॥శ్రీమద్రామాయణమ్॥

॥బాలకాణ్డః॥

తపస్స్వాధ్యాయ నిరతం। తపస్వీ వాగ్విదాం వరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్ముని పుఙ్గవమ్॥ ౧

అని ప్రారంభం చేసారు. కావ్యము దృశ్యము, శ్రవ్యము అని రెండు విధములుగా ఉంటుంది.

పాఠ్యము గానము అభినయము రసము ఇవి దృశ్యకావ్యాంగ చతుష్టయము. కావ్యారంభంలో విఘ్నోపశాన్తికై నాంది ప్రస్తావన చేయటం అనూచానమైన సంప్రదాయం. దానికై ఇష్టదేవతా ప్రార్థనమో సద్వస్తుస్మరణమో మఙ్గళార్థకము లైన పదములను ఉచ్చరించుటయో పరంపరగా వస్తూన్నది.

ఇక్కడ వాల్మీకి స్వగురునమస్కార రూప మఙ్గళాచరణం గావించారు. నారదులు దేవవర్గులోని వారగుటచే, ఇది వాల్మీకి ఇష్టదేవతా ప్రార్థనారూపమైన నాంది. షోడశకళాపూర్ణుడైన పరమాత్మయొక్క గుణములు మఙ్గళార్థకములైన పదములు కావున, వాటిని స్మరించి మొదటి నాల్గు శ్లోకాలలో నాందిప్రస్తావన చేసేరు.

తపస్వీ, వాల్మీకిః, తపస్స్వాధ్యాయ నిరతం, వాగ్విదాం వరమ్, మునిపుఙ్గవమ్, నారదం, పరిపప్రచ్ఛ. ఇదీ అన్వయం.

"తపస్వీ వాల్మీకిః" తపస్సుగల వాల్మీకి...

తపస్స్వాధ్యాయ నిరతం వాగ్విదాం వరమ్ అయిన నారదుని విశేషముగా అడిగెను అని..,

"తపస్స్వాధ్యాయనిరతం వాగ్విదాంవరం మునిపుఙ్గవం నారదం" అనునవి గురువుకు ఉండవలసిన లక్షణాలు.

ఎటువంటి వాడు గురువుగా లభించాడో చూడండి...

గురువనగా అన్ధకారమును నశింపచేయువాడు.

గాయన్నారాయణ కథాం సదా పాపభయాపహమ్।
నారదో నాశయన్నేతి నృణామజ్ఞానజం తమః॥

పాపభయాపహమైన నారాయణ కథాగానమును సదాగావిస్తూ, మనుష్యులయొక్క

అజ్ఞాన జన్యమగు అన్ధకారమును నాశన మొనర్చువాడు.

"నయతీతి నరః ప్రోక్తః పరమాత్మా సనాతనః" నరశబ్దము పరమాత్మ వాచకము.

'నారం దదాతీతి నారదః' నరసంబంధమైన జ్ఞానమును ఇచ్చువాడు నారదుడు.

ఈయన వాచో వేదాన్తికాడు. శ్రోత్రియుడు, స్వాధ్యాయ నిరతుడు. **"నిరతం"** అని చెప్పారు. అంటే

'తస్మాత్స్వాధ్యాయోఽధ్యేతవ్యః' 'స్వాధ్యాయా న్మా ప్రమదః' 'స్వాధ్యాయ ప్రవచనే ఏవేతి నా కో మౌద్గల్యః' అని చెప్పినట్లుగా శ్రుత్యుక్తమైన జీవిక కలవాడు. నిరంతర వేదాధ్యయన అధ్యాపన తత్పరుడు.

'శ్రోత్రియశ్ఛన్దోఽధీతే' వేదార్థము తెలిసినవాడు.

తపః అంటే కృచ్ఛ్రచాన్ద్రాయణాది వ్రతాచరణము. దీనివల్ల ఇన్ద్రియాలు అదుపులో ఉంటాయి. ఈయన జితేన్ద్రియుడు. "ఋతం తపః, సత్యం తపః, శ్రుతం తపః, శాన్తం తపః, దమస్తపః, శమస్తపః, దానం తపః, యజ్ఞం తపః" అని తైత్తిరీయము బ్రహ్మప్రతిపాదకములగు సర్వము **తపః** శబ్దముచేత చెప్పబడుచున్నవని చెప్పింది. నిరంతరము బ్రహ్మభావనయందుండు వాడు నారదుడు.

కనుకనే **మునిపుఙ్గవమ్** అని చెప్పబడ్డాడు.

మౌనముగా ఉండేవాళ్ళలో శ్రేష్ఠుడు. అంటే...

అసలు మాట్లాడడు అనుకుంటావేమో...

ఉలుకు పలుకు లేని శిలాప్రతిమ కాదు,

'వాగ్విదాం వరుడు' పలుక నేర్చినవాడు మంచి మాటకారి. దీనివల్లనే లోకంలో సర్వప్రయోజనాలు సిద్ధిస్తాయి. లౌకిక పారలౌకికాలు రెండూనూ...

వాగ్విదాం వరుడంటే పరా పశ్యన్తీ మధ్యమా వైఖరీ యను చతుర్విధ వాక్కులను తెలిసిన వారిలో శ్రేష్ఠుడు అని.

లోకంలో ఇన్ద్రియగ్రాహ్యమైన శబ్దానికి వైఖరీ యని పేరు. **"వై – నిశ్చయేన, ఖం– శ్రోత్రేన్ద్రియం, రాతి– గచ్ఛతి"** లోకంలో ఇన్ద్రియపటుత్వంగల ఏ జీవైనా దీన్ని వినగలదు. దీనికి సాధన అవసరం లేదు.

"చత్వారి వాక్పరిమితా పదాని తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః। గుహా

త్రీణి నిహితా నేఙ్గయన్తి। తురీయం వాచో మనుష్యా వదన్తి॥" మనుజులు నాల్గవది అయిన వైఖరీ వాక్కునే ఆశ్రయిస్తారని శ్రుతి చెప్తోంది. బహిర్ముఖులకు ఇది మొదటిది.

దీనిని ఆశ్రయించే సర్వ వ్యవహారమూనూ...

అన్తర్ముఖులకు మాత్రమే **వైఖరి** తురీయ పదవాచ్యము.

అపదం పదమాపన్నం పదం చాప్యపదం భవేత్।

పదాపద విభాగం చ యః పశ్యతి సపశ్యతి॥

స్పన్దరహితమైన శబ్దబ్రహ్మము పరాదిభేదముచే పదచతుష్టయమైనది. ఈ పదచతుష్టయమును తెలిసినవాడు పరబ్రహ్మస్వరూపుడగును. అని స్కాన్దపురాణ వచనము. ఇది యోగమార్గము. ఈ యోగవిద్యను తెలిసినవారిలో శ్రేష్ఠుడు. **'మునిపుఙ్గవం వాగ్విదాం వరమ్'** అని చెప్పుటచే మౌనముగా పరావాగ్రూపంగా ఉపదేశించు వారిలో దక్షిణామూర్తి. మౌనవ్యాఖ్యను అందుకోగల వారికి దక్షిణామూర్తి.

పుంగవః అంటే 'పురుషులలో వృషభం'. ఇక్కడ సాత్త్వికతే ఉంటుంది. వ్యాఘ్రమంటే రాజసం ఉంటుంది. ఇక్కడ సాత్త్వికతమాత్రమే కలవాడు. అందుకని వృషభము. ఇది బ్రహ్మవేత్తలకు మాత్రమే అయిన సంబోధన. ఇటువంటి శ్రేష్ఠమైన గురువు దగ్గర జ్ఞానసముపార్జనకొరకు, సకలసన్దేహనివృత్తికొరకు సుశ్రూషచేస్తూన్న తను ఎటువంటి వాడు? తనకున్న అర్హతలు ఏమిటి? అవి చెప్తున్నారు.

తపస్వీ, వాల్మీకిః అని తనగురించి చెప్పుకున్నారు.

'తపస్స్వాధ్యాయ నిరతం, వాగ్విదాం వరమ్' అను విశేషణాల మధ్య తనను "తపస్వీ" యను ఏకవచనాన్త విశేషణముచే పరిచయంచేసుకొని నేను నా గురువులకంటే తక్కువ వాడనేసుమా! అని చెప్పుకున్నారు వాల్మీకి. ఎందువలన అలా ప్రకటించుకున్నారు అంటే...

అథాబ్రవీన్మహాతేజా బ్రహ్మా లోక పితామహః।

వల్మీక ప్రభవోయస్మా త్తస్మాద్వాల్మీకి రిత్యసౌ॥

ఇతడు పాషాణ సదృశుడై చిరకాలం తపస్సుచేసాడు. ఆ సమయంలో తన చుట్టూ పుట్టలు మొలిచాయి. ఆ పుట్టలమధ్యనుండి వచ్చినవాడు. ఈ విధముగా

బ్రహ్మచే ప్రస్తుతించబడ్డాడు.

వల్మీకము అంటే దేహము. దానినుండి, పుట్టనుండి సర్పము బయల్వెడలినట్లుగా, దేహమునుండి బయటకు వచ్చాడు. అంటే దేహభ్రాన్తి లేనివాడు.

మూలాధారాది విశుద్ధాన్తము పృథ్వీ జల అగ్ని వాయు ఆకాశములను మహాభూత స్పర్శ. వాటి సమష్టి ఈ దేహము. ఇప్పుడు వాల్మీకి విశుద్ధోపరి ఆజ్ఞాస్థానమున ఉన్నాడు. ఇది గురుస్థానము. కనుకనే నారదరూప గురు దర్శనము.

తాను బ్రహ్మచే పొగడబడినవాడను గొప్ప సాధకుడను అను గర్వము కలవాడు కాడు. అది చెప్పడానికే **తపస్వీ** యన్న ఏకవచనాన్త విశేషణము. అది సత్యము కనుకనే నారద ఆగమనం.

ఇటువంటి వాల్మీకి, మహానుభావుడైన నారదుని **'పరిపప్రచ్ఛ'** విశేషముగా ప్రశ్నించెను.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" అన్నట్లుగా విధి విధానాన్ని అనుసరించి... వేదమార్గానుసారియై శాస్త్రోక్తరీతిని ప్రశ్నించేరు.

తపస్వీ, వాల్మీకిః, స్వాధ్యాయనిరతం, వాగ్విదాం వరమ్, మునిపుఙ్గవమ్, నారదం, తపః, పరిపప్రచ్ఛ అని అన్వయించుకుంటే...

బ్రహ్మ (స్వరూప) జ్ఞానమునకై నారదుని విశేషించి ప్రశ్నించెను అని.

బ్రహ్మవిషయక జ్ఞానము తెలుసుకొనుటకు తనకున్న అర్హతలు ఏమిటో చెప్పారు.

ఆపై విషయము జ్ఞాన సంబంధమైనది,

కనుక మహాయోగి, బ్రహ్మవేత్త అయిన నారదుని జ్ఞానమార్గముకొరకు సేవిస్తున్నారు.

ఎందుకంటే **"ఆజ్ఞాచక్రము"**వరకే యోగము సహాయకారి, ఆపై మార్గము మహాశూన్యమని ప్రసిద్ధి. దానిని జ్ఞానమార్గంలో సద్గురు కటాక్షరూపంగా మాత్రమే దాటగలం.

కోన్వస్మిన్సాంప్రతం లోకే గుణవాన్ కశ్చవీర్యవాన్।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః॥ ౨
చారిత్రేణచ కోయుక్త స్సర్వభూతేషు కోహితః।

విద్వాన్ కః కస్సమర్థశ్చ కశ్చైకప్రియ దర్శనః॥౩
ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః।
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే॥ ౪

అస్మిన్ లోకే, సాంప్రతం, గుణవాన్, కః ను వీర్యవాంశ్చ, కః ధర్మజ్ఞః చ, కృతజ్ఞః చ, సత్యవాక్యః, దృఢవ్రతః॥ కః చారిత్రేణ, యుక్తః చ, కః, సర్వభూతేషు హితః, కః విద్వాన్, కః సమర్థశ్చ, కః, చ, ఏకప్రియ దర్శనః॥ ఆత్మవాన్ కః జితక్రోధః కః ద్యుతిమాన్ అనసూయకః కః జాతరోషస్య కస్య సంయుగే దేవాశ్చ బిభ్యతి॥ ఇదీ అన్వయ క్రమము.

ఈలోకంలో ఇప్పుడు అంటే ఈ సమకాలీన ప్రపఞ్చములో

౧. **కః గుణవాన్?** ఎవడు గుణములు కలవాడు?

గుణవాన్ పదము మతుప్ ప్రత్యయాన్తము కావున బహు గుణములనియే గ్రాహ్యము.

గాన్ధర్వం చ కవిత్వం చ శూరత్వం దానశీలతా।
అభ్యాసేన నలభ్యన్తే చత్వార స్సహజాగుణాః॥

సంగీతము, కవిత్వము, శూరత్వము, దానగుణము ఇవి సహజగుణములు. అభ్యాసము వలన వచ్చేవికావు.

దయాసర్వభూతేషు క్షాన్తిరనసూయా శౌచమనాయాసో
మాఙ్గల్య మకార్పణ్య మస్పృహా చేత్యష్టావాత్మగుణాఃస్మృతాః॥

సర్వభూత దయ ఓరిమి అనసూయత్వం శుచిత్వం అనాయాసం కల్యాణం లోభములేకుండుట అస్పృహ అనగా ఆశలేమి...

అను ఎనిమిది ఆత్మగుణములని గౌతమ మహర్షి.

అసలు గుణశబ్ద వాచ్యమైనదేది. అని ఆలోచిస్తే **'సకల గుణసీమా వితరణం'** అని భర్తృహరి త్యాగమే గుణమని చెప్పారు.

త్యాగ ఏకో గుణః శ్లాఘ్యః కిమన్యైః గుణరాశిభిః।
త్యాగాజ్జగతి పూజ్యన్తే పశుపాషాణ పాదపాః॥

కేవల త్యాగమువలననే పశు పాషాణ పాదపములు (వృక్షములు) పూజార్హతను సంతరించుకొన్నాయి.

గుణమంటే త్యాగమనే చెప్పబడింది.

ఎవడు త్యాగమను గుణము కలవాడని మహర్షి ప్రశ్నిస్తున్నారు. ఈ త్యాగము కూడా ఎలా ఉండాలి?

దధీచిచే దానం చేయబడ్డ బ్రహ్మదణ్డములా!

రఘువుయొక్క సర్వస్వవితరణలా!

రంతిదేవుని భూతదయలా!

'ఆత్మనశ్చ పరేషాంచ తద్దానం పౌరుషం స్మృతమ్' అని భోజుడన్నట్లు ఒళ్ళు గగుర్పొడవాలి. ఇదీ త్యాగ మంటే. ఇంతటి త్యాగమూర్తి ఎవరైనా ఉన్నారా? అంటున్నారు. ఇటువంటి గుణముమాత్రమే ఆనన్దకారకము (రమణీయం) అవుతుంది కానీ, తక్కిన గుణములు భూషణములే తప్ప ఆనన్దకారకములు కాదు.

కామేశ్వరుని ఉపాసించిన కామేశ్వరి. కామేశ్వరిని ఉపాసించిన కామేశ్వరుడు. ఎలా చూసినప్పటికి; వారు తమను తాము అర్పించుకొన్నవారు. అందువలననే నామ రూప అస్త్ర ఐశ్వర్యాదులందు వీరికి భేదము లేదు.

ఇవ్వటం ఇలా ఉండాలి.

ఇది కేవలం బ్రహ్మమందే ఒప్పుతుంది. తనను ఆశ్రయించిన నిష్కామ కర్మయోగులను షడ్గుణైశ్వర్య సమ్పన్నులను గావించి భగవంతుని చేస్తుంది. సాక్షాత్తు తననుగా (పరబ్రహ్మ వాచ్యునిగా) చేస్తుంది.

ఇటువంటి గుణము కలవాడు ఎవరైనా ఉన్నారా? (అదీ! ఇప్పుడు ఉన్నాడా? కాలాన్తరముల విషయం నాకు అనవసరం. ఈ భూమి మీద... ఇప్పుడు... ఇటువంటి త్యాగమూర్తి ఉన్నాడా?)

౨. **వీర్యవాన్?** (వీరస్య స్వభావః కర్మవా వీర్యం) వీరునియొక్క భావము, కర్మ ఇవి వీర్యము.

'వీరే అక్లీబే సాధు వీర్యం' నపుంసకుడు కానివానియందు పుట్టునది. **"శుక్రం తేజోరేతసీచ బీజ వీర్యేన్ద్రియాణిచ"** ఇన్ని శబ్దాలు ఉండగా కేవలం వీర్యం అనే ఎందుకు అన్నారు...అని ఆలోచిస్తే

శుక్రం, తేజస్సు, రేతస్సు, బీజ శబ్దములు సాధకేతరులకు ఉద్దేశింపబడినవి.

నిత్యనూతన ఉత్సాహవంతుడైయుండాలి. గార్హస్థ్యధర్మంలో ఉన్నవాడై యుండాలి అని నిబంధించారు. పైచెప్పిన త్యాగం ఏ వానప్రస్థునకో ఉందని చెప్తావేమో? వాడు గృహస్థుగా ఉండాలి! అని నిబంధించారు.

గృహస్థునకు ప్రోగుచేసుకోవటం మీదనే ఆసక్తి. అందులో ఉంటూ...

ఏషణ లేనివాడు ఎవడు? అని ప్రశ్నించారు.

వీర్యవంతుడు ఎవడు? అని పృచ్ఛచేయుటచేత...

నిగ్రహం కలవాడు, భార్యా విషయకమైన ఆనన్దముకలవాడు, పరస్త్రీవ్యామోహ రహితుడైన వాడి గురించి చెప్పు.

"అహోరాత్రో వై ప్రజాపతి స్తస్యాహరేవ ప్రాణో రాత్రి రేవ రయిః। ప్రాణంవా ఏతే ప్రస్కన్దన్తి యే దివా రత్యా సంయుజ్యన్తే। బ్రహ్మచర్యమేవ తద్యద్రాత్రౌ సంయుజ్యన్తే॥"

అను శ్రుత్యుక్తరీతిని విధినిషేధములు పాటిస్తూ,

"రాత్రౌ రత్యా సంయుజ్యన్తే తత్ బ్రహ్మచర్యమేవ" రాత్రులందు ఋతుమతియైన సహధర్మచారిణియందు ఆనందించుట బ్రహ్మచర్యమనియే శ్రుతివచనము.

బ్రహ్మచర్యమును అవలంబించు గృహస్థుగురించి చెప్పండి.

అని వాల్మీకిమహర్షి అడుగుతున్నారు.

౩. **ధర్మజ్ఞః చ?** ౪. **కృతజ్ఞః?** ఎవడు ధర్మజ్ఞుడు. ఎవడు కృతజ్ఞుడు. ధర్మస్వరూపమును తెలిసినవాడు, ఇక్కడ ధర్మము అంటే వేదము. చకారము వలన వేదాన్తమను పేర ప్రసిద్ధి చెందిన బ్రహ్మతత్త్వావబోధక ఉపనిషద్భాగమును బాగుగా తెలిసినవాడెవడు?

యో వై సధర్మో సత్యం వై తత్ (బృ.ఉ. 1.4.14) ఇక్కడ సత్యము అంటే వేదము. దాని అనుష్ఠానం ధర్మము. **"సత్యధర్మయోః చ అభేదేన నిర్దేశః కృతః శాస్త్రాచార లక్షణయోః" "ఏతత్ ఉక్తం ఉభయం జ్ఞాయమాన మనుష్ఠీయ మానం చ ఏతద్ధర్మః'** తెలియబడేది (వేదము) అనుష్ఠించబడేది రెండూ ధర్మమే. అని అచార్యులు బృహదారణ్యక భాష్యంలో వేద ధర్మములకు అభేదాన్ని చెప్పేరు. ధర్మమును వృషభమని మహాభారతం చెప్పింది. శివసహస్ర నామాలలో

వృషరూపః అను నామమును నీకంఠుడు వ్యాఖ్యానిస్తూ **వృషోధర్మః తద్రూపో వృషరూపః** అని వ్యాఖ్యానించేరు.

పతంజలిమహర్షి మహాభాష్యమందు ఈ వృషభము వేదమే అని చెప్పేరు. పరమేశ్వరుడు వేదవాహనుడు అని వేదము వర్ణించింది. **చత్వారి శృంగాః.... వృషభో రోరవీతి** అను మంత్రమే దీనికి ప్రమాణం. కనుకనే సంప్రదాయంలో నందికొమ్ములను ఆలంబనచేసుకొని పరమేశ్వర దర్శనం చేస్తాము. ఈ కొమ్ములు బ్రహ్మవిద్య అయిన ఉపనిషత్తులు.

దానంజేసి ధర్మము అంటే వేదమే అని సిద్ధించింది.

కనుకనే మాయావి అయిన మారీచుడు **'రామో విగ్రహవాన్ ధర్మః'** అని రాముని కార్యకారణ సంఘాతకర్తయగు ధర్మమునందు తేజోమయ అమృతమయుడగు ఏ పురుషుడు గలడో వానిగా (శబ్దబ్రహ్మగా) దర్శించేడు.

ఆ తెలిసిన ధర్మమునందు నిష్ఠగలవాడు ఆచరణబుద్ధి గలవాడు ఎవడు అని ప్రశ్నిస్తున్నారు.

వేద ప్రామాణ్యాన్ని విశ్వసించి కొండ అంచునుండి క్రిందికి దుమికిన కుమారిలభట్టులా ఉండాలి విశ్వాసం. అదీ విశ్వసించటం అంటే!

తను పెట్టే శఠగోపం మీద తనకే నమ్మకంలేని ఆలయ అర్చకులలా ఉంటే కుదరదు. దానికి చెప్పిన నైతికతను వారు పాటించే తీరాలి.

తను వేదపణ్డితుడైయుండి, వేదమునందు అవిశ్వాసముచే తన ఔరసునకు హూణవిద్యను బోధింపజేస్తాడు.

ఈ వేదము, సంస్కృతము, తెలుగు, మరొకటి మరొకటి ఏదైనప్పటికి, లేదా వడ్రంగము, బంగారు ఆభరణాల పని, నేతపని, ఇలా ఏది తీసుకున్నా తన ధర్మమునందు తనకు అవిశ్వాసం...

ఆ విద్య అన్నం పెడుతుందో లేదో అని భయం.

ఇలా అవిశ్వాసంతో చేసే పని...

తనకూ తనను ఆశ్రయించిన వారికీ; ఎవరికీ ఉపయోగపడదు.

కులవృత్తి అనేదో ధర్మం. ఆవృత్తిపై అపనమ్మకం. ఫలితం నిరుద్యోగం.

శాస్త్రవిహితమైన వివాహవ్యవస్థను(౧౮,౨౧) ఆశ్రయించడం ధర్మం. దానియందు అలక్ష్యం.

(దీనికితోడు భ్రూణ, శిశు, స్త్రీ హత్యలు) ఫలితం ధార్మికమైన అనుభవ వ్యవస్థకు ఘాతకలగటం.

దానివల్ల వర్ణసంకరము, మానభంగములు, హత్యలు. ఇవీ ధర్మాన్ని అలక్ష్యం చేస్తే వచ్చే ప్రమాదాలు.

ఇటువంటి ప్రమాదాలులేకుండా, తాను ధర్మవేత్తయై, తెలిసిన ధర్మమునందు కృతజ్ఞతకలవాడై ఉండాలి. అంటే తాను ఆచరిస్తూ...ఆచరింపచేస్తూ ఉండాలి. అదీ కృతజ్ఞత. అటువంటి వాడున్నాడా? అని ప్రశ్నించారు.

శ్రుతిశ్చ భిన్నా స్మృతయశ్చ భిన్నాః, మహామునీనాం మతయశ్చ భిన్నాః।
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతస్సపన్థా॥

శ్రుతి స్మృతి పురాణాదులు భిన్నభిన్నములుగా కనబడుచున్నప్పటికీ, మహాత్ములు నడచిన దారి ధార్మికమైనది. దానిని అనుసరించటం ధర్మం. వారియందు వారిమార్గమునందు విశ్వాసం కలిగియుండుట కృతజ్ఞత.

౫. సత్యవాక్యః. ౬. దృఢవ్రతః

సత్యమైన వాక్యములు కలవాడు. దృఢవ్రతుడు.

ఇన్ద్రియ నియమనము కొరకు శాస్త్రవిహితమైన ఆహార నియమమెట్లో...
సత్యపాలనముకొరకు వాఙ్నియమము అట్లే కలవాడు.

వ్రతమంటే అవశ్యము అనుష్ఠింపతగిన కర్మ.

అథ బ్రహ్మచారిణో వ్రతం తరువాత బ్రహ్మచారులయొక్క వ్రతము (అన్నచోట వ్రతము) అవశ్యమనుష్ఠేయమైన కర్మయే,

"కృతాగ్ని కార్యో భుఞ్జీత వాగ్యతో గుర్వనుజ్ఞయా"

బ్రహ్మచారి అగ్నికార్యమొనర్చి గుర్వనుజ్ఞను గైకొని మౌనముగా భుజింపవలెను.

అగ్నికార్య పరిభ్రష్టా సన్ధ్యోపాసన వర్జితా।
వేదంచైవా నదీయానా సర్వేతే వృషాలాస్మృతాః॥
కృతదారో నైవతిష్ఠేత్ క్షణమప్యగ్నినా వినా।
తిష్ఠేతచే ద్విజో వ్రాత్యస్తథా చ పతితో భవేత్॥

బ్రహ్మచారులు సన్ధ్యావన్దన అగ్నికార్యములను ఆచరింపవలెను గురుసన్నిధి యందు వేదాధ్యయనము సలుపవలెను.

వివాహితుడు క్షణకాలముకూడా ఔపాసనాగ్నిని వీడి యుండరాదు.

॥నిత్యోధార్యః॥ అని ఆపస్తమ్బుడు ఔపాసనము నిత్యవ్రతమని చెప్పియున్నాడు. ఈ విధముగా బ్రహ్మచారుల, గృహస్థుల నిత్యవిధి (అనగా తప్పక చేయవలసినది కావున) వ్రతమని చెప్పబడుతోంది. ఔపాసన చేయనిచో సంసార సుఖము అనుభవించు అర్హత ఉండదని, వైశ్వదేవము చేయనిచో భుజించుటకు అనర్హుడని పెద్దల మాట.

సత్యంవద నానృతం వదేత్ అను విధినిషేధరూపమైన శ్రుతివాక్యములు సత్యమును పలుకుటమాత్రమే చేయతగినదని బోధిస్తున్నాయి. కనుక మరణాన్తము ఒక్కనాటికీ ఈ వ్రతమును వీడనివాడు **దృఢవ్రతుడు** ఉన్నాడా!

సత్యమేవ జయతే నాఽనృతం, సత్యేన పంథావితతో దేవయానః యేనాఽక్రమం త్వృషయో హ్యాప్తకామా। యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్॥ (ముణ్డక3.1.6) జయించునది సత్యమే, అసత్యముకాదు. సత్యము వలననే దేవతలమార్గము విస్తరించియున్నది. సత్యముచేతనే ఋషులు ఆప్తకాములై ఈశ్వరుని పొందుచున్నారు. ఆ ఈశ్వరుడు సత్యస్వరూపుడు.

సత్యస్వరూపుడైన ఈశ్వరుని పొందుమార్గమును ఎన్నటికీ వీడనివాడు. ఇటువంటి వాడు ఉన్నాడా?

౭. చారిత్రేణ చ కోయుక్తః॥

సదాచారము మంచినడవడి కలవాడు ఎవడు?

ఆచారమనగా సత్పురుష ధర్మం,

'ఆచారశ్చ సతాం ధర్మ స్సన్తశ్చాచార లక్షణా' అంటుంది భారతం

ఆచారము కలవారే సత్పురుషులు. ఇది కులానుగతం కావచ్చు, కాకపోనూవచ్చు.

అనుగంతుం సతాంవర్త్మ కృత్స్నం యది నశక్యతే।
స్వల్పమప్యనుగంతవ్యం మార్గస్థో నావసీదతి॥

మహాత్ముల మార్గమును అనుసరించి పోవుట అంత సులువైన పనేంకాదు. వీలైనంతవరకైన అనుసరించటం ఒక పద్ధతి. ఎందుకంటే ఆదారిలో అసలంటూ నడక మొదలిడితే వాడికి పతనంలేదు.

ఇక్ష్వాకులకు ఇవ్వటం అనేది ఆనువంశికమైనా...

రఘువువద్దకు వచ్చేసరికి విశ్వజిద్యాగ రూపంగా తన విశ్వరూప ప్రకటనం చేసి ముందుతరాలకు ఇవ్వటం ఇలా ఉండాలి సుమా! అని చెప్పింది.

"నియంతి న విముంచంతి మహాంతో భాస్కరా ఇవ"

మహాత్ములు ఏవిధంగా సూర్యభగవానునిలా నియతమార్గమున సంచరించుదురో, ఆవిధంగా...

ఇటువంటి మహాత్ముల మార్గమును త్రికరణశుద్ధిగా అనుగమించే వాడు ఎవడు? ఉన్నాడా? అన్నారు మహర్షి.

రామాయణంలో ఈ ప్రశ్నలకు సమాధానరూపంగా అనేకానేక పూర్వవృత్తాంతాలను మహర్షి చెప్పేరు. చతుర్విధ పురుషార్థోపదేశ సమన్వితమై, **"పూర్వవృత్త కథోపేత మితిహాసం ప్రచక్షతే"** పూర్వగాథను చెప్పుటచే ఇది ఇతిహాసము అయింది.

౮. సర్వభూతేషు కో హితః॥

సమస్త ప్రాణులయందు దయగల వాడెవడు.

"మాతా మిత్రం పితాచేతి స్వభావాత్త్రితయం హితం" లోకంలో తల్లి తండ్రి మిత్రుడు వీరే సహజంగా ప్రతి ఒక్కరికీ హితులు.

కాబట్టి సమస్త ప్రాణులు తల్లి తండ్రి మిత్రుడుగా ఆశ్రయింప తగినవాడు ఎవడైనా ఉన్నాడా!

మిగిలినవారు కార్యకారణాపేక్షలచే హితాన్ని అభినయిస్తారు, హితులుకారు. స్థావర జఙ్గమాత్మకమైన ఈ సృష్టి ఆశ్రయింపతగ్గవాడు ఎవ్వడు?

౯. విద్వాన్ కః॥ ౧౦. కః సమర్థః॥

ఎవడు విద్వాంసుడు? రాశీభూతమైన వేదమును తెలిసినవాడు ఎవడు, సాఙ్గోపాంగముగా ఎఱిగినవాడు ఎవడు?

వేదమునకు అంగభూతమైనవి ఆరు. అవి శిక్షా వ్యాకరణ ఛన్దో నిరుక్త జ్యోతిష కల్పములనునవి.

ఇవికాక ఉపాఙ్గములు ఎనిమిది మీమాంసా న్యాయ ధర్మ పురాణ ధనుర్వేద గాన్ధర్వ అర్థశాస్త్రములు. ఇవి సర్వము తెలిసినవాడు. భూతభవిష్యద్వర్తమానములను ఎరిగినవాడు ఎవడు.

ఎవడు సమర్థుడు...
అంటే అన్యులు చేయలేని పనులనుకూడా చేయగలవాడు ఎవడు.
కాలత్రయముయొక్క జ్ఞానంకలవాడై కేవలము మానుషధర్మాన్ని పాటిస్తూండటం ఉందే ఇది అనితర సాధ్యం.
అన్ని తెలిసి కేవలం మానవునిలా బ్రతుకుతున్నవాడు ఎవడైనా ఉన్నాడా! అని అడుగుతున్నారు.

౧౧. కశ్చైక ప్రియదర్శనః॥

ఎవడు పరమ సౌన్దర్యమూర్తి.

ప్రేక్షణీయం నృలోకస్య సానురాగస్మితేక్షణమ్॥
అపీచ్య వయసం మత్తమృగేన్ద్రోదార విక్రమమ్॥

ఈ మానవ లోకానికి దర్శింపదగినవాడు, చెదరని చిరునవ్వు కలవాడు, నిత్యయౌవనము కలవాడు, మదించిన సింహమువలె ఠీవైన నడకగలవాడు. ఇదీ భాగవతం అందానికి చెప్పిన నిర్వచనం.
ఇటువంటి సౌన్దర్యమూర్తి ఎవరైనా వున్నారా!
సౌన్దర్యమంటే ఒకసారి చూస్తే మరల దృష్టి మరల్చుకొనుటకు శక్యంకానిది. దశేన్ద్రియములను, దశేన్ద్రియ సమాహార రూపమగు మనస్సును ఏది తనయందే తదేకముగా లగ్నం చేసుకోగలదో అదే సౌన్దర్యము. అది బ్రహ్మమునందే ఒప్పుతుంది. అటువంటి మూర్తిమంతమైన పరబ్రహ్మమునుగూర్చి చెప్పండి, ఉన్నాడా!

౧౨. ఆత్మవాన్॥

నిర్భయుడైనవాడు, ఆత్మజ్ఞుడైన వాడెవడు. ఎవడు బ్రహ్మము నేత్రముల చేతను, వాక్కు చేతను, ఇన్ద్రియముల చేతను, తపస్సుచేతను, కర్మచేతను, గ్రహింపశక్యము కానిదిగా ఎఱిగినవాడు. **"తం పశ్యతే నిష్కలం ధ్యాయమానః"** అని శ్రుతి చెప్పినట్లుగా ఆ బ్రహ్మమును అవయవ రహితముగా ధ్యానించువాడు. ఆ ఆత్మయు జీవరూపముగానున్న తానూ ఏకమేయని ఎఱిగినవాడు.

"తే సర్వగం సర్వతః ప్రాప్యధీరా। యుక్తాత్మానః సర్వ మేవా విశన్తి॥"

ఇట్టివారు సర్వవ్యాపకమగు పరమాత్మను అంతటపొంది ధీరులును, ఏకాగ్రచిత్తులును అయి సమస్తమును పొందుచున్నారు. వీనికి భిన్నముగా రెండవది లేనిదగుటచే నిర్భయుడు. ఇటువంటి భయరహితుడైన వాడున్నాడా!

౧౩. జితక్రోధః॥

క్రోధమును జయించినవాడు ఎవడు?

ఈ క్రోధము అరిషడ్వర్గమునకు ఉపలక్షితము. కావున కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యములను జయించిన వాడెవడు.

౧౪. ద్యుతిమాన్ కః॥

ప్రశస్తమైన కాంతి గలవాడు ఎవడు?

ప్రశస్తమైన తేజస్సు కలవారిలో ప్రముఖులు ఇన్ద్ర సోమ సూర్య అగ్నులు. వీరి తేజస్సుచే బాహ్యాభ్యన్తరములందలి అన్ధకారము పరాస్తమగును.

తన దర్శనమాత్రంచేత ఎదుటివారి జీవితాలలో వెలుగులు నింపగలవాడు ఎవడైనా ఉన్నాడా!

౧౫. అనసూయకః కః॥ అసూయలేనివాడు

గుణినాం గుణానామావిష్కరణం అసూయా, తద్భిన్నా అనసూయా గుణవంతుల గుణములను వెల్లడిచేయకపోవుట అసూయ.

ఆ అసూయలేమియే అనసూయత్వం.

అసూయా రహితుడైన వాడు ఎవడైనా ఉన్నాడా?

౧౬. బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే॥

కోపంవచ్చిన ఎవనికి యుద్ధమునందు దేవతలుకూడా భయపడుదురు?

ఇక్కడి కోపము స్వాభావికంకాదు. ఎందుకంటే మహర్షి **'జితక్రోధః కః'** అని ఇంతకు మునుపు పృచ్ఛచేసియున్నారు. అరిషడ్వర్గమును జయించినవానికి **'జాతరోషస్య'** అన్నది విశేషణముగా వేసారు. జననమరణాలు లేని పరమాత్మ జననమరణాలను ఏవిధంగా అభినయిస్తున్నాడో ఆవిధంగా అభినయింపబడిన కోపంగలవాడు. వీనికి కోపం పుట్టనూలేదు పోనూలేదు. కేవలం అభినయింప బడింది. ఈ విధముగా అభినయింపబడిన కోపమునకే దేవతలు

తద్భిన్నులుకూడా భయపడుదురో అట్టివాడినిగూర్చి చెప్పు.
అసలు ఉన్నాడా...

"సత్యం బృహత్రితమృగ్రం దీక్షా తపో బ్రహ్మ యజ్ఞః పృథివీం ధారయంతి"

(బ్రహ్మజ్ఞానం చెదరని నిజాయితీ పవిత్రత తపస్సు ఆ పవిత్ర జీవనంద్వారా లభించే శక్తి యజ్ఞం) అని భూమి భరింపబడుటకు లేదా ఇలా నిలచి ఉండుటకు ఏ ఎనిమిది కారణమని శ్రుతి చెప్పిందో! వాటినే...

మహర్షి రెండింతలు చేసి నారదుని అడుగుతున్నారు.

భూభర్త ఎలా ఉండాలో చూపెడుతూ –

ఇలా భూమిని ధరించేవాడు ఎవడైనా ఉన్నాడా?

అని మహర్షి షోడశకళాపూర్ణమైన పరమాత్మను ఈ లోకంలో ఇప్పుడు సాకారంగా దర్శింపచేయమని అడుగుతున్నారు.

ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే।
మహర్షే త్వం సమర్థోఽసి జ్ఞాతుమేవం విధం నరమ్॥ 5

మహర్షీ! నీవు ఇట్టి షోడశకళా పూర్ణమైన పరమాత్మనుగూర్చి తెలుపుటకు సమర్థుడవు. కావున నేనా విషయమును వినగోరుచున్నాను అని పృచ్ఛ చేసేరు.

నారదులు సగుణ నిర్గుణోపాసనలు అనుభవమున ఉన్నవారు. (అది నారద భక్తిసూత్రాలు చూస్తే తెలుస్తుంది).

అటువంటి నిర్గుణపరబ్రహ్మము, మూర్తిమంతమై ఇప్పుడు ఎక్కడైనా ఉందా! ఉంటే నీకు తెలియకుండా ఉండదు, నాకు వినాలని కుతూహలంగా ఉంది చెప్పవలసినది.

శ్రుత్వా చైతత్త్రిలోకజ్ఞో వాల్మీకేర్నారదో వచః।

త్రిలోకజ్ఞుడైన నారదమహర్షి, వాల్మీకియొక్క ప్రశ్నలను విన్నారు.

ఎటువంటి ప్రశ్నలవి...బహుకాలము అన్తర్మథనరూపమై,

పర్వతముఖాగ్రమునుండి ఉబికివచ్చిన తప్తశిలాద్రవంలా...

వాల్మీకియొక్క నిస్సరణరూపమైన ప్రశ్న ఉద్ధృతికి నారదమహర్షి పరమానన్ద భరితులైయ్యారు.

వెంట్రుకలు నిక్కబొడుచుకొనేంత ఆనన్దాన్ని పొందారు.
కౌసల్యమహర్షియొక్క ప్రశ్నషట్కమునకు
నీవు బ్రహ్మిష్ఠుడవు నాయనా అని పరమానన్దముతో **'తస్మాత్తేఽహం బ్రవీమి'** కావున నేను నీకు చెప్పుచున్నాను. అని పల్కిన పిప్పలాదునిలా...

శ్రూయతామితి చామన్త్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్॥ ౬

నారదుడు "**శ్రూయతాం** వినబడుగాక" అదుపుచేయని ఆనన్దముతో బిగ్గరగా అని,
దగ్గరగా పిలిచారు **(అమన్త్ర్యచ)**
అంటే అభిముఖీకరించుకొన్నారు.
ఇది శిష్య నిర్బన్ధరూపమైన సమాధానం కాదు.
ఆ షోడశకళాపూర్ణమైన స్వరూపమునుగూర్చి తెలుసుకొనుటకు నీవు ఎంత ఉత్సుకతతో ఉన్నావో...
అంతకంటే ఉత్సాహంగా ఉంది చెప్పడానికి. విను, దృష్టిచెదరనీకుండా విను.
ఇన్ద్రియములు అన్యథా వెళ్ళిపోతాయేమో, నాకళ్ళలోకి చూస్తూ విను...
వింటే...ఏకాగ్రత చెదరదు.
అందుకే "**ఆమన్త్ర్యచ**" అని దృగ్దీక్షారూపంగా తత్త్వాన్ని ఉపదేశం చేస్తున్నారు.
మహర్షి ఇంకా ఆ రోమాంచితమైన ఆనన్దావస్థనుండి బయటకు రాలేదు.

బహవో దుర్లభాశ్చైవ యేత్వయా కీర్తితా గుణాః।
మునే వక్ష్యామ్యహం బుద్ధ్వా తైర్యుక్తః శ్రూయతాంనరః॥ ౭

ఇది భారతీవృత్తి. ప్రకృతార్థమును ప్రశంసించుచు సభ్యుల పాఠకుల చిత్తములను అభిముఖీకరించుకొను ప్రయత్నము. దీనికి ప్రరోచనమని సంజ్ఞ. భారతీవృత్తిలో ఇదొక అఙ్గము.

భారతీ సంస్కృతప్రాయో వాగ్వ్యాపారో నటాశ్రయః

సంస్కృత ప్రచురముగా నటులచేజేయబడు వాచికాభినయమే ఇక్కడ ప్రధానంగా ఉంటుంది. దీనికి వేదవిద్యాధిదేవతయైన బ్రహ్మకు మానసపుత్రుడైన నారదులకంటే ప్రతిభావంతులు ఉంటారా!
కనుకనే ప్రరోచనమును చేతనప్రరోచనమును నారదులతోనే ప్రారంభింప జేసారు.

హేమునే! అని సంబోధించారు. ఓ మననశీలుడా! అని సంబోధన.
ఎందుకని...అలా అన్నారు
శ్రవణ మనన నిదిధ్యాసనములు బ్రహ్మతత్త్వ విచారమునకు కావలసినవి.
చెప్పబడుచున్నది సూక్ష్మమైన తత్త్వముకనుక మననశీలత కలిగి శ్రద్ధగా విను అని,
విధ్యర్థమందు విధింపబడిన **"లోట్"** ప్రత్యయాన్తమైన **'శ్రూయతాం'** ఈ విషయాన్ని చెప్పుచున్నది. అంతియేకాదు ఈ చెప్పబోవు విషయమును నిత్యము నిదిధ్యాసనములు సలుపవలసినది. దన్తధావనము స్నానమువలె ఇది విధియని తెలియవలెను.

గుహ్యాద్గుహ్యతరైషా న ప్రాకృతాయోపదేష్టవ్యా।
సాత్త్వికాయాన్తర్ముఖాయ పరిశుశ్రూషవే॥

అని మహావాక్యోపనిషత్తు చెప్పినట్లుగా;
అడుగుతున్నది రహస్యమైన వాటిలో రహస్యమైనది. నీవడిగిన గుణములు అసామాన్యములు. సామాన్యుల ఊహకైనను కష్టసాధ్యమే.
నీవడిగిన విద్య సత్త్వగుణవిశిష్టులకొరకు, అన్తర్ముఖులైన వారికొరకు (ప్రపంచ వాసనలనుండి విముఖులైన వారికొరకు), స్వాచార్య శుశ్రూషయందు ఆసక్తిగల వారికొరకు ఇది ఉపదేశింపదగినది. నీకు చెప్తాను విను.
నీచేత కీర్తింపబడ్డ అనేకములైన ఏగుణములు కలవో అవి కలిగియుండుట ధర్మరక్షణ దీక్షాకంకణబద్ధుడై జగత్తునందు నరరూపమున అవతరించిన నారాయణుడికే సాధ్యము.
కనుక ఇప్పుడు నీరూపంగా నాకు మూర్తిమంతమైన బ్రహ్మచిన్తన చేసే భాగ్యము కలిగింది.
ఇదీ నారదమహర్షి ఆనన్దము...
నేను ఆ బ్రహ్మతత్త్వాన్ని ఆ నారాయణస్వరూపాన్ని తెలుసుకొని చెప్తాను అంటున్నారు.
బ్రహ్మము ఇన్ద్రియాతీతమైనది. కనుక అగ్రాహ్యము. కనుకనే **'అహం బుద్ధ్వా వక్ష్యామి'** అంటున్నారు.

ఇక్కడ కవి చేతనప్రరోచన విధిని కావ్యాన్తర్గతమైన పాత్రలగూర్చిన ప్రశంసను **ఇక్ష్వాకు** వంశప్రభవః తో ప్రారంభించి **జనశ్చశూద్రోఽపి మహత్త్వ మీయాత్** అని పూర్తిచేసారు.

ఇక్ష్వాకు వంశప్రభవో రామో నామ జనైశ్శ్రుతః।
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్వశీ॥౮
బుద్ధిమాన్నీతిమాన్వాగ్మీ శ్రీమాన్ శత్రు నిబర్హణః।
విపులాంశో మహాబాహుః కమ్బుగ్రీవో మహాహనుః॥౯
మహోరస్కో మహేష్వాసో గూఢజత్రు రరిందమః।
ఆజానుబాహు స్సుశిరా స్సులలాట స్సువిక్రమః॥౧౦
సమస్సమ విభక్తాఙ్గః స్నిగ్ధవర్ణః ప్రతపవాన్।
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః॥ ౧౧
ధర్మజ్ఞ స్సత్యసన్ధశ్చ ప్రజానాంచ హితేరతః।
యశస్వీ జ్ఞానసమ్పన్న శ్శుచిర్వశ్య స్సమాధిమాన్॥
ప్రజాపతి సమః శ్రీమాన్ ధాతారిపు నిషూదనః।
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా॥ ౧౩
రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా।
వేదవేదాఙ్గ తత్త్వజ్ఞో ధనుర్వేదేచ నిష్ఠితః॥ ౧౪
సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్।
సర్వలోకప్రియ స్సాధు రదీనాత్మా విచక్షణః॥ ౧౫
సర్వదాభిగత స్సద్భి స్సముద్ర ఇవ సిన్ధుభిః।
ఆర్య స్సర్వసమశ్చైవ సదైక ప్రియదర్శనః॥ ౧౬
స చ సర్వగుణోపేతః కౌసల్యానన్ద వర్ధనః।
సముద్ర ఇవ గామ్భీర్యే ధైర్యేణ హిమవానివా॥౧౭
విష్ణునా సదృశోవీర్యే సోమవత్ప్రియ దర్శనః।
కాలాగ్ని సదృశః క్రోధే క్షమయా పృథివీసమః॥౧౮
ధనదేన సమస్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః।

ఇక్కడ వరకు బాలకాణ్డ విషయమని మహేశ్వరతీర్థులు, గోవిన్దరాజ ప్రభృతులు చెప్పియున్నారు.

॥ఇక్ష్వాకువంశ ప్రభవః॥

ఇమం వివస్వతే యోగం ప్రోక్తవానహ మవ్యయమ్।

వివస్వాన్మనవే ప్రాహు మనురిక్ష్వాకవేఽ బ్రవీత్॥

నాశరహితమైనట్టి వేదమూలమైన ఉపాయ ఉపేయ భూతములైన కర్మ, జ్ఞాన యోగములను పరమాత్మ సృష్ట్యాదియందు సూర్యునకు, ఆ సూర్యుడు తన కుమారుడైన మనువునకు, మనువు తన పుత్రుడైన ఇక్ష్వాకునకు, అటనుండి పరంపరయా సకల రాజర్షులకు సంప్రాప్తమైనది.

అనాది, నాశరహితమైన కర్మజ్ఞానరూపమైనట్టి వేద విద్యను పరంపరయా అభ్యాసరూపంగా రక్షిస్తూన్నటువంటి వంశము.

అట్టి ఇక్ష్వాకువంశమందు పుట్టినవాడు. రాముడను పేర జనులచేత వినబడు వాడు. నియతాత్ముడు అంటే వికార రహితుడు.

వాల్మీకి **వీర్యవాన్ కః?** అని అడిగిన దానికి...

మహావీర్యః, ద్యుతిమాన్, ధృతిమాన్, వశీ అని నాలుగు విశేషణములు చెప్పారు. నాల్గు విశేషణములతో శాస్త్రాదర్శమున తనను తాను చూచుకొంటూ సాంసారిక జీవనమును గడుపుచున్నవాడు.

"పూర్వరాత్రే న సంవేశయేత్" – బోధాయన సూత్రం

"సన్ధ్యయోః క్రూరగర్భః, దివా పుణ్యనాశః, ప్రతిషిద్ధేషు నరకః, తతస్తాన్ పరివర్జయేత్" శాణ్డిల్య సూత్రం

"దివాస్వాపం మైథునంచ నకుర్యాత్। కుర్యాచ్చేత్క్రమేణ ఆయుః పుణ్యయోర్హానిః"
–గౌతమ సూత్రం

"అపరాత్రే సంవేశనం శుభం" అపరరాత్రి సంగమము ఆచరించిన శుభము. పూర్వరాత్రి సంవేశము తగదు. సన్ధ్యాకాల సఙ్గమమునందు క్రూరులు జన్మిస్తారు. పగటిపూట సంభోగము పుణ్యమును నశింపచేయును. నిషేధ దినములందు (అంటే పక్షద్వయమందలి సప్తమీ, చతుర్దశి, పూర్ణిమ, ఆమావాస్య, ఆబ్దికదినము, దానివెనుక దినము, వ్యతీపాత వైధృతులు, సంక్రాతి, పగటివేళ, గ్రహణ సమయములు) సంగమించిన నరకము సంభవించును. పగటిపూట నిద్రా మైథునములవలన ఆయుష్యము, పుణ్యము నశించిపోవునని గౌతమ వచనము.

ధాతుక్షయో రోగ వృద్ధిరశ్రీ స్సత్కర్మ విప్లవః।
సౌభాగ్యాయుర్యశో నాశః పుంసాం స్త్రీష్వతిసఙ్గినామ్॥

మిక్కిలిగ స్త్రీల గవయుటవలన విశేషించి వీర్యము తగ్గును, దానిచే తేజస్సు క్షీణించును, రోగవృద్ధి, సంపద నశించును, సత్కర్మ నాశమందును, భాగ్యము, ఆయుస్సు కీర్తికి నాశనము కలుగును.

ఈ విధముగా గృహ్యసూత్రములందు చెప్పబడినది.

ధర్మశాస్త్రములు గీసిన గీటు దాటనివాడు. కనుకనే మహర్షి **మహావీర్యః, ద్యుతిమాన్** అని చెప్పారు.

విశేషించి **"వశీ"** అంటున్నారు. అంటే ఇన్ద్రియ నిగ్రహం కలవాడు. **ధృతిమాన్** ప్రశస్తమైన ఆనన్దము కలవాడు. భార్యయందే ఆనన్దము కలవాడని...

ఇదిగో గార్హస్థ్య జీవనం ఇలా ఉండాలి.

భార్యారూపంగా ఉపాసనచేసినా అందునా బ్రహ్మచర్యాన్నే పాటించాలి. **సహధర్మచారిణి అంటే గార్హస్థ్యములోను బ్రహ్మచర్యాన్ని కాపాడేది.** అదీ ధర్మాన్ని అనుగమించడం అంటే. చతుర్విధ ఆశ్రమ వ్యవస్థలలో బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలలో బ్రహ్మచర్యము విధిగా కనబడుతోంది. గృహస్థాశ్రమ విషయంలో మనం పొరబడుతున్నాం. దీనియందు బ్రహ్మచర్యమే విధి.

ఇదిగో ఇటువంటి జీవిక గలవానిని శ్రుతి స్మృతులు బ్రహ్మచర్యమందున్న వానిగానే చెప్పాయి.

కనకనే రాముదు సీతను పొందగలిగాడు.

సీత వీర్యశుల్క. బ్రహ్మచారులచేత పొందతగినది. ఆరాధింపతగినది. సేవింప తగినది.

"వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతో పమామ్" అని బాలకాణ్డ చివరలో జనకుడు పరిచయంచేస్తారు. సురులు అంటే దీక్షితులైనవారిచే యాగాదులందు సమర్పింపబడిన పవిత్రమైన హవిరాదులను స్వీకరించు వారు. **సురసుతోపమామ్** దేవతలవలె,

పరమపవిత్రమైన వాటి(రి)నే గ్రహిస్తుంది, వా(రి)టిచేతనే సేవింపబడుతుంది. రామచన్ద్రా నీవు యజ్ఞపురుషుడవు అందుచేతనే నిన్ను వరించింది. ఇదీ జనకుడు చెప్పిన రహస్యం.

కనుకనే బ్రహ్మవేత్త యజ్ఞదీక్షితుడు అయిన జనకునకు ఆ భాగ్యం...
లక్ష్మణస్వామికి ఆ భాగ్యం...
ఆబాల్యము బ్రహ్మచర్యమందున్న హనుమదా భాగ్యం...
ధార్మిక జీవనముకల విభీషణునికా భాగ్యం...
ఆశ్రమవాసులైన మహర్షులకు ఆ భాగ్యం...
మహాతపస్వి, వాల్మీకియైన ఋక్షునకు ఆ భాగ్యం...
వీరందరకు సీత అమృతస్వరూపిణి, తాపత్రయోప సంహారిణి.
ఏతద్భిన్నులైన సుధన్వ, రావణాదులకు మృత్యుస్వరూపిణి.
కశ్చైక ప్రియదర్శనః అని అడిగిన ప్రశ్నమునకు సమాధాన రూపముగా...
'విపులాంసః, మహాబాహుః, కమ్బుగ్రీవః, మహాహనుః, మహోరస్కః, మహేష్వాసః, గూఢజత్రుః, ఆజానుబాహుః, సుశిరాః, సులలాటః, సువిక్రమః, సమః, సమవిభక్తాఙ్గః, స్నిగ్ధవర్ణః, పీనవక్షాః, విశాలాక్షః, లక్ష్మీవాన్, శుభలక్షణః' అని సాముద్రికశాస్త్రము ఎటువంటి అవయవ విశేషములు సున్దరము శుభము అని చెప్పిందో అలా ఉన్నవాడు. సదైక ప్రియదర్శనుడు.
సర్వభూతేషు కోహితః అని అడిగిన ప్రశ్నకు...
ప్రజానాం చ హితే రతః, రక్షితా జీవలోకస్య, ధర్మస్య పరిరక్షితా అని...
ధర్మబద్ధమైన జీవలోకమునకు ఎవడు రక్షకుడో, ప్రజలకు హితము చేయుటయందు ఎవనికి ఆసక్తికలదో వాడు సర్వభూతహితుడు.
అవ్యక్తమునుండి క్రమానుగతికముగా ఆవిర్భవించిన ఈ చరాచరాత్మకమైన సర్వసృష్టికి జీవలోకము అనే వ్యవహారము. ఈ స్థావరజఙ్గమాత్మకమైన సర్వము పరమేశ్వర ప్రజయే. వీటియొక్క హితమునందు ఆసక్తికలవాడు.
"ప్రజాపతి సమః" అని **ఆత్మవాన్ కః?** అని వాల్మీకి అడిగిన ప్రశ్నకు సమాధానముగా చెప్పేరు. హిరణ్యగర్భుడే ప్రజాపతి శబ్దవాచ్యుడు, మొదట పుట్టినవాడు. అగ్రజుడు అని శాంతిపర్వములో చెప్పేరు. ఇతనికంటే పరతత్త్వమును (అంటే తనకు అన్యముగా ఏదీలేదను విషయము) బాగుగా తెలిసినవాడు ఎవడును లేడు. కావున భయరహితుడు.
"చారిత్రేణచ కోయుక్తః" అను వాల్మీకి సంశయమునకు **"ఇక్ష్వాకువంశ ప్రభవః,**

రక్షితా స్వస్య ధర్మస్య, స్వజనస్య చ రక్షితా"... ఇక్ష్వాకువంశ ప్రభవః అనుటచేతనే పరంపరాగతమైన ఆచార వ్యవహారములు కలవాడనునది స్పష్టము. క్షత్రియధర్మమును రక్షించువాడు. ఆశ్రిత జనరక్షకుడు. ఆశ్రిత జనరక్షణ, స్వధర్మరక్షణాది సదాచారములను పాటించువాడు.

"విద్వాన్ కః" అంటే **"వేదవేదాఙ్గ తత్త్వజ్ఞో ధనుర్వేదేచ నిష్ఠితః, సర్వశాస్త్రార్థ తత్త్వజ్ఞః"** అని చూపెడుతున్నారు.

రాశీభూతమైన వేదముయొక్క, శిక్ష వ్యాకరణము ఛన్దస్సు నిరుక్తం జ్యోతిషం కల్పం అను వేదాఙ్గాలయొక్క; మీమాంస న్యాయ ధర్మశాస్త్ర పురాణ ఆయుర్వేద ధనుర్వేద గాన్ధర్వ అర్థశాస్త్రములయొక్క మూలస్వరూపమును బాగుగా ఎరిగినవాడు. వాటిని బాగుగా తెలిసి వాటియందు కృతజ్ఞత కలవాడు. కావుననే స్మృతిమాన్ అని చెప్పారు. నేర్చిన విద్యను, చేసిన మేలును, ఎరిగిన ధర్మమును ఎన్నడును మరువనివాడు అంటే ఆచరణయందు కలవాడు.

సముద్ర ఇవ గామ్భీర్యే ధైర్యేణ హిమవానివా॥

సముద్రంవలె గంభీరంగా ఉంటాడు. అంటే వాగులు వంకలు పిల్లకాలువలతో కలిసి వస్తూన్న మహానదులకు అభయప్రదమైన ఆశ్రయస్థానం సముద్రం. సముద్రుని శరణువేడిన నదులు ఏవిధంగా సముద్రంగా మారిపోతున్నాయో! రాముని శరణువేడినవారుకూడా రాముడే అయిపోతున్నారు. అహంభావనను వీడిపోతున్నారు.

హిమవంతుడిలా ఎంత కష్టం వచ్చినా!

ఇంద్రుడు రెక్కలు నరికే సమయంలో తన కడుపున పుట్టినవాడు యౌవనంలో ఉన్నవాడు భయంతో జారిపోయేడు. తనుమాత్రం ధైర్యం వీడిపోలేదు. కనుకనే సర్వదేవతలకు ఆశ్రమస్థానమైయ్యేడు. ఆవిధంగానే రాముడుకూడా ఎంత కష్టం వచ్చినా వెన్ను వంచనివాడు. అంత ధైర్యవంతులు కనుకనే హిమవంతుడు పరమేశ్వరునకు ఆవాసమైయ్యేడు. రాముడు ఆరాధ్యుడైయ్యేడు.

ద్యుతిమాన్ కః అని అడిగిన వాల్మీకి ప్రశ్నమునకు **'విష్ణునా సదృశో వీర్యే, సోమవత్ప్రియ దర్శనః'** తన స్వభావము చేతను, కర్మచేతను సర్వత్ర వ్యాపించి ప్రకాశింపజేస్తున్న సూర్యునిలాంటి వాడు. పూర్ణచన్ద్రునిలా సర్వులకు ప్రియమైన దర్శనము కలవాడు.

రాముడు, విష్ణువు లేదా విష్ణుశబ్దవాచ్యుడైనవాడు, చన్ద్రుడు; వీరు ఉపాధుల యందు భేదంకలవారు. అంటే ఉపమాన ఉపమేయములకు భేదంకలదు. కానీ వీరిమధ్య సాధర్మ్యమైన విషయం ఉంది. కావున ఉపమాలంకారము. **తుల్యః, సమ, సదృశ** మొదలైన పదాలకు 'సామ్యంకలది' అనే అర్థం. ఇవి ప్రత్యక్షంగా తుల్యత్వాదులున్న విశేష్యాన్ని బోధిస్తాయి. **'విష్ణునా సదృశో వీర్యే'** ఇక్కడ పరాక్రమం విష్ణువుతో తుల్యం అంటున్నారు మహర్షి. ఆ రెండూ తుల్యాలనే భావన ఏర్పడిన తరువాత సాధర్మ్యజ్ఞానం కలుగుతుంది. ఇక్కడ సాదృశ్యజ్ఞానం అర్థాత్ సిద్ధం. దీనిని **అక్షిప్తం** అంటారు. ఇక్కడ **ఉపమ ఆర్థి.** **'సోమవత్ప్రియ దర్శనః'** ఇక్కడ **'తత్ర తస్యేవ'** అను పాణిని సూత్రంచే **'వతి'** ప్రత్యయం విధించబడింది. షష్ఠ్యన్త, సప్తమ్యన్తపదాలకు **'వతి'** ప్రత్యయం వస్తుంది. అది **'ఇవ'** అనే అవ్యయంయొక్క అర్థాన్నే బోధిస్తుంది.

"సోమే ఇవ ప్రియదర్శనః" చన్ద్రునియందువలె ప్రియమైన దర్శనం. ఇది **తద్ధితగత శ్రౌతోపమ.**

"సాధు, సర్వదాభిగత స్సద్భిః, ఆర్యః, క్షమయా పృథివీ సమః" సత్పురుషులచే ఎల్లప్పుడు పొందబడినవాడు. పూజ్యుడు, అపకారికికూడా ఉపకారము చేయువాడు, ఓర్పుగలవాడు. కావున ఇతడు **జితక్రోధుదు.** అంటే అరిషడ్వర్గమును జయించినవాడు.

"సర్వలోక ప్రియః, అదీనాత్మా, సర్వసమః" అయినవాడు **అనసూయత్వము** కలవాడు. అందరియందు ప్రీతికలవాడు, కష్టకాలమందు కూడా కలత చెందని వాడు, అందరి విషయములందును సమముగా ప్రవర్తించువాడు. శత్రు మిత్రాదు లిరువురియందు సమముగా నుండువాడు.

"కాలాగ్నిసదృశః క్రోధే" కోపమువచ్చినప్పుడు మృత్యుస్వరూపుడు. ఇక్కడ **కాలాగ్ని-క్రోధం** వీటియందలి సాధారణ ధర్మమైన వినాశకత్వాన్ని చెప్పలేదు. కావున ఇది ధర్మలుప్తోపమ.

'సత్యవాక్యః కః' అన్నదానికి **'సత్యే ధర్మ ఇవాపరః'** అని సమాధానం చెప్పారు. అంటే సత్యమునందు తనను మించినవారు ఎవరునూ లేని ధర్మదేవత వంటివాడు.

"ధనదేన సమస్త్యాగే" త్యాగము చేయుటలో కుబేరునితో సమానుడు. ఎదుటివారికి ఇచ్చే సమయంలో తనను తాను కుబేరునిగా తలంచుకొను వాడు. **'క్షమయా పృథివీ సమః' 'ధనదేన సమస్త్యాగే'** అను స్థలాలలో ఆర్థోపమ. రాముని మించినవాళ్ళు అప్పటికి లోకంలో చాలామందే ఉన్నారు. **'గుణలేశతః సామ్యముపమా'** అని ఆలంకారికులు అంగీకరించేరు. ఇక్కడ ఉపమా అలంకార ప్రయోగంచే విష్ణువు చంద్రుడు పృథివీ మృత్యువు ధనదుడు వీరి సర్వశ్రేష్ఠత్వాన్ని మహర్షి అంగీకరించి రాముని వీరితో పోల్చి రాముడు సామాన్యుడే అని చెప్పేరు. ఈ సామాన్యుడే అసమాన ప్రతిభను ప్రదర్శిస్తూ ఎదిగేడు. అలా రాముడు ఎదిగిన మార్గాన్ని చూపిస్తున్నాను. తండ్రిని మించిన కొడుకు, గురువుని మించిన శిష్యుడు; ఎలా అయితే లోకంలో కనబడుతున్నారో రాముడు అలా ఎదిగి ఉపమేయుడుగా ఉన్న రాముడు ఉపమానముగా అయ్యేడు. ఇదగో ఈ మార్గంలో నడిస్తే, మీరు రామ సాదృశ్యాన్ని పొందుతారు. అందుకోసం ఆలంకారిక శోభ.

"ఇక్ష్వాకువంశ ప్రభవః" తో ప్రారంభించి **"స చ సర్వగుణోపేతః కౌసల్యానన్ద వర్ధనః"** వరకు మహర్షి ఒక క్రమం చూపెట్టారు.

శిశుజననము, నామకరణము, బ్రహ్మచర్యము, విద్యా భ్యాసము, రాజనీతి శాస్త్రసహితమైన సమస్తవిద్యలు తెలిసిన వానిగా, శస్త్రాస్త్రవిద్యా జ్ఞానముచే శత్రువులను నశింపజేయువానిగా, సాముద్రికశాస్త్రోక్త ప్రకారమైన ఆకృతిగల వానిగా ధర్మజ్ఞునిగా శ్రీమంతునిగా సర్వగుణోపేతునిగా శ్రీరాముడు (తీర్చిదిద్ద బడ్డాడు) ఆవిష్కరింపబడ్డాడు.

ఇప్పుడు రాముడు బాల్యం దాటాడు....

ప్రయోజకుడైన పుత్రుని చూస్తే... ఆ తల్లితండ్రుల ఆనన్దానికి అవధులుండవు. యుక్తవయస్సులో ఉన్నాడు...

60000 వేలసంవత్సరాల సుదీర్ఘ రాచరికవ్యవస్థలో అలసిన తండ్రి పరిపాలనా వ్యవహారాలను... అందిపుచ్చుకోగల సామర్థ్యంతో ఉన్నాడు.

ప్రయోజకుడై తనంతగా ఎదిగిన రాముడు శ్రీమంతుడై (వివాహితుడై) తన ఎదుట ఉన్నాడు. ఇదీ కౌసల్యాదేవి ఆనన్దము.

తమేవ గుణసమ్పన్నం రామం సత్యపరాక్రమమ్॥ ౧౯
జ్యేష్ఠం శ్రేష్ఠగుణైర్యుక్తం ప్రియం దశరథస్సుతమ్।
ప్రకృతీనాం హితైర్యుక్తం ప్రకృతిప్రియకామ్యయా॥ ౨౦
యౌవరాజ్యేన సంయోక్తు మైచ్ఛత్ప్రీత్యా మహీపతిః॥

కౌసల్యానన్ద వర్ధనుడేకాదు...
దశరథునకూ ప్రీతిపాత్రుడు. ఆ ఆనన్దము ఎందుకంటే...
జనులాపుత్రుని కనుగొని పొగడగ పుత్రోత్సాహము తండ్రికి, అనినట్లుగా...
ఏ ముహూర్తంలో నామకరణం చేసారో ఆ వశిష్ఠమహర్షి; పిపీలికాది బ్రహ్మ పర్యన్తమునకు రామనామ స్మరణే. రాముడు ప్రజల మనిషి, నాయకుడను ముసుగులో ఉన్నవాడుకాదు, ప్రజలతో ప్రజాసమస్యలతో మమైకమై యుండువాడు.
పశుపక్షిపాషాణపాదప రూపమైన సర్వప్రకృతితోను మమైకమైయుందు వాడు.
లోకహితాన్ని ప్రజాహితాన్ని నిజంగా కాంక్షిచేవాడికి పదవులు అవసరంలేదు.
నేను పరిపాలించాలి అని రాముడు అనుకోలేదు.
రాముని నీడలో మేము బ్రతకాలి, పరిపాలింపబడాలని ప్రజలు అనుకొన్నారు.
ఇటువంటి రాముడు యువరాజు కావాలని దశరథుడు కోరుకున్నాడు.
పరిపాలకునకు ఉండవలసిన అన్ని సద్గుణములు, అర్హతలు ఉన్నవాడు.
జ్యేష్ఠపుత్రునికి పరిపాలనాధికారం ధర్మము.
విశేషించి ప్రకృతికి ప్రియము చేసినవాడు అవతాడు.
కనుక రాముని యువరాజుని చేయ నిశ్చయించాడు.

తస్యాభిషేక సమ్భారాన్ దృష్ట్వా భార్యాథ కైకయీ॥ ౨౧
పూర్వం దత్తవరా దేవీ వరమేనమయాచత
వివాసనం చ రామస్య భరతస్యాభిషేచనమ్॥ ౨౨

రాముని అభిషేకమునకై తీసుకొనిరాబడిన సంభారాలను పూర్వము దశరథునిచే ఇవ్వబడిన వరములు గల కైకేయీ మాత చూచింది. చూచి..,
రాముని ప్రవాసజీవితమును, భరతుని అభిషిక్తుని గావించుటను ఇప్పుడు యాచించింది.

స సత్యవచనాచ్చైవ ధర్మపాశేన సంయతః।
వివాసయామాస సుతం రామం దశరథః ప్రియమ్। ౨౩
స జగామ వనం వీరః ప్రతిజ్ఞామనుపాలయన్।
పితుర్వచన నిర్దేశాత్ కైకేయ్యాః ప్రియకారణాత్॥ ౨౪

సత్యవాక్పాలనచే ధర్మపాశబద్ధుడైన దశరథుడు రాముని అరణ్యానికి పంపేరు. వీరుడైన రాముడు **"పితుర్వచన నిర్దేశాత్"** తండ్రియొక్క మాటమాత్రమును ఉపదేశముగా గ్రహించాడు. గ్రహించి ప్రతిజ్ఞాపాలనముకొరకు వనమునుగూర్చి వెళ్ళాడు.

తం వ్రజన్తం ప్రియోభ్రాతా లక్ష్మణోఽనుజగామ హ
స్నేహాద్వినయ సమ్పన్నః సుమిత్రానన్ద వర్ధనః॥
భ్రాతరం దయితో భ్రాతుః సౌభ్రాత్రమను దర్శయన్॥౨౫

లక్ష్మణుడు అనుగమించాడు, ఆవును అనుగమిస్తూన్న దూడలా...

రామస్య దయితా భార్యా నిత్యం ప్రాణసమా హితా। ౨౬
జనకస్య కులే జాతా దేవమాయేవ నిర్మితా
సర్వలక్షణ సమ్పన్నా నారీణాముత్తమా వధూః॥ ౨౭
సీతాప్యనుగతా రామం శశినం రోహిణీయథా॥

అని చెప్పారు మహర్షి. ఈమెను **"దయితా"** అన్నారు. సర్వవిధములా చిత్తమును ఆకర్షించునది. ఈ మాటను లక్ష్మణుని విషయంలోను చెప్పారు.
"జనకస్య కులేజాతా" జనకుని కులమందు పుట్టినది. ఇది వాచ్యార్థము. (ప్రజాపతి) హిరణ్యగర్భుని కులంలో పుట్టింది. **"దేవమాయేవ నిర్మితా"** అంటే "ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా" నిర్గుణమైన పరమాత్మ సగుణరూపాన్ని కల్పించుకొన్నట్లుగా; హిరణ్యగర్భునివలే పుట్టింది. (పరమాత్మతో నిత్యసంబంధియైన మాయ(శక్తి)లా... అవిభాజ్యమైన రూపం)
బాలకాణ్డ నలభైతొమ్మిదవ సర్గలో
ప్రయత్నా న్నిర్మితాం ధాత్రా దివ్యాం మాయామయీ మివ,
సతుషారావృతాం సాభ్రాం పూర్ణచన్ద్రప్రభామివ
అని మహర్షి అహల్యనుగూర్చి ఇదే విధంగా చెప్పారు.

పరమాత్మ సృష్ట్యున్ముఖుడై తనను తాను ఏవిధముగా హిరణ్యగర్భునిలా కల్పించుకున్నాడో...
అదే విధముగా సీత తనంత తానుగా బయల్పడింది.
"సర్వలక్షణ సంపన్నా" షోడశ కళాపూర్ణయని అర్థము.
నారీణాముత్తమా వధూః భర్తను వశమందుంచుకొన్న వారిలో తలమానికమైన స్త్రీ. ఆ భర్తచేత మాత్రమే పొందబడునది అని వధూ శబ్దము చెప్తోంది.
(నృణంతి నయంతి సర్వం స్వవశమితి నరాః) అన్నియు తమ వశమందుంచు కొన్నవారు యోగులు. అట్టి యోగులచే ఉపాసింపబడు శ్రేష్ఠమైన కుణ్డలినీ స్వరూపము. వధూశబ్దము గంధవిశేషముగా చెప్పబడి ఈమె స్థానము మూలాధారముగా సూచింపబడింది.
సీతాప్యనుగతా రామం శశినం రోహిణీయథా అట్టి సీత రాముని అనుగమించింది. రోహిణి చన్ద్రునివలె అని చెప్పి, ఇక్కడ శశిరోహిణులకు, రామసీతలకు సాధర్మ్యమును చెప్పారు. **'యథేవేతి' 'యథా, ఇవ, వా'** మొదలైన శబ్దాలు దేనికి పరంగా ప్రయోగింపబడతాయో అది ఉపమానం. ఇవి శ్రవణమాత్రంచేత సంబంధాన్ని ప్రతిపాదిస్తున్నవి కావున ఇది **శ్రౌతి** ఉపమ. చన్ద్రునియందు పరమప్రీతిగల రోహిణికూడా భర్తృసాన్నిధ్యాన్ని అపేక్షించి రోజుల తరబడి ఎదురుచూస్తూ; విధిని అనుసరించి భర్తృవియోగాన్ని నిత్యంగా అనుభవిస్తూన్నదిగానే ఉంది. ఇక్కడ భర్తృవియోగం ఇద్దరి (రోహిణీ సీతల) యందలి సమానధర్మం. ఇది **ధర్మలుప్తశ్రౌతి** అయిన ఉపమాలంకారం. ఆలాగుననే సీతారాముల జీవితమందు వియోగము సహజమని ఉపమాన పూర్వకమైన ధ్వని చేసారు.

> **పౌరైరనుగతో దూరం పిత్రా దశరథేనచ॥** ౨౮
> **శృఙ్గిబేరపురే సూతం గఙ్గాకూలే వ్యసర్జయత్।**
> **గుహమాసాద్య ధర్మాత్మా నిషాదాధిపతిం ప్రియమ్॥** ౨౯
> **గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా।**

సీతారామలక్ష్మణులు పురప్రజలచేతను, దశరథునిచేతను చాలా దూరం అనుసరింపబడ్డారు.

రథమును సారథినీ విడిచిపెట్టారు, సీతాలక్ష్మణ సహితుడైన ఆ రాముడు గుహునిచే పంపబడ్డాడు.

తేవనేన వనం గత్వా నదీస్తీర్వా బహూదకాః॥౩౦
చిత్రకూట మనుప్రాప్య భరద్వాజస్య శాసనాత్।

వారు పరస్పరము రక్షించుకొనుచు వనములు దాటి ఆశ్రమ ప్రాంతాలలో తిరిగి భరద్వాజుని ఆజ్ఞవలన చిత్రకూటం వెళ్ళారు.

రమ్యమావసథం కృత్వా రమమాణా వనేత్రయః॥౩౧
దేవగన్ధర్వ సజ్కాశాస్తత్ర తే న్యవస స్సుఖమ్॥

అక్కడ పర్ణశాలను నిర్మించుకున్నారు. అందముగా నిర్మించుకున్నారు. **'ఆవసథం రమ్యం కృత్వా'** అన్నారు మహర్షి.

ఆ వనమందు అట్టివారుగనే క్రీడించారు, అంటే వనవాసులుగానే క్రీడించారు. తాము నాగరికులైయుండి ప్రకృతి యొక్క సమతుల్యతకు భంగము కలుగకుండా జీవించారు.

రాముడు చిత్రకూటంలో ఉండగా దశరథుడు స్వర్గస్థుడైనాడు.

"దేవగన్ధర్వ సజ్కాశాస్తత్ర తే న్యవస స్సుఖమ్"

దేవతలతోను, గన్ధర్వులతోను సమానులై సుఖముగా నివసించిరి.

అంటే నిత్యసంతుష్టులై జీవన్ముక్తులవలె సుఖముగా నివసించుచున్నారు.

వశిష్ఠాదులు భరతునికి రాజ్యభారాన్ని అప్పగించే ప్రయత్నం చేసారు.

కాని తాను బ్రహ్మచారియై జితేన్ద్రియుడై రామానుగ్రహమును కోరి వనములకు వెళ్ళాడు.

రామచన్ద్రుని సమీపించాడు, సమీపించి...

త్వమేవరాజా ధర్మజ్ఞ ఇతి రామం వచోఽబ్రవీత్। ౩౬

రామా! నీవే రాజువు. నీవు ధర్మజ్ఞుడవు. రాజ్యార్హత నీకు మాత్రమే ఉంది. నీవు జ్యేష్ఠుడవు. నీ నీడను ఉండతగ్గ వారము మేము. అని పలికిన భరతుని వాక్యములు విన్నాడు.

తాను సమస్త జనులను ఆనన్దింపచేయువాడు. పరమ ఉదారుడు అంటే అడిగినంతనే ఇచ్చేవాడు... అడగకుండానే ఇచ్చేవాడు. ప్రసన్నమైన ముఖము

గలవాడు. గొప్పకీర్తి కలవాడు అయిన రామచన్ద్రుడు తండ్రియొక్క ఆదేశమునకు కట్టుబడి **'రాజ్యం న చ ఐచ్ఛత్'** రాజ్యమును కోరలేదు. ఎంతవరకు....తండ్రి విధించిన గడువు దాటువరకు నాకు రాజ్యము వలదని భరతునికి తెలిపి,

పాదుకేచాస్య రాజ్యాయ న్యాసం దత్వా పునఃపునః।

రాజ్యము చేయుటకు న్యాసపూర్వకముగా పాదుకలను ఇచ్చాడు. అంటే ఈ రామపాదుకలయందు రాముడు ఆరోపింపబడి భరతుని వెంట రాముడే వెళ్ళాడు.

నివర్తయామాస తతో భరతం భరతాగ్రజః॥ 38

భరతాగ్రజుడైన రాముడు మాటిమాటికి భరతుని మరలించెను. పాదుకలను ఇచ్చి చాలా విషయములను అనేక విధములుగా బోధించి నెమ్మదిగా పంపాడు. పాదుకారూపంగా నేను అయోధ్య వస్తే; పితృవాక్యపాలనకు ఘాతకలుగుతుంది. కావున ఈ పాదుకలు అయోధ్యా ప్రవేశార్హత కలవికావు.
ఇక్కడ భరతుని రూపంగా రామరాజ్యమే నడిచింది. ఇదీ రహస్యం.
కనుకనే భరతుడు అయోధ్యను తిరిగి పొందలేదు.

సకామ మనవాప్యైవ రామపాద ఉపస్పృశన్। 39
నన్దిగ్రామేఽకరోద్రాజ్యం రామాగమన కాంక్షయా॥

రామాగమన కాంక్షతో నన్దిగ్రామమునందు ఉన్నాడు.
రాముడు చిత్రకూటమును విడిచి, దణ్డకను ప్రవేశించాడు. విరాధవధ, శరభంగ, సుతీక్ష్ణ, అగస్త్య, అగస్త్యసోదరులను చూచారు.
ఇన్ద్రదత్తమైన ధనుస్సు, అక్షయ తూణీరములను, ఖడ్గమును రాముడు పరమప్రీతితో అగస్త్యునినుండి గ్రహించాడు.
శరభంగమహర్షి ఆశ్రమంలో అగ్నితుల్య తేజస్సుగల మహర్షులకు ఆ దణ్డకను అరాక్షసం చేస్తానని మాట ఇచ్చాడు. ఆ ప్రతిజ్ఞకారణంగా దణ్డకారణ్యంలోనే నివసిస్తున్నారు.

తేన తత్రైవ వసతా జనస్థాన నివాసినీ
విరూపితా శూర్పణఖా రాక్షసీ కామరూపిణి॥ ౪౮

రాముడు దణ్డకారణ్యములో జనస్థానమునకు చెందిన కామరూపిణియైన శూర్పణఖను వికృతమైన రూపముగలదిగా చేసేడు.

సజాతావుత్తమోదణ్డ అనులోమేన తు మధ్యమః।
ప్రాతిలోమ్యే వధః పుంసాం నార్యాః కర్ణాదికర్తనమ్॥

తక్కువ వర్ణమువాని బొందిన స్త్రీకి ముక్కు చెవులు కోయుట దణ్డనముగా యాజ్ఞ్యవల్క్య స్మృతి చెప్పింది.

విరూపితయైన శూర్పణఖ కారణంగా ఖరుడు, త్రిశిరసుడు, దూషణుడు అనువారలు వారి సేనలతో సహా పదునాలుగు వేలమంది ఆ జనస్థానములో వధింపబడ్డారు. దణ్డక అరాక్షసము అయ్యింది.

రావణుడు జ్ఞాతుల వధనుగూర్చి విన్నాడు. క్రోధమూర్ఛితుడైనాడు అన్నారు మహర్షి. క్రోధంతో ఒళ్ళుతెలియని స్థితిలో ఉన్నాడు. దానివలన స్మృతి భ్రంశము, దానితో బుద్ధిపని చేయట్లేదు. కనుకనే పరదారాపహరణ రూపమైన అధర్మానికి ప్రేరితుడైనాడు. ప్రేరితుడై....

సహాయం వరయామాస మారీచం నామ రాక్షసం। ౫౦

మారీచుని సహాయం కోరాడు. తన సార్వభౌమత్వాన్ని విడిచిపెట్టాడు. తన ఆజ్ఞాబద్ధులైన వారిముందు తాను యాచకుడై నిలబడ్డాడు.

వాడితో కూడా రామ విరోధరూపమై వారింపబడ్డాడు. కాని...

కాలచోదితుడైన రావణుడు అంటే క్రోధరూపమైన మృత్యు సమీపమునున్న రావణుడు; కనుకనే తనవాడైన మారీచుని హితవచనములు చెవికెక్కలేదు మనస్సు ఆదరింపలేదు. కాబట్టే ఇన్ద్రియాశ్వాలు మహావేగంగా రావణుని మారీచునితో సహా రుద్రస్వరూపుడైయున్న రామ సన్నిధానానికి లాక్కుని పోయాయి.

తేన మాయావినా దూర మపవాహ్య నృపాత్మజౌ। ౫౨

మాయావియైన మారీచునిచేత రాజకుమారు లిరువురును దూరముగా తొలగిపోవుట్లు చేసి, జటాయువును గ్రద్దను చంపి, రామపత్నిని అపహరించేడు.

మాయను విడిచిపెట్టిన మారీచునిచేత ఆ రాకుమారులను దూరముగా తొలగి పోవునట్లుచేసి సీతను అపహరించేడు.

స్వాభావికంగా ఆధర్మపరుడు మారీచుడు.

రామబాణ, రామనామ స్పర్శవలన మాయను విడిచి తపస్వియై ధర్మమార్గాన ఉన్నాడు. వాడితో మరల తప్పు చేయించాడు.

దుష్టుని సహవాసం ఎప్పుడూ ప్రమాదకరమే...

జటాయువను గృధ్రమును చంపాడు.

సీతాపహరణము చేసేడు.

రాముడు నిహతమైన జటాయువును చూసేడు. సీతాపహరణ వృత్తాంతాన్ని విన్నాడు. వ్యాకులమైన ఇన్ద్రియములు గలవాడై విలపించేడు.

అంత దుఃఖములోనూ, జటాయువునకు దహనక్రియ నిర్వహించాడు. సీతను వెదకుచూ...

అరణ్యమందు వికృతాకారుడు, భయంకరుడు అయిన కబంధుని చూసాడు.

రాముడు కబంధుని చంపి, దహన సంస్కారము చేసేడు.

కబంధుడు స్వర్గానికి వెళ్తూ...

"రామా...**'ధర్మచారిణీం, ధర్మనిపుణామ్'** ధర్మచారిణి, ధర్మములందు నిపుణురాలైన...తురీయాశ్రమమునందున్న శబరినిగూర్చి వెళ్ళమని" చెప్పేడు.

మహాతేజో విరాజితుడు శత్రుసూదనుడు అయిన రాముడు శబరినిగూర్చి స్వయంగా వెళ్ళేడు. దశరథాత్మజుడైన రాముడు శబరిచే బాగుగా పూజింప బడ్డాడు.

పమ్పాతీరే హనుమతా సఙ్గతో వానరేణ హ।
హనుమద్వచనాచ్చైవ సుగ్రీవేణ సమాగతః॥ ౫౮
సుగ్రీవాయ చ తత్సర్వం శంసద్రామో మహాబలః।
ఆదితస్తద్యథా వృత్తం సీతాయాశ్చ విశేషతః॥ ౫౯
సుగ్రీవశ్చాపి తత్సర్వం శ్రుత్వా రామస్య వానరః।
చకార సఖ్యం రామేణ ప్రీతశ్చైవాగ్ని సాక్షికమ్॥ ౬౦

రాముడు పంపాతీరమున హనుమంతునితో పరిచయము చేసుకున్నాడు, హనుమ మాటవలన సుగ్రీవునితోగూడా చేరాడు.
సుగ్రీవునకు, హనుమదాదులకు రాముడు తన వృత్తాంతమును ఆదినుండి చెప్పి, విశేషించి సీతా వృత్తాంతాన్ని యథాతథముగా చెప్పాడు.
సుగ్రీవుడు అంతా విన్నాడు, విని...
పరమప్రీతితో అగ్నిసాక్షిగా రామునితో స్నేహంచేసాడు.
ఎందుకని ఆనన్దము అంటే...
రాముడు తనవలెనే మహాబలుడు, వంశప్రతిష్ఠకలవాడు, రాజ్యపరిత్యాగం చేసినవాడు. దారాపహరణ రూప దుఃఖము గలవాడు.
సర్వసములతోనే స్నేహం. ఇది శాస్త్రవిధి. కనుకనే రామునితో అగ్నిసాక్షిగా మైత్రి చేసాడు. స్నేహితులు అయ్యారు. ఇంతవరకు పూర్వోక్త శ్లోకత్రయమందు **సుగ్రీవేణ సుగ్రీవాయ సుగ్రీవః** అని పిలువబడిన వాడు;
స్నేహితులైన ఉత్తరక్షణం **వానర రాజేన** పిలువబడ్డాడు.

తతో వానర రాజేన వైరాను కథనంప్రతి।
రామాయావేదితం సర్వం ప్రణయాదుఃఖితేనచ॥

అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నారు. స్నేహితునకు కానుక ఇస్తున్నాడు. ఎటువంటి కానుక...
ఏది తన మిత్రునకు ప్రియమైనదో...అది ఇస్తున్నాడు.
ఇటుపై నీవు వానర రాజువు అన్నాడు. దీనివలన రెండు ప్రయోజనాలు సిద్ధించాయి.
ప్రియపత్నీ ప్రాప్తిరూప ఫలం ప్రధానమైతే; రాజ్యప్రాప్తి ఆనుషఙ్గికము.
వీరు రాజ్యముకొఱకు ప్రాకులాడిన వారుకాదు.
పత్నీవియోగంవలన ధర్మాచరణకు ఆటంకము ఏర్పడినదను దుఃఖము కలవారు. **యస్యార్థాస్తస్య మిత్రాణి** ఇది లోకనీతి. లోకంలో సంపదలు కలవానికే మిత్రులు. రాముడు భాగ్యహీనుడిగా ఉండికూడా మిత్రులను సంపాదించు కున్నాడు. తను లక్ష్మీపరిత్యక్తుడైనప్పటికీ తను మిత్రులకు రాజ్య లక్ష్మలను ఇచ్చేడు.

తరువాత దుఃఖితుడైన వానరరాజైన సుగ్రీవుడు తన వృత్తాంతము సర్వము రామునకు చెప్పాడు.

ఇక్కడ **"వైర అనుకథనం ప్రతి"** చాలా అందముగా మాట్లాడుతున్నాడు, **"పశ్చాత్సాదృశ్యయో రను" అను** అనుదానికి **వెనుక** అను అర్థములోను, **సాదృశ్యము** అను అర్థములోను వినియోగము.

వాలి వధరూప ప్రతిజ్ఞను రాముడు చేసాడు. అప్పుడు వానరుడైన సుగ్రీవుడు, వాలి బలమును వర్ణిస్తున్నాడు. ఇదీ వానర స్వభావం.

రామపరాక్రమ విషయంలో సందేహము. ఆ సందేహనివృత్తికొరకు స్నేహితుణ్ణి పరీక్షించటం.

మహాపర్వత సదృశమైన దుందుభి కళేబరాన్ని చూపించాడు. దాన్ని రాముడు పాదాఙ్గుష్ఠముతో ఎత్తి దశయోజనముల దూరం విసిరివేసాడు. తిరుగ ఒకేఒక్క బాణముతో ఏడు సాలవృక్షములను పర్వతమును పాతాళమును భేదించాడు.

సుగ్రీవుడు సంతోషించాడు. రామపరాక్రమము మీద విశ్వాసం ఉంచాడు. రామునితోకూడి కిష్కిన్ధకు వెళ్ళాడు.

మహాగర్జన చేసాడు. ఆ ధ్వనికి వానరరాజైన వాలి బయటకు వచ్చాడు.

వస్తూ... తారను ఒప్పించి మరీ వచ్చాడు అన్నారు మహర్షి. ఈ శబ్దవ్యాప్తి ఎంత విస్తారంగా ఉందో ఆయా కాండలలో వాల్మీకి మనకు చూపిస్తారు.

ఒకే బాణముచే వాలిని చంపాడు.

సుగ్రీవునకు ఇచ్చిన మాట ప్రకారము వాలిని చంపి, రాజ్యమునందు సుగ్రీవుని ప్రతిష్ఠించాడు. వానర శ్రేష్ఠుడగు సుగ్రీవుడు సమస్తమైన వానరులను రప్పించి సీతాదేవిని అన్వేషించుటకై అన్నిదిక్కులకు పంపేడు.

తతో గృధ్రస్య వచనాత్సంపాతేర్హనుమాన్ బలీ।
శతయోజన విస్తీర్ణం పుప్లువే లవణార్ణవమ్॥౭౨

సంపాతియను గ్రద్దయొక్క మాటవలన శతయోజన విస్తీర్ణమైన లవణ సముద్రమును బలశాలియైన హనుమ దాటాడు.

తత్ర లఙ్కాం సమాసాద్య పురీం రావణపాలితామ్।
దదర్శ సీతాం ధ్యాయన్తీ మశోకవనికాం గతామ్॥ 23

రావణునిచే పాలింపబడిన లంకాపట్టణమును చేరి, ఎప్పుడైతే హనుమ అబ్ధిలంఘించాడో, అప్పుడే లంక రావణునియొక్క గతవైభవమని, ఇక్కడ మహర్షి '**పాలితామ్**' భూతకాలిక క్రియాప్రయోగం చేసారు. అక్కడ అశోక వనములో ధ్యానమందున్న సీతను చూచేడు. అభిజ్ఞానమును నివేదించాడు.
రామ సుగ్రీవ మైత్రీవృత్తాంతాన్ని విన్నవించాడు.
వైదేహిని ఓదార్చి, బహిర్ద్వారమును చూర్ణము చేసేడు.
ఐదుగురు సేనానాయకులను, ఏడుగురు మంత్రి కుమారులను చంపాడు.

శూరమక్షంచ నిష్పిష్య గ్రహణం సముపాగమత్

శూరుడైన అక్షుని ముద్ద చేసాడు. గ్రహణాన్ని పొందాడు.
సూర్యచన్ద్రులు గ్రహణ సమయములందు రాహుకేతువులచే ఏవిధముగా గ్రహింపబడినట్లుగా కనబడుతున్నారో అదేవిధముగా స్వామి ఇన్ద్రజిత్తుచేత బంధింపబడినట్లుగా కనబడుతున్నారు. అందుకే స్వామి విషయంలో మహర్షి '**గ్రహణం సముపాగమత్**' అని ప్రయోగించారు.
వీరుడైన హనుమంతుడు బ్రహ్మ వరప్రభావము వలన తాను బ్రహ్మాస్త్రముచే విడువబడిన వానినిగా తెలుసుకొని, రావణుని చూడాలనే కోరికచే ఆ రాక్షసులను సహించాడు. తరువాత సీతాదేవి నివసించు ప్రదేశమును విడిచి మిగిలిన లంకాపురమంతా కాల్చి రామునకు సంతోషముకూర్చు వార్తను చెప్పుటకు తిరిగి వచ్చేడు.

సోఽభిగమ్య మహాత్మానం కృత్వా రామం ప్రదక్షిణమ్
న్యవేదయ దమేయాత్మా దృష్టా సీతేతి తత్త్వతః॥

బుద్ధిశాలియగు హనుమంతుడు మహాత్ముడైన రాముని పొంది సీతాదేవి యథార్థముగా చూడబడినదియని నివేదించాడు.
సుగ్రీవసహితుడై రాముడు సముద్రతీరముచేరి, సూర్యసమానమైన బాణములచే సముద్రుని క్షోభింపచేసాడు. నదులకు ప్రభువైన సముద్రుడు నిజరూపమున కనబడి చెప్పగా; సముద్రుని మాటప్రకారమే నలునిచే సేతువుని చేయించాడు.

తేన గత్వా పురీం లఙ్కాం హత్వా రావణ మాహవే।
రామస్సీతామనుప్రాప్య పరాం వ్రీడాముపాగమత్।౮౧

ఆ సేతువుచే లంకనుపొంది, యుద్ధమున రావణుని చంపి, సీతనుపొంది, అటుపై అధికమైన సిగ్గును పొందాడు.
రాముడు జన సమూహంలో సీతనుగూర్చి పరుషముగా మాట్లాడాడు. పతివ్రతయైన సీతాదేవి సహింపజాలనిదై అగ్నిని ప్రవేశించింది. పిమ్మట అగ్నిమాటవలన రాముడు సీతను పాపములు లేనిదిగా తెలుసుకొని సంతసించినవాడై, సమస్త దేవతలచే పూజింపబడినవాడై ప్రకాశించెను.
మహాత్ముడైన రామునియొక్క ఆ గొప్పదైనపనిచేత స్థావరజఙ్గమాలతో కూడిన, దేవగణములతోడను, మహర్షిగణములతోడనుకూడిన లోకత్రయము సంతోషించింది.

అభిషిచ్య చ లఙ్కాయాం రాక్షసేన్ద్రం విభీషణమ్।
కృతకృత్యస్తతో రామో విజ్వరః ప్రముమోద హ॥౮౫

రాముడు విభీషనుని లంకయందు అభిషేకముచేసి, ప్రతిజ్ఞారూప కార్యమును నిర్వర్తించినవాడై, **విజ్వరః** (వి-జటాయు విషయకమైన) సంతాపముగల వాడైనప్పటికీ, సంతోషించెను. ఆశ్చర్యము. "వివిష్కరపతత్రిణః" అని అమరసింహుడు చెప్పేడు.
ఎందుకని జటాయు విషయకమైన సంతాపం అంటే తనకొరకు ప్రాణాలు అర్పించిన వారినందరిని తిరిగిపొందాడు. అశ్రితులందరికీ రాజ్యాన్ని ఇచ్చాడు. తనయందు వాత్సల్యపూర్ణుడు పితృసఖుడు అయిన జటాయువును తిరిగి పొందలేకపోయానే అని విచారించి, ఆ జటాయువు పొందిన పునరావృత్తి రహిత అక్షయఫలానికి సంతోషాన్ని ఆశ్చర్యాన్ని పొందాడని పూర్వవ్యాఖ్యాతలు కొందరన్నారు.
రాముడు దేవతలనుండి వరములనుపొంది,
వానరులను పునరుజ్జీవింపజేసి మిత్రులతోకూడి...
పుష్పకమను విమానముచే అయోధ్యనుగూర్చి ప్రయాణమాయెను.

భరద్వాజాశ్రమం గత్వా రామస్సత్యపరాక్రమః।
భరతస్యాన్తికం రామో హనూమన్తం వ్యసర్జయత్॥౮౭

సత్యపరాక్రముడైన రాముడు భరద్వాజాశ్రమమునుగూర్చి వెళ్ళి హనుమంతుని భరతునివద్దకు పంపాడు.

భరద్వాజుడు అంటే **"బిభ్రత్ వాజః - భరద్వాజః"**

వాజః అనగా **'ప్రజ'** అని **'రేతస్సు'** అని నిరుక్తము.

దానంజేసి భరద్వాజుడు అంటే రేతస్సును ధరించినవాడు, నిత్యబ్రహ్మచారి. రాముడు వనవాస (బ్రహ్మచర్య)దీక్షను భరద్వాజుని ఆశ్రమమునందే ప్రారంభం చేసాడు. తిరిగి ఆ మహర్షి ఆశ్రమంలోనే దీక్షావిరమణ చేస్తున్నాడు. అందుకే భరద్వాజ సందర్శనం.

పాపరహితుడైన రాముడు నందిగ్రామమందు సోదరులతో కూడినవాడై జడనువిడిచి, సీతాదేవిని పొంది, తిరిగి రాజ్యమును పొందెను.

అప్పుడు లోకము రోమాంచిత ఆనన్దము కలదైనది. తుష్టి పుష్టి కలదైనది. ధర్మతత్పరమై ఉన్నది. పీడలు లేనిదైనది. వ్యాధులు లేనిదైనది. క్షామమువలన కలుగు భయము లేనిదిగా అయినది.

ఆ రాజ్యములో ఎక్కడా పురుషులు పుత్రమరణాన్ని చూడలేదు. స్త్రీలు వైధవ్యములేనివారై నిత్యము పతివ్రతలైయున్నారు. అగ్నిభయముకాని జలభయముకాని వాతభయముకాని జ్వరభయముకాని క్షుద్బాధకాని చోరభయముకాని లేదు. నగరములు రాష్ట్రములు (దేశములు) ధనధాన్య సమృద్ధములై ఉన్నవి. ప్రజ కృతయుగములో వలేయున్నారు.

అశ్వమేధశతై రిష్ట్వా తథా బహుసువర్ణకైః॥
గవాం కోట్యయుతం దత్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి।

గొప్పకీర్తిగల రాముడు వందలాది అశ్వమేధములచేతను, బహుసువర్ణ కములనెడి యాగాలచేతను దేవతలను తృప్తిపొందించి పదివేలకోట్ల గోవులను లెక్కింప వీలుపడని ధనమును బ్రాహ్మణులకు ఇచ్చి బ్రహ్మలోకమునుగూర్చి వెళ్ళగలడు.

దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ।
రామో రాజ్యముపాసిత్వా బ్రహ్మలోకం గమిష్యతి॥ అని చెప్పేరు. ఆ రాముడు ఈ లోకమునందు వందరెట్లుగా రాజవంశములను స్థాపించి, నాలుగువర్ణములను తమ తమ ధర్మమునందు నియమింపగలడు.
పఠన్ ద్విజో వాగృషభత్వమీయాత్। స్యాత్ క్షత్రియో భూమిపతిత్వ మీయాత్।
వణిగ్జనః పణ్యఫలత్వ మీయాత్। జనశ్చ శూద్రోఽపి మహత్త్వ మీయాత్॥
ఈ సర్గను పారాయణ చేసిన మొత్తం శ్రీమద్రామాయణము పారాయణ చేసిన ఫలాన్ని పొందుతారు. ద్విజులు (బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు) దీన్ని పారాయణ చేయుటచే శ్రేష్ఠమైన వాక్కును పొందుతారు. ఇంతకన్న విశేషంగా క్షత్రియులు భూమిపతులగుదురు. వైశ్యులు వాణిజ్యంలో అధిక లాభాలను పొందుతారు. శూద్రులు అంటే సేవకవృత్తియందున్నవారు గొప్పతనాన్ని పొందుతారు. అంటే వాణిజ్య, పరిపాలనాధికారాలను పొంది శూద్రత్వంనుండి మహత్వం వైపు ప్రయాణిస్తారు.
జనక-పరాశర సంవాదములో జనకుడు శూద్రులను ప్రజాపతి తుల్యులనగా, విష్ణుతుల్యులని పరాశరులు అంటారు. అనగా పాలన పోషణ చేయువారని అర్థం.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **సంక్షేపరామాయణము** అను పేరుగల
ప్రథమస్సర్గ సమాప్తము.

–

॥అథ ద్వితీయః సర్గః॥

(తమసానది వర్ణన, క్రౌంచ ఇతి వృత్తము. రామాయణ రచన చేయమని బ్రహ్మ వాల్మీకిని ఆదేశించుట)

నారదస్య తు తద్వాక్యం శ్రుత్వా వాక్యవిశారదః
పూజయామాస ధర్మాత్మా సహశిష్యో మహామునిః॥

యోగముయొక్కయు, జ్ఞానముయొక్కయు పారము నెఱింగిన నారదునియొక్క తత్ వాక్యం' తత్పదార్థరూపమైన వాక్యమును,

వాక్యమంటే **"తిఙ్సుబన్త చ యస్య ఏకవాక్యతయా అర్థ వాచకత్వాద్వాక్యం"** తిఙ్సుబన్త సమూహమునకు ఏకార్థత్వం కలుగుటవలన ఇది వాక్యము.

'పచతి, ఖాదతి, మోదతి" ఇత్యాదులు తిఙ్గన్తములు. సగుణ క్రియావాన్ అయిన రామబ్రహ్మము;

'రామ కృష్ణాది శబ్దములు' సుబన్తములు.

సుబన్తరూపమైన తత్పదలక్ష్యార్థమైన నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వరూపమగు నిర్విశేష జ్ఞేయరూప పరమాత్మ – సుబన్తరూపుడు.

శక్తిమత్త్వ, సర్వజ్ఞత్వ, సర్వేశ్వరత్వాది గుణములతో ప్రకాశించు ద్వితీయాది కారకముల (విభీషణ సుగ్రీవాదులు) సంబంధముగలదైన తత్పదవాచ్యార్థ ధ్యేయస్వరూప రామబ్రహ్మము,

వాక్యము. **"తిఙ్సుబన్తచయో మహావాక్యం"** తిఙ్సుబన్త సముదాయమునకు మహావాక్యమని పేరు.

ఇక్కడ తత్ శబ్దము నారదప్రోక్తమైన గుణములను వాచ్యముగా చెప్తూ, లక్ష్యార్థమును సూచిస్తోంది.

తత్ అనునది వాక్యమని చెప్పి; లక్ష్యార్థ వాచ్యార్థములకు ఏకార్థత్వమును ఉపదేశించిరి.

దానిని వినినంతనే **వాక్యవిశారదః** వాక్యవిశారదుడైన వాల్మీకి, అంటే పరాది చతుర్విధ వాగ్రూపములను బాగుగా తెలిసిన వాల్మీకి; పరాపశ్యన్తులు కేవలము యోగులు మాత్రమే తెలుసుకోగలరు. ఈ జ్ఞానము కేవలము శ్రవణ జన్యమైనది కాదని చెప్పుటకే **ధర్మాత్మా** అని అంటున్నారు.

ప్రాణాశ్చలన్తు తద్ధర్మైః కామైర్వా హన్యతాం మనః ప్రాణులు వాటియొక్క కర్మచేత చలించుచుండును. ఇక్కడ ధర్మము అంటే అనుష్ఠానరూపమైన కర్మయే (ఋగ్వేద ఆత్మబోధోపనిషత్తు);

"సమ్యగ్జ్ఞానం సాత్త్వికమ్, ధర్మజ్ఞానం రాజసమ్, తిమిరాన్ధం తామసమితి" ఇక్కడకూడా బ్రహ్మజ్ఞానము సాత్వికము, కర్మజ్ఞానము రాజసము, అజ్ఞానము తామసము. ఇక్కడ ధర్మమంటే అనుష్ఠానరూపమైన కర్మయే అని యజుర్వేదీయ శారీరకోపనిషత్ చెప్తోంది.

దానంజేసి **వాక్యవిశారదః ధర్మాత్మా మహామునిః** అనుటచే చతుర్విధ వాగ్రూపముల జ్ఞానము; సాధన సాధ్యమైనదియేగాని, (శాస్త్ర) శ్రవణ సాధ్యముగాదు. ఈయన అనుష్ఠాత, ఉపదేశింపబడినది తత్త్వము. కనుకనే వాక్కులను విసర్జించి మహామౌనాన్ని ఆశ్రయించారు. తాను మౌనియై శిష్యులతోకూడి శిష్యసహాయముతో నారదులను పూజించెను.

యాథావత్పూజితస్తేన దేవర్షిర్నారదస్తథా।
ఆపృష్టైవాభ్యనుజ్ఞాత స్స జగామ విహాయసమ్॥౨

ప్రకాశస్వరూపుడైన ఆ జ్ఞానప్రదాత, ఆ వాల్మీకిచే యథాశాస్త్రముగా పూజింపబడినవాడై, సంశయరహితుని గావించి, **అభ్యనుజ్ఞాతః** అనుజ్ఞను పొందినవాడై; అనుటచే; ఇరువురును ఉపదేశానన్తరము గురుశిష్యత్వాది అభిమానరహితులైరి. ఇట్టి స్థితియందున్న వారై ఆకాశమును పొందెను. అంటే నిర్వికల్పస్థితిని (తన సహజ స్థితిని) పొందెను.

స ముహూర్తం గతే తస్మిన్ దేవలోకం మునిస్తదా।
జగామ తమసాతీరం జాహ్నవ్యాస్త్వవిదూరతః॥౩

ఆ నారదమహర్షి ముహూర్తకాలంలో దేవలోకమును అంటే ఏస్థానము వెలుగులకుకూడా వెలుగో; అట్టి స్థానమును అంటే కేవల ప్రకాశస్వరూపమును పొందగా, వాల్మీకి మౌనముగానే గంగానదికి సమీపముననున్న తమసానదీ తీరమును పొందేరు.

అవిదూరతః అనుపద నిర్దేశ్యముచే తమసానది సర్వవిధముల గంగానది వలెనే అని చెప్తున్నారు.

గంగ ఏవిధముగా సకలకల్మషహారిణియై రక్షిస్తోందో...
అదేవిధంగా తమసానది కూడా...
అదీ దగ్గరగా ఉండటం అంటే (అవ రక్షణే రూపం).
దూరతః అనటంలో బాహ్యప్రయత్నం ఉంది. **దుఃఖేన ఈయతే ప్రాప్యత ఇతి దూరం** (ఇణ్ గతౌ). తను అన్తర్ముఖుడైయుండియు తనకు కర్తవ్యాకర్తవ్యములు లేనివాడైనప్పటికీ, తాను గురుస్థానమున ఉన్నవారు కావున, శిష్యవాత్సల్యంచే బాహ్యాభ్యన్తర శౌచమునకు విధాయకమైన నదీస్నానాది కర్మానుష్ఠానమును తనను అనుగమించు వారికై ఆచరిస్తూ న్నట్టివాడు...
ఈవిధముగా పరహితముకొరకై ఆచరింపబడుచున్న కర్మానుష్ఠానము గలవాడై; మధ్యాహ్నికమునకై (మధ్యాహ్నము చేయవలసిన అనుష్ఠానాదులకై) తమసానదికి వెళ్ళెను.

స తు తీరం సమాసాద్య తమసాయా మహామునిః
శిష్యమాహ స్థితం పార్శ్వే దృష్ట్వా తీర్థమకర్దమమ్॥

వాల్మీకి మౌనముగానే తమసానదియొక్క తీరమును చేరారు.
తను నిర్వికల్పావస్థయందున్నారు. సర్వ ప్రకృతిని అలాగే దర్శిస్తున్నారు. కావున...
ఆ తమసానదికూడా బ్రహ్మము నెఱింగిన వాని మౌనము వలె; (కర్దతి కుత్సితశబ్దం కరోతీతి వా కర్దమః) ఏవిధమైన కదలిక లేకుండా నిశ్శబ్దంగా కల్మషరహితంగా ఉంది. అటువంటి తీర్థమును చూచి...
ప్రక్కనున్న శిష్యునిగూర్చి మాట్లాడుతున్నారు. ఇదీ లోకానుగ్రహ దృష్టి.

అకర్దమమిదం తీర్థం భరద్వాజ నిశామయ,
రమణీయం ప్రసన్నామ్బు సన్మనుష్యమనో యథా॥

శిష్యునికి బ్రహ్మవేత్తలు ఎలా వుంటారో; ఎటువంటి వారిని ఆశ్రయించాలో చూపెడుతున్నారు. నాయనా భరద్వాజా! ఇది తీర్థము. అంటే (శాస్త్రవాక్యంలా ప్రజ్ఞానం బ్రహ్మ, అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి ఇత్యాదులవలె) విషయవాసనలు దూరంచేసే శాస్త్రంలా; తను తరించి ఆశ్రితులను తరింపజేసే బ్రహ్మిష్ఠుడైన గురువులా ఉంది.

ఇంకా **సన్మనుష్యమనో యథా** సన్మనుష్యుల మనస్సువలె ఉంది. అంటే బ్రహ్మవేత్తల మనస్సులా నిశ్చలంగా ఉంది. సమాధినిష్ఠుడైన వానివలె నిశ్శబ్దముగా ఉంది.

అద్వయావస్థలో (తనకంటే వేరైనది లేదను జ్ఞానంకలదై) రాగద్వేష రహితమైన వానివలె ప్రసన్నంగా ఉంది. పరమ రమణీయంగా ఉంది.

నిర్మలోదకంలో తన సహజస్థితి కనబడుతుంది. అదే విధంగా అకర్దములు, ప్రసన్నులు అయిన సత్పురుషుల సాంగత్యముకూడా మనకు మన సహజ స్థితిని చూపెడుతుంది.

మన జీవగతిని, జీవనగతిని మార్చుకోవటానికి ఉపకరిస్తుంది. చూడు! అని చూపెడుతున్నారు. చూపెడుతూ...

న్యస్యతాం కలశస్తాత దీయతాం వల్కలం మమ।
ఇదమేవావగాహిష్యే తమసాతీర్థముత్తమమ్॥ ౬

నాయనా! ఆ కలశను క్రిందపెట్టి, నాకు వల్కలమును (నారచీర) ఇవ్వు. ఇస్తే... నేను ఉత్తమమైన తీర్థరూపమైన ఈ తమసానదిని ప్రవేశిస్తాను. అని అంటూనే ఆంతరంగా శిష్యునికి బ్రహ్మవేత్తలను ఆశ్రయించే పద్ధతి చెప్తున్నారు.

కలశః న్యస్యతామ్ అనటంలో...నాయనా! బ్రహ్మవేత్తలు అనన్తము, అఖణ్డము అయిన జ్ఞాననిధులు. కలశను క్రిందపెట్టు అనటంలో ఆయనకు ఈవిద్య తెలుసు; ఆవిద్య తెలుసు; దానిని తెలుసుకోవాలని ఆశ్రయించకు.

ఎందుకంటే...ఆయనకు తెలుసని నీవనుకుంటునది; నిజమునకు ఆయనకు తెలిసినదాంట్లో అణువంత.

అందుకని ఇది మాత్రమే, ఇంతమాత్రమే తెలుసుకోవాలనే బుద్ధి(కలశ)ని ప్రక్కనపెట్టు అని, పెడితే...యోగ్యతను బట్టి అనుగ్రహింపబడతాము.

వల్కలములను ఇమ్మనుట – అర్థసిద్ధుల ప్రదర్శనలను, పటాటోపాలను ప్రక్కనపెట్టి పరిపూర్ణశరణాగతి భావనతో ఆశ్రయించమని.

అలా ఆశ్రయిస్తే! ఆశ్రితుడు... కావలసినది కావలసినంతగా పొందుతాడు. అని తాను ఏవిధంగా ఆశ్రయించారో, ఆవిధానమును శిష్యునికి చూపుతూ దిశానిర్దేశం చేస్తున్నారు. ఇదీ గురుధర్మం.

ఏవముక్తో భరద్వాజో వాల్మీకేన మహాత్మనా।
ప్రాయచ్ఛత మునేస్తస్య వల్కలం నియతో గురోః॥

మహాత్మనా గొప్ప(ఆత్మగల) మనస్సుగల వాల్మీకిచేత ఈ విధముగా పలుక బడినవాడై (ఉపదేశింపబడినవాడై) గురువునకు విధేయుడైన భరద్వాజుడు ఆ మునికి (వాల్మీకికి) నారచీరను ఇచ్చేడు.

ఇక్కడ వాల్మీకి గురు శబ్దముచే చెప్పబడ్డారు.

నిషేకాదీని కర్మాణి యః కరోతి యథావిధి। సంభావయతి చాన్నేన స విప్రో గురురుచ్యతే॥(మను) గర్భాదానాది కర్మలను శాస్త్రానుసారముచేసి, అన్నం పెట్టి పెంచినవారిని గురువు అని చెప్పాలి.

గురుభక్తి సమాయుక్తః పురుషజ్ఞో విశేషతః।
ఏవం లక్షణ సంపన్నో గురిత్యభిధీయతే॥

విశేషమైన ఆత్మజ్ఞానము గలవాడు, గురుభక్తి గలవాడు ఇటువంటి సులక్షణ సంపన్నుడే గురువని శుక్లయజుర్వేదాన్తర్గత అద్వయతారకోపనిషత్తు చెప్తోంది. ఇదిగో ఇటువంటి బ్రహ్మవేత్తయైనటువంటి గురువునకు విధేయుడైన శిష్యుడు భరద్వాజుడు. వాల్మీకి ఇక్కడ **మునేః** అని చెప్పబడుచున్నారు. ముని అంటే

దుఃఖేష్వనుద్విగ్నమనా స్సుఖేషు విగత స్పృహః।
వీతరాగ భయక్రోధః స్థితధీర్మని రుచ్యతే॥

త్రివిధ తాపములయందు అనగా ఆధ్యాత్మిక (వ్యాదులు), ఆధిభౌతిక (వ్యక్తిగత ప్రమాదాలు), ఆధిదైవిక (ప్రకృతి వైపరిత్యాలు). వీటియందు ఎవని మనస్సు సంక్షోభాన్ని పొందదో అట్టివాడు అనుద్విగ్నమనస్కుడు. సుఖములయందు తొలగిన ఆశకలవాడు విగతస్పృహుడు. ఆసక్తి, భయము, క్రోధము లేని; అనుద్విగ్నమనస్కుడు, విగతస్పృహుడైన వాడు ముని. ఇంతకు ముందు **మహామునిః** అని చెప్పబడిన వాల్మీకి ఇక్కడ **మునేః** అని చెప్పబడుచున్నారు. ఇతఃపూర్వము మహచ్ఛబ్ద ప్రయోగం వలన ప్రయత్నం ద్యోతకమగుచున్నది. ఇప్పుడది సహజస్థితి అని భావము. **మహాత్మ** అనటంచేత వ్యాపించుటకు ఇక వీలులేనంతగా వ్యాపించిన విస్తరించిన ఆత్మగలవాడు. సర్వాత్మభావనను పొందినవాడు.

మునిః, మహామునిః అని ప్రారంభమునుండి పలుమార్లు చెప్పటం ఎందుకంటే, ఈయన మౌనము సహజస్థితిగా కలవారని తెలియచేయటకు.

అతిగా మాట్లాడే వాడి మాటలు అసత్యపూతమై ఆ వాక్ఝురి ప్రయోజన శూన్యంగా ఉంటుంది. వాఙ్నియమముకలవారి మాటలు సత్యపూతములై మహాప్రభావముగలవై, ఆనకట్టలోని నీరులా లోకోపకారకములై ఉంటాయి. ఇదిగో ఇటువంటి బ్రహ్మవేత్తయైనటువంటి గురువునకు విధేయుడైన భరద్వాజుడు ఆ మునికి (వాల్మీకికి) నారచీరను ఇచ్చేడు.

స శిష్యహస్తాదాదాయ వల్కలం నియతేన్ద్రియః।
విచచార హ పశ్యం స్తత్సర్వతో విపులం వనమ్॥౮

అట్టి నియతేన్ద్రియుడైన, ఇక్కడ వాల్మీకి అన్తర్ముఖమైన ఇన్ద్రియములు కలవారు. సర్వేన్ద్రియములు ఉపరమావస్థయందు(శాన్తావస్థ) ఉన్నటువంటి వారైన వాల్మీకి శిష్యుని చేతినుండి నారచీరను తీసుకొని, మిక్కిలి గొప్పదైన ఆ సర్వాశ్రయిని (వనమును) అంతటా చూస్తూ సంచరిస్తున్నారు.

తస్యాభ్యాశే తు మిథునం చరన్తమనపాయినమ్।
దదర్శ భగవాంస్తత్ర క్రౌఞ్చయోశ్చారునిస్వనమ్॥౯

బాలకాణ్డ ప్రారంభమునుండి ఇతఃపూర్వ శ్లోకమువరకు అష్టోత్తరశతసంఖ్య పూర్తి అయింది. ఇది మన్త్రదీక్షితుడు ప్రతిరోజు దీక్షాది అవభృతస్నాన (మరణ) పర్యన్తము అధమపక్షం జపించవలసిన జపసంఖ్య. ఈ సంఖ్య క్రమశిక్షణాయుతమైన సాధనకు సంకేతము. మహర్షి క్రమశిక్షణాయుతమైన సాధనయందు (నిత్యముగా) ఉన్నారు. కనుకనే ప్రారంభమునుండి ఇప్పటి వరకు **తపస్వీ, వాల్మీకిః, మునిః, మహామునిః, మహాత్మా, గురోః** అని చెప్పి ఒక క్రమాన్ని చూపుటచే, వాల్మీకి అన్తర్ముఖత్వం ద్యోతకమగుచున్నది. ముక్తిదాయకమైన తత్త్వదర్శనరూపమైన అన్తర్యాగమునకు మునులకు ముముక్షువులకే అధికారముకలదని గౌతమీయతన్త్రము అంటోంది.

ఇట్టి అన్తర్ముఖావస్థకలవారు కనుకనే; నారదాగమనము, తత్త్వోపదేశమూను. ఉపదేశానన్తరము సక్రమమైన అభ్యాసము (విచారము) వలన గురువుతో అభేదాన్ని పొందారు. గురుశిష్యులకు అభేదావస్థ సిద్ధించింది కనుకనే

నారదుని విషయంలో **అభ్యనుజ్ఞాత స్సజగామ విహాయసం** అని చెప్పారు. ఇటువంటి వాల్మీకి సాధనపరిపుష్టి రూపంగా ఇప్పుడు **భగవాన్** అని చెప్పబడుచున్నారు. భగవాన్ అంటే... **యస్సర్వాన్ భవాన్ ఈక్షతి, ఆత్మజ్ఞానం నిరీక్షయతి, యోగం గమయతి తస్మాత్ ఉచ్యతే భగవాన్** (అథర్వ శిరోపనిషత్) ఎవడు సకల పదార్థములను చూచుచున్నాడో (సర్వభావములకు సాక్షియో); **అహం బ్రహ్మాస్మి** అను అద్వైతభావనను అస్మదాదులకు కలుగచేయుచున్నాడో **ఈశ్వరానుగ్రహేణ పుంసాం అద్వైతవాసనామ్** జీవబ్రహ్మలకు తాదాత్మ్య సంబంధమును పొందించుచున్నాడో అందువలన భగవంతుడు.

ఐశ్వర్యస్య సమగ్రస్య ధైర్యస్య యశసశ్శ్రియః। జ్ఞానవైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణాః॥ సమగ్రమగు ఐశ్వర్యము ధైర్యము కీర్తి సంపద జ్ఞానము వైరాగ్యము ఇవి పూర్ణముగా గలవాడు భగవంతుడు. శాపానుగ్రహ సామర్థ్యము గలవారు సకలమునకు సాక్షిమాత్రముగా ఉన్నవారు ఆశ్రితులు జీవన్ముక్తావస్థను పొందుటకు దారిచూపగలవారైన వాల్మీకిమహర్షి వనమందు తనకు సమీపమున నిర్భయముగా తిరుగుచున్న మంచిధ్వనిగల క్రౌఞ్చమిథునమును (పక్షుల జంటను) చూచెను.

తస్మాత్ మిథునాదేకం పుమాంసం పాపనిశ్చయః।
జఘాన వైరనిలయో నిషాదస్తస్య పశ్యతః॥

పాపమునందు నిశ్చయాత్మకుడైన, శత్రుత్వమునకు స్థానమైన బోయవాడు ఆ క్రౌఞ్చమిథునమందలి పురుషపక్షిని, వాల్మీకి చూస్తూండగా చంపాడు.

తం శోణిత పరీతాఙ్గం వేష్టమానం మహీతలే।
భార్యాతు నిహతం దృష్ట్వా రురావ కరుణాం గిరమ్॥
వియుక్తాపతినా తేన ద్విజేన సహచారిణా।
తామ్రశీర్షేణ మత్తేన పత్రిణా సహితేనవై॥ ౧౨

భర్తయు, **సహచారిణా** కలిసి తిరుగునదియు, ఎఱ్ఱని తలగలది, మదించిన రెక్కలుగలది, సాన్నిహిత్యము గలది (సహితేన), ఆ మగపక్షితో(ద్విజేన) వియోగాన్ని పొందిన, భార్యయైన ఆడుపక్షి; కొట్టబడి భూమిపై పొర్లుచున్న, రక్తముచే కప్పబడిన శరీరముగలదగు ఆ మగపక్షిని చూచి కనికరమును పుట్టించు వాక్కును పల్కెను.

ఇక్కడ అన్యాపదేశముగా రావణుని దర్శింపజేసారు. వ్యభిచార గుణములు (సహచారిణా) కలిగియున్నవాడు **ద్విజేన** అనుటచే కేవల జాతిబ్రాహ్మణ్యం గలవాడు. **సహితేన** వాలి మొదలగు వారు హితులుగా గలవాడు, అని రావణుడు కొట్టబడుటకు కారణాలను దర్శిస్తున్నారు.

తదా తు తం ద్విజం దృష్ట్వా నిషాదేన నిపాతితం।
ఋషేర్ధర్మాత్మన స్తస్య కారుణ్యం సమపద్యత॥ ౧౩

అప్పుదు బోయవానిచే కొట్టబడ్డ పక్షిని (ద్విజుణ్ణి) చూచి వాల్మీకికి జాలికలిగింది.

తతః కరుణవేదిత్వా దధర్మో౽యమితి ద్విజః।
నిశామ్య రుదతీం క్రౌఞ్చీమిదం వచనమబ్రవీత్॥ ౧౪

తరువాత కరుణకలవారు అగుటవలన 'ద్విజః' వాల్మీకి ఇది అధర్మము (పక్షివిషయకముగా, పక్ష్యాదులందు కాలనియమము లేదు కనుక రతికాల వధ) అని పలికిరి. **తతః ద్విజః రుదతీం క్రౌఞ్చీమ్** తరువాత వాల్మీకి ఏడ్చుచున్న ఆడపక్షిని (మణ్డోదరిని) **నిశామ్య** చూచి, **కరుణ వేదితత్వాత్** కరుణకలవారు అగుటవలన; **అయమ్** ఈ అకాల సంగమము; **అధర్మః ఇతి** ధర్మంకాదని **ఇదం వచనమబ్రవీత్** ఈ వాక్యమును పలికెను. ఇక్కడ రావణ వినాశనరూప దర్శనం చేసి మాట్లాడేరు.

అహోరాత్రో వై ప్రజాపతి స్తస్యాహరేవ ప్రాణో రాత్రిరేవ రయిః। ప్రాణంవా ఏతే ప్రస్కన్దన్తి యే దివా రత్యా సంయుజ్యన్తే। బ్రహ్మచర్యమేవ తద్యద్రాత్రౌ సంయుజ్యన్తే॥ పగటిపూట సంభోగము మృత్యుప్రదమని శ్రుతి అంటున్నది. **పూర్వరాత్రే న సంవేశయేత్।** అని బోధాయనులు చెప్పారు.

దివాస్వాపం మైథునం చ నకుర్యాత్। కుర్యాచ్చేత్క్రమేణ ఆయుః పుణ్యయో ర్హానిః॥ అని గౌతమస్మృతి.

శ్రుతి స్మృతులన్నీ ఈ విషయంగా ఏకవాక్యతను కల్గియున్నాయి. వాలి, రావణుల మరణానికి ప్రత్యక్షంగా రామ శరాఘాతం కారణంగా కనబడు చున్నప్పటికీ, వారివారి అధర్మవర్తనయే కారణం. ఇటువంటివారు పణ్డితమూర్ఖులు. అందుకే వారియందు కరుణను పొందారు మహర్షి.

మానిషాద ప్రతిష్ఠాం త్వమగమ శ్శాశ్వతీ స్సమాః।
యత్క్రౌఞ్చమిథునాదేక మవధీః కామ మోహితమ్॥

అమ, నిషాద, త్వం, యత్, క్రౌఞ్చమిథునాత్, కామ మోహితం, ఏకమ్, అవధీః (తత్) శాశ్వతీః, సమాః, ప్రతిష్ఠాం తు, మాగమః॥ (అన్వయక్రమం). నిర్భాగ్యుడైన ఓ నిషాదుడా! క్రౌఞ్చమిథునమందలి కామమోహితమైన ఒకదానిని ఏకారణమున చంపితివో; ఆ కారణముగా సంవత్సరాలపాటు స్థిరముగా ఉండుటను పొందకుందువు గాక!

ఈ శ్లోకమే వాల్మీకి మొదటగా పలికినది. వైదిక ఛందోవనమునుండి లోకానుగ్రహార్థం వాల్మీకి బుద్ధిగుహలనుండి బయల్వెడలిన పరావాగ్బీజములు, కరుణతో తడిసిన ముని హృదయమునందు పడి చిత్రగతిగల లౌకికఛన్దస్సు అంకురించింది.

ఈ శ్లోకమును **మానిషాద! త్వం, యత్, క్రౌఞ్చమిథునాత్, కామమోహితం, ఏకమ్, అవధీః, శాశ్వతీః, సమాః, ప్రతిష్ఠామ్, అగమః॥** అని అన్వయింపగా మహాలక్ష్మి నివాసస్థానమైన విష్ణువా! నీవు ఏకారణమువలన రాక్షస దంపతులైన రావణ మండోదరులలో, కామపరవశుడగు రావణుని మాత్రమే చంపితివో; ఆ కారణమువలన సంవత్సరముల పర్యన్తము స్థిరమైన మహాత్మ్యము పొందితివి.

ఈ శ్లోకమున మొత్తం రామాయణము సంక్షేపింపబడినదని పూర్వవ్యాఖ్యాతలు నిశ్చయించారు.

తస్యైవం బ్రువతశ్చిన్తా బభూవ హృది వీక్షతః।
శోకార్తేనాస్యశకునేః కిమిదం వ్యాహృతం మయా॥ ౧౬

పక్షియొక్క శోకముచే దుఃఖమును పొందిన మహర్షియొక్క హృదయమునందు తను పలికిన దానిని పరిశీలించుకొనుచు, నా నోటినుండి పలుకబడిన ఈ వాక్యము ఏమి? అని ఆలోచన కలవాడాయెను.

ఇతఃపూర్వము వరకు మహర్షి బ్రహ్మనిష్ఠులైయున్నారు. ఆ స్థితియందు నిష్క్రియులు. ఇప్పుడు భగవానుడైన మహర్షి సగుణసాకార స్వరూపుడై ప్రకృతిగతమైనారు. ఇప్పుడు ప్రకృతిగతమైన సర్వదుఃఖములు తనవే, ఇప్పుడు క్రౌఞ్చి దుఃఖమూ తనదే అయ్యింది.

వైదికము, ఛాన్దసము అయిన వాక్కు పారుష్యాన్ని పొందింది.
దానికి ఆశ్చర్యపోతున్నారు మహర్షి.
భాష అవైదికమైంది. ఇదీ ఆశ్చర్యానికి కారణము.

చిన్తయన్ స మహాప్రాజ్ఞశ్చకార మతిమాన్ మతిమ్।
శిష్యం చైవాబ్రవీద్వాక్యమిదం స మునిపుఙ్గవః॥

మహాప్రాజ్ఞుడు మతిమంతుడు అయిన వాల్మీకిమహర్షి **మతించకార** అంటున్నారు. నిశ్చయాత్మకుడైనాడు. (అంటే తనయందలి బుద్ధివైక్లబ్యము క్షణికమైనదై వెంటనే) అంటే ఇన్ద్రియనియమనము కలవాడగుటచే బుద్ధివైక్లబ్యము క్షణికమైనదై వెంటనే బుద్ధి నిశ్చయాత్మకమైంది.
సామాన్యుల విషయంలో క్రోధం ఆత్మనాశకమైతే, నియతేన్ద్రియులకది లోకకల్యాణ హేతువు.

పాదబద్ధోఽక్షరసమస్తన్త్రీలయసమన్వితః।
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా॥

శోకార్తుడనైన నానుండి అప్రయత్నముగా వెలువడినది నాల్గుపాదములతో కూర్చబడినది సమానమైన అక్షరసంఖ్యగలది, వీణాతన్త్రులపై కూర్చుటకు తగిన లయతోకూడినది అగు ఈ వాక్యము శ్లోకమను పేరున ప్రసిద్ధిని పొందును.

శీక్షాం వ్యాఖ్యాస్యామః। వర్ణస్స్వరః। మాత్రాబలమ్। సామసంతానః। ఇత్యుక్త శ్శీక్షాధ్యాయః॥ శిక్షను వివరంగా చెప్పుచున్నాను. వర్ణములన్నియు (అకారాది క్షకారాన్తమైన అక్షరములు) స్వరములని (ఉదాత్త, అనుదాత్త, స్వరితములు); మాత్రలని (హ్రస్వ, దీర్ఘ, ప్లుతములు); బలము (అంటే ఆయా వర్ణములను ఉచ్చరించునపుడు చేయు ప్రయత్నము); సామము (అతివేగము, అతిమందముగాక మధ్యమ వృత్తితో పలుకుట); సంతానం (అక్షరములను విలంబము లేక ఉచ్చరించుట)
అను నియతిని వేదము అధ్యయన, అధ్యాపనములందు ఏవిధముగా కలదిగా ఉందో! అదే విధంగా ఈ లౌకికఛన్దస్సుకు కూడా ఒక నియతిని ఏర్పాటు చేసారు.

సమానమైన అక్షరసంఖ్య, పాదవిభాగము, స్వరమును మాత్రను బలమును సామమును సంతానాన్ని తంత్రీలయ సమన్వితంచేసి అనుష్టుప్‌యొక్క లాక్షణికధర్మాన్ని చూపెట్టారు.

శిష్యస్తు తస్య బ్రువతో మునేర్వాక్యమనుత్తమమ్।
ప్రతి జగ్రాహ సన్తుష్ట స్తస్య తుష్టోఽభవద్గురుః॥

అని పలికిన వాల్మీకియొక్క అత్యుత్తమమైన ఆ వాక్యమును శిష్యుడైన భరద్వాజుడు స్వీకరించెను.

ఆ కాలానికి లేఖనప్రక్రియ లేదు. గురువునుండి శిష్య ప్రశిష్యులకు విద్య ముఖతః ప్రవహించ వలసినదే.

పరిచరితవ్యాః సన్తోయద్యపి కథయన్తి నైకముపదేశం।
యాస్తేషాం స్వైరకథా స్తాఏవ భవంతి శాస్త్రాణి॥ సేవింపతగినవారు ఏ ఉపదేశం చేయకపోయినను, తమంత తాముగా చెప్పిన మాటలే శాస్త్రావాక్యాలు (ప్రామాణికం) అగుచున్నవని భర్తృహరి చెప్పినట్లుగా, శిష్యధర్మమునందు ఏమరపాటు లేనివాడు భరద్వాజుడు.

శిష్యుడు గురువులు క్రొత్తవిషయము ఎప్పుడు చెప్తారా! నేర్చుకుందామా! అనే తీవ్ర జిజ్ఞాస కలిగియుండాలి.

ఇదిగో అటువంటి శిష్యలక్షణానికి భరద్వాజుని విషయంలో వాల్మీకి సంతోషాన్ని పొందారు.

తరువాత వాల్మీకిమహర్షి ఆ తమసా నదియందు యథావిధిగా స్నానముచేసి ఆ శ్లోకప్రయోజనమును గూర్చి చింతించుచూ ఆశ్రమంవైపు అడుగులు వేస్తున్నారు. పిమ్మట వినయవంతుడు మననశీలుడు అయిన భరద్వాజుడు జలపూర్ణమైన కలశను తీసుకొని వాల్మీకిమహర్షిని వెనుకనే అనుసరించేడు. ఇక్కడ శిష్యధర్మాన్ని చూపెడుతున్నారు. శిష్యుడు గురువును అనుగమించాలని గురువుకంటే తక్కువదైన ఆహార ఆహార్యములు కలవాడుగా ఉండాలన్న ధర్మాన్ని భరద్వాజుని ద్వారా తెలియజేస్తున్నారు.

ధర్మవేత్తయైన వాల్మీకిమహర్షి ఆశ్రమమును ప్రవేశించి పరిపరి విధాల ఆ విషయమునే ధ్యానిస్తున్నారు. ఇంతలో...

ఆజగామ తతో బ్రహ్మా లోకకర్తా స్వయంప్రభుః।
చతుర్ముఖో మహాతేజా ద్రష్టుం తం మునిపుఙ్గవమ్॥

లోకకర్తా లోకములను సృజించువాడు (ఇది ప్రజాపతి స్వరూపం), ప్రభుః వాటిని విశేషముగా కలిగియుండువాడు (స్థితికర్త), నాల్గుముఖములు కలవాడు (అన్నివైపులనుండి జగత్తును భక్ష్యరూపముగా పీడించువాడు; ఇది లయకారక స్వరూపం); గొప్పతేజస్సుకలవాడు అగు బ్రహ్మ; మునులలో శ్రేష్ఠుడైన ఆ వాల్మీకిమహర్షిని చూచూటకు స్వయముగా వచ్చారు.

పిమ్మట ఆ బ్రహ్మదేవుని చూచి మిక్కిలి ఆశ్చర్యమును పొంది, వెంటనే లేచి మౌనముగా అంజలిబద్ధుడై నిల్చున్నారు.

అభివాదయేత్ వృద్ధాంశ్చ దద్యాచ్చైవాసనం స్వకమ్।
కృతాంజలి రుపాసీత గచ్ఛతః పృష్ఠతోన్వియాత్॥

వృద్ధులకు నమస్కరించడం, నీ ఆసనమును వారికి ఇయ్యటం, అంజలి బద్ధుడవైయుండి వారు వెళ్ళునప్పుడు వెనుకనే కొంతదూరం సాగనంపటం. ఇది మన సనాతనధర్మం మనకు చూపిన శ్రేయోమార్గం.

బ్రాహ్మస్య జన్మనః కర్తా స్వధర్మస్య చ శాసితా
బాలాఽపి విప్రో వృద్ధస్య పితా భవతి మన్త్రదః॥
సహాయనై ర్నపలితై ర్నవిత్తేన నబంధుభిః।
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనుభావ స్సనోమహాన్॥
నతేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః।
యోవై యువా ప్యధీయాన స్తం దేవాః స్థవిరం విదుః॥

అని మనువు పెద్దరికాన్ని నిర్ణయించారు. యువకుడైనను వేదవేత్త వృద్ధుడనియే చెప్పారు. ధర్మాచరణము గలవానినే గొప్పవాడని చెప్పారుకాని, నెఱసిన జుత్తు కలవాడిని కాదు. అంటే వయోధికులకు నమస్కరించ వద్దనికాదు; వారికి ఎలాగూ నమస్కరిస్తాం, వేదవేత్తలు శాస్త్రజ్ఞులు అయిన పండితులకు కూడా అని.

దానంజేసి పెద్దలకు నమస్కరించడం అంటే ఎవరైనా పండితులు, వృద్ధులు మన ఇళ్ళకు వస్తే నువ్వు కూర్చున్న కుర్చీలోంచి కూడా లేవకుండా;

ఆ... రండి, బాగున్నారా! కూర్చోండి అని ప్రక్కనున్న కుర్చీచూపడం కాదు. వారు వచ్చిన వెంటనే నువ్వు లేచి వారికి నమస్కరించాలి. అలా చెప్పలేదు కదా అనకూడదు. ఆవిషయం నీ ఆసనం వారికి సమర్పించాలి అని చెప్పటంలో ఉంది. నువ్వు వినయంతో వారు వెళ్ళే పర్యన్తమూ వారి సమీపంలోనే ఉండాలి. వారిమానాన వారిని విడిచి పెట్టకూడదు. అంజలి ఘటించి సమీపంలోనే ఉండాలి. అంటే భగవదారాధనలో మనం చేసే సేవలన్నీ అవసరమైనంతగా దగ్గరుండి చెయ్యాలి. వారు వెళ్ళ దలచినప్పుడు, మీరు గబగబా వెళ్ళి తలుపు తీసి వెళ్ళండి అని చూపెట్టకూడదు. ఇది మహాదోషం, పొమ్మన్న దానితో సమానం. వారి వెనుకనే నడచి కనీసం మీ ఇంటి సరిహద్దుల వరకైనా సాగనంపడం చెయ్యాలి. ఇదీ ధర్మం. ఇలా చేస్తే కొడుక్కి ప్రేతకర్మ చేయవలసిన అవసరం తండ్రికి రాదు, వైధవ్యాన్ని మోయవలసిన అవసరం ఇల్లాలికి ఉండదు.

ఈ మార్గాన్ని వాల్మీకిమహర్షి అనుసరించి చూపుతున్నారు.

ఎందుకంటే ...

ఊర్ధ్వం ప్రాణాహ్యుత్క్రామన్తి యూనః స్థవిర ఆగతే।
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే।
అభివాదన శీలస్య నిత్యం వృద్ధోపసేవినః।
చత్వారి పరివర్ధంతే ఆయుర్విద్యాయశోబలమ్॥

వృద్ధులు సమీపించినప్పుడు యువకుని ప్రాణాలు పైకిలేచిపోతాయి. లేచి నమస్కరించుట వలన తిరిగి వాటిని పొందుతాడు. ఎల్లప్పుడు వృద్ధులను సేవించువానికి ఆయువు, విద్య, యశస్సు, బలము వృద్ధిచెందుతాయి.

అసౌ నామహ మస్మీతి తన్నామ పరికీర్తయేత్। అని ఈ రీతిగా మహర్షి సేవించారు.

ఇదిగో ఈ ధర్మాన్ని ఇక్కడ వాల్మీకిమహర్షి ఆచరించి చూపెడుతున్నారు. బ్రహ్మచేత అనుజ్ఞ ఇవ్వబడినవాడై తానునూ ఎదురుగా ఆసనమందు కూర్చొనియుండి, మనస్సుతో ఆ క్రౌఞ్చపక్షి విషయమునే ధ్యానించు చుండెను.

కర్ణపేయమైన ధ్వనిగల క్రౌఞ్చపక్షిని అకారణంగా చంపాడుకదా! పాపాత్ముడైన బోయవాడు, దానిని పట్టుకొనుటకు ఎంతటి ఘోరమైన పనిచేసాడు, అని ఆలోచిస్తూ, దుఃఖపరవశులై బాహ్యస్మృతి లేని మనస్సు కలవారై మరల ఆ శ్లోకమునే గానం చేస్తున్నారు.

అది చూసినటువంటి బ్రహ్మగారు చిరునవ్వుతో, ఆ వాల్మీకిమహర్షినిగూర్చి నీచేత కూర్చబడినది శ్లోకమే, ఈ విషయంలో ఇక ఆలోచన అక్కరలేదు.

మచ్ఛన్దాదేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ।
రామస్యచరితం సర్వం కురు త్వమృషిసత్తమ॥ ౩౧

ఇక్కడ వాల్మీకిమహర్షిని ఋషిసత్తమా అని సంబోధించారు. అంటే సమ్యగ్దర్శనము కలవారని అర్థం. సమ్యగ్దర్శనం కలవారు మాత్రమే సృష్టిచేయగలరు. అటువంటి వాల్మీకిమహర్షిని హిరణ్యగర్భుడు; నీ ఈ సరస్వతి (వాక్కు) నా అభీష్టాన్ని అనుసరించే ప్రవర్తించింది. అని చెప్పి, హే బ్రహ్మన్! అని పిలిచారు. ఇప్పుడు నీవు బ్రహ్మవు, సృష్టికర్తృత్వ సామర్థ్యాన్ని పొందావు. నీవు రామసంబంధమైన చరితమును రచించు. లేదా రామ సంబంధమైన సమస్త ధర్మమార్గమును కీర్తించు అని చెప్పారు.

ధర్మాత్మనో గుణవతో లోకే రామస్య ధీమతః।
వృత్తంకథయ ధీరస్య యథాతే నారదా చ్ఛ్రుతమ్॥ ౩౨

రామస్య వృత్తం కథయ అంటున్నారు. రామునియొక్క చరిత్రమును చెప్పు అంటూనే; రామ సంబంధమైన ఆ చరిత్ర ఎలా ఉండాలో నిర్దేశిస్తున్నారు.

ధర్మాత్మనః ధార్మికమైన నడకనుగూర్చి చెప్పమని (శాస్త్రీయతను చూపమని) అంటున్నారు. అంటే శాస్త్రలక్షణాన్ని అనుసరించమని;

గుణవతః గుణములనుగూర్చి చెప్పమన్నారు. అంటే కావ్య లక్షణంగా మాట్లాడమన్నారు. శాస్త్రం గుణరహితంగా ఉంటుంది. కావ్యం గుణాత్మకంగా ఉంటుంది. త్రిగుణాత్మకమైన కావ్యం రసస్ఫోరకంగా ఉంటుంది.

లోకే ధీమతః లోకమందు బుద్ధిమంతుడగు రామచరిత, అంటే లోకనీతిని లోకజ్ఞతను చూపమని, **ధీరస్య** పరాక్రమ విశేషాలను వర్ణించమని చెప్పేరు. అంటే అన్తఃశత్రు నిర్మూలనకు అనువైన ఇన్ద్రియ నిగ్రహాదులగూర్చి వర్ణించు.

అంటే ఈ రచన శాస్త్రమైయుండాలి, కావ్యలక్షణాలు కలదైయుండాలి, లోకవ్యవహార దక్షతగలదైయుండాలి. ఆ విధంగా నారదునివలన ఏది విన్నావో అది చెప్పమని అనుశాసించారు.

నారదుని వలన ఎలా విన్నారో మహర్షి ఇదిగో ఇక్కడ చెబుతున్నారు.

రహస్యం చ ప్రకాశం చ యద్వృత్తం తస్య ధీమతః।
రామస్య సహసౌమిత్రే రాక్షసానాం చ సర్వశః॥ ౩౩
వైదేహ్యాశ్చాపి యద్వృత్తం ప్రకాశం యది వారహః।
తచ్చాప్యవిదిం సర్వం విదితం తే భవిష్యతి॥ ౩౪

లక్ష్మణ సహితుడైన రామునియొక్క సీతయొక్క రాక్షసులయొక్క అపి శబ్దముచే మిగిలిన రాఘవులయొక్క ఏ చరిత్రముకలదో అది. రహస్యమైనదియు ప్రకాశమైనదియు నీకు తెలియనిదికూడా నీకు తెలిసినదిగా కాగలదు.

శ్రూయతామితి చామన్త్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్ నారదమహర్షి శిష్యుని అభిముఖీకరించుకొని మన్త్ర లక్షణంగా చెప్పారు. మన్త్రము ప్రకాశము రహస్యము అయిన లక్షణాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు లోకప్రసిద్ధమైన ఒక మన్త్రములో **'–సర్వ జనం మే వశమానయ స్వాహా'** అని ఉంది. విన్నవారికి ఈ మన్త్రసాధకుడు లోకంలో ఉన్న జనులందరినీ వశమందు ఉంచుకోగలడని, ఇదే ఈ మన్త్రమునకు పరమప్రయోజనము అనుకొనేలా తన ప్రకాశలక్షణంచేత భ్రమింపజేస్తుంది. ఈ మన్త్రము బ్రహ్మవిద్యకు ఉపాయభూతమైనది. ఇక్కడ జనశబ్దానికి ఇన్ద్రియములు అని అర్థం. ఈ విషయాన్ని ఆ మన్త్రోపదేష్ట అయిన గురువే శిష్యునికొరకు చెప్తారు. ఇది రహస్యం. ఇదగో శ్రీమద్రామాయణం ఈ లక్షణాలతోనే ఉంటుంది. ప్రకాశమంటే ఉన్నది ఉన్నట్లుగా ఉండనివ్వని రూపం. ఈ కావ్యప్రపంచములో ఆలఙ్కారిక జగత్తులో...లేని దుఃఖం, లేని సంబంధాలు ఇలా అవస్థాభేదంచేత నశ్వరమైనవికూడా సత్యత్వభ్రాంతిని కలిగిస్తాయి. అంటే లేనిది ఉన్నట్లుగా కనబడుట (అన్యథా భావము); ఉన్నది ఉన్నట్లు కనబడక పోవుట (అభావము). ఇవి ప్రకాశలక్షణం.

ఇక్కడ ప్రకాశమంటే
బాహ్యేన్ద్రియ గ్రాహ్యమై అందరికీ తెలియబడునది అని అర్థం. ఈ ప్రకాశ బహుప్రయాశతో కూడినది.

ఉన్నది ఉన్నట్లుగా ఉండటం ధర్మం. దాన్ని అలాగే గ్రహించుట జ్ఞానం. దీనికి ప్రయాశ పడనవసరం లేదు. ఇదీ రహస్యం. అందుకే మహర్షి శ్రీరాముని మాటిమాటికి **'రామో విగ్రహవాన్ ధర్మః'** అంటారు. రాముడు అతి సహజంగా వికార రహితంగా ఉంటాడు. ఈ విధంగా స్థూలస్వరూపము లయొక్క ఆంతరమైన తత్త్వము (రహస్యము)కూడా నీకు తెలుస్తుంది. ఈ కావ్యంలో నీయొక్క ఒక్కమాటకూడా అసత్యమైనది కానేరదు.

"**కురు రామకథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్**" ఇక్కడ బ్రహ్మగారు పుణ్యము, మనోరమము అయిన రామకథను శ్లోకబద్ధంచేయమని చెప్పేరు.

పుణ్యమంటే అనేక శాఖలుగా విస్తరించిన త్రిగుణాత్మకమైన వేదములను ఆధారం చేసుకొని సకామకర్మయోగులు చేయు...

యజ్ఞ యాగాదులు, దానధర్మాలు, జపతపాలు, వ్రతాలు ఇత్యాదులనుండి జనించిన అపూర్వం.

మనోరమము అంటే మనస్సునకు ఆనందదాయకమైన అని, ఈ స్థితి చాంచల్యములేక, నిర్వికారమును, నిర్భయమును, అద్వైతమును, నిర్వికల్పమును అగు నిష్కామకర్మయోగుల నిష్కామకర్మాచరణముచే జనించునది. ఇక్కడ సర్వేన్ద్రియములు ఉపరమావస్థయందు ఉండును. ఏది ఆనందిస్తే సర్వేన్ద్రియములు ఆనందాన్ని పొందుతాయో, అట్టి మనస్సునకు ఆనందాన్ని కలిగించుటద్వారా శాన్తించిన ఇన్ద్రియములు కలవాడై అన్తర్ముఖుడగును. ఇటువంటి రామకథను శ్లోకబద్ధం చెయ్యమని ఆదేశించారు.

యావత్ స్థాస్యన్తి గిరయః సరితశ్చ మహీతలే।
తావద్రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి॥

ఇదిగో ఈ రామాయణం భూమిమీద పర్వతాలు, నదులు ఎంతవరకు ఉంటాయో అంతవరకు ప్రవర్తింపగలదు. ఇక్కడ ఒక రహస్యం ఉంది.

రామాయణం అంటే **"రామస్య అయనం', రామాయాః అయనం"** రామ సంబంధమైన మార్గం, సీతా సంబంధమైన మార్గం అని, అంటే ఈ సీతారాములతో త్రికరణశుద్ధిగా సంబంధమును ఏర్పరుచుకొన్న ప్రతివారూ ఈ భూమిమీద పర్వతాలు, నదులు ఉన్నంతకాలం ఉంటారు. నిషాదుడు క్రౌఞ్చమిథునం దశరథుడు కౌసల్యాదులు వశిష్ఠవిశ్వామిత్రాది ఋషులు హనుమాది సమస్త వానరులు తాటక మారీచ సుబాహు ఖరత్రిశిరాది రాక్షసజాతి సమస్తమూ వీరేకాదు...

బ్రహ్మవర ప్రభావంవలన సీతారాములతో సంబంధం లేకుంటే తమ అమరత్వానికి ప్రమాదం ఏర్పడగలదను శంకచే దేవతలు;

ఇలా చివరకు పరమేశ్వరుడు కూడా...

బ్రహ్మవాక్కునందలి ఆదరబుద్ధితో నిత్య రామజప, ధ్యాన తత్పరుడైనాడు. ఇలా ప్రతివారు రామసంబంధాన్ని కలిగియున్నారు. వీరిలాగే నీవూ అమృతత్వాన్ని పొందుతావయ్యా! ఇది బ్రహ్మ రామాయణ రచనచేసిన వాల్మీకిమహర్షికి ఇచ్చిన వరం. ఈ వాల్మీకిమహర్షి కృతమైన రామాయణాన్ని చదివిన, సీతారామ సంబంధకులు అయిన మనకు ఇచ్చిన వరం. ఈ రహస్యం తెలిసిన వారే పురంధర, రామదాస, త్యాగరాజాదులు. ఇక్కడ మహర్షి గిరయః, సరితశ్చ అని ఒక క్రమాన్ని చూపెట్టారు. నదులయొక్క ప్రాదుర్భావానికి పర్వతాలు మూలం. కావున గిరయః, సరితశ్చ అనే చెప్పాలి. దూడ-ఆవు అని అనకూడదు. ఆవు-దూడ అనే చెప్పాలి. అదే ఔచిత్యం.

ప్రవాహం ఎగువనుండి దిగువకు ఉంటుంది. ఇక్కడ **గిరయః** అంటే సర్వేసర్వత్ర ఏకరూపతను కలిగి, ఉన్నది ఉన్నట్లుగా ఉండేది. ఇదీ అచలస్థితి. కదలకుండా పడుండుటకాదు. త్రికాలాబాధ్యమైనట్టిది. ఇదీ ధర్మం. ఇట్టి ధర్మం లోకానుగ్రహ దృష్ట్యా ప్రవాహరూపాన్ని సంతరించుకొంది. తరువాత బ్రహ్మగారు అన్తర్హితులైనారు. శిష్యసమేతుడైన వాల్మీకి ఆశ్చర్యాన్ని ఆనందాన్ని పొందేరు. వరప్రభావాన్ని ఎరిగిన శిష్యులు అమితానందంతో మాటిమాటికి ఈ శ్లోకాన్ని గానంచేస్తూ ఒకరికొకరు చెప్పుకొంటున్నారు.

ఈ విధంగా చేయుటచే సమానమైన అక్షరసంఖ్య గలిగి, నాలుగు పాదాలతో మహర్షిచే గానం చేయబడిన ఆ శ్లోకం ఇంకను గొప్పతనాన్ని పొందింది. రామాయణ కావ్యాన్నంతనూ ఇటువంటి శ్లోకాలతో చేసెదనని వాల్మీకి మహర్షి నిశ్చయించుకొన్నారు.

కీర్తిమంతుడు బుద్ధిమంతుడు అగు వాల్మీకిమహర్షి యశస్వియైన రాముని కీర్తిని ఉత్తమమైన వృత్తములతోను, శబ్దార్థములతోను, సమాక్షరములుగల శ్లోకములతోను నిర్మించారు.

తదుపగత సమాససన్ధియోగం
సమమధురోపనతార్థవాక్యబద్ధమ్।
రఘువరచరితం మునిప్రణీతం
దశశిరసశ్చ వధం నిశామయధ్వమ్॥ ౪౩

వాల్మీకిమహర్షి రచించిన ఈ రామచరితంలో, రావణవధలో నాతిదీర్ఘమైన సమాసములను, సమాన సంధి వ్యుత్పత్తులతోకూడిన మధురము అర్థవంతము అయిన వాక్యములతో కూడిన కావ్యాన్ని దర్శించండి.

జగన్నాథపణ్డితుడు **వాక్యం రసాత్మకం కావ్యమ్** అని కావ్యలక్షణాన్ని సూత్రప్రాయంగా చెప్పినదానికి మాతృక **సమమధురోపనతార్థవాక్యబద్ధమ్** అని పలికిన వాల్మీకిమహర్షి వచనము.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్వితీయస్సర్గ సమాప్తము.

–

॥అథ తృతీయః సర్గః॥

(ఈ సర్గ శ్రీమద్రామాయణ విషయానుక్రమణిక)

శ్రుత్వావస్తు సమగ్రం తద్ధర్మాత్మా ధర్మసంహితమ్।
వ్యక్తమన్వేషతే భూయో యద్వృత్తం తస్య ధీమతః॥ ౧

ఇతఃపూర్వము ప్రథమసర్గలో "భారతీవృత్తిని" పరిచయం చేసారు. అది సంస్కృత ప్రచురముగా నటులచే చేయబడు వాచికాభినయం. ఇక ఇక్కడ కావ్యమునకు ఆరంభములో విషయానుక్రమణిక యుండవలెనని విధిస్తూ దానిని పరిచయం చేస్తున్నారు. ఇది పాఠకుల చిత్తమును ఆకర్షించు సాధనము.

ధర్మస్వభావుడైన వాల్మీకి, ధర్మసహితము సమగ్రము అయిన; అంటే ఉన్నది ఉన్నట్లుగా ఉండుటయే ధర్మం. ఇది త్రికాలాబాధ్యమైనది. త్రికాలాబాధ్యమైన ధర్మమే **'తత్'**. అట్టి **'తత్ వస్తు శ్రుత్వా'** తత్ వస్తువునుగూర్చి విని అంటే ఆ నిర్విశేష జ్ఞేయరూప బ్రహ్మమునుగూర్చి విని, బుద్ధిమంతుడైన **'తస్య' తత్ సంబన్ధస్య** అని. అంటే నిర్విశేష జ్ఞేయరూప బ్రహ్మసంబంధమైన తత్పద వాచ్యార్థ ధ్యేయస్వరూప రామబ్రహ్మముయొక్క; **వృత్తమ్** నడత ఏదికలదో దానిని, ఇక్కడ **'వృత్తమ్'** అనుటచే ప్రారంభ పరిసమాప్తులు ఒక్కటిగా అయిన రామునియొక్క, ప్రారంభ పరిసమాప్తులు ఒక్కటే అయిన లక్షణం వృత్తానిది. ఇది పూర్ణత్వానికి చిహ్నము. అట్టి పూర్ణము, వికార రహితము అయిన రామ వృత్తాంతమును స్పష్టమగునట్లు ఇంకనూ అన్వేషించారు.

వాల్మీకి ఆచమనం చేసి దర్భలపై కూర్చొని అఞ్జలిబద్ధుడై ధర్మముచేత పొందతగిన మార్గమును బాగుగా అన్వేషించేరు.

రామలక్ష్మణ సీతాభిః రాజ్ఞా దశరథేన చ,
సభార్యేణ సరాష్ట్రేణ యత్ప్రాప్తం తత్ర తత్త్వతః॥ ౩
హసితం భాషితం చైవ గతిర్యా యచ్చ చేష్టితం
తత్సర్వం ధర్మవీర్యేణ యథావత్సం ప్రపశ్యతి॥ ౪

రామలక్ష్మణసీతలచేతను, దశరథునిచేతను **రామలక్ష్మణ సీతాభిః** అనటంచేతనే ఉపాధి సంబంధాలు స్ఫురిస్తుండగా **'సభార్యేణ'** అన్నచోట సీతతోకూడిన రామునిచే అని చెప్పిన పౌనరుక్త్యం అవుతుంది. ఇక్కడ రామునకు ఇంకను

యౌవరాజ్య పట్టాభిషేకం జరుగలేదు. **సరాష్ట్రేణ** అంటే రాజ్యంతో కూడిన రామునిచే అని చెప్పిన సందర్భశుద్ధి లోపిస్తోంది. **సభార్యేణ** ఆశ్రమధర్మము లతోకూడిన వీరిచే, **సరాష్ట్రేణ** (రాజత ఇతి రాష్ట్రం) జ్ఞానముతోకూడిన వారిచే ఏది పొంద బడినదో ఆ విషయాన్నంతనూ అంటే వారి నవ్వుల, మాటల, నడచినదారుల యందలి యథార్థమును అంటే వాటియందలి తత్త్వమును **ధర్మవీర్యేణ** బ్రహ్మచర్య బలముచేత అనుభవానికి తెచ్చుకొన్నారు.

స్త్రీతృతీయేన చ తదా యత్ప్రాప్తం చరతా వనే।
సత్యసన్ధేన రామేణ తత్సర్వం చాన్వవేక్షితమ్॥ ౫

వనచరుడు, సత్యసన్ధుడు, భార్యను మూడవదిగాగల రామునిచేత ఏది పొందబడెనో అదంతయూ చూడబడెను. **స్త్రీతృతీయేన** అని అనడంలో రహస్యం ఉంది. **'వనే చరతా'** వనము అనగా సర్వాశ్రయి అయిన బ్రహ్మము. దానియందే సంచారము. దానంజేసి బ్రహ్మచర్యము, సత్యసంధతగల రామునకు అని, స్త్రీ వీటి తరువాతది. ఇప్పుడు భార్యది మూడవస్థానం. సాంసారిక జీవనానికి ఇబ్బందికలిగినా సహిస్తాడు. నిశ్శ్రేయసానికి పనికివచ్చే పారలౌకిక వ్యవస్థకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించడు. (అందుకే ఋషులకొరకు దండకను అరాక్షసం చేసేడు). ఇటువంటి రామునిచే ఏది పొందబడిందో అదంతా చూడబడింది.

తతః పశ్యతి ధర్మాత్మా తత్సర్వం యోగమాస్థితః।
పురా యత్తత్ర నిర్వృత్తం పాణావామలకం యథా॥ ౬

ధర్మాత్ముడైన వాల్మీకి యోగమార్గమును పొంది శ్రీరామ వృత్తాంతము సర్వమును చూచేడు. ఇక్కడొక రహస్యాన్ని అంటున్నారు. ఈ రామవృత్తాంతాన్ని రామాయణాన్ని యోగదృష్టితో పొందమని ఉపదేశిస్తు న్నారు. ఆ రామమార్గంతో మమైకం అయిపోవాలి. రాముడే అవ్వాలి. అది యోగమంటే. **యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ। సిద్ధ్యసిద్ధ్యో స్సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే॥** అని గీతాచార్యులు అన్నట్లుగా, యోగమునందున్న వాడు అంటే ఈశ్వరునికొరకైన కర్మానుష్ఠానపరుడు.

అలా చేస్తూకూడా ఈశ్వర సంతోషమునందు అనాసక్తుడుగా ఉండువాడు. అంటే నా ఈ కర్మవలన ఈశ్వరుడు నాకొరకు సంతోషించుగాక! అని అనుకోకూడదు. వాల్మీకి ఇటువంటి వారు. తనచే రచింపబడిన రామాయణము తనకు కీర్తిని తీసుకురావాలని వ్రాయలేదు. తనకొరకు రాముడు సంతోషించాలనీ వ్రాయలేదు. ఈ గ్రంథం జాతికొరకు, ఈ ప్రజలకు రామమార్గమును పరిచయం చేయుటకు, తద్వారా వారు వారియందు రామబ్రహ్మమును ఆవిష్కరింపజేసుకొనుటకు. **'ఫలతృష్ణాశూన్యేన క్రియమాణే కర్మణి సత్త్వశుద్ధిజా జ్ఞానప్రాప్తి లక్షణా సిద్ధిః'** అని భాష్యకారులు అంటారు. ఇలా ఫలతృష్ణ లేకుండా కర్మచేస్తే అది రాగద్వేష రహితంగా ఉంటుంది. రామచరిత్రను రాగద్వేషరహితంగా సాక్షిగా దర్శిస్తున్నారు. కావ్యాన్తర్గతమైన రామాదులయందు ఎవ్వరియందుకూడా రాగద్వేషములు లేకుండా దర్శిస్తున్నారు. యోగం అంటే **సమ్యగ్దర్శనోపాయ కర్మానుష్ఠానం** అంటారు భాష్యకారులు. దీనివలన సత్యం దర్శింపబడుతుంది. పూర్వం **న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి** అన్న బ్రహ్మమాటకు ఇదే లక్ష్యం.
ఇప్పుడు ఈ రామాయణంలో ఉన్నదంతా అక్షరసహ సత్యం.

> **తత్సర్వం తత్త్వతో దృష్ట్వా ధర్మేణ స మహాద్యుతిః।**
> **అభిరామస్య రామస్యరామస్య చరితం కర్తు ముద్యతః।**
> **కామార్థగుణ సంయుక్తం ధర్మార్థగుణ విస్తరమ్।**
> **సముద్రమివ రత్నాఢ్యం సర్వశ్రుతి మనోహరమ్॥**

'మహాద్యుతిః సః' తన ప్రకాశం (జ్ఞానం)చేత ఎదుటివారి జీవితాల్లో వెలుగులు నింపగల స్థితియందున్న వాల్మీకి, ఆ సమస్తమైన చరిత్రమును **'తత్త్వతః, ధర్మేణ'** తాత్త్వికదృష్టి కలిగి, ధర్మముచేత ఉన్నది ఉన్నట్లుగా అంటే కనబడుచున్నది కనబడుచున్నట్లే చూచి, **'కామార్థగుణ సంయుక్తం'** కామమే ప్రయోజనముగా గల గుణములతోకూడినది. **'ధర్మార్థగుణ విస్తరమ్'** ధర్మమే ప్రయోజనముగా గల గుణములతో విస్తరించినది. అంటే సాంసారికవాసనలచే కూడియున్న ప్పటికీ, విస్తారమైన పారమార్థిక ప్రయోజనం కలది. ఇటు సాంసారిక ప్రయోజనాలను సిద్ధింపజేస్తూనే,

అటు మోక్షప్రాప్తి ఉపాయభూతముగను ఉన్నది. ఇది **'ప్రజాతన్తుం మా వ్యవచ్ఛేత్సీః'** ప్రజాసంతతిని విచ్ఛిన్నం చేయకు అన్న ఔపనిషద వాక్యమును దృష్టియందున్న వాని రచన. రామాయణం సంసారలక్షణ ప్రకాశకలది. కనుకనే సముద్రంతో పోలిక చెప్పారు. సులువు తెలిసినవారు, జ్ఞానులు సముద్రుని (సంసారాన్ని) రత్నాధ్యునిగా తెలుసుకొని రత్నదర్శనం చేసి తరిస్తారు. అజ్ఞులు కామనలచే ఊపిరిసలుపక ఆ సముద్రము (సంసారము)నందే మునిగిపోతారు. సర్వశ్రుతి సమ్మతమైన సకలవేదసారమైన రామాయణం బాహ్యాభ్యన్తర భేదంచే ఈవిధంగా ధ్వని ప్రధానంగా ప్రారంభించేరు.

ఎలా నారదులు చెప్పారో అలా రచించారు.

జన్మ రామస్య సుమహద్వీర్యం సర్వానుకూలతామ్।
లోకస్య ప్రియతాం క్షాన్తిం సౌమ్యతాం సత్యశీలతామ్॥

రామ జననము, మిక్కిలిశ్రేష్ఠమైన బ్రహ్మచర్యము (పరాక్రమము) **సర్వానుకూలతామ్। లోకస్య ప్రియతాం** అందరికీ అందుబాటులో ఉండు ఆతని తత్త్వమును, కేవలము మనుష్యులకేకాదు చరాచర ప్రాణికోటికి అంతకూ ప్రియమైనవాడగుటను, అతని ఓర్పును సౌన్దర్యమును సత్యశీలతను అంటే రాగద్వేష రహితమైన సర్వేసర్వత్రా ఒక్కలా ఉండు స్వభావాన్ని వర్ణించారు. విశ్వామిత్రునితో కలిసినప్పుడు ఇతరములైన అనేకములైన చిత్రమైన కథలను ధనుర్భంగాన్ని జానకీపరిణయాన్ని, పరశురామ గర్వభంగాన్ని, శ్రీరాముని గుణగణాలను, రాముని పట్టాభిషేకమును, కైకేయి దుష్టచింతనను వర్ణించారు. పట్టాభిషేకభంగమును, రాముని అరణ్యవాసమునకు పంపుటను, దశరథుని దుఃఖమును, పరలోకగమనమును వర్ణించెను.

'ప్రకృతీనాం విషాదం చ ప్రకృతీనాం విసర్జనమ్'

చరాచరాత్మక జీవజాలముయొక్క దుఃఖాన్ని వర్ణించారు. **'సర్వానుకూలతామ్, లోకస్య ప్రియతామ్'** అయిన రాముని స్వభావానికి విరుద్ధంగా చరాచర జీవజాలాన్ని విడిచిపెట్టుటను వర్ణించారు.

ఇక్కడ రామచన్ద్రుడు దుఃఖభూయిష్టమైన చరాచరాత్మక సర్వప్రకృతిని విడిచి ఆనన్దరూపుడుగా (స్వస్వరూపమున) ఉన్నవానిగా చెప్తున్నారు. గుహునితో

సంభాషణమును సారథిని వెనుకకుపంపుటను వర్ణించెను. (ఆజ్ఞవరకే రథమార్గము. ఇక్కడ వరకు యోగము సహాయకారి. ఆజ్ఞ గురుస్థానము, కనుకనే భరద్వాజాది ఋషుల దర్శనం). గంగానదిని దాటుట, భరద్వాజ దర్శనం, చిత్రకూట ప్రయాణం, చిత్రకూటమున ఆశ్రమనిర్మాణము, అందు నివాసము, భరతాగమనము, పితృతర్పణములను వర్ణించేరు. పాదుకా పట్టాభిషేకము, నందిగ్రామ వాసము, దణ్డకారణ్య ప్రవేశం, విరాధవధ, శరభఙ్గ దర్శనం, సుతీక్ష్ణమహర్షి దర్శనం, అనసూయా సందర్శనము, అనసూయ అంగరాగమును ఇచ్చుట, అగస్త్య దర్శనము, జటాయు సమాగమము, పంచవటీ గమనము, శూర్పణఖను వృత్తాంతము, ఖర త్రిశిరస్కుల వధ, రావణప్రయత్న ప్రారంభమును వర్ణించెను. రావణ దర్శనము, పుష్పకముయొక్క దర్శనము, పానభూమి, అంతఃపురముల దర్శనం, హనుమ అశోకవన ప్రవేశం, సీతను దర్శించుట, ఉంగరమును ఇచ్చుట, రాక్షసస్త్రీల పలుకులు, త్రిజటా స్వప్న వృత్తాంతము, చూడామణి ప్రదానం, తరువాత వృక్షములను విరుచుట, రాక్షస స్త్రీలు పారిపోవుట, రావణసైన్యాన్ని చంపుట, ఇన్ద్రజిత్తునకు పట్టుబడుట, లంకాదహనము ఇత్యాదులు. హనుమ పునః సముద్రలంఘనము, మధువన ప్రవేశము, రామునకు సీతావృత్తాంతం నివేదించి ఓదార్చుట, చూడామణిని ఇచ్చుట. నలునిచే సేతుబంధనము, సముద్రమును దాటుట, రాత్రియందు లంకను ముట్టడించుట, విభీషణునితో సంబంధము, రామునకు రావణ వధోపాయమును చెప్పుట, కుంభకర్ణ మేఘనాథు రావణాదుల వధ, సీతాప్రాప్తి విభీషణ పట్టాభిషేకము, పుష్పకదర్శనము, అయోధ్యాగమనము భరత సమాగమము, శ్రీరామ పట్టాభిషేకము, సకలసైన్యమును వెనుకకు పంపుట, రాష్ట్రమును ఆనందింపచేయుట, సీతను విడచుటను వర్ణించెను.

అనాగతం చ యత్కించిద్రామస్య వసుధాతలే।
తచ్చకారోత్తరే కావ్యే వాల్మీకిర్భగవానృషిః॥౩౮

ముందు జరుగు రామచరిత్రను ఉత్తరకాండలో రచించెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **తృతీయస్సర్గ** సమాప్తము.

॥అథ చతుర్థః సర్గః॥

(మహర్షి ఇరువదినాల్గువేల శ్లోకములతో రామాయణము రచించి దానిని కుశలవులకు ఉపదేశించుట, ఋషులు రామాయణమును ప్రశంసిచుట)

ప్రాప్తరాజ్యస్య రామస్య వాల్మీకిర్భగవానృషిః।
చకార చరితం కృత్స్నం విచిత్ర పదమాత్మవాన్॥

భగవంతుడు, ఆత్మజ్ఞానీ (నిర్భయుడు), ఋషి అంటే సమ్యగ్దర్శన సామర్థ్యంగల వాల్మీకిమహర్షి ఆశ్చర్యకర శాబ్దికప్రయోగములుగల పొందబడిన రాజ్యముగల రామునియొక్క సమస్తమైన చరిత్రమును రచించెను.

'ప్రాప్త రాజ్యస్య రామస్య కృత్స్నం చరితం వాల్మీకిః చకార' అన్న ఈవాక్యము రాముడు రాజ్యపాలనయందున్న కాలమందే శ్రీమద్రామాయణ రచన జరిగిందని తెలియజేస్తోంది. రామాయణ వ్యాఖ్యాతలందరు ఈ విషయంలో ఏకవాక్యత గలవారుగనే యున్నారు.

చతుర్వింశత్సహస్రాణి శ్లోకానాముక్తవాన్ ఋషిః।
తథా సర్గశతాన్పఞ్చ షట్కాణ్డాని తథోత్తరమ్॥

ద్రష్టయైన వాల్మీకి ఐదువందల సర్గలను ఆరుకాండలుగా విభజించి మరియు ఉత్తరకాండతో కలిపి ఇరువదినాలుగువేల శ్లోకాలలో చెప్పేరు. **తపస్వాధ్యాయ నిరతం** నుండి **తద్బ్రహ్మోప్యన్వమన్యత** వరకు ఇరువది నాలుగువేల శ్లోకాలని శ్రీగోవిందరాజులు చెప్పేరు. ఉత్తరకాండతో మొత్తం ఏడుకాండలు ఇరువదినాల్గువేల శ్లోకాలని ప్రసిద్ధ రామాయణ వ్యాఖ్యాన కర్తలందరు అంగీకరించియే యున్నారు.

ఆయోధ్యకాణ్డను బాలకాండాన్తర్గతంచేసి ఉత్తరకాండపర్యన్తం ఆరుకాండలని చెప్పినవారూ ఉన్నారు.

వీరందరకి ఉత్తరకాండ వాల్మీకికృత మనుటలో విప్రతిపత్తి లేదు.

ఉత్తరే త్వృషి సంవాదో యజ్ఞప్రారమ్భ ఏవచ।
తత్రానేకా రామకథాః శ్రుణ్వతాం పాపనాశిఖాః॥
చతుర్వింశతి సాహస్రం షట్కాణ్డ పరిచిహ్నితమ్।
తద్వై రామాయణం ప్రోక్తం మహాపాతక నాశనమ్॥

అని పద్మపురాణం అశ్వమేధయజ్ఞంతో ఉత్తరకాండ ప్రారంభింపబడి మొత్తం ఆరుకాండలతో ఇరువదినాల్గువేల శ్లోకములతో సర్వపాపవినాశకమైన రామాయణం కలదని చెప్పింది.

శ్రీవాల్మీకిమహర్షికూడా బాలకాండ తృతీయసర్గాన్తమున

అయోధ్యాయాశ్చ గమనం భరతేన సమాగమమ్।
రామాభిషేకాభ్యుదయం సర్వసైన్యవిసర్జనం।
స్వరాష్ట్రరఞ్జనం చైవ వైదేహ్యాశ్చ విసర్జనమ్॥

అని సీతను పరిత్యజించు పర్యన్తము యుద్ధకాండ విషయమనియే చెప్పి, ఇకపై జరుగనున్న రామునిచరిత్ర ఉత్తరకాండలో రచించెనని చెప్పారు. దానంజేసి రామాయణం ఉత్తరకాండతో కలిపి ఇరువదినాల్గువేల శ్లోకాలు. ఉత్తరకాండకూడా వాల్మీకిమహర్షి కృతమనుట నిర్వివాదము.

అపౌరుషేయమైన వేదధర్మము త్రేతాయుగమున స్వరూపగ్రహణము చేసి, శ్రీమద్రామాయణముగా వాల్మీకిచే దర్శింపబడింది. వృద్ధిక్షయాలు ఉపాధి ధర్మం. యుగాలతరబడి అతిదీర్ఘకాలంగా జీవనంసాగిస్తూన్న రామాయణం కూడా ఉపాధిధర్మంగా కొద్దిపాటి మార్పులకు గురియైనది. ఇది ధర్మశాస్త్రం కనుక మార్పు ధర్మంకూడాను. అయినా రామాయణంతో చిరకాలంగా సహజీవనం చేస్తూవస్తూన్న మనం, ఇది రామాయణం అని గుర్తించగలం. ఎలాఅంటే! దేవదత్తుడు పుట్టాడు. బాల్యందాటి యౌవనంలోకి వచ్చాడు. వివాహం సంతానం ధనసంపాదన ఇదీ వాడి జీవితం. వాడు పుట్టినప్పుడు; వాడికంటే పెద్దవారు, వాడి తోడివారు, పిన్నలు ఈ ముగ్గురూ వాడితో వాడి కాలంలో ఉంటారు. కాలంతోపాటు నడిచి వారు అవసరాన్ని అనుసరించి వాణ్ణి చాలామందికి పరిచయం చేస్తూ పోతారు. తరువాత కాలంలో దేవదత్తుడు ఉపాధిధర్మంగా అనేక మార్పులకు లోనై కాలానుగుణంగా రూపం మార్చుకొన్నా సమకాలీన ప్రపంచం వాణ్ణి దేవదత్తునిగా గుర్తిస్తోంది కదా! ఎందుకంటే వాడి మూలతత్త్వంలో మార్పులేదు. అలాగే, బ్రహ్మావర ప్రభావంచే మహాప్రళయ పర్యన్తమైన జీవితంకలది రామాయణం.

కొద్దిపాటి ఉపాధిగత మార్పులను స్వీకరిస్తూనే

మనలను అనుగ్రహించు సామర్థ్యంకలదై మనలను ధర్మమార్గాన నడిపిస్తూ, మనతో నడుస్తూన్నది. రామాయణం అంటే శ్లోకరూపమైన అక్షరవిన్యాసం మాత్రమే కాదు, శ్రీరామతత్త్వ స్వరూపం. దానియందు మార్పు ఉండదు. ఏకకాలంలో భిన్నదేహాలతో భిన్నప్రాంతాలలో భిన్నభిన్ననామాలతో సంచరించగల యోగులవలె ఈ రామతత్త్వమే వాల్మీకేతరమైన అనేక నామాలతో **ఆధ్యాత్మ ఆనంద మొల్ల విచిత్ర రామాయణం రామచరితమానస్** ఇలా భిన్నభిన్నకాలాలలో భిన్నభిన్ననామాలతో కనిపిస్తూ తిరిగితిరిగి వాల్మీకి మహర్షినే ఆశ్రయిస్తున్నాయి. ఉపాధిధర్మంగా కాలానుగుణంగా వచ్చే వ్యాధిలా **రామాయణవిషవృక్షం** వంటివి వస్తే అపరవాల్మీకులు ఆమ్నాయధన్వన్తరులు యోగులు సిద్ధులు సాధకులు అయినవారు **కల్పవృక్షాల** వంటి వాటితో చికిత్సచేయకపోలేదు. ప్రధానంగా దృష్టి నిలుపవలసినది శ్రీరామతత్త్వముపై భౌతికస్వరూపమైన శ్లోకసంఖ్య కాండసంఖ్య సర్గసంఖ్యలమీదకాదు.

కృత్వాపి తన్మహాప్రాజ్ఞః సభవిష్యం సహోత్తరమ్।
చిన్తయామాస కోన్వేత త్ప్రయుఞ్జీయాదితి ప్రభుః॥

సర్వజ్ఞుడు స్వతంత్రుడు అగు వాల్మీకి రామపట్టాభిషేక అనంతర కథతోను, అశ్వమేధము తరువాత జరిగిన కథతోను రామాయణమును రచించెను. అని చెప్పుటచే వైదేహీ విసర్జనపర్యన్తం యుద్ధకాండ విషయమనునది స్పష్టం. అటుపై విషయమంతయు అశ్వమేధము మొదలు శ్రీరాముడు సరయూ ప్రవేశపర్యన్తం ఉత్తరకాండ అని తెలియదగినది. కానీ లోకంలో ఈభాగం భిన్నంగా తోచుచున్నది. స్థితప్రజ్ఞులు సృష్టికర్త అయిన మహర్షికి సుఖదుఃఖ స్పర్శలేదు. సంసారంలో దుఃఖం నిత్యంగా ఉంటుందయ్యా! అని చెప్తూ, సీతారాముల వియోగ దుఃఖంతో పరిసమాప్తి చేసి,

ఉన్నది ఉన్నట్లుగా వ్రాసానని చెప్పారు.

కానీ సంసారి విషయం అలాకాదు. వీడికి దుఃఖం నిత్యంగా ఉంటుంది. ఆ దుఃఖమునందు అనిష్టత ఉంటుంది. అనిష్ట పరిహారమునకైన ప్రయత్నం ఉంటుంది. ఆ ప్రయత్నంలో భాగంగానే, ఈ జగత్తునకు మార్గదర్శకులైనఆ తల్లితండ్రుల దుఃఖాన్ని చూడలేని ప్రాజ్ఞులైన పండితులు యుద్ధకాండను

పట్టాభిషేకంతో పూర్తిచేసి, మిగిలిన చరిత్రను ఉత్తరకాండతో చేర్చి తల్లిదండ్రులను సుఖపెట్టే ప్రయత్నం చేసేరు.

ఇంతలో... మునుల వేషములను ధరించి ఉన్న కుశలవులు, పరిశుద్ధాత్ముడైన అన్యమనస్కుడైన వాల్మీకిమహర్షియొక్క పాదములకు మ్రొక్కేరు. అలా ప్రణమిల్లిన ధర్మము తెలిసినవారు, క్షత్రియులు (శాసనాధికారముకలవారు), కీర్తికలవారు సోదరులు స్వరసంపన్నులు అంటే వేదాధ్యయనం చేసినవారు, గాయకులు అయిన ఆశ్రమవాసులు అంటే నియతేన్ద్రియులు అయినటువంటి వారిని మహర్షి చూసేరు.

సర్వస్వతంత్రుడైన వాల్మీకి, సలక్షణ వేదాధ్యయనము చేసిన, మేధావంతులైన ఆ సోదరులను చూచి **వేదోపబృంహణార్థాయ** వేదములకు పరిపుష్టిని గూర్చుటకైన రామాయణమును వారిద్దరకు ఉపదేశించేరు.

కావ్యం రామాయణం కృత్స్నం
సీతాయాశ్చరితం మహత్
పౌలస్త్యవధమిత్యేవ చకార చరితవ్రతః॥౭

రామాయణము అని నామకరణం చేసేరు మహర్షి. "రామ అయనమ్" ఇజ్ అధ్యయనే అని ధాతువు. ఇజ్ ధాతురూపమైన 'ఆయన' శబ్దము అధ్యయనార్థమునే చెప్పుచున్నది. ఎవరినిగూర్చి ఈ అధ్యయనం లేదా గమనము అంటే "రామం ప్రతి".

రామ అయనమ్ అయనం అంటే ప్రలయం అని ఛాందోగ్యభాష్యంలో శఙ్కరులు చెప్పేరు. **'తాని హ వా ఏతాని సఙ్కల్పైకాయనాని సంకల్పాత్మకాని సంకల్పే ప్రతిష్ఠితాని...' సంకల్పః ఏకః అయనం గమనం ప్రలయో యేషాం తాని సంకల్పైకాయనాని"** మనస్సు వాక్కు మొదలైన వాటికి ఉపాదాన కారణమైన సంకల్పమే విలీనస్థానము. రామాయణము స్వాధ్యాయమే. ఎందువలన అంటే వేదోపబృంహణము కనుక. **రామం అధికృత్య అయనం ప్రలయం** రామాయణం అని సర్వాధిష్ఠాన స్వరూపమైన రామబ్రహ్మమే ఉపాసకుని అంతఃకరణమునకు పరమలక్ష్యమైన లయస్థానము.

చరితవ్రతుడైన వాల్మీకి ఆ కావ్యమును రామాయణమని, సీతాచరితమని, పౌలస్త్యవధ (రావణవధ) అను పేర్లతో చేసేరు.

పాఠ్యేగేయే చ మధురం ప్రమాణై స్త్రిభిరన్వితమ్।
జాతిభిః సప్తభిర్బద్ధం తన్త్రీలయ సమన్వితమ్॥ ౮
రసైః శృఙ్గారకారుణ్య హాస్యవీరభయానకైః
రౌద్రాదిభిశ్చ సంయుక్తం కాత్యమేతదగాయతామ్॥౯
తౌతుగాన్ధర్వ తత్త్వజ్ఞౌ మూర్ఛనాస్థాన కోవిదౌ
భ్రాతరౌ స్వర సమ్పన్నౌ గన్ధర్వావివ రూపిణౌ॥౧౦
రూపలక్షణ సమ్పన్నౌ మధుర స్వరభాషిణౌ।
బిమ్బాదివోద్ధృతౌ బిమ్బౌ రామదేహాత్తథా పరౌ॥౧౧

ఈ రామాయణమందలి సాహిత్య సంగీతాలు మధురంగా ఉన్నాయి. ఈ సోదరులకు మంచి గాత్రం ఉంది, సంగీతజ్ఞానం ఉంది. స్వరస్థానాలు తెలిసినవారు. విశేషించి శ్రీరాముని ప్రతిబింబాలా అన్నట్లుగా ఉన్నారు. శృఙ్గార కరుణ హాస్య వీర భయానక రౌద్ర బీభత్స అద్భుతములను రసములతోకూడిన రామాయణ కావ్యాన్ని తన్త్రీలయసమన్వితంగా తంబుర సాయంతో లయాత్మకంగా గానంచేసారు.

ఇక్కడ మహర్షి రసవర్గంలో ఎనిమిది రసాలనే పఠించేరు.

శాన్తము రసాష్టకానికి ఉపరమస్థానం. శాన్తము సముద్రమైతే, రసములు అలలు. అలలు సముద్రముయొక్క సహజస్థితికాదు. అలలు సముద్రముయొక్క వికారరూపము.

శాన్తము మనస్సుయొక్క సహజస్థితి. మనోవికారము రసము. **శాన్తాకారం భుజగశయనమ్...** అని యోగిహృద్ధ్యాన గమ్యమైన పరమాత్మను ఉపరమ స్థానంగా చెప్పి శాన్తము మనోవికారరూపములైన రసములయొక్క ఉపరమ స్థానంగానే తలచి రసవర్గంలో ఎనిమిదినే పఠించేరు. దర్శనకారులుకూడా ఆకాశము సముద్రము శాన్తము ఇవి పరమాత్మయొక్క దర్శనీయ స్వరూపాలని చెప్పేరు. రామాయణంలో శృఙ్గారాది మనోవికారరూపములైన రసాష్టకాన్ని కావలసినంతగా చూపెడుతూ, వాటిని శాన్తింపచేయు మార్గాలనూ చూపించేరు.

ధర్మప్రతిపాదికము ఉత్తమము అయిన ఈ రామాఖ్యానమును పూర్తిగా వాచోవిధేయంగా (కంఠస్థముగా) చేసి, అపస్వరములు లేకుండా తత్త్వము తెలుసుకొని, ఆ తత్త్వమునందు దృష్టికలవారై ఏవిధంగా ఉపదేశించారో ఆవిధంగానే ఋషులయొక్క ద్విజులయొక్క సత్పురుషులయొక్క సమావేశమున గానముచేసేరు.

ఆ ఋషిమండలి ఆ కావ్యగానాన్ని వింది. విని, గొప్ప ఆశ్చర్యాన్ని పొందేరు. కంటతడితో సాధుసాధని మెచ్చుకొంటున్నారు. అక్కడున్న ఋషిగణాన్నిగూర్చి మహర్షి **'ధర్మవత్సలాః'** అని అంటున్నారు. అంటే వారు ధర్మముయెడ పుత్రపుత్రికా భావాన్ని కలిగినవారైయున్నారు. అంటే ధర్మ దూరులైనవారికి, ధర్మనిర్ణయం చేసుకోలేని శిశుత్త్వమందున్న వారికి, వీరు వాత్సల్యాతిశయంచే శిక్షకులై సరైనమార్గమున ఉంచువారు. ఇప్పుడు ఈ రామాయణం వీరి ఆమోదాన్ని పొందినట్టైంది. ఈ ఋషిమండలి ఆనందానికి అవధులు లేకుండా ఉంది. ఎప్పుడో జరిగిన కథ ఇప్పుడు కన్నులముందు కదులుతున్నట్లుంది.

ప్రవిశ్య తావుభౌ సుష్ఠు భావం సమ్యగగాయతామ్।
సహితౌ మధురం రక్తం సంపన్నం స్వర సమ్పదా॥౧౮

వారిరువురు లయతప్పకుండా ఒకే భావావేశంతో వీరిరువురు ఏకోదరులు మాత్రమేకాదు, ఏకమనస్కులుకూడా! అందుకే మహర్షి **'భావం సుష్ఠు ప్రవిశ్య'** అని చెప్పేరు.

చక్కటి స్వరసంపదతో మధురంగా గానం చేసారా! అని మెచ్చుకొంటున్నారు. సంతోషం పట్టలేక ఒకరు చేతిలోని కలశను ఇచ్చేసారు.

మరొకరు నారచీరను ఇచ్చారు.

పరం కవీనామాధారం సమాప్తం చ యథాక్రమమ్ ఆశ్చర్యకరమైన క్రమబద్ధమైన ఈ కావ్యరచన భావి కవులకు ఆధారము. అని ఈవిధంగా ఋషిసంఘం మెచ్చుకుంటోంది.

అభిగీతమిదం గీతం సర్వగీతేషు కోవిదౌ।
ఆయుష్యం పుష్టిజనకం సర్వశ్రుతిమనోహరమ్॥

ఇది **'సర్వశ్రుతి మనోహరమ్'** సకలవేద సారభూతమైనది. కర్ణపేయమైనది.

ఇట్టిది చక్కగా పాడబడుటచే ఆయుష్యాన్ని, పుష్టిని కలిగించేదిగా ఉంది. ఇట్టిదాన్ని ఆ కుశలవులు పురవీథులయందు, రాజవీథులందు, అంతటా గానముచేస్తూ, ఓ రోజు వారు పాడుచున్న చోట రాముని చూచేరు.

శత్రునాశకుడగు రాముడు వారిని తన గృహమునకు తీసుకొనిపోయి, గౌరవించేడు. వశిష్ఠాదులతోకూడి భ్రాతృసహితుడైన రాముడు సింహాసనోప విష్టుడై సింహాసనమును అలంకరించి, సభాసదులను ఉద్దేశించి దేవతలవంటి తేజస్సుకల ఈ బాలుర విచిత్రమైన అర్థములు పదములుగల (చిత్రమైన ప్రయోజనములను కూర్చు పదములుగల) ఆఖ్యానమును శ్రద్ధగా వినండి అని, ఆ బాలురను గానము చేయమని చెప్పేడు.

ఆ కుశలవులు మధురంగా రాగయుక్తంగా శ్రుతిలయాత్మకంగా భావప్రధానంగా గానంచేసారు. కర్ణపేయమైన ఆగానానికి ఆ శ్రోతల సర్వేన్ద్రియములు మనస్సు, హృదయము ఆనందమున మునిగిపోయాయి.

ఈ మునిబాలురు క్షత్రియలక్షణాలతో ఉన్నారు. గొప్ప తపస్సు కలవారుగా ఉన్నారు. నాకుకూడా శ్రీకరమైన, గొప్పశక్తిగల ఆ చరిత్రను సావధానులై వినండి. (అని సభ్యులతో పలికాడు). రామ అభ్యర్థనచే **'మార్గపద్ధతిని'** అనుసరించి ఆ సభలో గానం చేసారు. మనశ్శాన్తికొరకు రాముడు కూడా గానమునందు ఆసక్తితో విన్నాడు.

ఇక్కడ వాల్మీకిమహర్షి ఈ రామాయణ పారాయణయొక్క పరమప్రయోజనాన్ని చెప్పారు. ఏమిటి ఆ పరమప్రయోజనం అంటే మనశ్శాంతి.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుర్థస్సర్గ సమాప్తము.

-

॥అథ పఞ్చమః సర్గః॥

(అయోధ్యానగర వర్ణనము)

సర్వా పూర్వమియం యేషా మా సీత్కృత్స్నా వసుంధరా।
ప్రజాపతి ముపాదాయ నృపాణాం జయశాలినామ్॥

చతుస్సముద్ర వేలావలయితమైన సమస్త భూభాగము పూర్వము మన్వాది రాజుల వశమందుండెడిది. ఆ రాజులలో సగరుడు అను చక్రవర్తి, అతడు సముద్రములను త్రవ్వించాడు. అతడు వెళ్ళునప్పుడు అతడి వెంట అతడి కుమారులైన అరవైవేలమంది పరివారం ఉండేది. అట్టి మహాత్ములైన ఇక్ష్వాకురాజులయొక్క వంశమునందు రామాయణమని ప్రసిద్ధిగాంచిన ఆఖ్యానం ఉత్పన్నమైనది. అట్టి రామాయణం అంతయూ లోకములో ప్రవర్తింప నిశ్చయించాను.

ధర్మకామార్థ సహితమైన ఈ రామాయణాన్ని అనసూయా సహితుడవై విను; వింటే... అత్రిమహర్షి అంతటి వాడవు అవతావు.

సరయూనదీ తీరం వెంబడి విశాలమైన కోసలదేశం.

ధనధాన్యాలతో తులతూగుచు, నిత్యసంతుష్టులైన ప్రజలతో ఉంది.

"అయోధ్యానామ నగరీ తత్రాసీల్లోక విశ్రుతా" ఆ కోసల దేశమునందు మనువుచే నిర్మింపబడ్డ అయోధ్య అను పేరుగల నగరం ఉంది. ఇది పండ్రెండు యోజనాల పొడవు, మూడుయోజనాలు వెడల్పుకలది. **"సువిభక్త మహాపథా"** చక్కగా విడగొట్టబడ్డ సువిశాలమైన రహదార్లు; అంటే అవి రాకపోకలకు వేర్వేరుగా విడగొట్టబడ్డ మార్గాలు (వన్ వే సిస్టం). ఈ విశాలమైన రహదార్లు దీపపుకాంతులతో శోభాయమానంగా ఉన్నాయి. **"శ్రీమతీ సువిభక్త మహాపథా"** ఇప్పటి వీధిదీపాల వ్యవస్థ అప్పటికే ఉంది.

రాజమార్గేణ మహతా సువిభక్తేన శోభితా।
ముక్త పుష్పావకీర్ణేన జలసిక్తేన నిత్యశః॥ ౮

ఆ రాజమార్గములు వెదజల్లబడిన పుష్పాలతో వాటి సువాసనలతో వ్యాప్తమైయుండెడివి. ఈమార్గములు ఎప్పుడు నీటితో తడుపబడుచుండెడివి (దుమ్ము పైకి లేవకుండా). ఇట్టి పరమశోభాయమానమైన రాజ్యమును పరిపాలించు

సమర్థుడైన రాజు దశరథుడు. స్వర్గంలోవలె ఉంటున్నాడు. అంటే ఇన్ద్రభోగాలన్నీ ఉన్నాయి.

కవాటతోరణవతీం సువిభక్తాన్త రూపణామ్।
సర్వయన్త్రాయుధవతీ ముపేతాం సర్వశిల్పిభిః॥

ఆ నగరం వెలుపల తలుపులు, దారుబంధములు కలిగియున్నది. చక్కగా విభాగింపబడిన వాణిజ్య సముదాయాలు, సమస్తమైన యంత్రములు, సమస్తమైన ఆయుధములతో కూడియున్నది.

సూతమాగధ సమ్బాధాం శ్రీమతీమతులప్రభామ్।
ఉచ్చాచట్టాల ధ్వజవతీం శతఘ్నీశత సఙ్కులామ్॥

ఇంకా **'సూతమాగధ సమ్బాధాం'** ఈ నగరం సూతులచేతను, మాగధుల చేతను బాధింపబడుతోంది. అంటే ఇరుకుగా ఉంది. సూతుడు అంటే గుఱ్ఱములను తోలువాడు, వారితోనూ; రసవిద్య తెలిసిన వారితోనూ, వద్రంగులతోనూ, ఇంకను స్తోత్రపాఠకులైనవారు. వీరు ప్రజాసంక్షేమానికైన ప్రభుత్వ పథకములను ప్రజలకు వివరిస్తూ రాజును కీర్తించువారు. తద్వారా ప్రజలయందు రాజుపై వ్యతిరేకత కలుగకుండా చేస్తారు. ఇదొక ప్రధానమైన ప్రభుత్వోద్యోగం. వీరందరూ సూతశబ్దంచేతనే నిర్దేశింపబడ్డారు. వీరిచేతను, మాగధులు వీరు రాజవంశమును కీర్తించువారు. వీరు ఆ రాజవంశ ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన పూర్వుల చరిత్రములను ఈ రాజునకు జ్ఞప్తిచేయుచు ధర్మమార్గమున నిలుపువారు.

మగధనుండి వచ్చిపోయేవారు; లేదా అమోధ్యనుండి అక్కడకు తరచుగా వెళ్లువారు. వైశ్యసంబంధకులైన వీరు వ్యాపారులు.

ఇట్టి సూతమాగధులచే ఆ వ్యాపార స్థలములు, అయోధ్యా రాజమార్గములు ఎప్పుడు కిక్కిరిసి ఉంటాయి.

ఉన్నతమైన కోటబురుజులు ధ్వజములు కలిగి, వందలాది శతఘ్నులతో అమర్చబడి, కండ్లు మిఱుమిట్లు గొలుపు దీపపుకాంతులతో సకల సంపత్సమృద్ధంగా ప్రకాశిస్తోంది.

వధూనాటక సంఘైశ్చ సంయుక్తాం సర్వతః పురీమ్।
ఉద్యానామ్రవణోపేతాం మహతీం సాలమేఖలామ్।

ఆ అయోధ్యలో స్త్రీలతోకూడిన నాటకసంఘాలు ఉన్నాయి. స్త్రీ పాత్రలు స్త్రీలే ధరించేవారు. సమానత్వం, అభివృద్ధి అని ఇప్పుడు మనం కర్ణపుటలు చిల్లులు పడేట్లుగా అరుస్తూ కోరుకుంటున్న సాంఘికవ్యవస్థ, ఆనాటికే ఉంది. స్త్రీలు వంట ఇంటికే పరిమితం అయినవారు కాదు. తురుష్కుల దండయాత్రలవలన మన సాంఘికవ్యవస్థలలో పెనుమార్పులు చోటుచేసు కొన్నాయి. ఆ నేపథ్యంలో వచ్చిన కట్టుబాట్లు. ఇప్పుడు మనం దురాచారాలని గోల చేస్తూన్నవి, సమాజ రక్షణార్థం ఒకప్పటి అత్యవసర పరిస్థితి.

ఈ అయోధ్యకు అన్నివైపులా పట్టణాలు ఉన్నాయి. మామిడితోపులతోనూ, ఉద్యానవనాలతోనూ కూడుకొని ఉంది. అయోధ్య చుట్టూ ఎత్తైన సరిహద్దు రక్షణకుడ్యము ఉండి, అది ఆ పట్టణానికి వడ్డాణములా ఉంది.

ఆ ప్రాకారం తరువాత ప్రవేశింప శక్యంకాని అగాధమైన ఆగడ్త ఉంది. శత్రువులు ఆక్రమించి ప్రవేశించుటకు అశక్యమైనది గుఱ్ఱములతోను ఏనుగలతోను నిండియున్నది.

"వాజివారణ సంపూర్ణాం దుర్గమన్యై ర్దురాసదామ్।" అని చెప్పుటచే ఈ గుఱ్ఱాలు, ఏనుగులు యుద్ధవిషయకమైనవి అనునది స్పష్టం.

గోభిరుష్ట్రైః ఖరైస్తథా ఆవులు ఎద్దుల చేతను; ఒంటెలు గాడిదలతో నిండియుంది. ఈ సమూహము విడిగా ఉచ్చరింపబడుటచే ఈ గోవులు ఉష్ట్రములు ఖరములు వ్యాపార రవాణాకొరకైనట్టివి.

సామన్తరాజసంఘైశ్చ బలికర్మభిరావృతామ్।
నానాదేశనివాసైశ్చ వణిగ్భిరుపశోభితామ్॥౧౪

కప్పము చెల్లించుటకు వచ్చిన సామంతరాజసంఘాలతో అనేక దేశములనుండి వచ్చిన వర్తకులచే ఆ నగరము నిండియున్నది. అభివృద్ధికి సోపానముగా సీమాంతర వాణిజ్య, వ్యాపారాలను అప్పటికే గుర్తించి ఆచరించారు. (స్వరాజ్య సముపార్జన అనే మహత్తరము తాత్కాలికము అయిన ప్రయోజనాన్ని అపేక్షించి

స్వదేశీవిధానాన్ని ఆయుధంగా ప్రయోగించారు. ఆయుధ ప్రయోగంవలన లాభనష్టాలు రెండూ ఉంటాయి, స్వాతంత్ర్యరూపమైన ప్రయోజనాన్ని పొందాము. ఇక దానిని ఉపసంహరింపకుంటే మౌలికమైన దేశ ఆర్థికవ్యవస్థ దెబ్బతింటుంది. నిరుద్యోగం పెరిగిపోతుంది. విదేశీ ప్రయాణాలు విదేశీ వస్తువినియోగాలు తప్పనిచెప్పలేదు. సాంకేతికత నాణ్యతలలో సుహృద్భావంతో కూడిన స్పర్థ మార్పిడి అపేక్షణీయమే)

వృక్షములతోడను (పర్వతః పాదపే పుంసి శాకమత్స్య ప్రభేదయోః అని మేదినీకోశం) రత్నములచే విశేషముగా చేయబడిన అలఙ్కారములతోడను ప్రకాశింపచేయబడుచున్న రాజప్రాసాదాలు కలది. అంతస్తులుగా కట్టబడిన మేడలతో నిండిన అమరావతిలా ఉంది.

ఇంకా పాచికలు ఆడు పలకలా ఉంది. అంటే నాలుగు వైపులా నాలుగు విశాలమైన మాడవీథులు. మధ్యభాగంలో సార్వభౌమగృహం (విమానం). ఈ మాడవీథులు విమానంతో అనుసంధింపబడి ఉంటాయి. ఈ సార్వభౌమ గృహం శ్రేష్ఠమైన స్త్రీగణములతోను, రత్నములతోను వ్యాప్తమై యుండునది. ఆ అయోధ్య ఇండ్లతో దట్టమైనది. పనికిరాని చోటంటూ లేనిది. మెట్టపల్లాలు లేని భూములు కలది. వరి ప్రధానమైన పంటగాకలది. చెఱకురసమువంటి త్రాగునీరుకలది. ఎల్లప్పుడు మంగలవాద్యములు మ్రోగుతూంటాయి. ఆ మాడవీథులందు వరుసగా మంత్రి పురోహితాది ప్రముఖుల గృహాలున్నాయి.

యే చ బాణైర్న విధ్యన్తి వివిక్తమపరాపరమ్।
శబ్దవేధ్యం చ వితతం లఘుహస్తా విశారదాః॥
సింహవ్యాఘ్రవరాహాణాం మత్తానాం నర్దతాం వనే।
హన్తారో నిశితైః శస్త్రైర్బలాద్బాహుబలైరపి॥ ౨౧
తాదృశానాం సహస్రైస్తామభిపూర్ణాం మహారథైః।
పురీమావాసయామాస రాజా దశరథస్తదా॥ ౨౨

ఆ అయోధ్యలో కొన్నివేలమంది మహారథులైన వీరులు ఉన్నారు. వీరు బాణప్రయోగమునందు మంచి నేర్పరులు. వీరు ఒంటరిగా ఉన్నవారిపై, ముందు వెనుకల ఎవరూ లేనివారిపై (అంటే కుటుంబానికి ఆధారమైన వానిని

కేవల శబ్దమును పట్టి కొట్టుటకు వీలైన వారిపై, పారిపోవు వారిపై బాణప్రహారం చేయరు. **అర్థస్య తదవస్థత్వం స్వభావోఽభిహితో యథా** స్వభావమంటే వస్తువుయొక్క యథార్థస్వరూపం. ఉన్నది ఉన్నట్లుగా చెప్పుట. దీనికి **స్వభావోక్తి** అని పేరు. ఈ గుణములు వారికి సహజసిద్ధములని పైశ్లోకమును **స్వభావోక్తి** చే అలఙ్కరించుటద్వారా చెప్పేరు.

ఇలా చేయటం అధర్మమని మహర్షి ఉపదేశం. కేవల శబ్దాన్ని అనుసరించి బాణప్రహారం చేసి పాపాన్ని పొందాడు దశరథుడు.

సింహవ్యాఘ్రవరాహాది క్రూరమృగాలను శస్త్రబలముచేత, బాహుబలము చేత చంపెడివారు. సాధుజంతువుల వేట నిషేధం అన్నమాట. ఇటువంటి అయోధ్యను దశరథమహారాజు రాజ్యముగా చేసుకొని పాలించేడు.

తామగ్నిమద్భిర్గుణవద్భిరావృతాం
ద్విజోత్తమైర్వేదషడఙ్గపారగైః।
సహస్రదైః సత్యరతైర్మహాత్మభి
ర్మహర్షికల్పైరృషిభిశ్చ కేవలైః॥ ౨౩

ఆ అయోధ్యలోని ద్విజులందరు ఆహితాగ్నులు గుణవంతులు వేదవేదాఙ్గ పారంగతులు. అంటే శిక్షా వ్యాకరణ ఛ్చందో నిరుక్త జ్యోతిష కల్పములను వేదాఙ్గములతోకూడిన వేదాధ్యయన సంపన్నులు. వేలకొలదిగా ఇచ్చువారు, సత్యనిరతులు మహాధీశాలులు. ఇటువంటి వారిలో కొందరు మహర్షికల్పులు అయితే, కొందరు సాక్షాత్తు మహర్షులే. ఇట్టివారిచే నిండిన అయోధ్యను దశరథుడు పాలిస్తున్నాడు.

తామగ్నిమద్భిర్గుణవద్భిరావృతాం ఈపాదంలో **జతజర**కు బదులు **తతజర** అను గణములనుంచి ఇన్ద్రవంశవృత్తంగా చూపేరు. దశరథుని ఆనువంశికమైన ఇన్ద్రసమమైన ఐశ్వర్యముకలవానిగా చెప్తూనే, ఈ దశరథుడు ఇన్ద్రవంశము వంటి వంశముకలవాడని చూపెడుతున్నారు. దేవతలు నిస్సంతులు. వారికి ఔరసులు లేరు. ఇదిగో ఇక్కడ దశరథుడు అలాగే ఉన్నాడని సూచనచేస్తున్నారు. **ద్విజోత్తమైర్వేదషడఙ్గపారగైః 'జతజర'** గణాలకు బదులు జగణాభావం

చేసి **యతజర** గణాలతో ఉపజాతిని చేసారు. **'సదాశివః స్థిరా శూలీ జయన్తశ్చతురాననః। జనకో జయజో వామ-మణి బన్ధగతో జకః'** అని రుద్రయామళతన్త్రోక్త వర్ణనిఘంటువు. మేదినీకరుడు ఇత్యాదిగాగల నైఘంటికులు అందరు **'జ'** అను ఏకాక్షరానికి తండ్రి అనే అర్థం చెప్పేరు. సర్వాంగసుందరమైన నగరం, మందిమార్బలం ఇలా! ఇన్ద్రవైభవమంతా ఉంది. తండ్రినని అనిపించుకోలేక పోయాననే దుఃఖంకూడా ఉంది. దశరథుడు ఆ దుఃఖాన్ని బహిర్గతం చేయట్లేదు. ఆయన మనస్సులోనే ఉంది ఆ బాధ. కనుకనే మహర్షికూడా గణాలను చాటుగాచేసి ఆ మహారాజుయొక్క దుఃఖాన్ని చూపారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చమస్సర్గ సమాప్తము.

-

॥అథ షష్ఠః సర్గః॥

(దశరథుని పరిపాలనా కాలంలో అయోధ్యా ప్రజల స్థితిగతుల వర్ణన)

తస్యాం పుర్యామయోధ్యాయాం వేదవిత్సర్వసఙ్గ్రహః।
దీర్ఘదర్శీ మహాతేజాః పౌరజానపద ప్రియః॥ ౧
ఇక్ష్వాకూణామతిరథో యజ్వా ధర్మరతో వశీ।
మహర్షికల్పో రాజర్షి స్త్రిషులోకేషు విశ్రుతః॥ ౨
బలవాన్నిహతామిత్రో మిత్రవాన్విజితేన్ద్రియః।
ధనైశ్చ సఙ్గ్రహైశ్చాన్యైః శక్రవైశ్రవణోపమః॥ ౩
యథా మనుర్మహాతేజా లోకస్య పరిరక్షితా।
తథా దశరథో రాజా వసన్ జగదపాలయత్॥ ౪

వేదము తెలిసినవాడు. సర్వులను దానాదులచే వశమందు ఉంచుకొను వాడు. **దీర్ఘదర్శీ** అంటే ముందుచూపు కలవాడు. గొప్పపరాక్రమము కలవాడు. నగరవాసులకు గ్రామీణులకుకూడ ఇష్టుడు. ఇక్ష్వాకులలో అతిరథుడు. యజ్ఞములు చేసినవాడు, ధర్మమందు ఆసక్తి కలవాడు. **వశీ** అంటే జనులను (ఇన్ద్రియములను) అదుపులో ఉంచగలిగినవాడు.

మహర్షితుల్యుడు, రాజర్షి. ముల్లోకములందు ప్రసిద్ధుడు, బలవంతుడు. – రాజుయొక్క బలము అతని సైన్యమును, సంపదను బట్టి నిర్ణయించాలి. కనుక అంగ అర్ధ బలములు సమృద్ధిగా కలవాడని. శస్త్రాస్త్ర శిక్షాలబ్ధ భుజబలమూ కలవాడు. చంపబడిన శత్రువులు కలవాడు, మంచిమిత్రులు కలవాడు. ధనముచేతను, కూడబెట్టబడిన ఇతర వస్తువులచేతను ఇన్ద్ర కుబేరులతో సమానుడై; ఏవిధంగా మనువు లోకములను రక్షించాడో, ఆవిధంగా దశరథమహారాజు అయోధ్యయందు నివసిస్తూ జగత్తును పాలిస్తున్నాడు. సత్యమునందు పట్టుదలకలవాడు.

సత్యమంటే ఏది చెప్పాడో అదే చేయటం; ఏది చేసేడో అదే చెప్పటం. కాయిక వాచక కర్మలమధ్య సమన్వయం కలవాడు. ధర్మమును అనుసరించు అర్థకామములు కలవాడైన దశరథుడు ఆ అయోధ్యను ఇన్ద్రునిచే అమరావతి వలే పాలించెను.

అమరావతి అంటే మృత్యువులేని నగరం. దానివలే ఉంది. అంటే అకాలమరణం లేకుండా శతాధికమైన ఆయుర్దాయంకలవారుగా ఉన్నారని. అయోధ్యలోని ప్రజలు సంతోషముకలవారు. ధర్మాత్ములు బాగుగా చదువుకున్న వారు, ఉన్నదానితో తృప్తిచెందువారు. దురాశలేనివారు, సత్యవాదులు.
ఇంకా అయోధ్యలో కొద్దిగా సంపాదించినవాడెవడు లేడు. **'కశ్చిత్ అసిద్ధార్థః నాసీత్'** అంటున్నారు. ధర్మార్థ కామములు సిద్ధించనివాడు ఒక్కడూ లేడు. అయోధ్యలో అందరూ బాగా కూడబెట్టిన ధనంకలవారే అనటంచేత ఎలా వీళ్లైతే అలా సంపాదించారు అనుకుంటావేమో! అలాకాదు. వారి అర్థకామాలు ధర్మాన్ని అనుసరించే ఉన్నాయి. వారు **ధర్మాత్మనో బహుశ్రుతాః** అని ముందు చెప్పేరు. మరి పురుషార్థములు నాలుగు కదా! మరి నాల్గవదాన్ని ఎందుకు చెప్పలేదు? అంటే **త్రివర్గ మనుతిష్ఠతా** అని దశరథుని విషయంలో చెప్పారు మహర్షి. **యథారాజా తథా ప్రజా** గృహస్థు విషయంలో అర్థకామాలు ధర్మము ఇవే ప్రధానం. గృహస్థుకూడా మోక్షేచ్ఛ కలవాడైయుండాలి. ఇచ్ఛారూపమైన మోక్షం కామనలో అంతర్భాగమైంది కనుక ప్రయత్నం త్రివర్గలకొరకే. గృహస్థు విషయంలో మోక్షం ఆనుషఙ్గికం. ధర్మార్థకామములే ప్రధానం. బ్రహ్మచారి వానప్రస్థ సన్న్యాసుల విషయంలో మోక్షం ముఖ్యం. మిగిలినవి గౌణం (జీవయాత్రార్థం).
ధర్మార్థకామ మోక్షాలని చెప్తాం. లెక్కించవలసి వస్తే 'అంకానాం వామతో గతిః' మొదటిదే మోక్షం. అర్థకామాలు ధర్మ-మోక్షములమధ్యవి. సాఙ్గవేదాధ్యయనం చేసిన వటువు వేదములయొక్క నిశ్చయార్థకమైన మోక్షమునందు దృష్టికలవాడయ్యానా; అట్టివానికి మోక్షం ముఖ్యపురుషార్థం మిగిలినవి గౌణము. మోక్షేచ్ఛనుకూడా విడిచిపెట్టవలసిన వాటిలో చెప్పటం చేత; ముఖ్యపురుషార్థమైనప్పటికీ, మోక్షేచ్ఛ విడిచిపెట్టవలసిన వాటిలో మొదటిదైతే ఇక మిగిలిన పురుషార్థముల విషయం స్పష్టం.
ప్రధానం ఆచరింపబడుచున్నప్పుడు గౌణఫలములు అనాయాసంగా వస్తూంటాయి. ప్రధానమే పరిత్యాజ్యమైనప్పుడు గౌణప్రసక్తి ఉండదు.
మోక్షం ఎప్పుడు ఇచ్ఛారూపంగా ఉండదు. ఉంటే...

అది కామమునందు అంతర్భాగమైపోతుంది. సాఙ్గవేదాధ్యయనము చేసాకకూడా వటువు సంసారాభిముఖుడైతే గార్హస్థ్యధర్మంగా త్రివర్గములకే ప్రాధాన్యం. మోక్షం అపేక్షింపకపోయినా సిద్ధించే ముఖ్యపుషార్థ మవుతుంది.

కుటుమ్బీ యో హ్యసిద్ధార్థో౽గవాశ్వ ధనధాన్యవాన్

ఆవులు ఎద్దులు గుఱ్ఱాలు ధనధాన్యాలు లేని కుటుంబి లేదు.

కుటుంబం కలవాడంటే...దశవిధ పోష్యవర్గం కలవాడని.

మాతాపితా స్నుషా పుత్రౌపుత్రీ పత్న్యతిథి స్స్వయం।

దశ సంఖ్య కుటుంబీతి విష్ణునోక్తం ద్విజోత్తమ॥

తాను, భార్య, తన తల్లిదండ్రులు, కుమారులు, కోడళ్ళు, కుమార్తె, అతిథి ఇలా మొత్తం పదిమంది.

కాముకుడుగాని లోభికాని ఈ లోభంచే కుటుంబసభ్యులను పీడించువాడు కాని ఆ అయోధ్యలో ఎక్కడా చూచుటకు కూడా కనబడరు. నాస్తికుడు అంటే వేదమును నిందించువాడు. వైదికవ్యవస్థయందు విశ్వాసము లేనివాడు కనబడడు.

సర్వే నరాశ్చ నార్యశ్చ ధర్మశీలాః సుసంయతాః

అయోధ్యలోని స్త్రీ పురుషులు అందరూ ధర్మస్వభావంకలవారు. అంటే వాపీకూపతటాకారామాది నిర్మాణశీలురు. మంచి ఇన్ద్రియనిగ్రహంకలవారు. మంచి స్వభావముతోడను నడవడికతోడను అభివృద్ధిని పొందువారు. మహర్షులవలే అమలమైనవారు.

నాకుణ్డలీ నామకుటీ నాస్రగ్వీ నాల్పభోగవాన్।
నామృష్టో నానులిప్తాఙ్గో నాసుగన్ధశ్చ విద్యతే॥
నామృష్టభోజీ నాదాతా నాప్యనఙ్గదనిష్కధృక్।
నాహస్తాభరణో నాపి దృశ్యతే నాప్యనాత్మవాన్॥
నానాహితాగ్నిర్నాయజ్వా న క్షుద్రో వా న తస్కరః।
కశ్చిదాసీదయోధ్యాయాం న చ నిర్వృత్తసఙ్కరః॥

ఆ అయోధ్యలో కర్ణాభరణాలు లేనివాడు, శిరోభూషణం లేనివాడు,

పుష్పమాలలు ధరించనివాడు, అల్పమైన భోగములుకలవాడు, అభ్యఙ్గనము చేయనివాడు, పైపూత లేనివాడు, సుగన్ధము లేనివాడు ఒక్కడూ కనబడడు. అమృష్టభోజియైనవాడు అంటే కడుపునిండనివాడు లేడు. దాతకానివాడు లేడు. బాహువులకు ఊరువులకు కంఠమునకు భూషణములు లేనివారు లేరు. హస్తాభరణములు లేనివారు లేరు. జితేన్ద్రియులు కానివాడు లేరు. పూర్వం **ధనైశ్చ సఙ్గహైశ్చాన్యైః శక్రవైశ్రవణోపమః** అని చెప్పారు.
ఈ ఇంద్రవైభవ ప్రాప్తిహేతువులుగా పైవాటిని చెప్పారు.
ఈ పై అలంకారములు సంపదర్థమైనవి మరియు సౌభాగ్య ప్రదమైనవీను.

నానాహితాగ్నిర్నాయజ్వా న క్షుద్రో వా న తస్కరః।
కశ్చిదాసీదయోధ్యాయాం న చ నిర్వృత్తసంకరః॥ ౧౨

అయోధ్యయందు ఆహితాగ్ని కానివాడు లేడు. **ఆధానేన సంపాదితో అగ్నిః ఆహితాగ్నిః** (ఆధానకర్మద్వారా సంపాదిత అగ్ని త్రయంకలవాడు) ఆధానకర్మ ద్వారా సంపాదితుడైన అగ్నిత్రయం కలవాడని అర్థం. యజ్ఞం చేయుటకు అగ్నిసిధ్యర్థం చేయుకర్మ ఆధానం. యజ్ఞార్హతను సంపాదించి పెట్టేది ఆధానకర్మ. సిద్ధమైన అగ్ని ఉంటే దాన్ని ఏంచెయ్యాలి అనే అపేక్ష దానికి ఉంది కాబట్టి, అపేక్షితమైన అగ్నులకు ఈ సోమాయాగ, వాజపేయాదుల యందు వినియోగం. అంతక్రితం ఔపాసనాగ్ని సిద్ధమైయుంది. ఈ ఔపాసనాగ్నికే గృహ్యాగ్ని, స్మార్తాగ్ని అని పేరు. గృహస్థుడు కాబట్టి. ఈ అవిచ్ఛిన్నమైన ఔపాసనకర్మ ద్వారా ఆధానకర్మకు అధికారియై తద్వారా అగ్నిత్రయాన్ని సిద్ధింపజేసుకొని వాటిద్వారానే సర్వకర్మలను చేయాలి. ఈ అగ్నికే శ్రౌతాగ్ని లేదా త్రేతాగ్ని అని పేరు. త్రేతాగ్ని అంటే మూడుఅగ్నులు. ఆవహనీయము, గార్హపత్యము, దక్షిణాగ్ని అనునవి మూడు. **అగ్నిన్ ఆధాస్యమానః ,,, యేనాస్యా కుశలగ్ం స్యాత్తేన కుశలం కుర్వీత। యాన్యు ఉత్తిత కాలాని స్యుస్తాని వ్యావహరేత్। అనుజ్ఞాపయీతవా।** ఈ బోధాయనసూత్రంచే ఆహితాగ్ని ఎవరితోను వైషమ్యములుకాని, ఎవరివద్దను ఋణములుకాని ఉన్నవాడుకాడు అనునది స్పష్టం. అరణులను మథించగా వచ్చిన అగ్నులను పూర్తిగా గార్హపత్యకుండములో వేయాలి. ఇది **గార్హపత్యాధానము.**

ఈ అగ్నినుండి ఒక అంశతీసుకొని దక్షిణాగ్నికుండములో స్థాపించాలి. దీనికి **దక్షిణాగ్న్యాధానము** అని పేరు. సూర్యుడు సగము ఉదయించిన పిదప గార్హపత్య కుండమునుండి అగ్నిని తీసూకొని ఆవహనీయకుండములో వేయుటను **ఆవహనీయాధానము** అంటారు. ఈ విధంగా త్రేతాగ్నులు సిద్ధిస్తాయి. ఇలా సిద్ధించిన అగ్నులను కాపాడుకుంటూ ప్రతిపౌర్ణమి, అమావాస్యలలో ఇష్టులను చేయాలి. అగ్నిప్రణయనం చేయాలంటేమాత్రం గార్హపత్యంనుండి ప్రణయనం చేస్తూ, సర్వము ఆవహనీయాగ్నిద్వారా చేస్తాడు. అగ్నిని స్వీకరింపని గృహస్థుని **వృథాపాకి** అంటారు. ఇటువంటి వారింట భోజనాదులు చేయరాదని స్మృతులు అంటున్నాయి. అయోధ్యలోని ఈ అగ్న్యాహితులు అందరూ యజ్ఞము చేసినవారే. యజ్ఞము చేయనివాడు లేడు. **నక్షుద్రః** అవైదికమైనకర్మలను ఆచరించువాడు వాడులేడు. చోరుడులేడు. **నిర్వృత్త సఙ్కరః** వృత్తి సాంకర్యం చేసినవాడు ఒక్కడునూ లేడు. ఏ వర్ణమునకు తగిన వృత్తిని వారు యథేచ్ఛగా చేనుకొంటూ తగువిధంగా గౌరవింపబడుచున్న వారుగానే ఉన్నారు.

స్వకర్మనిరతా నిత్యం బ్రాహ్మణా విజితేన్ద్రియాః।
దానాధ్యయనశీలాశ్చ సంయతాశ్చ పరిగ్రహే॥ ౧౩

బ్రాహ్మణులు నిత్యము తమతమ కర్మలయందు ఆసక్తికలవారై జయింప బడిన ఇన్ద్రియములు కలవారై **దాన అధ్యయనశీలాః** దానముచేయుట అధ్యయనముచేయుట వారిస్వభావం, దానము పట్టుటయందు నియమము కలవారు. **సంయతాశ్చ పరిగ్రహే** పరిగ్రహ శబ్దమునకు భార్య అని అర్థం. స్వభార్యయందూ నియమము కలవారు.

బ్రాహ్మణులు సత్త్వగుణ ప్రధానులు. మనోనిగ్రహము, బాహ్యేన్ద్రియ నిగ్రహము, తపస్సు, విజ్ఞానము ఇవి బ్రాహ్మణులు కలిగియుండవలసినవి. స్నానము (సఙ్కల్ప సహితముగా), సంధ్యావందనము, జపము, హోమము, బ్రహ్మయజ్ఞము, తర్పణము, దేవతాపూజనము, వైశ్వదేవము **'వైశ్వదేవం ద్విజైః కార్యం అన్నశుద్ధ్యర్థమాదరాత్'** అన్న శుద్ధికి ద్విజులు వైశ్వదేవమును ఆచరింపవలెను, దీనివలన పంచసూనమను పాపముతొలగి ఆత్మసంస్కారం

కలుగును. ఔపాసనాగ్నియందు షడాహుతి హెూమము చేయుట, భూమిపై బలులను ఉంచుట ఇందలి ముఖ్యమైన క్రియ. ప్రతిగృహస్థు పాపహేతువులగు ఐదు హింసా క్రియలను చేస్తాడు, అవి ఖండినీ (కూరలు కోయుట), పేషిణీ (రుబ్బుట, విసురుట), చుల్లీ (పొయ్యి), ఉదకుంభీ (నీటి కడవ), మార్జనీ (ఊడ్చుట) అలుకుట మొదలైనవి. ఈ పనులు చేయునప్పుడు చాలా క్రిములు మనకు తెలిసీ తెలియక నశించిపోతూంటాయి. ఈ పంచసూనము బంధహేతు వగుచున్నది. ఈ పాపనివారణార్థము వైశ్వదేవాన్ని పంచమహాయజ్ఞములతో సహా చేయవలెను. పంచమహాయజ్ఞాలంటే బ్రహ్మయజ్ఞం దేవయజ్ఞం భూతయజ్ఞం పితృయజ్ఞం మనుష్యయజ్ఞం అనునవి. ఆతిథ్యము భోజనవిధి దానము అనునవికూడా బ్రాహ్మణునకు నిత్యకర్మలు.

దానంకూడా నిత్యకర్మయే. ఎవరికి దానం చెయ్యాలి? అంటే **దాతవ్యం ప్రత్యహం పాత్రే స్వస్థః శక్త్యనుసారతః** అని యోగ్యునికి దానం చేయాలని చెప్పారు. ఎంతదానం చేయాలంటే దీనికి నియమమేదీలేదు. తాను దరిద్రుడైయున్నప్పటికీకూడా తనకు లభించిన దాంట్లో గ్రాసార్థమైనా (పిడికిట సగము) దానము చేయాలని చెప్తున్నారు. ఏ రోజైనా దానం చేయకపోతే? **ఏకస్మిన్నప్యతి క్రాంతే దినే దాన వివర్జితే। దస్యుభిర్మూషితస్యేవ యుక్తమాక్రందితుం భృశమ్॥** దొంగలు పడి ఉన్నదంతా దోచుకొని పోతే ఎంత దుఃఖమో, అంత దుఃఖాన్ని అనుభవించాలని భారతం అంటోంది. ఏది దానం చేస్తారు? ఏది దానం చేయాలి? **దేవతానాం గురూణాం చ మాతాపిత్రో స్తథైవ చ। పుణ్యం దేయం ప్రయత్నేన నాపుణ్యం నోదితం క్వచిత్॥** పుణ్యమునుకూడా దానంచేయవచ్చు. అని చెప్పుటచే ధన కనక వస్తు వాహనాదులనేకాదు; అపూర్వమునుకూడా దానం చేయవచ్చు. అపూర్వమంటే పుణ్య పాప జ్ఞానాదులు. వీరు **దానాధ్యయనశీలురు** కనుక వారిచే ఏది అధ్యయనము చేయబడిందో! అది దానం చేస్తారు. అంటే జ్ఞానమును దానము చేయువారుగా ఉన్నారు. ఇది బ్రాహ్మణులకు సహజగుణం. బంధుప్రీతి, స్వార్థం, ప్రతిఫలాపేక్ష లేకుండా తాను నేర్చుకొన్నది పదిమందికీ పాఠం చెప్పటం. ఇది బ్రాహ్మణ ధర్మం. వీరు నిత్యము వీరికర్మలందు ఆసక్తి గలవారు.

దశరథుని రాజ్యపాలన సమయంలో నాస్తికుడు లేదు. అసత్యవాది లేదు. షట్ఛాస్త్ర అధ్యయనంచేయనివాడు లేదు. అసూయకలవాడు లేదు. అసమర్థుడు అజ్ఞాని లేదు. షడంగవేత్త "శిక్షా వ్యాకరణ ఛ్చందో నిరుక్త జ్యోతిష కల్పము అనునవి షడంగాలు" ఇవి తెలియనివాడు లేదు. **'అవ్రతః'** వ్రతమంటే అవశ్యము విధిగా అనుష్ఠింపవలసిన కర్మ. విధ్యుక్తమైన కర్మలను ఆచరించని వాడు లేదు. శాస్త్రవిహితమైన ఆహారనియమమును ఆచరించనివాడు లేదు. వేలకొలదిగా దానము చేయనివాడు లేదు. దీనుడు, కలతచెందిన చిత్తముకల వాడు బాధలు అనుభవిస్తున్నవాడు ఒక్కడూ లేదు.

అయోధ్యలో ఐశ్వర్యము సౌన్దర్యము రాజభక్తిలేని పురుషుడుకాని, స్త్రీకాని వెదకినా కనబడరు.

అయోధ్యలో బ్రాహ్మణాదిగా నాల్గువర్ణములకు చెందిన పురుషులు అందరూ దేవతాతిథిపూజ చేయువారు, కృతజ్ఞులు ఉదారులు శూరులు పరాక్రమవంతులు దీర్ఘాయుర్దాయం కలవారు. భార్యాపుత్రపౌత్రాదులతో కలిసి ఆనందించెడివారు.

క్షత్రం బ్రహ్మముఖం చాసీద్వైశ్యాః క్షత్రమనువ్రతాః।
శూద్రాః స్వధర్మనిరతా స్త్రీన్ వర్ణానుపచారిణః॥ ౧౯

క్షత్రియులకు బ్రాహ్మణులు ముఖముగా ఉండెను. వైశ్యులు క్షత్రియులను అనుసరించువారుగా ఉన్నారు. శూద్రులు మూడువర్ణములను ఉపచరించువారు. వీరందరు తమతమ ధర్మములందు ఆసక్తులైయుండిరి.

లోకహితైషులు బ్రహ్మవేత్తలు విజ్ఞానవేత్తలు అయిన వారు క్షత్రియులకు ముఖస్థానీయులైయున్నారు. కావున రాజ్యకాంక్ష, ధనకాంక్ష, కీర్తికాంక్ష లేని ప్రజల హితంకొరకైన వారు ప్రజాపాలకులుగా ఉన్నారు. ఈ బ్రాహ్మణులు దేశభద్రతకు అభ్యున్నతికీ తగిన శాస్త్ర సాంకేతికతను అందించువారు. దానిని ఆచరణలోనికి తీసుకొనిరావడం క్షత్రియుని పని. దానికి తగిన ఆర్థికవ్యవస్థను ఏర్పాటు చేయటం వైశ్యుని పని. ఆ శాస్త్ర సాంకేతికతకు, ఆకృతికి తగిన యంత్రాలను ఆయుధాలను తయారుచేయటం కర్మచారుల (శూద్రుల) పని. ఈ కర్మచారులు పై మూడు విభాగాలలోను ఉంటారు. వీరు ఆయా విభాగాలలోని సాంకేతిక నిపుణులకు సహాయకులుగా ఉంటూ, నిపుణుల

ఆలోచనలకు ఒక దర్శనీయమైన ఆకృతిని తీసుకువచ్చే వారుగా ఉంటారు. వీరికి ఆలోచనతో పనిలేదు. శారీరక దార్ఢ్యముకలిగి బండస్వాధ్యాయిలా ఉంటాడు. వీరందరు ఒకరియందు ఒకరు ఆదరాభిమానాలు కలవారుగా ఉన్నారు.

సాక్షాత్తు మనువు ఎలా పరిపాలించాడో, దశరథుడు అలాగే పాలిస్తున్నాడు. ఆ అయోధ్య అగ్నితుల్యులు పౌరుషవంతులు అభ్యసింపబడిన విద్యలు (యుద్ధాది) కలవారు ఆ విద్యలలో మంచినేర్పు ప్రతిభాపాటవములు ప్రదర్శించు వారు, అయిన యోధులతో సింహాలతో నిండిన పర్వతగుహలా ఉంది.

కాంభోజ(Tajikstan), బాహ్లిక (Bactria), వనాయు (Persia), సింధు (Pakistan) దేశములలో పుట్టిన మేలుజాతి అశ్వాలతో నిండియుంది. వింధ్యపర్వతమున పుట్టిన మత్తగజములతోను అతిబలమైన పర్వతాకారముగల హిమవత్పర్వతమున పుట్టిన మదించిన ఏనుగుల చేతను, ఐరావతకులమందు పుట్టిన ఏనుగులచేతను, **మహాపద్మకులైః** పుండరీకమను దిగ్గజకులమందు పుట్టిన ఏనుగులచేతను, **అఞ్జనాత్** వరుణ దిగ్గజమైన అంజనమను ఏనుగుకులమందు పుట్టిన ఏనుగులచేతను, **వామనా**దపి యమదిగ్గజమైన వామనమను ఏనుగుకులమందు పుట్టిన ఏనుగులచేతను అయోధ్య నిండియుండెను. అంటే ఆయా దిక్కులనుండి మేలుజాతి గజములను తీసుకొని వచ్చి, వాటిని సంకరణముద్వారా బలిష్ఠమైన శ్రేష్ఠమైన గజజాతులను సృష్టించువారు. అయోధ్య భద్రజాతీయములు, మంద్రజాతీయములు, మృగజాతీయములు, భద్రమంద్రమృగ జాతీయములు, భద్రమృగ జాతీయములు, భద్రమంద్రజాతీయములు, మృగమంద్రజాతీయములను బలిష్ఠమైన పర్వతాకారముగల సంకరజాతుల ఏనుగులచే నిండి యుండెను. బలిష్ఠమైన ఆరోగ్యవంతమైన జాతుల ఉత్పత్తికి సంకరీకరణవిధానాన్ని ఆలోచించి ఆచరించిన సాంకేతికపరముగా అత్యంత అభివృద్ధిచెందిన ప్రాంతంగా అయోధ్య ఉండేది.

సాయోజనే చ ద్వే భూయః సత్యనామా ప్రకాశతే।
యస్యాం దశరథో రాజా వసన్ రాజ్యమపాలయత్॥

దశరథమహారాజు ఎక్కడ నివసించుచు రాజ్యమును **అపాలయత్** పాలించెనో!

ఆ అయోధ్య సరిహద్దుల ఆవల రెండుయోజనముల వరకు శత్రుదుర్భేధ్యమై ఎదిరింపశక్యముకానిదై సార్థకనామము కలదిగాఉంది.

అపాలయత్ అనునది **పా**(రక్షణే) అను **ణిజన్త** ధాతురూపం. అనద్యతన లఙ్.

శశాస శమితామిత్రో నక్షత్రాణీవ చన్ద్రమాః॥ ౨౭

తేజశ్శాలి పూజ్యుడు అయిన దశరథుడు **శమితామిత్రుడు** అనగా శాన్తించిన శత్రువులు కలవాడై, శాన్తించిన అరిషడ్వర్గము కలవాడై అని; ఆ పురమును చన్ద్రుడు నక్షత్రములను పాలించినట్లు పాలించెను.

తాం సత్యనామాం దృఢతోరణార్గలాం గృహైర్విచిత్రైరుపశోభితాం శివామ్ పురీమయోధ్యాం నృపసహస్రసంకులాం శశాస వై శక్రసమో మహీపతిః॥

శక్రసముడైన ఆ మహీపతి దృఢమైన, గడియలతోకూడిన ముఖద్వారములు కలది, విచిత్రమైన గృహములచే ప్రకాశింపచేయబడినది, మఙ్గలకరమైనది, వేలాది జనులచే నిండియున్నది, యదార్థమైన పేరుకలది అయిన అయోధ్యను శాసించెను.

ఇక్కడ **శాస్ - అనుశిష్టౌ** శాసించుట, అను ధాతువు సకర్మక పరస్మైపదీ ప్రయోగం. **శశాస** అనునది పరోక్షానద్యతన లిట్. కావున ఇది చాలాకాలం క్రితం అంటే తన దృష్టికి అందనంత దూరంలో జరిగిన విషయం. అంటే తన జీవితకాలంలో తను ప్రత్యక్షంగా చూడనిది.

యస్యాం దశరథో రాజా వసన్ రాజ్యమపాలయత్

అపాలయత్ అన్న లఙ్ ప్రయోగం అనద్యతన భూతకాలిక ప్రయోగమగుటచే ఇదీ దూరపుభూతకాలమైనా తనకు ప్రత్యక్షం. ఈ గతం తన అనుభవంలోనిది. ఇక్కడ వాల్మీకిమహర్షి దశరథునియొక్క పరిపాలననుగూర్చి తనకు అనుభవమున ఉన్నదానినీ, యోగమార్గానుసారియై వరప్రభావముచే చరిత్రగతమైన విషయములను దర్శించి చెప్తున్నారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **షష్ఠస్సర్గ** సమాప్తము.

॥అథ సప్తమ సర్గః॥

తస్యామాత్యా గుణైరాసన్నిక్ష్వాకోస్తు మహాత్మనః।
మన్త్రజ్ఞాశ్చేఙ్గితజ్ఞాశ్చ నిత్యం ప్రియహితే రతాః॥ ౧

మహాత్ముడు ఇక్ష్వాకువంశస్థుడైన దశరథునకు గుణములచే మన్త్రాంగమునందు సమర్థులును పరులభావాలను వారి రూపవికారముల పట్టి తెలుసుకోగలవారు ఎల్లప్పుడు **ప్రియహితేరతాః** ప్రభువునకు ఇష్టము లాభకరమైన కార్యములందు ఆసక్తికలవారును అగు అమాత్యులు (ఆసన్) ఉండిరి.

అష్టౌ బభూవుర్వీరస్య తస్యామాత్యా యశస్వినః।
శుచయశ్చానురక్తాశ్చ రాజకృత్యేషు నిత్యశః। ౨

వీరుడు యశస్వి అయిన దశరథునకు **శుచయః** పరిశుద్ధులు అంటే మనసా వాచా కర్మణా పరిశుద్ధులు. రాజదండనకు పాత్రమగు కర్మాచరణమును ఎన్నడు చేయకపోవుట–పరిశుద్ధత. ఈ శుద్ధత నిత్యంగా కలవారు.

సాధారణంగా అధికారియొక్క ప్రత్యక్షంలో అందరూ శుద్ధంగానే ఉంటారు. వీరు అపరోక్షంలోకూడా శుద్ధంగానే ఉంటారు. వీరి మనస్సులో ఉంటాడు రాజు. రాజదండనకు పాత్రమగు కర్మాచరణము చేస్తే, తెలిస్తే శిక్షిస్తాడున్న భయం ఉంటుంది వీరికి.

రాజుయొక్క పరోక్షంలో రాజభయం లేదా అధికారిభయం ఉండదు. ఇక్కడే జనుల స్వభావాలు తెలుస్తాయి.

ఈ ధశరథుని మంత్రులు ఈ మూడు సందర్భములలోను ఏకరూపంగానే ఉంటారు. అందుకని నిత్యశుద్ధులు. రాచకార్యములయందు ఎల్లప్పుడు ఆసక్తి కలవారు. ప్రభువుకొరకైన కార్యములను చేయుటయందే ఆనందం కలవారు. ఇటువంటి ఎనమండుగురు అమాత్యులు ఉండిరి (బభూవుః). ఈ అమాత్యష్టకం ఇప్పుడు లేకపోవచ్చుగాక! వీరు తాను ఎరిగిన గతం లోనివారే, ఆ గతంకూడా తన అనుభవంలోనిది.

తస్యామాత్యా గుణైరాసన్నిక్ష్వాకోస్తు మహాత్మనః ఇక్కడ **ఆసన్** అని క్రియాపదం వేసారు. **అస్ – భువి** ధాతువు. అకర్మక పరస్మైపదీ అనద్యతన లఙ్, **“ఆసీత్ – ఆస్తామ్ – ఆసన్”** అని రూపం. ఇది అనద్యతన భూతం,

పరోక్షంకాదు. చాలాకాలం క్రితం ఈ దశరథునకు ఎనమండుగురు మంత్రులు ఉండేవారు. నేను ఎరుగుదును. అనుకున్నారు. అనుకొని... వారినిగూర్చిన సర్వవిషయాలను ధ్యానంలో అవలోకనం చేస్తున్నారు. **అష్టౌ బభూవుర్వీరస్య** కనుకనే భూధాతువునకు భూతఅనద్యతన పరోక్షరూప మైన లిట్, **బభూవుః** (ఉండిరి)అని ప్రయోగించారు. (బభూవ-బభూవతుః-బభూవుః)

ధృష్టిర్జయన్తో విజయః సిద్ధార్థోహ్యర్థ సాధకః।
అశోకో మన్త్రపాలశ్చ సుమన్త్రశ్చాష్టమోఽభవత్।।

ధృష్టి, జయన్తుడు, విజయుడు, సిద్ధార్థుడు, అర్థసాధకుడు, అశోకుడు, మన్త్రపాలుడు అనువారు ఏడుగురు, వారితోపాటు సుమన్త్రుడు ఎనిమిదవ మంత్రిగా ఉండెను (అభవత్). ఈ **అభవత్** భూధాతువుయొక్క అనద్యతన భూతం లఙ్ రూపం. దీనిచే ఇది నా అనుభవం అని చెప్తున్నారు. ఎందుకంటే ముందర ఈ సుమంత్రుణ్ణి సూతుడని చెప్పారు. సూతుడైనప్పటికీ ముఖ్యామాత్య పదవిలోనికి గ్రహింపబడ్డాడు. మహారాజునకు అత్యంత ఆంతరంగికుడుగా పరిగణింపబడ్డాడు. ఇది చెప్పటానికే చకారము వేసి సుమంత్రుని ప్రత్యేకతను ప్రత్యేకంగా చూపెట్టారు.

దశరథునకు వశిష్ఠుడు, వామదేవుడు అను ఇద్దరు ఋషిశ్రేష్ఠులు ఇష్టులైన ఋత్విక్కులుగా ఉన్నారు. ఈ ఎనిమిదిమంది మంత్రులుకాక మరికొంత మంది మంత్రులుకూడా ఉన్నారు.

విద్యావినీతా హ్రీమన్తః కుశలా నియతేన్ద్రియాః।
శ్రీమన్తశ్చ మహాత్మానః శాస్త్రజ్ఞా దృఢవిక్రమాః।।
కీర్తిమన్తః ప్రణిహితా యథావచనకారిణః।
తేజఃక్షమాయశఃప్రాప్తాః స్మితపూర్వాభిభాషిణః।।

వీరందరు విద్యా వినయ సంపన్నులు. హ్రీమంతులు అంటే శాస్త్రవిరుద్ధ కర్మాచరణకు సిగ్గుపడువారు. మంచి నేర్పుకలవారు. ఇంద్రియనిగ్రహం కలవారు. ఐశ్వర్యవంతులు, విశాలమైన మనస్సుకలవారు. శాస్త్రజ్ఞులు. వెన్నుచూపని పరాక్రమంకలవారు. కీర్తికలవారు అంటే యుద్ధంలో వెనుదిరగని తత్త్వంచేత మరణానంతర జీవితం కలవారని. ప్రశాన్తచిత్తులు.

"యథావచన కారిణః" ఏలా ఆజ్ఞాపింపబడ్డారో ఆవిధంగానే చేయువారు. తేజస్సును, ఓర్పును పొందినవారు. **యశః** బుద్ధికుశలతచేత దిక్కులవరకు వ్యాపించినవారు. తామే ముందుగా నవ్వుతూ పలుకరించు స్వభావం కలవారు.

క్రోధాత్కామార్థహేతోర్వా నబ్రూయురనృతం వచః॥

కోపంవలనకాని, అర్థకామములకొరకుగాని సత్యదూరమైన వాక్కులను పలుకరు.

వీరు స్వవర్గమునకు పరవర్గమునకు సంబంధించిన అంటే తమ రాజ్యమునకు సంబంధించిన, సరిహద్దురాజ్యములకు సంబంధించిన కాలత్రయమందలి సర్వవిషయాలను గూఢచారులద్వారా తెలిసికొనువారు. ఆ మంత్రులు వ్యవహారములందు సమర్థులు. వీరి స్నేహితుల విషయమున రాజుచే పరీక్షింపబడినవారు. దండనార్హమైన సందర్భంలో ఔరసులను కూడా దండించేవారు. ఆ మంత్రులు రాజ్య ధనాగారమును నింపుటయందు, దేశరక్షణకైన సైన్యమును సమకూర్చుటయందు శ్రద్ధ చూపెడివారు. శత్రువైనను నిరపరాధియైన బాధించరు. ఈ మంత్రివర్గము వీరులు, నిత్యనూతనోత్సాహవంతులు. రాజశాస్త్రమును అనుష్ఠించువారు. గృహస్థులకు సత్పురుషులకు ఆపదలురాకుండా నిత్యము కాపాడెడివారు. ఆ మంత్రులు బ్రాహ్మణ క్షత్రియులకు బాధకలుగకుండ చూచుచూ కోశమును నింపేవారు. పురుషునియొక్క అపరాధతీవ్రతను చూచి అతితీక్ష్ణమైన దండమును విధించేవారు. పరిశుద్ధులైన ఆ మంత్రులందరు ఐకమత్యంతో రాజకార్యములను విచారించుచుండగా నగరమందుకాని, రాజ్యమందు కాని అసత్యవాదియైన వాడు, దుష్టుడు, పరభార్యాసక్తుడు; ఇటువంటివారు ఒక్కడూ లేడు.

రాజధానియైన అయోధ్యతోసహా మొత్తం దేశం శాన్తిపూర్ణమై ఉంది.

మంత్రులందరు మంచివస్త్రములను ధరించెడివారు, మంచి ఆహార్యము కలవారు **సుశీలినః** స్వజనపక్షపాతం బంధుప్రీతిలేని మంచిశీలము కలవారు. ప్రభుహితంకొరకు నీతినేత్రములతో మేల్కొని ఉండువారు.

ఈ మంత్రులు **గురౌ గుణ గృహీతాశ్చ** గురువులనుండి లేదా జ్ఞానవృద్ధుల నుండి గుణములనుమాత్రమే గ్రహించెడివారు. పరాక్రమమందు ప్రసిద్ధులు. సర్వవిషయములను గ్రహింపగలిగిన నిశ్చయాత్మకమైన బుద్ధివలన విదేశాలలో కూడా విశేషముగా గుర్తింపబడినవారు.

ఈ మంత్రులు సన్ధివిగ్రహతత్త్వజ్ఞులు. అంటే ఎప్పుడు యుద్ధం చేయాలి, ఎప్పుడు సంధి చేసుకోవాలి అనునవి బాగుగా తెలిసినవారు. **'ప్రకృత్యా సమ్పదాన్వితాః'** స్వభావసిద్ధమైన సంపదతోకూడినవారు. అనగా సహజముగా ఐశ్వర్యవంతు లనియు, కలిగినదానితో తృప్తిపడువారని అర్థం. **'మన్త్రసంవరణే శక్తాః'** అనటంవలన వీరు మితంగా మాట్లాడువారు, ఎక్కడ ఎవరితో ఎంతవరకూ ఎలా మాట్లాడాలో తెలిసినవారు, కావున రహస్యములను దాచుటయందు సమర్థులు. సూక్ష్మవిషయములు గ్రహించి నిర్ణయించుట యందు సమర్థులు. రాజనీతిశాస్త్రములోని రహస్యములు బాగుగా తెలిసిన వారు. ఎప్పుడూ పరుల మనస్సునకు బాధకలుగకుండా పలుకువారు.

రాజా దశరథోఽనఘః పాపములులేని దశరథమహారాజు సద్గుణోపేతులైన ఇటువంటి అమాత్యులతో కూడినవాడై భూమిని శాసించెను.

వాల్మీకిమహర్షి అయోధ్యలో ఈవిధమైన గుణవిశిష్టులైన మంత్రులు ఉన్నారని చూపిస్తూ...ఇటువంటి గుణములుకలవారిని మంత్రులుగా నియమించాలని ఉపదేశిస్తున్నారు.

"శుచయః, రాజకృతేషు అనురక్తాః, విద్యావినీతాః, హ్రీమన్తః, శ్రీమన్తః, నియతేన్ద్రియాః, మహాత్మానః, శాస్త్రజ్ఞాః, దృఢవిక్రమాః, ప్రణిహితాః, స్మితపూర్వభాషిణః, నబ్రూయుః అనృతం వచః, క్రియమాణం కృతం వాపి చారేణాపి చికీర్షతమ్, సౌహృదేషు పరీక్షితాః, ప్రాప్తకాలం తు తే దణ్డం ధారయేయుః సుతేష్వపి, కోశసంగ్రహణం, నియతోత్సాహాః, రాజశాస్త్రం అనుష్ఠితాః, బలాబలం సంప్రేక్ష్య సుతీక్ష్ణదణ్డాః, గురౌ గుణ గృహీతాః, సన్ధివిగ్రహ తత్త్వజ్ఞాః, మన్త్రసంవరణాః, సూక్ష్మాసు బుద్ధిషు శక్తాః, నీతిశాస్త్ర విశేషజ్ఞాః, ప్రియవాదినః"

అమాత్యుడు ఇలా చతుర్వింశతి గుణాలు కలవాడైయుండాలి. ఇదీ మహర్షి ఉపదేశం. ఇలా ఉన్నవారినే అమాత్యులుగా నియమించాలని శాసించకుండా కావ్యధర్మాన్ని అనుసరించి –

ఇలాంటి వారున్న అయోధ్యను చూడండి, ఎంత సుసంపన్నంగా ఉందో...! అలా ఉంటే... మీ దేశం, నగరంకూడా అయోధ్యలా సంపన్నము సమృద్ధము అని చూపెడుతున్నారు.

పురుషశ్రేష్ఠుడైన దశరథమహారాజు గూఢచారులచేత చూస్తూ, ప్రజలను సంతోషపెట్టుచూ, రక్షిస్తూ, అధర్మములను విడిచిపెట్టి, ఉదారుడని, సత్యమైన ప్రతిజ్ఞకలవాడని లోకత్రయమందు ప్రసిద్ధినిపొంది, ఈ భూమిని ధర్మబద్ధంగా శాసించేడు.

ఇక్కడ ప్రభుధర్మాన్ని చెప్తున్నారు. రాజు **చారేణ అవేక్షమాణః** గూఢచారులు కండ్లుగా కలవాడు, మరియు **చార** శబ్దమునకు బంధమని అర్థం. **బంధాపసర్పయో శ్చారః** అని నైఘంటిక వచనం. లక్షణాత్ మనస్సని అర్థం. రాజు మనస్సుతో చూడాలి అని ఉపదేశం.

ఆ దశరథుడు అనేకమంది మిత్రులు కలవాడు. **నతసామన్తాః** లొంగి ఉన్న సామంతులు కలవాడు. తన ప్రతాపముచే తన బాధకులను సంహరించిన వాడు. తనతో సమానుడైన, తనను మించిన శత్రువు లేనివాడైన దశరథుడు, స్వర్గమును దేవేంద్రునివలె జగత్తును శాసించేడు.

తైర్మన్త్రిభిర్మన్త్రహితే నివిష్టైః వృతోఽనురక్తైః కుశలైః సమర్థైః
స పార్థివో దీప్తిమవాప యుక్తః స్తేజోమయై ర్గోభిరివోదితోఽర్కః॥

తనకు మేలు చేయుటయందు ఆసక్తిగల తనయందు అనురాగముగల మంత్రులతోకూడిన దశరథుడు **ఉదితోఽర్కః ఇవ** బాలభానునివలె ఉన్నాడు. దశరథుడు యౌవనంలో ఉన్నడు, పరంపరాగతమైన రాజ్యభారం భుజానికి ఎత్తుకున్న క్రొత్త ఇంకా సూర్యాస్తమయానికి చాలా సమయం ఉంది. వాల్మీకిమహర్షి అప్పటి విషయాలను స్మృతిపథంలోకి తెచ్చుకొంటున్నారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **సప్తమస్సర్గ** సమాప్తము.

॥అథ అష్టమ సర్గః॥

(దశరథుడు యాగసంకల్పము, వసిష్ఠాదులు దానిని ఆమోదించుట)

తస్య త్వేవం ప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః।
సుతార్థం తప్యమానస్య నాసీద్వంశకరః సుతః॥

ఇటువంటి ప్రభావంకలవాడు, ధర్మాత్ముడు, మహాబుద్ధిమంతుడు, వంశకరుడైన సంతానముకై పరితపించు ఆ దశరథునకు 'సుతః నాసీత్' వంశకరుడైన ఒక్క కుమారుడు కలుగలేదు.

చిన్తయానస్య తస్యైవం బుద్ధిరాసీన్మహాత్మనః।
సుతార్థం హయమేధేన కిమర్థం న యజామ్యహమ్॥

అహం సుతార్థం హయమేధేన కిమర్థం న యజామి? నేను పుత్రులకొరకు అశ్వమేథముచే ఎందులకు దేవతలను ఆరాధించకూడదు? అని తనలో తానే తర్కించుకొని **ఏవం బుద్ధిః ఆసీత్** ఈ విధంగా నిశ్చయించుకొన్నాడు. బుద్ధిమంతుడు, ధర్మాత్ముడు అయిన దశరథమహారాజు నిష్కల్మషులైన మంత్రులతోకలసి తన నిశ్చయాన్ని బలపరచుకొన్నాడు.

తరువాత పురోహితులతోకూడిన తన గురువులందరిని తీసుకొని రమ్మని సుమంత్రుని ఆదేశించేడు. ఇక్కడ **"మహాత్మనః, బుద్ధిమాన్"** అని దశరథునకు రెండు విశేషణములు వేసేరు. బుద్ధిమంతుడు అంటే తనకు జరిగిన నష్టమునుగూర్చి, గడచిపోయిన విషయాలనుగూర్చి మరణించిన వారినిగూర్చి విచారిస్తూ కాలంగడిపేవాడు కాడని.

కనుకనే ఈ వయస్సులోను సంతాన ప్రతిబంధకమైన పాపక్షయమును చేసుకొని సంతానమును పొందే ప్రయత్నాన్ని చేస్తున్నాడు.

ఇక్కడ శుభకార్యములకు ఎవరి ఆశీర్వచనములు ముందుగా అపేక్షింప తగినవో చెప్పారు.

పురోహితులకు చెప్పమన్నారు. వారు దేశక్షేమముయందు దృష్టికలవారు. తనయందలి సంతానకాంక్షకూడా రాష్ట్రహితాన్ని అపేక్షించి సంకల్పింప బడింది. రాజులేని రాజ్యంలో అరాచకం ప్రబలుతుంది. కనుక రాజైనవాడు

ఔరసుణ్ణి అందించాలి. అది సమాజంపట్ల తన ధర్మం. కనుక పురోహితుల్ని స్మరించారు. తరువాత తనయందలి ఆస్తిక్యబుద్ధికి కారణమైన గురుమణ్డలాన్ని స్మరించారు.

తరువాత అతిశీఘ్రగమనం గల సుమంత్రుడు వేగంగావెళ్ళి

తతః సుమన్త్రస్త్వరితం గత్వా త్వరితవిక్రమః।
సమానయత్సతాన్ సర్వాన్ సమస్తాన్వేదపారగాన్॥
సుయజ్ఞం వామదేవం చ జాబాలిమథకాశ్యపమ్।
పురోహితం వసిష్ఠం చ యేచాన్యే ద్విజసత్తమాః॥

సుయజ్ఞుని, వామదేవుని, జాబాలిని, కాశ్యపుని వీరితోపాటు పురోహితుడైన వశిష్ఠుని, వేదపారంగతులైన వారిని అంటే వేదముల అంతమును చూచిన వారిని అంటే అనంతమైన వేదములయొక్క నిశ్చయాత్మకమైన అర్థమును అనగా ఉపనిషద్భాగములను తెలిసినవారిని, వీరు నిష్కామకర్మయోగులు.
"తద్యథేహకర్మజితో లోకఃక్షీయతే ఏవమేవా ముత్ర పుణ్యజితో లోకఃక్షీయతే॥"
"పరీక్ష్యలోకాన్కర్మజాతాన్ బ్రాహ్మణో నిర్వేద మాయాన్నాస్త్య కృతః కృతేన"
ఇత్యాది వచనములవలన సకామ కర్మానుష్ఠానోపార్జితములైన స్రక్చన్దన విత్తాదులన్నీ కదళీగర్భమువలే సుఖాభాసములని తెలిసి ఈశ్వరార్పణ బుద్ధితో కర్మలను ఆచరించువారు.

కర్త, కర్మఫలభోక్తయునై ప్రకాశించు ఆత్మసంబంధజ్ఞానము లేనిచో కర్మల యందు ప్రవర్తించుటయు ఉండదు.

సర్వకర్మలందు ఆత్మజ్ఞానం అపేక్షిణీయమని మీమాంసకులు చెప్పుచున్నారు. కౌషీతకీబ్రాహ్మణోపనిషత్తునందు చిత్రుడను (గార్గ్యాయణి) రాజు యజ్ఞముచేయు సందర్భములో యజ్ఞప్రవర్తకుడైన ఆరుణియను ఋత్విజుని బ్రహ్మతత్త్వ విషయకమై ప్రశ్నించెను. ఆ ఆరుణి వాటికి సమాధానం తెలియక తన తండ్రినడిగెను. చివరకు వీరిరువురు చిత్రునివలన విద్యోపదేశమును పొందినట్లు శ్రుతివచనము.

"స్వాధ్యాయమధీత్య ఏతదర్థ ప్రతిపాదికం వేదభాగం సార్థమధిగమ్య చిత్రాత్ గార్గ్యయణేః హరామహేఽధిగచ్ఛామః" ఏ అర్థమున బ్రహ్మమునుగూర్చి

సందేహము కలిగిందో ఆ అర్థమును ప్రతిపాదించెడి వేదభాగమును గురుముఖముననే సభలో అర్థజ్ఞానపూర్వకంగా తెలిసికొనవలెనని భావము. దానంజేసి ఋత్విజులకు యజమానులకు బ్రహ్మతత్త్వజ్ఞానము ఆవశ్యకమని తెలుస్తోంది. ఇది ఎందుకొరకంటే నేను ఫలానా అను లౌకికభావనను విడిచి నేను జన్మతః అగ్నిస్వరూపుడను అను భావనను పొందాలి. అలా ఉదాత్తమైన భావనను పొంది యజ్ఞకర్మను పూర్తిచేయాలి. **"అగ్నిరస్మి జన్మనా జాతవేదా ఘృతంమే చక్షురమృతం మ ఆసన్"**

"అర్కస్త్రిధాతూ రజసోవిమానోఽజస్రో ఘర్మోహవిరస్మి నామ" యజమానుని ఆత్మస్వరూపము అగ్నియే అని శ్రుతి చెప్తోంది. **"ఓతం నిహితముచ్ఛిష్టే యజ్ఞస్యాణూని విద్యయా"** అను అధర్వణ మంత్రానికి సాయణులు **"ఇత్థం యజ్ఞస్య సంబన్ధీని అణూని సూక్ష్మాణి రూపాణి విద్యయా భావనయా తత్రైవ కారణభూతే బ్రహ్మణి నిహితానీత్యర్థః"** అని వ్రాసేరు. భావనవలన యజ్ఞ సంబంధమైన సూక్ష్మరూపములన్నీ కారణభూతమగు బ్రహ్మయందే నిహితమై యున్నవని శ్రుతిమాత భావము.

కావున ఋత్విజులు యజమానుడు సాఙ్గోపాంగముగా కర్మస్వరూపమును తెలుసుకొని, కర్మయందు వినియోగించు మన్త్రప్రతిపాద్య దేవతా స్వరూపాన్ని, మహాత్మ్యమును, ఆ యజ్ఞాధిష్ఠాన దేవతాతత్త్వమును తెలుసుకొని యజ్ఞము నిర్వహిస్తే, అది సమృద్ధమై అభీష్టసిద్ధికి హేతువగుచున్నది. అందువలన వేదాన్తజ్ఞానముకలవారిని పిలిచారు. ఇంకను ఇతరులైన ద్విజసత్తము లందరిని అంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులను అందరిని తీసుకువచ్చేదు. ధర్మాత్ముడైన దశరథుడు వారినందరిని పూజించి, ధార్మికమైన ప్రయోజనముతో కూడిన మృదువైన వచనమును పలుకుచున్నాడు. **ధర్మార్థసహితం శ్లక్ష్ణం వచనమబ్రవీత్** అంటున్నారు. ఏమిటి తను చెప్తున్నటు వంటిదానికి ఉన్న ధార్మికత అంటే, తనకు పితౄణం తీరలేదు. అది తీర్చుకొనుట ధర్మం. ఆ ధర్మబద్ధమైన ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని మాట్లాడుతున్నాడు. ఔరసులు కలుగుట అనేది విధిని అనుసరించి ఉంటుంది. పితౄణం తీరకపోయిన పోవచ్చుగాక! ధర్మనిష్ఠగల ఇక్ష్వాకులకు ఈ పృథివి కోరినవన్నీ ఇచ్చింది. ప్రకృతి

ప్రకృతి అవసరార్థం కోరినవన్నీ ఇచ్చినా, అవసరం తీరిన తరువాత వాటిని తిరిగి ఇచ్చివేయుట ధర్మం. లేదా ఇచ్చినవారు తీసుకునే పర్యంతము దానికి రక్షకుడుగా ఉండి రక్షించాలి, లేదా దానికి రక్షకులను కల్పించాలి. ఇది లౌకికఋణం. ఇది తీర్చే తీరాలి. **తతం తంతు మన్వేకే అనుసంచరంతి యేషాం దత్తం పిత్ర్యమాయనవత్। అబంధ్వేకే దదతః ప్రయచ్ఛాద్దాతుంచే చ్ఛక్నవాగ్ం స స్వర్గ ఏషాం॥** ఈ విధంగా లౌకికఋణమును తీర్చిన అనగా తీసుకొన్న దాన్ని ప్రత్యర్పణచేయు సామర్థ్యంగల వారికి స్వర్గప్రాప్తియని అని శ్రుతి వచనం.

మమలాలప్యమానస్య పుత్రార్థం నాస్తివై సుఖం।
తదహం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ॥

సంతానంకొరకు బాధపడుచున్న నాకు సుఖంలేదు. ఆ కారణంగా నేను అశ్వమేధయాగం చెయ్యాలని నిశ్చయించేను. అదీ శాస్త్రం ఎలా నిర్దేశించిందో అలా ఆచరించాలని కోరుతున్నాను. నాకోరికను నేను ఎలా పొందగలనో ఉపాయం ఆలోచించండి అన్నారు.

అత్రి రదదా దౌర్వాయ ప్రజాం పుత్రకామాయ
స రిరిచానోఽ మన్యత నిర్వీర్య శ్శిథిలో యాతయామా
స ఏతం చతూరాత్ర మపశ్యత్త మాహరత్తేనాఽ యజత తతో వై తస్య చత్వారో వీరా అజాయంత అని తైత్తిరీయసంహిత పుత్రోత్పాదన సామర్థ్యము లేనివాడు, వయోధర్మముచే అవగతమైన సారముకలవాడైన అత్రిమహర్షి సంతానార్థం **చతురాత్ర**మను సోమయాగాన్ని పుత్రులనుపొందుటకు సాధనముగా నిశ్చయించి అనుష్ఠించెనని చెప్తోంది. అదే విధంగా దశరథుడు సంతానార్థము అశ్వమేధాన్ని సంకల్పించాడు.

వశిష్ఠాది ప్రముఖులందరు సాధువచనాలు పలికారు. పలికి... మహారాజా! మాకు పరమసంతోషంగా ఉందయ్యా, క్రతువుకు కావలసిన వస్తుసామగ్రిని సమకూర్చి, అశ్వాన్ని విడిచిపెట్టు. అన్నారు. పుత్రార్థమైన నీ బుద్ధి మిక్కిలి ధర్మబద్ధంగా ఉంది. నీవు తప్పక పుత్రులను పొందగలవని ఆశీఃపూర్వకంగా పలికారు.

దశరథుడు సంతానముకొరకు పుత్రకామేష్టి, చతురాత్రము మొదలైనవి చెయ్యాలి కాని, ఈ అశ్వమేధము ఏమిటి? అని అనుమానం సహజం. ఇది దశరథునకు లేకపోలేదు. అందుకే తన నిర్ణయాన్ని పండితపరిషత్తులో పెట్టారు. చిత్రం ఏమిటంటే **సర్వాథా ప్రాప్స్యసే పుత్రానభిప్రేతాంశ్చ పార్థివ** అని ఆశీఃపూర్వకంగా పలికి, ముందుకు నడవమన్నారు. ఈ అశ్వమేధము భవిష్యత్కాలములో నీకు సంతానాన్ని అనుగ్రహించగలదు అని చెప్పారు.

ఎక్కడ చెప్పారు. అది **ప్రాప్స్యః అస్ ధాతువు. (ఆప్స్యః–ఆప్స్యతమ్–ఆప్స్యత)** అను క్రియాపద ప్రయోగంలో ఉంది. సస్యము చేతికి రావలెనన్న వర్షము కురియాలి. వర్షసస్యములకు కార్యకారణ భావము ఏవిధంగా ఉందో, వర్షం కారణం, సస్యము కార్యము. ఇంకను వర్షము కురియలేదు. ఇట్టి స్థితిలో భవిష్యత్కాల క్రియను చెప్పే ధాతురూపము లృట్.

ఇదే విధంగా అశ్వమేధము, పుత్రప్రాప్తి కార్యకారణములు. ఇక్కడ అశ్వమేధము కారణం, పుత్రప్రాప్తి కార్యం. ఇంకా అశ్వమేధము జరుగలేదు. ఇది చెయ్యి, భవిష్యత్తులో కలుగుతారని అర్థం. సంతానప్రాప్తి అనేది విధిని అనుసరించే ఉంటుంది. సామర్థ్యాన్నిబట్టికాదు. పురాకృతమైన బలీయమైన పాపకర్మల ఫలం, సంతాన ప్రతిబంధకముగా ఉంటుంది. ఇదిగో అశ్వమేధమువలన ఈ పాపసంచయము క్షీణించి ప్రజోత్పత్తి హేతువగుచున్నది. అశ్వమేధము సంతానమును పరంపరయా అనుగ్రహించునది.

తపోధనులైన ఆ బ్రాహ్మణుల ఆశీఃపూర్వకమైన వాక్కులకు ఆనందించి, ఆ ఆనందంలో మంత్రులను పిలిచేడు. పిలిచి...

యజ్ఞసంభారాలను సమకూర్చండి, సమర్థులైన వీరులచే రక్షింపబడుచున్న ఉపాధ్యాయులతో కూడిన అశ్వమును విడిచిపెట్టండి అని ఆజ్ఞాపించాడు. సరయూనది ఉత్తరతీరమునందు యజ్ఞశాల నిర్మించండి. కల్పోక్తరీతిని, శాస్త్రప్రకారం శాన్తికార్యములు జరిపించండి. ఈ యజ్ఞము కష్టసాధ్యమైది. అపరాధములు జరుగుటకు అవకాశము లేనిపక్షంలో ప్రతి రాజుకూడ ఈ యజ్ఞమును ఆచరించేవాడు.

ఛిద్రం హి మృగయన్తేఽత్ర విద్వాంసో బ్రహ్మరాక్షసాః।
నిహతస్య చ యజ్ఞస్య సద్యః కర్తా వినశ్యతి॥ ౧౭

విద్వాంసులైన బ్రహ్మరాక్షసులు ఈ యాగమునందు లోపములను అన్వేషిస్తూ ఉంటారు. ఏకారణముచేతనైనా యజ్ఞమునకు భంగము వాటిల్లినా ఆ యజ్ఞకర్త వెంటనే నశించును. అని చెప్పేరు.

యజ్ఞమునకు భూశుద్ధి ద్రవ్యశుద్ధికూడా అవసరం. **తృతీయం బ్రహ్మహత్యాయై ప్రత్యగృహ్ణా త్తత్స్వకృత మిరిణ మభవ త్తస్మాదాహితాగ్ని శ్రద్ధాదేవ స్స్వకృత ఇరిణేవావస్యే ద్బ్రహ్మహత్యాయై హ్యేష వర్ణః** ఆహితాగ్ని భూమియొక్క బ్రహ్మహత్యాదోష రూపమైన ఊసరక్షేత్రమందు నివాసము గాని, యజ్ఞశాల నిర్మాణముగాని చేయరాదు. కనుకనే నదీతీరమును యాగశాల నిర్మాణానికి ఎంపిక చేసేరు.

అగ్రేధృతౌవినాశాయ ధృతౌమధ్యే ప్రజాక్షయే। మూలేధృతస్తు హోతుస్తు మృతిందద్యాత్స్రువోధ్రువమ్॥ స్రువమును అగ్రభాగమునందు గ్రహించినచో వినాశనము. స్రువమును మధ్యభాగమును పట్టి గ్రహించినచో ప్రజాక్షయము. మొదట గ్రహించినచో యజమానుని నశింపచేయును. స్రువమును ఐదుభాగలు చేసి రెండవ భాగమునందుగాని, నాల్గవభాగమందుగాని గ్రహించి హోమ నిర్వహణము చేసినచో సర్వకామార్థసిద్ధి అగును.

కఠినద్రవ్యహోమేతు ముష్టినాధారణం స్రుచః।
ద్రవద్రవ్యస్య హోమేతు ఉత్తనాఙ్గులిభిః స్మృతమ్॥

పురోడాశము, చరువు మొదలగు కఠినద్రవ్యములను హోమము చేసేప్పుడు ముష్టితో స్రుక్కును ధరించవలెను. ద్రవపదార్థములను హోమము చేసేప్పుడు ఉత్తానముగా నున్న వ్రేళ్ళచే స్రుక్కును ధరించవలెను. ఇట్టివి స్రుక్స్రువముల ధారణయందలి రహస్యములు.

ఇంకను శాలానిర్మాణానికి కొన్నినియమాలు ఉన్నాయి. ప్రాగ్వంశ సదో హవిర్ధానాగ్నీధ్రములను నాలుగు శాలలు ఉంటాయి. వీటిలో హవిర్ధాన అగ్నీధ్రములు రెండును పందిరిమాదిరిగా ఉంటాయి. ఈ రెండిటియందు

స్థూణలకు ప్రమాణము చెప్పియుండలేదు. కనుక యథేష్ట ప్రమాణమనియే గ్రాహ్యము. ప్రాగ్వంశమునకు పాక వేస్తారు. సదస్సుకూడా పాకయే. వీటికి **యజమానేన సంమితౌ దుంబరీ భవతి** అని తైత్తిరీయసంహిత మధ్యస్థూణలు (ఔదుంబరీ) యజమానునితో సమాన ప్రమాణముగలదై యుండవలెనని చెప్పింది. ఆపస్తంబమహర్షి **నాభిదఘ్నియః పరియస్తీయాః** అని చెప్పి ప్రాన్తస్థూణలకు (చుట్టూ ఉన్న రాటలు) నాభిప్రమాణంకలవై యుండాలని నిర్ణయించారు. ఆపస్తమ్బమహర్షి చెప్పిన **తిష్ఠన్ప్రహ్వోవా** అని చెప్పిన సూత్రము అధ్వర్యుడు, యజమానియొక్క ప్రమాణములయందలి వ్యత్యాసములను దృష్టియందు ఉంచుకొని చెప్పినది. యజమాని పొడవుగా ఉండి, అధ్వర్యుడు పొట్టివాడైన **తిష్ఠన్** అను విధి వర్తించును. అధ్వర్యుడు పొడవువాడై, యజమాని పొట్టివాడైనను, ఇరువురు సములైనను **ప్రహ్వః** అను విధి వర్తించును.
వీటికి విపరీతముగా శాలా నిర్మాణములను గావించుట, క్రతుతత్త్వమును తెలుసుకొనకుండ ఆచరించుట మొదలలైనవి క్రతువులయొక్క పూర్ణఫలాన్ని సిద్ధింపచేయజాలవు.

తద్యథా విధిపూర్వం మే క్రతురేష సమాప్యతే।
తథా విధానం క్రియతాం సమర్థాః కరణేష్విహ॥

వశిష్ఠాదులను సభలో ఉంచుకొని మంత్రులతో మాట్లాడుతున్నారు.
ఆ కారణంగా నాయొక్క ఈ క్రతువు సమాప్తిపర్యన్తము శాస్త్రమును ముందర ఉంచి చేయబడుగాక! మీరు ఈ కార్యములందు సమర్థులే కదా! అని సున్నితంగా హెచ్చరించారు.
(**క్రియతామ్ -క్రియేతామ్ -క్రియన్తామ్** అని ధాతురూపము. ఈ లోట్ రూపము విధ్యాద్యర్థములందు, ఆశీరర్థమునందు వస్తుంది.)
ఆ మంత్రులందరు దశరథునియొక్క శాసనరూపమైన వాక్కును విన్నారు. అభినందించారు. అభినందించి, మీచే ఎలా ఆజ్ఞాపింపబడిందో అలానే చేస్తాం. అని అందరు ముక్తకంఠంతో పలికారు. ధర్మము తెలిసిన ఆ ద్విజులు (క్షత్రియ, వైశ్యులు) అందరు దశరథుని సంకల్పాన్ని వృద్ధిపొందించుచు, దశరథునివద్ద అనుజ్ఞనుపొంది తిరిగి వెళ్ళారు.

ఆ బ్రాహ్మణులను అంటే ఋత్విక్కులైన వశిష్ఠాదులనుకూడా పంపించి, మంత్రులనుగూర్చి మాట్లాడుతున్నాడు. **యథావత్ క్రతుః ఆప్యతామ్** ఋత్విక్కుల చేత ఉపదేశింపబడిన ఈ క్రతువు శాస్త్రప్రకారం జరగాలి. అని మంత్రులను హెచ్చరించారు. ఈ విధంగా ఆజ్ఞాపించి ఆ మంత్రులను పంపివేసి, తను తన ఇంటిలోనికి ప్రవేశించారు.

తతః స గత్వా తాః పత్నీర్నరేన్ద్రో హృదయప్రియాః।
ఉవాచ దీక్షాం విశత యక్ష్యేఽహం సుతకారణాత్॥

నేను సంతానార్థము చేస్తున్నాను. మీరుకూడా దీక్షను ప్రవేశించండి అన్నారు. విశత అనేది విధ్యర్థకమైన లోట్ ప్రయోగం. విశ్ ప్రవేశనే **(విశ, విశతాత్ – విశతమ్ – విశత)** అని రూపం. **విశత** ఇది విధిరూపంగా ఉన్న వాక్కు. ఇలా చేద్దామనుకుంటున్నాను అని బయటవారినందరను అడిగారు కదా! భార్యతో (భార్యలతో)కూడ ఒకమాట చెప్తే బాగుండును అనిపిస్తుంది. అది ధర్మం కూడాను.

శ్రుతి **అర్థో వా ఏష ఆత్మనః। యత్పత్నీ** అని చెప్తోంది. పత్ని యజమానుని అర్ధభాగం. వాగర్థములవలె. మరియు శ్రుతి, పత్ని పతియొక్క శిరః స్థానీయురాలని చెప్తోంది. **మూర్ధానం పత్యు రారోహ ప్రజయా చ విరాడ్భవ। సమ్రాజ్ఞీ శ్వశురే భవ సమ్రాజ్ఞీ శ్వ శ్ర్వాం భవ। ననాందరి సమ్రాజ్ఞి భవ సమ్రాజ్ఞీ అధిదేవృషు। స్ను షాణాగ్ శ్వశురాణాం ప్రజాయాశ్చ ధనస్య చ।** వివాహానంతరము భర్తయొక్క అఖిలసంపదలకు స్త్రీ సర్వాధికారిణి అని శ్రుతి వచనం. రాజ్ఞీ అని ప్రయోగం ఈమె పరాధీనమైన అధికారముకలది కాదు, సర్వస్వతంత్ర అని చెప్తోంది. **పత్న్యన్వారభతే పత్నీ హి పారీణహ్య స్యేశే పత్న్యైవాఽనుమతం నిర్వపతి।** అని కృష్ణయజుర్వేదము ఈమె అనుమతి మీదనే ధార్మికమైన సర్వకర్మలను ఆచరించాలని విధించింది. **పత్నీగ్ం శకట మన్వారంభ యిత్వాఽఽతిథ్యం నిర్వపతి** అని ఆశ్వలాయన శ్రౌతసూత్రం యజ్ఞమందు రెండవరోజున జరుగు **ఆతిథ్యేష్టిలో** ఆ దేవతకు పురోడాశమును పృథక్కరణము చేయు సమయమున పత్ని ఆ పాత్రను తాకి అంగీకారమును తెల్పవలెనని విధించింది. దానంజేసి సర్వకర్మలు

పత్నియొక్క అంగీకారముతో జరుగవలెననునది స్పష్టం. ఇక్కడ దశరథుడు పత్నులను సంప్రదించి అంగీకారమును తెలుసుకొనకుండగా! నేను ఇలా నిర్ణయించాను సిద్ధంకండని ఆజ్ఞాపించుట కనబడుచున్నది. అది సత్యంకాదు. మనము నిర్ణయానికి వచ్చుటకుముందు పుర్వోత్తరశ్లోకాలను, విషయాలను పరిశీలించాలి. పూర్వ శ్లోకంలో **స్వం వేశ్మ ప్రవివేశ** అన్నారు. అది తన ఇల్లు. అందున్న ప్రతీది అంటే ప్రాణి వాగ్వస్తువులన్ని తనవి. ఈ విధంగానే అందున్న వారివికూడ. భార్యాభర్త లిరువురు ఏకవాక్యతను కలిగియుంటేనే అది గృహం. గృహమందలి గృహిణి గృహస్థు ఏకాత్మగల భిన్నదేహులు. అది గృహధర్మం. ఈ విషయాన్ని **హృదయ ప్రియాః** అని చెప్పారు మహర్షి. ఈ దశరథ నిర్ణయం ఆ దశరథ పత్నులందరిదీను. ఇదే నిర్ణయం ముందుగా ఆ పత్నులచే చేయబడ్డా అది దశరథునకు అంగీకారమై యుండెడిదని గ్రహించాలి.

తాసాం తేనాతికాన్తేన వచనేన సువర్చసామ్।
ముఖపద్మాన్యశోభన్త పద్మానీవ హిమాత్యయే॥ ౨౪

ఇక్కడ **అతికాన్తేన వచనేన** అని చెప్పి మహర్షి మనకు వేయి దీపపు కాంతులతో వెలిగిపోతున్న దశరథుని ముఖమును చూపెడుతున్నారు. మిక్కిలి హృదయానందకరమైన మాటచేత మంచి వర్చస్సుతో కూడిన దశరథపత్నుల ముఖపద్మములు హేమంతపు చివరి రోజులలో పద్మాల్లా ప్రకాశిస్తున్నాయి. హేమంతపు చివరి రోజులు అనటంచేత, ముసిరిన మంచు కరిగిపోయింది. పద్మములకు ఇప్పుడు తమ స్వప్రకాశకు అనువైన కాలం. ప్రకృతిగతమైన అడ్డంకులు తొలగిపోయాయి. పద్మాలు తమంత తాముగా ప్రకాశిస్తున్నాయి. ఇక్కడ దశరథపత్నులకుకూడా ప్రకృతిగతమైన స్వాభావికమైన సర్వప్రతిబంధకాలు తొలగి, తమంత తాముగా ప్రకాశించుటకు అనుకూలంగా ఉన్నారు. ఇప్పటిదాకా దశరథపత్నులు. ఇకపై కౌసల్యా సుప్రజ అని రాముడు; సౌమిత్రి అని లక్ష్మణ, శతృఘ్నులు; కైకేయీసుతుడని భరతుడు పిలువబడి వీరు స్వప్రకాశకలవారు అవుతారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **అష్టమస్సర్గ** సమాప్తము.

॥అథ నవమ సర్గః॥

(ఋష్యశృఙ్గ చరిత్ర)

ఏతచ్ఛ్రుత్వా రహః సూతో రాజానమిదమబ్రవీత్।
ఋత్విగ్భిరుపదిష్టోఽయం పురావృత్తో మయా శ్రుతః॥

సంతానార్థము అశ్వమేధము చేయాలను దశరథ నిర్ణయాన్ని విని, సూతుడైన సుమంత్రుడు, రాజునుగూర్చి... రహస్యముగా మాట్లాడుతున్నాడు. ఈ వృత్తాంతము పూర్వము జరిగింది. ఋత్విక్కులచే ఉపదేశింపబడింది. నాచేత వినబడినది.

ఓ మహారాజా! పూర్వము ఋషులయొక్క సన్నిధిలో భగవానుడైన సనత్కుమారుడు నీ పుత్రప్రాప్తినిగూర్చిన కథను చెప్పేరు.

కాశ్యపునకు విభండకుడను ప్రసిద్ధుడైన కుమారుడు, ఈ విభండకునకు ఋష్యశృంగుడని పేరు పొందిన పుత్రుడు పుట్టగలడు.

ఈ ఋష్యశృఙ్గుడు జన్మప్రభృతి వనమందే పెరిగినవాడై అందే సంచరించుచు, నిత్యముగా తండ్రినే అనుసరించి యుండుటచే అన్యులను ఎరుగడు.

ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్య భవిష్యతి మహాత్మనః॥

ఓరాజా! మహాత్ముడైన ఆ ఋష్యశృఙ్గునకు సర్వలోక ప్రసిద్ధమైన సదా బ్రాహ్మణులచే కొనియాడబడినదైన, బ్రహ్మచర్యముయొక్క ద్వివిధత్వము కలుగ గలదు.

అగ్నిం శుశ్రూషమాణస్య పితరం చ యశస్వినమ్।

అగ్నిని, యశస్వియైన తండ్రిని సేవిస్తూ కాలం గడుపుతాడు.

ఇక్కడ ఋష్యశృఙ్గుడు విద్యార్థి దశయందు ఉన్నాడు. ఇతనికి అగ్న్యారాధన, వేదాధ్యయనరూపమైన గురుసేవ ఇవే దైనందిన జీవితం. విద్యార్థి దశలో అన్యము తెలియతగినది కాదని శాస్త్రనిర్ణయం. బ్రహ్మచర్యము ద్వివిధముగా చెప్పబడింది.

ఒకటి ఉపనయన ప్రాప్తమైనట్టిది. మేఖలాజిన దండాదులను స్వీకరించి గ్రహించు బ్రహ్మచర్యము. దీనికే **వ్రత్యమని** సంజ్ఞ. ఇది అస్ఖలిత బ్రహ్మచర్యము.

రెండవది శాస్త్రవిహితమైన సాంసారిక జీవనవిధిని అనుసరించునది. ఋతుగమన లక్షణరూపమైనది. ఇదీ బ్రహ్మచర్యమనియే శాస్త్రవ్యవహారము. దీనికి **ప్రాజాపత్యము** అని సంజ్ఞ.

మేఖలాజిన దండాదులను కలిగియున్న సమయమందే అంగదేశమున మహాబలవంతుడు, ప్రసిద్ధుడు అయిన రోమపాదుడు అను రాజు ఉన్నాడు. ఆ రోమపాదుడు ధర్మమును అతిక్రమించుటవలన సర్వభూత భయావహమైన అనావృష్టి కలుగుతుంది.

రోమపాదుడు అనావృష్టికి దుఃఖిస్తూ, శ్రుతవృద్ధులను అనగా శాస్త్రజ్ఞానముచే వృద్ధులైన బ్రాహ్మణులను పిలిచి, మీరందరు శ్రుతధర్ములు (వినబడిన ధర్మములు కలవారు). లోకరీతి తెలిసినవారు. వీరిని అనావృష్టి నివారణార్థము ఏ ప్రాయశ్చిత్తము ఆచరింపతగినదో ఆ నియమమును ఉపదేశించమని అడిగేరు. వేదపారగులైన ఆ బ్రాహ్మణులు రాజునుగూర్చి...

ఓమహారాజా! విభణ్డకపుత్రుడైన ఋష్యశృఙ్గుని సర్వోపాయములచేత ఇక్కడకు తీసుకొని రా! బాగుగా సత్కరించి ఋష్యశృఙ్గునకు శాన్తను ఇచ్చి యథా శాస్త్రము వివాహము చేయుమని చెప్పేరు.

పణ్డితవృద్ధులలైన వారి మాటలను విని,

కేనోపాయేన వై శక్యమిహానేతుం స వీర్యవాన్॥

నియతేన్ద్రియుడైన అతడు ఇక్కడకు వచ్చుటకు ఉపాయమేమి అని ఆలోచించసాగేడు. తరువాత బుద్ధిశాలియైన రాజు మంత్రులతో ఆలోచించి బాగుగా నిశ్చయించుకొన్న వాడై, పురోహితులను అమాత్యులను సత్కరించి వారిని ఋష్యశృఙ్గుని తీసుకొని వచ్చుటకు ప్రేరేపించసాగేడు.

ఆ బ్రాహ్మణులు అమాత్యులు విభండకమునికి భయపడి, తలవంచి మేము అచటికి వెళ్ళము అని రాజును బ్రతిమలాడేరు. పిమ్మట ఆలోచించి ఉపాయం కనుగొని "గణిక"ల (వేశ్యల) సాహాయ్యముతో తీసుకొని వచ్చెదమని చెప్పిరి. రోమపాదుడు గణికల సాహాయ్యముతో ఋష్యశృఙ్గుని తీసుకొనిరాగలడు.

వర్షములు కురియును. శాన్త అతనికొరకు ఇవ్వబడును.
రోమపాదుని అల్లుడైన ఋష్యశృఙ్గుడు నీకు పుత్రులుకలుగు విధానము చేయగలడని సనత్కుమారులవారు చెప్పేరు.
నేను విన్నాను. నీకు చెప్తున్నాను.

అథ హృష్టో దశరథః సుమన్త్రం ప్రత్యభాషత।
యథర్ష్యశృఙ్గస్త్వానీతో విస్తరేణ త్వయోచ్యతామ్॥౧౯

దశరథుడు సంతోషించేడు. సుమంత్రునితో ఋష్యశృఙ్గని ఏవిధంగా తీసుకొని వచ్చారో చెప్పమని అడిగేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
నవమస్సర్గ సమాప్తము.

-

॥అథ దశమః సర్గః॥

(ఋష్యశృఙ్గుడు అంగదేశము వచ్చుట, శాన్తాఋష్యశృఙ్గుల వివాహము)

సుమన్త్రశ్చోదితో రాజ్ఞా ప్రోవాచేదం వచస్తదా।
యథర్శ్యశృఙ్గస్త్వానీతః శృణు మే మన్త్రిభిస్సహ॥

ఆ ఋష్యశృఙ్గుడు మన్త్రులచేత ఏవిధంగా తీసుకొని రాబడెనో చెప్తాను వినండి అని రాజుచేత ప్రేరేపింపబడిన సుమన్త్రుడు ప్రారంభించాడు. మంత్రితోకూడిన పురోహితుడు రోమపాదునిగూర్చి మేము అపాయంలేని ఉపాయం ఆలోచించేము అని పలికేరు.

ఋశ్యశృఙ్గో వనచర స్తపస్స్వాధ్యాయ సంయుతః।
అనభిజ్ఞః స నారీణాం విషయాణాం సుఖస్య చ॥

ఋష్యశృఙ్గుడు వనములందే సంచరించుచు, తపస్స్వాధ్యాయ నిరతుడై యున్నాడు.

స్వాధ్యాయం అంటే అర్థసహితమైన వేదాధ్యయనమనే, వేదము స్త్రీయొక్క స్వరూపస్వభావాలు తెలియనిది కాదు. దానంజేసి ఇతడు స్త్రీసంబంధమైన సుఖముయొక్క, ఇతర విషయముల సుఖముయొక్క అనుభవము లేనివాడు.

ఇన్ద్రియార్థైరభిమతైర్నరచిత్తప్రమాథిభిః।
పురమానాయయిష్యామః క్షిప్రం చాధ్యవసీయతామ్

నరుల చిత్తములను క్షోభపెట్టు, అభిమతమైన ఇన్ద్రియార్థములచే పట్టణానికి తీసుకువస్తాము. శీఘ్రంగా నిర్ణయం తెలుపవలసినది.

ఇక్కడ మహర్షి ఇన్ద్రియార్థములు యోగుల చిత్తములనుకుడా క్షోభింపచేస్తున్నా యని చెప్తున్నారు. అనుకూలత ఉంటే ఇన్ద్రియార్థములు పరమేశ్వరునికూడా క్షోభింపజేయ చూస్తాయి. నిత్యసాధకుడు వెంటనే అంతర్ముఖుడై సంక్షోభాలను శాంతింపచేసుకొంటాడు. సామాన్యుడు బహిర్ముఖములైన ఇన్ద్రియములచే చిత్రవిచిత్ర అనుభవాలను ప్రోగుచేసుకొంటూ, వాసనలు అను బంధములచే బంధింపబడతాడు. తనకుతానై వేసుకొన్న ముడులలో చిక్కుపడి, బయట పడలేక బాధపడు పసివాడిలా ఉంటుంది వాని స్థితి.

గణికాస్తత్ర గచ్ఛన్తు రూపవత్యః స్వలఙ్కృతాః।
ప్రలోభ్య వివిధోపాయైరానేష్యన్తీహ సత్కృతాః॥

నీచే సత్కరింపబడినవారు రూపవతులు బాగుగా అలఙ్కరించుకొన్నవారు అయిన గణికలు,

గణికలు అంటే ఎదుటివారి సమర్థతను తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరించువారు. కావున వీరు అనేక విధములైన ఉపాయములచేత అతనిని ప్రలోభపెట్టి ఇచ్చటికి తీసుకురాగలరు.

ఇప్పటివరకు ఋష్యశృఙ్గుడు అగ్నిరూపోపాసన చేస్తున్నాడు. స్వరూపగ్రహణం చేసిన వాటిలో అగ్ని మొదటిది. దీనియందు స్వరూపభేదాలు ఉండవు. అగ్నికి పైన నిరాకారత ఉంటే, అగ్నికి క్రింది వరుసలో నానాత్వం ఉంది. అగ్నియొక్క స్వరూపం నిరాకార సాకారముల సంధి. అతి సహజసిద్ధంగా ఉంటుంది. ఇక మిగిలిన ఏ రూపమైనా నానావిధ అలఙ్కారములచే సహజస్థితి మరుగుపఱచుకొని మోహకారకములగుచు ప్రలోభపెట్టుచున్నవి. ఈ కారణముగానే బ్రాహ్మణులకు అన్తర్దృష్టిహేతువైన అగ్నియే దైవమని చెప్పబడినది. నిరాకారుడైన ఈశ్వరుడు అగ్నియే లిఙ్గముగాకలవాడని లిఙ్గోద్భవకథ చెప్తోంది. ఎప్పుడైతే అగ్నినికాదని స్వరూపమునందు దృష్టి నిలిపేమో... హరిహరబ్రహ్మేన్ద్ర యమ కుబేర రామ కృష్ణ బాలా దుర్గా ఇత్యాదిగా స్త్రీపురుష భేదములు కల్పింపబడి నానాత్వ ప్రకటనముచే అనన్తమైన రూపాలు దర్శనమిస్తాయి. ఇక్కడ ఋష్యశృఙ్గుడు అగ్నిని ఉపాసిస్తున్న వానినిగానే చెప్తున్నారు. మంత్రిపురోహితుల ఆలోచనకు రోమపాదుడు సరే అన్నాడు.

వారముఖ్యాస్తు తచ్ఛ్రుత్వా వనం ప్రవివిశుర్మహత్।
ఆశ్రమస్యావిదూరేఽస్మిన్ యత్నం కుర్వన్తి దర్శనే।
ఋషేః పుత్రస్య ధీరస్య నిత్యమాశ్రమవాసినః॥

సౌన్దర్యవతులైన వారకాంతలు గొప్పదైన వనమును ప్రవేశించారు.

వారకాంతలు అంటే **వారం వారం రాజసేవార్థం అగతా వా** వీరి సహాయం అవసరమైన ప్రతిసారి రాజసేవార్థమై వచ్చునది. రాజాస్థానముల యందలి అనేకమైన ఉద్యోగములవలెనె వారకాంతలుకూడ. పరిపాలకులు

అన్ని సందర్భములలోను దండమును, యుద్ధమును ఆశ్రయించలేరు. యుద్ధములవలన ధన మాన ప్రాణములకు ఏర్పడు నష్టముయొక్క తీవ్రతను ఊహించలేము. అట్టిదానిని నివారించుటకొరకో, లేక వాటి తీవ్రతలను తగ్గించుకొనుటకో ఈ వారకాంతలను శత్రువుల అనుపానులను తెలిసికొను నిమిత్తమై ప్రయోగించెడివారు. ఈ వారకాంతలు రాజ్యరక్షణార్థమైన ప్రధానమైన ఉద్యోగాలలో ఇదియు ఒకటై పారంపర్యముగా వస్తూన్న వ్యవస్థ. ఈవారకాంతలు విభండకుని ఆశ్రమమునకు సమీపమునందుండి; మేధావి, నియతేన్ద్రియుడు, ఎల్లప్పుడు ఆశ్రమమునందే నివశించువాడు అయిన ఋష్యశృఙ్గుని దర్శనమునకు ప్రయత్నిస్తున్నారు. నిత్యసంతుష్టుడైన ఋష్యశృఙ్గుడు తండ్రియొక్క ఆశ్రమము విడచి బయట తిరిగినవాడు కాదు. జన్మప్రభృతి...

స్త్రీ వా పుమాన్వా యచ్చాన్యత్సర్వం నగరరాష్ట్రజమ్।

నగరమందలి, రాష్ట్రములోని ఇతర ప్రదేశములందలి స్త్రీగాని, పురుషుడుగాని, మరే ఇతర వస్తువులుగాని ఇతనిచే చూడబడలేదు. మనోవైక్లబ్యకారకమైన ద్వైదీభావనను ఎన్నడు పొందలేదు. అట్టి ఋష్యశృఙ్గుడు యాదృచ్ఛికంగా వారకాంతలు ఉన్న ప్రదేశమునకు వెళ్ళి వారాఙ్గనలను చూసేడు.

చిత్రమైన వేషములు ధరించి, మధురమైన కంఠముకలిగి గానము చేయుచున్న ఆ స్త్రీలు ఋష్యశృఙ్గుని సమీపించారు.

హే బ్రహ్మన్! నీవెవరు? నడవడిక ఎటువంటిది? నీవు ఒక్కడివే జనరహితమైన భయంకరమైన వనమందు ఎందుకు తిరుగుతున్నావు? మాకు తెలుసుకోవాలని కోరికగా ఉంది. చెప్పవలసినది. అని అడిగేరు.

అదృష్టరూపాస్తాస్తేన కామ్యరూపా వనే స్త్రియః।

ఆ స్త్రీలు కోరతగిన రూపములు గలవారుగా ఉన్నారు. పరమ సౌన్దర్యవతులు. ఇంతకు మునుపెన్నడు చూసిన స్వరూపాలు కావవి. అందువల్ల వారితో స్నేహం చేసేడు. తన తండ్రినిగూర్చి చెప్తున్నాడు. ఇప్పటివరకు మహర్షి **గణికాః వారముఖ్యాః వరాఙ్గనాః ప్రమదాః** అని వారినిగూర్చి చెప్పి, ఋష్యశృఙ్గ దర్శనమాత్రంచేతనే మనోగతమైన పాపచింతనలు దూరమైనవారని తెలుపుతు,

వీరిని ఇకపై స్త్రీలు అని చెప్తున్నారు.

పితా విభణ్డకోఽస్మాకం తస్యాహం సుత ఔరసః।
ఋష్యశృఙ్గ ఇతి ఖ్యాతం నామ కర్మ చ మే భువి॥

నేను విభండకుని ఔరసుడను. అంటున్నాడు. "స్వజాతే త్వౌరసౌరస్యౌ" అని అమరము దత్తక్షేత్రజాది నిరాసమును తెలుపుచున్నది. నేను గౌణపుత్రుణ్ణి కాను. ఔరసుడను అని చెప్తున్నాడు. ఔరసుడు అంటే తనవలన స్త్రీయందు (సవర్ణ) పుట్టిన కుమారునికి ఔరసుడని పేరు. ఇతడు ధీరుడని చెప్పబడ్డాడు. అంటే మేధావి అని నిరుక్తకారులు చెప్పేరు. కనుక వేదవిదితమైన గర్భవాసాది విషయజ్ఞానము కలవాడనియే అర్థం. స్త్రీ సంబంధమైన స్వరూపజ్ఞానము కలవాడే, తత్సంబంధమైన సుఖానుభవం లేనివాడు.

ఋష్యశృఙ్గుడను నాయొక్క పేరు, నేను చేయు పని భూమియందు ప్రసిద్ధము. అభేదదృష్టితో నేను ఆచరించు అగ్న్యారాధనరూపమైన ఏకర్మకలదో అది, తద్వారా నాపేరు ఈ రెండూ లోకప్రసిద్ధి పొందేయి. అని చెప్పేరు. నేను అగ్న్యారాధనయందే ఉంటాను అంటే, నేను ఈ స్వరూపములయందలి భేదములను దర్శించను. నేను దృశ్యమాన జగత్తునంతను ఏకరూపంగానే చూస్తాను. అని చెప్తున్నారు. ఇది ఆ నైష్ఠికుని మాటతీరు.

ఇహాశ్రమ పదోఽస్మాకం సమీపే శుభదర్శనాః।
కరిష్యేవోఽత్ర పూజాం వై సర్వేషాం విధిపూర్వకం॥

ఇదగో అలాగే మాట్లాడుతున్నారు కూడ! హేశుభదర్శనాః! అని సంబోధించారు. మీదర్శనమే అనంతమైన శుభాలను అనుగ్రహించేదిగా ఉంది. మా ఆశ్రమం ఇక్కడకు సమీపంలోనే ఉంది. **"సర్వేషాం పూజాం విధిపూర్వకం కరిష్యే"** విధి పూర్వకంగా మీ అందరియొక్క పూజను చేయగలను అంటున్నారు. **"శుభదర్శనాః, సర్వేషాం"** అనునవి పుంలిఙ్గ వాచక శబ్దప్రయోగములు.

ఆ ఋష్యశృఙ్గుని మాటలు విన్న ఆ వారకాంతలకు ఆ ఆశ్రమాన్ని చూడాలనే కోరిక కలిగింది. వారందరు అతనితో ఆశ్రమానికి వెళ్ళేరు.

ఇదమర్ఘ్యమిదం పాద్యం అంటూ వచ్చిన వారందరికి అర్ఘ్యపాద్యములను కందమూలములను సమర్పించి పూజించేడు. ఆ వారకాంతలు అందరు ఋష్యశృఙ్గునిచే పూజలు అందుకొని, విభండకమహర్షి రాకయందలి భయముచే తొందరగా వెళ్ళుటకు నిశ్చయించుకొన్నారు.

అస్మాకమపి ముఖ్యాని ఫలానీమాని వై ద్విజ।
గృహాణ ప్రతిభద్రం తే భక్షయస్వ చ మా చిరమ్॥

తిరిగివెళ్తూ, ఓ బ్రాహ్మణుడా! మాయొక్క ముఖ్యమైన ఫలములనుకూడా గ్రహించు ఈ ఫలములు మా సంబంధమైనవే ఇతరములు కావు. నీకు క్షేమం కలుగుతుంది. ఆలస్యం చేయవద్దు. అని

తతస్తాస్తం సమాలిఙ్గ్య సర్వా హర్షసమన్వితాః।

ఆ బాలబ్రహ్మచారిని ఆ స్త్రీలు అందరు కౌగలించుకొన్నారు. ఈ చర్యచేత సౌన్దర్యవతులైన స్త్రీల వక్షోజసంబంధమైన ఇప్పటివరకు తెలియని వశ్యకరమౌ ఒక స్పర్శ అనుభూతమైంది. వారంతా ఆనందంతో అతనికొరకు మధుర పదార్థములును, ఇతరములైన అనేక భక్ష్యములను ఇచ్చేరు.

ఇప్పటివరకు కందమూలాలనే తిన్నటువంటి వాని ఆహారంలో మార్పు చేసేరు. అన్నం మనస్సుకు కారణమగుటంజేసి మనస్సులోనూ మార్పు చోటు చేసుకొంది.

తేజస్వియైన ఋష్యశృఙ్గుడు నిత్యము వనమందు నివసించు వారిచేత పూర్వమెన్నడు ఆస్వాదింపబడనివాటిని ఆస్వాదించి; ఇవి ఫలములే అంటే పొందతగినవే అని అనుకొన్నాడు. ఇతఃపూర్వము ఎన్నడూ ఇటువంటి అనుభవావస్థ లేదు. అపూర్వ రసత్వంవలన ఇన్ద్రియములు బహిర్ముఖములు అవుతున్నాయి. ఏకరూపత కలిగిన దృష్టి విక్షేపాన్ని పొందుతోంది.

ఆపృచ్ఛ్య చ తదా విప్రం వ్రతచర్యాం నివేద్య చ।
గచ్ఛన్తి స్మాపదేశాత్తా భీతాస్తస్య పితుస్స్త్రియః॥

ఇంతలో ఆ స్త్రీలు విభండక మహర్షియందున్న భయముచే ఋష్యశృఙ్గుని అడిగి కర్మానుష్ఠానము అను మిషచేత వెళ్ళిపోయిరి.

ఇక్కడ ఋష్యశృఙ్గుని విప్రుడని చెప్పారు. తనను తాను పాపములనుండి రక్షించుకొనుచు, ఇతరులనుకూడా పాపములనుండి రక్షించువాడు విప్రుడు. ఇతడు ఈ సామర్థ్యం పూర్ణంగాకలవాడు.

ఇక్కడ వారాఙ్గనలను "స్త్రియః" స్త్రీలని అని చూపెడుతున్నారు. **"స్త్యాయతి సంఘాతో భవత్యస్యాం గర్భ ఇతి స్త్రీ"** కారణం ఇప్పటి వీరు వేశ్యాలక్షణం కలవారుకాదు. "పదిమంది నడిచేదారిలో పచ్చగడ్డికూడా మొలవదు" అని లోకోక్తి. కనుకనే వారియందలి వేశ్యా ప్రవృత్తి నశించి స్త్రీలని చెప్పబడ్డారు.

గతాసు తాసు సర్వాసు కాశ్యపస్యాత్మజో ద్విజః।
అస్వస్థ హృదయాశ్చాసీదుఃఖాత్ స్మ పరివర్తతే॥

కాశ్యప కుమారుడైన విభండకునకు ఆత్మజుడైన, ద్విజుడైన ఋష్యశృఙ్గుడు అస్వస్థ హృదయుడైనాడు. చరాచరాత్మకమైన ఈ దృశ్యమాన జగత్తును ఏకరూపంగా చూసే ఏకాగ్ర చిత్తం చెదిరిపోయింది.

తతోఽపరేద్యుస్తం దేశమాజగామ సవీర్యవాన్।
మనోజ్ఞా యత్ర తా దృష్టా రూపవత్యస్స్వలఙ్కృతాః॥

తరువాత బ్రహ్మచారియైన అతడు మరునాడు మనోజ్ఞమైన రూపవతులును, అందంగా అలఙ్కరించుకొన్నవారు అగు ఆ స్త్రీలు తనచే ఎక్కడ చూడబడ్డారో ఆ ప్రదేశానికి వెళ్ళేడు. **'మనోజ్ఞాః, రూపవత్యః'**అని స్వరూపములను గ్రహించునది మనస్సని చెప్తున్నారు. ఇది సహజస్థితికి దూరంగా కృత్రిమమైన ఆలఙ్కారిక జగత్తువైపునకు ఆకర్షింపబడుతోంది.

ఋష్యశృఙ్గుని దృష్టి ప్రకృతిగతమగుచున్నది. కనుకనే ఇన్ద్రియార్థముల కొరకైన దుఃఖస్పర్శ కలవానినిగా మహర్షి చూపెడుతున్నారు.

ఆ స్త్రీలు అతని రాకకు సంతసించారు. దగ్గరగా వెళ్ళారు. వెళ్ళి...

ఏహ్యాశ్రమపదం సౌమ్య హ్యస్మాకమితి చాబ్రువన్।
తత్రాప్యేష విధిః శ్రీమాన్ విశేషేణ భవిష్యతి॥

ఓ సౌమ్యుడా! అని పిలుస్తున్నారు. ఓ అందగాడా! అని పిలిచారు, అలా పిలుస్తూనే ఋష్యశృఙ్గుని ఇప్పటి స్థితిని చెప్తున్నారు. చన్ద్రుడు దేవతగా గలవాడా! అని పిలుస్తున్నారు. ఇప్పటి వరకు అగ్నియే దేవతగాకలవాడు.

అన్యమెరుగని వాడు. ఇప్పుడు ఆ తేజస్సు జడమైన ప్రపంచము మీద పడి ప్రతిఫలిస్తోంది, ఆకర్షిస్తోంది. ఆకర్షణీయమైన జగత్తును చూస్తున్నాడు.

ఇటువంటి ఋష్యశృఙ్గునిగూర్చి రావయ్యా! మా ఆశ్రమానికి, అక్కడ ఇంతకన్నా పరమశోభాయమానమైన సత్కారము చాలాగొప్పగా జరుగుతుంది అని పలికారు.

హృదయానందకరమైన వారి మాటలను విన్నాడు. వారి వెంట వెళ్ళుటకు నిశ్చయించుకొన్నాడు. ఆ స్త్రీలు అతనిని తీసుకొని వెళ్ళేరు.

మహాత్ముడైన ఆ విప్రుడు తీసుకురాబడుచుండగానే జగత్తును సంతోషింప చేయుచు వర్షాధిష్ఠాన దైవము వర్షించేడు.

రోమపాదుడు వర్షముతోకూడ తన అంగదేశాన్నిచేరిన ఋష్యశృఙ్గునకు ఎదురు వెళ్ళి వంగి తన శిరస్సుతో భూమిని పొందేడు.

శ్రద్ధాపూర్వకంగా అతనికొరకు అర్ఘ్యపాద్యాలను శాస్త్రప్రకారం ఇచ్చాడు. ప్రలోభపెట్టి ఇక్కడకు తీసుకొని వచ్చుటచే నీ తండ్రి కోపగించుకొను అవకాశము ఉంది, కావున నీ తండ్రికి కోపమురాకుండునట్లు అనుగ్రహించు అని వేడుకున్నాడు.

రాజైన రోమపాదుడు అంతఃపురమున ప్రవేశించి కన్యయైన శాన్తను అతనికొరకు యథావిధిగా ఇచ్చి వివాహము చేసి, శాన్తించిన మనస్సు కలవాడై ఆనందమును పొందేడు.

ఇక్కడ ఋష్యశృఙ్గుడు స్త్రీ సంబంధ సుఖానుభవమునకై వచ్చియున్నాడు. ఇన్ద్రియార్థములకై బహిర్ముఖమైన, ఇంద్రియములను శాన్తింపచేయుటకు శాన్తను ఇచ్చి వివాహము చేసి ఇన్ద్రియార్థములు ధర్మాన్ని అనుగమించునట్లుగా చేసేడు. ఋష్యశృఙ్గుడు వేదార్థమును ఎరిగిన వాడైననూ వైరాగ్యమును పొందలేదు. ధీరుడుకావున ఆవిషయాన్ని గ్రహించివాడై వివాహం చేసుకొన్నాడు. **ద్వైవిధ్యం బ్రహ్మచర్యస్య భవిష్యతి మహాత్మనః** అని సనత్కుమారుడు బ్రహ్మచర్యమును గూర్చి చెప్పిన ద్వివిధత్వం శాస్త్రవిదితమైన సాంసారిక జీవితం ప్రారంభమైంది.

ఏవం స న్యవసత్తత్ర సర్వకామైః సుపూజితః॥

ఋష్యశృఙ్గుడు ఈ విధంగా సర్వకామనలచే బాగుగా పూజింపబడిన వాడై ఆ అంగరాజ్యమునందే నివసించాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు

బాలకాణ్డయందలి

దశమస్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకాదశః సర్గః॥

(దశరథుని అంగదేశ గమనము, శాన్తా ఋష్యశృఙ్గులను అయోధ్యకు తీసుకొని వచ్చుట)

భూయ ఏవహి రాజేన్ద్ర శృణు మే వచనం హితమ్।
యథా స దేవప్రవరః కథాయామేవమబ్రవీత్॥

దశరథమహారాజా! నాయొక్క హితకరమైన మాటలను, దేవతలలో శ్రేష్ఠుడైన సనత్కుమారుడు ఏవిధంగా చెప్పేరో, ఆ విధంగా, మరల వినుము.

ఇక్ష్వాకూణాం కులే జాతే భవిష్యతి సుధార్మికః।
నామ్నా దశరథో నామ శ్రీమాన్ సత్యప్రతిశ్రవః॥

శ్రీమంతుడు, సత్యమైనప్రతిజ్ఞకలవాడు, దశరథుడను పేర పిలువబడువాడు, గొప్పధార్మికుడైనవాడు ఇక్ష్వాకుల కులమందు భవిష్యత్తులో పుట్టగలడు.
ఆ దశరథునకు అంగరాజుతో స్నేహంకూడా కాగలదు. ఈ అంగరాజునకు మహాభాగ్యవతియైన శాన్తయనెడు కుమార్తె కలుగ గలదు.
మహాయశస్వియైన దశరథమహారాజు అంగరాజు పుత్రుడైన రోమపాదుని వద్దకు వెళ్తాడు. వెళ్ళి... ఓధర్మాత్ముడా! రోమపాదా! నేను సంతానము లేనివాడనై ఉన్నాను. శాన్తయొక్క భర్తఅయిన ఋష్యశృఙ్గుడు నీచేత ఆజ్ఞాపింపబడినవాడై నాయొక్క కులవృద్ధికొరకు యజ్ఞాన్ని నిర్వహించుగాక!

శ్రుత్వా రాజ్ఞోఽథ తద్వాక్యం మనసా స విచిన్త్య చ।
ప్రదాస్యతే పుత్రవన్తం శాన్తా భర్తారమాత్మవాన్॥

బుద్ధిమంతుడైన రోమపాదుడు, దశరథ వాక్యాన్ని విని, తరువాత మనసా ఆలోచించి పుత్రులుగల శాన్తయొక్క భర్తను దశరథునికొరకు ఇవ్వగలడు.
ఇక్కడ బుద్ధిమంతుడైన రోమపాదుడు ఆలోచించాడు అన్నారు. ఆలోచించిన విషయం ఏమిటి? అంటే...

అంగోఽశ్వమేధం రాజర్షిరాజహార మహాక్రతుమ్।
నాజగ్ముర్దేవతాస్తస్మిన్నాహూతా బ్రహ్మావాదిభిః॥ (భాగవతం)

పూర్వం తనవంశీయుడే అయిన అంగుడు అను రాజర్షి అశ్వమేధయాగం చేస్తూండగా, ఋత్విజులు ఆహ్వానించినా దేవతలు హవిర్భాగాలను

స్వీకరించుటకు రాలేదు.

అప్పుడు ఋత్విజులు యజమానుడైన అంగభూపతితో

తథా స్వభాగధేయాని గ్రహీష్యంతి దివౌకసః।
యద్యజ్ఞపురుషః సాక్షాదపత్యాయ హరిర్వృతః॥ (భాగవతం)
తాంస్తాన్కామాన్ హరిర్దద్యాత్ యాన్యాన్కామయతే జనః।
ఆరాధితో తథైవైష యథా పుంసాం ఫలోదయః॥ (భాగవతం)

ఓమహారాజా! నీవు నిస్సంతుడవు కావున దేవతలు హవిర్భాగాలు భుజించుటకు రాలేదు. ముందు నీవు పుత్రకామేష్టి యాగాన్నిచేసి పుత్రుణ్ణి పొందు. తురువాత దేవతలు సంతోషపూర్వకంగా ఆహుతులు స్వీకరిస్తారు అని చెప్పగా అంగుడు శిపివిష్ట దేవతాకం అయిన పురోడాశంతో హెూమం చేసాడు.

తస్మాత్పురుష ఉత్తస్థౌ హేమమాల్యమలాంబరః। హిరణ్మయేన పాత్రేణ సిద్ధమాదాయ పాయసమ్॥ సా తత్పుంసవనం రాజ్ఞీ ప్రాశ్య వై పత్యురాదధే। గర్భం కాల ఉపావృత్తే కుమారం సుషువేఽ ప్రజా॥ (భాగవతం)

అంగరాజునకు యజ్ఞపురుషుడు పసిడిపాత్రలో పాయసం ఇచ్చాడు. ఆ పాయసాన్ని అంగుడు భార్యయైన సునీథకు ఇచ్చాడు. పతి సంయోగంవల్ల ఆమె వెంటనే గర్భం ధరించి కుమారుణ్ణి కన్నది.

ఇదిగో ఈ విషయాన్ని ఆలోచించాడు రోమపాదుడు.

ఇక్కడ శాన్తను దశరథునకు దత్తత ఇచ్చి, శాస్త్రము అంగీకరించిన విధంగా దశరథుని సంతానవంతునిగా చేసేరు. పుత్రవంతుడైన ఋష్యశృఙ్గుడు పుత్రులను అనుగ్రహింపగల సామర్థ్యం కలవాడు. ఏది కలిగి ఉంటామో దానిని మాత్రమే దానం చేయగలము, లేదా దానిని పొందు ఉపాయాన్ని చెప్పగలవారుగా ఉంటారు.

ప్రతిగృహ్య చ తం విప్రం స రాజా విగతజ్వరః।
అహరిష్యతి తం యజ్ఞం ప్రహృష్టే నాన్తరాత్మనా॥

దశరథుడు విప్రుడైన ఋష్యశృఙ్గుని స్వీకరించి, తొలగిన మనోవ్యధ కలవాడై సంతోషాంతరంగుడై యజ్ఞమును అనుష్ఠింపగలడు.

కిల్బిషములే దుఃఖహేతులగుటం జేసి విప్రుడైన ఋష్యశృఙ్గని ఆశ్రయించిన వెంటనే గతకిల్బిషుడైనాడు. హృదయం ఆనందంతో నిండిపోయింది. ఇటువంటి వాడు యజ్ఞమును అనుష్ఠించుటకు అర్హుడు.
మలిన మనస్కులు యజ్ఞకర్తగా పనికిరారు.

తం చ రాజా దశరథోయష్టుకామః కృతాఞ్జలిః।
ఋష్యశృఙ్గం ద్విజశ్రేష్ఠం వరయిష్యతి ధర్మవిత్॥
యజ్ఞార్థం ప్రసవార్థం చ స్వర్గార్థం చ నరేశ్వరః।
లభతే చ స తం కామం ద్విజముఖ్యాద్విశాంపతిః॥

యాగము చేయవలెనను కోరికగలవాడు, ధర్మముల నెఱింగినవాడు, నరులకును చకారమువలన నరేతరములకు (జటాయువు మొదలగు వాటికి) ప్రభువైన దశరథమహారాజు అంజలిబద్ధుడై యజ్ఞముకొరకు సంతానము కొరకును స్వర్గముకొరకుకూడా కోరగలడు. ఆ రాజు ద్విజశ్రేష్ఠుడైన బ్రాహ్మణుని వలన ఆ కోరికను పొందుతాడుకూడ.
ఈ మహారాజునకు అమితపరాక్రమముగల వంశమునకు పేరు తెచ్చువారును, సర్వలోక ప్రసిద్ధులైన నలుగురు పుత్రులు పుట్టగలరని...

ఏవం స దేవప్రవరః పూర్వం కథితవాన్ కథామ్।
సనత్కుమారో భగవాన్ పురా దేవయుగే ప్రభుః॥

ఈ విధంగా పూర్వము కృతయుగములో ఈ కథను సనత్కుమారుడు చెప్పేరు. కావున పురుషశ్రేష్ఠుడవైన ఓ మహారాజా! అట్టి నీవు చతురంగ బలాలతోడను, వాహనముతోడను కూడిన వాడవై స్వయముగా వెళ్ళి ఆ ఋష్యశృఙ్గని బాగుగా సత్కరించి తీసుకొని రమ్ము.
దశరథుడు సుమంత్రుని వాక్యమును విని, వసిష్ఠుని అంగీకరింపజేసి, అన్తఃపురముతో కూడినవాడై అంటే సపత్నీకుడై అమాత్యసహితుడై ఆ బ్రాహ్మణుడైన ఋష్యశృఙ్గుడు ఎక్కడ ఉన్నాడో అక్కడకు వెళ్ళేడు.
వనములను, నదులను మెల్లగా దాటుచు, ఆ మునిశ్రేష్ఠుడు ఉండు చోటునకు ప్రవేశించేడు.

రోమపాదుని సమీపించి, అతని సమీపమునందున్న వాడును, ప్రకాశిస్తూన్న అగ్నివలెనున్నవాడును బ్రాహ్మణుడును అయిన ఋషిపుత్రుని ముందుగానే చూసాడు.

రోమపాదుడు సంతోషాన్తరంగుడై యథావిధిగా స్నేహితుడైన దశరథుని విశేషముగా పూజించేడు.

రోమపాదుడు తనకు దశరథునకు మధ్యనున్న స్నేహమును బాంధవ్యమును ఋష్యశృంగునకు చెప్పగా అతడుకూడా దశరథుని పూజించేడు. ఈ విధముగా సత్కారములను అందుకొంటు రోమపాదునితో కలిసి ఏడెనిమిది దినములు ఉన్నాడు. తరువాత రోమపాదుని ఉద్దేశించి, ప్రజలకు ప్రభువైన ఓ రాజా! కుమార్తె అయిన శాన్తను భర్తతోసహా నా నగరానికి పంపు అతడు చేయవలసిన గొప్పకార్యం ఒకటి సంభవించింది. అని చెప్పేడు.

రోమపాదుడు అటులనే అని బుద్ధిమంతుడైన ఋష్యశృఙ్గుని పంపుటకు అంగీకరించి; భార్యాసహితుడవై వెళ్ళమని విప్రుడైన ఋష్యశృఙ్గునితో పలికేరు. ఋషిపుత్రుడైన ఋష్యశృఙ్గుడు అటులనే చేసెదనని రాజుతో పలికి రాజుయొక్క అనుజ్ఞ తీసుకొని భార్యాసహితుడై ప్రయాణమయ్యేడు.

దశరథుడు, పరాక్రమశాలియగు రోమపాదుడు ఒకరికొకరు అంజలించుకొని, స్నేహమున రొమ్ముల కౌగిలించుకొని సంతోషించేరు.

దశరథుడు మిత్రుని వీడ్కొని, అయోధ్యకు ప్రయాణమై, శీఘ్రముగా వెళ్ళగలిగిన దూతలను అయోధ్యా పౌరులకొరకు పంపేడు.

దూతలద్వారా పురప్రజలకు “సమస్తమైన నగరమును వెంటనే బాగుగా అలంకరించండి, ధూపమును వేయండి, మార్గములను తడిపి తుడవండి, పతాకములచే అలంకరించండి” అని వర్తమానము పంపేడు.

పౌరులు రాజాజ్ఞను అనుసరించి నగరమును అలంకరించారు.

దశరథుడు ఆ బ్రాహ్మణశ్రేష్ఠుని ఎదుట ఉంచుకొని బాగుగా అలంకరింపబడిన నగరమును మంగలవాద్యములతో ప్రవేశించేడు. పౌరులెల్లరు ఇన్ద్రునివంటి కర్మగల నరేన్ద్రునిచే సత్కరింపబడి ప్రవేశపెట్టబడుచున్న ఆ బ్రాహ్మణుని చూచి సంతోషించారు.

ఋష్యశృఙ్గుని అన్తఃపురానికి తీసుకొని వెళ్ళి యథావిధిగా పూజించి, అతనికి సమీపమున ఉండుటవలన దశరథుడు తనను తాను కృతకృత్యునిగా భావించేడు.

అన్తఃపుర స్త్రీలందరు భర్తతోకూడ వచ్చిన విశాలమైన నేత్రములుగల శాన్తను చూచి ప్రేమతో ఆనందాన్ని పొందేరు.

ఆమె దశరథమహారాజుచేతను, మిగిలిన అన్తఃపురవాసులచేతను విశేషముగా పూజింపబడుచున్నదై సుఖముగా ఋత్విక్కు అయిన ఋష్యశృంగునితో కలిసి కొంతకాలము అచటనే నివసించింది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకాదశస్సర్గ సమాప్తము.

-

॥అథ ద్వాదశః సర్గః॥

(అశ్వమేధమును నిర్వాహణకొరకు ఋషులనడుగుట వారు యజ్ఞసంభారాలను సమకూర్చుకొనమనుట దశరథుడు వాటికై తన మంత్రులను ఆజ్ఞాపించుట)

తతః కాలే బహుతిథే కస్మింశ్చిత్సుమనోహరే।
వసన్తే సమనుప్రాప్తే రాజ్ఞోయష్టుం మనోభవత్॥

తరువాత చాలా తిథులు గడచి సుమనోహరమైన వసంతఋతువు వచ్చింది, దశరథునకు యజ్ఞము చేయుటకు మనసైంది.

"అయనం చోత్తరం శస్త మప్రశస్తం తు దక్షిణమ్।
వసంతే తు ఋతౌ ప్రాప్తే యజ్ఞ కర్మ ప్రశస్యతే॥"

యజ్ఞం చేయుటకు ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసము ప్రశస్తమైనదని చెప్పబడుతోంది. శాస్త్రబద్ధంగా వసంత చైత్రంలోనే యజ్ఞకర్మ ప్రారంభింపబడింది.

తతః ప్రసాద్య శిరసా తం విప్రం దేవవర్ణినమ్
యజ్ఞాయ వరయామాస సన్తానార్థం కులస్య వై॥౨

అంతట దేవతుల్యుడును పాపములనుండి రక్షించువాడును అయిన ఋష్యశృఙ్గునికి శిరస్సువంచి నమస్కరించి అనుగ్రహమును పొంది **కులముయొక్క అనవచ్ఛిన్నత్వముకొరకు** యజ్ఞము చేయించుటకై వరించేడు. ఇక్కడ దశరథుడు తన యజ్ఞసంకల్పం చెప్పేరు.

దశరథుడు ఋష్యశృఙ్గునకు నమస్కరించి, వస్త్రాదులను సమర్పించి పూజించి అనుగ్రహింపచేసుకొని ఋత్విగ్వరణం చేస్తున్నారు.

సుసత్కృతుడైన ఋష్యశృఙ్గుడు అటులనే అని రాజునుగూర్చి యజ్ఞసంభారాలు ఏర్పాటుచేసి, అశ్వము విడయిపెట్టు, అని అన్నారు.

అటుపై దశరథుడు అమాత్యవరేణ్యుడైన సుమంత్రునిగూర్చి ఓసుమంత్రుడా! వెంటనే బ్రహ్మావాదులైన ఋత్విక్కులను సుయజ్ఞుని వామదేవుని జాబాలిని మరియు కాశ్యపుని పురోహితుడైన వసిష్ఠుని ఇంకను ఇతరులైన బ్రాహ్మణోత్తములను రప్పింపుము అని పలికేడు.

ఇలా ఆహ్వానించటానికి సాంగ్రహణేష్టి అని పేరు. బ్రహ్మనుండి సుబ్రహ్మణ్యుని వరకు మొత్తం పదహారుగురు ఉంటారు.

వీరు **బ్రహ్మ అధ్వర్యుడు హోత ఉద్గాత అగ్నీధ్రుడు మైత్రావరుణుడు ప్రతిప్రస్థాత ప్రస్తోత; బ్రాహ్మణాచ్ఛంసి అచ్ఛావాకుడు నేష్టా ప్రతిహర్త గ్రావస్తుత పోత ఉన్నేత సుబ్రహ్మణ్యుడు** అనువారు. ఇందులో బ్రాహ్మణాచ్ఛంసి నుండి సుబ్రహ్మణ్యుడువరకు ఉన్న ఎనిమిదిమంది ఋత్విజులు సోమార్థమైన వారు. వీరికి యజ్ఞదీక్షా ప్రారంభానికి ముందురోజు వరుణ ఇస్తారు.

బ్రహ్మనుండి ప్రస్తోతవరకు ఉన్న ఎనమండుగురు ఋత్విక్కులను **సోమప్రవాక్** అను వానితోకలిసి వెళ్ళి పిలవాలి.

బ్రహ్మ అధ్వర్యుడు హోత అగ్నీధ్రుడు అను నలుగుర్ని గజాశ్వాది శ్రేష్ఠమైన వాహనాలపై పూర్ణిమాతిథినాడు తీసుకురావాలి. అనంతరంవచ్చు అమావాస్యనాడు సంజ్ఞానేష్టి (యజ్ఞార్థం వరుణ)కొరకు వారివద్దకు వెళ్ళాలి. వైశాఖపూర్ణిమనాడు మైత్రావరుణ ప్రతిప్రస్థాత అను ఋత్విజుల్ని శ్రేష్ఠమైన వాహనాదులపై తీసుకువచ్చి యజ్ఞార్థం వరించాలి. వైశాఖదర్శినాడు ఉద్గాతను శ్రేష్ఠమైన వాహనాదులపై తీసుకువచ్చి యజ్ఞార్థం వరించాలి.

తరువాత మళ్ళీవచ్చే వసంత చైత్ర పంచదశినాడు ప్రస్తోతను శ్రేష్ఠమైన వాహనాదులపై తీసుకువచ్చి యజ్ఞార్థం వరించాలి. దీనికి **త్రైధాతవీయష్టి** అని పేరు. సుమంత్రుడు శీఘ్రముగా వెళ్ళి వేదపారంగతులైన వారినందరిని తీసుకొని వచ్చేడు.

మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖమ్
తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ॥ ౮

ధర్మాత్ముడైన దశరథమహారాజు వారినందరిని పూజించి సంతానముకొరకు అశ్వమేధయాగము చేయగోరుతున్నానని పలికేరు. ఇది సంతానార్థమని ముందూ చెప్పేరు. ఇక్కడ పునఃచెప్తున్నారు. ఇతఃపూర్వము **సన్తానార్థం కులస్య** అని చెప్పిన దానియందు కేవలము పితౄణం తీర్చుకొను నిమిత్తంగానే **ప్రజాతంతుం మాం వ్యవచ్ఛేత్సీః** అని వేదం చెప్పిన విధంగా నేను సంతానం

కోరుతున్నాను అన్నారు. అంతేకాని పున్నామనరకాదుల భయంకాదు. ఇది ధర్మం. ఇంతమాత్రమే అయితే ఒక పుత్రుడు సరిపోతాడు. ఇది పరమ ప్రయోజనం.

పిల్లలతో ఆడుకోవాలన్న ధ్యాసకూడా లేకుండా ఇంత సుదీర్ఘకాలం పరిపాలనాది రాచకార్యాలతోనే గడిచిపోంది. ఇప్పుడు ఈ యజ్ఞంవల్ల నా వంశవృద్ధి జరుగుతుంది. తద్వారా నేనూ పిల్లలతో ఆడుకొనె ఆనందమూ దక్కుతుంది. ఈ ఫలం ఆనుషంగికం. దశరథ సంకల్పం వంశవృద్ధికొరకే. దీనికొరకు యథాశాస్త్రముగా యాగము చెయ్యాలనుకుంటున్నాను. ఋషిపుత్ర ప్రభావముచే నేను సంకల్పసిద్ధిని పొందగలనుకూడా అన్నారు.

వెంటనే ఋష్యశృఙ్గాది మహర్షులందరు **యజ్ఞసంభారములను సమకూర్చు. అశ్వమును విడిచి పెట్టు** అని పలికేరు.

నీకు పుత్రార్థమై ధర్మ సమ్మతమైన బుద్ధికలిగినందులకు అమితపరాక్రమ వంతులైన నలుగురు పుత్రులను పొందుతావు అని పలికేరు. పితౄణం తీర్చుకొను నిమిత్తం అయితే ఒక్కడుచాలు, మరి నలుగురు అని ఎందుకు చెప్పేరు! అంటే ఆనుషంగిక ఫలాన్ని దృష్టియందుంచుకుని. ఒక్కడితో ఆడుకోవడంకంటే సంతాన బహుత్వంచేత ఎక్కువ ఆనందాన్ని పొందుతాడని దశరథుని ధర్మనిష్ఠకు సంప్రీతితో ముందే వరం అనుగ్రహించారు.

దీనికి సంతసించిన దశరథుడు, తన మంత్రులతో...

గురువులు చెప్పిన విధముగా యజ్ఞసంభారములను సమకూర్చి, వీరులచే రక్షింపబడుచున్న, ఉపాధ్యాయులతోకూడిన అశ్వమును విడిచిపెట్టండి అన్నారు. యజ్ఞీయాశ్వమోచన ఉపకరణం అంటే ద్వాదశారత్నుల (పండ్రెండు మూరల) పొడవైన ముంజెత్రాడు. దీనిని అశ్వమును కట్టుటకు ఉపయోగిస్తారు. ఈ అశ్వాన్ని రక్షించుటకై నాలుగువందలమంది వీరులు అనుసరిస్తూంటారు.

"సన్నాహవంతః క్షితిపాలపుత్రా స్సన్నద్ధసూతా శ్శతమస్య తల్ప్యాః। గోపాయితారశ్శతమేవ ముగ్రా స్సన్నాహి నస్తాదృశ సూనుయుక్తాః। వైశ్యాశ్శతం ప్రాంతచరాః పథిస్యుర్వరూథిపస్తై శ్శత మేవ శూద్రా" అని భట్టభాస్కరులు. ఇక్కడ చాతుర్వర్ణాల వారు రక్షకులుగా అధ్వర్యుడు బ్రహ్మ హొూత అగ్నీధ్రుడు

అను వారితోకలిసి అనుసరిస్తారు.
అధ్వర్యుడు తనవారితోకూడి ముఖస్థానంలో (తూర్పున) ఉంటాడు.
బ్రహ్మ తనవారితో దక్షిణస్థానంలో ఉంటాడు.
హెూత తనతో ఉన్న వందమందితోకలిసి పశ్చిమాన ఉంటాడు.
అగ్నీధ్రుడు తనవారితో ఉత్తరాన ఉంటాడు.
నాలుగు వర్ణాలవారు అనటంలో సామ దాన భేద దండోపాయాలచే ఈ అశ్వముయొక్క స్వేచ్ఛాగమనాన్ని కాపాడుతూంటారు. సమయాసమయాలను చూసి హితవు చెప్పుటకు ప్రకృతిశక్తులనుండి రక్షించుటకు ఉపాధ్యాయ సహితంగా చతుశ్శత (నాలుగువందల) సేనావాహిని బయలుదేరి వెళ్ళింది.

సరయ్వాశ్చోత్తరే తీరే యజ్ఞభూమిర్విధీయతామ్।

సరయూ ఉత్తరతీరాన యజ్ఞభూమిని ఏర్పాటుచేయమని ఆజ్ఞాపించేడు.
ఈ భూమి **'సుపద్మా భద్రకా పూర్ణా ధూమ్రా చేతి చతుర్విధా'** అని నాలుగు విధాలుగా ఉంటుంది. ఇందు మొదటి మూడు సుపద్మా, భద్రకా, పూర్ణా (సుపూర్ణా) అనునవి యజ్ఞము చేసుకొనుటకు అనువైన భూములు.

నదీనాం సాగరస్యాపి పార్శ్వస్థా తీర్థశోభితా
ఫలవృక్షైః పుష్పవృక్షై క్షీరవృక్షైశ్చ సంయుతా।
లతాగుల్మాదిభిర్యుక్తా ఉద్యానోపవనాన్వితా।
వ్రీహిక్షేత్రైః కుశైః కాశైర్యజ్ఞవృక్షై స్సమావృతా
అధోజల సమోపేతా భద్రకేతి ప్రకీర్తిత॥

అని భద్రకా లక్షణం చెప్పబడింది. సరయూ ఉత్తరతీర భూమి భద్రకా లక్షణము కలది. యాగనిర్వాహణకు యోగ్యమైనది.

సుపద్మా సుఖదా భూమి శ్శాన్తిదా స్వశోభనా।
భద్రకాభీష్టదా బ్రహ్మన్ ఆయురారోగ్య భాగ్యదా॥

ఇక్కడ చేసిన యజ్ఞము అభీష్టమును, ఆయువును, ఆరోగ్యమును భాగ్యమును ఇచ్చునదిగా ఉంటుంది.
ఈ భూమియందు శాస్త్రోక్తముగా నియమబద్ధంగా శాన్తికార్యములను జరిపించండి అంటున్నారు. అంటే వేది నిర్మాణం దగ్గరనుండి జరుపవలసిన

శాన్తిపుష్టి కార్యములను యథాశాస్త్రముగా జరిపించండి అంటున్నారు.
యజ్ఞముకొరకు స్థలనిర్ణయం చేసిన తరువాత ఆ భూమికి ఖనన బీజావాప రస వర్గ పరీక్షలు చేసి నిర్ణయిస్తారు.
దండప్రమాణంలో త్రవ్వి ఖనన పరీక్షచేస్తారు. బీజములు ఎంతకాలమునకు మొలకెత్తుచున్నవో చూచి భూమియొక్క యోగ్యతను నిర్ణయిస్తారు. మూడురాత్రుల లోపు శాలి యవాది బీజములు మొలకెత్తిన అది ఉత్తమమైన భూమి. ఆ ప్రాంతమునందలి నీరు మధురంగా ఉందా లేదా అని చూస్తారు. యజ్ఞభూమి శ్వేతవర్ణములో ఉండాలి. అలా ఉందా లేదా?
ఇవి అన్నీ చూసి స్థలనిర్ణయం చేయాలి. అలా నిర్ణయింపబడిన స్థలంలో ప్రవేశించుటకు ముందు ప్రవేశబలులు సమర్పించాలి.
పూర్ణకుంభాన్ని ధూప దీప ధ్వజ ఛత్రాదులను ధరించి భక్తసంఘం వెంటరాగా బ్రాహ్మణుల వేదఘోషచేత ప్రదక్షిణంగా పరిక్రమణంచేస్తూ స్వస్తివాచనముల చేతను మహానారాయణసూక్తం పురుషసూక్తం ఇతరములైన స్వస్తిసూక్తములు పఠించుచూ; దిక్కులయందు విదిక్కులయందు బలిని విచిపెట్టాలి. ఈ భూమి అంతా పిశాచ రాక్షసాధీనంగా ఉంటుంది. ఇదంతా యజ్ఞ నిర్వాహణార్థం యజమాని స్థలముకొరకు వాటిని ప్రసన్నం చేసుకొను ప్రక్రియ.
పిశాచ భూత రాక్షసాదులకు గ్రహములకు నాగములకు ఇంకను ఇతరములైన వాటికొరకు మాషాన్నలాజ సంయుక్తంగా అపూపాదులనుకూడ సమర్పించాలి. బ్రహ్మస్థానంలో ప్రత్యేకంగా పాయసబలి సమర్పించాలి.
అనంతరం వాస్తుబలి ఇవ్వాలి. తరువాత యజ్ఞార్థం శాస్త్రవిధిని అనుసరించి వృషభము, **నాగలి** ఉపయోగించి భూములను దున్నాలి. వృషభములను కట్టుటకు ఉపయోగించు యుగం (కాడి), యజమాని క్షత్రియుడు కావున **న్యగ్రోధ**(మఱ్ఱి)యై యుండాలి. బ్రాహ్మణుడు పాలాశమును (మోదుగ); వైశ్యశూద్రులు జువ్విని కాడిగా వినియోగించాలని స్మృతుల నిర్ణయం. ఈ విధంగా నిర్ణయింపబడిన భూమియందు బాహ్యాభ్యన్తర న్యాసములు అఖండదీపస్థాపన సర్వతోభద్రమండల దేవతాస్థాపన కలశస్థాపనము చేయాలి.

కలశలో **సప్తధాన్యములను** ఉంచాలి. అవి యవలు, వడ్లు (వ్రీహిబియ్యం), నువ్వులు, ప్రియంగు (కొఱ్ఱలు) పెసర్లు శనగలు సామలు ఇవి సప్త ధాన్యములు. తరువాత కలశలో **రత్నాలు** ఉంచాలి.

కనకం కులిశం ముక్తా పద్మరాగం చ నీలకమ్।
ఏతాని పంచరత్నాని సర్వకార్యేషు యోజయేత్॥

బంగారం వజ్రం ముత్యం పద్మరాగం నీలం ఇవి పంచరత్నాలు. లేదా వజ్రం ముత్యం పద్మరాగం నీలం మరకతం గోమేధికం పుష్యరాగం పగడం అని నవరత్నాలు. వీటిని కలశయందు ఉంచాలి.

పంచపల్లవాలను వేయాలి. అవి మఱ్ఱి మేడి రావి, మామిడి జువ్వి అనునవి.

ఓషధులను వేయాలి. అవి ముర జటామాంసి వజ్ర చెంగల్వకోష్టు శిలాజాత్తు పసుపు మరియు మానిపసుపు గంధకచూరలు సంపెంగ తుంగముస్తెలు.

సప్తమృత్తికలు వేయాలి. అవి అశ్వశాల గజశాల వల్మీకము (పుట్టమన్ను) నదీసంగమస్థలము తటాకము రాజద్వారము గోశాల ఈ స్థలములయందలి మృత్తికలను వేయాలి.

అధిదేవతా ప్రత్యధిదేవతా సహితంగా నవగ్రహాలను, యోగినీగణములను స్థాపనచేయాలి. నైరృతిలో వాస్తుమండలాన్ని వేయాలి. వాయువ్యంలో క్షేత్రపాలపీఠస్థాపన చేయాలి. శాస్త్రప్రమాణాన్ని అనుసరించి హోమకుండ నిర్మాణం చేయాలి. మొత్తం హోమకుండం పొడవు వెడల్పులు 24"X24" గా ఉండాలి. ఈ 24 అంగుళముల ప్రమాణం యజమాని పరిమాణమును అనుసరించి మారుతుంది. కాలిబొటన వ్రేలునుండి బ్రహ్మరంధ్రమువరకు ఒక త్రాడుతో కొలిచి, దానిని 96 భాగలుగా చేసిన, అందలి ఒక భాగము ఒక అంగుళము అనబడును. ఈ ప్రమాణమును అనుసరించి కుండ నిర్మాణమును జరుపుతారు.

విఘ్నం కలిగించుటకు ఎక్కడ తప్పు దొర్లుతుందా అని ఎదురుచూసే చదువుకున్న మూర్ఖులు ఉంటారు. వీరే బ్రహ్మరాక్షసులు. వీరి బారిన పడకుండా క్రతువును నిర్వహించండి. అందుకు మీరు సమర్థులే కదా! అని అంటున్నారు.

మంత్రులందరు దశరథుని అభినందించారు. అతడు ఆజ్ఞాపించిన విధంగానే చేసారు.

పిమ్మట ద్విజులందరు ధర్మము తెలిసిన రాజశ్రేష్ఠుని స్తుతించి, రాజుచే అనుజ్ఞపొందినవారై ఎలా వచ్చారో తిరిగి అలాగే వెళ్ళేరు.

బ్రాహ్మణులుకూడ వెళ్ళిన తరువాత తేజశ్శాలియగు రాజు మంత్రులనుకూడ పంపివేసి తన గృహమును ప్రవేశించాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాండయందలి
ద్వాదశస్సర్గ సమాప్తము.

–

॥అథ త్రయోదశ స్సర్గః॥

(దశరథుని యజ్ఞదీక్షా స్వీకారము)

పునఃప్రాప్తే వసన్తే తు పూర్ణస్సంవత్సరోఽభవత్।
ప్రసవార్థం గతో యష్టుం హయమేధేన వీర్యవాన్॥

మరల వసంతఋతువు వచ్చింది. సంవత్సరము పూర్తి అయింది. ఇక్కడ దశరథుని వీర్యవాన్ అని అన్నారు. క్రిందటి సంవత్సరము వసంతచైత్రమందు యజ్ఞదీక్షితుడైనాడు. కావున ఏడాదిగా బ్రహ్మచర్యమందున్న వాడు. అట్టి దశరథుడు సంతానార్థం అశ్వమేథముచే దేవతలను పూజించుటకు యజ్ఞశాల యందు ప్రవేశించేరు.

మొదటి వసంత చైత్రపూర్ణిమయందు సాంగ్రహణేష్టిచేసి ప్రతిపత్తునందు బ్రహ్మౌదన మేధ్యాశ్వబంధన స్నాపన ప్రోక్షణ విమోచనాదులు చేయాలి. ఆవిధంగా చేసి నలుగురు ఋత్విక్కులు సిద్ధంగా ఉండాలి. తరువాత **సావిత్రమష్టాకపాలం ప్రాతర్నిర్వపతి** అను నియమమును అనుసరించి ప్రతిదినము సావిత్రాదికర్మలు వచ్చే వసంతచైత్రము వరకు చేస్తూండాలి. క్రతు నిర్విఘ్నపరిసమాప్తికి సవితృదేవతానుగ్రహము ఆవశ్యకము. సర్వకర్మారంభమున సావిత్ర హెూమము చేయవలెనని ఉన్ననూ, **అశ్వస్సుత్యాయాః** అని శ్రుతి సంకోచము చేసింది. సావిత్రహెూమము సుత్యాదినముకంటే పూర్వము చేసినచాలు తరువాత అక్కరలేదని **ప్రాక్ సూత్యాయాః** సూత్రముచే కాత్యాయనశ్రౌత సూత్రము విధించింది. తైత్తిరీయ శ్రుతి సవనత్రయారంభములందు చేసిన చాలునని చెప్పింది.

ద్విజోత్తముడు అనగా బ్రాహ్మణుడైన వసిష్ఠునికి నమస్కరించి యథావిధిని పూజించి సంతానముకొరకు వినయముతో మాట్లాడుతున్నాడు.

మునిపుంగవుడవైన ఓబ్రాహ్మణుడా! నాయొక్క యజ్ఞము శాస్త్రోక్తరీతిగా చేయబడుగాక! యజ్ఞాంగములలో ఏవిధమైన విఘ్నములు కలుగకుండునట్లు చేయండి.

నీవు నాకు గురువు, స్నేహితుడవు. సహృదయుడవు.

సర్వశ్రేష్ఠుడవు. పూజ్యుడవు. ప్రారంభింపబడిన యజ్ఞభారము నీవే వహింప

తగినది. అని దశరథుడు ప్రార్థించాడు.
బ్రాహ్మణోత్తముడైన వశిష్ఠుడు, దశరథునిగూర్చి నీచేత ఏది ప్రార్థింపబడినదో ఏది నిర్ణయింపబడిందో ఆవిధంగానే చేయగలను అని పలికేరు.

తతోఽబ్రవీద్ద్విజాన్వృద్ధాన్యజ్ఞకర్మ సునిష్ఠితాన్
స్థాపత్యే నిష్ఠితాంశ్చైవ వృద్ధాన్ పరమధార్మికాన్॥
కర్మాన్తికాన్ శిల్పకారాన్ వర్ధకీన్ ఖనకానపి
గణకాన్ శిల్పినశ్చైవ తథైవ నటనర్తకాన్॥ ౬
తథాశుచీన్ శాస్త్రవిదః పురుషాన్ సుబహుశ్రుతాన్।
యజ్ఞకర్మ సమీహన్తాం భవన్తో రాజశాసనాత్॥ ౭
ఇష్టకా బహుసాహస్రీ శీఘ్రమానీయతామితి।

యజ్ఞకర్మయందు నిష్ణాతులైన వృద్ధులైన ద్విజులు **వృద్ధత్వం జరసావినా** అని రఘువంశంలో మహాకవి అన్నట్లుగా వీరి వృద్ధత్వం అనుభవజ్ఞానరూప మైనది. అంటే జ్ఞానవృద్ధులైన ద్విజులు. పరమధార్మికులైనవారిని వాస్తుకర్మ యందు సమర్థులైనవారిని కార్యనిర్వాహకులను శిల్పకారులను– వీరు కుండముల, వేదీ నిర్మాణములకు కావలిసిన విధంగా ఇటుకలు శంకువులు మొదలైనవి చేయువారు. వారిని...
వఢ్రంగులను భూమిని త్రవ్వువారిని, గణకులను వీరు యజ్ఞ నిర్వాహణకు వలయు ఆర్థికప్రణాళికలను సిద్ధంచేయువారు. అంతేకాదు లేఖకులుకూడా. వీరు క్రతు సంబంధమైన ఆహ్వానాలను వ్రాసి పిలవతగిన వారికి పంపుతారు, ఆహ్వానాలను జనసమర్దమైన బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేస్తారు. వీరినీ... వర్ణచిత్రాదులను నిర్మించు శిల్పులను మరియు యజ్ఞవిరామ సమయము లందు విశ్రాంతినిపొందుటకై నటులను రసభంగముకాకుండా హావభావము లను అభినయించు నటనర్తకులను వీరినీ...
శుచీన్ శాస్త్రవిదః అంటున్నారు. పరిశుద్ధులైన శాస్త్రవేత్తలను. అంటే తెలిసిన శాస్త్రము అనుభవమందున్న వారు. వేదబాహుళ్యము తెలిసినవారిని. వీరందరిని...
రాజాజ్ఞను అనుసరించి యజ్ఞసంబంధమైన పనులుచేయుటకు పూనుకోండి.

అనేక సహస్రముల సంఖ్యలో ఇటుకలు వేగంగా తీసుకొనిరండి.

ఔపకార్యాః క్రియన్తాం చ రాజ్ఞాం బహుగుణాన్వితాః॥
బ్రాహ్మణావసథాశ్చైవ కర్తవ్యాః శతశః శుభాః।
భక్ష్యాన్నపానైర్బహుభిః సముపేతాః సునిష్ఠితాః॥ ౧౦

యజ్ఞసందర్శనార్థము విచ్చేయు రాజులకు అనేక గుణములతోకూడిన తాత్కాలిక భవనసముదాయములను నిర్మించండి. అంటే రాజులు క్రీడా వినోదప్రియులు కావున విలాసమందిరాలతోకూడిన భవనములు. అంటూ రాజాజ్ఞగా తానే చెప్తున్నారు. ఇంకా అనేకమైన చక్కని అన్న పాన భక్ష్యములతో కూడిన శుభకరమైన బ్రాహ్మణ నివాసయోగ్యమైన గృహాలు వందలకొలది నిర్మించండి. **బ్రాహ్మణో భోజన ప్రియః** అనికదా లోకోక్తి. వసిష్ఠుదు సర్వజ్ఞుడు కావున ఈ విధంగా ఆజ్ఞాపించేరు.

బ్రాహ్మణులయొక్క ఈ భోజనప్రియత్వం వారిదికాదు. దేవతా ప్రీతికొరకైనది. వీరు నిత్య వైశ్వదేవాది కర్మలను ఆచరించువారు. ఈ దేవతాప్రీతికరములైన ఈ కర్మలను అనుష్ఠించుటకై అన్న పాన భక్ష్యములయందు బ్రాహ్మణులు శ్రద్ధనుకలిగి ఉంటారు. ఇక్కడ బ్రాహ్మణులకు రాజులకు వారివారి అనుష్ఠానములకు భోగములకొరకు అయిన వ్యక్తిగత గృహములు నిర్మాణం చేయించేరు.

తథా పౌరజనస్యాపి కర్తవ్యా బహువిస్తరాః।
ఆవాసా బహుభక్ష్యా వై సర్వకామైరుపస్థితాః॥ ౧౧

ఆవిధంగానే పురజనులకొరకు చాలా విశాలమైన, చాలా రకాల భక్ష్యములు కలవి, అవసరార్థమైన అన్ని వసతులతో కూడిన నివాసములు చేయండి అని చెప్తున్నారు. (ఇది డార్మెటరీ వ్యవస్థ)

అదే విధంగా ప్రక్క గ్రామాలనుండి వచ్చిన జనులనుకూడా యథోచితముగా సత్కరించి మంచి అన్నమును శ్రద్ధతో ఆదరంతో పెట్టండి. అనాదరణ చూపకండి.

సర్వేవర్ణా యథా పూజాం ప్రాప్నువన్తి సుసత్కృతాః।
న చావజ్ఞా ప్రయోక్తవ్యా కామక్రోధవశాదపి॥౧౩

నాలుగువర్ణాలవారు బాగుగా సత్కరింపబడినవారై పూజింపబడాలి. కామ క్రోధాదులతో ఎవరియందు అనాదరము చేయతగదు. ఇన్ని వేలమందిని సమర్ధించు సందర్భములలో సందర్శకులలో కొందరు అసహనమువలన కామక్రోధాదులను ప్రదర్శించవచ్చు, మీరు మాత్రం వారియెడ ఆదరబుద్ధినే కలిగియుండాలి అని చెప్తున్నారు.

శిల్పులను, యజ్ఞకర్మలయందు నిమగ్నులైయున్న పురుషులను; వారిని కూడ యథాక్రమంగా యథోచితంగా పూజించి వారిని భోజనముచేతను చాలినంత ధనముచేతను తృప్తులను చేయండి.

ఏదీ విడువబడకుండా అన్నీ చక్కగా నిర్వహింపడబడునట్లుగా మీరు ప్రేమతో ఆర్ద్రమైన చిత్తముతో చేయుదురుగాక!

తరువాత అందరు వసిష్ఠుని దగ్గరకువచ్చారు. వచ్చి, వసిష్ఠునితో...

మీరు ఏవిధంగా చెప్పేరో ఆవిధంగా చక్కగా నిర్వహింపబడినది.

రాజ బ్రాహ్మణ పౌర నివాసగృహాలు, ఇంకను వివిధములైన యజ్ఞసంబంధ నిర్మాణాలు అన్నీ చెప్పినట్లుగా జరుగుతున్నాయి. ఏదీ విడిచిపెట్టలేదు. మీరు ఎలా చెప్పారో ఆవిధంగానే పరిహాసపాత్రము కాకుండా చేస్తాము. అంటే తాము చెప్పిన విధంగా వచ్చిన వారందరికి అన్నపానీయాదులు అందునట్లుగా చూస్తాము.

తతః సుమన్త్రమానీయ వసిష్ఠో వాక్యమబ్రవీత్।
నిమన్త్రయస్వ నృపతీన్ పృథివ్యాం యే చ ధార్మికాః॥
బ్రాహ్మణాన్ క్షత్రియాన్ వైశ్యాన్ శూద్రాంశ్చైవ సహస్రశః।
సమానయస్వ సత్కృత్య సర్వదేశేషు మానవాన్॥ ౧౯

తరువాత వసిష్ఠులు సుమంత్రుని పిలిచేరు. పిలిచి...

భూమియందు ధార్మికులైన రాజులు ఎవరున్నారో వారందరిని ఆహ్వానించు. మనుధర్మాన్ని అనుసరించు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను సమస్త దేశములందు ఉన్నవారందరిని వేలకొలది సత్కరించి తీసుకొనిరమ్ము.

ధర్మనిరతులైన వారిని మనం శుభకార్యాలకు పిలిచేప్పుడే గంధ వస్త్ర తాంబూలాది మంగళ సుగంధద్రవ్యములతో అర్హులైనవారు ఆదరపూర్వకంగా

అర్చించి ఆహ్వానించాలి.

వీరందరు మనువు చెప్పిన సాంఘికవ్యవస్థను ఆదరిస్తూ చాతుర్వర్ణ్యములు ఒకరియందు ఒకరు ఆదర గౌరవములు కలిగి చరించుచున్నవారు. కావున ధార్మికులు. ఏతద్వ్యతిరిక్తులు రాక్షసులు. వీరు అధార్మికులు. వీరియందు సంఘటిత సంఘనిర్మాణ కార్యనిర్వాహణ శక్తులు ఉండవు. ఇట్టివారియందు ధర్మం స్థానంలో స్వార్థముంటుంది. అంటే వీరికి స్వప్రయోజనమే తప్ప సాంఘిక ప్రయెజనము తెలియదు. వీరివలన మానవులకు (అంటే మను సంబంధమైన వారికి) అపాయం. ఈ అపాయం మానవులకు వ్యక్తిగతమైతే సహనంకలిగి ఉపేక్షిస్తారు. మానవేతరులవల్ల నష్టం సమాజానికైతే ఉపేక్షించరు. దండించటమో వధించటమో చేస్తారు.

మిథిలాపతిం శూరం జనకం సత్యవిక్రమమ్
నిష్ఠితం సర్వశాస్త్రేషు తథా వేదేషు నిష్ఠితమ్॥ ౨౦
తమానయ మహాభాగం స్వయమేవ సుసత్కృతమ్।
పూర్వసంబంధినం జ్ఞాత్వా తతః పూర్వం బ్రవీమితే॥

మిథిలకు ప్రభువు శూరుడు సత్యవిక్రముడు (నిజమైన పరాక్రమంకలవాడు) వేదములందు సర్వశాస్త్రములందు నిష్ణాతుడు గొప్పభాగ్యవంతుడగు ఆ జనకుని పూర్వసంబంధం కలవానినిగా తెలుసుకొని బాగుగా సత్కరించి స్వయముగా తీసుకొని రమ్ము. అందువలన నీకు ముందుగా చెప్పుచున్నాను. సత్యవిక్రమం అంటే శస్త్రాస్త్రకోవిదుడైన గాధిపుత్రుడైన కౌశిక దశరథాదుల పరాక్రమము వంటిదికాదు. కౌశికుని శస్త్రాస్త్రములను నిగ్రహించిన బ్రాహ్మీమయమైన ఏ తేజముందో అది సత్యవిక్రమం. ఆ పరాక్రమం వసిష్ఠునిది. ఇదిగో ఇక్కడ జనకునిది.

తథా కాశీపతిం స్నిగ్ధం సతతం ప్రియవాదినమ్।
వయస్యం రాజసింహస్య స్వయమేవానయస్వహ॥౨౨

రాజశ్రేష్ఠుడు స్నేహశీలుడు ప్రియభాషి దశరథునకు మిత్రుడు అయిన కాశీరాజును స్వయముగనే తీసుకొనిరమ్ము.

తథా కేకయ రాజానం వృద్ధం పరమధార్మికమ్।
శ్వశురం రాజసింహస్య సపుత్రం త్వమిహానయ॥ ౨౩

రాజశ్రేష్ఠుడు పరమధార్మికుడు వృద్ధుడు దశరథుని మామగారైన కేకయరాజును సకుటుంబముగా తీసుకొనిరండి.

అంగదేశాధిపతి మహాభాగ్యవంతుడు దశరథునియొక్క మిత్రుడు యశస్వియైన రోమపాదుని బాగుగా సత్కరించి తీసుకొనిరండి.

జనకుని కాశీరాజును కేకయరాజును రోమపాదుని స్వయముగా ఆహ్వానింపుము అని సుమంత్రునితో చెప్పేరు.

తూర్పుదేశ (ఫిలిపైన్స్ జపాన్ చైనా థాయిలాండ్ బర్మా) రాజులను, సింధు సౌవీర దేశ (పాకిస్థాన్) రాజులను, సౌరాష్ట్ర దేశ (ఒడిశా) రాజును, దక్షిణదేశ రాజులను అందరినీ ఆహ్వానించండి.

మరియు భూమణ్డలమునందు మనకు స్నేహితులైన ఇతర రాజులు అందరిని బంధుసహితముగా వీలగునంత తొందరగా ఆహ్వానించండి.

ఆ వసిష్ఠవాక్యమును విన్న సుమంత్రుడు తొందరపడుచున్నవాడై రాజులను తీసుకొనివచ్చుటకు సద్గుణవంతులైన పురుషులను ఆజ్ఞాపించాడు.

వసిష్ఠుని ఆజ్ఞానుసారము తాను స్వయముగా ఆహ్వానింపతగినవారిని ఆహ్వానించుటకు తొందరకలవాడై స్వయంగా బయలుదేరేడు.

వివిధ పనులయందు నియుక్తులైన పనివారందరు ఎవరెవరికి యజ్ఞముకొరకు ఏది ఉపకల్పింపబడినదో ఆ పనులన్నింటిని వసిష్ఠునకు విన్నవించేరు.

దానికి సంతోషించిన వసిష్ఠుడు వారిని అందరిని ఉద్దేశించి

అవజ్ఞయా న దాతవ్యం కస్య చిల్లీలయాపి వా।
అవజ్ఞయా కృతం హన్యాద్దాతారం నాత్ర సంశయః॥ ౩౦

ఎవ్వరికీ అనాదరముతోగాని అశ్రద్ధతోగాని ఇవ్వరాదు. అనాదరముతో చేయబడిన దానం దాతను చంపును. ఈ విషయంలో సంశయం అనవసరం. అని జాగ్రత్తను చెప్పి హెచ్చరించేరు.

తరువాత కొన్నిరోజులలో వివిధదేశాల రాజులు దశరథునకు అనేకములైన రత్నములను తీసుకొని అయోధ్య వచ్చేరు.

అపుడు మిక్కిలి ప్రీతినొందిన వసిష్ఠుడు, రాజుతో ఓ నరశ్రేష్ఠుడా! నీయొక్క శాసనంవలన రాజులందరు వచ్చారు. రాజశ్రేష్ఠులైన వారందరు యోగ్యతాను సారముగా నాచే సత్కరింపబడ్డారు.
కర్మచారులు చాలా జాగ్రత్తగా యజ్ఞమునకు కావలసిన సాధనసామగ్రి సమకూర్చేరు.

నిర్యాతు చ భవాన్యష్టుం యజ్ఞాయతనమన్తికాత్

నీవు యాగము చేయుటకై యాగశాలనుగూర్చి బయలుదేరుము.
ఓరాజేన్ద్రా దశరథా! చేర్చబడిన సమస్త భోగ్యవస్తువులతో అంతటా నిండి మనస్సుచే నిర్మింపబడినట్లున్న ఈ యాగశాలను చూడు అన్నారు.
వసిష్ఠ ఋష్యశృఙ్గుల మాటలు విని భూభర్త అయిన దశరథుడు శుభకరమైన నక్షత్రములుగల శుభదినమున బయలుదేరేడు.

తతో వసిష్ఠ ప్రముఖా స్సర్వ ఏవ ద్విజోత్తమాః
ఋష్యశృఙ్గం పురస్కృత్య యజ్ఞ కర్మారభం స్తదా
యజ్ఞవాటగతాః సర్వే యథాశాస్త్రం యథావిధి॥

పిమ్మట వసిష్ఠాది ఋత్విక్కులు సమస్తమైన ద్విజోత్తములు యజ్ఞవాటమును చేరి శాస్త్రోక్తమైన విధిననుసరించి ఋష్యశృఙ్గుని ముందుంచుకొని యజ్ఞకర్మను ప్రారంభించారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రయోదశస్సర్గ సమాప్తము.

॥అథ చతుర్దశః సర్గః॥

(దశరథుడు సరయూ నదీతీరమున అశ్వమేధయాగం చేయుట)

అథ సంవత్సరే పూర్ణే తస్మిన్ ప్రాప్తే తురఙ్గమే।
సరయ్వాశ్చోత్తరే తీరే రాజ్ఞో యజ్ఞోఽభ్యవర్తత॥ ౧

తరువాత సంవత్సరాంతంలో ఆ అశ్వము వచ్చింది. తిరిగి వచ్చిన అశ్వం బ్రహ్మ అధ్వర్యుడు హెూత ఉద్గాతలచే పదకొండుమాసాలు రథాకారగృహంలో అశ్వత్థవృక్షానికి కట్టి ఉంచబడుతుంది. పండ్రెండవమాసానికి శాలా నిర్మాణాది రూపంగా సకలసంభారాలను పూర్తిచేసుకొని, ఫాల్గుణ అమావాస్యనాడు ఋత్విక్కులతో కలిసి అశ్వమేధం ప్రారంభం చేసారు.

సరయూనది ఉత్తరతీరమందు యజ్ఞము ప్రారంభమైనది.

మహాత్ముడైన దశరథునియొక్క అశ్వమేధ మహాయజ్ఞమునందు బ్రాహ్మణ శ్రేష్ఠులు ఋష్యశృఙ్గునిముందుంచుకొని యజ్ఞకార్యమును చేసేరు.

చైత్రప్రతిపత్‌న మొదలిడి ఏడురోజులు మూడుపూటలూ వైశ్వదేవాన్ని చేసేరు. పూర్ణాహుతి పూర్వకంగా మొత్తం ఇరవైయొక్క హెూమాలు చేసేరు.

కర్మకుర్వన్తి విధివద్యాజకా వేదపారగాః
యథావిధి యథాన్యాయం పరిక్రామన్తి శాస్త్రతః॥

వేదపారగాః అంటే ఉపనిషత్పర్యన్తము వేదార్థమును తెలిసినవారు. **యాజకాః** ఋత్విక్కులు. వీరందరు వేదవిధిని అనుసరించి యథాశాస్త్రముగా కార్యమును చేసారు.

బ్రాహ్మణులు ప్రవర్గ్యమును, పండ్రెండ్రురోజులు ఉపసదమును యథాశాస్త్రంగా చేసి, ఇంకను ఇతరమైన అశ్వమేధాంగములనుకూడ నిర్వర్తించిరి.

తరువాత మునిపుంగవులందరు ఆనందించి ఆహూతులైన దేవతలను పూజించి ప్రాతఃసవనమును యథావిధిగా చేసేరు.

ఐన్ద్రశ్చ విధివద్దత్తో రాజా చాభిషుతోఽనఘః।
మాధ్యందినం చ సవనం ప్రావర్తత యథాక్రమం॥

ఇంద్రదేవతకు హవిస్సు యథావిధిగా ఇవ్వబడింది. దోషరహితమైన సోమలతకూడా నూరబడి రసము తీయబడినది. మాధ్యందిన సవనము

క్రమాన్ని అనుసరించి జరిగింది. బ్రాహ్మణులు ఉదారబుద్ధిగల దశరథునియొక్క తృతీయ సవనమునుకూడ చేసేరు.

న చాహుతమభూత్తత్ర స్ఖలితం వాపి కిఞ్చన।
దృశ్యతే బ్రహ్మవత్సర్వం క్షేమయుక్తం హి చక్రిరే॥

యజ్ఞమున దోషభూయిష్టమైన హోమము జరుగలేదు. కొద్దిపాటి పొరపాటుకూడ జరుగలేదు. అంటే హవిర్భాగాలు ఎక్కడా వ్యర్థంకాలేదు. అన్నీ సకాలంలో జరుగుటచే ప్రాయశ్చిత్తాదుల అవసరంలేకుండా ఉంది. సర్వము మంత్రపూతముగానే కనబడుచున్నవి. ఆపదలకు తావులేని విధంగా చేసేరు.

బ్రహ్మశబ్దమునకు **బ్రహ్మతత్వ తపో వేదే నద్వయోః పుంసి వేధసి. ఋతిగ్యోగభిదోర్విప్రే** అను అర్థములను మేదినీకారుడు చెప్పియున్నాడు. **సర్వం బ్రహ్మవత్ దృశ్యతే** అంతయూ మంత్రార్థములను తెలిసి చేసినట్లే కనబడుచున్నది. కావున **కర్మ వైగుణ్యం** అంటే చెప్పిన ప్రకారం చేయకపోవుట–వేదం చెప్పినట్లుగా ఋత్విక్కులు చెప్పినట్లుగా చేయకపోవుట. **కర్తృవైగుణ్యం** అంటే అర్థజ్ఞానశూన్యముగా కర్మనుచేయుట. ఇటువంటి ప్రమాదములులేక అంతయు శుభకరముగా ఉండునట్లు చేసేరు.

ఆ దినములలో శ్రాంతుడు కనబడుటలేదు. క్షుధితుడు అంటే ఆకలితో బాధపడువాడు కనబడుటలేదు. అక్కడ

నావిద్వాన్ బ్రాహ్మణస్తత్ర నాశతానుచర స్తథా।

విద్వాంసుడుకాని బ్రాహ్మణుడులేడు. అనుచరశతం లేనివాడులేడు. అంటే ఇక్కడ **శతం** బహుత్వాన్ని చెప్పేదేకాని సంఖ్యావాచకంకాదు. విద్వాంసులైన బ్రాహ్మణులందరు పెక్కుమంది శిష్యులుకలవారుగా ఉన్నారు. అలాగే వృత్తిపనులలో సుశిక్షితులైన శిల్పులు శిల్పకారులు స్థపతులు వీరందరుకూడా బహుశిష్య సమేతంగా ఉన్నారు.

బ్రాహ్మణా భుఞ్జతే నిత్యం నాథవన్తశ్చ భుఞ్జతే।
తాపసా భుఞ్జతే చాపి శ్రమణా భుఞ్జతే తథా॥

నిత్యము బ్రాహ్మణులు భుజించుచుండిరి. నాథవంతులు అంటే యజమానికల

సేవకులు. అర్థాత్ శూద్రులు. పరిశేషన్యాయముచేత క్షత్రియ వైశ్యులు ఇరువురుకూడా గ్రహింపతగినవారు. దానంజేసి బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులను నాలుగు వర్ణములవారు ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనునది లేకుండా భుజించుచున్నారు. తాపసులు సన్న్యాసులు కూడా భుజించుచున్నారు.

వృద్ధాశ్చ వ్యాధితాశ్చైవ స్త్రియో బాలాస్తథైవ చ
అనిశం భుఞ్జమానానాం న తృప్తిరుపలభ్యతే॥

ముసలివారు తినుచున్నారు. వ్యాధిపీడితులు కూడా తినుచున్నారు. స్త్రీలు బాలురుకూడా తినుచున్నారు.

నాలుగువర్ణాల వారు తినుచున్నారు అని చెప్పి, మరల ప్రత్యేకంగా వీరిని ఎందుకు చెపేరు అంటే–వయోధర్మం ఆశ్రమధర్మం వృత్తిధర్మం శారీరకధర్మం ఇవి భోజన విధానాన్ని ప్రభావితం చేస్తాయి.

బాలురు వృద్ధులు దంతపాటవం సరిగా లేకపోవటంవల్ల సామాన్యంగా మెత్తటి పదార్థములను ఇష్టపడతారు.

వ్యాధిపీడితులకు పథ్యము పరమౌషధం. వారు తేలికగా జీర్ణమగు ఆహారాన్ని తీసుకుంటారు.

ఈవిధంగా ఎవరెవరికి ఎలా కావాలో అలా పెడుతున్నారు. అందరికీ ఒకే విధమైన భోజనంకాదు. అదీ అక్కడ అన్నవితరణలో విశేషం. అది మహర్షి చూపెడుతున్నారు.

ఇంతగా అన్నవితరణ జరుగుచున్నప్పటికీ ఎంతకావాలో అంత, ఎలాకావాలో అలా జరుగుచున్నప్పటికీ దశరథునకు తృప్తి కలుగుటలేదు. అన్నంతోపాటుగా వస్త్రాలు పంచుతున్నారు. ఎప్పటికి అప్పుడే వండిన భోజ్యపదార్థాల రాసులు పర్వతంవలె కనబడుతున్నాయి. ఈ యజ్ఞంలో అనేక ప్రాంతాలనుండి వచ్చిన స్త్రీపురుషులు అన్నపానములచే బాగుగా తృప్తిపొందేరు.

అన్నం హి విధివత్స్వాదు ప్రశంసన్తి ద్విజర్షభాః।
అహోతృప్తాః స్మ భద్రం తే ఇతి శుశ్రావ రాఘవః॥

పద్ధతిననుసరించి వండిన మధురమైన అన్నమును బ్రాహ్మణులు ప్రశంసించేరు.

ఆహా! సంతృప్తులమైనాము నీకు శుభమగుగాక! అంటున్నారు.
ఈ మాటలు విని దశరథుడు ఆనందించాడు.
అన్నం పెట్టినవాడు సుఖంగా ఉండాలని ఆ అన్నం తిన్న ప్రతిఒక్కడు కోరుకోవాలి. ఇది మన వైదికధర్మం. దాన్ని మహర్షి జ్ఞప్తిచేస్తున్నారు.
యజమాని స్వార్జితమైన అన్నాన్ని తిన్న సందర్భంలోకూడా భోజనాంతమున 'అన్నదాత! సుఖీభవ' అని చెప్పుకుంటాం. ఇక్కడ కర్షకులకు శుభపరంపరలు కలగాలని ఆకాంక్ష.

స్వలఙ్కృతాశ్చ పురుషా బ్రాహ్మణాన్ పర్యవేషయన్
ఉపాసతే చ తావన్యే సుమృష్ట మణికుణ్డలాః॥

సాలంకృతులైన పురుషులు బ్రాహ్మణులకు వడ్డించేరు. చక్కటి కాంతిగల మణులతోకూడిన కుండలాలుగల ఇంకొందరు వారిని సేవించేరు.
వడ్డనచేసే వారిని చూస్తే ఆనందంగా మరికొంచం తినాలని అనిపించాలి. అలా చక్కగా శుచిగా తయారై వడ్డనకు రావాలి.
బృహత్కార్యక్రమాలలో అన్నశాన్తి జరుగు సందర్భాలలో మేము సంపన్నులం అనుకొని తినటానికే పుట్టినట్లుగా కూర్చోకూడదు. వీలైనంత సేవచెయ్యాలి. ఇక్కడ ఆ విషయాన్ని చూపిస్తున్నారు. అందుకే మణిమయాలంకారాలతో ఉన్నవారు వడ్డనచేస్తున్నారు అని చెప్పడం.

కర్మాన్తరే తదా విప్రా హేతువాదాన్ బహూనపి
ప్రాహుశ్చ వాగ్మినో ధీరాః పరస్పర జిగీషయా॥౧౬

వాక్చాతుర్యంగల బుద్ధిమంతులైన పండితులైన విప్రులు కర్మలమధ్య వ్యవధానమందు ఒకరినొకరు జయించాలనే కోరికతో అనేకములైన యుక్తివాదములను చేసేరు. ఈ హేతువాదులు అనఘాత్ములు. వీరు అక్కడ ఉన్నవారినీ పాపమునుండి రక్షించగల సమర్థులు అందుకే విప్రులని చెప్పబడ్డారు. అక్కడ ఉన్నవారందరూ దుఃఖవిముక్తుని పొందాలను సంకల్పంతో హేతువాదం చేస్తున్నారు. యజ్ఞములందు నేర్పరులైన ద్విజులు ప్రతిరోజూ ఋష్యశృఙ్గాది ప్రేరకులచే ప్రేరేపింపబడినవారై అన్ని పనులు యథా శాస్త్రముగా చేసేరు.

ఇక్కడ పనులయందు నియోగింపబడ్డ పనివారు ఆ పనులందు నేర్పును ప్రదర్శించే విధంగా, నియోగించిన యజమాని ప్రతిరోజూ వారిని ఉత్తేజ పరుస్తూండాలి. ఇది యజమాని విధి. కేవలం పని ఒప్పజెప్పి వారిని వదిలిపెట్టకూడదు, ఆపనిని పర్యవేక్షించడం, పనివారు పని చేయుటకు వలసిన వాతావరణమును కల్పించి ఉత్తేజితుల్ని చేయడం ఇవి యజమాని ధర్మాలు. (ఇప్పటి కార్పరేట్ సంస్థలు ఇదే చేస్తున్నాయి.)

ఆ యాగశాలలో షడంగసహితంగా వేదాధ్యయనం చేయనివాడులేడు. వ్రతానుష్ఠానం చేయనివాడు లేడు. ఆహితాగ్ని కానివాడు లేడు. దశరథుని యజ్ఞసదస్సులో శాస్త్రవాద కౌశలులు కానివారు లేరు.

ప్రాప్తేయూపోచ్ఛ్రయే తస్మిన్ షడ్బైల్వాః ఖాదిరాస్తథా
తావన్తో బిల్వసహితాః పర్ణినశ్చ తథాపరే॥
శ్లేష్మాతక మయస్త్వేకో దేవదారు మయస్తథా
ద్వావేవ విహితౌ తత్ర బాహువ్యస్త పరిగ్రహౌ॥

యజ్ఞం నడుస్తోంది. యూపస్తంభాల్ని నిలుపు సమయం వచ్చింది. మారేడు కఱ్ఱతో చేసిన యూపస్తంభాలు ఆరు. వీటికి దగ్గరగా చంద్రకఱ్ఱతో చేసినవి ఆరు. పలాశ (మోదుగ) కఱ్ఱతో నిర్మించినవి ఆరు.

శ్లేష్మాతకము అంటే విరిగి చెట్టు దానితో చేసినది ఒకటి. దేవదారు స్తంభాలతో చేసినవి రెండు.

మొత్తం ఏకవింశతి(21) యూపస్తంభాలు నిలుపబడ్డాయి.

మొదట శ్లేష్మాతకం. దానికి దక్షిణోత్తరాలలో దేవదారుయూపాలు. ఈ యూపత్రయానికి దక్షిణంగా మూడు బిల్వయూపాలు. ఈ యూపషట్కానికి ఉత్తరంగా ఖదిరయూపాలు మూడు. ఈ తొమ్మిది యూపాలకు దక్షిణోత్తరాలుగా మూడు మూడు మోదుగయూపాలు. మిగిలిన మారేడు చంద్ర యూపాలు ఆరుకూడ పాలాశయూపాలకు ఉత్తరంగా ప్రతిష్ఠించాలి.

కారితాః సర్వ ఏవైతే శాస్త్రజ్ఞైర్యజ్ఞ కోవిదైః
శోభార్థం తస్య యజ్ఞస్య కాఞ్చనాలఙ్కృతా భవన్॥

యూపస్తంభాల్ని యజ్ఞముయొక్క శోభకొరకు బంగారంచే అలంకరించేరు.

ఏకవింశతి యూపాస్తే ఏకవింశత్యరత్నయః
వాసోభిరేకవింశద్భి రేకైకం సమలంకృతాః॥ ౨౩

ఒకొక్క యూపస్తంభం ఇరువదియొక్క అరత్నుల (మూరల) ఎత్తు, అలా ఇరువదియొక్క యూపస్తంభాలు.

ఆ ఇరువదియొక్క యూపములు ఇరువదియొక్క వస్త్రములచే ఒక్కొక్కటిగా అలంకరింపబడ్డాయి.

యూపస్తంభాలను బంగారంతో అలంకరించుట కేవలము వేడుకకొరకు. ఆవిధంగా చేయాలని శ్రుతి విధించుట లేదు. ఈ స్వర్ణాలంకరణ చేయకున్ననూ దోషములేదు.

వస్త్రము సర్వదేవతాక మగుటంజేసి వస్త్రాలంకరణే శ్రుతి నిర్ణయం.

"వాసోభిర్వేష్టయతి। ఏషవై యజమానః। యద్యూపః। సర్వ దేవత్యం వాసః। సర్వాభిరేవైనం దేవతాభిస్సమర్ధయతి॥"

"అగ్నే స్తూషాధానం। వాయోర్వాత పానం పితౄణాం నీవిరోషధీనాం ప్రఘాత ఆదిత్యానాం ప్రాచీన తానో విశ్వేషాం దేవానామోతు ర్నక్షత్రాణా మతీకాశాస్త ద్వా ఏతత్సర్వ దేవత్సమ్" అని శ్రుతి చెప్పుచున్నది.

వస్త్రంయొక్క పూర్వ వ్యవస్థలో (చిలకలుకల) కొయ్యకు దారము పోస్తారు. దీనికి అగ్ని అభిమాన దేవత.

తరువాత కొయ్యకు చుట్టబడిన దారమును ఊడదీసి ఆరపోస్తారు. దీనికి అభిమానదేవత వాయువు.

ఆరిన తరువాత చుట్టను మొత్తంగా కలిపి ముడివేస్తారు. దీనికి పితృదేవతలు అభిమానులు.

తరువాత దారమునందు చిక్కుకున్న గడ్డిముక్కలవంటి నేతకు అడ్డువచ్చు వాటిని తొలగించుటకు ఆ చుట్టను ఊతిమీద కొడతారు. దీనికి అభిమాని ఓషధులు.

తరువాత వస్త్రం తయారీకి దారాన్ని నిలువుగా పోస్తారు. దీన్ని పడుగు అంటారు.

పడుగుకు అభిమానదేవత ఆదిత్యుడు. పేకకు (అడ్డముగా పోయు దారం)

విశ్వేదేవతలు అభిమానులు.
వస్త్రం పూర్తి అయిన తరువాత పడుగు పేకల సంధికి నక్షత్రాలు అభిమాన దేవతలు. ఈ విధంగా వస్త్రం సర్వదేవతాకము. యూపస్తంభమే యజమాని. అట్టి యూపస్తంభాన్ని వస్త్రంచే చుట్టుటచేత యజమానుడు సర్వదేవతా పరివేష్ఠితుడై స్వరాన్ని పొందుతాడు.
(ఈ కారణంగా సంప్రదాయవాదులు చిరిగిన అతుకులుగల వస్త్రధారణను నిషేధించారు. ఏకనేతగల వస్త్రాలుమాత్రమే (పంచ ఉత్తరీయం చీర) ధారణకు యోగ్యమైనవి.
మనదేశంలో కేరళ తదితర ప్రాంతాలలో స్త్రీలు రవికలు ధరించక పోవుటకు కారణం అది అతుకుల వస్త్రం అనే)
ఆ యూపస్తంభాలు అష్టభుజి (ఎనిమిది అంచులు ఉండునట్లు)గా దృఢంగా నున్ననిరూపం కలవిగా చక్కగా చేయబడ్డాయి. వస్త్రాలచే ఆచ్ఛాదింపబడిన పుష్పములచే సుగంధములచే అలంకరింపబడిన యూపములు ప్రకాశిస్తూన్నవై స్వర్గమునందు సప్తర్షులవలె ఉన్నాయి.

ఇష్టకాశ్చ యథాన్యాయం కారితాశ్చ ప్రమాణతః।
చితోఽగ్నిర్బ్రాహ్మణై స్తత్ర కుశలైః శుల్బకర్మణి॥ ౨౮

అచ్చట పద్ధతిప్రకారం శాస్త్రమును అనుసరించి కావలసిన ప్రమాణాలతో ఇటుకలు చేయబడ్డాయి. పురిపెట్టని త్రాడుతో కొలతలు వేయు సమర్థులైన బ్రాహ్మణులచే అగ్నివేది ఇటుకలతో కట్టబడింది.

సచిత్యో రాజసింహస్య సంచితః కుశలైర్ద్విజైః।
గరుడోరుక్మపక్షో వై త్రిగుణోఽష్టాదశాత్మకః॥ ౨౯

చయననిర్మాణ సమర్థులైన బ్రాహ్మణులచే బంగారు రెక్కలుగలది, మూడురెట్లుకలది అంటే పదునెనిమిది వరుసలుకల గరుడాకారమైన వేదిక. అగ్నిష్టోమాదులయందు మతభేదాలను అనుసరించి **వేది** అయిదు లేక ఆరు వరుసలుకలదిగా ఉంటుంది.
అశ్వమేధమునందు వేది అగ్నిష్టోమాదులకు మూడురెట్లు అధికంగా అంటే పదిహేను లేక పదునెనిమిది వరుసలలో ఉంటుంది.

పంచ చితయో భవంతి అని తైత్తిరీయ శాఖానుయాయులు పంచదశ ప్రస్థారం అంటున్నారు. ఇక్కడ అష్టాదశ ప్రస్థారముని చెప్పుటచే దశరథుడు వాజసనేయ పక్షావలంబియని గ్రహించాలి.

ఈవిధంగా పదునెనిమిది వరుసల గరుడాకార వేది రాజశ్రేష్ఠుడైన దశరథునియొక్క **'చిత్యః'** ఆవహనీయాగ్నితో కూడినది పేర్చబడినది.

ఈ వేది నిర్మాణాలకు పుంలింగేష్టకలను ఉపయోగించాలి. ఈ ఇష్టకలు ఇరువదినాలుగు (24) అంగుళాల పరిమితికలవిగా ఉండాలి. (పదునెనిమిది లేదా పదహారు అంగుళాలుకూడ ఉండవచ్చు).

ఇష్టకలు బాగా కాలినవైయుండాలి. దృఢంగా ఉండాలి. ఏకవర్ణంతో ఉండాలి. ఇటువంటివి ప్రశస్తం. నల్లగా ఉన్నవి విరిగినవి యజ్ఞకర్మలందు వినియోగించ రాదు. ఈ ఇష్టకలను కుండ నిర్మాణమునకై పేర్చుటను **'చయనం'** అంటారు. ఈ విధంగా చయనంచేసిన వేదియందలి అగ్ని **'చితి'.**

అక్కడ శాస్త్రవిహితమైన పశువులు, ఉరస్సుచేత సంచరించు పక్షులు ఆయా దేవతలను ఉద్దేశించి కట్టబడినవి.

శామిత్రే తు హయస్తత్ర తథా జలచరాశ్చయే
ఋత్విగ్భిః సర్వమేవైత తన్నియుక్తం శాస్త్రతస్తదా॥ ౨౯

పశువిశన కర్మచేయు సమయమున అశ్వము మరియు ఇతరములైన జలచరాలను వీటినన్నింటిని ఋత్విక్కులు శాస్త్రవిధిని యూపస్తంభాలకు కట్టేరు.

పశూనాం త్రిశతం తత్ర యూపేషు నియతం తదా।
అశ్వరత్నోత్తమం తస్య రాజ్ఞో దశరథస్య చ॥ ३०

అప్పుడు అక్కడ మూడువందల పశువులు, ఆ రాజుయొక్క శ్రేష్ఠమైన అశ్వం యూపస్తంభాలకు కట్టబడ్డాయి.

"ఇంద్రాయ రాజ్ఞే సూకరో। వరుణాయ రాజ్ఞే కృష్ణ" మొదలైన అనువాకాలను అనుసరించి వివిధ దేవతలకొరకు సూకర (అడవిపంది), కృష్ణమృగాది నానావిధ పశువులను యూపస్తంభాలకు కట్టేరు. (అయిదువందల పంతొమ్మిది అని భట్టభాస్కర మతం)

కౌసల్యాం తం హయం తత్ర పరిచర్య సమన్తతః।
కృపాణైర్విశశాసైనం త్రిభిః పరమయాముదా॥ ౩౧

కౌసల్య ఆ అశ్వమునకు ప్రదక్షిణచేసి అతిశయించిన సంతోషంతో మూడు కత్తులచే అశ్వమును చంపింది.

శ్రాద్ధకర్మ (పితృకర్మ యజ్ఞం అగ్నిహోత్రం)లయందు జ్యేష్ఠులకే కర్మాధికారము. తరువాతవారు కర్మాధికారులు కారు. అలాగే పత్నీత్వంచేత శ్రాద్ధకర్మలయందు అధికారి జ్యేష్ఠపత్ని అయిన కౌసల్యయే.

తరువాత వారు మమ అనుకొని అనుగమించ వలసినవారే.

పతత్రిణా తదాసార్థం సుస్థితేన చ చేతసా।
అవసద్రజనీమేకాం కౌసల్యా ధర్మకామ్యయా॥ ౩౨

అప్పుడు కౌసల్య ధర్మాచరణమునందలి కోరికతో స్థిరచిత్తముతో విశనము చేయబడిన గుఱ్ఱముతోకూడ ఒకరాత్రి నివసించింది.

హోతాధ్వర్యు స్తథోద్గాతా హస్తేన సమయోజయన్
మహిష్యా పరివృత్త్యా చ వావాతాం చ తథాపరామ్॥

తరువాత హోత అధ్వర్యుడు, ఉద్గాత అనువారు పట్టమహిషిని పరివృత్తిని వావాతను పాణిగ్రహణం చేసేరు.

పట్టమహిషి రాజుతోపాటు రాజ్యాభిషేకమును పొందిన భార్య. ఈమె **కౌసల్య.** **వావాత** అంటే రాజుయొక్క మధ్యమజాతీయురాలైన రెండవ భార్యను చెప్పు పదం. ఈమె **సుమిత్ర**. భోగినీ స్త్రీ

పరివృత్తి అంటే ఉపేక్షిత భార్య. ఈమె శూద్ర స్త్రీ. అంటే రాజుకు సేవకైనట్టిది. ఈమె **కైక.** ఇక్కడ శూద్రత్వం జాతివాచకం కాదు.

ఇక్కడ **బ్రహ్మ** అను ఋత్విక్కు స్మరింపబడలేదు. అలాగే **"పాలాకలీ"** అను స్త్రీ (రాజునకు పాత్రలు అందించునది) చెప్పబడలేదు. అయినా పరిశేషన్యాయం చేత వీరిరువురిని చెప్పినట్లే గ్రహించాలి. ఎందుకంటే...

మహిషీం బ్రాహ్మణే దదాతి। వావాతం హోత్రే। పరివృత్తి ముద్గాత్రే। పాలాకలీ మధ్వర్యవ అని సూత్రం.

బ్రహ్మనుండి హోతా ఉద్గాత అధ్వర్యుడు అనుజ్ఞను తీసుకుంటూ

యజ్ఞసంబంధమైన కర్మచేస్తారు. ఇక్కడ **వసిష్ఠుడు** బ్రహ్మస్థానలో ఉన్నాడు. అధ్వర్యుడు ఆద్యంతములపర్యంతమైన ప్రధాన ప్రయోగాలన్నీ యజమానిచే అనుమంత్రణ పూర్వకంగా చేయిస్తారు. యజమాని అనుమంత్రణ పూర్వకంగా అధ్వరుని అనుసరిస్తాడు. **ఋష్యశృంగమహర్షి** అధ్వర్యుడు హోత హోతృకర్తృకమైన భాగములను చేస్తారు. అగ్ని ప్రజ్జ్వలనార్థం సామిధేనిఋక్ మంత్రములచే సమిధలను ఉంచువారు.

ఉద్గాత సామవేది. సామను ఉచ్చరించువాడు.

బ్రహ్మ అధ్వర్యుడు హోతా ఉద్గాత ఇవి నాలుగుగణాలు. ఒక్కొక గణానికి నలుగురు ఉంటారు. మొత్తం పదహారుమంది ఋత్విక్కులు ఉంటారు. వసిష్ఠుడు కౌసల్యను, ఋష్యశృఙ్గుడు పాలాకలీ అను ఆమెను, హోత సుమిత్రను, ఉద్గాత కైకను దశరథుని అభ్యనుజ్ఞమేరకు పాణిగ్రహణం చేసారు. ఋత్విక్కులకు దక్షిణ ఆనంద దాయకమైన విషయం కావున **'అంబే అంబాల్యంబికే'** అను శ్రుత్యనుసారము వారు ఆనందించుటకొరకు వారిని దక్షిణార్థము ఇచ్చారు. తరువాత దశరథుడు ప్రతినిధి ద్రవ్యదానంచేత తిరిగి తీసుకొన్నారు. ఇంద్రియ నిగ్రహంకల వసిష్ఠాదులు ప్రతినిధిద్రవ్యాన్ని గ్రహించి కౌసల్యాదులను తిరిగి ఇచ్చివేసేరు.

(ఇట్టి ప్రమాదాలతో కూడి ఉంది కనుకనే కలియుగంలో అశ్వమేధయాగం నిషేధింపబడింది.)

పతత్రిణస్తస్య వపాముద్ధృత్య నియతేంద్రియః।
ఋత్విక్పరమ సంపన్నః శ్రపయామాస శాస్త్రతః॥ ౩౪

నియతేంద్రియుడు ఉత్కృష్టమైన(జ్ఞాన) సంపదగలవాడు అగు ఋత్విక్కు ఆ అశ్వముయొక్క వపను (తేజని) తీసి శాస్త్రవిధిని పక్వము చేసేరు.

ధూమగంధం వపాయాస్తు జిఘ్రాతి స్మ నరాధిపః।
యథాకాలం యథాన్యాయం నిర్ణుదన్ పాపమాత్మనః॥

రాజైన దశరథుడు కాలానుగుణంగా శాస్త్రవిధిని తనయొక్క పాపమును తొలగించుకొనుచు వపాధూమముమొక్క గంధమును వాసన చూసేరు. ఆ అశ్వముయొక్క వివిధములైన అంగములను అన్నింటిని మన్త్రపూతముగా

ఋత్విక్కులైన పదహారుగురు బ్రాహ్మణులు అగ్నియందు హుతమొర్చిరి.

ప్లక్షశాఖాసు యజ్ఞానామన్యేషాం క్రియతే హవిః।
అశ్వమేధస్య యజ్ఞస్య వైతసోభాగ ఇష్యతే॥ ౩౭
త్ర్యహోఽశ్వమేధః సంఖ్యాతః కల్పసూత్రేణ బ్రాహ్మణై
చతుష్టోమమస్తస్య ప్రథమం పరికల్పితమ్॥ ౩౮
ఉక్థ్యం ద్వితీయం సంఖ్యాతమతిరాత్రం తథోత్తరమ్।
కారితాస్తత్ర బహవో విహితాః శాస్త్ర దర్శనాత్॥ ౩౯
జ్యోతిష్టోమాయుషీ చైవ మతిరాత్రౌ వినిర్మితౌ।
అభిజిద్విశ్వజిచ్చైవ మప్తోర్యామో మహాక్రతుః॥ ౪౦

ఇతరములైన యజ్ఞములందలి హవిస్సు జువ్వికొమ్మలయందు ఉంచి హుత మొనర్చాలి. అశ్వమేధమున హవిస్సు ప్రబ్బలితీగయందు (గొంతెమగోరు తీగ) ఉంచాలి. కల్పోక్తప్రకారము అశ్వమేధము మూడురోజులు చేయతగినదిగా చెప్పబడింది.

మొదట చతుష్టోమం చెయ్యాలి. రెండవది ఉక్థ్యం చెయ్యాలి. మూడవది అతిరాత్రం. ఇవికాక అశ్వమేధమునందు విధింపబడిన అనేక క్రతువులూ చేసేరు.

జ్యోతిష్టోమం ఆయుర్యాగం మరియు అతిరాత్రౌ అని ద్వివచనంగా చెప్పుటచే అతిరాత్రములు రెండని గ్రహించాలి. రెండు అతిరాత్రములు చెసేరు. అభిజిద్యాగం విశ్వజిద్యాగమూ ఆప్తోర్యామం అను మహాక్రతువు చేసేరు.

ప్రాచీం హోత్రే దదౌ రాజా దిశం స్వకులవర్ధనః।
అధ్వర్యవే ప్రతీచీం తు బ్రహ్మణే దక్షిణాం దిశమ్॥
ఉద్గాత్రే చ తథోదీచీం దక్షిణైషా వినిర్మితా।
అశ్వమేధే మహాయజ్ఞే స్వయం భూవిహితే పురా॥

ఇక్ష్వాకు కులవర్ధనుడైన దశరథుడు హోతకు తూర్పుదిక్కును ఇచ్చేరు. హోత ప్రాఙ్ముఖుడై కర్మను నిర్వహిస్తారు.

అధ్వరుడు పశ్చిమాభిముఖుడై ఉంటాడు. అధ్వర్యునకు పశ్చిమదిక్కును ఇచ్చేరు. బ్రహ్మ దక్షిణముఖుడై ఉంటాడు. బ్రహ్మకు దక్షిణదిక్కును ఇచ్చేరు.

ఉద్గాతకు ఉత్తర దిక్కును ఇచ్చేరు. పూర్వము చతుర్ముఖబ్రహ్మచేత విధింప బడిన అశ్వమేధమునందు ఈ దక్షిణ ఏర్పరుపబడింది.

పురుషశ్రేష్ఠుడైన దశరథుడు ఆ క్రతువును పూర్తిచేసి శాస్త్రోక్తరీతిని ఈ భూమిని ఋత్విక్కులకు ఇచ్చేరు. ఋత్విక్కులు అందరు గతకల్మషుడైన దశరథునిగూర్చి నీవు ఒక్కడివే సమస్తమైన భూమిని రక్షించుటకు అర్హత కలిగి ఉన్నావు.

న భూమ్యా కార్యమస్మాకం న హి శక్తాః స్మ పాలనే

ఓ దశరథా! భూమిచేత మాకు పనిలేదు. పాలించుటకు అశక్తులము. ఈ మాటలు అంటున్నది వసిష్ఠాదులు. వీరు ప్రయోగోపసంహార రూపంగా సర్వశస్త్రాస్త్ర పాటవంకల విశ్వామిత్రాదులను నిగ్రహించిన వారు. మరెందకు ఈ బేలతనం అంటే పరిపాలన బ్రాహ్మణధర్మం కాదు. ధర్మదూరంమైన పనిని మేము అంగీకరించలేము. మేము నిత్యము తపస్స్వాధ్యాయ అధ్యాపన ములందు ఉండ వలసినవారం. కావున ఈ భూమికిమారుగా కొద్ది మూల్యం చెల్లించు. మణులో సువర్ణమో గోవులో ఏది సిద్ధంగా ఉన్నదో అది ఇచ్చి ఈ భూమిని గ్రహించు. మాకు భూమితో ప్రయోజనం లేదు.

ఏవముక్తో నరపతిర్బ్రాహ్మణైర్వేదపారగైః
గవాం శతసహస్రాణి దశ తేభ్యో దదౌ నృపః
దశకోటీః సువర్ణస్య రజతస్య చతుర్గుణమ్॥

ప్రభువైన దశరథుడు వేదపారంగతులైన బ్రాహ్మణులచే ఈ విధంగా అభ్యర్థింపబడినవాడై వారికి **శతసహస్రాణి దశ** పదిలక్షల గోవులను, ఈ దశ అనునది అన్నింట అన్వయింపబడుతుంది. కావున నూరుకోట్ల బంగారు నాణెములను, దానికి నాలుగురెట్లు అంటే నాలుగువందల కోట్ల వేండినాణెములు ఇచ్చేరు. ఈ ధనము పదహారు ఋత్విక్కుల సమష్టిధనం కావున, ఈ ధనమంతయు బుద్ధిమంతుడైన వసిష్ఠునకు ఋష్యశృఙ్గునకు ఇచ్చేరు. సంతోషాంతరంగులైన బ్రాహ్మణోత్తములు అందరు న్యాయముగా పంపకమును చేసికొని, దశరథా! చాలా సంతోషాన్ని పొందేము అన్నారు. ఆ తరువాత దశరథుడు మిక్కిలి శ్రద్ధచే యాగమును వీక్షించుటకు వచ్చిన బ్రాహ్మణులకు కోటి సంఖ్యగల బంగారమును ఇచ్చేరు.

దరిద్రాయ ద్విజాయాథ హస్తాభరణముత్తమమ్।
కస్మైచిద్యా చమానాయ దదౌ రాఘవనందనః॥౫౨

అంతా దానంచేసిన తరువాత యాచించుచున్న ఒకానొక దరిద్రుడైన బ్రాహ్మణునకు దశరథుడు తన హస్తాభరణాన్ని ఇచ్చేరు. ఇవ్వాలన్న మనస్సు ఉంటే ఇవ్వతగిన వస్తువు (ద్రవ్యం) దానంతట అదిగానే కనిపిస్తుంది. అటువంటి మనస్సుకలిగి ఉండాలి. దానిని పరిచయం చేసారు మహర్షి. అటువంటి మనస్సును దృఢం చేసుకోకపోతే దానంచేసే అవకాశం వచ్చినాకూడా దానం చేయలేం. కారణాలతో మిగిలిపోతాం.

బ్రాహ్మణులయందు అధికప్రేమకల దశరథుడు బ్రాహ్మణులు సంతోషించు చుండగా వారికి నమస్కరించెను. వంగి నమస్కరించుచున్న దశరథునకు బ్రాహ్మణులు వేదాశీర్వచనములను పలికేరు.

తరువాత దశరథుడు పాపాపహమును, స్వర్గమును ఇచ్చేది, గొప్ప రాజులచేకూడ చేయ అశక్యమైన అత్యుత్తమమైన అగు అశ్వమేధయజ్ఞమును పొంది ప్రీత మనస్కుడైనాడు.

తతోఽ బ్రవీ దృశ్యశృఙ్గం రాజా దశరథస్తదా।
కులస్య వర్ధనం త్వం తు కర్తు మర్హసి సువ్రత॥౫౬

తరువాత దశరథుడు ఋష్యశృఙ్గనిగూర్చి సువ్రతుడా! నాకులమునకు వృద్ధికలిగించు కర్మను చేయుటకు నీవు తగినవాడవు. అని ప్రార్థించాడు. నిస్సంతుడగుటకు పురాకృతమైన దురితములే కారణము. అని నమ్మినవాడు. అది లోకాన్ని చూచి స్థిరీకరించుకున్న వాడు.

నేను సంపన్నుణ్ణి కాబట్టి సంతానవంతుణ్ణి కావాలన్న నియమంలేదు. నేను పురుషుణ్ణి కావున నాకు సంతతి కలుగుతుందన్న నియతిలేదు. నేను గొప్పకులంలో పుట్టాను కావున ఆ భాగ్యం కావాలంటే రాదు.

వంశవృద్ధి నిరోధకమైన పాపములు లేనివాడైతే వాడు సంపన్నుడు కులీనుడు అయనా కాకపోయినా అనుగ్రహింపబడతాడు.

ఈ యాగమువలన దశరథుడు పాపరూపమైన ఆ అవరోధములను తొలగించుకొన్నాడు. ఇప్పుడు వంశవృద్ధికి మార్గం సుగమమైంది. కావున

తదర్థమై ఏదైనా కర్మను చేయండి. అని ప్రార్థించాడు.

తథేతి చ స రాజానమువాచ ద్విజసత్తమః
భవిష్యన్తి సుతా రాజం శ్చత్వారస్తే కులోద్వహాః॥౫౭

అటులనే అని రాజునుగూర్చి పలికి, ఆ బ్రాహ్మణశ్రేష్ఠుదు నీకు వంశోద్ధారకులైన నలుగురు కుమారులు పుట్టగలరని ఆశీర్వచన రూపంగా పలికేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుర్దశస్సర్గ సమాప్తము.

–

॥అథ పఞ్చదశః సర్గః॥

(దశరథుడు పుత్రీయేష్టిని ప్రారంభించుట, బ్రహ్మ రావణ వధోపాయమును తెల్పుట. విష్ణువు దేవతలను ఓదార్చుట.)

మేధావీతు తతో ధ్యాత్వా స కించిదిదముత్తరమ్
లబ్ధసంజ్ఞస్తతస్తం తు వేదజ్ఞో నృపమబ్రవీత్॥ ౧

వేదజ్ఞుడు మేధావి అయిన ఋష్యశృంగుడు కొంచెం ఆలోచించి పొందబడిన స్మృతిగలవాడై దశరథునిగూర్చి పలికేరు.

తతః ప్రాక్రమ్య తామిష్టిం పుత్రీయాం పుత్రకారణాత్
జుహావ చాగ్నౌ తేజస్వీ మన్త్రదృష్టేన కర్మణా॥ ౩

నేను నీకొరకు సంతానమును కలిగించు పుత్రకారకమైన అధర్వశిరస్సను వేదభాగమందు చెప్పిన మంత్రములచే సిద్ధించు పుత్రీయేష్టిని శాస్త్రవిధిని అనుసరించి చేయిస్తానని...

సంతానంకొరకు పుత్రులను కలిగించు ఇష్టిని ప్రారంభించి తేజస్వియైన ఋష్యశృంగుడు మంత్రోక్తముగా అగ్నియందు హెూమము చేసేరు.

గంధర్వులతోకూడిన దేవతలు సిద్ధులు హవిర్భాగార్హతగల ఋషులు హవిర్భాగ ప్రతిగ్రహార్థం కలిసేరు.

తాః సమేత్య యథాన్యాయం తస్మిన్ సదసి దేవతాః
అబ్రువన్ లోకకర్తారం బ్రహ్మాణం వచనం మహత్॥
భగవన్ త్వత్ప్రసాదేన రావణోనామ రాక్షసః
సర్వాన్నో బాధతే వీర్యా చ్ఛాసితుం తం నశక్నుమః॥౬

ఆ దేవతలు (యథాన్యాయం)మన్త్రోక్తంగా పిలువబడినవారై ఆ సదస్సునందు కలిసి లోకకర్త అయిన బ్రహ్మదేవునిగూర్చి పూజనీయమైన మాటల్ని పలికేరు. హే భగవన్! రావణుడు అను పేరుగలవాడు. రాక్షసుడు. అంటే 'రక్ష ఏవ రాక్షసః-రక్షత్యాత్మానమేవేతి-తన ప్రాణమును రక్షించుకొనువాడు."

ఏవిధంగానైనా తన ప్రాణరక్షణే ముఖ్యం అనుకొనే కరుడుకట్టిన స్వార్థపరుడు. అటువంటి వాడు నీ అనుగ్రహంచేత పరాక్రమంవల్ల మమ్మల్ని అందరినీ బాధిస్తున్నాడు. వాడిని శిక్షించే విషయంలో అసమర్థులుగా ఉండిపోయాం.

త్వయా తస్మై వరోదత్తః ప్రీతేన భగవన్ పురా
మానయన్తశ్చ తం నిత్యం సర్వం తస్య క్షమావహే॥

భగవన్! పూర్వం వానియందలి ప్రీతిచేత నీచే వానికొరకు వరం ఇవ్వబడింది. ఆ వరమును గౌరవించుచూ వాడియొక్క సర్వాన్ని అంటే వాడుచేసే అకృత్యాలన్నింటినీ నిత్యం క్షమిస్తున్నాం. (ఈ రావణునికంటే ప్రతాపవంతులు చాలామంది ఆ కాలంలోనూ ఉన్నారు. అర్జునాదులైన రాజులు, వాలి, కాలాగ్ని రుద్రులు. ఇంద్ర ఉపేంద్రులు వీరంతా సృష్టికర్తయందలి గౌరవంచే వీణ్ణి భరిస్తున్నవారే.)

ఉద్వేజయతి లోకాంస్త్రీనుచ్ఛ్రితాన్ ద్వేష్టి దుర్మతిః
శక్రం త్రిదశరాజానం ప్రధర్షయితుమిచ్ఛతి॥ ౮

దుష్టమైన ఆలోచనలు కలవాడు. త్రిలోకాల్ని పీడిస్తున్నవాడు. ఉచ్ఛ్రితులను అంటే యజ్ఞములందు హవిర్భాగార్హత కలవారిని ద్వేషిస్తున్నాడు. దేవరాజైన శక్రుని అవమానమును కోరుకొనువాడు.

ఋషీన్యక్షాన్సగన్ధర్వానసురా న్బ్రాహ్మణాం స్తథా
అతిక్రామతి దుర్ధర్షో వరదానేన మోహితః॥ ౯

వరదానముచేత అతిక్రమింప శక్యముగాని అతడు గర్వితుడై ఋషులను యక్షులను గంధర్వులను వీరితోకూడిన అసురులను మరియు బ్రహ్మవేత్తలను అవమానిస్తున్నాడు.

తతో దేవా స్సగన్ధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః। భాగప్రతి గ్రహార్థం- అని పూర్వశ్లోకంలో వీరందరు హవిర్భాగ ప్రతిగ్రహార్థం కలిసేరని చెప్పేరు. ఇక్కడ అసురులు అంటే మహర్షి దేవ గంధర్వాదులకు హవిర్భాగాలను ఇచ్చే **మర్త్యులు. సురు**లంటే ఐశ్వర్యయుక్తులు ప్రకాశస్వరూపులు హవిర్భాగాలను గ్రహించువారు శుభములను పల్కువారు, అమృతంకలవారు, అభీష్టఫలాలను ఇచ్చువారు. ఇక్కడ వాల్మీకిమహర్షి అసురులకు ఋషి యక్ష గంధర్వాదులతో సంబంధాన్ని చెప్పటంవల్ల అసురులు పైవాటికొరకు యజ్ఞయాగాదులద్వారా హవిర్భాగాలను సమర్పిస్తూ తద్వారా సురులను ప్రసన్నం చేసికొని ఐశ్వర్యం ప్రకాశం (కీర్తి) మొదలైన సర్వాభీష్టాలను పొందు మర్త్యులని గ్రహించాలి.

నైనం సూర్యః ప్రతపతి పార్శ్వే వాతి న మారుతః
చలోర్మిమాలీ తం దృష్ట్వా సముద్రోఽపి నకంపతే॥

సూర్యుడు వీడిని తపింపచేయటంలేదు. గాలి దగ్గరగా వీచటంలేదు. చంచలమైన సముద్రుడుకూడా వీడిని చూస్తే కదలటం లేదు.

ప్రకృత్యష్టకరూపంగా పరమేశ్వరుడు తనను తాను ప్రకటించుకుంటాడు. ఈ ప్రకృతి శక్తులు పరమేశ్వరుని మహిమయందే నిష్ఠకలిగి ఉంటాయి. సర్వనియామకుడైన పరమేశ్వరుడే వీటి నియామకుడుకాని అన్యులుకాలేరు. అయినప్పటికి బ్రహ్మదత్తమైన వరమును మన్నించి జగన్నియామకుడూ మౌనముదాల్చాడు.

తన్మహన్నో భయం తస్మాద్రాక్షసాద్ఘోరదర్శనాత్
వధార్థం తస్య భగవన్నుపాయం కర్తుమర్హసి॥ ౧౧

ఘోరమైన దర్శనంగల ఆ రాక్షసునినుండి మాకు ఆకారణంగా గొప్పభయం కలిగింది. శిష్టరక్షకుడు సర్వనియంత అయిన పరమేశ్వరుని మౌనము. ఆ కారణంగా వాడు ఘోరదర్శనుడై మాకు భయకారకుడు అయ్యేడు.

హే భగవన్! రావణ వధార్థం ఉపాయమును ఆలోచించు, దానికి నీవే తగిన వాడవు. అని ప్రార్థించేరు. సమస్త దేవతలచే ఈ విధంగా ప్రార్థింపబడిన బ్రహ్మ ఆలోచించి; ఆహా! దురాత్ముని చంపే ఉపాయం తెలిసింది అన్నారు.

తేన గన్ధర్వయక్షాణాం దేవదానవ రక్షసామ్
అవధ్యోస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా॥ ౧౩

గన్ధర్వ యక్ష దేవ దానవ రాక్షసులకు అవధ్యుడను అగుదునుగాక! అని అడిగేడు. నేనూ సరే అన్నాను. ఆసమయంలో వాడు అనాదరముతో మనుష్యులను కీర్తించలేదు. ఆ కారణంగా ఆ రాక్షసుడు మనుష్యులవలన మరణిస్తాడు. వానికి మరో విధంగా మృత్యువు లేదన్నారు.

బ్రహ్మపలికిన ఈ ప్రియవాక్యము విని, ఆ దేవతలు ఋషులు అందరూ చాలా సంతోషించారు. ఎందుకని అంటే రావణవధార్థమైన సంకల్పం బ్రహ్మ చేసారు. ఇది బ్రహ్మసంకల్పం కనుక వాడికి మృత్యువు తథ్యం.

ఏతస్మిన్నన్తరే విష్ణురుపయాతో మహాద్యుతిః।
శఙ్ఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః॥౧౬

అంతలో గొప్ప కాంతికలవాడు శంఖము చక్రము గదా హస్తములందు కలవాడు పీతవస్త్రం (పచ్చని వస్త్రం) ధరించినవాడు. జగత్పతి అయిన విష్ణువు వచ్చేడు. ఇక్కడ చెప్పబడ్డ విష్ణుశబ్దం "అల వైకుంఠ పురంబులో నగరిలో..."అని చెప్పబడ్డిన విష్ణుశబ్దవాచ్యుడు కాదు. ఇక్కడ విష్ణుశబ్దం సవితృ దేవతాకం.

ధ్యేయస్సదా సవితృమణ్డల మధ్యవర్తీ నారాయణ స్సరసిజాసన సన్నివిష్టః।
కేయూరవాన్ మకర కుణ్డలవాన్కిరీటీ హారీహిరణ్మయ వపుర్ధృత శఙ్ఖచక్రః॥

గొప్పకాంతి శంఖం చక్రం కిరీటకుండలాలను ధరించిన సూర్యమండల అధిష్ఠాతయైన నారాయణుడు. బ్రహ్మతోకలిసి సమాహితచిత్తుడై ఉండగా, ఈయన సర్వలోక కర్మసాక్షి కావున బ్రహ్మసంకల్పాన్ని తెలిసి దానియందు మనస్సు నిలిపి మౌనంగా ఉన్నాడు. అప్పుడు దేవతలు అందరు స్తుతి నమస్కారాదులతో విన్నవించుకుంటున్నారు.

యో ద్రవ్యదేవతా త్యాగసంభూతో రస ఉత్తమః
దేవాన్ సంతర్ప్య స రసో యజమానం ఫలేన చ॥
సంయోజ్య వాయునా సోమం నీయతే రశ్మిభిస్తతః।
ఋగ్యజుఃసామ విహితం సారం ధామోపనీయతే॥
స్వమణ్డలాదసౌ సూర్యః సృజత్యమృతముత్తమమ్।
యజ్జన్మ సర్వభూతానామశనానశనాత్మనామ్॥

దేవతలను ఉద్దేశించి పురోడాశాది ద్రవ్యమును త్యాగం చేయడంవల్ల జగత్కారణమైన శ్రేష్ఠమైన రసోత్పత్తి జరుగుతోంది. దానితో దేవతలు తృప్తిచెంది యజమానికి ఫలము సమకూర్చి వాయువుచేత సోమునిగూర్చి తీసుకు వెళ్ళి అటుపై వేదసారమైన సూర్యతేజస్సునుగూర్చి తీసుకువెళ్ళ బడుతుంది. ఆ నారాయణుడే తన మణ్డలమునుండి శ్రేష్ఠమైన అమృతమును సృష్టిస్తాడు. ఈ అమృతమువలన స్థావరజంగమాత్మకమైన సకలభూతములు కలుగుతున్నాయి.

క్రతుకర్మ ఫలప్రదాత ఆదిత్యుడేయని హవిర్భాగ గ్రహీతలైన దేవతలు విష్ణురూపుడైన ఆదిత్యమణ్డలాంతర్గత నారాయణుని ఆశ్రయించి తద్వారా యాగఫలాన్ని అనుగ్రహిస్తారని యాజ్ఞ్యవల్క్యాది స్మృతులు, శివపురాణములో వ్యాసమహర్షి చెప్పేరు.

త్వాం నియోక్ష్యామహే విష్ణో లోకానాం హితకామ్యయా
రాజ్ఞో దశరథస్య త్వమయోధ్యాపతేః ప్రభోః॥
ధర్మజ్ఞస్య వదాన్యస్య మహర్షి సమతేజసః
తస్యభార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసు చ॥౧౯
విష్ణో పుత్రత్వ మాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్।

ఓవిష్ణూ! లోకములయొక్క హితమునందలి కోరికచే నిన్ను నియమించు చున్నాను. విష్ణూ! నీవు అయోధ్యాధిపతియు ప్రభువు ధర్మజ్ఞుడు మహర్షులతో సమానమైన తేజస్సుకలవాడైన దశరథునియొక్క **హ్రీ శ్రీ కీర్తి** అనువారలతో (వీరు దక్షపుత్రికలు) సమానులైన ముగ్గురుభార్యలయుందు నాల్గువిధాలైన వానినిగా చేసికొని పుత్రత్వమును పొందు. అని అర్థించారు.
ఎందుకని అంటే–తమకు హవిర్భాగాలను అర్పిస్తున్న ఋషులను సత్యవాక్కులుగా చేయాలి. అందుకు ఆ అభ్యర్థన.

తత్రతం మానుషో భూత్వా ప్రసిద్ధం లోకకంటకమ్
అవధ్యం దైవతైర్విష్ణో సమరే జహి రావణమ్॥౨౦

ఓవిష్ణూ! నీవు వారియందు మనుష్యునిగా జన్మించి ప్రసిద్ధుడైన లోకకంటకుడైన దేవతలచే అవద్యుడైన రావణుని యుద్ధమందు చంపు.

స హి దేవాంశ్చ గన్ధర్వాన్ సిద్ధాంశ్చ మునిసత్తమాన్
రాక్షసో రావణో మూర్ఖో వీర్యోత్సేకేన బాధతే॥౨౧

ఆ రావణుడు రాక్షసుడు మూర్ఖుడు. దేవతలను గంధర్వులను సిద్ధులను మునిశ్రేష్ఠులను బలగర్వముచే బాధిస్తున్నాడు. ఇక్కడ రావణుడు మూర్ఖుడని చెప్పబడ్డాడు. అంటే మోహమును పొందువాడు అర్థాత్ ఇంద్రియ నిగ్రహం లేనివాడు. ఏవిధంగానైనా తన ప్రాణములను మాత్రం రక్షించుకోజూచువాడు (స్వార్థపరుడు) కావున రాక్షసుడు. వీడు తండ్రి గురువు సోదరుడు దైవము

అనువారియందు లక్ష్యంలేనివాడు. దేవతలను గంధర్వులను బాధించువాడు. దేవతలు అంటే హవిర్భాగాలను స్వీకరించేవారిని, గంధర్వులు అంటే ఆ హవిర్భాగాలను మంత్రపూతంగా సమర్పించు వేదపండితులు. వీరుభయుల పరస్పరాశ్రయంవలన దేశం వృష్టిసహితంగా ఉపద్రవరహితంగా ఉంటుంది. ఈ వేదపండితులను బాధించుటచే యజ్ఞములు జరుగక, దేవతలకు హవిర్భాగాలులేక, దేశం వృష్టిరహితమై ఉపద్రవాలతో పీడింపబడుతుంది. సిద్ధులు మునులుకూడా పీడింపబడుతున్నారు. అంటే వీడిచే సత్వగుణ విశిష్టులందరు పీడింపబడుతున్నారు.

వదార్థం వయమాయాతా స్తస్యవై మునిభిస్సహ।
సిద్ధగన్ధర్వయక్షాశ్చ తతస్త్వాం శరణంగతాః॥ ౨౩

మేము (దేవతలు) సిద్ధులు గన్ధర్వులు యక్షులు మునులతోకూడి ఆ రావణవధార్థం వచ్చి నిన్ను శరణు పొందేము.

ఏవముక్తస్తు దేవేశో విష్ణుస్త్రిదశ పుఙ్గవః॥ ౨౪
పితామహపురోగాంస్తాన్ సర్వలోక నమస్కృతః
అబ్రవీత్త్రిదశాన్ సర్వాన్ సమేతాన్ ధర్మసంహితాన్॥౨౬

దేవతలలో శ్రేష్ఠుడు సర్వలోక నమస్కృతుడు దేవతలకు ప్రభువు అయిన విష్ణువు. ఈ విధంగా ప్రార్థింపబడినవాడై అక్కడకు చేరిన ధర్మాత్ములైన బ్రహ్మాది దేవతలనుగూర్చి పలుకుతున్నాడు.

భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్
సపుత్రపౌత్రం సామాత్యం సమిత్రజ్ఞాతి బాంధవమ్॥
హత్వాక్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్।
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ
వత్స్యామి మానుషేలోకే పాలయన్ పృథివీమిమామ్॥

మీరు భయం విడిచిపెట్టండి. మీకు భద్రమగుగాక!
మీ హితంకొరకు క్రూరుడు దురాత్ముడు దేవతలకు ఋషులకు భయము కలిగించువాడగు రావణుని పుత్రపౌత్రాదులతో అమాత్యులతో మిత్రజ్ఞాతి బాంధవులతోకూడిన వానిని యుద్ధమందు చంపి, ఈ భూమిని పదివేల

ఒక వెయ్యి సంవత్సరములు పాలించుచు, మనుష్యలోకంలో నివసించ గలను. అని–

ఏవం దత్త్వావరం దేవో దేవానాం విష్ణురాత్మవాన్
మానుషే చింతయామాస జన్మభూమి మథాత్మనః॥

విష్ణువు దేవతలకు ఈవిధంగా వరమును ఇచ్చి మనుష్యులయందు అవతరించుటకు తనకు తగిన స్థానమునుగూర్చి ఆలోచించెను.

తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్॥

తరువాత పద్మపురేకులవంటి కన్నులుకల విష్ణువు అప్పుడు తనను నాలుగు విధాలుగా విభాగించుకొని దశరథుని తండ్రిగా ఇష్టపడ్డాడు.

తతో దేవా స్సగంధర్వా స్సరుద్రా స్సాప్సరోగణాః
స్తుతిభిర్దివ్య రూపాభిస్తుష్టువు ర్మధుసూదనమ్॥

తరువాత అప్సరసలతోకూడిన గంధర్వలు రుద్రులు దేవతలు స్తోత్రాలతో దివ్యమైనరూపముగల మధుసూదనుని స్తుతించేరు.

ఇప్పటివరకు విష్ణుశబ్దాన్ని వాడి ఇప్పుడు ఆ విష్ణువు మధుసూదనుడు అని చెప్తున్నారు.

అహం విష్ణు ర్భవాన్ విష్ణుః బ్రహ్మావిష్ణుః ప్రభాకర। అస్మాకం సకలం ధామ త్వయి తిష్ఠతి భాస్కరా! అని పరమేశ్వరుడు ఆదిత్యునితో చెప్పేరు. ఇక్కడ విష్ణుశబ్ద వాచ్యుడైనవాడు ఆదిత్యుడే!

క్రమణాచ్చ తథా విష్ణురీశిత్వా దింద్ర ఉచ్యతే జగదాక్రమణంచే విష్ణువని, ఈశుండగుటచేత ఇంద్రుడని పేర్కొనబడుచున్నావు. అని ఆదిత్యుడే స్థితికారకుడిగా చెప్పబడ్డాడు.

మధుకైటభులను సంహరించింది లక్ష్మీపతి అయిన విష్ణువు కదా! అంటే దానికి సమాధానం

విష్ణుశ్చకార దేహౌ ద్వౌ విష్ణుర్జిష్ణురితి స్మృతౌ। మధునా యుయుధే జిష్ణుర్విష్ణుర్వై కైటభేన చ॥ మధురాక్షసుని చంపింది జిష్ణునామధేయుడైన వాడు. ఇతడు విష్ణువుకాడా? అంటే అవతారభేదం కర్మభేదములచేత కాదనే చెప్పాలి.

వైవస్వతేఽస్మిన్ దేవేశ! యథా మన్వంతరే శుభే॥
ప్రాదుర్భావాని దృష్టాని మయాతస్య మహాత్మనః।
వరాహం వామనం చైవ తథా శక్రః త్రివిక్రమమ్॥
నారసింహం తథా మాత్స్యం కూర్మం హంసం తథౌవచ
నృవరాహం తథా రామం రామం చ సురసత్తమః॥
మాంథాతారం పృథుంచైవ కార్తవీర్యార్జునం తథా।
ధాతారం చ తథా మిత్రం చాంశు మర్యమణం తథా॥
పూషణం చ భవన్తం చ వరుణం భగమేవచ।
త్వష్టారం చ వివస్వంతం సవితారం తథైవచ
విష్ణుం చంద్రమసం రుద్రం బ్రహ్మాణం యయమేవ చ
హుతాశనం వైశ్రవణం శేషం నాగేశ్వరం తథా
గ్రహముఖ్యం బుధంచైవ ఆపః ఖం పృథివీ తథా।
వాయుస్తేజశ్చ దేవేశః తథైవాన్యాని వాసవ!

అని విష్ణుధర్మోత్తరపురాణంలో శంబరాయణి ఇంద్రునకు పైవన్నీ విష్ణుయొక్క వివిధ అవతారములని చెప్పేరు.

ఇక్కడ విష్ణుశబ్దవాచ్యుడైన ఆదిత్యుడే గ్రహింపతగినవాడు.

"భూమి స్థావర జంగమ భూతకోటిభారముచే పీడింపబడుచున్నది. కార్తవీర్యార్జునుడు రాజైన తరువాత చెట్లు బహుధా విస్తరించినవి. దైత్యులు క్షత్రియులై భూమిని పీడించుచున్నారు. అని రుద్రుడు ప్రార్థింపగా!"

సాంప్రతం బ్రాహ్మణో భూత్వా చార్జునేనైవ పాదపాన్
సర్వాన్ వినాశయిష్యామి శాసనేన తథాఽర్జునమ్
వసిష్ఠా ద్యోజయిష్యామి తతోఽంశేన వసుంధరామ్।
భృగువంశే కరిష్యామి తతో నిఃక్షత్రియాం ప్రజామ్॥

బ్రాహ్మణుడనై కార్తవీర్యార్జునుని చేతనే చెట్లను నరికిస్తాను. నాఅంశచే (పరశు రామ) ఈ భూమిని భృగువంశం వశం చేస్తాను. ఆపై ప్రజలను నిఃక్షత్రియం చేస్తాను అని సూర్యుడు త్రిపురాంతకునితో పలికేడు.

తఏవ తేజసోర్ధేన జాతశ్చైవాదితేః సుతాః
నరనారాయణౌ చోభౌ యౌతౌ రాజన్మయేరితౌ
ఇంద్రా విష్ణూతథైవోక్తా వాదితేషు నరాధిపః॥

నరుడు నారాయణుడు అన్నా! ఇంద్రుడు విష్ణువు అన్నా! ఇద్దరూ ఆదిత్యులుగా పేర్కొనబడ్డారు. **"వేదాశ్చక్రతవశ్చైవ క్రతూనాం ఫలమేవ చ"** అని ఎదర చెప్పేరు. యజ్ఞములందు పొందిన ఆహుతి ద్రవ్యము సరిగా ఆదిత్యుని పొందును. ఆదిత్యునివలన వర్షము, వృష్టివల్ల అన్నం, అన్నంవలన ప్రజలు...

ప్రాప్తా త్వయాహూతిః సమ్యగాదిత్య ముపతిష్ఠతే
ఆదిత్యా జ్జాయతే వృష్టి ర్వృష్టేరన్నం తతః ప్రజా।
సర్వదేవ వరేశానః సర్వలోక నమస్కృతః॥

అని బృహస్పతి కీర్తించుటను బట్టి, ఈ హోమద్రవ్యముల ఆహుతులచే సంప్రీతిని విష్ణుశబ్దవాచ్యుడైన ఆదిత్యుడే ఇచ్చటకు వచ్చెనని చెప్పవలసినది.

విశేషించి సూర్యవంశ ప్రవర్తకుడు. అంశజులైన ఇక్ష్వాకుల ధర్మానుష్ఠానానికి ప్రీతిచెంది దశరథుని తండ్రిగా నిర్ణయించుకొని కర్మసాక్షికావున మంత్రపూతంగా హవిస్సులను అర్పిస్తూన్న ఋషులను సత్యవాక్కులుగా చేయనిశ్చయించి తనను నాలుగుగా కల్పించుకున్నాడు.

(ఈ ఆదిత్యుడు సర్వదేవతా శరీరుడు. **'ఏష బ్రహ్మా చ విష్ణుశ్చ...'** బ్రహ్మ విష్ణు మహేశ్వర కుమారస్వామి ప్రజాపతి ఇంద్రుడు కుబేరుడు కాలుడు యముడు చంద్రుడు వరుణుడు ఇతడే. ఇంకా పితృదేవతలు అష్టవసువులు మరుద్గణములు మనువు వాయువు అగ్ని అశ్వినీకుమారులు. వీరందరు ఆదిత్యుడే. ఈ ఆదిత్యుడు బ్రహ్మవిష్ణు మహేశ్వరులనుకూడ రక్షించువాడు. **'బ్రహ్మేశానాచ్యుతేశాయ'** అని చెప్పేరుకదా! ఈ స్వరూపాన్నే వాల్మీకి– **విష్ణురాత్మవాన్**(1.15.29) బుద్ధిమంతుడైన విష్ణువు; **త్రిదశపుఙ్గవః** దేవతా శ్రేష్ఠుడు. **సర్వలోకనమస్కృతః**(1.15.26)**, నారాయణః**(1.16.1)**. అవ్యయమ్ విష్ణుః**(1.16.3) **అవినాశి,** దేవతా శ్రేష్ఠుడు, సర్వలోక నమస్కృతుడు అయిన విష్ణువు, మహాత్ముడు సర్వలోకశరణ్యుడు (యుద్ధ.17సర్గ) అయిన విష్ణువు.

ఈ నామాలు సగుణసాకారుడైన వానికొరకుకాదు. ఈ నామధ్యానం

సగుణనిరాకారుడైనప్పుడే సాధ్యపడుతుంది. అదిఎలా! నిరాకారుని శరణు పొందడం సాధ్యమా! అంటే-

బంగారం ఉంది. అది సగుణనిరాకారమా? సగుణసాకారమా? అంటే! అది **సగుణనిరాకారం.** ఆభరణం సగుణసాకారం.

విష్ణువు సగుణసాకారుడైతే సర్వలోక ప్రియత్వం, సర్వలోక శరణ్యత్వం కుదరదు. ఎందుకంటే! సాకారుడు పరిచ్ఛిన్నుడు. సాకారమైన స్వరూపం ఒక ప్రాంతానికో ఒక లోకానికో పరిమితమై ఉంటుంది. ఆ స్వరూపం అక్కడ వారిచేతనే ఆశ్రయింప వీలుంటుంది. అదికూడా అందరూ శరణాగతి పొందుటకు వీలుగా ఉండదు. కష్టసాధ్యమైన రాజదర్శనా శ్రయాదులవలె. సగుణ సాకార విష్ణువునకు అవినాశిత్వం కుదరదు. అప్పుడు కాలమునకు బద్ధులైన హరి హర బ్రహ్మాదులని చెప్పాలి. అది వాల్మీకి అభిమతం కాదు. అలా అయితే హిరణ్యాక్ష హిరణ్యకశిపులను; రావణ కుమ్భకర్ణులను; శిశు పాల దంతవక్త్రు (జయ విజయు)లను సంహరించింది ఎవరు? అంటే నిస్సందేహంగా విష్ణువు. అంటే పిపీలికాది బ్రహ్మపర్యంతము స్థావరజంగ మాత్మకమైన ఈ జగత్తును వ్యాపించిన చైతన్యమే విష్ణువు. ఈ చైతన్యమే కార్యార్థమై దేనియందు స్ఫుటముగా ప్రకటమైతే ఆ స్వరూపం విష్ణువని చెప్పబడుతోంది.

ఇక్కడ దేవతలు రుద్రులు వేదపండితులు అప్సరసలతోకూడినవారై విష్ణువుని స్తుతించేరని చెప్పేరు.

"దక్షణాభిర్హియజ్ఞః స్తూయతే అథోయో వై కశ్చన దక్షిణాం దదాతి స్తూయత ఏవ సః"(శత.బ్రా.) దక్షిణతో యజ్ఞంయొక్క స్తుతి జరుగుతుంది. బ్రహ్మ అధ్వర్యుడు ఆదిగాగల ఋత్విక్కులు గంధర్వులు. ఋక్ సామలు వాని అప్సరసలు. ఈ ఋక్ సామల సాహచర్యంతోనే ఋత్విక్కుల అన్ని ఇష్టులు పండితసదస్సులు, సత్కారాలు దానాలు జరుగుతాయి. **"గంధర్వ స్యాప్సరా పతే"** అని అధర్వవేదం గంధర్వుడు అంటే అప్సరాపతి అని చెప్పింది. ఋక్ సామరూపాలుగా ఉన్న ఈ మంత్రవిద్యను రక్షించు వేదపురుషుడైన ఋత్విక్కు గంధర్వుడు. రక్షింపబడుతూన్న వేదవిద్య అప్సరసులు.

అదేవిధంగా అగ్నికి ఓషధులు అప్సరసలు (ముద్), చంద్రునకు నక్షత్రాలు (భేకురి) అప్సరసలు, వాయువునకు ప్రాణశక్తులు అప్సరసలు (ఊర్జ్). ఇలా దేవతలు రుద్రులు వారివారి శక్తులతో ఉన్నవారై విష్ణుశబ్దవాచ్యుడైన ఆదిత్యుని స్తుతిస్తున్నారు.

తముద్ధతం రావణముగ్ర తేజసం
ప్రవృద్ధదర్పం త్రిదశేశ్వర ద్విషమ్।
విరావణం సాధు తపస్వికణ్టకం
తపస్వినా ముద్ధర తం భయావహమ్॥ ౩౨

విజృభించినవాడు ఉగ్రమైనతేజస్సుకలవాడు బాగావృద్ధిపొందిన గర్వంకలవాడు దేవేంద్రుని ద్వేషించువాడు తపస్వులకు కంటకం వంటివాడు మహర్షులకు భయావహుడు సకలలోకములను ఏడిపించువాడైన ప్రసిద్ధుడైన రావణుని బాగుగా ఉద్ధరింపుము.

తమేవ హత్వా సబలం సబాన్ధవం
విరావణం రావణమగ్ర్య పౌరుషమ్
స్వర్లోక మాగచ్ఛ గతజ్వరశ్చిరం
సురేన్ద్రగుప్తం గతదోష కల్మషమ్॥ ౩౩

నేను రావణ సంబంధిని అన్న మాట మరల ఎక్కడా వినిపించకూడదు. పుత్ర మిత్ర బంధు పరివారసమేతంగా సంహరించు, సంహరించి పోయిన వ్యధకలవాడవై దేవేంద్రునితో రక్షింపబడు దోషరహితము పాపరహితము అయిన స్వర్గలోకమునుగూర్చి రావయ్యా!

పూర్వశ్లోకంలో బాగుగా ఉద్ధరించు అని, ఇక్కడ అందర్ని సంహరించు అని చెప్తున్నారు. ఇదేం ఉద్ధరించటం అంటే... ఆవిధంగా వాడికి పోయే ముందైనా వైరాగ్యోదయం కావాలి. వీడు అన్నివిధాలా సంహరింప తగినవాడే, అయినా సంహరించటానికికూడా ఒక క్రమాన్ని చెప్పేరు. ముందే వాణ్ణి చంపకూడదు. వాడి బలాన్ని అంటే సైన్యాన్ని, తరువాత వాడి బంధువుల్ని, వీడు ఎవడెవడితో బంధాల్ని (పుత్ర మిత్ర బంధురూపంగా) వేసుకున్నాడో వాళ్ళందర్ని చంపు. అలా జరిగితే వీడికి జీవితంయొక్క అస్థిరత అనుభవంలోకి వస్తుంది. తద్వారా వైరాగ్యం ఉదయిస్తుంది.

ఇది ఉద్ధరణ. ఈవిధమైన అభ్యర్థనుందే ఇది దైవీసంపత్తిగలవారి సహజగుణం. శత్రువుకు కూడా మేలుచేకూర్చు ఆలోచన. ఇటువంటి ఆలోచనకలవారు దేవతలు, మహర్షులు, తపస్వులు. వీరు లోకక్షేమంకొరకైనవారు.

సత్పురుషుడో లోకకంటకుడో వాడు ఎవడైనప్పటికి ఏ జీవి అయిన్పటికీ వాడిని లేదా ఆజీవిని సంహరించాలన్న సంకల్పం, ఆ సంకల్పసిద్ధిపర్యంతమైన కర్మాచరణం ఇది లోకోపకారకమైనప్పటికి, ఇవి ఎంతటి వానికైనా దుఃఖాన్ని కలిగిస్తుంది. దుఃఖప్రాప్తిరూపమైన కర్మ నేను ఎందుకు చెయ్యాలి అని సమర్థుడు విముఖతను ప్రదర్శించకూడదు. తనకు దుఃఖప్రాప్తికరమైనను లోకోపకారకమగుటచే ఆ కర్మను చేయవలసినదే అని చెప్పేరు.

ఈమాటను స్మృతికర్తలూ అంగీకరించేరు.

దుఃఖంగలవానికి స్వర్గం ప్రాప్తించదు. కావున దుఃఖనివారక ఉపాయమును అనుష్ఠించి గతకల్మషుడవై స్వర్గానికి రా! అన్నారు.

పాపులకు స్వర్గప్రవేశార్హత లేదు. అందుకని ఆవిధంగా చెప్పటం.

ఇది చతుర్ముఖబ్రహ్మ సహితంగా ఇంద్రాలుచేసిన అభ్యర్థన.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చదశస్సర్గ సమాప్తము.

-

॥అథ షోడశః సర్గః॥

(రావణవధార్థం దేవతలు విష్ణువును అభ్యర్థించుట, దశరథుడు చేయు పుత్రేష్టిలో ప్రాజాపత్య పురుషుడు పాయస ప్రదానము, దశరథపత్నులు గర్భధారణ.)

తతో నారాయణోదేవో నియుక్తః సురసత్తమైః
జానన్నపి సురానేవం శ్లక్ష్ణం వచన మబ్రవీత్॥ ౧

తరువాత దేవతలచే రావణ వధార్థం నియమింపబడిన **నారాయణ దేవః** స్వయంగా ప్రకాశించువారలలో శ్రేష్ఠుడైన నారాయణుడు, **జానన్నపి** సర్వలోక కర్మసాక్షి అన్నీ తెలిసినవాడైనా దేవతలనుగూర్చి చాలా మృదువైన మాటలతో అడుగుతున్నాడు.

ఉపాయః కో వధే తస్య రావణస్య దురాత్మనః।

దురాత్ముడైన రావణవధ విషయమై ఉపాయం ఏదైనా ఉందా?
మహర్షికంటకుడైన వానిని నేను ఏవిధంగా చంపను?
ఈ విధంగా అడుగబడిన వారైన దేవతలు అవినాశి అయిన విష్ణువునుగూర్చి– మానుష సంబంధంమైన శరీరాన్ని గ్రహించి యుద్ధంలో రావణుని సంహరించు అన్నారు.

ఓ అరిందమా! రావణుడు చాలాకాలం తపస్సు చేసేడు. ఆ తపస్సుకు లోకపూర్వజుడు లోకకర్త అయిన బ్రహ్మ సంతోషించేడు.

సంతష్టః ప్రదదౌ తస్మై రాక్షసాయ వరం ప్రభుః।
నానావిధేభ్యో భూతేభ్యో భయం నాన్యత్ర మానుషాత్॥
అవజ్ఞాతాః పురా తేన వరదానేన హి మానవాః॥

సంతోషించిన బ్రహ్మ మనుష్యేతరములైన భూతములనుండి భయంలేదని వరం ఇచ్చేరు. పూర్వం వరదాన సమయంలో వానిచేత మానవులు ప్రయత్న పూర్వకంగా విస్మరింపబడ్డారు.

ఏవం పితామహాత్తస్మాద్వరం ప్రాప్య సదర్పితః।
ఉత్పాదయతి లోకాం స్త్రీన్ స్త్రియశ్చాప్యపకర్షతి।
తస్మాత్తస్య వధో దృష్టో మానుషేభ్యః పరంతప॥ ౨

ఈ విధంగా బ్రహ్మనుండి వరం పొంది, ఆ రావణుడు గర్వితుడై లోకాలను

పీడిస్తున్నాడు. స్త్రీలను బలాత్కరిస్తున్నాడు.
ఆ కారణంగా పరంతపుడా! వాడి వధ మనుష్యులనుండే చూడబడినది.

ఇత్యేతద్వచనం శ్రుత్వా సురాణాం విష్ణురాత్మవాన్।
పితరం రోచయామాస తదా దశరథం నృపమ్॥౮

అని పలికిన దేవతలయొక్క మాటలు విని, లోకత్రయమును వ్యాపించగల తను దశరథమహారాజుని తండ్రిగా నిర్ణయించుకొన్నాడు. **పితరం రోచయామాస తదా దశరథం నృపమ్** ఈ మాట పూర్వమూ చెప్పేరు. పునరుక్తి ఎందుకంటే ఆలోచన నిర్ణయం అయింది. ఇది చెప్పడానికి

స చాప్య పుత్రో నృపతి స్తస్మిన్ కాలే మహాద్యుతిః।
అయజత్పుత్రియామిష్టిం పుత్రేప్సురరిసూదనః॥౯

ఆ సమయంలోనే గొప్పతేజోవంతుడూ అరిసూదనుడు అంటే బాహ్యాభ్యన్తర శత్రునాశకుడు అగు ఆ దశరథుడు పుత్రుడు లేనివాడు పుత్రుని పొందదలచి పుత్రీయేష్టిని అనగా సంతతిని కలిగించు ఒక యాగవిశేషాన్ని చేస్తూన్నాడు. ఈ విధంగా విష్ణువు నిశ్చయించుకొని బ్రహ్మదేవుని వీడ్కొని దేవతలచేత మహర్షులచేత పూజలు అందుకొంటు అంతర్ధానం చెందేరు.

తతో వై యజమానస్య పావకాదతులప్రభమ్
ప్రాదుర్భూతం మహద్భూతం మహావీర్యం మహాబలమ్॥
కృష్ణరక్తాంబర ధరం రక్తాస్యం దున్దుభిస్వనమ్।
స్నిగ్ధహర్యక్ష తనుజ శ్మశ్రు ప్రవరమూర్ధజమ్॥ ౧౨
శుభలక్షణ సంపన్నం దివ్యాభరణ భూషితమ్।
శైలశృఙ్గ సముత్సేధం దృప్తశార్దూల విక్రమమ్॥౧౩
దావాకర సమాకారం దీప్తానల శిఖోపమమ్।
తప్తజాంబూనదమయీం రాజతాంత పరిచ్ఛదామ్॥
దివ్యపాయస సంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్।
ప్రగృహ్యావిపులాం దోర్భ్యాం స్వయం మాయామయీమివ॥

తరువాత దశరథునియొక్క అగ్నినుండి సాటిలేని కాంతికలది. గొప్ప వీర్యంకల వాడు. గొప్ప బలంకలవాడు. **కృష్ణరక్తాంబర ధరమ్** చిత్తమును ఆకర్షించుచున్న

ఎఱ్ఱనివస్త్రం ధరించిన, ఎఱ్ఱని ముఖంకల, దుందుభిధ్వనివంటి ధ్వనికల, సింహపుజూలా ఉన్న మెత్తని కేశములు మీసంకల, శుభలక్షణములతో కూడిన, దివ్యాభరణములు ధరించి పర్వతశిఖరంవలె ఎత్తైనవాడు, పెద్దపులివంటి నడక దివాకరునితో సమానమైన ఆకారం. జ్వలిస్తూన్న అగ్నితో సమానమైన గొప్పభూతము మేలిమిబంగారంతో చేయబడి, వెండిమూతగల దివ్యపాయస పూర్ణమైన మాయానిర్మితమా అన్నట్లున్న పెద్దపాత్రను ఇష్టురాలైన పత్నినివలె స్వయముగా రెండుచేతులతో పట్టుకొని ఆవిర్భవించింది.

ఇక్కడ ఇతఃపూర్వం ఎప్పుడూ చూడనటువంటి అద్భుతం ఆవిష్కరింపబడింది. దానిని చూచిన దశరథుని స్థితిని జీవలక్షణాన్ని చూపెడుతున్నారు.

మనస్సు ఎప్పుడూ ప్రకృతిని చూచి, కాల్పనికతను జోడిస్తుంది. ఇది మనో ధర్మం. లోకానుభవం అలాగే ఉంటుంది. చూడండి..!

లోకంలో దారిన పోతూన్న ఒకడు ఆరుఅడుగులకు పైబడి ఎత్తుగా విశాలమైన ఛాతీతో బలిసిన శరీరంతో ఉన్నాడు. వాడు లోకంలోఉన్న స్త్రీపురుషులు అందరికి అలాగే కనబడతాడు. ఇది ప్రకృతి (సహజస్థితి).

ఇంతలో ఒక కన్యామణి వాణ్ణి చూసింది.

అబ్బ! సముద్రం ఒడ్డున దీపస్తంభంలా ఎలా ఉన్నాడో!

పెళ్ళంటూ చేసుకుంటె వీణ్ణే చేసుకోవాలి. అనుకుంది.

ఎందుకు–వాడితో ఉంటే జీవితం ఆనందంగా ఉంటుంది.

వాడు ప్రక్కన ఉంటే జీవితం భయరహితంగా ఉంటుంది.

ఇది మనస్సుచేసిన కల్పన.

వీడినే మరొక వ్యక్తి చూసేడు. అమ్మో ఇంతున్నాడేంటి? ఒక్క గుద్దు గుద్దితే అంతే, ఎవ్వడైనా నెత్తురు కక్కాల్సిందే! వీడు గట్టిగా అరిస్తేచాలు అవతలివాడు పోతాడు. అలా ఉన్నాడు. అనుకుంటున్నాడు. ఇది లోకంలో అతిసహజం.

అక్కడ కన్యకకు వాడితో ఏ పూర్వానుభవం లేదు. ఏ సుఖాన్ని అనుభవించనూలేదు. ఏ సందర్భంలోనూ రక్షింపబడనూలేదు.

ఇక్కడ ఈ వ్యక్తికూడా వాడి రూపాన్ని చూసి ఊహచేసి భయాన్ని పొందుతున్నాడు.

ఎవరి దారిన వారు వెళ్ళి పోయారు. ఇక్కడ నిజానిజాల చర్చ అనవసరం. ఇది మనోధర్మం. ఇలాగే ఉంటుంది.

ప్రస్తుతంలో ఆవిర్భవించిన మహాభూతం అగ్నినుండి వచ్చింది. సాటిలేని ప్రకాశతో ఉంది. చక్కటి ఎఱ్ఱని వస్త్రాలు ధరించింది. సింహపుజూలువంటి జుట్టు ఉంది. చూడ్డానికి ఇంపుగా ఉన్నాడు. పర్వతశిఖరంలా ఉన్నతంగా ఉన్నాడు. బంగారంతో చేసిన పెద్దపాత్రపై వెండి పళ్ళెం మూతగా వేసి రెండుచేతులతో పట్టుకొని ఎదురుగా నిల్చున్నాడు. ఇంతవరకు ఇంతే జరిగింది.

అనూహ్యమైన అద్భుతమైన పరిణామానికి మనస్సు తన కల్పనను జోడిస్తోంది. ఉన్నదాన్ని ఉన్నట్టుగా గ్రహించడం మనస్సుకు ఇష్టం ఉండదు.

ఆరూపాన్ని చూసి, వీడు చాలా పరాక్రమవంతుడు. గొప్ప బలవంతుడు. దుందుభిధ్వని కలవాడు. వీడిది పెద్దపులినడక. ఇలా ఊహిస్తోంది. నిజానికి ఆ భూతం తన వీర్యాన్ని బలాన్ని స్వరాన్ని గమనాన్ని చూపనేలేదు. మనోధర్మం ఇంతే. ఇటువంటి సందర్భాలు ఎదర చాలావస్తాయి. ఆయా సందర్భాలలో మనస్సును ఎలా పరామర్శించాలో దానికి సత్యాసత్య వివేకం ఎలా తెలియ చెప్పాలో మహర్షి ఎదర చూపెడతారు.

మరొకమాట-

ఆదిత్యుడు సప్తసప్తి. ఏడు ముఖ్యకిరణాలు కలవాడు. అవి **సుషమ్నా సురాదనా ఉదన్వసు సంయద్వసు విశ్వకర్మా ఉదావసు విశ్వవ్యచా అస్వరాట్ హరికేశ** అనునవి.

ఈ హరికేశ అను రశ్మి నక్షత్రాల ఆవిర్భావానికి కారణం. ఇవి ప్రాణుల శరీరాలనుండి బలము వీర్యము తేజస్సు జారిపోకుండా రక్షిస్తుంది. ఈ రశ్మియే మహాభూతంగా అవిర్భవించింది. ఇతరులకు ఇవ్వతగినది మనం కలిగి ఉ ండాలి కావున వీర్యము బలము గొప్పతేజస్సు కలవానిగా చెప్పబడ్డాడు. ఈ రశ్మి చీకట్లను చీల్చుకుంటూ పోయి నక్షత్రాలను ఆవిష్కరింపచేస్తోంది. ఆస్థానం నలుపు ఎఱుపుల కలయికతో ఉన్న అంబరవీధి.

ఇక్కడ దివాకరాభిన్న ప్రకాశయే రూపుదాల్చి ప్రాజాపత్య పురుషునిగా వచ్చాడు. కనుకనే దివాకర సమాకారం అని చెప్పేరు.

ఇక్కడ మహర్షి **దివ్యపాయస సంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్** అన్నారు. ఇక్కడ ఇష్టురాలైన పత్నివలె అంటున్నారు.
పతి చాలాకాలంగా తన కర్మానుష్ఠాన వ్యగ్రతలో ఉండటంవలన ఉపాధిగతమైన తేజస్సు ఇంద్రియసామర్థ్యం పశుసంపద ధనం ఇవి తొలగిపోతాయి. పత్నులు ఆజ్యముచే అభ్యంజనం చేయుటచే తేజాది చతుష్టయాన్ని యజమానియందు స్థాపనచేస్తారు.
"పత్న్యయోఽభ్యంజంతి। శ్రియా వా ఏత ద్రూపం యత్పత్న్యః। శ్రియ మేవాఽస్మిన్ తద్దధతి। నాస్మాత్తేజ ఇంద్రియం పశవ శ్శ్రీరపక్రామంతి।"
కనుక పత్నిని లక్ష్మీ స్వరూపంగా వేదంచెప్పింది.
పత్యుర్నో యజ్ఞసంయోగే। పతి శబ్దస్య నకారోఽంతాఽఽదేశః జీప్చ। యజ్ఞేన సంబంధే। వసిష్ఠస్య పత్నీ తత్కర్తృ యజ్ఞ ఫలభోక్త్రీత్యర్థః। దంపత్యోస్సహాధికారాత్॥
పతిశబ్దానికి నకారం అంతాదేశం జీప్ ప్రత్యయంచేత పత్నీశబ్దం ఏర్పడుతుంది. **వసిష్ఠస్య పత్నీ తత్కర్తృ యజ్ఞ ఫలభోక్త్రీత్యర్థః।** భర్తచేసిన యజ్ఞఫలాన్ని అనుభవించునది అని పత్నీశబ్దానికి అర్థం.
ఇక్కడ పాయసపాత్రను పత్నీ అని చెప్పుటచే, ఈ పాయసపాత్రయందు యజమాని అయిన దశరథపత్నులు అధికారంకలవారని తద్వారా దశరథుడు రూపసంపదలను పొందువాడని చెప్పేరు.

ప్రాజాపత్యం నరం విద్ధి మామిహాభ్యాగతం నృప॥౧౦

ఆ మహాభూతం దశరథుని చూచి రాజా! ఇక్కడకి వచ్చిన నన్ను ప్రాజాపత్య పురుషునిగా తెలుసుకో. అని పలికింది.
అంటే నేను ప్రజాపతి సంబంధిని అని తెలుసుకో అంటున్నారు. ఇతడు ఎలా ఉన్నాడు అంటే ముందే చెప్పేరు **దివాకర సమాకారం** అని.
సూర్యుడే అన్నట్లున్నాడు.
వైకుంఠమునందు ఉన్నవారు విష్ణురూపులై ఉంటారు.
శివలోకంలో ఉన్నవారు శివరూపంతో ఉంటారు.
అని కర్మఠులు స్వరతంత్రులు తెగేలా అరుస్తున్నారు కదా!

కనుక ఇదిగో ఇతడు ఆదిత్యలోకంనుండి వచ్చాడు. కనుకనే సూర్యుడు వలె ఉన్నాడు.

అశ్రావయ, అస్తుశ్రౌషట్, యజ, యే యజామహే, వషట్ అనునవి యజ్ఞశరీర నిష్పాదకమైన మంత్ర పంచకం. ఇవి సప్తదశాక్షరములు కలిగి ఛందస్సారమై ప్రజాపతిరూపమైయున్నది. **ఏష వై సప్తదశః ప్రజాపతిః। ఏష వై ఛందస్య ప్రజాపతిః।** అని శ్రుతి చెప్పింది. ఈ మంత్రపంచకం యజ్ఞశరీర నిష్పాదకమై యజ్ఞనిర్వాహకం కావున అట్టి ప్రజాపతి సూర్యుడని చెప్పబడింది.

సోఽబ్రవీత్ప్రజాపతిః। ఛందాగ్ంసి రథో మే భవత్। యుష్మాభి రహమేత ముధ్వాన మనుసంచరాణీతి।... సూర్యరూప ప్రజాపతి ఆకాశమున ప్రయాణింపతలచి గాయత్ర్యాది ఛందస్సులను రథరూపమును ధరించండి నేను దానిపై ఆకాశమార్గాన సంచరిస్తాను అని పలికేరు అని శ్రుతి చెప్తోంది.

ఏష ఏవాగ్నిహోత్రం చ। ఫలంచైవాగ్నిహోత్రిణాం॥
వేదాశ్చ క్రతవశ్చైవ। క్రతూనాం ఫలమేవ చ॥
యానికృత్యాని లోకేషు। సర్వ ఏష రవిః ప్రభుః॥

అని అగస్త్యమహర్షి రామునకు ఆదిత్యహృదయంలో చెప్పేరు.

కావున ఇక్కడ ప్రజాపతి సూర్యుడే. ప్రజాపతిసంబంధి అయిన హరికేశుడు (రశ్మి) ప్రాజాపత్యపురుషుడు. ఆవిధంగానే నన్ను తెలుసుకో అని పలికేరు. తరువాత దశరథుడు అంజలిఘటించి భగవన్! మీకు స్వాగతం అగుగాక! నేను మీకు ఏమి చేయగలను అని పలికేరు.

తరువాత ప్రాజపత్య పురుషుడు ప్రత్యుత్తరమిచ్చుచూ...

రాజా! దేవతలను పూజించుచున్నందుకు ఫలితంగా ఈ రోజు ఇది నీచే పొందబడినది. రాజశ్రేష్ఠుడా! ఇది దేవనిర్మితమైన పాయసం. వంశకరమైనది. ధనమును ఆరోగ్యమును వృద్ధిచేస్తుంది. నీవు దీనిని గ్రహించు.

భార్యాణా మనురూపాణా మశ్నీతేతి ప్రయచ్ఛ వై।
తాసుత్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప॥

రాజా! దీనిని తగిన భార్యలకు ఇచ్చి భుజింపమని చెప్పు. దేనికొరకు యాగము చేస్తున్నావో ఆ పుత్రులను నీవు వారియందు పొందగలవు. అని పలికేరు.

తథేతి నృపతిః ప్రీతః శిరసా ప్రతిగృహ్యతామ్।
పాత్రీం దేవాన్నసంపూర్ణాం దేవదత్తాం హిరణ్మయీమ్॥

శిరస్సువంచి వినీతుడై అలాగే చేసెదనని దేవతలచే పంపబడ్డ అన్నపూర్ణమైన బంగారుపాత్రను స్వీకరించి సంతోషించేరు. ఆ అద్భుతమైన భూతమునకు ప్రదక్షిణ నమస్కారములు చేసేరు.

దరిద్రుడు ధనాన్ని పొందినట్లుగా దేవనిర్మితమైన పాయసాన్నిపొంది, పరమప్రీతిని పొందేరు. మహాతేజోవంతమైన అద్భుతమైన ఆ భూతం పాయసపాత్రను ఇచ్చి అంతర్ధానం చెందింది.

శారదస్యాభిరామస్య చన్ద్రస్యేవ నభోఽంశుభిః॥ ౨౫

హర్షరశ్మలచేత బాగుగా ప్రకాశిస్తున్న దశరథునియొక్క అంతఃపురం శరత్కాల చంద్రకిరణాలచేత ప్రకాశిస్తున్న ఆకాశంలా ఉంది. అంటే దశరాథాదులు సంతానప్రతిబంధకమైన పాపపంకము పోయినవారై ఆనందిస్తున్నారు.

దశరథుడు అంతఃపురంలో ప్రవేశించేరు. కౌసల్యను చేరి నీకు పుత్రులను కలిగించు ఈ పాయసమును స్వీకరించు అని పలికేరు.

కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః॥ ౨౬
కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థకారణాత్।
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్। ౨౮
అనుచిన్త్య సుమిత్రాయై పునరేవ మహీపతిః।
ఏవం తాసాం దదౌ రాజా భార్యాణాం పాయసం పృథక్॥

కౌసల్యకు దశరథుడు పాయసంలో సగభాగం ఇచ్చేరు. మిగిలిన సగంలో సగం అంటే నాల్గవభాగం సుమిత్రకు ఇచ్చేరు. ఇక మిగిలిన నాల్గవభాగంలో సగం అంటే ఎనిమిదవ భాగం కైకకు ఇచ్చేరు. మిగిలిన ఎనిదవ భాగాన్ని ఆలోచించి సుమిత్రకు ఇచ్చారు. ఇక్కడ దశరథుని విషయంలో మహర్షి **అనుచిన్త్య** అని ప్రయోగించారు. ఇది పూర్వవ్యాఖ్యాతల తార్కికతకు ఇంధనం అయింది. యజ్ఞ ప్రసాదమైన ఈ పాయసం మాత్రమే తన ఆర్జిత సంపద. మిగిలినది అంతా దక్షిణగా సమర్పించేసేరు.

ఇక్కడ కౌసల్య **పట్టమహిషి** పత్ని. కావున ఈమె ధర్మము.
పతియొక్క అర్ధభాగం. ఈమెకు అర్ధభాగం ఇచ్చేరు. అంటే స్వార్జితమైన దానిలో సగభాగం ధర్మకార్యాలకు ఖర్చు చేస్తున్నారు.
సుమిత్ర **వావాత** ఈమె మధ్యమజాతీయురాలు (వైశ్యజాతి). ఖచ్చితంగా అవ్వాలన్న నియమంలేదు. భార్యా స్థానీయురాలు. భోగినీ స్త్రీ. అంటే తన కుటుంబ పోషణకు విలాసాలకు స్వార్జితమైన దానిలో నాల్గవభాగం ఖర్చు చేస్తున్నారు.
పరివృత్తి ఈమె ఉపేక్షిత. ఇది ఉపేక్షిత ద్రవ్యం. అంటే అవసరార్థం దాచిన ధనం. మిగిలిన నాల్గవభాగంలో సగం అంటే ఎనిమిదవ భాగం. దీనినీ సుమిత్రకే ఇచ్చారు.
కైక **పాలాకలీ** స్థానంలో మిగిలిన ఎనిమిదవభాగాన్ని అందుకొంది. అంటే సేవకులకొరకు స్వార్జితంలో ఎనిమిదవ భాగం వెచ్చిస్తున్నాడు.
ఇది ధర్మ సమ్మతంకూడాను.
విష్ణో పుత్రస్య మాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్ అని
తతః పద్మపలాశాక్షః కృత్వాత్మానం చతుర్విధమ్ అని పదిహేనవ సర్గలో చెప్పినదానికి అనవచ్ఛిన్నము. అనంతము అయిన స్వరూపము నాలుగు ముక్కలైంది అని చెప్పుట పరమాత్మ అనంతత్వానికి అనవచ్ఛిన్నత్వానికి ఘాత. అయినా ఈ భావననే సమర్థిస్తే షోడశకళాపూర్ణుడైన రామచంద్రుడు అష్టమీచంద్రుడు. భరతుడు శుక్లపక్ష విదియనాటి చంద్రుడూ కావాలి.
పూర్ణుడైన విష్ణువు తనను నాలుగుగా విభాగించుకొన్నాడు అంటే అప్పటికే అభివ్యక్తమైన పరశురామునిది ఎన్నోవంతు అన్న ప్రశ్నపుడుతుంది. పరశు రామునకు పూర్వమే విష్ణువు అత్రిపుత్రుడైన దత్తునిగా ప్రసిద్ధిని పొంది ఉన్నాడు. పరశురామునిది అర్థాంశ అనుకుంటే మిగిలిన అర్ధభాగంలో అర్ధభాగం అంటే రాముడు నాల్గవవంతు అని నిర్ణయించాలి.
మన బుద్ధియొక్క పరిచ్ఛిన్నతను అపరిచ్ఛిన్నుడు అనంతుడు అప్రమేయుడైన పరమాత్మయందు ఆరోపించకూడదు. పరమాత్మ అనంతనామరూపాలతో ఏకకాలంలో అనేకానేక ప్రదేశాలలో లేదా ఒకేస్థలంలో ప్రకటమైనప్పటికీ

తన అనంతత్వానికి అపరిచ్ఛినతకు భంగంవాటిల్లదు. పాయస విభాగాన్నిబట్టి పరమాత్మను విభాగింపపూనుట మన బుద్ధియొక్క అల్పజ్ఞతను వమనం చేసుకోనుటయే.

తాస్త్వే తత్పాయసం ప్రాప్య నరేంద్రస్యోత్తమాః స్త్రియః
సంమానం మేనిరే సర్వాః ప్రహర్షోదిత చేతసః॥ ౩౦

దశరథునియొక్క ప్రధానమైన భార్యలు ఈ పాయసమును పొంది పట్టరాని సంతోషముగల మనుస్సుతో దానిని తమకు దక్కిన గొప్పబహుమానంగా భావించేరు.

తతస్తుతాః ప్రాశ్య తదుత్తమస్త్రియో
మహీపతేరుత్తమ పాయసం పృథక్
హుతాశనాదిత్య సమాన తేజస
శ్చిరేణ గర్భాన్ ప్రతిపేదిరే తదా॥ ౩౧

అటుతరువాత మహారాజుయొక్క ప్రధానమైన భార్యలు ఉత్తమమైన పాయసమును వేరుగా భుజించి సూర్యాగ్నులతో సమానమైన తేజస్సుకలవారై **చిరేణ తదా గర్భాన్ ప్రతిపేదిరే** చాలాకాలానికి అప్పుడు గర్భములను పొందిరి. ఎప్పుడో గర్భం ధరించాలి. ధారణాయోగ్యమైన సమయంలో అది జరగలేదు. గర్భధారణకు ప్రతిబంధాకాలు చాలా ఉన్నాయి.
అప్పుడు దైవీకం అయితే, ఇప్పుడు శారీరకం. ఇలా...
ఈ పాయసప్రాసనతో సర్వప్రతిబంధకాలు తొలగిపోయి గర్భధారణకు యోగ్యులైనవారై గర్భాలను ధరించేరు.

తతస్తు రాజా ప్రసమీక్ష్య తాః స్త్రియః
ప్రరూఢ గర్భాః ప్రతి లబ్ధమానసః
బభూవ హృష్ట స్త్రిదివే యథా హరిః।
సురేన్ద్రసిద్ధర్షిగణాభి పూజితః॥

తరువాత దశరథుడు గర్భములు దాల్చిన ఆ భార్యలను చూచి స్వస్థతను పొందిన మనస్సుకలవాడై బ్రహ్మేంద్రాదులచేతను సిద్ధులచేతను, మహర్షి

గణములచేతను పూజింపబడిన ఆదిత్యునివలె సంతోషించినవాడు అయ్యేడు.

తప్తచామీకరాభాయ హరయే విశ్వకర్మణే
నమస్తమోభి నిఘ్నాయ రుచయే లోకసాక్షిణే॥

అని యుద్ధకాండలో **హరయేనమః** అని హరిశబ్దవాచ్యుడు ఆదిత్యుడని మహర్షి చెప్పేరు.

రశ్మిమంతం సముద్యన్తం దేవాసుర నమస్కృతం
పూజయస్వ వివస్వంతం భాస్కరం భువనేశ్వరమ్॥ అని ఎదర చెప్తున్నారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షోడశస్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తదశః సర్గః॥

(దేవతలు అనేక వానరవీరులను తమ అంశజులుగా సృజించుట)

పుత్రత్వం తు గతే విష్ణౌ రాజ్ఞస్తస్య మహాత్మనః।
ఉవాచ దేవతా స్సర్వాః స్వయమ్భూర్భగవానిదమ్॥ ౧

మహాత్ముడైన దశరథునియొక్క పుత్రత్వమును విష్ణువు పొందినవాడు అగుచుండగా, భగవానుడైన బ్రహ్మ దేవతలందరితోనూ...

సత్యసంధుడు వీరుడు సర్వభూతహితైషి మనహితంకొరకైనవాడు అటువంటి విష్ణువుకు **సహాయాన్ బలినః సృజధ్వం** సహాయార్థం బలవంతులైన కామరూపులను సృజించండి. అన్నారు.

వారు ఎలాటి వారై ఉండాలి? అది చెప్తున్నారు.

మాయలు తెలిసిన వారై ఉండాలి. శూరులై ఉండాలి.

వాయువేగంతో సమానమైన వేగం కలవారై ఉండాలి.

నీతికోవిదులై ఉండాలి. బుద్ధిమంతులై ఉండాలి.

సంహరింపశక్యంగాని వారై ఉండాలి.

ఉపాయాలు తెలిసినవారై ఉండాలి. వీరు దివ్యులై ఉండాలి

సర్వ అస్త్రముల శక్తివంటి శక్తికలవారై ఉండాలి.

అమృతం త్రాగినవారివలె వీరూ ఉండాలి. అంటే ఆకలిదప్పులు ముసలితనం ఇటువంటి ఇబ్బందులు లేనివారై ఉండాలి. మీతో సమానమైన పరాక్రమం కలవారై యుండాలి.

పరాక్రమవంతులైన బుద్ధిమంతులైనవారిని మీ అంశజులుగా ముఖ్యులైన అప్సరస్త్రీలయందు, గంధర్వకాంతలయందు సృజించండి.

దేవతలకు ఔరసులు ఉండరు. కావున అంశజులనే సృజించడం.

జాంబవంతుడను ఋక్షపుంగవుడు పూర్వమే నాచేత సృష్టించబడ్డాడు. ఆవులించుచున్న నా ముఖంనుండి హఠాత్తుగా పుట్టేడు. అని బ్రహ్మ చెప్పేరు.

తత్ ప్రతి శ్రుత్య శాసనం దానిని (బ్రహ్మ చెప్పిన విషయాన్ని) శాసనం అనుకొన్నారు. వానరరూపులైన సంతతిని పుట్టించేరు.

మహాత్ములైన ఋషులు సిద్ధులు విద్యాధరులు ఉరగులు (సర్పజాతి), చారణులు వీరందరు వీరులైన వనచరులైన కుమారులను సృజించేరు.
ఇంద్రుడు మహేంద్రపర్వతసముడు దృఢమైన శరీరంకలవాడైన వాలిని, సూర్యుడు సుగ్రీవుని పుట్టించేరు.
కుబేరునివల్ల గంధమాదనుడు; విశ్వకర్మవల్ల నలుడు కలిగేరు. శ్రీమంతుడు అగ్నిసమతేజసుడైన నీలుడు అగ్నివల్ల కలిగేడు.
అశ్వనీదేవతలవల్ల మైందుడు ద్వివిదుడు పుట్టేరు.
వరుణునివల్ల సుషేణుడు; పర్జన్యునివల్ల శరభుడు కలిగేరు.
శ్రీమంతుడు పరాక్రమశాలి వజ్రదేహుడు గరుత్మంతునితో సమానమైన వేగంకలవాడు హనుమంతుడను పేరుగల వానరుడు వాయువువలన కలిగేడు.
ఈవిధంగా రావణవధయందు ఆనందంకలవారు అప్రమేయ బలసంపన్నులు పరాక్రమవంతులు కామరూపులైన వానరులు వేలకొలదిగా సృజింపబడ్డారు.

మేరుమన్దర సంకాశా వపుష్మన్తో మహాబలాః।
ఋక్షవానర గోపుచ్ఛాః క్షిప్రమేవాభి జజ్ఞిరే॥ ౧౭

మేరుపర్వతంతోను మందరపర్వతంతోను సమానమైనవారు. మంచి దేహంకలవారు. మహాబలవంతులగు ఋక్ష వానర గోపుచ్ఛాః- ఎలుగుబంట్లు వానరులు కొండముచ్చులు అతి శీఘ్రంగా పుట్టేరు.
ఇది దేవతావ్యూహం. వీరంతా విష్ణువునకు సహాయార్థమైనవారు.
విష్ణువు నిశ్చయాత్మకుడై కౌసల్యాగర్భాన్ని ప్రవేశించేరు.
ఇప్పుడు వీరుకూడా మానవజన్మనే కోరుకొంటే పదిమాసాల గర్భవాసంతో రాముని తరువాతో, రామునితో పాటుగానో జన్మిస్తారు. రామ జననానికి ముందే రామునికొరకు పుట్టి పెరిగి బలిష్ఠమైన శరీరాలతో వేలాది సైన్యంగా సిద్ధంగా ఉండాలి. లేదా రాముడు పుట్టు సమయానికి పుట్టినా అతిత్వరగా పెరిగి సిద్ధంగా ఉండాలి.
కనుకనే దేవతలు వానర భల్లూకాల జన్మలను ఎంచుకొని వారియందు తమతమ అంశజులను ప్రవర్తింపచేసేరు.
క్షిప్రమేవాభి జజ్ఞిరే అన్నారు కాదా! అందుకోసం ఈ తొందర.

ఈవిధంగా అనేకంగా కల్పింపబడ్డ వానరులు జన్మకారకులైన వారి స్వరూప స్వభావాలను పరాక్రమాన్ని కలిగియున్నారు.

గోలాఙ్గూలీషు చోత్పన్నాః కేచిత్సంమత విక్రమాః।
ఋక్షీషు చ తథా జాతా వానరాః కిన్నరీషు చ॥ ౧౮

పొగడతగిన పరాక్రమంకలిగిన కొందరు వానరులు ఆడకొండముచ్చుల యందు, ఆడఎలుగుబంటులయందు కిన్నెరస్త్రీలయందు పుట్టేరు.

దేవతలు మహర్షులు గంధర్వులు గరుడులు యక్షులు నాగులు కింపురుషులు సిద్ధులు విద్యాధరులు ఇలా అనేకులు రావణవధార్థమై సంతోషంతో ఆసమయంలో ముఖ్యమైన అప్సరసలయందు విద్యాధరస్త్రీల యందు నాగకన్యలయందు గంధర్వస్త్రీలయందు వనములందు సంచరించు స్వభావంగల చాలాపెద్ద దేహముగల వానరులను (నర ఇవ వానరః – మనుష్యులవలె ఉన్నవారిని) వేలకొద్ది పుట్టించేరు.

వీళ్ళెలా ఉన్నారంటే...

స్వేచ్ఛగా కోరినరూపం ధరించగలవారు. స్వేచ్ఛగా తిరుగువారు. బలగర్వంచే సింహాలతోనూ పులులతోనూ సమానంగా ఉన్నారు.

వీళ్ళందరు శిలలు ఆయుధాలుగాకలవారు. పాదపయోధులు అంటే చెట్లనే ఆయుధాలుగా చేసుకొని యుద్ధంచేస్తారు. అస్త్రములను తెలిసినవారు. వీళ్ళు మహాపర్వతాలను కదిల్చేయగలరు. మహావృక్షాలను పెకలించగలరు. పాదాలచేత భూమిని చీల్చగలవారు. మహాసముద్రాలను దాటగలవారు. మేఘములందు తిరుగగలవారు. అడవిఏనుగులను పట్టుకోగలరు.

కామరూపులైన సేనానాయకులైన ఇటువంటివారు

ప్రసూతాని హరీణాం శతం శతసహస్రాణి కోటిమంది పుట్టేరు. వీరంతా ప్రధానమైన సేనలయందు నాయకులై వీరులైన వానరులను మరల పుట్టిచేరు. వీరిలో కొందరు ఋక్షపర్వతసానువులను ఆశ్రయించేరు.

మరికొందరు నానావిధాలైన పర్వతాల్ని వనాల్ని ఆశ్రయించేరు. వీరంతా సోదరులైన వాలి సుగ్రీవులను నలుని నీలుని హనుమంతుని మరికొంతమంది వానరసేనానాయకుల్ని సేవిస్తున్నారు.

గరుత్మంతునివంటి బలముకలిగి యుద్ధమునందు సమర్థులైన వీరు బలగర్వముచే సంచరించుచు సింహ వ్యాఘ్రూలకు భయాన్ని కలిగిస్తున్నారు. గొప్ప పరాక్రమవంతుడైన వాలి ఈ సమస్త ఋక్ష వానర సమూహాన్ని రక్షిస్తున్నాడు.

ఈ శూరులు అనేక ప్రాంతాలకు చెందినవారు. (సంస్థాన శబ్దానికి శరీరాకృతి అర్థంకూడా ఉంది) పొట్టి పొడుగు తేడాలతో అనేక విధాలుగా ఉన్నారు. అనేక జాతులకు సంబంధించినవారు. వీరందరు నరులకు దగ్గరవారు కావున మహర్షి సార్వజనీనంగా వానర ప్రయోగంచేసేరు. వీరు పర్వతాలు అడవులు సముద్రాలతో నిండిన ఈ భూమండలమంతా వ్యాపించేరు.

తైర్మేఘబృన్దాచల కూటకల్పై।
ర్మహాబలైర్వానర యూథపాలైః।
బభూవ భూర్భీమ శరీరరూపై
స్సమావృతా రామ సహాయ హేతోః॥ ౩౫

మేఘసమూహాలతో పర్వతశిఖరాలతో సమానులైన మహాబలవంతులైన భయంకర శరీరాకృతిగల వానరసేనానాయకులచేత ఆనందింపజేయువానికి (రామ) సహాయార్థం ఈ భూమి అవరింపబడింది.

'రామసహాయ హేతోః' అన్నారు మహర్షి. ఇంకా దశరథునకు పుత్రోదయం కాలేదు. నామకరణమూ జరగలేదు. ఇతఃపూర్వం విష్ణుశబ్దవాచ్యుడైన నారాయణుడు నేను ఈ (రామ) సంజ్ఞచే పిలవబడతాననీ చెప్పలేదు. ఇక్కడ రామ శబ్దం "రమయతి ఇతి రామః" ఆనందింపచేయువాడు అనే అర్థంలోనిదే! రావణవధరూపంగా సర్వులను సంతోషింపచేయువాడు. ఈ పని చేస్తానని వాగ్దానం చేసేరు. ఈవిధంగా ఆనందింపచేయువానికి సహాయార్థం పృథివి అంతా పరుచుకొన్నారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణార్థవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తదశ స్సర్గ సమాప్తము.

॥అథ అష్టాదశః సర్గః॥

(అశ్వమేధం పుత్రీయేష్టులను పూర్తిచేసి దశరథుడు తన్నిమిత్తమైవచ్చిన రాజులను, ఋష్యశృఙ్గుని వారి దేశములకు సగౌరవంగా పంపించేడు. శ్రీరామాదుల పుట్టుక. వారికి జాతకర్మాది సంస్కారములు, విశ్వామిత్ర ఆగమనం)

నిర్వృత్తే తు క్రతౌ తస్మిన్ హయమేధే మహాత్మనః।
ప్రతిగృహ్య సురాభాగాన్ ప్రతిజగ్ముర్యథా గతమ్॥ ౧

మహాత్ముడైన దశరథునియొక్క అశ్వమేధక్రతువు పూర్తి అయింది. దేవతలు హవిర్భాగాలను స్వీకరించి ఎలా వచ్చేరో అలాగే వెళ్ళారు.

సమాప్త దీక్షా నియమః పత్నీగణ సమన్వితః। పత్నీగణసమేతుడైన రాజు యజ్ఞదీక్షను విరమించినవాడై సేవకులతో ససైన్యముగా వాహనాలతోకూడి అయోధ్యాపట్టణాన్ని ప్రవేశించేరు.

యాగమునకు ఆహ్వానింపబడిన రాజులందరు అర్హతననుసరించి పూజింప బడినవారై మునిపుంగవుడైన వసిష్ఠునకు నమస్కరించి వారి దేశాలకు వెళ్ళేరు.

బలాని రాజ్ఞాం శుభ్రాణి ప్రహృష్టాని చ కాశిరే। ౪

ఆ అయోధ్యనుండి తమ పురములకు వెళ్తూన్న శ్రీమంతులైన రాజులయొక్క సైన్యం శుభ్రములై సంతోషంకలవై ప్రకాశించేయి.

శుభ్రాణి అంటే సైనికులు తెల్లనివస్త్రాలు ధరించారు అనునది సామాన్యం. **'తథాశ్వమేధావభృథస్నానాద్వా శుద్ధి మాప్నుయాత్'** అశ్వమేధంచేసిన యజమాని యాగాంతంలో అవభృథస్నానం చేస్తూండగా ఇతరులుకూడా తాముచేసిన పాపం చెప్పుకుంటూ అవభృథస్నానంచేసినా శుద్ధిని పొందుతారని స్మృతికర్తలు చెప్తున్నారు. కనుక ఆవిధంగా శుద్ధమైయ్యేరు. అంటే ఈ సైనికులు అఘనాశకమైన యజ్ఞ సందర్శనంవల్ల శుద్ధమనస్కులు అయ్యేరు.

చిత్తశుద్ధివలన గొప్పదైన ఆనందాన్నిపొంది ప్రకాశిస్తున్నారు.

ఆ రాజులు ఎవరి సైన్యాలతో వారు తిరిగి వెళ్ళిన తరువాత శ్రీమంతుడైన దశరథుడు బ్రాహ్మణశ్రేష్ఠులను ముందుంచుకొని అయోధ్యను ప్రవేశించేరు. తరువాత శాంతా ఋష్యశృంగులుకూడా బాగుగా పూజింపబడినవారై అనుచరగణంతోకూడిన రోమపాదుని అనుసరించి స్వస్థానమునకు వెళ్ళేరు.

ఏవం విసృజ్య తాన్సర్వాన్రాజా సంపూర్ణ మానసః
ఉవాస సుఖిత స్తత్ర పుత్రోత్పత్తిం విచిన్తయన్॥ ౭

దశరథుడు ఈవిధంగా వచ్చిన వారినందర్ని పంపివేసి **సంపూర్ణమానసః** మనఃపూర్తిగా పుత్రోత్పత్తినిగూర్చి ఊహించుకొంటూ సుఖంగా అంతఃపురంలో వాసం చేసేరు. అంటే కేవలం సంతానార్థం అదే ధ్యాసతో ఆనందంగా భార్యలనుకూడి అంతఃపురంలోనే నివసించేడు అని.

యజ్ఞంద్వారా సంతాన ప్రతిబంధకాలన్నీ తొలగిపోయాయి. సంతానార్థం యజ్ఞఫల స్వరూపంగా లభించిన పాయసాన్ని కౌసల్యాదులు స్వీకరించారు. భర్తనుకూడి అనతికాలంలోనే గర్భాన్ని ధరించేరు.

తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్సమత్యయుః।
తతశ్చ ద్వాదశేమాసే చైత్రే నావమికే తిథౌ॥ ౮
నక్షత్రేదితి దైవత్యే స్వోచ్చసంస్థేషు పఞ్చసు।
గ్రహేణ కర్కటే లగ్నే వాక్పతావిన్దునా సహ॥ ౯
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతమ్।
కౌసల్యా జనయద్రామం సర్వలక్షణసంయుతం॥ ౧౦
విష్ణోరర్థం మహాభాగం పుత్రమైక్ష్వాక వర్ధనమ్।

యజ్ఞంపూర్తై ఆరుఋతువులు గడిచేయి. (అశ్వమేధము మూడురోజులు చేయతగినదిగా చెప్పబడింది. (మొదట చతుష్టోమం చెయ్యాలి. రెండవది ఉక్థ్యం చెయ్యాలి. మూడవది అతిరాత్రం.)

ఇవికాక జ్యోతిష్టోమం ఆయుర్యాగం మరియు అతిరాత్రములు రెండు, అభిజిద్యాగం విశ్వజిద్యాగమూ ఆప్తోర్యామం అను మహాక్రతువు చేసేరు.)

ఈ అశ్వమేధము ప్రారంభించిన తరువాత పంద్రెవమాసమున చైత్రశుక్ల నవమినాడు ఐదుగ్రహాలు ఉచ్చయందుండగా జగన్నాథుడు సర్వలక్షణ సంయుతుడు, విష్ణువుయొక్క అంశజుడు, గొప్పభాగ్యంకలవాడు, వంశవృద్ధికరుడు, సర్వులకు ఆనందదాయకుడగు పుత్రుని కౌసల్య కన్నది. గర్భధారణ మొదలు శిశుజననపర్యంతం సుమారు 280రోజుల సమయం పడుతుంది. అంటే తొమ్మిదిమాసాల పైన పదిరోజులు గర్భంలో అంతకాలమే

ఉన్నాడు. అంతేకాని ఈయన సామాన్యుడుకాడు భగవంతుడు కావున పంద్రెండుమాసాలు గర్భవాసం చేసేడు అని చెప్పకూడదు. శ్రీరాముడు ఆమానుషంగా ప్రవర్తించలేదు. అటువంటి వ్యాఖ్యలు ఆయనకు అమానుషత్వాన్ని ఆపాదిస్తూ చేసిన సత్యదూరమైన వ్రాతలుగా చూడాల్సిందే! **దశమే మాసి కౌసల్యా సుషువే పుత్రమద్భుతమ్।** అని ఆధ్యాత్మ రామాయణం చెప్పింది.

చైత్రమాసం శుద్ధ నవమినాడు ఐదుగ్రహాలు ఉచ్చస్థానములందు ఉండగా కర్కటలగ్నమందు చంద్రుడు బృహస్పతితో కలిసి ఉండగా కౌసల్య పుత్రుని కన్నది.

కర్కటరాశి చంద్రునికి స్వక్షేత్రం. బృహస్పతికి ఉచ్ఛ. దీనిని గజకేసరియోగం అంటారు. ఇది ఒక యోగముగా మహర్షి సూచించేరు. దీనికి ఫలితం కీర్తిప్రతిష్ఠలు, శత్రుజయం దీర్ఘాయువు సంపదలు. అది చైత్రమాసం. చైత్రమాసంలోనే రవి మేషరాశి ప్రవేశం. కావున రవి ఉచ్ఛయందు ఉన్నాడని గ్రహించవచ్చు.

మిగిలిన బుధ కుజ శుక్ర శని గ్రహాలగూర్చిన ప్రసక్తి మహర్షి చెయ్యలేదు. వేదవాస్య నిర్మితమని భావింపబడుతున్న అధ్యాత్మ రామాయణంలో **మేషం పూషణి సంప్రాప్తే పుష్పవృష్టి సమాకులే** అని సూర్యుడు మేషంలో ఉన్నాడని చెప్పేరు. అక్కడకూడా అయిదుగ్రహాలు ఉచ్ఛయందున్నాయని చెప్పి మిగిలిన గ్రహాల ప్రసక్తి చెయ్యలేదు.

బుధుడు ఎప్పుడు రవికి సన్నిహితంగా ఉంటాడు. కావున బుధాదిత్యులు మేషంలో ఉన్నారు, మేషం బుధునకు ఉచ్ఛకాదు. కావున పరిశేషన్యాయంచేత కుజ శుక్ర శనులు ఉచ్ఛయందున్నారని (రాహుకేతువుల ప్రసక్తిని విడిచిపెట్టి, వీటికి వృషభ వృశ్చికాలు ఉచ్ఛలని శాస్త్రకారులే చెప్పేరు) పూర్వవాఖ్యాతలు అంటున్నారు.

ఇదీ కాల్పనిక వ్యవస్థే. రవిబుధులు దగ్గరగా ఉంటారని చెప్పినంత మాత్రాన ఎప్పుడూ కలిసి ఒకే రాశియందు ఉంటారని చెప్పలేం. మేషం మిథునం సింహములలో వీరి ఇరువురి కలయికను బుధాదిత్యయోగం అంటారని

జ్యోతిషశాస్త్రకారులే చెప్తున్నారు. ఇది యోగం అంటే నిత్యంగా ఉండదనేకదా! కనుక మహర్షి చెప్పినంతవరకే గ్రహించుట ఉత్తమం.
ఇంకొక ముఖ్యవిషయం. ఒక్క చంద్రుడు తప్ప మిగిలిన గ్రహాలన్నీ అధమపక్షం ఒక నెల రోజులు ఒక రాశియందే ఉంటాయి. కొన్ని ఇంకా ఎక్కువ రోజులు. ఆ దృష్టితో చూచినప్పుడు రామాదుల జననంలో లగ్నభేదాలే తప్ప పఞ్చగ్రహ ఉచ్చస్థితి నలుగురకు సమమే అని చెప్పాలి.
కనుక వాల్మీకి మతానుసారం–
చైత్రమాసం పఞ్చగ్రహోచ్చస్థితిగల శుక్లపక్షం నవమితిథి కర్కటరాశియందు గురు చంద్రులు, మేషంలో రవి. ఇంతవరకే మహర్షి శ్లోకతాత్పర్యంగా గ్రహించగలం. మిగిలినది ఊహామాత్రమే.
జగన్నాథుడు సర్వలక్షణ సంపన్నుడు సర్వలోక నమస్కృతుడు విష్ణువుయొక్క అంశజుడు గొప్పభాగ్యశాలి వంశవృద్ధికరుడు సర్వులకు ఆనందదాయకుడు అయిన పుత్రుని కన్నటువంటి కౌసల్య–
వజ్రపాణి (ఇంద్రుడు)చేత అదితి ప్రకాశించినట్లుగా
మహాతేజస్వి అయిన ఆ పుత్రునిచేత ప్రకాశించింది.

భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః।
సాక్షాద్విష్ణోశ్చతుర్భాగః సర్వైః సముదితో గుణైః॥ ౧౩

సత్యపరాక్రముడైవాడు “విష్ణోశ్చతుర్భాగః” అంటున్నారు. విష్ణువుయొక్క నాల్గవభాగమైనవాడు అని ఇక్కడ చెప్పేరు. **“కైకేయ్యై చావశిష్టార్థం దదౌ పుత్రార్థ కారణాత్”** అని పూర్వం ఎనిమిదవవంతు అని చెప్పేరు. కావున పాయసవిభాగ సమయంలో విష్ణువుయొక్క చైతన్యమందలి ఎనిమిదవఅంశ భరతునిగా పుట్టేడని చెప్పకూడదు. పాయసవిభాగం అప్రమేయుడైన విష్ణువును కొలుచుటకొరకైనది కాదు. నాల్గవభాగమంటే పరమాత్మయందలి నాల్గవ (భాగం)పాదం అవ్యక్తమును తెలుసుకొనుటకు ఉపయుక్తమైన వ్యక్తము. ఇట్టిదని చెప్పుటకు వీలుపడనిది.
భరతుడు కూడా ఇట్టివాడని చెప్పుటకు వీలుపడనివాడు.
భరతుడు ఏమిటో రామునకు మాత్రం తెలుసు.

రాముడు ఏమిటో భరతునకు తెలుసు. అంత గహనమైన హృదయం కలవాడు భరతుడు.

ఈ భరతుడు సత్యపరాక్రముడు.

వాల్మీకిమహర్షి జనకుని పరిచయం చేస్తూ '**మిథిలాపతిం శూరం జనకం సత్యవిక్రమమ్'** అన్నారు.

భరతుని పరిచయం చేస్తూ "**సత్యపరాక్రమః**" అని చెప్పేరు. రాముని పరిచయం చేస్తూ ఎదర **"తేషామపి మహాతేజా రామః సత్యపరాక్రమః"** అని చెప్తున్నారు. వీరు బ్రహ్మవేత్తలు. కేవల క్షత్రియులు కారు. కనుకనే... మిగిలిన దశరథాదులయందు ఈ మాట వాడలేదు.

తరువాత విష్ణువుయొక్క అంశతో కూడినవారైన లక్ష్మణ శత్రుఘ్నులను సుమిత్ర కన్నది.

పుష్యే జాతస్తు భరతో మీనలగ్నే ప్రసన్నధీః।

భరతుడు పుష్యమీనక్షత్రంలో మీనలగ్నంలో పుట్టేడు. సూర్యుడు ఉదయించాడు. సౌమిత్రులు ఆశ్లేషా నక్షత్రంలో కర్కటలగ్నంలో పుట్టేరు.

భరతుని **ప్రసన్నధీః** అని చెప్పేరు. అంటే ప్రసన్నమైన బుద్ధికలవాడు. అంటే మాలిన్యాలులేని స్వచ్ఛమైన శుద్ధమైనస్థితి. దీనితో ఏకాగ్రమైన ధ్యానావస్థ యందు ఉన్నాడు. ఈ నిర్మలత ఎలా వచ్చింది. అంటే **శాన్తో దాన్త ఉపరత స్తితిక్షు శ్శ్రద్ధా విత్తస్సమాహితో భూత్వా** అని బృహదారణ్యకం మనోనైర్మల్యానికి సంపదషట్కాన్ని చెప్పింది. వీటిచేత ఏకాగ్రమైన ధ్యానావస్థయందు ఉన్నాడు. గొప్పబుద్ధిమంతులు గుణవంతులు (దశరథునకు) అనురూపులు అయిన నలుగురు పుత్రులు జన్మించేరు. అప్పుడు గంధర్వులు శ్రావ్యంగా గానంచేసేరు. అప్సరసలు నాట్యం చేసేరు. దేవతలు దుందుభులు మ్రోగించేరు. పుష్పవర్షం కురిసింది.

అయోధ్యలో పెద్ద ఉత్సవమే జరిగింది. జనపథాలన్నీ నటనర్తకులతో నిండిపోయాయి. గాయకులు గానం చేస్తూన్నారు. వాద్యకారులు వాద్యాలు మ్రోగిస్తున్నారు.

ఇంకా వందిమాగధులుచేసే ధ్వనులతో ఆ మార్గాలన్నీ మారుమ్రోగుతున్నాయి.

అతీత్యైకాదశాహం తు నామకర్మ తథాకరోత్
జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్။
సౌమిత్రిం లక్ష్మణమితి శత్రుఘ్నమపరం తథా।
వసిష్ఠః పరమప్రీతో నామాని కురుతే తదా။ ౨౧

ఏకాదశాహం అతీత్య పదకొండు రోజులు దాటాయి. పన్నెండవరోజు శుద్ధి (సుమిత్రాదేవి శుద్ధిదివసం) కావున ఆ రోజున పరమానందభరితుడైన వసిష్ఠుడు పెద్దవానికి రాముడని, కైకేయీ పుత్రునకు భరతుడని, సౌమిత్రులకు లక్ష్మణ శత్రుఘ్నులని పేర్లను పెట్టేరు.

(ఈ విషయంలో మతభేదాలు అనేకంగా ఉన్నాయి. ఈ కాలపు ఆచార వ్యవహారాలతో అప్పటి స్థితులను అవలోకనం చేయకూడదు)

'రాజశ్చ సూతకం నాస్తి యస్య చేచ్ఛతి పార్థినః' రాజునకు రాజపురోహితునకు అశౌచమేలేదని చెప్పబడింది.

ప్రసవే గృహమేధీతు నకుర్యాత్సంకరం యది
దశాహాచ్ఛుధ్యతే మాతా త్వవగాహ్య పితాశుచిః။

ప్రసవించిన స్త్రీకి పదిరోజులు అశౌచం. పురిటి భార్యను తాకని భర్తకు స్నానం చేస్తే శుద్ధి అని చెప్పేరు.

మరోసందర్భంలో–

సూతకం మాతురేవస్యా దుపస్పృశ్య పితాశుచిః తల్లిని పదిరోజులు తాకకూడదు. తండ్రికి స్నానమాత్రంచేత శుద్ధి.

క్షత్రస్య ద్వాదశాహాని విశః పఞ్చదశైవతు। త్రింశద్ధినాని శూద్రస్య తదర్థం న్యాయవర్తినః။ క్షత్రియులకు పన్నెందు దినాలు శౌచం యాజ్ఞ్యవల్క్య స్మృతి విధించింది.

ఏవమహరహరానిర్దశతా యాః။ పుట్టినదినముతో కలుపుకొని పదిదినములు ప్రతిదినము (తవుడు ఆవాలు కలిపి) ఇదే విధంగా హెూమం చేయ్యాలి.

దశమ్యాముత్థితా యాం స్నాతాయాం పుత్రస్య నామ దధాతి పితా మాతేతి. పదవరోజున అగ్ని, ఉదకకుంభం తీసివేసి, తరువాత అంటే పదకొండవ రోజున పన్నెండవ రోజున స్నానంచేసి మొదట తండ్రి తరువాత తల్లి

నామకరణం చెయ్యాలని ఆపస్తంబుడు. (పదవరోజునే చేసేవారు ఉన్నారు).
ఇక్కడ బ్రహ్మ క్షత్రియ శూద్రులకొరకు ప్రత్యేకంగా చెప్పలేదు. సార్వజనీనమైన సూత్రాన్ని చెప్పేరు. ఇది బ్రాహ్మణ ధర్మం, క్షత్రియాదులు వారివారి ఆచారాన్ని పాటించవలసి ఉంటుంది. ఇక్కడ మహర్షి పదకొండవ రోజు దాటేక నామకరణం చేసేరు అని చెప్పేరు. అంతే అంతవరకే...
బ్రాహ్మణులకు నగరప్రజలకు జానపదులకు ఇలా అందరికీ అన్నసంతర్పణ చేసేరు. బ్రాహ్మణులకు భూరిదక్షిణలు ఇచ్చేరు.

తేషాం జన్మక్రియాదీని సర్వకర్మాణ్య కారయత్॥౨౨

ఆ నలుగురికి జాతకర్మ మొదలు ఏయే సంస్కారాలు జరిపించవలసి ఉందో అవన్నీ యథాకాలంగా జరిపించేరు.
విద్యాభ్యాస నిమిత్తంగా ఉపనయనపర్యన్తం అన్ని సంస్కారాలు చేసేరు.

తేషాం కేతురివజ్యేష్ఠో రామోరతికరః పితుః॥

అందరిలో పెద్దవాడైన రాముడు ధ్వజంవలె దశరథునకు చాలా ప్రీతిని కలిగిస్తున్నాడు. ధ్వజం ఉపాధి సంబంధమైన చిహ్నం. అది వ్యక్తిగతంకావచ్చు. సంస్థాగతం కావచ్చు. ఒక దేశానికి సంబంధిం చినది కావచ్చు. ఆ ధ్వజాన్ని చూడగానే ఆ దేశమో, ఆ సంస్థో, ఆ వ్యక్తో గుర్తుకు వస్తారు. ఆ ధ్వజాన్ని ప్రదర్శించే వాళ్ళు ఆ ధ్వజసంబంధమైన సంస్థకో దేశానికో సంబంధించిన వారై ఉంటారు.
అది భారత జాతీయపతాకం అయితే వారు భారతదేశానికి సంబంధించిన వారని వెంటనే తెలుస్తుంది.
అది భగవద్ధ్వజం అయితే సుశిక్షితులైన స్వయంసేవకులను కలిగిన రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ అని తెలుస్తుంది.
ఇక్కడ పెద్దవాడైన రామునియందు ఆనువంశిక లక్షణాలు స్ఫుటంగా ఉన్నాయి. ఇతన్ని చూడగానే ఇక్ష్వాకు వంశీయుడా? ఏమి, అని అనిపిస్తాడు. రాముణ్ణి చూడగానే దిలీప రఘు అజ దశరథాదులు గుర్తుకువస్తున్నారు. రాముడు ఇక్ష్వాకువంశ కీర్తిపతాకలా ఉన్నాడు. దానితో దశరథుడు పరమప్రీతిని పొందుతున్నాడు.

సర్వే వేదవిదః శూరాస్సర్వే లోకహితే రతాః
సర్వే జ్ఞానోపపన్నాః సర్వే సముదితా గుణైః॥ ౨౪

రామభరతసౌమిత్రులు నలుగురు వేదవేత్తలే. వేదము అంటే కర్మ ఉపాసనా జ్ఞానముల సమష్టి. నలుగురూ శూరులు. **లోకహితేరతాః** క్షత్రియధర్మమందు ఆసక్తి. అంటే లోకహితమునందు ఆసక్తి. లోకం అంటే దేవతా భూ విత్త పశు పక్ష్యాది సహితమైన మానవులు. వీరి క్షేమమందు ఆసక్తిగలవారు, అంటే యజ్ఞాదులయందు శ్రద్ధకలవారని. జ్ఞానసంపన్నులు, అంటే లోకంయొక్క అస్థిరత్వాన్ని ఎరిగినవారు. నలుగురూ మంచిగుణములు కలవారే.

తేషామపి మహాతేజా రామః సత్యపరాక్రమః।
ఇష్టః సర్వస్యలోకస్య శశాఙ్క ఇవ నిర్మలః॥ ౨౫

నలుగురిలోను రాముడు గొప్ప తేజస్సుకలవాడు. సత్యమైన పరాక్రమం కలవాడు. సర్వప్రకృతి పూర్ణచంద్రుని ఇష్టపడినట్లుగా! రాముని ఇష్ట పడుతున్నారు.
లోకంలో కర్మజన్యమైన ఫలం ఎప్పుడూ ఆపూర్వం. ఈ అపూర్వం అనుభవ పర్యన్తం అవ్యక్తంగా ఉంటుంది. అనుభవం ఎలా ఉంటే ఆరూపంగానే ప్రకటమవుతూ ఉంటుంది. పుత్రీయేష్టివలన జనించిన అపూర్వానికి ఫలం సంతానమే. (దశరథునకు ఇష్టి ఫలం రామాదులు).
లోకులు సుఖాపేక్షచే సర్వకర్మలయందు ప్రవర్తిస్తూంటారు. లోకంలో జీవజాలానికి వెన్నెల వెలుగుల పున్నమి చంద్రుడు సుఖావహమైన స్థానం. ఈవిధంగానే రాముడు. రాముడంటే సర్వజనులయొక్క క్రతుఫలస్వరూప మైనవాడు. యజ్ఞపురుషుడు.
రామునిగూర్చి **ఇష్టః సర్వస్యలోకస్య శశాఙ్క ఇవ నిర్మలః** అని అర్ధశ్లోక రూపంలో చెప్పిన దాన్ని, పూర్వశ్లోకంలో **ప్రసన్నధీః** అని ఒకే పదంలో భరతునిగూర్చి చెప్పేరు. అలాగే ఇద్దరూ సత్యపరాక్రములని చెప్పేరు.
రాముడు ఏనుగుమూపుపై, గుఱ్ఱపు వీపుపై రథముపై ఎక్కి తిరుగుటయందు లేదా యుద్ధం చేయుటయందు సమర్థుడని పేరు తెచ్చుకొన్నాడు. రాముడు ధనుర్వేదమునందు మంచిఆసక్తి కలవాడు. తల్లిదండ్రులసేవలో ఆనందాన్ని అనుభవించువాడు.

లక్ష్మీవర్ధనుడైన లక్ష్మణుడు పెద్దన్నగారైన రామునితో ఎప్పుడు మంచి స్నేహం కలిగి ఉండేవాడు. రాముని విషయంలో శారీరకశ్రమను కూడా చేసేవాడు. ఎప్పుడు రామునకు బయట ఉన్న రెండవ ప్రాణంలా ఉన్నాడు.
లక్ష్మణుడు లేకుండా రాముడు నిద్రపోడు. తిండి తినడు.
రాముడు వేటకు బయలుదేరితే వెనకనే లక్ష్మణుడు ధనుర్బాణాలు ధరించి వెళ్ళేవాడు. ఇలా ఉంది వాళ్ళ మైత్రీగాఢత.
"జ్యాయస్వన్తశ్చిత్తినో మా వియౌష్ట సంరాధయన్తః సధురాశ్చరన్తః। అన్యో అన్యస్మై వల్గు వదన్త ఏత" చిన్నవారు పెద్దలను అనుసరించినట్లు పరస్పరం అనుసరించి వెళ్ళేవారుగా, ఏకమనస్కులుగా పరస్పరం సౌమ్యంగా మట్లాడేవారుగా కలిసి ఆరాధించేవారుగా ఉండండి అని శ్రుతి చెప్పినట్లుగా ఉన్నారు ఆ సోదరులు.
లక్ష్మణునకు తమ్ముడైన శత్రుఘ్నుడు,
లక్ష్మణుడు రాముని విషయంలో ఎలా ఉన్నాడో, శత్రుఘ్నుడు భరతుని విషయంలో అలా ఉన్నాడు. భరతుడికి శత్రుఘ్నుడు ఆరోప్రాణం అయ్యేడు.

స చతుర్భిర్మహాభాగైః పుత్రైర్దశరథః ప్రియైః।
బభూవ పరమప్రీతో దేవైరివ పితామహః॥ ౩౨

బ్రహ్మగారు దేవతలతో ఎలా ఆనందంగా ఉన్నాడో!
దశరథుడు మహాభాగ్యవంతులైన ఈ నలుగురు కొడుకులతో అలా ఉన్నాడు.

తే యదా జ్ఞానసంపన్నాః సర్వైః సముదితాగుణైః॥33
హ్రీమన్తః కీర్తిమన్తశ్చ సర్వజ్ఞా దీర్ఘదర్శినః।
తేషా మేవం ప్రభావానాం సర్వేషాం దీప్త తేజసామ్॥
పితా దశరథో హృష్టో బ్రహ్మాలోకాధిపో యథా।

వారు ఎప్పుడూ జ్ఞానంతోకూడినవారుగా ఉన్నారు. సమస్తమైన గుణములతో కూడినవారు, సిగ్గుకలవారు. అంటే నిషిద్ధకర్మాచరణకు సిగ్గుపడువారు. సమస్త విషయములు తెలిసినవారు. **దీర్ఘదర్శను**లు. అంటే కర్మానుగుణ్య ఫలరూపమైన భవిష్యత్తును దర్శించగలవారు. ప్రకాశిస్తూన్న తేజస్సుకల కుమారుల విషయమున దశరథుడు లోకాధిపతియైన బ్రహ్మదేవునివలె సంతోషించేరు.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులను దేవతలతో పోల్చి, దశరథుని బ్రహ్మతో పోల్చారు.

ఇతఃపూర్వము మరియు ఇప్పుడు వీరియందు చెప్పబడ్డ గుణములు దైవీగుణములు –మహాభాగ్యవంతులు. జ్ఞానులు సద్గుణసంపన్నులు నిషిద్ధకర్మాచరణకు సిగ్గుపడు వారు. సర్వజ్ఞులు. దీర్ఘదర్శనులు అంటే జరుగుతున్న జరిగిన కర్మలనుబట్టి ఫలరూపమైన భవిష్యత్తును ఆలోచించగల సామర్థ్యం కలవారు. ప్రకాశస్వరూపులు. ఇవన్నీ కలిగి దేవతలతో సమానంగా ఉన్నారని చెప్పేరు.

పూర్వం పదిహేనవసర్గయందు **'సురేన్ద్రగుప్తం గతదోష కల్మషం'** దేవేంద్రునిచే రక్షింపబడునది దోష పాపరహితమైన స్వర్గమునుగూర్చి రమ్ము. అని చెప్పేరు. ఎదరెదర దేవతాకార్యాలు మనల్ని సంశయగ్రస్తుల్ని చేస్తాయి. ఆయా సందర్భాలలో ఈ గుణవిశేషాలను బుద్ధియందు నిలుపుకొని అనఘాత్ములైన వారి వృత్తాంతాల్ని పరిశీలించాలి. ఇకపై అడుగడుగునా ఇది బుద్ధియందు ఉండవలసినదే! వీటిని బుద్ధియందుంచుకొనే ఎదర పాత్రల ఔచిత్యాలను నిర్ణయించాలి.

ఆ మనుష్యశ్రేష్ఠులు (రామాదులు) వేదాధ్యయనరతులు. తల్లిదండ్రుల సుశ్రూషయందు ఆసక్తిగలవారు. ధనుర్వేదంలో నిష్ణాతులు.

> **అథ రాజా దశరథస్తేషాం దారక్రియాం ప్రతి**
> **చిన్తయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాన్ధవః॥** ౩౮
> **తస్య చిన్తయమానస్య మన్త్రిమధ్యే మహాత్మనః**
> **అభ్యగచ్ఛన్మహాతేజా విశ్వామిత్రో మహామునిః॥** ౩౯

దశరథుడు మంత్రి పురోహిత బంధువులతోకూడి కుమారుల వివాహమునుగూర్చి ఆలోచించసాగేరు.

ఈవిధంగా మంత్రి పురోహిత బంధుగణాలమధ్య పుత్రుల వివాహ విషయమైన ఆలోచనయందుండగా విశ్వామిత్రమహర్షి వచ్చేరు.

ఇక్కడ వాల్మీకి కథాభాగాన్ని చాలా వేగవంతంచేసి ఒక కప్పగంతు వేసేరు. ఈ గంతు యోగవాసిష్ఠము అని లోకప్రసిద్ధిని పొందింది. ఇక్కడ దశరథుడు పుత్రులకు వివాహం చెయ్యాలని సంకల్పించేరు. ఆక్షణమే విశ్వామిత్రమహర్షి వచ్చేరు.

ఎందుకని? అంటే ఈ రామకల్యాణం ఈయన పని. విశ్వకల్యాణకారకమైన కన్యారత్నాన్ని నిర్ణయించ వలసింది, విశ్వం ఎవరిని మిత్రుడని అంగీకరించిందో ఆయన చెయ్యాలి. ఆయనే విశ్వామిత్రుడు. అందుకే పనిగట్టుకొని అయోధ్యకు దశరథునివద్దకు వచ్చేరు.

రాజకుమారులకు విద్యాభ్యాసానంతరం యౌవరాజ్య పట్టాభిషేకానికి పూర్వమే తీర్థక్షేత్రాది దర్శనరూపంగా దేశాటనం తరువాత వివాహం విధింపబడ్డాయి. ఇక్కడ వివాహప్రయత్నం చేస్తున్నారు అంటే తీర్థయాత్రాది రూపమైన దేశాటనం పూర్తిచేసేరని భావించాలి.

ఈ తీర్థక్షేత్ర సేవనాదులవల్ల స్వరూపాలలోని నానాత్వం, నానాత్వంలోని ఏకత్వం అనుభవానికి వస్తుంది. కష్టసుఖాలు తెలుస్తాయి. లోకానుభవం వస్తుంది.

విశ్వామిత్ర ఆగమనానికి పూర్వమే సభ్రాతృకంగా తీర్థయాత్రలను పూర్తిచేసేరని యోగవాసిష్ఠంలో చెప్పేరు. ఆ విశ్వామిత్రుడు రాజదర్శనాన్ని కోరి ద్వారపాలకులతో గాధిసుతుడు కుశికవంశమందు పుట్టినవాడు కౌశికుడు అనువాడు వచ్చేడని తొందరగా చెప్పు, అన్నారు.

ఆమాట విన్న ద్వారపాలురు కంగారుపడిపోయారు. వెంటనే రాజగృహాన్నిగూర్చి పరుగెత్తి వెళ్ళారు. దశరథునకు విశ్వామిత్ర ఆగమనాన్నిగూర్చి చెప్పేరు.

వెంటనే దేవేంద్రుడు బ్రహ్మను ఎదుర్కొన్నట్లుగా, ఎదురేగి ఆహ్వానించి తీసుకొని వచ్చాడు. కఠినములైన నియమములుకల ఆ విశ్వామిత్రుడు తపస్సుచే ప్రకాశిస్తూ జ్వలిస్తూన్న అగ్నిలా ఉన్నాడు.

దశరథుడు చూచేడు. ఆనందించేరు. అర్ఘ్యాన్ని ఇచ్చేరు. శాస్త్రవిదితంగా ఇవ్వబడ్డ అర్ఘ్యాన్ని విశ్వామిత్రమహర్షి స్వీకరించేరు. రాజును కుశలం అడిగేరు.

పురేకోశే జనపదే బాన్ధవేషు సుహృత్సు చ।
కుశలం కౌశికో రాజ్ఞః పర్యపృచ్ఛత్సుధార్మికః॥ ౪౪

మంచి ధార్మికుడైన కౌశికుడు దశరథునిగూర్చి **"రాజ్ఞః పురే కుశలం"** రాజధానియొక్క క్షేమాన్ని అడిగేరు. తరువాత కోశం అంటే ధనాగారం. అది కుశలంగా ఉందా? అని అడిగేరు. గ్రామాలు క్షేమంగా ఉన్నాయా అని అడిగేరు. నీ బంధుమిత్రులందరు క్షేమమేనా! అని అడిగేరు.

పరమధార్మికుడైన కౌశికుడు తానెరిగిన రాజధర్మాలని స్మృతికి తెచ్చుకొని రాజతంత్రాలను దృష్టియందుంచుకొని కుశలాన్ని అడిగేరు. రాజధాని క్షేమంగా ఉందా! (లేదా) నీ రాజ్యంలోని నగరాలు క్షేమంగా ఉన్నాయా? అంటే రాజధాని ఎప్పుడూ శత్రుదుర్భేద్యంగా ఉండాలి. అలా ఉందా? అమాత్యులతో (పాలనాధి కారులతో) ఉందా! వారు ఆజ్ఞాబద్ధులై ఉన్నారా?

సైన్యం ఎప్పుడూ సర్వసన్నద్ధంగా ఉండాలి. అలా ఉందా? అని అడుగుతున్నారు. రాజ్యంలోని నగరాలు సంపద ఉత్పాదక కేంద్రాలు. ఆ నగరాలనుండే ప్రభుత్వాలకు పన్నురూపంలో ఆదాయం ఖజానాకు చేరుతూంటుంది.

నీ కోశాగారం క్షేమంగా ఉందా? అంటే రావలసిన శిస్తులు సమయానికి సరిగా వస్తున్నాయా అంటున్నారు. అలావస్తేనే కోశాగారం సమృద్ధిగా ఉన్నట్టు.

జానపదులు కుశలంగా ఉన్నారా? ఎందుకంటే వీరు అన్నదాతలు. వీరు క్షేమంగా ఉంటేనే మిగిలిన అన్ని వర్గాలు క్షేమంగా ఉంటారు. కనుక వాళ్ళ వ్యవసాయానికి నువ్వు చేయవలసిని సహాయం సరిగా చేస్తున్నావా? అని తరువాత బంధుమిత్రులు సుఖంగా ఉన్నారా. అని అడిగేరు. ఎందుకంటే వీరు ఆపదలలో తోడుగా ఉంటారు. బంధుమిత్రుల్ని సంపాదించుకోవడం వల్ల రాజు బలాన్నిపుంజుకొంటాడు. బలాన్నిపుంజుకొని వారి సహాయంతో లేనిదాన్ని సంపాదించడం. సంపాదించినదాన్ని కాపాడుకోవడం. కాపాడబడిన దాన్ని వృద్ధిచేసుకోవడం. దాన్ని తగినవిధంగా వినియోగించడం చేసుకొంటూ తన రాజ్య వ్యవహారాలన్నీ ప్రమాద రహితం చేసుకొంటాడు.

ఈ రాజ్యతంత్రం అంతా కౌశికునిగా ఉన్న సమయంలో తన పూర్వానుభవంలో ఉన్నదే. కనుక ఆవిధమైన కుశలాన్ని ప్రశ్నించేరు. ఇంకా అడుగుతున్నారు.

అపి తే సన్నతా స్సర్వే సామన్తారిపవో జితాః।
దైవం చ మానుషం చాపి కర్మ తే సాధ్వనుష్ఠితం॥

సామంతరాజులు అందరు అణిగి ఉన్నారా? రిపవః జితాః? శత్రువులు జయింపబడ్డారా? అని అడుగుతున్నారు. ఇక్కడ శత్రువు అంటే **"అనన్తర ప్రకృతిః శత్రుః"** అని కదా! రాజశత్రువు అంటే సరిహద్దురాజ్యం.

సరిహద్దురాజులందరు అనుకూలంగా ఉన్నారా? అని అడుగుతున్నారు. దేవతానుగ్రహార్థమైన కర్మలు చక్కగా అనుష్ఠింపబడుతున్నాయా? అంటే శాంతికర్మలు చక్కగా నిర్వహిస్తున్నారా.
పురుషప్రయత్న సాధ్యమైన కర్మలు అనగా చతుర్విధ ఉపాయములవలన సాధించతగ్గ కర్మలు చక్కగా సాధింపబడుతున్నాయా?(ఇవి సామ దాన భేద దండములు)
అక్కడ ఉన్న మునిశ్రేష్ఠుడైన వసిష్ఠుడు ఇత్యాదిగాగల ఋషులందరినీకూడా యథాన్యాయంగా కుశలమడిగేరు. కౌశికుని రాకతో సంతోషించిన ఋషిమండలి రాజగృహాన్ని ప్రవేశించేరు. ఎవరి అర్హతననుసరించి వారు పూజింపబడి కూర్చొన్నారు.
పరమోదారుడైన దశరథుడు సంతోషాన్తరంగుడై మహాముని అయిన విశ్వామిత్రుని పూజించి...
ఓ విశ్వామిత్రా! మీరాక - మాకు అమృతప్రాయం.
అనావృష్టి ప్రాతంలొ వర్షంలా-
నిస్సంతులకు స్వభార్యయందు పుత్రోదయంలా-
అసలు దొరకదనుకొన్న నష్టద్రవ్య లాభంలా-
గొప్పఅభివృద్ధి కలిగినప్పుడు పొందు సంతోషంలా ఉంది.
మహర్షీ! మీకు స్వాగతం. మీరాకచే సంతోషాన్తరంగుడనైన నేను మీకు శ్రేష్ఠమైన ఏ కోరికను ఎట్లు తీర్చవలెనో చెప్పండి. నీవు నా అదృష్టం కొద్దీ వచ్చావు.

అద్యమే సఫలం జన్మ జీవీతం చ సుజీవితమ్॥౧౨

ఈరోజు నాజన్మ సఫలమైంది. నాజీవితం ధన్యమైంది.
రాజర్షివైన నీవు తపస్సుచేత బ్రహ్మర్షిత్వాన్ని పొందేవు. నీవు నాకు బహుధా పూజ్యనీయుడవు. హే బ్రహ్మన్! నీ ఆగమనమే అద్భుతం. అన్నారు.
అంటే ఈ హఠాత్పరిణామానికి దశరథుడు ఆశ్చర్యాన్ని పొందేడు. ఇంకా... నీరాక నాకు పవిత్రను చేకూర్చింది. నేను పుణ్యక్షేత్రంలో ఉన్నట్లు ఉంది. అంటున్నాడు. ఇలా అనేక విధాల ప్రస్తుతించేరు. స్తుతించి...

బ్రూహి యత్ప్రార్థితం తుభ్యం కార్యమాగమనం ప్రతి మీరు ఏ కార్యాన్ని కోరి ఇక్కడకు వచ్చేరో చెప్పండి. అని అడుగుతున్నాడు.
చెప్పడంకాదు. మీరు ఆజ్ఞాపించండి. మీచే ఆజ్ఞాపింపబడిన దాన్ని చేయుటకు సిద్ధంగా ఉన్నాను. అన్నారు. అని
ఓకౌశికా! మీరు పొందతగిన కార్యం ఎంత గొప్పదైనాకావచ్చు, అనుమానించకుండా అడగండి. నేను దానిని పూర్తి చేస్తాను.

దైవం హి భవాన్మమ॥౫౬

మీరు నా దైవం. అంటే నాకు ఇది భగవదాజ్ఞ.
హేబ్రహ్మన్! నీ ఆజ్ఞారూపంగా నేను గొప్ప అభ్యుదయాన్ని పొందేనని అనుకొంటున్నాను. నీరాక వల్ల నాకు కలిగిన ధర్మం (అపూర్వం) చాలా గొప్పది.
ఇలా హృదయానందకరంగా చెవులకు ఇంపుగా పలికిన దశరథుని మాటలకు విశ్వామిత్రుడు చాలా ఆనందించేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణార్థవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టాదశ స్సర్గ సమాప్తము.

-

అథ ఏకోనవింశః సర్గః

(విశ్వామిత్రుడు యాగ సంరక్షణకై రాముని పంపమనుట. దశరథుడు దుఃఖించుట.)

తచ్ఛ్రుత్వా రాజసింహస్య వాక్యమద్భుత విస్తరమ్।
హృష్టరోమా మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత॥

రాజశ్రేష్ఠునియొక్క ఆశ్చర్యమును కలిగించు విస్తృతమైన మాటల్నివిన్నారు. ఆ మాటలకు మహాతేజశ్శాలియైన విశ్వామిత్రునకు ఒళ్ళు గగుర్పొడిచింది. ఆనందించేరు. ఆనందించి...

ఓ రాజశ్రేష్ఠా! గొప్పవంశమునందు పుట్టేవు. వసిష్ఠుని ఉపదేశాలు పొందుతున్నావు. కనుకనే ఇలా మాట్లాడావు. అంటే ఆనువంశికమైన త్యాగము సత్యవాక్పాలనము ఎలాగూ ఉంటాయి. అంత గొప్పవంశం కనుక. దీనికి తోడు బంగారానికి తావిలా వసిష్ఠుని సాహచర్యం. ఇవి నిన్ను ఇలా మాట్లాడించేయి.

మరొకడు ఇలా మాట్లాడలేడు. నువ్వు మరొకలా మాట్లాడలేవు.

రాజశ్రేష్ఠా! నామనస్సులో మాట నేను వచ్చిన పని చెప్తాను. దానిని చెయ్యి. ప్రతిజ్ఞ నిలుపుకో.

అహం నియమమాతిష్ఠే సిద్ధ్యర్థం పురుషర్షభ।

ఓపురుషశ్రేష్ఠా! నేను సిద్ధికొరకు నియమమును దృఢంగా అవలంబిస్తున్నాను. నియమము అంటే పరతత్త్వమునందు ఎడతెగక కలుగు అభిలాష. దీనికొరకు పది ఉపాయాలను చెప్పేరు. అవి **తపస్సు,** తృప్తిజన్యమైన **సంతోషము,** శ్రుతి స్మృతులయందు **విశ్వాసం. దానం** ఇది ద్రవ్య వస్తురూపంగా ఉంటుంది లేదా జ్ఞానరూపంగా ఉంటుంది. **ఈశ్వర ఆరాధన** (అంటే రాగాది గుణరహితుడై అహింసా సత్యము అను వ్రతములు కలిగి ఉండుట), **సిద్ధాన్తవాక్యశ్రవణం** అంటే సచ్చిదానంద స్వరూపమే (ప్రత్యక్కు) అంతరాత్మ అని తెలియుట. **లజ్జ** (అంటే బ్రహ్మజ్ఞానావరోధకమైన కర్మలను ఆచరింపకుండుట) కలిగి ఉండుట. **మతి** అంటే బ్రహ్మజ్ఞానమందు దృఢమైన నిష్ఠ. **జపము** అంటే బ్రహ్మప్రతి పాదకములగు ఉపనిషద్వాక్యములను నిరంతరము మననము

చేయుట. **వ్రతము** గురువాక్యమును అనుసరించి నడుచుకొనుట. వీటివలన స్వస్థుడు అవుతాడు. అంటే తానే బ్రహ్మనని తెలుసుకొంటాడు. ఈ బ్రహ్మవిచారం ఎప్పుడూ జరుగుతూ ఉండవలసినదే. ఇది సాత్వికప్రవృత్తి. దీనికి రాక్షసప్రవృత్తినుండి ప్రతిఘటన ఒకప్పుడు ఉంటుంది. దీనికి బ్రహ్మవేత్తలను ఆశ్రయించుటయే ఉపాయం. కనుకనే విశ్వామిత్రుడు; వసిష్ఠుడు రాముడు మొదలగు వారితో కూడిన దశరథుని సభను ఆశ్రయించారు.

(ఎందుకు దశరథుని ఆశ్రయించడం అంటే తనకు గురుస్థానీయుడైన వసిష్ఠుడు అక్కడ ఉన్నాడు. ఆ వసిష్ఠునిముందు పెట్టుకొనే విశ్వామిత్రుడు బ్రహ్మవిచారం చేసి బ్రహ్మవేత్త అయ్యేరు.)

సిద్ధికొరకు ప్రయత్నిస్తున్నాను కానీ, కామరూపులైన ఇద్దరు రాక్షసులు నా నియమానికి విఘ్నం కలిగిస్తున్నారు.

మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవంతౌ సుశిక్షితౌ
సమాంసరుధిరౌఘేణ వేదిం తామభ్యవర్షతామ్॥ ౫

నా వ్రతదీక్ష సమాప్తిదశయందు ఉంది. సుశిక్షితులు మంచి పరాక్రమవంతులు అయిన మారీచ సుబాహులు వచ్చి మాంసముతోకూడిన రక్తముతో యజ్ఞవేదిని వర్షిస్తున్నారు.

ఈయజ్ఞం ఏమిటి? ఇది ద్రవ్యయజ్ఞమా? జ్ఞానయజ్ఞమా? అంటే పూర్వశ్లోకంలో సిద్ధికొరకు అని చెప్పడంవలన, ఇక్కడ సిద్ధి అనునది కర్మాచరణములద్వారా లభించే కర్మఫలరూపముకాదు. **సిద్ధిః నిష్క్రియాత్మస్వరూప అవస్థాన లక్షణం** అని సిద్ధి అంటే ఏమిటో భాష్యకారులు చెప్పేరు. ఈయజ్ఞం జ్ఞానయజ్ఞమే. పూర్వం పన్నెండవసర్గలో...

మమ లాలప్యమానస్య పుత్రార్థం నాస్తి వై సుఖం। తదర్థం హయమేధేన యక్ష్యామీతి మతిర్మమ॥ అని కామ్యకర్మను ఆచరించేరు. సుఖం పుత్రులయందు ఉందనుకొంటున్న దశరథుడు, దాని నిమిత్తంగా ద్రవ్యయజ్ఞం చేసేరు. **'ఋషిపుత్ర ప్రభావేన కామాన్ప్రాప్స్యామి చాప్యహం'** ఋషి పుత్రుడైన ఋష్యశృంగుని ప్రభావంతో నేను కామనలను పొందగలను అనుకొన్నారు. పుత్రులను పొందడం కర్మాచరణకు సంబంధించిన విషయం. సిద్ధి అనునది

ఉపాసన లేదా జ్ఞానసంబంధిత విషయం. ఇప్పుడు విశ్వామిత్రుడు ఇంద్రియములన్నీ ఉపరమావస్థయందున్నవాడు కావున ఈయజ్ఞం భౌతిక సుఖాపేక్షకొరకైన ద్రవ్యయజ్ఞరూప కామ్యకర్మకాదు. ఇది జ్ఞానయజ్ఞమే. ఆ దీక్షాసంకల్పం విఘ్నం అయింది. దానికొరకు అంత శ్రమించిన నా ఉత్సాహంకూడా భగ్నం అయింది. దాంతో నేను ఆ దేశాన్ని వదిలి వచ్చేసాను. (ఇక్కడ కథాభాగంలో ఒక రహస్యం ఉంది. కౌశికుడు క్షత్రియుడు. వసిష్ఠుని చేతిలో పరాభవింపబడి ఆ పరాభవాగ్నినుండి జనించిన వైరాగ్యంతో తత్త్వవిచారాన్ని దృఢదీక్షగా కొనసాగించినవారు. ఆక్రమంలో అనేకసార్లు పడిలేచేరుకూడా. తరువాత వసిష్ఠాదులు వచ్చి నీకు తత్త్వం తెలిసింది అన్నారు. అటుపై తన స్వభావం అయిన క్షాత్రాన్నివిడిచే ప్రయత్నంచేసేరు. బ్రాహ్మణ్యాన్ని ఆశ్రయించేరు. నీవు బ్రహ్మవేత్తవు అని అనిపించుకొన్నారు. కానీ ఇంకా లేశమాత్రంగా స్వభావం (నామరూపాలు వాటినే రక్తమాంసా లని చెప్పేరు) అడ్డుపడుతోంది. ఆవిషయాన్నే మారీచ సుబాహులని చెప్పేరు వాల్మీకి. **సుబాహువు మహాబాహువు** అను శబ్దాలు క్షత్రియసంబంధమైన ప్రకృతిని తెలియచెప్పేవి. **మారీచుడు** మాయకు సంకేతం. ఉన్నదాన్ని లేనట్లు లేనిదున్నట్లు సాధకుని స్వభావానికి తగినట్లుగా దర్శింపచేసేది. దీనినుండి బయటపడుటకు సత్పురుష సందర్శనము సత్సంగము మార్గాలు. అందుకని వసిష్ఠాదుల సందర్శనం. మరి రాముని ఎందుకు అపేక్షించాడు అంటే రాముడు యువకుడైనా జ్ఞాని, తన కర్మను యోగముగా మార్చుకొన్నవాడు)

న చ మే క్రోధముత్సృష్టుం బుద్ధిర్భవతి పార్థివ। ౭

ఓరాజా! (ఆసమయంలో) కోపాన్ని ప్రదర్శించుటకు నాకు మనస్కరించలేదు. అంటే ఇంకా కోపం అనుభవానికి వస్తోంది. కాని సుదీర్ఘమైన యమనియమాది అనుష్ఠానాదులవలన తెలిసి నిగ్రహించుకో గలుగుతున్నాడు.

యజ్ఞయాగాదులు వ్రతాలు అక్రోధియై ఏకాగ్రచిత్తంతో చేయాలి. నేను చేసే పనికూడా అటువంటిదే. కనుక అక్కడ ఆయాగంలో శాపం ఇవ్వకూడదు.

స్వపుత్రం రాజశార్దూలం రామం సత్యపరాక్రమమ్।

ఓరాజశ్రేష్ఠా! జునపములు ధరించి కౌమారదశయందు ఉన్న శౌర్యవంతుడు

సత్యపరాక్రమంకలవాడు. నీ పుత్రులలో పెద్దవాడు అయిన రాముని నాకు ఇమ్ము.

శక్తో హ్యేష మయాగుప్తో దివ్యేన స్వేన తేజసా।
రాక్షసా యే వికర్తారస్తేషా మపి వినాశనే॥ ౯

నా రక్షణలో ఉన్న రాముడు తన సహజ దివ్యతేజస్సుచే విఘ్నములు చేయు రాక్షసులను సంహరింప సమర్థుడు.

ఇక్కడ విశ్వామిత్రుడు బ్రాహ్మణుడు. ఇంద్రియజయంకలవాడు. తన స్వభావమైన క్షాత్రమును బహుప్రయాసతో వదిలి సత్త్వగుణ సంపన్నమైన బ్రాహ్మణ్యాన్ని ప్రకృతిగా చేసుకొన్నవాడు. బ్రాహ్మణునకు ఆయుధధారణ నిషిద్ధం.

ఇంద్రియ నియమనము ఏకాగ్రతా లేని ఏకార్యంయొక్క ఫలమైనా ప్రశ్నార్థకమే. అవి క్రతువ్రతాల వంటివి అయితే ఇంకా ఎక్కువ శ్రద్ధకలిగి ఉండాలి. అందువల్ల ఆయుధాన్ని క్రోధాన్ని ధరించలేదు.

క్షత్రియధర్మం శిష్టజన సంరక్షణకనుక సత్యవ్రతులు ధర్మనిరతులు అయిన రాఘవులను ఆశ్రయించి యజ్ఞసంరక్షణకొరకైన అభ్యర్థనను వారిముందుంచేరు. రాముడు నా రక్షణలో ఉంటాడు కనుక నీకు భయం అక్కరలేదు.

శ్రేయశ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః
త్రయాణామపి లోకానాం యేన ఖ్యాతిం గమిష్యతి॥

నేను ఇతనికి దేనివలన మూడులోకాలలో ఖ్యాతిని పొందుతాడో అట్టి శ్రేయస్సును అనేక రూపాలలో ఇస్తాను.

రాక్షస వినాశనసామర్థ్యం కలవాడు రాముడు అని చెప్పేరు కదా! ఇప్పుడు తన సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశాలను ఇవ్వాలి. నేనా వీలును కల్పిస్తాను. దగ్గరుండి రాక్షససంహారం చేయిస్తాను. శివధనుర్భంగం చేయిస్తాను. పత్నికాదగిన కన్యారత్నాన్ని చూపించి వివాహం చేయిస్తాను.

బహురూపం అంటే రుద్రునిగా చూపిస్తాను. సర్వలోక శరణ్యుడైన స్థితికారకునిగా పరిచయంచేస్తాను. సర్వసమ్మోహనకరమైన ఈతని మన్మథ స్వరూపాన్ని లోకానికి చూపిస్తాను.

న చ తౌ రామమాసాద్య శక్తౌ స్థాతుం కథం చన।

మారీచ సుబాహులు రామునిపొంది ఏవిధంగాను నిలువలేరు. రామునికంటే అన్యుడు వారిరువురిని చంపుటకు సమర్థుడూకాడు.

(**బాహ్యంగా–** రామపరాక్రమం అటువంటిది. నేను ఎఱుగుదును. అంటున్నారు. రహస్యంగా–రాముడు మాయను వశమందంచుకొన్నవాడు. అతడు స్వభావాన్ని జయించి స్వరూపనిష్ఠుడై ఉన్నవాడు. నామరూపాలు అతని ముందు నిలువలేవు అంటున్నారు.)

వీర్యోత్సిక్తౌ హి తౌ పాపౌ కాలపాశవశం గతౌ
రామస్య రాజశార్దూల న పర్యాప్తౌ మహాత్మనః॥ ౧౨

వీర్యముచే గర్వితులైన ఆ మారీచ సుబాహులు కాలపాశమునకు వశము కావలసియున్నది. వారు రామునకు సరికారు. (నామరూపాలు కాలవశములై నాశనమును పొందుతాయి. ఆనందరూపుడు ఆనందదాయకుడు అయిన వానికి నామరూపాలను వశమందుంచుకొను కాలము బాధకంకాదు. అని చెప్తున్నారు)

న చ పుత్రకృతస్నేహం కర్తుమర్హసి పార్థివ
అహం తే ప్రతిజానామి హతౌ విద్ధి రాక్షసౌ॥
అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్।
వసిష్ఠోఽ పి మహాతేజా యే చేమే తపసి స్థితాః॥

రాజా! పుత్రునిపై మమకారం తగదు. మారీచ సుబాహులు రామునిచే సంహరింపబడిన వారిగా తెలుసుకో.

మహాత్ముడు ఆనందదాయకుడు ఆత్మస్వరూపుడు(అహం) సత్యవిక్రముడు అగు రాముని నేను ఎరుగుదును(వేద్మి) నీకు ప్రతిజ్ఞచేస్తున్నాను. వసిష్ఠునకు, ఈ తపస్వులైన మహర్షులకు కూడా తెలుసు.

అంటే రాముడు బ్రహ్మవేత్తలచే తెలియబడువాడు. నీవు సామాన్యునిగా తలుస్తున్నావు. ఈవిధంగా మాట్లాడుతున్నారు మహర్షి.

(రాముడు అంటే ఉపాధికాదనే విషయాన్ని వాల్మీకిమహర్షి అవకాశం ఉన్న ప్రతి సందర్భంలోనూ చెప్తారు. ఇంద్రియార్థముల సన్నికర్షము వలన ప్రత్యక్షజ్ఞానం కలుగుతుంది. ఈ ఇంద్రియములు ఆతీత అనాగతకాలమునందలి వస్తువులను

గ్రహించలేవు. రాముడు వర్తమానంలో ఉన్న ఉపాధిరూప పుత్రుడుకాదు. రాముడు సార్వకాలికుడు. ఇంద్రియములచే గ్రహింపబడు ఉపాధికాదు.)

యదితే ధర్మలాభం చ యశశ్చ పరమంభువి।
స్థితిమిచ్ఛసి రాజేన్ద్ర రామం మే దాతు మర్హసి॥ ౧౫

రాజేంద్రా! నీకు ధర్మంయొక్క లాభం కావాలన్నట్లయితే! భూమిపై నీకీర్తి స్థిరంగా ఉండాలను కోరిక కలవాడవైతే రాముని నాకు ఇమ్ము.
(ఇక్కడ ప్రతి సందర్భంలోనూ ఓరాజశ్రేష్ఠుడా! అనో, ఓరాఘవా! అనో, హేకాకుత్థ! అనో సంబోధిస్తున్నారు మహర్షి. ఇలా సంబోధిస్తూ, రాజా! నీవు పొందే లాభాలు వ్యక్తిగతాలుకావు. వంశానుగతాలు. కాబట్టి శ్రద్ధవహించాలి.
అని బోధిస్తున్నారు.
అరవైవేల సంవత్సరాలు గడిచిపోయాయి. యుద్ధాలద్వారా, క్రతువులద్వారా సంపాదించవలసినదేదో సంపాదించేను. ఇప్పుడు క్రొత్తగా సంపాదించడానికి ఏముంది. ఉన్నా! సంపాదించి ఏంచెయ్యాలి కనుక. ఆనందంగా పుత్రులతో కాలక్షేపంచేస్తాను అంటావేమో! నీకీర్తి నీసంపద అన్నీ నీవంశ ప్రతిష్ఠకు సంబంధించినవి. అవి స్థిరంగా ఉండాలంటే రాముని విడు అని చెప్పేరు.)
ఓకాకుత్థా నీ మంత్రుల, వసిష్ఠాది ప్రముఖుల అనుజ్ఞను పొందే రాముని విడిచిపెట్టు. విశ్వామిత్రుడు మంచి వాగ్మి. వచ్చినకార్యం ఏవిధంగా మాట్లాడితే సానుకూలం అగునో ఆవిధంగా మాట్లాడుతున్నారు.
సాధారణంగా రాజులు (అధికారులు) ధన, కీర్తికాంక్ష లుకలవారుగా ఉంటారు. ఇక్కడ దశరథుడు సార్వభౌముడు. ధనసమృద్ధి కలవాడూను. కావున శాశ్వతమైన కీర్తినిపొందుతావు అన్నారు. ఎందుకని శాశ్వతకీర్తి, ఎంతవరకు కీర్తి భూమిపై స్థిరంగా ఉంటుందో అంతవరకూ స్వర్గలోక నివాసం స్థిరం. పూర్వం దశరథునిచే **యజ్ఞార్థం ప్రసవార్థం చ స్వర్గార్థం చ నరేశ్వరః** అని యజ్ఞసంకల్పంలో స్వర్గం కోరబడింది. తన్నిమిత్తమై నీకు శాశ్వతమైన కీర్తిని కలిగింపగలను. నమ్మకం కుదరకపోతే ఈ విషయమై మంత్రులతో ఆలోచించు. వసిష్ఠునితో ఆలోచించు. నేను ఏమిటో వారికి తెలుసు, వారు చెప్పినట్లుగా చెయ్యి.
నేనేమైనా శాశ్వతంగా ఇమ్మంటున్నానా ఏమి?

దశరాత్రం హి యజ్ఞస్య రామం రాజీవలోచనం।

రాజీవలోచనుడైన రాముని పదిరోజులు యజ్ఞరక్షణకు ఆలస్యం చేయకుండా పంపించు.

నాత్యేతి కాలో యజ్ఞస్య యథాయం మమ రాఘవ।
తథా కురుష్వ భద్రంతే మా చ శోకే మనః కృథాః॥

హేరాఘవ! (ఓ దశరథా!) యజ్ఞసమయం దాటిపోకుండా చూడు. నీకు క్షేమ మగును. అంటే నేను చెప్పినట్లుగా **నీరాముడు**, నీకొరకైన **స్థిరమైన కీర్తి** ఇవి నిన్ను చేరతాయి. దుఃఖించకు.

మహాత్ముడూ గొప్ప తేజోవంతుడూ అయిన విశ్వామిత్రుడు ధర్మార్థ సహితమైన వాక్కులను పలికి విరమించేరు.

స తన్నిశమ్య రాజేన్ద్రో విశ్వామిత్ర వచః శుభమ్।

దశరథుడు శుభకరమైన మహర్షి వాక్కులను విని తీవ్రమైన శోకాన్ని భయాన్ని పొందేరు.

మహర్షి పలికిన మాటలు శుభకరములని తెలిసీ ఎందుకు దుఃఖాన్ని భయాన్ని పొందేడు. అంటే స్వభావనిష్ఠుడై ఉన్నాడు కనుక. స్వభావం అంటే నామరూపాలు. ఈ స్వభావమే కర్త. ఇక్కడ దశరథునకు రాముడంటే రక్తమాంస అస్థిమయమైన కోమలమైన నయనానందకరమైన ఉపాధి. రాముడు ఉపాధియే అనుకొంటే మనకైనా దశరథునికైనా ఎడబాటు తప్పదు. దానివల్ల దుఃఖమూ తప్పదు. ఈ కారణంగా ముని మాటలు దశరథ హృదయాన్ని మనస్సును చీల్చేసాయి. మనోవ్యధను పొందేడు. కూర్చొన్నచోట కూర్చోలేక పోయేడు. (దీన్నిబట్టి తెలిసింది ఏమిటి? అని ప్రశ్నించుకొంటే–

నీ పుత్రుడు సాక్షాత్తు శ్రీరాముడేకాని, శ్రీకృష్ణుడేకాని; నీవు తత్త్వం తెలుసుకోకపోతే మృత్యురూపమైన దుఃఖాన్ని మనోవ్యధను పొందుతూ, ఆనందానికి ఆమడ దూరంలో ఉంటావు)

శ్రీఫల అను శ్రీమద్రామాయణార్థవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **ఏకోనవింశ స్సర్గ** సమాప్తము.

అథ వింశః సర్గః

(విశ్వామిత్రుడు యాగ రక్షణకు రాముని పంపమని దశరథునికోరగా దశరథుడు నిరాకరించుట మహర్షి కోపించుట.)

తచ్ఛ్రుత్వా రాజశార్దూలో విశ్వామిత్రస్య భాషితమ్।
ముహూర్తమివ నిస్సంజ్ఞః సంజ్ఞావానిదమబ్రవీత్॥ ౧

రాజశ్రేష్ఠుడైన దశరథుడు విశ్వామిత్రుని పలుకులు విని ముహూర్తకాలం నిశ్చేష్టుడైపోయేడు. మరల చేష్టలనుపొంది మాట్లాడుతున్నాడు.

పద్మనేత్రుడైన నా రాముడు పూర్తిగా పదహారుసంవత్సరాలైనా లేనివాడు. ఈ రాముడు రాక్షసులతో యుద్ధంచేయగల యోగ్యుడుగా కనబడుటలేదు.

ఒకఅక్షౌహిణి సైన్యము నా అధీనంలో ఉంది. నేను దానికి నియామకుడను. దీనితో నేను వెళ్ళి యుద్ధంచేస్తాను. నా అధీనమందున్న సైన్యమందలి సైనికులు శూరులు పరాక్రమవంతులు అస్త్రవిశారదులు రాక్షసగణములతో యుద్ధం చేయుటకు తగినవారు. వీళ్ళందర్నీ తీసుకువెళ్ళండి. రామునిమాత్రం వద్దు. ఈ సైన్యంతోపాటు ధనుర్ధారినై నేనూ వస్తాను. రాక్షసులతో యుద్ధంచేస్తాను. యాగాన్ని రక్షిస్తాను. నీవ్రతానుష్ఠానం నిర్విఘ్నంకాగలదు. రాముని మాత్రం తీసుకొని వెళ్ళవద్దు.

ఎందుకంటే –

రాముడు బాలుడు. పూర్తిగా విద్యలను నేర్చుకోలేదు. శత్రువుయొక్క బలాబలాలు పూర్తిగా తెలిసినవాడుకాదు. యుద్ధవిశారదుడుకాదు. కపటులైన రాక్షసులతో యుద్ధానికి రాముడు తగినవాడు కాదు.

విప్రయుక్తో హి రామేణ ముహూర్తమపి నోత్సహే।
జీవితుం మునిశార్దూల న రామం నేతు మర్హసి॥

ఓ మునిశ్రేష్ఠుడా! రాముడు లేనిచో ముహూర్తకాలంకూడా జీవించలేను. (ఇక్కడ దశరథుడు పుత్రరూపంగా ఉపాధిని శరణాగతి చేస్తూన్నారు. ఇది మనోదౌర్బల్య కారకమేకాని ఆనంద దాయకమూ సుఖదాయకమూ కాదు.) సువ్రతా! ఓబ్రాహ్మణుడా! రాముని తీసుకొని వెళ్ళుటయే నీ అభిమతమైతే చతురంగ బలములతోకూడిన నన్నూ రామునితో తీసుకొని వెళ్ళు.

దుఃఖేనోత్పాదితశ్చాయం నరామం నేతుమర్హసి। ౧౦

ఓకౌశికా! నాకు అరవైవేల సంవత్సరాలు. ఈ రాముని అతి ప్రయాసచే కన్నాను. తీసుకొని వెళ్ళుటతగదు.

(సుఖాపేక్షచే యజ్ఞయాగాదిరూపమైన కర్మలు, వ్రతాలు నోములు ఇలా ఎన్ని ఆచరించినా చివరకు అవి దుఃఖరూపంగానే పరిణమిస్తాయి. కర్మఫలరూపంగా ఏ అపూర్వం (శుభాశుభరూపంగా) జనించినప్పటికీ ఆఫలం అనుభవంవలన క్షయాన్నిపొంది తిరిగి దుఃఖాన్నే ఇస్తోంది.

ఈ విషయంలో దశరథుని ఉదాహరణగా చూపెడుతున్నారు.)

చతుర్ణాత్మజానాం హి ప్రీతిః పరమికా మమ।
జ్యేష్ఠం ధర్మప్రధానం చ న రామం నేతుమర్హసి॥౧౧

నాకు నలుగురు కొడుకులు. ఆ నలుగురియందు గొప్ప ప్రేమకలదు. రాముడంటావా! జ్యేష్ఠుడు. ధర్మ విషయమున ప్రధానుడు. కనుక రాముని తీసుకొని వెళ్ళుటతగదు.

అంటే మిగిలిన ముగ్గురులో ఎవరినైనా ఇస్తాను అని సూచించేరు. కాని శాస్త్రం జ్యేష్ఠసంతానాన్ని మాత్రమే ధర్మసంతానం అని చెప్పింది. యజమాని ఇస్తున్నాడుకదా అని ప్రతిగ్రహణం చేయకూడదు. అతని సంపాదన ధర్మబద్ధమైనదేనా! అని చూడాలి. కానిపక్షంలో విడిచెయ్యాలి. జ్యేష్ఠాపత్యమైన రాముడే ధర్మం. కావున విశ్వామిత్రుడు రాముడే కావాలని అడిగేరు.

ఓ మునిపుంగవా! ఇంతకీ ఆరాక్షసులు ఎవరు? వారి పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి? వారి పరాక్రమం ఎట్టిది? వారు ఎంత ఉంటారు?

ఆ రాక్షసులు ఎవరి రక్షణలో ఉన్నారు.

కపటయుద్ధంచేయువారి విషయంలో నేనుకాని, నా సైన్యంకాని రాముడుకాని ఏవిధంగా ప్రతిక్రియ చేయవలసి ఉంటుంది.

పూజ్యుడా! రాక్షసులు బలగర్వితులు కదా! దుష్టులైన వారివిషయంలో నేను ఎలా మెలగవలసి ఉంటుంది. అని దశరథమహారాజు అడిగేరు.

విశ్వామిత్రమహర్షి చెప్తున్నారు.

పౌలస్త్యవంశమందు పుట్టిన రావణుడను రాక్షసుడు. మహాబలవంతుడు. గొప్పపరాక్రమం కలవాడు. బ్రహ్మదత్తమైన వరములుకలవాడు. అనేకులైన రాక్షససైన్యం కలవాడు. మూడులోకాలను పీడించువాడు. ఈ రావణుడు విశ్రవసు కుమారుడు. సాక్షాత్తు కుబేరుని సోదరుడు. వీడు స్వయంగా యజ్ఞమునకు విఘ్నంచేయడు. వీడిచే ప్రేరితులైన మారీచ సుబాహులు అను ఇద్దరు రాక్షసులు విఘ్నములను చేస్తున్నారు.

విశ్వామిత్రుడు చెప్పినది ధశరథుడు విన్నాడు. విని-

నేను యుద్ధంలో ఆదురాత్ములను నిలువరించుటకు తగినవాడిని కానని తన అసమర్థతను తెలిపేరు.

ధర్మజ్ఞుడవైన ఓమహర్షి! నీవు అల్పభాగ్యుడనైన నన్ను నాకుమారుని అనుగ్రహించు. గురువైన నీవు దైవముకదా!

దేవదానవ గన్ధర్వ యక్ష పతగ పన్నగులుకూడా యుద్ధమందు రావణుని సహించుటకు శక్తులుకారు. ఇక మానవుల విషయం చెప్పాలా!

ఆ రావణుడు యుద్ధమునందు వీర్యవంతుల వీర్యమును గ్రహించి వేయును. ఓమునిశ్రేష్ఠా! సైన్యముతోకూడిగాని నాకుమారులతోకూడిగాని నేను రావణునితోగాని అతని సైన్యముతోగాని యుద్ధంచేయుటకు అసమర్థుడను.

కథమప్యమరప్రఖ్యం సంగ్రామాణామకోవిదమ్।
బాలం మే తనయం బ్రహ్మన్ నైవ దాస్యామి పుత్రకమ్॥

ఓబ్రాహ్మణుడా! బాలుడైన నాకుమారుడు దేవతలతో సమానుడు. అంటే పసివాళ్ళు భగవంతునితో సమానం అంటారుకదా! నా రాముడు పసివాడు. దేవతుల్యుడు. నన్ను పున్నామనరకంనుండి రక్షించువాడు. యుద్ధాలను ఎరుగని వాడు. ఇటువంటి రాముడిని ఏవిధంగా ఇవ్వగలను.

ఆ మారీచ సుబాహులు సుందోపసుందుల కుమారులు. యమునితో సమానులు. పరాక్రమవంతులు. అందువల్ల నేను రాముని ఇవ్వను.

నేను నా మిత్రగణంతోకూడి వారిలో ఒకరితో యుద్ధంచేస్తాను.

ఇతి నరపతిజల్పనాద్ద్విజేన్ద్రం
కుశికసుతం సుమహాన్ వివేశమన్యుః।
సుహుత ఇవ మఖేగ్నిరాజ్యసిక్తః
సమభవదుజ్జ్వలితో మహర్షివహ్నిః॥ ౨౭

ఈవిధంగా మహారాజుయొక్క అసంబద్ధ ప్రలాపమువలన ద్విజశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని చాలాగొప్ప కోపం ఆవహించింది. యజ్ఞమునందు బాగుగా హోమంచేసి నేతిచే తడుపబడిన అగ్ని ఎలా ఉంటుందో! మహర్షి అటువంటి అగ్నిలా ప్రజ్వలిస్తున్నారు.

మంత్రపూతమైన ఆజ్యము హుతమొనర్చుటచే ప్రజ్వలించిన వైదికాగ్ని ఏవిధంగా కామ్యసాధకమో! అదే విధంగా క్రోధంచే ప్రజ్వలించుచున్న విశ్వామిత్రాగ్ని కూడా! అని మహర్షి సూచించేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
వింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకవింశః సర్గః॥

(విశ్వామిత్రుడు పలుకులు విని వసిష్ఠుడు రాముని విషయంలో దశరథుని ఒప్పించుట.)

తచ్ఛ్రుత్వా వచనం తస్య స్నేహపర్యాకులాక్షరమ్।
సమన్యుః కౌశికో వాక్యం ప్రత్యువాచ మహీపతిమ్॥

దశరథునియొక్క పుత్రస్నేహముచే తడపబడుచున్న అక్షరములుకల వాక్కును విని, కౌశికుడు క్రోధమునుకూడి రాజునుగూర్చి ప్రత్యుత్తరమును ఇచ్చెను. దశరథుని మాటలలోని ప్రతి అక్షరమూ అతిశయించిన పుత్రప్రేమయందు తడిచి ముద్దై బయటకువస్తోంది. అతిగా ఉపాధులతో మమైకమైన తండ్రిని చూపెడుతున్నారు.

సంతానం (పుత్రుడు) నరకమునుండి ఉద్ధరించి స్వర్గమును పొందటకైనది. ఎంతవరకూ మనపేరు భూమిపై స్థిరంగా ఉంటుందో అంతవరకు స్వర్గలోక వాసం స్థిరమని పురాణాలు చెప్తున్నాయి.

సంతానమంటే అస్థిమాంసమయమైన ఉపాధులుకావని-

కూపస్తటాకముద్యానం మండపం చ ప్రపాతథా।
జలదానమన్నదానం అశ్వత్థారోపణం తథా
పుత్రశ్చేతి చ సంతానం సప్తవేదవిదో విదుః॥

అని స్కాందపురాణం నూయి చెఱువు ఉద్యానవనం మండపం చలివెందుల అశ్వత్థారోపణం పుత్రుడు అనునవి సప్తసంతానాలని చెప్పింది. ఇవి అన్నీ పుత్రుడు ఏవిధమైన ఫలాన్ని(సుఖాన్ని) ఇస్తాడని అనుకొంటున్నామో అదే ఫలాన్ని ఇస్తాయి. ఒకప్పుడు పుత్రునికంటె పదింతలుగా ఫలాన్ని ఇస్తాయని పెద్దలమాట.

అతిశయించిన మమకారం అపేక్షణీయంకాదు. అది దుఃఖహేతువు. ఆవిధంగానే తత్త్వదృష్టిలేని కర్మాచరణం (క్రతువ్రతజపదాన దేవతార్చనాదులు) సుఖహేతువుకాకపోగా యజమానిపై అనవసరమైన వత్తిడిని కలిగిస్తాయి. ఈవిషయాల్ని దశరథుని చాటుచేసి శాస్త్ర(జ్ఞాన) విషయాన్ని కావ్యభాషలో చెప్పేరు వాల్మీకి మహర్షి.

ఇదిగో ఇటువంటి దశరథుడు మాట్లాడిన మాటలు విన్నారు విశ్వామిత్రమహర్షి. విని–

అడిగినది ఇస్తానని ప్రతిజ్ఞచేసి ఇప్పుడు మాట దాటాలనుకొంటున్నావు. ఇది రాఘవుల కులమునకు తగినది కాదు. హేరాజా! నీకు ఇదే క్షేమ మనిపిస్తే, నేను వచ్చినట్లే వెళ్తాను. ఓ కాకుత్స్థా! మిథ్యాప్రతిజ్ఞకల నీవు బంధువులతోకలిసి సుఖంగా ఉండు.

బుద్ధిమంతుడైన విశ్వామిత్రుడు క్రోధముచేకూడిన వాడుకాగా సమస్తమైన వసుధ కంపించింది. అంటే ప్రతిజ్ఞాభంగమునకు మహర్షి కోపమునకు (ధనమును ధరించునది వసుధ) తన రాజ్యము చలించినది. తనకు తన రాజ్యమునకూ హితమునుకూర్చు దేవ బ్రాహ్మణులు భయాన్నిపొందేరు. **సుఖీభవ సబాన్ధవః** అని పైనచెప్పిన మాట విశ్వామిత్రుడు ఉక్రోషం పట్టలేక పలికినదేకాని ఆశీర్వాణికాదు.

ధీరుడు సువ్రతుడగు వసిష్ఠమహర్షి సకలజగత్తు భయపడినదిగా తెలిసికొన్నారు. విపత్తును గ్రహించి రాజునుగూర్చి హితాన్ని చెప్పేరు.

ఇక్ష్వాకూణాం కులేజాతః సాక్షాద్ధర్మ ఇవాపరః। ౬

ఇక్ష్వాకువంశమందు పుట్టేవు. సాక్షాత్తు నీవు మరో (రెండవ) ధర్మ దేవతవు. (మరి మొదటివాడు ఎవడు అంటే వసిష్ఠమహర్షి. నాహితవు అనుసరించి నడిచేవాడవే కావున నా ప్రతిబింబానివే నీవు.) ధైర్యవంతుడవు. సువ్రతుడవు. శ్రీమంతుడవు (గృహస్థువు). నీవు ధర్మం విడుచుట తగదు.

స్వధర్మం ప్రతిపద్యస్వ నాధర్మం వోఢుమర్హసి। ౭

ఓదశరథా! నీవు ధర్మాత్ముడవని లోకత్రయమందు విఖ్యాతిని పొందేవు. స్వధర్మాన్ని ఆచరించు. అధర్మాన్ని చేయకు. ఇక్కడ అధర్మమంటే పరధర్మమే. అది నీకూ నీకులానికీ కూడా చేటు తెస్తుంది. ఇది **"స్వధర్మో నిధనం శ్రేయః పరధర్మో భయావహః"** అన్న గీతావాక్యార్థము.

సంశ్రుత్యైవం కరిష్యామీ త్యకుర్వాణస్య రాఘవ।
ఇష్టాపూర్త వధో భూయాత్తస్మాద్రామం విసర్జయ॥ ౮

ఓరాఘవా! ఇలా చేస్తానని ప్రతిజ్ఞచేసి, (ఆవిధంగా) చేయనివాని క్రతు

దాన వ్రతాదులు నాశనమగును. ఆ కారణంగా రాముని విడిచిపెట్టు. దశరథుడు వాగ్దానం చేసేడు. దానంచేసిన తరువాత దానిపై సర్వాధికారాలు ఆదానం పట్టిన వానివిగా ఉంటాయి. ఇప్పుడు వాగ్దానభంగం చేయుటచేత చౌర్యం అవుతుంది. అందునా ఇప్పుడు ఇది బ్రాహ్మణద్రవ్యం. దీనివల్ల తను స్వయంగా సంపాదించుకొన్న అపూర్వం(పుణ్యం) నశించిపోతుంది. కావున రాముని విడిచిపెట్టు.

రాముడు అస్త్రములను నేర్చినను, నేర్వకున్నను విశ్వామిత్రుని చాటున ఉన్నంతవరకూ, అగ్నిచే రక్షింపబడిన అమృతంవలె ఈ రాముని రాక్షసులు ఏమీ చేయలేరు.

ఏష విగ్రహవాన్ ధర్మః ఏష వీర్యవతాం వరః।
ఏష బుద్ధ్యాధికో లోకే తపసశ్చ పరాయణమ్॥ ౧౦

ఈ విశ్వామిత్రుడు మూర్తీభవించిన ధర్మం. పరాక్రమవంతులలో శ్రేష్ఠుడు. ఇతడు బుద్ధిచే లోకమునందు అందరికంటే గొప్పవాడు. తపస్సునకు ఉత్కృష్టస్థాన మైనవాడు.

ధర్మము అంటే వేదైక గోచరమైనది. ప్రత్యక్షం అనుమానం ఉపమానం అర్థాపత్తి అభావం (అనుపలబ్ధి) అను ప్రమాణ పంచకమునకు అందనిది.

అట్టి ధర్మమే విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడు అంటే సర్వప్రకృతి ఎవరితో మిత్రత్వాన్ని కోరుకొంటోందో అతడు విశ్వామిత్రుడు. విశ్వామిత్రుడు అంటే రక్తాస్థిమాంసమయమైన ఉపాధికాదు. కౌశికుని బ్రహ్మను చేసిన మార్గము. దానికి రూపంలేదు. రూపంలేనిదాన్ని ఇంద్రియములు గ్రహించలేవు. కావున **ప్రత్యక్ష అనుమాన** ప్రమాణములచేత గ్రహింపబడువాడు కాదు.

విశ్వామిత్రునివంటి వాడు విశ్వామిత్రుడే. ఇటువంటివాడు సృష్టిలో మరొకడు లేడు. కావున **ఉపమానం**చే తెలియబడుటలేదు. **అర్థాపత్తి**చే సామాన్యజ్ఞానమే సిద్ధిస్తుందికాని, విశేషజ్ఞానం కలుగదు. ధర్మము కాలత్రయమందు భావ రూపమున ఉంటుంది. **అనుపలబ్ధి** అభావజ్ఞానాధీన మగుటంజేసి ధర్మమును ప్రకాశింపచేయలేదు. **'వేదైకగోచరౌ తస్మా ద్ధర్మాధర్మౌ వితి స్థితమమ్"** ఇప్పుడు విశ్వామిత్రుడు అంటే వేదవేద్యుడు.

ఇదిగో ఈ మహావృక్ష సంబంధమైన ఫలమే రాముడు. **"రామో విగ్రహవాన్ ధర్మః"** అని మారీచుడు చెప్పడంలో ఔచిత్యం ఉంది. మారీచుడికి విశ్వామిత్రుడూ తెలుసు, ఆ వృక్షసంబంధ ఫలరూపమైన రాముడూ తెలుసు. అందుకే శ్రీరాముని **'వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే'** అని కీర్తించేరు.

ఇతడు అనేక విధములైన అస్త్రములను తెలిసినవాడు. చరాచరాత్మకమైన లోకత్రయంలో ఇతనికి తెలిసినవిధంగా అన్యులకు తెలియదు. తెలుసుకోలేరు! ఈ విశ్వామిత్రునకు తెలిసిన అస్త్రములు దేవ ఋషి అసుర రాక్షస గంధర్వ యక్ష పతగ పన్నగాదులకుకూడా తెలియదు.

సర్వాస్త్రాణి భృశాశ్వస్య పుత్రాః పరమధార్మికాః।
కౌశికాయా పురా దత్తా యదా రాజ్యం ప్రశాసతి॥ ౧౩

పరమధార్మికులైన భృశాశ్వపుత్రులైన సర్వాస్త్రములు పూర్వం విశ్వామిత్రుడు రాజ్యమును శాసించునప్పుడు అతనికి ఇవ్వబడినవి.

పూర్వము కౌశికునిగా ఉన్నప్పుడు రాజ్యమును శాసించునప్పుడు అస్త్రములను కలిగి ఉన్నాడు. విశ్వామిత్రుడై రాజ్యాన్ని విడిచిపెట్టేడు. తన స్వభావసంబంధమైన అస్త్రశస్త్రములు తనదగ్గరే ఉన్నాయి. ఇదిగో ఇది బంధం. దీన్ని వదుల్చుకొనే ప్రయత్నంలో ఉన్నారు మహర్షి.

ఉపాసకుడు తన ఉపాస్యమంత్రాలను యోగ్యుడైన వానికి ఉపదేశించి విముక్తుడుకావాలి. అది శాస్త్రవిధి. ఆ ప్రయత్నంలో యోగ్యుడు జితేంద్రియుడు అయిన రాముని ఎన్నుకొన్నారు.

భృశాశ్వునకు ప్రజాపతి (దక్షుని)కుమార్తెలకు పుత్రులైన అస్త్రములు అనేక రూపములు కలవి. మహావీర్యవత్తరములు కాంతిమంతములు జయమును ఇచ్చునవి.

జయ సుప్రభ అను ఇరువురు దక్షునికుమార్తెలు. వారిరువురు మహాప్రకాశ వంతములైన నూరు అస్త్రములను కనిరి.

పూర్వం **జయ** అను ఆమె రాక్షసులయొక్క వధకొరకు చెప్పశక్యముకాని పరాక్రమముకల కామరూపముకల శ్రేష్ఠమైన ఏబదిమంది పుత్రులను పొందింది.

సుప్రభకూడా ఎదిరింపశక్యముకాని ఆక్రమింప శక్యంకాని మహాబలవంతులైన **సంహారుల**ను పేరుగల మరి యేబదిమంది పుత్రులకు జన్మనిచ్చింది. ఆ అస్త్రములన్నీ ఈ కుశికాత్మజునకు బాగాతెలుసు.

అపూర్వాణాం చ జననే శక్తో భూయః సధర్మవిత్। ౧౯

ఇంకనూ అపూర్వమైన అస్త్రములను సృష్టించుటయందు సమర్థుడు. ఓరాజా! విశ్వామిత్రుడు గొప్పతేజోవంతుడు. మహాయశస్వి గొప్ప వీర్యవంతుడు. కావున రాముని పంపుటకు సందేహింపకు.

తేషాం నిగ్రహణే శక్తః స్వయం చ కుశికాత్మజః।
తవ పుత్రహితార్థాయ త్వాముపేత్యాభియాచతే॥ ౨౦

కుశకాత్మజుడు ఆరాక్షసులను స్వయముగనే నిగ్రహింపగలడు. నీయొక్క పుత్రుని హితముకొరకే నిన్నుపొంది యాచిస్తున్నాడు.

వసిష్ఠుడు కాలత్రయమందలి విషయములు తెలిసినవాడు. కావున విశ్వామిత్ర ఆగమనరహస్యాన్ని చెప్పేరు. దశరథా! విశ్వామిత్రుడు రాజ్యభోగాలన్నీ విడిచిపెట్టేడు. మన్త్రరూపులైన అస్త్రదేవతలు ఇంకా అతనివద్దనే ఉన్నాయి. కొన్ని సందర్భాలలో అవి క్రోధజనకములై అసహనానికి కారణమగుచున్నాయి. యోగ్యుని చూచి విడిచిపెట్టాలని సంకల్పించేరు. కనుక రాముని పంపవలసినది అని చెప్పేరు.

ఇతి మునివచనాత్ప్రసన్న చిత్తో
రఘువృషభస్తు ముమోదభాస్వరాఙ్గః
గమనమభి రురోచ రాఘవస్య
ప్రథితయశాః కుశికాత్మజాయ బుద్ధ్యా॥ ౨౧

ఈవిధమైన వసిష్ఠముని మాటలవలన దశరథుని మనస్సు ప్రసన్నము అయింది. సంతోషాన్నిపొందేడు. శరీరం కాంతిమంతమైంది. ప్రసిద్ధమైన కీర్తిగల దశరథుడు విశ్వామిత్రునికొరకు (కుశికాత్మజాయ అని చతుర్థ్యంతం) రామునియొక్క గమనమును బుద్ధిచే అంగీకరించేడు. అంటే ఈక్షణంనుండి నీవు విశ్వామిత్రునికొరకు ఆయన చెప్పినట్లుగా నడుచుకో! ఎంతకాలం అంటే జీవితపర్యంతం. ఎందుకని అంటే నీనడక విశ్వామిత్రునికొరకని దశరథుడు

చతుర్థ్యంత ప్రయోగంచేసేరు. ఇది "షష్ఠ్యర్థేచతుర్థీ". విశ్వామిత్రా! నీకు రాముని ఇస్తున్నాను. నీ వ్రత పరిసమాప్తి తరువాత నాకు ఒప్పగించు. నీవు మాత్రమే రామునకు గురువు. శిష్యధర్మంగా రాముని నీకొరకు ఇచ్చెస్తున్నాను. విశ్వామిత్రా నీకు ఇచ్చేను కదా అని పరివ్రాట్‌గా తయారు చేయకూడదు. ఎందుకంటే సంసారం నిస్సారమని గ్రహించి రాజ్యభోగాలు విడిచి బ్రాహ్మణ్యాన్ని గ్రహించినవాడవు. శిష్యునకు కూడా అదే బోధించి సన్న్యాసిలాచేయకు. వాడిని తిరిగి నాకు ఒప్పగించు అంటే గృహస్థునిగాచేయి. అంటున్నారు. అందుకు షష్ఠ్యర్థే చతర్థీ ప్రయోగం.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకవింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ ద్వావింశః సర్గః॥

(రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట. రామునకు బల అతిబల అను విద్యలను ఉపదేశించుట)

తథావసిష్ఠే బ్రువతి రాజా దశరథః స్వయమ్।
ప్రహృష్టవదనో రామమాజుహావ సలక్ష్మణమ్॥

ఆవిధంగా వసిష్ఠుడు చెప్పాక, దశరథుని ముఖంలో నవ్వుకనబడింది. స్వయంగా లక్ష్మణసమేతుడైన రాముని పిలుచుకొని వచ్చేరు.

కౌసల్యా దశరథుడు రామునకు స్వస్త్యయనం చేసేరు. వసిష్ఠుడు మంగళకరము లగు మన్త్రములను అభిమన్త్రించేరు. దశరథుడు రాముని నడినెత్తిని ఆఘ్రాణించి మిక్కిలి సంతోషాంతరంగుడై విశ్వామిత్రునకు ఇచ్చేరు.

తరువాత రాజీవలోచయుడైన రాముడు విశ్వామిత్రుని అనుసరించగనే పరాగరహితముగా సుఖస్పర్శగలదైన వాయువు వీచింది. మహాత్ముడైన విశ్వామిత్రుడు బయలుదేరగనే గొప్పపుష్ప వృష్టి కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. రాజప్రాసాదంకూడా శంఖములయొక్క దుందుభులయొక్క ధ్వనులతో నిండిపోయింది.

విశ్వామిత్రో యయావగ్రే తతో రామోధనుర్ధరః।
కాకపక్షధరో ధన్వీతంచ సౌమిత్రిరన్వగాత్॥ ౬

ముందు విశ్వామిత్రుడు నడిచేరు. తరువాత అంటే మహర్షివెనుక ధనుర్ధరుడైన రాముడు, రాముని వెనుక జునపములుకల ధనుర్ధారియైన లక్ష్మణుడు వెళ్ళేరు. అనల్పమైన రూపవీర్యాది ప్రభావంకల రాఘవులు రెండేసి అమ్ములపొదులను ధరించి ధనుస్సులను హస్తములందుకలిగి మూడుతలల సర్పాలలా ఉన్నారు. ఇటువంటి రామలక్ష్మణులు బ్రహ్మదేవుని అశ్వనీదేవతలవలె విశ్వామిత్రుని అనుసరించేరు.

ధనుస్సును హస్తమునందు ధరించి చక్కగా అలంకరింపబడినవారు. చేతివ్రేళ్ళకు ఉడుముచర్మంతో చేసిన కవచంకలవారు. ఖడ్గములు కలవారు. అచింత్య ప్రకాశంకల ఈశ్వరుని, అగ్నినుండి పుట్టిన స్కంద విశాఖులవలె, దోషములు లేనివారు బాలురు సోదరులైన రామలక్ష్మణులు విశ్వామిత్రుని ప్రకాశింపచేసేరు.

సంప్రదాయబద్ధంగా నడకసాగుతోంది. ఒకటిన్నర యోజనాలదూరం వెళ్ళేరు. సరయూనది దక్షిణపుతీరం చేరేరు. మహర్షి ఓరామా! అని పరమమధురంగా పిలిచేరు. అమ్మ (కౌసల్యామాత) పిలిచినంత మధురంగా పిలిచేరు.

గృహాణ వత్స సలిలం మాభూత్కాలస్య పర్యయః।
మన్త్రగ్రామం గృహాణ త్వం బలామతిబలాం తథా॥౧౨

వత్సా! ఆచమనం చెయ్యి. మంత్రముల సముదాయమైన బల అతిబల అను విద్యలను గ్రహించు.

ఈవిద్యలు గ్రహిస్తే నీకు శ్రమ తెలియదు. జ్వరంకూడా రాదు. నీరూపంలో మార్పురాదు. అంటే వయస్సుతో పాటు వచ్చే మార్పులు ఇకరావు. నీవు నిద్రిస్తూన్నా ఏమరపాటుగా ఉన్నా రాక్షసులు నిన్ను బాధించలేరు. రామా బాహుబలంలో నీ సదృశుడు భూమిమీద ఎవడూ లేడు.

నసౌభాగ్యే నదాక్షిణ్యే నజ్ఞానే బుద్ధినిశ్చయే।
నోత్తరే ప్రతివక్తవ్యే సమోలోకే తవానఘ॥ ౧౪

ఓఅనఘాత్ముడా! సౌభాగ్యంలోనూ సామర్థ్యంలోనూ నీకు సమానుడు లోకంలో లేడు. జ్ఞానమునందుకాని నిశ్చయ బుద్ధియందుకాని ఎదుటివాడికి సమాధానం చెప్పవలసినప్పుడుగాని నీతో సమానుడు ఉండడు.

ఈ విద్యాద్వయాన్ని పొందితే నీకు సమానమైనవాడు ఇప్పుడులేడు. భవిష్యత్తులో రాడు. ఓరామా! బల అతిబల జపించుచున్న నీకు మార్గమందు ఆకలిదప్పులు కలుగవు.

మహర్షి ఇవి రెండూ విద్యలు అని చెప్తున్నారు. అంటే ఉపాసనా – జ్ఞాన సంబంధమైనవి అని.

కర్మకాండ ప్రయాసతోకూడి ఉంటుంది. కర్మకాండలో ఆసన స్థల వివక్షలు ఉంటాయి. ఉపాసనలో శారీరకశ్రమ ఉండదు. ఆసననియమంగాని స్థలనియమంగాని ఉపాసన విషయంలోలేవు. (కర్మను ఉపాసనను కలిపేసుకొని క్రిందమీద అయిపోతూంటాము.) **"అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా"** అన్నది విద్యావిషయంగానే.

విద్యాద్వయ మధీయానే యశశ్చాప్యతులం త్వయి

ఆ విద్యలను ధ్యానించిన నీవు ఎనలేని కీర్తిని పొందగలవు.

శుశ్రూషా శ్రవణం చైవ గ్రహణం ధారణం తథా। ఊహాపోహోఽర్థవిజ్ఞానం తత్త్వజ్ఞానం చ ధీగుణాః" ఈ ఎనిమిది బుద్ధి సామర్థ్య విశేషాలు.

పితామహసుతేహ్యేతే విద్యే తేజస్సమన్వితే।
ప్రదాతుం తవ కాకుత్థ్స సదృశస్త్వం హి ధార్మిక॥

ఓధార్మికుడా! రామా! అని సంబోధించేరు.

ఎందుకు రాముడు ధార్మికుడు అంటే–

మునులు ఉపదేశించిన ధర్మాన్ని వేదశాస్త్రవిరుద్ధంకాని విధంగా సమన్వయం చేసుకొని అనుష్ఠించువాడు ధార్మికుడు.

వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియమాత్మనః। ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్॥ వేదప్రమాణ్యం స్మృతిచోదితం సదాచారం (సత్పురుషుల మార్గం) తన ఆత్మకు (మనస్సుకు) ప్రియమైనది. ఈ నాలుగు ధర్మానికి ప్రత్యక్ష లక్షణాలు.

ధృతిః క్షమా దమోఽస్తేయం శౌచమింద్రియ నిగ్రహః
ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్॥

ధైర్యము, ఓర్పు, మనోనిగ్రహం, పరులసొత్తునందు ఆశలేకుండుట, శుచిత్వం, ఇంద్రియనిగ్రహం, బుద్ధి విద్య సత్యం కోపరాహిత్యం–ఈ పది ధర్మమునకు లక్షణాలు. ఇవి కలిగి ఉండవలసినవాడు కలిగినవాడు బ్రాహ్మణుడు.

అందుకే వసిష్ఠుడు దశరథునితో నీవు రెండవ ధర్మదేవతాలా ఉన్నావు అన్నారు. అంటే మొదటివారు వసిష్ఠ విశ్వామిత్రాది బ్రహ్మవేత్తలు అని అర్థం.

హేధార్మిక! ఓరామా! తేజస్సమన్వితమైన బ్రహ్మకుమార్తెలైన ఈవిద్యలు గ్రహించుటకు నీవే తగినవాడివి.

రామా! ఈవిద్యలను పొందటానికి నీవే తగినవాడవు. ఎందుకని అంటే నీవు బ్రహ్మవేత్తవు. ఈ పైచెప్పిన గుణములన్నీ నీయందు అధికంగా ఉన్నాయి. సందేహంలేదు. నీయందు తపస్సుచే ఈ విద్యలు పోషింపబడినవై బహురూపములు కలవి కాగలవు.

అంటే అష్టవిధ ధీర్లక్షణాలచే పోషింపబడితే ఈవిద్యలు అనేకానేక ఫలాలను ఇస్తాయి.
బాహుబలంలోనూ సౌభాగ్యంలోనూ సామర్థ్యంలోనూ జ్ఞానమునందుకాని నిశ్చయబుద్ధియందుకాని నీకు సమానుడు లోకంలోలేడు. ఈవిద్యలను పొందటానికి నీవే తగినవాడవు. అని విశ్వామిత్ర వచనం. ఒక వస్తువు నందలి సర్వధర్మాలు లేదా గుణములు అదే నిష్పత్తిలో మరొక వస్తువులో ఉండుట సంభవించదు. **'సర్వథైవోపమా నిషేధోఽ సమాఖ్యోఽ లఙ్కారః'** అన్నివిధముల ఉపమానం నిషేధింపబడుటచే రాముడు అసమానుడు.
దీక్ష స్వభావాన్నిగుర్తించి యోగ్యతననుసరించి గురువులు అనుగ్రహిస్తారు. బంధుత్వాలనుబట్టికాదు. కావున రామునకు విశ్వామిత్రుడు మంత్రదీక్షను యోగ్యతననుసరించి ఇచ్చేరు. ఇక్కడ రామునకు మాత్రమే ఇచ్చినట్లున్నది. ఉపలక్షణంచేత లక్ష్మణునకుకూడా ఇచ్చారని చెప్పుట ఔచిత్యంకాదు.
తరువాత రాముడు ఉదకాన్ని స్పృశించేరు. పవిత్రుడై వికసించిన ముఖం కలవాడై పరిశుద్ధాంతరంగుడైన మహర్షినుండి ఆవిద్యలు రెండిటినీ స్వీకరించేరు.
భూరివిక్రముడైన రాముడు విద్యలను స్వీకరించి విశ్వామిత్రుని విషయమున గురువునకు చేయవలసిన సర్వకార్యాలను చేసేరు. చేసి, శరత్కాల సూర్యునిలా ప్రకాశించేరు. వారుముగ్గురు సరయూతీరమున ఆరాత్రి సుఖంగా ఉన్నారు.

దశరథనృపసూను సత్తమాభ్యాం
తృణశయనేఽ నుచితే సహోషితాభ్యామ్।
కుశిక సుతవచోఽ నులాలితాభ్యాం
సుఖమివ సా విబభౌ విభావరీ చ॥ ౨౩

రామలక్ష్మణులు అనుచితమైన తృణశయనాన్ని కలిసిచేసేరు. దశరథ పుత్రశ్రేష్ఠులైన వారు విశ్వామిత్రునిచేత లాలన చేయబడిన వారగుటచే ఆరాత్రి వారికి సుఖంగానే గడిచింది.
రజనీం తత్ర సరయ్వాం సుసుఖం త్రయః ఆరాత్రి ముగ్గురూ చాలా సుఖంగా ఉన్నారు. రామలక్ష్మణులు తృణశయనం చేసేరని ప్రత్యేకంగా చెప్పేరు. మరి మహర్షి ఎక్కడ పడుకొన్నారు. అంటే తనూ అదే నేలమీద వారితో పడుకొన్నారు.

తను రాజ్యపరిత్యాగం చేసి చాలాకాలంగా కఠిన నియమాలతో ఉన్నకారణంగా భూతలశయనం అలవాటులో ఉంది. కనుక ప్రత్యేకంగా చెప్పుకోలేదు.

వీరు చక్రవర్తి బిడ్డలు. హంసతూలికాతల్పంనుండి సరాసరి కటిక నేలమీదికి వచ్చేరు. మహర్షి జీవితపు రెండవ పార్శ్వాన్ని పరిచయం చేస్తున్నారు. కటికనేలల కాఠిన్యంకూడా తెలియాలి. ఇతఃపూర్వం మహర్షి వీరిని **"వత్సా"** అని పిలిచేరు. అంటే మీరు ఇంకా జీవిత ప్రథమార్థంలో ఉన్నారు. ఇటుపై యౌవరాజ్య పట్టాభిషేకాన్నిపొందాలి. దశరథుడు వివాహప్రయత్నాలు మొదలు పెట్టేరు. జీవితపు ద్వితీయార్థానికి అవసరమైన శిక్షణకావాలి. స్త్రీపురుషుల మనస్తత్త్వం తెలియాలి. వీరికి ఇప్పటివరకూ అమ్మ మాత్రమే తెలుసు. అందరినీ అమ్మలానే చూసేరుకూడ. లోకంలొ నిర్దాక్షిణ్యంగా చంపతగిన తాటకాదులు ఉంటారని తెలియాలి. అకారణంగా అపకారంచేసే మారీచ సుబాహుల్ని చూపించాలి. జీవితం అంటే సుఖాలేకాదు, సంసారంలో కాఠిన్యం ఉంటుంది. అది తెలుసుకోవాలి అని అనునయించి తల్లిలా చెప్తున్నారు.

మహర్షి వీరిని **వత్సా** అని పిలిచేరు. అంటే ఏడాది వయస్సున్న పసివాళ్ళన్ని చూసినట్లు చూస్తున్నారు. పసివాళ్ళు అనే... లాలన చేస్తున్నారు. నిద్రవచ్చేవరకు కబుర్లు చెప్పవలసిందే! నిద్ర సుఖమెరుగదు కదా!

అలా లాలిస్తూండగానే పిల్లలు నిద్రలోకి జారుకొన్నారు.

మహర్షికూడా సుఖావస్థను పొందేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్వావింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ త్రయోవింశః సర్గః॥

(విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో నదీసంగమ స్థానమందలి ఆశ్రమమున రాత్రి విశ్రమించుట.)

ప్రభాతాయాంతు శర్వర్యాం విశ్వామిత్రో మహామునిః
అభ్యభాషత కాకుత్స్థౌ శయనౌ పర్ణసంస్తరే॥ ౧

రాత్రియందు ప్రకాశం ప్రవృత్తమవుతోంది. పర్ణశయనమునందు నిద్రించియున్న రామలక్ష్మణులను ఉద్దేశించి విశ్వామిత్రుడు పలికేరు.

పూర్వం తృణశయనం అని ఇప్పుడు పర్ణశయనం అని చెప్పేరు ఏమిటి? అంటే ఆకులచే కప్పబడిన గడ్డిపై పడుకొన్నారని అర్థగ్రహణమునకు ఉభయపదాలను స్వీకరించవలసిందే.

బ్రాహ్మీముహూర్తమునందు మేల్కొనుట అలవాటున ఉన్నవాడు కనుక మహర్షి ముందేలేచేరు. ఎండకన్నెరుగని సుకుమారులు రథాశ్వములపై విహరించువారు మహర్షిని అనుసరించి చాలాదూరం నడిచేరు. అలసిన శరీరాలతో పడుకున్నారు. చీకటిమాటున ఉన్న వెలుగు అనుభవంలోకి రావట్లేదు. ఆవెలుగును అనుభవంలోకి తీసుకొనిరావలసిన బాధ్యత గురువులది.

కౌసల్యాసుప్రజా రామా పూర్వాసంధ్యాప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికం॥ ౨
తస్యర్షేః పరమోదారం వచః శ్రుత్వా నృపాత్మజౌ।
స్నాత్వా కృతోదకౌ వీరౌ జేపతుః పరమం జపమ్॥ ౩

ఓకౌసల్యాసుప్రజా! ఓరామా! అని పిలుస్తున్నారు. కౌసల్యామాత దశరథుని భార్యలలో జ్యేష్ఠురాలు. పట్టమహిషి. పత్నీస్థానాన్ని అలంకరించింది. ఈమె ధర్మం. భర్తచేయు వైదిక శ్రాద్ధకర్మలయందు అధికారంకలది. కౌసల్యకుగల పత్నీరూప శ్రేష్ఠత్వంచేత దశరథుడు తేజాది (తేజస్సు సామర్థ్యం పశు ధన) చతుష్టయాన్నిపొందేడు. ఈమె ధర్మం కావున, ఈమెయందలి సంతానం ధర్మసంతానం. ఈ ధర్మసంతానమే సుప్రజ.

తరువాత భార్యలూ సంతానమూ కామ్యమును అనుసరించి వచ్చేరు.

ఇటువంటి ధర్మసంతానాన్ని కౌసల్యపొంది దశరథునిచే పొందించింది.

కావున మహర్షి కౌసల్యా సుప్రజా అన్నారు.

వేదము సంతానాన్ని వారివారి తల్లుల పేరున పరిచయం చేస్తుంది. బృహదారణ్యకము నందలి వంశబ్రాహ్మణము (6అ. 1–2)"అథ వగ్ంశః। పౌతిమాషీపుత్రః కాత్యాయనీపుత్రాత్కాత్యాయనీపుత్రో గౌతమీపుత్రాద్గౌతమీ పుత్రో...ఆసురేరాసురిః" స్త్రీప్రాధాన్యాద్ గుణవాన్ పుత్రో భవతి ఇతి ప్రస్తుతమ్। అతః స్త్రీవిశేషణేన ఏవ పుత్ర విశేషణాద్ ఆచార్యపరంపరా కీర్త్యతే" పుత్రుడు గుణవంతుడగుటలో తల్లిది ప్రధానపాత్ర. ఆకారణంగా శ్రుతి సంతానాన్ని వారివారి తల్లుల పుత్రులుగా పరిచయం చేసింది.

రామాయణము శ్రుతి శిశువు. విశ్వామిత్రుడు ఆచార్యత్వాన్ని వహిస్తున్నారు. కనుకనే కౌసల్యాసుప్రజా అని పిలుపు.

పూర్వసంధ్య ప్రవర్తిస్తోంది. ఓ నరశ్రేష్ఠుడా! లే! దేవతాసంబంధమైన నిత్యకర్మను చెయ్యి.

ఎందుకని దేవతాసంబంధమైన నిత్యకర్మ చెయ్యాలి. వీరున్నది శర్వరీస్థితి. ఆత్మానాత్మ విచారరూపమైన వ్యాపారానికి అవకాశంలేకుండా చేసి అసలు వెలుగే అయిన స్వరూపాన్ని కప్పింది. సర్వమును ప్రకాశింపచేసే వెలుగు అనుభవంలోకి వస్తోంది, తమస్సును విడు. లే! లేచి ఆవెలుగును ఉపాసన చెయ్యి. అది కర్తవ్యకర్మ. **వీరౌనృపాత్మజౌ తస్య ఋషేః పరమోదారం వచః శ్రుత్వా స్నాత్వా** వీరులైన రాజకుమారులు ఇరువురు పరమోదారమైన వాక్కును విన్నారు. (దంతధావనాదులు పూర్తిచేసి) స్నానం చేసేరు.

మహర్షి లక్ష్మణుని నిద్రలేపలేదు అని చెప్పకూడదు. విశ్వామిత్రుడు "కౌశల్యా సుప్రజా రామా" అని రాముని పిలిచినప్పటికీ ఆపిలుపునకు ఇద్దరు రాకుమారులకు తెలివివచ్చింది. లేచి స్నానఅర్ఘ్యాదులను పూర్తిచేసేరని ద్వివచన ప్రయోగంచేసేరు మహర్షి.

బుద్ధిని జ్ఞానమునందు ప్రచోదనంచేయు శ్రేష్ఠమంత్రము (సావిత్రీ)ను జపించేరు.

గొప్పపరాక్రమంకల రామలక్ష్మణులు సంధ్యాసమయంలో చేయవలసిన నిత్యకర్మలు పూర్తిచేసికొని తపస్సే ధనంగాకల విశ్వామిత్రమహర్షికి నమస్కరించి

మంచి ఉత్సాహంగా ప్రయాణమునకు సన్నద్ధులైయ్యేరు.
కొంతదూరం ప్రయాణించేరు. పవిత్రమైన సరయూ గంగానదుల సంగమ స్థానం చూసేరు. ఆప్రదేశంలో అనేక వేలసంవత్సారాలనుండి గొప్పతపస్సుచే తపింపబడి గొప్ప తేజస్సుకల ఋషీశ్వరుల పవిత్రమైన ఆశ్రమాన్ని చూసేరు. పుణ్యాశ్రమాన్ని చూడగనే పరమప్రీతితో విశ్వామిత్రుని గూర్చి ఓపూజ్యుడా! ఈ ఆశ్రమం ఎవరిది. దీనిలో ఎవరు ఉంటున్నారు. మాకు వినాలని చాలా వేడుకగా ఉంది. చెప్పవలసింది. అని ప్రార్థించేరు.
శ్రుత్వాప్రహస్య మునిపుఙ్గవః అదివిని మహర్షి నవ్వుకొన్నారు. తను చెప్పాలనుకొంటున్నదే వారు అడిగినదీనూ. కనుక నవ్వు వచ్చింది. వినండి పిల్లలూ చెప్తాను అని ప్రారంభించేరు.
పూర్వం కందర్పుడు(మన్మథుడు)మూర్తిమంతుడై ఉన్నప్పటి విషయం. ఈ కందర్పునికి కాముడని మరో పేరు. ఇతడు దుర్మేధ. తన దుష్టబుద్ధిచేతనే తాపసులను బాధిస్తాడు.
ఆ అలవాటుచేతనే తపస్సుచేయుచున్నవాడు నియమంచే ఏకాగ్రమైన చిత్తంకలవాడైన స్థాణువును ఎదిరించేడు. స్థాణువుఅంటే అంతటాతానే అయిన శివుడు. తానులేని చోటుకాని తనకంటే వేరైనదికాని ఉంటే అటు జరుగుతాడు. అదిలేకుండుటచే స్థాణువులా కనబడుతున్నాడు. ఇటువంటి శివుని దుర్మతియైన మన్మథుడు ఎదిరించేడు.

అవదగ్ధస్య రౌద్రేణ చక్షుషా రఘునందన
వ్యశీర్యన్త శరీరాత్స్వాత్సర్వగాత్రాణి దుర్మతేః॥ ౧౨

రఘునందనా! ఆ మన్మథుడు రుద్రునిచే కాల్చివేయబడ్డాడు. రుద్రనేత్రముచే అని తృతీయా ఏకవచన ప్రయోగంచేసేరు. రెండుకన్నులు కదా! ఏకవచనం ఎలా- అంటే రెండుకన్నులు ఒకటిచేసి చూసేరు.
దృష్టిని ఏకాగ్రంచేసేరు. అనాత్మలయందు ఆత్మభావనలను కలిగించు ఇంద్రియములు మొత్తంగా రాలిపోయాయి. ఇప్పుడు హవిర్భాగాలు అందక నశించిపోయిన దేవత అయ్యేడు. ఈ విధంగా మన్మథుడు శరీరం లేనివాడు అయ్యేడు. ఇది మొదలు మన్మథుడు అనంగుడని పేరు పొందేడు.

ఇది శివునియొక్క తపోభూమి. ఈ మునులు ఆయన శిష్యులే. వీరు నిత్య ధర్మపరాయణులు. వీరికి పాపంలేదు. అని వారినిగూర్చి ఆశ్రమంగూర్చి చెప్పి, రామా! ఈరాత్రి పవిత్రమైన సరయూ గంగా నదులమధ్య ఇక్కడ ఉండి రేపు ఉదయం గంగను దాటుదాం.

అభిగచ్ఛామహే సర్వే శుచయః పుణ్యమాశ్రమమ్।
స్నాతాశ్చ కృతజప్యాశ్చ హుతహవ్యా నరోత్తమ॥ ౧౭

ఓ నరశ్రేష్ఠుడా! మనం ముగ్గురూ స్నాన సంధ్యావందన అగ్నిహోత్రాదులు పూర్తిచేసుకొని పవిత్రనుపొంది పుణ్యమైన ఆశ్రమమును ప్రవేశించెదము. **సర్వే శుచయః పుణ్యమాశ్రమం అభిగచ్ఛామహే** అనునది విధివాక్యం. అది వారికొరకు మాత్రమే అయినటువంటి వాక్యం కాదు. క్షేత్ర తీర్థాదుల వద్దకు వెళ్ళవలసివస్తే ఈవిధంగానే వెళ్ళాలి. పుణ్యనదీస్నానాలకు వెళ్ళేముందు స్నానంచేసి శుచిగా వెళ్ళాలి. మహాత్ముల దర్శనానికి క్షేత్రదర్శనాలకు నిత్యకర్మలను పూర్తిచేసుకొని వెళ్ళాలి. హరిహరబ్రహ్మేంద్రాల క్షేత్రాలన్నీ విష్ణుక్షేత్రాలే. ఎందుకంటే శివుడు బ్రహ్మ ఇంద్రుడు ఆదిత్యుడు ఇత్యాదిగా అందరూ విష్ణుశబ్ద వాచ్యులే. స్థావర జంగమాత్మకమైన సృష్టియందు సర్వేసర్వత్ర ఆ విష్ణుచైతన్యం ఈశ్వరశక్తి నిండి నిబిడీకృతమై ఉంది. ఆ విష్ణుతత్త్వాన్ని బాహ్యాభ్యన్తర శౌచహీనులు దర్శించలేరు. ఎందుకంటే పాపులయందు అంతఃకరణం శుద్ధంగా ఉండదు. నిత్యకర్మను చేయకుంటే ప్రత్యవాయం కలుగుతుంది. తద్వారా అంతఃకరణ శుద్ధి లోపిస్తుంది. అప్పుడు సర్వవ్యాపకమైన ఈశ్వరచైతన్యాన్ని తెలుసుకోలేము.

కనుక రాఘవులారా! మనం అంతఃకరణ శుద్ధిని పొంది లోనికి ప్రవేశిద్దాం! రామలక్ష్మణవిశ్వామిత్రులు ఈవిధంగా సంభాషించుకొని నిత్యకర్మలు ఆచరిస్తూండగానే తపస్సుచే సంపాదించుకొన్న అతీంద్రియ దృష్టిచేత మునులు వీరి రాకను తెలిసికొని పరమప్రీతిని పొందేరు.

విశ్వామిత్రునకు ముందుగా అర్ఘ్యపాద్యాలను ఇచ్చేరు. ఆతిథ్యాన్ని సమర్పించేరు. తరువాత రామలక్ష్మణులకు ఆతిథ్యాన్ని ఇచ్చేరు.

రామలక్ష్మణులు విశ్వామిత్రుడు బాగుగా ఆతిథ్యాన్ని పొంది వారిని కథలచే ఆనందింపచేసేరు. తరువాత ఆ ఋషులు ఏకాగ్రచిత్తులై విధిననుసరించి సంధ్యోపాసన చేసేరు.

ఆ ఆశ్రమవాసులైన సువ్రతులైన మునులు రామలక్ష్మణ విశ్వామిత్రులను తమతోపాటు కామాశ్రమంలోనికి తీసుకు వెళ్ళేరు. రామాదులు అచట సుఖంగా నివశించేరు.

కథాభిరభిరామాభిరభిరామౌ నృపాత్మజౌ
రమయామాస ధర్మాత్మా కౌశికో మునిపఙ్గవః॥ ౨౨

ధర్మాత్ముడు మునిపుంగవుడు అయిన విశ్వామిత్రుడు మనోహరులైన రాజకుమారులను మనస్సును ఆకట్టుకొనే కథలతో ఆనందింపచేసేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్వవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రయోవింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ చతుర్వింశః సర్గః॥

(విశ్వామిత్రుడు మలద-కరూష-తాటక వనములనుగూర్చి రామునకు చెప్పి తాటకవధకు రాముని ప్రేరేపించుట)

తతః ప్రభాతే విమలే కృతాహ్నిక మరిన్దమౌ।
విశ్వామిత్రం పురస్కృత్య నద్యాస్తీరముపాగతౌ॥ ౧

తరువాత శత్రుసంహారకులైన రామలక్ష్మణులు స్వచ్ఛమైన ప్రాతఃకాలమునందు దంతధావనాదులనుండి సంధ్యావందన అగ్నిహోత్రాదులవరకు నిత్యకర్మలను పూర్తిచేసుకొని విశ్వామిత్రుని ముందుంచుకొని గంగానదియొక్క తీరమును చేరేరు.

ఇక్కడ వాల్మీకిమహర్షి **'విమలే ప్రభాతే'** అని చెప్పేరు. స్వచ్ఛత దేనిది? శౌచ అశౌచాలు కాలమునందు ఉండవు. అవి మనస్సుకు సంబంధించినవి. నిత్యప్రళయము (నిద్ర) నందు అంతవరకూ ఉన్న సంసారం నేనుతో సహా అంతరించింది. మేల్కొను సమయమునందు 'నేను'ని నెత్తిన పెట్టుకొని లేస్తాడు. ఆ నేనుకి గతాన్ని కట్టే ప్రయత్నం మెలకువతోనే ప్రారంభం అవుతుంది. ఆకారణంగానే ప్రభాతవేళ మనస్సులో పూర్తిస్థాయి సంసారం ఉండదు. కావున మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. కాబట్టి కాలం స్వచ్ఛంగా ఉంటుంది. అందుకనే దైవీసంపదను పెంపొందించుకొనే పనులు ఈ సమయంలోనే చెయ్యాలి అని పెద్దలు నిర్ణయించేరు.

మొదటిరాత్రి సరయూనది తీరంలో గడిచింది. ఇది రెండవరాత్రి. సరయూ గంగానదుల సంగమస్థానంలో ఉన్నారు. రెండవ రోజునుండి విశ్వామిత్రుడు నిద్రలేపడు. వీరే సకాలమునకు నిద్రలేచి విధ్యుక్తములను ఆచరించి సిద్ధంగా ఉంటారు. ఉత్తమ శిష్యునకు ఒక్కసారి చెప్తేసరి.

తీవ్రతపశ్చర్యకల మహాత్ములైన ఆ మునులందరూ శుభకరమైన నావను తీసుకొనివచ్చి తరువాత విశ్వామిత్రునితో - నీవు రాజపుత్రులను వెంటపెట్టుకొని నావను ఎక్కి, ఏవిధమైన కష్టమును పొందకుండా ఆలస్యంకాకుండా ప్రయాణించమని చెప్పేరు.

విశ్వామిత్రుడు అటులనే అని పలికి ఆ ఋషులను పూజించి రామలక్ష్మణులను కూడి సముద్రగామిని అయిన నదిని దాటుతున్నారు. జలమధ్యమును పొందేరు. రాముడు లక్ష్మణుడు అతివేగంచే వృద్ధి పొందింపబడిన శబ్దాన్ని విన్నారు. విని...,

విశ్వామిత్రునితో రాముడు నీరు భేదింపబడుచున్నట్లు వచ్చుచున్న ఈ వ్యాకులమైన ధ్వని ఏమిటి అని అడిగేడు.

కుతూహలంతోకూడిన రాముని మాటలు విన్నారు. విని, ఆ ధర్మాత్ముడు ఆశబ్దానికి కారణాన్ని చెప్తున్నారు.

ఓరామా! బ్రహ్మచేత కైలాసపర్వతంపై ఒక సరస్సు నిర్మింపబడింది. మనస్సుచే నిర్మింపబడుటచే ఈ సరస్సు మానసం. ఆ మానససరస్సునుండి ప్రవహించిన నది ఆయోధ్యాపట్టణాన్ని చుట్టుకొని ఉంది. బ్రహ్మయొక్క సరస్సునుండి ప్రవహించుటచే పుణ్యమైన ఆ నది సరయూ అను పేరుకలదైంది. ఆ నది గంగలో ప్రవేశించుచున్నది. ఈ రణకోలాహలంవంటి గొప్పధ్వని ఆ నదియొక్క జలసంక్షోభంవల్ల కలిగింది.

ఓరామా! ఈ సంగమస్థలికి శ్రద్ధకలిగి నమస్కరించు.

ఆ రామలక్ష్మణులు ఆ నదులకు నమస్కరించేరు. గంగానది దక్షిణతీరంచేరి శీఘ్రగమనంతో ప్రయాణం చేసేరు.

దశరథకుమారుడైన రాముడు భయంకరమైనదీ నర సంచారం లేనిదైన అరణ్యమును చూచి మునిపుంగవుడైన విశ్వామిత్రుని ప్రశ్నించేరు. ఈ అడవి ప్రవేశింప శక్యంకాకుండా ఉంది. ఝిల్లికాగణనాదంతో (కీచురాళ్ళ ధ్వనితో) నిండి ఉంది. భయంకర మైన అడవికుక్కలతోనూ లేదా ఏదుపందులతోనూ భయంకరమైన కూతలుగల పక్షులతోనూ ఏనుగులతోనూ ప్రకాశిస్తోంది. చంద్ర ఇనుమద్ది ఏరుమద్ది మారేడు తుమ్మి రేగువంటి చెట్లతో దట్టంగా ఉ ంది. ఈ దారుణమైన వనము ఏంటి? అని అడిగేడు.

మహాతేజస్సుగల విశ్వామిత్రుడు వత్సా రామా! ఈ దారుణమైన అడవి ఎవరిదో చెప్తాను విను. ఓనరశ్రేష్ఠా! పూర్వం దేవతలచే నిర్మితములైన

మలదము కరూశము అను విశాలమైన దేశములు ఈ ప్రాంతములో ఉండేవి. రామా! పూర్వం వృత్రాసుర సంహారంచేసిన ఇంద్రుని బ్రహ్మహత్యా పాపం చుట్టుకొంది. అప్పుడు అశుచిత్వం, ఆకలి ఇంద్రుని పీడించడం మొదలు పెట్టేయి. దేవతలు ఋషులు అఘమర్షణ మంత్రాలతో కలశోదకములచేత స్నానం చేయించి ఇంద్రుని అశుచిత్వాన్ని తొలగించేరు. మహేంద్రుడు తన శరీరంనుండి పుట్టిన మలమును ఆకలిని ఈ భూమికి ఇచ్చి ఆనందాన్ని పొందేడు.

ఈ ప్రదేశంలో తను శరీరశుద్ధిని పొంది ఆకలినుండి విముక్తుడైయ్యేడు. దాని నిమిత్తంగా ఆప్రదేశానికి వరమును ఇచ్చేడు. ఈ ప్రదేశం నా శారీరక మలమును గ్రహించిన కారణంగా మలదమని, ఆకలిని గ్రహించిన కారణంగా కరూశమని ప్రఖ్యాతినిపొంది సర్వసమృద్ధాలు అవుతాయి. అని వరాన్ని ఇచ్చేడు. దేవతలు సాధువాచనాల్ని పలికేరు.

ఓశత్రుసంహారకుడా! విశాలమైన ఈ మలద కరూశ దేశాలు చాలాకాలం ధనధాన్యాలతో అనందంగా ఉన్నాయి.

తాటకానామ భద్రం తే భార్యాసున్దస్య ధీమతః।
మారీచో రాక్షసః పుత్రో యస్యాః శక్రపరాక్రమః॥ ౨౬

తరువాత కొంతకాలానికి కామరూపిణి అయిన వేయి ఏనుగుల బలం కలది, ధీమంతుడైన సుందునకు భార్య, ఇంద్రునివంటి పరాక్రమంకల మారీచుడను రాక్షసునకు తల్లి అయిన తాటక అను యక్షిణి వచ్చింది. రామా! నీకు క్షేమం అగుగాక! అంటే అది ఇప్పుడూ ఉంది. భయపడకు నీకు క్షేమమగును. అని.

మారీచుని బాహువులు వర్తులాకారంగా ఉన్నాయి. బాగా బలిసి ఉన్నాయి. వీడు గొప్పపరాక్రం కలవాడు. చాలా ఎత్తైనవాడు. భయాన్ని కలిగించు ఆకారం కలవాడు. ఈ రాక్షసుడు ఎప్పుడూ ప్రజల్ని భయపెడుతూ ఉంటాడు.

రామా! ఈ తాటక దుష్టచారిణి. మలదము కరూశము అను దేశాలను నశింపచేయుచున్నది. తాటక మార్గమును అడ్డగించి ఒకటిన్నర యోజనముల దూరమున నివశిస్తోంది. ఇది తాటకవనం కావున ఈ వనంలోకి ఎవ్వరూ వెళ్ళరు.

స్వబాహుబల మాశ్రిత్య జహీయం దుష్టచారిణీమ్।

నీ బాహుబలముచేత ఈ దుష్టచారిణి అయిన తాటకను చంపు. రామా! నా ఆజ్ఞను పాలించి ఈదేశాన్ని తిరిగి నిష్కంటకం చెయ్యి. ఇక్కడ విశ్వామిత్రుడు రాముని ధనుర్విద్యా నైపుణ్యాన్ని చూడాలని ద్వంద్వయుద్ధాన్ని చేయమన్నారు. ఎందుకంటే ఆ ధనుర్ధరుని సామార్థ్యాన్ని చూసి తన అస్త్రసంపదను ధారపోయాలి. (పాశుపతాన్ని అనుగ్రహించేముందు అర్జునుడిని పరమేశ్వరుడు ఈ విధంగానే పరీక్షించేడు. అసమర్థులకు అస్త్రదానంకూడదు)

ఓరామా! ఘోరమైన ఎదిరింప శక్యంకాని యక్షిణిచేత నాశనం చేయబడిన ఈ దేశాన్నిగూర్చి ఎవడు వచ్చుటకు సాహసిస్తాడు.

ఏతత్తే సర్వమాఖ్యాతం యథైతద్దారుణం వనమ్।
యక్ష్యా చోత్సాదితం సర్వమద్యాపి న నివర్తతే॥ ३२

ఈ వనం అంతయు దారుణంగా యక్షిణిచే ఏవిధంగా పాడుచేయబడినదో ఇప్పటికీ ఈవనాన్ని ఏవిధంగా విడిచిపోకుండా ఉందో అంతా నీకు చెప్పేను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుర్వింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ పఞ్చవింశః సర్గః॥

(విశ్వామిత్రుడు రామునకు తాటకా వృత్తాంతమును చెప్పి ఆమెను సంహరింపుమని చెప్పుట)

అథ తస్యాప్రమేయస్య మునేర్వచన ముత్తమమ్।
శ్రుత్వా పురుషశార్దూలః ప్రత్యువాచ శుభాం గిరమ్॥ ౧

ఊహకందని సామర్థ్యంగల విశ్వామిత్రునియొక్క ఉత్తమమైన మాటలను విని పురుషశ్రేష్ఠుడైన రాముడు శుభమైన వాక్కును తిరిగి పలికేడు.

మునిపుంగవా! యక్షులు అల్పవీర్యంకలవారని చెప్తూ ఉంటారు. అటువంటిది ఒక స్త్రీ వేయి ఏనుగుల బలంకలది ఎలా అయింది. అంటే

విశ్వామిత్రుడు చెప్తున్నాడు. ఆ అబల ఏకారణంగా బలవంతురాలో విను. ఆమె వరదానంచే లభించిన బలపరాక్రమాలు కలది.

సుకేతు అను మహాపరాక్రమవంతుడైన గొప్ప యక్షుడు. ఇతడు సంతానం లేనివాడగుటచే సదాచారవంతుడై గొప్ప తపస్సుచేసేడు.

ఓరామా! అప్పుడు బ్రహ్మ సంతోషించి ఆ యక్షరాజునకు తాటక అను ప్రసిద్ధికల కన్యారత్నాన్ని ఇచ్చేరు.

బ్రహ్మ ఈమెకు సహస్ర నాగముల బలం ఇచ్చేడు. కానీ సుకేతువునకు పుత్రుని మాత్రం ఇవ్వలేదు.

నాగసహస్రబలంతో పుట్టిన తాటక పెరిగి రూప యౌవనాలతో ప్రకాశిస్తోంది. తండ్రి అయిన సుకేతువు ఈమెను ఝరుని పుత్రుడైన సుందునికి ఇచ్చి వివాహం చేసేడు. కొంతకాలానికి తాటక మారీచుడను బలవంతుడు ఎదిరింపశక్యంకానివాడైన పుత్రునకు జన్మనిచ్చింది.

సున్దేతు నిహతే రామ సాగస్త్యమృషి సత్తమమ్।

'అశస్త్ర విహితో వధః' అన్నది ఒకటి ఉంది కదా!

నాగసహస్ర బలంకలిగి రూపయౌవనములచే మదించి ఉన్న తాటకను అగస్త్యమహర్షి చంపలేదు. భర్తృవియోగరూపమైన శిక్షనువేసేరు. **'పృథక్శయ్యా చ నారీణాం అశస్త్ర విహితో వధః'** యౌవనదశలో భర్తృవియోగం మరణమే. ఆవిధంగా అగస్త్యుడు తాటకను చచ్చినదానిగా చేసేరు.

రామా! ఋషిశ్రేష్ఠుడైన అగస్త్యుడు సుందుని శపించి చంపేరు. ఆ తాటక పుత్రుడైన మారీచునితోకూడి అగస్త్యుని ఎదిరించుటకు ప్రయత్నించింది.
తనపైకి వస్తూన్న తాటకా మారీచులను చూసేరు. రాక్షసత్వాన్ని పొందమని మారీచుని శపించేరు.
పరమక్రుద్ధుడైన అగస్త్యుడు తాటకనుకూడా ఈ రూపాన్ని విడిచి నరమాంసం భక్షిస్తూ వికృతమైన ముఖము, రూపముకలిగి మహాయక్షిణివై ఉండమని దారుణంమైన శపాన్ని ఇచ్చేరు.
ఆలా శపించిన అగస్త్యుని పై కోపంకలదై తాటక అగస్త్యుడు సంచరించిన శుభప్రదమైన దేశమును నశింపచేస్తోంది.

ఏనాం రాఘవ దుర్వృత్తాం యక్షీం పరమదారుణామ్।
గోబ్రాహ్మణ హితార్థాయ జహిదుష్ట పరాక్రమామ్॥

ఓరామా! చెడుప్రవర్తనకల, పరమదారుణమైన, తన పరాక్రమాన్ని చెడుకు ఉపయోగించునదైన ఈ యక్షిణిని గోబ్రాహ్మణుల హితముకొరకు చంపు. ఈతాటక రూపయౌవన బలగర్వంచే దుష్టచారిణి. ఈమె వావివరుసలు లేక చరించునట్టిది. చెడుప్రవర్తనకలిగి పరమదారుణమైన గోబ్రాహ్మణ వధను చేస్తోంది. **'నజాతు బ్రాహ్మణం హన్యాత్సర్వపాపేష్వవస్థితమ్'** అని ఎన్నో పాపాలు చేసినా బ్రాహ్మణవధ కూడదని ఇతర స్మృతులు చెప్తున్నాయి. ఎందుకంటే వీడు విజ్ఞానవేత్త. ఈ విద్యా జ్ఞానములు సమాజంకొరకైన ధనం. ప్రాయశ్చిత్తాదులవలన శుద్ధుడైతే బ్రాహ్మణుని ధనము విద్యా తిరిగి సమాజానికి ఉపకరిస్తాయి. **ధనవంతుణ్ణి తయారు చేయటం సులభం. జ్ఞానిని తయారుచేయుట చాల కష్టం.** కనుక జ్ఞానుల (బ్రాహ్మణుల)యొక్క విషయంలో వధను నిషేధించాయి.

అజ్ఞాని దోషియై వాడి విజ్ఞానం ఏవిధంగాను సమాజమునకు ఉపకరించుట లేదని నిర్ణయింపబడితే వాడూ వధార్హుడే అని రామాయణ భారత భాగవతాదులలోని కొన్ని వృత్తాంతాలు చెప్తున్నాయి. ఇది విశేషాంశం. కావున స్వైరిణి బ్రహ్మహత్యాది మహాపాతకములచేకూడి లోకవినాశకారియైన తాటక చంపతగినదే.

గోబ్రాహ్మణుల హితంకొరకు చంపు అంటున్నారు. ఎందుకు - వీరు రక్షింపబడితే లోకం రక్షింపబడుతుంది.

గోబ్రాహ్మణులు లోకహితంకొరకు ప్రవర్తించువారు.

తాటక లోకహితైషులైన గోబ్రాహ్మణులను హింసిస్తోంది. ఆకారణంగా లోకకంటకురాలైంది. ఇప్పుడు ఇది చస్తే లోకం కల్యాణాన్ని పొందుతుంది. ఓరఘునందనా! శపింపబడిన ఈమెను చంపుటకు నీవు తప్ప లోకత్రయమందలి మరోపురుషుడు ఎవడూ సమర్థుడుకాడు.

ఓ నరోత్తమా! స్త్రీవధనుగూర్చిన జాలి అనవసరం.

క్షత్రియపుత్రులచే నాలుగువర్ణముల (బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్ర) హితంకొరకు అది ఏపనైనా చేయతగినదే.

నృశంశ మనృశంసం వా ప్రజారక్షణ కారణాత్।
పాతకం వాసదోషం వా కర్తవ్యం రక్షతా సతా॥ ౧౭

సుక్షత్రియునిచే ప్రజారక్షణకొరకైన కార్యం క్రూరమైనదైనా కాకపోయినా, పాపకర్మఅయినా దోషముతోకూడినదైననూ చేయతగినదే.

రాజ్యభార నియుక్తానామేష ధర్మస్సనాతనః।
అధర్మ్యాం జహి కాకుత్థ్స ధర్మోహ్యస్యా నవిద్యతే॥

ఇది రాజ్యపాలనభారమును వహించు వారలకు విధి. అధర్మంకల తాటకను చంపు. ఈమెయందు ధర్మమే లేదు.

రామునకు ధర్మసూక్ష్మములను మహర్షి చెప్తున్నారు.

స్త్రీవధకూడదను సామాన్యధర్మం రామునకు తెలుసు. దాని నిషేధరూపమైన వాక్యాలను పరిచయం చేస్తున్నారు. నాయనా! దేశరక్షణ ప్రథమ కర్తవ్యం. దానివిషయంలో యుక్తాయుక్తాలు పాపపుణ్యాల విచారంలేదు. ఏకార్యమైనా చేయవలసిందే. అదే రాజధర్మం.

దేశక్షేమానికి విఘాతం కలిగించు తాటక విషయంకూడా ఇటువంటిదే. దీనియందు పాపకర్మ ప్రసక్తిలేదు. ఒకవేళ పాపమే అయినా నీవు చేయవలసినదే. చేయనిచో ధర్మాతిక్రమణ దోషంవస్తుంది. ఈదోషం తాటకవధ రూపంగా సంక్రమించు దోషంకన్నా చాలా పెద్దది.

స్త్రీవధ బ్రాహ్మణవధ నిషేధం అన్నది సామాన్యం.
అది విశేషంచే బాధింపబడుతుంది. అది చూపిస్తున్నారు.

పృథివీం హన్తుమిచ్ఛన్తీం మంథరామభ్య సూదయత్

పూర్వం పృథివిని చంపగోరిన విరోచనపుత్రియైన మంథరను దేవేంద్రుడు సంహరించేడు.

ఓరామా! పూర్వం లోకంలో ఇంద్రుడు ఉండకోడదను కోరికతో తీవ్రవ్రతమును ఆచరిస్తూన్న శుక్రాచార్యుని తల్లియైన భృగుపత్నిని విష్ణువు చంపేడు.

ఇక్కడ పై రెండు సందర్భాలలోనూ వారు శాపరూపంగా పాపఫలాన్ని అనుభవించేరు. అది పాపమైనప్పటికీ దేశక్షేమంకొరకు సమాజశ్రేయస్సు కొరకు ఆచరించేరు.

ఏతైశ్చాన్యైశ్చ బహుభీ రాజపుత్ర మహాత్మభిః।
అధర్మ సహితా నార్యో హతాః పురుషసత్తమైః॥

ఓరాజపుత్రా! మహాత్ములైన వీరిచేతను ఇతరులైన పురుష శ్రేష్ఠులచేతను ఇంకా అనేకులచే అధర్మసహితులగు స్త్రీలు చంపబడ్డారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్వ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చవింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ షడ్వింశ స్సర్గః॥

(రాముడు తాటకను సంహరించుట)

మునేర్వచనమక్లీబం శ్రుత్వా నరవరాత్మజః।
రాఘవః ప్రాఞ్జలిర్భూత్వా ప్రత్యువాచ దృఢవ్రతః॥ ౧

పితృవాక్యపాలన ఇత్యాది దృఢవ్రతుడు దశరథకుమారుడైన రాముడు శాసనరూపమైన మునివాక్యమును విని అంజలిబద్ధుడై మాట్లాడుతున్నాడు. నాతండ్రియొక్క ఆజ్ఞ, ఆయన మాటయందు నాకున్న గౌరవంవల్ల, కౌశికవాక్యం అనే కారణంవల్ల అంటే గురువాక్యం అను కారణంవలన తాటకవధ రూపమైన ఈకార్యం నిస్సందేహంగా నాకు కర్తవ్యం.

నేను అయోధ్యలో వసిష్ఠాదిమహర్షులమధ్య తండ్రియైన దశరథునిచేత విశ్వామిత్రుని వాక్యం ఉల్లంఘింపరాదని ఆజ్ఞాపింపబడ్డాను.

నాతండ్రియొక్క మాటవలన, వేదాధ్యయన సంపన్నుడవైన నీయొక్క ఆజ్ఞవలన నేను గొప్పదైన తాటకవధను తప్పకచేస్తాను.

గోబ్రాహ్మణ హితార్థాయ దేశస్యాస్య సుఖాయచ।
తవచైవాప్రమేయస్య వచనం కర్తుముద్యతః॥ ౫

గోబ్రాహ్మణ హితంకొరకు ఈదేశంయొక్క సుఖంకొరకు అప్రమేయుడవైన నీఆజ్ఞను చేయుటకు సిద్ధంగా ఉన్నాను. రాజుగా గోబ్రాహ్మణ హితంకొరకు ఎలాగూ ఈ తాటక వధరూపకర్మ చెయ్యతగినది. అదే గురువైన మీ ఆజ్ఞకూడా అగుటంజేసి దానిని పాటించుటకు ఉద్యుక్తుడను అవుతున్నాను. అని–

అరిందముడైన రాముడు ధనుస్సుయొక్క మధ్యభాగమునందు పిడికిలి బిగించి తీవ్రమైన శబ్దముచేత దిక్కులు పిక్కటిల్లునట్లు నారిసారించి టంకారధ్వని చేసేడు.

ఆధ్వనిచేత తాటకవనంలో నివసించు సర్వప్రాణులు భయపడిపోయేయి. తాటకకూడా ఆశబ్దానికి దిగ్భ్రాంతిచెంది విపరీతమైన కోపాన్ని పొందింది. ఆరాక్షసి ఆ ధనుష్టంకారాన్ని విని కోపంచేత వళ్ళుతెలియనిదై ఆశబ్దం వచ్చిన దిశగా వేగంగా పరుగెత్తుకు వచ్చింది. వికారమైన ఆకారం. ఏవగింపు కలిగించే ముఖం. అతిభారీశరీరం.

రాముడు చూసాడు. లక్ష్మణునకు చూపెడుతున్నారు. లక్ష్మణా! ఈ యక్షిణియొక్క భీకరమైన దారుణమైన శరీరాన్నిచూడు. ఈమెను చూస్తేనే పిరికివాళ్ళ గుండెలు బ్రద్దలైపోతాయి.

మాయాబలంతోకూడిన ఎదిరింప శక్యంగాని ఈమెయొక్క ముక్కు చెవులు హరించివేస్తాను చూడు.

స్త్రీకనుక ఈమెను చంపే ప్రయత్నం చెయ్యట్లేదు. ఈమె పరాక్రమాన్ని గమనశక్తిని నాశనం చేద్దాం అనుకొంటున్నాను.

ఈవిధంగా రాముడు పలుకుచుండగనే తాటక కోపంచే వళ్ళుతెలియనిదై చేతులు చాచి రామునిగూర్చి పరిగెత్తసాగింది.

బ్రహ్మఋషి అయిన విశ్వామిత్రుడు హుంకారముచే తాటకను భయపెట్టి రామలక్ష్మణులకు క్షేమమగుగాక అని వారికొరకు జయమును పలికేరు.

ఆ తాటక భయంకరమగు పరాగమును చిమ్ముచూ ఆ రామలక్ష్మణులను క్షణకాలం పాటు మోహింపచేసింది. తన మాయా ప్రభావంచే వారిపై గొప్ప శిలావర్షమును కురిపించింది. రాముడు కోపాన్ని పొందేడు.

రాముడు ఆమెయొక్క గొప్పదైన శిలావృష్టిని బాణవర్షముచే త్రిప్పికొట్టేడు. **కరౌ చిచ్ఛేద పత్రిభిః** మీదికి వస్తూన్న తాటకయొక్క చేతులను శరములచే ఛేదించేడు. చేతులు తెగి అలసిపోయి సమీపమున గర్జిస్తూన్న తాటక ముక్కు చెవులు లక్ష్మణుడు ఛేదించేడు.

కామరూపిణి అయిన తాటక అనేక రూపాలను ధరిస్తూ భయంకరంగా రాళ్ళవర్షం కురిపిస్తూ సంచరిస్తోంది.

అన్ని దిక్కులనుండి రాళ్ళవర్షముచే కప్పబడుచున్న రామలక్ష్మణులను చూచిన విశ్వామిత్రుడు–

రామా! ఈమెపై చూపిన జాలిచాలు. ఈమె పాపాత్మురాలు. చెడుతిరుగుడు కలది. యజ్ఞములకు విఘ్నములను కలిగించునది అయిన ఈయక్షిణి మాయచే మరల వృద్ధి పొందగలదు. పునః సంధ్యాకాలం సమీపిస్తోంది. ఈలోపు ఈమెను చంపు. సంధ్యాకాలంలో రాక్షసులు ఎదిరింప శక్యంగాని వారు. అని పలికేరు.

రాముడు శబ్దవేధేత్వమున (శబ్దమును అనుసరించి లక్ష్యంపై బాణప్రయోగం చేయు విద్య) రాళ్ళవాన కురిపించుచున్న తాటకను అడ్డగించేడు.

మాయాబలం కలిగిన తాటక బాణములచే అడ్డుకోబడినదై గర్జింస్తూ రామలక్ష్మణులనుగూర్చి పరిగెత్తింది.

శరేణోరసి వివ్యాధ సా పపాత మమార చ।

పరాక్రమాన్ని చూపిస్తూ అశనిపాతంలా మీదపడుతూన్న ఆమెను రాముడు వక్షఃస్థలమందు కొట్టేడు. తాటక క్రిందపడి మరణించింది.

లోమభ్యః స్వాహేత్యేవం హి లోమప్రభృతి వైతనుమ్।
మజ్జాన్తాం జుహుయాద్వాపి మన్త్రైరేభిర్యథాక్రమమ్॥

తనకు తానుగా శరీరాంగములను హోమంచేసుకోవలసిన ప్రాయశ్చిత్తాన్ని స్మృతి చెప్పింది.

లోమాని మృత్యోర్జుహోమి లోమభిర్మృత్యుం వాశయ।
త్వచం మృత్యోర్జుహోమి త్వచామృత్యుం వాశయ।
లోహితం మృత్యోర్జుహోమి లోహితేన మృత్యుం వాశయ।

ఈవిధంగా లోమ త్వచ లోహిత మాంస మేదస్ స్నాయు అస్థి మజ్జలతో ఎనిమిది ఆహుతులు ఇచ్చి చివరగా శరీరాన్ని అగ్నిలో పడవేయాలి. యథేచ్ఛగా కామాన్ని అనుభవించినవానికి, బ్రహ్మహత్య చేసినవానికి ఇది ప్రాయశ్చితం. యాజ్ఞ్యవల్క్య వసిష్ఠాదులు చెప్పినది.

నేను చంపాలనుకోవడం లేదు. పవిత్రీకరించాలనుకొంటున్నాను. కనుకనే **కరౌ చిచ్ఛేద పత్రిభిః** దర్భలు ఏవిధంగా కరములను చీలుస్తాయో– ఆవిధంగా ముందు కరములను ఛేదించి పవిత్రీకరణను ప్రారంభించేరు.

తాటకకు ఇటువంటి ప్రాయశ్చితరూపమైన బుద్ధి ఎప్పటికీ రాదు. కావున పరమకారుణ్యంతో రామలక్ష్మణులు యుద్ధాన్నికూడ యజ్ఞంలా చేస్తున్నారు.

దేవేంద్రుడు ఇతర దేవతలు భయాన్నికలిగించు తాటకయొక్క మరణాన్ని చూచి సాధువచనాల్ని పలికేరు. రాముని బాగుగా పూజించేరు.

సహస్రాక్షుడు, దేవతలందరూ సంతోషించినవారై విశ్వామిత్రునిగూర్చి పలుకుతున్నారు.

ఓవిశ్వామిత్రమహర్షి! నీకు భద్రమగుగాక! ఈ కర్మచేత ఇంద్రునిచేకూడిన సమస్త దేవతాగణము సంతోషించేరు. రాముని విషయమున స్నేహాన్నిచూపు. ఓబ్రాహ్మణుడా! సత్యపరాక్రమం కలవి **తపోబలభృతాన్ రాఘవాయ నివేదయామి** తపోబలంచే పోషింపబడిన ప్రజాపతియైన భృశాశ్వునియొక్క పుత్రులైన అస్త్రములను రామునకు ఇమ్ము.

హేబ్రహ్మన్! నిన్ను స్థిరంగా అనుగమించి వచ్చుచున్న రాముడు నీకు సత్పాత్రమైనవాడు. ఈ రాజకుమారునిచే గొప్ప దేవకార్యం జరుగవలసి ఉన్నది.

ఈవిధంగా పలికి దేవతలందరూ సంతోషించినవారై విశ్వామిత్రుని పూజించి ఎలావచ్చేరో అలా వెళ్ళేరు.

సాయం సంధ్యాసమయం అయ్యింది.

తాటక సంహారంతో సంతోషించిన విశ్వామిత్రుడు రాముని మూర్ధ్నిస్థానాన్ని ఆఘ్రాణించేరు. (దీనివల్ల ఆయుర్వృద్ధి అని పెద్దలమాట) ఆనందంతో మాట్లాడుతున్నారు.

శుభదర్శనుడవైన ఓరామా! ఈరాత్రి ఇక్కడే ఉండి, రేపు ప్రభాతవేళ నా ఆశ్రమానికి వెళ్దాము.

విశ్వామిత్రుని మాటలు విన్న రాముడు సంతోషంతో ఆరాత్రి తాటకవనంలోనే నివసించేరు.

ఆవనంకూడా ఆ దినమందే శాపమునుండి ముక్తినిపొంది చైత్రరథం అను వనం ఎట్లో ఆవిధంగా రమణీయంగా ప్రకాశించింది. (ఈ చైత్రరథం కుబేరుని ఉద్యానవనం)

నిహత్య తాం యక్షసుతాం స రామః
ప్రశస్యమానః సురసిద్ధసంఘైః
ఉవాస తస్మిన్మునినా సహైవ
ప్రభాతవేలాం ప్రతిబోధ్యమానః॥ ౩౬

రాముడు ఆ యక్షసుత అయిన తాటకను చంపి సురసిద్ధ సంఘములచే

ప్రశంసింపబడుచున్నవాడై విశ్వామిత్రునితో సహా ఆ వనమందే ప్రభాతవేళలో మేల్కొలుపబడుచున్నవాడై నివసించెను. అంటే ప్రభాతకాలం ముగ్గుర్నీ మేల్కొలిపింది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షడ్వింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తవింశ స్సర్గః॥

(విశ్వామిత్ర మహర్షి రామునకు దివ్యాస్త్రములను ఉపదేశించుట)

అథ తాం రజనీముష్య విశ్వామిత్రో మహాయశాః।
ప్రహస్య రాఘవం వాక్యమువాచ మధురాక్షరమ్॥ ౧

గొప్పకీర్తిగల విశ్వామిత్రుడు ఆరాత్రి తాటకవనమందు ఉండి మరునాడు స్మితవదనుడై రామునిగూర్చి మధురంగా మాట్లాడుతున్నాడు.

గొప్పకీర్తిగల ఓరాకుమారా! నేను చాలా సంతోషించేను. నీకు భద్రమగుగాక! పరమప్రీతితో అస్త్రములను నీకు పూర్తిగా ఇస్తాను.

దేవాసురగణాన్వాపి సగన్ధర్వోరగానపి।
యైరమిత్రాన్ ప్రసహ్యాజౌ వశీకృత్య జయిష్యసి॥ ౩

ఏ అస్త్రములచేత దేవాసుర గణాల్ని, గంధర్వులతోకూడిన ఉరగులను, శత్రువులను యుద్ధమునందు వేటి సహాయంతో బలాత్కారంగా వశంచేసుకొని జయింపగలవో అట్టి దివ్యాస్త్రములను పూర్తిగా ఇస్తాను. నీకు క్షేమ మగుగాక! ఇవి అభిచారప్రయోగ లక్షణంకల అస్త్రములు. పరులను తిరస్కరించుట కొరకైన మంత్రరూపమైన అస్త్రములు. ఇది అధర్వణ వేదవిహితమైన మంత్రభాగం.

యే అంగిరస స్సరసః। యే అధర్వణా స్తద్భేషజం।
యద్భేషజం తదమృతం। యదమృతం తద్బ్రహ్మ॥

అధర్వ వేదంలో అంగిరశ్శబ్ద వాచ్యమైనభాగం సారము. అధర్వవాచ్యములైన భాగం భేషజం. ఈ భేషజమే అమృతం. ఈ అంగిరశ్శబ్దవాచ్యమైన భాగమునందు అభిచారసంబంధమైన శత్రుమారణాది కర్మలు మాత్రమే చెప్పబడినవి.

ఓరామా! గొప్పదైన దివ్యమైన **దండచక్రాన్ని కాలచక్రాన్ని విష్ణుచక్రమును** ఇస్తాను. అత్యుగ్రమైన **ఇంద్రాస్త్రము**ను **వజ్రాస్త్రము**ను, శివుని శ్రేష్ఠమైన **శూలాన్ని, బ్రహ్మశిరస్సు** అను అస్త్రమును **ఐషీకాస్త్రము**ను అత్యుత్తమమైన **బ్రహ్మాస్త్రము**ను ఇస్తాను.

నరశ్రేష్ఠుడవైన ఓరామా! బాగుగా ప్రకాశిస్తూన్న **మోదకి శిఖరి** అను రెండు గదలను ఇస్తాను.

రామా! **ధర్మపాశం కాలపాశం వారుణపాశం** అత్యుత్తమమైన **వారుణాస్త్రము**లను ఇస్తాను.

శుష్కము ఆర్ద్రము అను రెండు పిడుగులను, **పైనాకము**ను **నారాయణాస్త్రము**ను ఇస్తాను.

అనఘాత్ముడా! **శిఖరమను** పేరుకల అగ్నికి ఇష్టమైన **ఆగ్నేయాస్త్రమును ప్రథనమను పేరుకల వాయవ్యాస్త్ర**మును ఇస్తాను.

రామా! **హయశిరస్సు** అను అస్త్రమును, **క్రౌంచాస్త్రము**ను **రెండు శక్తులను** నీకు ఇస్తాను.

రాక్షసులు ధరించు **కంకాళం** అను రోకలిని, **కపాలం కంకణం** అను ముసలములను నీకు ఇస్తాను.

ఓ మహాబాహో! రాజకుమారా! **వైద్యాధరము** అను మహాస్త్రమును, **నందక**మను శ్రేష్ఠమైన ఖడ్గమును నీకు ఇస్తాను.

రాఘవా! నిద్రను కలిగించునది, నిద్రను పోగొట్టునది అయిన **గంధర్వాస్త్రాన్ని మానవాస్త్రము**ను **సౌరాస్త్రమ**ను ఇస్తాను.

నరశ్రేష్ఠుడవైన ఓరామా! గర్వమును కలుగచేయు **దర్పణాస్త్రము**ను, ఎండింపచేయు **శోషణాస్త్రము**ను తాపాన్నికలిగించు **సంతాపాస్త్రము**ను, విలాపమును కలిగించు **విలాపనాస్త్రము**ను ఎదిరింపశక్యముకాని మన్మథునకు ఇష్టమైన **మదనాస్త్రం**, మోహనం అను పేరుకల పిశాచములకు ఇష్టమైన **పైశాచకం** అను అస్త్రమును తీసుకో.

ఓనరశ్రేష్ఠుడా। **తామసాస్త్రం సౌమనాస్త్రం సంవర్ధాస్త్రం మౌసలాస్త్రం సత్యాస్త్రం మయాధరాస్త్రం** పరుల తేజస్సును లాగివేయు **తేజఃప్రభ** అను అస్త్రం శిశిరం అను పేరుగల **సౌమ్యాస్త్రం, సుధామనం** అను పేరుగల త్వష్టయొక్క అస్త్రం, భగునియొక్క భయంకరమైన **శితేష్వస్త్రం** మరియు **మానవాస్త్రము**ను గ్రహించు. (ఇవి అభిచారక కర్మకొరకైన ఏబది అస్త్రములు)

ఓమహాబాహో! రాజకుమారా!రామా! కోరినరూపములను ధరించు మహాబలముగల చాలాగొప్పవైన అస్త్రములను శీఘ్రముగా తీసుకో. అని

స్థితస్తు ప్రాఙ్ముఖో భూత్వా శుచిర్మునివర స్తదా।
దదౌ రామాయ సుప్రీతో మంత్రగ్రామ మనుత్తమమ్॥

మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు పరమప్రీతితో శుచియై తాను తూర్పువైపు ముఖముకలవాడై రామునకు పరమోత్తమమైన మంత్రగ్రామమును ఇచ్చేరు. ఈ అస్త్రములు అథర్వణవేద మంత్రములు అగుటచే వీటికి సిద్ధమంత్రములని పేరు. వీటి ఉపదేశమునకు జపమునకు తిథి నక్షత్ర గ్రహ చంద్రబలాలతో నిమిత్తం లేకయే చెయ్యచ్చు.

న తిథి ర్నచ నక్షత్రం నగ్రహో న చ చంద్రమాః।
అథర్వమంత్ర సంప్రాప్త్యా సర్వసిద్ధిర్భవిష్యతి॥

ఇక్కడ రాముడూ 'దేవముఖావై ప్రాచీ' అని విశ్వామిత్రునకు అభిముఖంగా ఉండియే మంత్రములను గ్రహిస్తున్నాడు. **"దైవతం హి భవాన్ గురుః"** గురువే దైవమని ఇతఃపూర్వం చెప్పేరు. **'శ్రూయతామితి చామన్త్ర్య ప్రహృష్టో వాక్యమబ్రవీత్'** అని పూర్వం నారదమహర్షి ఉపదేశ సమయంలో వాల్మీకిని అభిముఖుని చేసుకొనే ఉపదేశించేరు.

ఏఅస్త్రములను ప్రయోగ ఉపసంహారరూపంగా స్వీకరించుట దేవతలకుకూడా దుర్లభమో అట్టి అస్త్రములను విశ్వామిత్రుడు రామునికొరకు ఇచ్చేరు.

ఏకాగ్రచిత్తులై ఆ విశ్వామిత్రుడు జపిస్తూంటే పూజనీయములైన ఆ అస్త్రములన్నీ రాముని సేవించాయి. పరమోదారులైన ఆ అస్త్రదేవతలు అందరూ అంజలి బద్ధులై రామా! మేము నీయొక్క కింకరులమని పలికేరు.

కింకరాస్తవ రాఘవ అంటున్నాయి. వారు దేవతా స్వరూపులు. పూజార్హత కలవారు. అయినా కింకరభావాన్ని రామునియందు పొందేరు. వారు ప్రయోగించమని అడుగుటయో, స్వబుద్ధిని ప్రదర్శించుటయో చెయ్యరు. యజమాని ఆజ్ఞకుబద్ధులై ప్రవర్తించు వారే. యజమానిచే విడువబడి జీవించలేరు. అందుకే విశ్వామిత్రుడు తనవంటి సామర్థ్యంగల ఉత్తముని చూచుకొని ఆ అస్త్రములను ఇచ్చేరు. ఇవి యజమానిచే విడువబడినా తిరిగి యజమానునే ఆశ్రయిస్తాయి.

లక్ష్యాన్ని నిర్దేశించి విడుబడిన రామబాణాలు లక్ష్యం ఛేదించి తిరిగి రాముని చేరేయి అని చెప్పుటలో రహస్యం ఇదే.

రాముడు అస్త్రములను స్వీకరించేడు. హస్తముతో కింకరులైన అస్త్రదేవతలను స్పృశించి మీరు నా మనస్సులో సంచరించువారుగా అగుదురు. అని వారిని ఆజ్ఞాపించేరు.

తతఃప్రీతమనా రామో విశ్వామిత్రం మహామునిమ్।
అభివాద్య మహాతేజా గమనాయోప చక్రమే॥

తరువాత తేజశ్శాలి అయిన రాముడు సంతోషాన్తరంగుడై విశ్వామిత్రునకు నమస్కరించి ప్రయాణం ప్రారంభించారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తవింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ అష్టావింశ స్సర్గః॥

(విశ్వామిత్రుడు రామునకు దివ్యాస్త్రములయొక్క ఉపసంహార మంత్రములను ఉపదేశించి మరికొన్ని అస్త్రములను ఇచ్చుట)

ప్రతిగృహ్య తతోఽస్త్రాణి ప్రహృష్ట వదనః శుచిః।
గచ్ఛన్నేవ చ కాకుత్స్థో విశ్వామిత్ర మథాబ్రవీత్॥ ౧

రాముడు పవిత్రుడై అస్త్రములను స్వీకరించి వికసితవదనుడై విశ్వామిత్రుని అనుసరిస్తూనే మాట్లాడుతున్నాడు.

భగవన్! అస్త్రములను గ్రహించిన నేను దేవతలకూ ఎదిరింప శక్యంగాని వానిగా ఉన్నాను. మునిపుంగవా! నాకు అస్త్రములయొక్క ఉపసంహారాన్ని తెలుపవలసినదని ప్రార్థించేడు. అంగీకరించిన విశ్వామిత్రుడు అస్త్రముల ఉపసంహారాన్నీ ఉపదేశించేరు.

రామా! భృశాశ్వుని కుమారులును కామరూపులు, ప్రకాశస్వరూపులు అయిన–

సత్యవంతం సత్యకీర్తి ధృష్టం రభసం ప్రతిహారతరము పరాఙ్ముఖం అవాఙ్ముఖం లక్షాక్షము విషమము దృఢనాభం సునాభం దశాక్షం శతవక్త్రము దశశీర్షము శతోదరము పద్మనాభము మహానాభము దుందునాభము జ్యోతిషము కృశనము నైరాశ్యము విమలము యోగంధరము హరిద్రము దైత్యము ప్రశమనము సార్చిమాలి ధృతి మాలి వృత్తిమంతము రుచిరము పితృసౌమనసము విధూతము మకరము కరవీరకము ధనము ధాన్యము కామరూపం కామరుచి మోహము ఆవరణము జృంభకము సర్వనాభము సంతానము వరణము అను అస్త్రములను స్వీకరించు నీకు క్షేమమగును. నీవు సత్పాత్రమైనవాడవు.

నక్షత్రకల్పో వైతాన స్తృతీయ స్సంహితావిధిః। తుర్య అంగిరసః కల్పః శాంతికల్పస్తు పఞ్చమః॥ మంత్రములకు శాంతిపౌష్టిక కర్మలయందు వినియోగం. ఈ విషయం కౌశికసూత్రములలో చెప్పేరు. సంహితావిధి అంటే కౌశికసూత్రము అనే అర్థం. ఇతర సూత్రములు అన్నింటికీ ఇదే అవష్టంభం. దీనిలో గ్రామ నగర దుర్గ రాష్ట్రాది లాభార్థమైన కర్మలు, పుత్ర ధన ధాన్య ప్రజా స్త్రీ మొదలగు సర్వసంపదలకూ సాధనములగు కర్మలు చెప్పబడ్డాయి.

ఇవి మానవులకు అపేక్షితములైన ఫలములకు సాధనములగు కర్మసంబంధమైన మన్త్ర సమూహం.

రాముడు సంతోషాంతరంగుడై అస్త్రములను గ్రహించేడు. ఆ అస్త్రదేవతలలో కొందరు దివ్యము(ప్రకాశవంతవమైన)లైన దేహంకలవారు. సుఖమును ఇచ్చువారు. కొందరు బొగ్గువలే ఉన్నారు. కొందరు చన్ద్రసమానులు, కొందరు సూర్యసమానులు. వీరందరూ వినయంతో అంజలిబద్ధులై ఓనరశ్రేష్ఠా! నీకొరకు మేము ఇక్కడ ఉన్నాము, మాకు కర్తవ్యాన్ని ఆజ్ఞాపించు. అని ప్రార్థించేరు.

రాముడు అస్త్రములతో నా మనస్సులో మెదులుచు అవసరార్థం నాకు సహాయ్యం చేయండని చెప్పి స్వేచ్ఛను ఇచ్చాడు. (ఇవి రజోగుణ ప్రవృద్ధములు. రజోగుణ ప్రవృద్ధులకు స్వేచ్ఛను ఇవ్వాలి. ఇస్తేనే రాజ్యసంబంధమైన వ్యవహారాలు వేగంగా నడుస్తాయి. ఈ స్వేచ్ఛకూడా త్రాడు మెడలో కట్టబడిన ఆవుయొక్క స్వేచ్ఛలా ఉండాలి. ఇక్కడా ఆ విధమైన స్వేచ్ఛనే రాముడు వారికి ఇచ్చినది.) అస్త్రదేవతలు అంగీకరించి రామునికి ప్రదక్షిణ నమస్కారములు చేసి వచ్చినట్లే వెళ్ళేరు.

రాముడు ఉపసంహార మన్త్రములను తెలుసుకొని నడుస్తూనే విశ్వామిత్రునితో మృదుమధురంగా మాట్లాడుతున్నాడు.

ఇటువైపు పర్వతసమీపమునందు మేఘముతో సమానమైనది అందమైనది మృగములతో వ్యాప్తమైనది మనోహరము ఆనందదాయకములైన అనేక రకములైన పక్షులయొక్క శ్రావ్యమైన ధ్వనులచే అలంకరింపబడిన వృక్షసముదాయము ప్రకాశించుచున్నది. ఈ ప్రదేశము ఏమి? నాకు తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది.

మునిశ్రేష్ఠుడా! ఈదేశము సుఖకరముగా ఉండుటచే భయమును కలిగించు అడవినుండి బయటకు వచ్చామని అనుకొనుచున్నాను. ఈ ఆశ్రమం ఎవరిది? భగవన్! నాకు వివరంగా చెప్పండి.

భగవన్ తస్య కో దేశః సాయత్ర తవ యాజ్ఞికీ।
రక్షితవ్యా క్రియా బ్రహ్మన్మయా వధ్యాశ్చ రాక్షసాః।
ఏతత్సర్వం మునిశ్రేష్ఠ శ్రోతుమిచ్ఛామ్యహం ప్రభో॥౨౨

ఓబ్రాహ్మణుడా! భగవన్! బ్రహ్మహత్య చేయువారు దుర్మార్గులు దుష్టస్వభావులు అగు పాపాత్ములు ఎక్కడికి వచ్చి నీ యజ్ఞమునకు విఘ్నం చేస్తున్నారు. నేను నీ యజ్ఞరూపమైన క్రియను రక్షింపవలసిన ప్రదేశం ఏది? రాక్షసులను ఎక్కడ వధించాలి. సమర్థుడవగు ఓమునిశ్రేష్ఠా! ఇది అంతయూ వినవలెనని కోరుచున్నాను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టావింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకోనత్రింశ స్సర్గః॥

(విశ్వామిత్రుడు సిద్ధాశ్రమాన్నిగూర్చి రామునకు చెప్పుట. రామలక్ష్మణులతో మహర్షి సిద్ధాశ్రమం ప్రవేశించుట)

అథ తస్యాప్రమేయస్య తద్వనం పరిసృచ్ఛతః।
విశ్వామిత్రో మహాతేజా వ్యాఖ్యాతు ముపచక్రమే॥ ౧

ఆ వనమునుగూర్చి ప్రశ్నించిన అప్రమేయుడైన రామునకు గొప్ప తేజస్సుకల విశ్వామిత్రుడు చెప్పుటకు ఉపక్రమించెను.

ఇహ రామ మహాబాహో విష్ణుర్దేవవరః ప్రభుః।

గొప్పబాహువులుకల రామా! ఇక్కడ దేవతలలో శ్రేష్ఠుడు సర్వశక్తిమంతుడు గొప్ప తపస్సుకలవాడూ అయిన విష్ణువు వందలకొలది యుగాలు తపస్సు చేయుటకై ఇక్కడ నివసించేడు.

ఏష పూర్వాశ్రమో రామ వామనస్య మహాత్మనః।
సిద్ధాశ్రమ ఇతిఖ్యాతః సిద్ధోహ్యత్ర మహాతపాః॥ ౩

రామా! ఇది మహాత్ముడైన వామనునియొక్క పూర్వాశ్రమం.
సిద్ధాశ్రమమని ప్రసిద్ధమైనది. ఎందుకంటే పూర్వం ఇక్కడ గొప్పతపస్సుకల కాశ్యపుడు సిద్ధిని పోందేడు.

ఏతస్మిన్నేవ కాలేతు రాజావైరోచనిర్బలిః

పైనచెప్పిన వామనుడు తపస్సుచేయుకాలంలో విరోచనుని కుమారుడైన బలి రాజ్యపాలన చేస్తున్నాడు. ఇంద్రమరుద్గణాలతోకూడిన దేవతలందర్నీ జయించి మూడులోకాలలో ప్రసిద్ధుడై రాజ్యాన్ని పాలిస్తున్నాడు.
ఇక్కడ విష్ణుశబ్దవాచ్యుడైనవాడు ఆదిత్యుడు. అదితి పుత్రుడు. **వామన** నామధేయుడు.

ఈ వామనుడు బలిని జయించుటచేత ఆ బలియొక్క అధికారం ఎంతమేర వ్యాపించి ఉందో అంతమేర ఈ వామనుడు వ్యాపించినట్లు అయ్యింది. అంటే లోకత్రయములను వ్యాపించినవాడు అయ్యేడు. ఏమీలేని వామనుడు బలిని జయించి లోకత్రయములకు వ్యాపించి వాటియందు అధికారం

కలవాడై విక్రమత్వాన్ని పొంది పాలించేడు. ఇలా తనఅధీనంలోకి వచ్చిన లోకత్రయాన్ని దేవతలకు స్వర్గాన్ని సుక్షత్రియులకు పృథివిని ఇచ్చి పాతాళ్ళాన్ని బలికే ఇచ్చేడు. లోకత్రయమందు విస్తరించిన కీర్తి అధికారం కలవాడు అగుటచే విష్ణువని పిలవబడ్డాడు.

బలేస్తు యజమానస్య దేవాః సాగ్నిపురోగమాః
సమాగమ్య స్వయంచైవ విష్ణు మూచురిహాశ్రమే॥౬

బలిచక్రవర్తియాగం చేయుచుండగా అగ్నిని ముందుంచుకొన్న దేవతలు ఈ ఆశ్రమమునందు విష్ణువును స్వయముగా సమీపించి పలుకుతున్నారు. ఎవడియందు వ్యాపకలక్షణం ఉంటుందో వాడు విష్ణువు. దేశకాలవస్తు పరిచ్ఛేద్యుడు కానివాడు ఒక్కడే ఉంటాడు. మిగిలిన వారందరూ దేశకాలవస్తు పరిచ్ఛిన్నులైనప్పటికీ విష్ణుశబ్దం చేతనే చెప్పబడ్డారు. కైలాసవాసి వైకుంఠవాసి సత్యలోకవాసి స్వర్గాధిపతి ఆదిత్యుడు వామనుడు ఇలా సర్వశ్రేష్ఠుల మొదలు **'నావిష్ణుః పృథీవీపతిః'** అని చెప్పబడు సామాన్యుని వరకు.

ఓవిష్ణు! విరోచనుని కుమారుడైన బలి గొప్పయజ్ఞాన్ని చేస్తున్నాడు. ఆ క్రతువు పూర్తికాకముందే మాకార్యాన్ని సాధించి పెట్టు.

అన్నివైపులనుండి యాచకులు ఇతడిని యాచిస్తున్నారు. అడిగినదే తడవుగా ఏది ఎక్కడ ఎలా ఉందో దానినంతను అలాగే ఇచ్చేస్తున్నాడు.

సత్వం సురహితార్థాయ మాయాయోగముపాగతః।
వామనత్వం గతో విష్ణో కురు కల్యాణముత్తమమ్॥

ఓవిష్ణు! అట్టి నీవు (సఃత్వం). ఈ విష్ణువు ఎటువంటివాడు. రజోగుణాధిక్యుడు కాదు. సత్త్వగుణప్రధానుడైన బ్రాహ్మణుడు. యాచకత్వం బ్రాహ్మణధర్మం. ప్రతిగ్రహణార్హతకల నీవు– దేవతల హితంకొరకు, మాయాసంబంధము పొందిన వాడవై వామనత్వం పొంది ఉత్తమమైన శుభములను చెయ్యి.

ఈ వామన జననం ఎలా జరిగిందంటే–

ఏతస్మిన్నన్తరే రామ కాశ్యపోఽగ్ని సమప్రభః।
అదిత్యా సహితో రామ దీప్యమాన ఇవౌజసా॥౧౦

దేవీసహాయో భగవాన్ దివ్యం వర్షసహస్రకమ్।
వ్రతం సమాప్య వరదం తుష్టావ మధుసూదనమ్॥

ఓరామా! అగ్నిథతో సమానమైన కాంతికలవాడు అదితితోకూడినవాడు ఓజస్సుచే ప్రకాశించువాడు, భగవానుడగు కాశ్యపుడు భార్యాసహితుడై వేయి దివ్యసంవత్సర ములు వ్రతమును పూర్తిచేసుకొని వరదరుడైన మధుసూదనుని స్తుతించెను.
ఇక్కడ ఓజస్సు అంటే ప్రాణముశక్తి. ఈ ప్రాణవిద్యచేత ప్రకాశించువాడు. వ్రతమనగా ఉపాసనారూపమైన కర్మ. ప్రాణోపాసనకాకుండా మరియొక ఉపాసన ఏదైననూ, తత్సంబంధమైన ఇంద్రియములు శ్రమచే అలసిపోవు చుండుటచే వ్రతపరిసమాప్తి సాధ్యపడుటలేదు. ప్రాణోపాసనయందు ప్రాణము ఆత్మరూపంగా దర్శింపబడుతుంది. వాగాది ఇంద్రియములు అగ్న్యాదిదేవతలు నాస్వరూపమే. సర్వమునకు చలనంకలిగించు ప్రాణరూపమైన ఆత్మను నేను అని ఈ వ్రతంలో దర్శిస్తారు. ఈ వ్రతఫలం ప్రాణదేవతతో ఐక్యమగుట అంటే హిణ్యగర్భుడిని పొందుతారు.
ఈ హిరణ్యగర్భుడే సగుణనిరాకార స్వరూపం. ఇతడే బ్రహ్మ విష్ణు రుద్రులుగా పిలవబడుతున్నాడు.

తపోమయం తపోరాశిం తపోమూర్తిం తపాత్మకమ్।
తపసా త్వాం సుతప్తేన పశ్యామి పురుషోత్తమమ్॥ ౧౨

ఓపురుషోత్తమా! నీవు తపోమయుడవు. రాశీభూతమైన తపస్సువి. మూర్తీభవించిన తపస్సు నీవు. నీవు తపః స్వరూపుడవు. అటువంటి నిన్ను తపస్సుచేతను చూచుచున్నాను.
ఇది **అనుభయరూపకము**నకు చక్కటి ఉదాహరణ. ఉపమాన ఉపమేయముల మధ్య హెచ్చుతగ్గులను చూపక కేవలము సర్వవిధములా అభేద తాద్రూప్యము లను చెప్పేరు. హేపురుషోత్తమా! నీవే తపస్సు. తపస్సే నీవు. కనుకనే నిన్ను తసస్సుచేతనే తెలుసుకొంటున్నాను.

శరీరే తవ పశ్యామి జగత్సర్వమిదం ప్రభో
త్వమనాదిరనిర్దేశ్యస్త్వా మహం శరణం గతః॥ ౧౩

ఓప్రభూ! ఈ ప్రపంచమునంతనూ నీశరీరంలో చూచుచున్నాను. ఓపాలకుడా! నిన్ను విశ్వరూపునిగా దర్శిస్తున్నాను.

ఆకాశం (space)లో పాలపుంతలు ఆదిత్యాదిగ్రహాలు స్థావరజంగమాత్మక మైన సర్వప్రకృతి ఏవిధంగా భాసిస్తున్నాయో! ఆ ఆకాశముకంటే సర్వశ్రేష్ఠుడవైన నీయందు ఈవిశ్వాన్నంతను దర్శిస్తున్నాను. ముణ్డకశ్రుతి ఈ హిరణ్యగర్భుని **విశ్వస్యకర్త భువనస్యగోప్తా** అన్నచోట విద్యాస్తుతౌ అని చెప్పింది. ఇక్కడకూడా **ప్రభో** అన్నది స్తుతివాచకమే కాని దానిని అక్షరశః తీసుకోకూడదు. ఆ విష్ణువు తనకంటే భిన్నమైనది సృష్టించి దానికి బయట ఉండి దాన్ని పరిపాలిస్తున్నాడు అని చెప్పకూడదు. నీవు **అనాది.** అనాది అంటే స్వయంగా ప్రకటమైనవాడు. ఈ ఆదిత్యాది దేవతాగణాలు సృష్ట్యావిర్భావానికి పూర్వంలేరు. హిరణ్యగర్భుడు సృష్ట్యావిర్భావానికి పూర్వమందూ ఉన్నాడు.

అనిర్దేశ్యః ఇట్టిదని చెప్పుటకు వర్ణింపశక్యంగాని స్వరూపముకలవాడు. ఈయనయొక్క రూపం ఇది అని చెప్పలేం. ఆకాశం (space) వంటి వాడు. ఈ విశ్వం అంతా నీచే ప్రకటింపబడుతోంది, నీవు మాత్రం ప్రకటింపబడు వాడవు కాదు. **'అవ్యక్తః'** నీవు బుద్ధికి అందనటువంటి వాడవు. అటువంటి నిన్ను శరణు పొందుతున్నాను.

ఇక్కడ కాశ్యపుడు సర్వోత్తమమైన మూర్తిని దర్శిస్తున్నారు. సగుణనిరాకార స్వరూపంగా (విద్యుత్తు, బంగారములవంటి) దర్శిస్తున్నారు. అటువంటి నిన్ను శరణుపొందుతున్నాను.

తమువాచ హరిః ప్రీతః కాశ్యపం ధూతకల్మషమ్।

పరమాత్మను సర్వవ్యాపకుడిగా తెలుసుకొని తొలగిన మాలిన్యం కలవాడైన కాశ్యపునిగూర్చి హరి ప్రీతిచెందినవాడై పలుకుతున్నాడు. నీకు క్షేమమగును. వరముకోరుకో. నీవు కోరుకొనుటకు (వరార్హ) తగినవాడవు. నాకు ఇష్టుడవుకూడా! అన్నాడు.

విశ్వకర్త అయిన హరికి (హిరణ్యగర్భునకు) దేనియందు ఎవనియందు ప్రత్యేకమైన రాగం ఉండదు. తనను తెలిసిన కాశ్యపుడు తనే అయి ఉన్నాడు.

సృష్టిలో ఎవరైనా తనను తానే ఇష్టపడతారు. బ్రహ్మవేత్త బ్రహ్మమే అయిఉంటాడు. అందువలన కాశ్యపుడు ఇష్టం అని చెప్పటం. కాశ్యపుడు స్థావరజంగమాత్మకమైన సర్వప్రకృతిని భగవంతునియందు, భగవంతుని సర్వప్రకృతియందు దర్శించువాడు. ఇట్టివానియందు స్వార్థం ఉండదు. స్వార్థరహితంగా చేసిన ఏప్రార్థన అయినా ఈశ్వరునిచే అంగీకరింపబడుతుంది. ఇటువంటి నీవు కోరతగినవాడవు.

హరియొక్క వచనములు విన్న మరీచుని పుత్రుడైన కాశ్యపుడు మాట్లాడుతున్నాడు. వరదుడా! సువ్రతుడా! నీవు అదితికి దేవతలకు వారిని అనుసరించి యాచించుచున్న నాకు అనుగ్రహంతో వరమును ఇమ్ము.

భగవంతుడా! అనఘాత్మా! అదితికిని నాకు పుత్రుడవు అగుము. అసురసంహారం చేయువాడా! నీవు ఇంద్రునకు సోదరుడవు అగుము. శోకార్తులైన దేవతలకు సహాయపడు. అని అడిగేరు.

అయం సిద్ధాశ్రమో నామ ప్రసాదాత్తే భవిష్యతి।
సిద్ధేకర్మణి దేవేశ ఉత్తిష్ఠ భగవన్నితః॥ ౧౮

దేవేశ! దేవతలకుకూడా ప్రభువైనవాడా! నాతపస్సు సఫలం కాగానే అంటే నాకు పుత్రునిగా జన్మించిన తరువాత అని నీయొక్క అనుగ్రహంవలన ఇది సిద్ధాశ్రమం అను పేరుగలది కాగలదు. భగవన్! ఇచటనుండి లెమ్ము.

అథ విష్ణుర్మహాతేజా అదిత్యాం సమజాయత।
వామనం రూపమాస్థాయ వైరోచని ముపాగమత్॥

తరువాత గొప్పతేజస్సుకల విష్ణువు అదితియందు పుట్టెను. వామనరూపమును ధరించి బలిచక్రవర్తిని సమీపించెను.

వామనుడు అంటే పరిచ్ఛిన్నమైన స్థూలస్వరూపాన్ని స్వీకరించేడని.

బ్రహ్మము అంటే పెద్దది. ఎంతపెద్దది అన్నది ప్రశ్న. ఆదిత్యాది గ్రహాలను నక్షత్రాలను పాలపుంతలను తనలో కలిగి ఉన్న ఆకాశం అన్నింటికన్న పెద్దది. దానికి కూడా అధిష్ఠానమైనది. దానికంటేకూడా సర్వశ్రేష్ఠుడు. ఇటువంటి బ్రహ్మ తనను తాను వామనునిగా చేసుకొన్నాడు. ఆకాశానికి అధిష్ఠానమైన బృహత్‌కు స్వరూపంలేదు. **అనిర్దేశ్యవపుః** అయినప్పుడు విక్రముడు. స్వరూపగ్రహణం చేస్తే వామనుడు.

ఇలా స్వరూపగ్రహణం చేసి కాశ్యప సంతానరూపంగా వామనుడైన భగవానుడు అదే ఆశ్రమంలో చాలాకాలంగా తపస్సు చేస్తున్నాడు. ఇదిగో ఈ సమయంలో బలిచక్రవర్తి యజ్ఞం చేస్తున్నాడు. దేవతలు వెళ్ళి ప్రార్థించేరు.
తరువాత అభిమానమును తొలగించువాడు విశ్వరూపుడు సర్వభూతహితుడు అంటే పోషకుడు. ఎందుకంటే ఆయనే విశ్వకర్త కనుక. ఆయనే సంహర్తకూడాను. అటువంటి సర్వవ్యాపకుడైన భగవానుడు మూడుఅడుగులను యాచించి స్వీకరించి బలిని తేజస్సుచేత బంధించి మహేంద్రునకు మరల ఇచ్చెను. గొప్పతేజస్సుగల విష్ణువు మూడులోకాలు మరల ఇంద్రునకు వశమగునట్లు చేసెను.
శ్రమను తొలగించు ఈ ఆశ్రమం వామనునిచే పూర్వం అధిష్ఠింపబడినది. ఆ వామనునిపై నాకున్న భక్తిచే నాచేతకూడా ఈ ఆశ్రమం అనుభవింపబడుచున్నది. అంటే నేనూ ఈఆశ్రమంలోనే నివసిస్తున్నాను.
పురుషశ్రేష్ఠుడా! విఘ్నములు చేయు రాక్షసులు ఈ ఆశ్రమమునుగూర్చి వచ్చుచున్నారు. ఆ దుర్మార్గులు ఇచటనే చంపతగినవారు.
ఓరామా! ఇప్పుడు అత్యుత్తమమైన సిద్ధాశ్రమానికి వెళ్దాం.

తదాశ్రయపదం తాత తవాప్యేతద్యథా మమ॥ ౨౪

నాకన్నతండ్రీ! అని తల్లి బిడ్డను ముద్దుచేసినట్లుగా అంత లాలనగా వాత్సల్యంతో మహర్షి చూస్తున్నారు. కనుకనే తాతా! (నాయనా!) అని సంబొధించేరు. ఈ ఆశ్రమం నాకు ఎట్లో నీకూ అట్లే అంటున్నారు.
రాజ్యాదులను (ప్రాపంచిక సంపదలను) ఎప్పుడో విడిచేడు. తనదంటూ ఉన్నది ఈ ఆశ్రమమే. రాముడు విశ్వామిత్రునకు పుత్రసముడు. గురుత్వం చేత. కనుకనే నాకు ఈ ఆశ్రమం ఎటువంటిదో నీకూ అటువంటిదే అన్నారు. జ్ఞానసంబంధమైన మంత్రగ్రామాన్ని ఉపదేశించేరు. దానితో గురుశిష్య బంధం ఏర్పడింది. ఇప్పుడు రాముడు వత్స. పుత్రసముడు. తనదైన సర్వసంపదలు తన పుత్రునకే అందుకే ఇంద్రాదులు అస్త్రాదులను రామునకు ఇమ్మంటే **ప్రహస్య రాఘవం వాక్యమువాచ మధురాక్షరమ్** నవ్వేరు. వాత్సల్యంచేత ఎలాగూ ఇవ్వాలని నిర్ణయించుకొన్నారు. అదే విషయాన్ని వాళ్ళూచెప్పేరు. అందుకని నవ్వుకొన్నారు. ముందు రజోగుణ ప్రవృద్ధములైన అస్త్రములను ఇచ్చేడు.

ఇప్పుడు సత్త్వగుణమును వృద్ధిపొందించు తపోభూమిని ఆశ్రమస్థానాన్ని. రామలక్ష్మణులతో ఆశ్రమంలోకి ప్రవేశిస్తూన్న విశ్వామిత్రుడు

శశీవ గతనీహారః పునర్వసుసమన్వితః॥ ౨౫

మంచుతొలగిన పునర్వసు నక్షత్రంతోకూడిన చంద్రుడువలె ప్రకాశించేరు. పునర్వసుతోకూడిన చంద్రుడు రామలక్ష్మణులతోకూడిన విశ్వామిత్రుడు. పునర్వసు అనునది జంటనక్షత్రాలు. చంద్రునకు నక్షత్రాలతో సంబంధం నిత్యంకాదు. రాముని నక్షత్రంగానో చంద్రునిగానో చెప్పిన సందర్భంలోకూడా రామునకు (సీత విషయంలో **శశినం రోహిణీ యథా**) వారితోడి సంబంధము నిత్యంకాదు అని మహర్షి సూచిస్తూ వచ్చేరు.

సిద్ధాశ్రమ ఋషిగణం విశ్వామిత్రుని చూచేరు. గబగబా ఎదురు వెళ్ళేరు. తగినవిధంగా పూజించేరు. రాజపుత్రులకు అతిథిపూజ చేసేరు.

తరువాత శత్రుసంహారకులైన రామలక్ష్మణులు మూహూర్త కాలం విశ్రమించేరు. తరువాత అంజలిబద్ధులై మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రునిగూర్చి మాట్లాడుతున్నారు.

మునిపుఙ్గవా! ఈరోజే దీక్షలో ప్రవేశించండి. మీకు భద్రమగుగాక! నీమాటలు నిజమగుగాక! ఈ సిద్ధాశ్రమం సార్థకనామధేయ అగును.

మహాతేజో విరాజితుడైన విశ్వామిత్రుడు వారి మాటలను విన్నవాడై నియమమును అవలంబించి ఇంద్రియములను నిగ్రహించి దీక్షను ప్రవేశించేరు.

కుమారావపి తాం రాత్రిముషిత్వా సుసమాహితౌ
ప్రభాతకాలే చోత్థాయ పూర్వం సన్ధ్యాముపాస్య చ॥
స్పృష్టోదకౌ శుచీ జప్యం సమాప్య నియమేన చ
హుతాగ్నిహోత్రమాసీనం విశ్వామిత్ర మవన్దతామ్॥

రామలక్ష్మణులు ఆరాత్రి అంతా సావధానచిత్తులై ఉండి ప్రాతఃకాలమునందు లేచి సన్ధ్యను ఉపాసించి నియమం కలిగి మంత్రజపం చేసి అగ్నిహోత్రం చేసుకొని దీక్షితుడై కూర్చొన్న విశ్వామిత్రునికి నమస్కరించేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **ఏకోనత్రింశ స్సర్గ** సమాప్తము.

అథ త్రింశ స్సర్గః

(విశ్వామిత్ర యాగ సంరక్షణార్థం రాముడు రాక్షసులను సంహరించుట.)

అథ తౌ దేశకాలజ్ఞౌ రాజపుత్రావరిన్దమౌ।
దేశే కాలే చ వాక్యజ్ఞావబ్రూతాం కౌశికం వచః॥ ౧

తరువాత దేశకాలాదులను తెలిసినవారంటే సమయం సందర్భం తెలిసి మసలేవారు. ఎక్కడ ఏసమయంలో ఎలా మాట్లాడాలో ఎరిగినవారు, శత్రుసంహారకులైన రామలక్ష్మణులు విశ్వామిత్రునితో మాట్లాడుతున్నారు.

భగవన్ శ్రోతుమిచ్ఛావో యస్మిన్ కాలే నిశాచరౌ।
సంరక్షణీయౌ తౌ బ్రహ్మన్ నాతివర్తేత తత్ క్షణమ్॥

భగవన్! ఆ రాక్షసులు ఏకాలమునందు సంరక్షింపతగినవారో వినగోరుచున్నాను. ఆక్షణము దాటకోడదు కదా? రాక్షసులనుండి ఎప్పుడు రక్షించాలో చెప్పండి. అంతేకాదు రాక్షసులను ఎలా సంరక్షించాలో చెప్పండి.

ఇక్కడ ఈ రాక్షసులను సంరక్షింపతగినవారుగా చూస్తున్నాడు. ఇది రాముని సహజస్వభావం. శిక్షాస్మృతి కేవలం హింసనుమాత్రమే కలిగిఉండదు. శిక్షాస్మృతిలోని హింస పరివర్తనలక్ష్యంగా ఉంటుంది. ఈ రాముడు వీరియందలి రాక్షసప్రవృత్తిని రూపుమాపుటకు ఆలోచిస్తున్నాడు. ఆ రాక్షసులు వారి ప్రవృత్తియందే ప్రతిష్ఠితులై ఉంటే వధార్హులే. అంటే తను విధించే శిక్షవలన వారిలో మార్పునైనా తీసుకురావాలి లేదా వారికి ఉత్తమగతులైనా కలగాలి.

ఈవిధంగా మాట్లాడుతూ యుద్ధమునందుకోరికచేత త్వరపడుచున్న రాకుమారులను ఆ మునులందరు ప్రశంసించేరు.

ఓరాఘవులారా! మీరు ఈరోజు మొదలు ఆరురాత్రులు మా దీక్షను కాపాడవలసి ఉంటుంది. విశ్వామిత్రమహర్షి దీక్షను ప్రారంభించేరు. కనుక మౌనమును ఆశ్రయించి ఉంటారు.

అనిద్రౌ షడహోరాత్రం తపోవనమరక్షతామ్।

కీర్తిమంతులైన ఆ రాకుమారులు ఇద్దరూ ఆ ముని వాక్కులను విన్నారు. విని, ఆరు పగళ్ళు ఆరు రాత్రులు నిద్రను విడిచి తపోవనమును రక్షించేరు. **అనిద్రౌ** కేవలం నిద్రపోకుండా అనిమాత్రమేకాదు, బద్ధకంలేకుండా

నిత్యోత్సాహంతో అని. ధనుర్ధరులలో శ్రేష్ఠులైన శత్రుసంహారకులైన ఆ వీరులు విశ్వామిత్రుని సమీపములోనే ఉండి రక్షించేరు.

సౌమిత్రిమబ్రవీద్రామో యత్తో భవ సమాహితః। ౬

అయిదురోజులు గడిచేయి. దీక్షాపరిసమాప్తి రోజైన ఆరవరోజు వచ్చింది. రాముడు సౌమిత్రినిగూర్చి సన్నద్ధుడవై ఏమరపాటు లేకుండా ఉండు అన్నాడు. ఎందుకింత ప్రత్యేకంగా చెప్తున్నాడు! అంటే అయిదురోజులు పూర్తి అయ్యేయి. ఆరవరోజుకు చేరేరు. ప్రళయంముందు ప్రశాంతతలా...

సమయం శ్రమ ద్రవ్యం ఖర్చు అయ్యేయి. ఇది చివరిరోజు. పూర్ణాహుతితో దీక్షాఫలం అనుభవంలోకి వచ్చే సమయం. ఇప్పుడు నష్టంకలిగిస్తే ఇంత శ్రమ ద్రవ్యం వ్యర్థమైపోతాయి. ఇది రాక్షసం. కనుక హెచ్చరించేడు.

యుద్ధోత్సాహంతో తొందరపడుతున్న రాముడు ఈవిధంగా మాట్లాడుతునే ఉన్నాడు, ఋత్విక్కులతోను పురోహితులతోనుకూడిన యజ్ఞవేది ఒక్కసారిగా ప్రజ్జ్వరిలింది.

దర్భలతో పానపాత్రలతో స్రుక్కులతో సమిధలు పుష్పసముదాయములతో విశ్వామిత్రునితోను ఋత్విక్కులతోనుకూడిన వేది జ్వలించసాగింది.

ఆ యజ్ఞం మంత్రపూర్వకంగా శాస్త్రానుసారం జరుగుతోంది. ఇంతలో ఆకాశమునందు భయాన్ని కలిగించే గొప్పధ్వని వచ్చింది.

ఆవార్య గగనం మేఘో యథా ప్రావృషి నిర్గతః।
తథా మాయం వికుర్వాణౌ రాక్షసావభ్యధావతామ్॥ ౧౧

ఏవిధంగా వర్షాకాలంలో మేఘాలు ఆకాశాన్ని ఆవరిస్తాయో ఆవిధంగా రాక్షసులు ఆకాశమును ఆవరించి మాయను చేస్తూ పరిగెత్తి వచ్చేరు.

వర్షాకాలంలో బయలుదేరిన దట్టమైన మేఘములు లోకరక్షకుడు యజ్ఞఫలప్రదాతైన సూర్యభగవానుని కప్పే ప్రయత్నంచేస్తాయి. ఆవిధంగానే రాక్షసులు లోకక్షేమంకొరకైన యాగాన్ని యాగఫలాన్ని కప్పే ప్రయత్నం చేస్తున్నారు.

మేఘాలు ఆకాశంలో ఎప్పుడూ ఉన్నాయి. సామాన్యంగా మనం వర్షారంభ

సమయంలో మాత్రమే ఆకాశం మేఘావృతమై ఉన్నదని అంటాము. అంటే అంతకుముందు మేఘములు లేవనికాదు. వర్షారంభహేతువు అయిన తడిపే సామార్థ్యం ఉన్నవాటినే ప్రముఖంగా గుర్తిస్తున్నాం. ఇక్కడ మేఘము-రాక్షసులు ఆకాశమును ఆవరించుట అనునది ప్రత్యక్షమైన సమానధర్మం. దీనిని ఇలాగే గ్రహిస్తే పూర్ణోపమ. ఇక్కడ అలంకారానికి లక్ష్యం ఇదికాదు.

ఇక్కడ మేఘము-రాక్షసులు తడిపే స్వభావంకలవి. మేఘం నీటిచేత, రాక్షసులు రక్తంచేత తడుపుతున్నారు. తడుపుట అను ధర్మాన్ని మేఘము-రాక్షసులు కలవారైననూ మహర్షి దాన్ని చెప్పక ధర్మలోపాన్ని చూపించేరు. ధర్మలోపం జరిగిన చోటు శిక్షార్హమైనదిగా ఉంటుంది. కావున ఈ రాక్షసులు శిక్షార్హులు అని ధర్మలుప్తోపమచేత చూపించేరు.

ఇక్కడ రాక్షసులంటే శిక్షార్హులు. శిక్షద్వారా సంస్కరింప తగివారు. మరి మేఘముల విషయం! అంటే జలపూర్ణమైన మేఘాలు వర్షించాలి. అది వాటి ధర్మంకూడా. అవి వర్షింపకున్నచో విష్ణువు మేఘములందలి రసమును (బలమును) తన పరాక్రమంచేత గ్రహించి వాయువుగా మార్చి వాటిని బలహీనులుగాచేసి ధర్మమార్గంలో నడిపిస్తారు. కనుక అవి తమంత తాముగా వర్షించినను వర్షింపకున్ననూ అవి ధర్మమేఘములే. ఇది ధర్మలుప్తోమ అని చెప్పుట ఔచిత్యవంతంగా ఉంటుంది.

ఆగమ్య భీమసంకాశౌ రుధిరౌఘమవాసృజన్।

భయంకరులైన మారీచ సుబాహులు వారి అనుచరులు వచ్చి రక్తమును ప్రవాహంలా వర్షిస్తున్నారు.

ఆ రక్తప్రవాహంతో నింపబడ్డ వేది ప్రజ్జ్వలిస్తోంది. అంతలో రాముడు వేగముగా పరుగున వచ్చి ఆకాశమున రాక్షసుల్ని చూసేడు. చూచి...లక్ష్మణునితో అంటున్నాడు. లక్ష్మణా! దుర్మార్గులూ నరమాంస భక్షకులూ అయిన రాక్షసులను వాయువుచేత మేఘమువలె మానవాస్త్రముచే ఎగరగొట్టెస్తాను చూడు. అంటున్నాడు. అని ఆ రాముడు పరమోదారమైన గొప్పప్రకాశంకలిగిన మానవాస్త్రమును చాలా కోపంతో మారీచుని వక్షస్థలం పై నాటేడు.

ఆ మానవాస్త్రముచేత కొట్టబడిన మారీచుడు పూర్తిగా నూరుయోజనముల దూరంలో కల్లోలముగా ఉన్న సాగరజలాల లోనికి విసిరివేయబడ్డాడు.

విచేతనం విఘూర్ణన్తం శీతేషు బలతాడితమ్।

ఆ చల్లని అస్త్రముచే కొట్టబడినవాడు అచేతనుడై గుండ్రముగా తిరుగుతూ పోతూ దూరంగాపడిన మారీచుని చూచి రాముడు లక్ష్మణునితో మాట్లాడు తున్నాడు.

లక్ష్మణా! ధర్మముతోకూడిన చల్లనైన మానవాస్త్రం చూడు ఈతనికి మోహాన్ని కలిగించి తీసుకుపోతోంది. ప్రాణాలుమాత్రం తీయలేదు.

దయారహితులు చెడుప్రవర్తనకలవారు పాపకర్మలు చేయు మిగిలిన ఈ రాక్షసులనుకూడా చంపెస్తాను.

తరువాత రాముడు ఆగ్నేయాస్త్రమును గ్రహించి సుబాహుని వక్షస్థలాన్ని కొట్టేడు. దాని దెబ్బకు నేలపైపడ్డాడు.

గొప్పకీర్తికల పరమోదారుడైన రాముడు మునులకు ఆనందాన్ని కలిగించుచూ వాయవ్యాస్త్రమును గ్రహించి మిగిలిన అనుచర రాక్షసులను చంపేడు.

ఆ మునులందరు అసురులపై విజయం సాధించిన దేవేంద్రుని పూజించినట్లుగా యజ్ఞవిఘ్నకర్తలైన రాక్షసులపై విజయం సాధించిన రాముని పూజించేరు.

యజ్ఞం పరిసమాప్తమైంది. విశ్వామిత్రుడు ఈతి బాధలులేని దిక్కులను చూచి రామునిగూర్చి మాట్లాడుతున్నాడు.

సిద్ధాశ్రమమిదం సత్యం కృతం రామ మహాయశః।

ఓమహాబాహో! నేను తలపెట్టిన పని పూర్తి అయింది.

నీవు తండ్రి మాటను పాటించేవు. గొప్పకీర్తిగల రామా! ఈ సిద్ధాశ్రమాన్ని సార్థక నామధేయను చేసేవు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్వవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రింశ స్సర్గ సమాప్తము.

–

అథ ఏకత్రింశ స్సర్గః

(రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు మిథిలకు ప్రయాణ ప్రయత్నం)

అథ తాం రజనీం తత్ర కృతార్థౌ రామలక్ష్మణౌ।
ఊషతేర్ముదితౌ వీరౌ ప్రహృష్టే నాన్తరాత్మనా॥ ౧

కృతార్థులైన వీరులైన రామలక్ష్మణులు అంటే దేని నిమిత్తం తీసుకొనిరాబడ్డారో ఆపనిని పూర్తిచేసారు. వచ్చిన పని పూర్తైందన్న ఆనన్దంతో వీరులైన రామలక్ష్మణులు ఆరాత్రి అక్కడే సిద్ధాశ్రమంలోనే నివసించేరు.

రాత్రి తెల్లవారింది. ప్రాతఃకాల సంధ్యావందన అగ్నికార్య మంత్రజపాదులను పూర్తిచేసుకొన్న వారై రామలక్ష్మణులు ఇద్దరూకలిసి విశ్వామిత్రునివద్దకు ఇతరులైన ఋషులవద్దకు వెళ్ళేరు.

అభివాద్య మునిశ్రేష్ఠం జ్వలన్తమివ పావకమ్।

కర్ణపేయంగా మాట్లాడు రామలక్ష్మణులు జ్వలిస్తూన్న అగ్నిలా ఉన్న మునిశ్రేష్ఠునకు (విశ్వామిత్రునకు) నమస్కరించి మధురము ఉదారమూ అయిన మాటల్ని పలుకుతున్నారు. మునియొక్క శ్రేష్ఠత్వం తపస్సువల్ల వచ్చింది. అలా తపస్సు చేసినవాడు లేడు. కావున మునిశ్రేష్ఠుడు. అగ్ని జ్వలిస్తూన్నంత మాత్రాన సాధర్మ్యాన్ని చెప్పలేం. అగ్ని చాలాసందర్భాల్లో జ్వలిచే అవకాశం ఉంది. ఇళ్ళు ఊళ్ళూ తగలబడుతూన్న సందర్భంలో అగ్ని ప్రజ్వలనం చాలాహెచ్చుగా ఉంటుంది. అంతమాత్రంచేత అది శ్రేష్ఠమైన అగ్ని అని చెప్పం.

ఎందుచేతనంటే దాని వృద్ధిని కోరుకోం. ఆర్పే ప్రయత్నమూ చేస్తాం. సర్వశ్రేష్ఠమైనది ఎప్పుడూ ప్రయత్న పూర్వకంగా కాపాడబడుతూ ఉంటుంది. అది లోకధర్మం. యజ్ఞవేదియందలి అగ్నియొక్క వృద్ధినిమాత్రమే కోరుతూ నిత్యమూ రక్షిస్తూంటాం. ఇది సర్వశ్రేష్ఠమైన అగ్ని.

యజ్ఞవేదియందలి అగ్ని ప్రజ్వలనం. ఇప్పుడు సాధర్మ్యం సిద్ధించింది. ఇది **వాక్యగత శ్రౌత్యుపమ.**

రాముడు మంచి ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు. తను నేర్చిన చదువు,

పట్టిన ధనుస్సు సార్థక్యాన్ని పొందేయి. నిండా పదహారుసంవత్సరాల వయస్సు కాదు, తను యుద్ధంచేసేడు. లోకభీకరులైన రాక్షసులను చంపేడు. గొప్పకీర్తి సంపాదించేడు. ఆ ఉత్సాహంతో మాట్లాడుతున్నాడు. ఓమునిశ్రేష్ఠా! నీ కింకరులమైన రామలక్ష్మణులము వచ్చాము. నీకు ఇష్టమైనది ఆజ్ఞాపించండి. ఏ శాశనమును చేయాలి. అంటే ఏ ఆజ్ఞను పాటించాలి. అని అడిగేరు.

ఇక్కడ **మునిశార్దూల** అనునది ఉపమితము. **ఉపమితం వ్యాఘ్రాదిభిః సామాన్యాప్రయోగే** ఉపమేయవాచకం సమానధర్మవాచకం మాత్రమే ఉన్నప్పుడు వ్యాఘ్రాది శబ్దములతో సమాసమును పొందునని పాణినివచనం. "శార్దూలమువంటి ముని". ఉపమితం అని చెప్పగానే శార్దూలాది పదములు ఉపమావాచకాలను విషయం సులభగ్రాహ్యం. ఇది సమాసగతోపమానలుప్త. నరశార్దూల రాజశార్దూల ఇత్యాది పదాలు తరచుగా ప్రయోగిస్తూనే ఉంటారు. ఆయా సందర్భాలలో ఇలాగే అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

రామలక్ష్మణులు ఈవిధంగా పలుకగానే మహర్షులందరూ విశ్వామిత్రుని ముందుంచుకొని మాట్లాడుతున్నారు. అంటే వారితరపునకూడా విశ్వామిత్రుడే మాట్లాడుతున్నాడు.

మైథిలస్య నరశ్రేష్ఠ జనకస్య భవిష్యతి।
యజ్ఞః పరమధర్మిష్ఠ స్తస్య యాస్యామహే వయమ్॥

నరశ్రేష్ఠుడా! మిథిలాధిపతియైన జనకుడు పరమధర్మముతోకూడిన యజ్ఞాన్ని చేస్తున్నాడు. మేము ఆ యజ్ఞానికి వెళ్తున్నాం. పరమధర్మముతోకూడిన యజ్ఞం అంటే హింసలేనిదని. జనకుడు బ్రహ్మవేత్త. కర్తవ్యనిష్ఠుడుకూడా. కనుక అహింసాయుతంగా యజ్ఞంచేస్తున్నాడు.

అద్భుతం ధనురత్నం చ తత్ర తద్ద్రష్టుమర్హసి॥౬

ఓ నరశార్దూలా! నీవు మాతోకూడా రావలసింది. అక్కడ ఆశ్చర్యకరమైన ధనురత్నాన్నికూడా చూడగలవు. ఈ చకార ప్రయోగంవలన అసలు చూడవలసింది వేరొకటని రామునకు చెప్పేరు.

నరశ్రేష్ఠుడా రామా! అప్రమేయ బలంకలది ఘోరమైనది మిక్కిలి ప్రకాశంకలదైన ధనుస్సు పూర్వం యజ్ఞమునందు సభలో ఇవ్వబడినది.

ఈ ధనుస్సుయొక్క నారి బిగించుటకు సురాసురులు గంధర్వులు రాక్షసులే సమర్థులుకారు అంటే ఇక మానవుల విషయం చెప్పాలా!
క్షత్రియులైన ఎందరో మహాబలవంతులైన రాజులు ఆ ధనుస్సుయొక్క శక్తి తెలియదలచి ప్రయత్నించి నారిని బిగించలేకపోయారు.

తత్ర ద్రక్ష్యసి కాకుత్థ్స యజ్ఞం చాద్భుత దర్శనమ్।

నరశార్దూలా! కాకుత్థ్సా! మహాత్ముడైన మిథిలాధిపతియొక్క ధనుస్సును ఆశ్చర్యాన్నికలిగించు యజ్ఞాన్నిచూడు. ఇతఃపూర్వం అహింసాయుతమైన ఇటువంటి యజ్ఞం ఎరుగరు. కనుక ఆశ్చర్యాన్ని పొందుతున్నారు.

నరశార్దూలా! దృఢమైన మధ్యభాగముకల ఆ ఉత్తమమైన ధనుస్సును దేవరాతుడు సర్వదేవతలనుండి యజ్ఞఫలంగా యాచించి గ్రహించేడు.

రాఘవా! ఆ ధనుస్సు మిథిలాధిపతి గృహమందు ఆయుధపూజ సమయంలో వివిధ గంధములచేతను అగరుధూపాలచేత పూజలందుకొంటోందని పలికి ఋషిసంఘముతోను రామలక్ష్మణులతోను కూడినవాడై మునివరుడైన విశ్వామిత్రుడు వనదేవతలను పలకరించి ముందుకు నడిచేరు.

ఓ వనదేవతలారా! నేను సిద్ధినిపొంది అంటే సంకల్పిత కార్యాన్ని పూర్తిచేసుకొని సిద్ధాశ్రమమునుండి గంగాతీర హిమవత్పర్వతాలనుగూర్చి వెళ్తున్నాను. మీకు క్షేమమగుగాక! అని, మిక్కిలి శ్రేష్ఠమైన సిద్ధాశ్రమానికి ప్రదక్షిణం చేసి ఉత్తర దిక్కునుగూర్చి ప్రయాణాన్ని ప్రారంభించేరు.

అలా వెళ్తూన్న విశ్వామిత్రుని సుమారు నూరుబండ్లపై బ్రహ్మావాదులు అనుగమించేరు.

మృగపక్షి గణాశ్చైవ సిద్ధాశ్రమ నివాసినః।
అనుజగ్ముర్మహాత్మానం విశ్వామిత్రం మహామునిమ్॥

సిద్ధాశ్రమంలో నివశించు మృగపక్షిగణాలుకూడా మహాత్ముడైన విశ్వామిత్రుని అనుసరించి వెళ్తున్నాయి. మహర్షి పక్షిసంఘాన్ని మృగాల్నికూడా వెనుకకు మరలించేడు.

గృహస్థు సమర్పించు బలిద్రవ్యాలను తింటూ ఆ గృహాన్ని నమ్ముకొని కొన్ని

పక్షులు జంతువులు జీవిస్తూంటాయి. అనివార్యమై గృహంలోని వారు ఎటైనా వెళ్ళవలసి వస్తే ఆ పక్షులు మృగాలు వారిని అనుసరించరించడం, యజమానులు వాటిని వెనక్కిపంపే ప్రయత్నం లోకంలో సహజంగా చూస్తూనే ఉంటాం.

ఆ సిద్ధాశ్రమంలోని బ్రహ్మవాదులైన ఆ ఋషిమండలి నిత్యకర్మలయందు సమర్పించు బలినికోరి అక్కడ పక్షి జంతు సంఘాలు జీవిస్తున్నాయి. ఇప్పుడు వారు ఆ ప్రాంతాన్ని విడిచిపెడుతున్నారు. కృతజ్ఞతాభావంతోను వారియందలి స్నేహంచేతను ఆ పక్షిమృగసంఘాలు ఆ ఋషులను అనుసరించేయి. వారు వాటిని వారించి వెనుకకు పంపుతున్నారు. ఇది చక్కటి స్వభావోక్తి.

ఆ మునిగణాలు చాలా దూరం వెళ్ళేరు. సూర్యుడు నడినెత్తికి వచ్చేడు. అందరూ కలిసి శోణనదీతీరంలో ఆగేరు.

అమిత తేజసులైన వారు సూర్యాస్తమయం అగుచుండగా స్నాన సంధ్యావందన అగ్నిహోత్రాదులు కలవారై విశ్వామిత్రుని ముందుంచుకొని కూర్చొన్నారు. సౌమిత్రీ సహితుడైన రాముడు ఆ మునులను పూజించి తరువాత ధీమంతుడైన విశ్వామిత్రుని ముందుకూర్చొని కుతూహలంతో విశ్వామిత్రుని అడుగుతున్నాడు. భగవన్! ఇది ఏ దేశం? సర్వసమృద్ధంగా వనాలతో ప్రకాశిస్తోంది. నాకు వినాలనుంది. నీకు భద్రమగుగాక! యథార్థమును చెప్పుటకు నీవే తగినవాడవు.

చోదితో రామవాక్యేన కథయామాస సువ్రతః।
తస్య దేశస్య నిఖిల మృషిమధ్యే మహాతపాః॥

సువ్రతుడు గొప్ప తపస్సుగల విశ్వామిత్రుడు రామ వాక్యముచే ప్రేరితుడై ఋషులమధ్యయందు ఆ దేశంయొక్క మొత్తం వృత్తాంతాన్ని చెప్పేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకత్రింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ద్వాత్రింశ స్సర్గః॥

(కుశునికి సంతానము కలుగుట. వసువు శోణనదీ పరీవాహక ప్రాంతాన్ని పాలించుట. కుశనాభునకు నూరుగురు పుత్రికల వృత్తాంతము.)

బ్రహ్మయోనిర్మహానాసీత్కుశో నామ మహాతపాః।
అక్లిష్టవ్రత ధర్మజ్ఞః సజ్జన ప్రతిపూజకః॥ ౧

బ్రహ్మవశంమునందు పుట్టినవాడు మహాతపస్సంపన్నుడు క్లిష్టమైన వ్రతములు లేనివాడు. ధర్మజ్ఞుడు సజ్జనులను పూజించువాడగు కుశుడు అను పేరుగల రాజు ఉండేవాడు.

ఆ కుశునకు, తగినది సత్కులమందు పుట్టినదైన విదర్భరాజ కుమార్తెయందు కుశాంబుడు కుశనాభుడు అధూర్తరజసుడు వసువు అను అనురూపులైన నలుగురు కుమారులు.

ప్రకాశంకలవారు గొప్పఉత్సాహంకలవారు ధర్మనిష్ఠులు సత్యవాదులైన తన నలుగురు పుత్రులకు క్షత్రియధర్మాన్ని పాటించమని కుశుడు చెప్పేడు.

పుత్రులారా! పరిపాలనచేయండి. గొప్పధర్మాన్ని పొందుతారని తండ్రి చెప్పిన మాటలను విని, ఆ నలుగురు నరశ్రేష్ఠులు పట్టణములను నిర్మించారు.

కుశాంబుడు – కౌశాంబి అను పట్టణాన్ని నిర్మించేడు.

కుశనాభుడు – మహోదయమను పట్టణాన్ని,

అధూర్తరజసుడు – ధర్మారణ్యమను పట్టణాన్ని,

వసువు – గిరివ్రజమను పట్టణాన్ని నిర్మించేరు.

ఏషా వసుమతీ రామ వసోస్తస్య మహాత్మనః

రామా! ఇది మహాత్ముడైన వసువుయొక్క భూమి.

దీనిచుట్టూ ఐదుశ్రేష్ఠమైన పర్వతాలు ఉన్నాయి.

సుందరమైన ప్రసిద్ధమైన **సుమాగధీ** అను నది మగధదేశాన్ని పొంది, శ్రేష్ఠమైన ఐదుపర్వతాలమధ్య మాలవలె ప్రకాశిస్తోంది.

ఈ సుమాగధీనదియే మాగధీయని శోణయని పిలువబడుతోంది.

రామా! ఈ మాగధీనది మహాత్ముడైన వసువునకు సంబంధించినది.

తూర్పునుండి పశ్చిమంగా ప్రవహిస్తోంది. దాని తీరప్రాంతమంతా మంచి పంటభూములు కలిగి సస్యములతో నిండియుంది.

రఘునందనా! ధర్మాత్ముడు రాజర్షి అయిన కుశనాభుడు ఘృతాచి అను అప్సరః స్త్రీయందు శ్రేష్ఠమైన కన్యాశతకానికి జన్మనిచ్చేడు.

తాస్తు యౌవనశాలిన్యో రూపవత్యః స్వలఙ్కృతాః।
ఉద్యానభూమి మాగమ్య ప్రావృషీవ శతహ్రదాః॥

యౌవనంతో ప్రకాశించుచున్న రూపవతులైన ఆ కన్యలు చక్కగా అలంకరించుకొన్నవారై ఉద్యానభూములనుచేరి వర్షాకాలమందు మెఱుపులవలె ఉన్నారు.

యౌవనమందున్నవారు రూపవతులు చక్కగా అలంకరించుకొని ఉద్యాన భూములను చేరిన కన్యలు. ఇదంతా ఉపమేయం. వర్షాకాలంలో మెఱుపుల (ఇది ఉపమానం) వలె ప్రకాశిస్తున్నారు. ఇక్కడ మెఱుపులయొక్క ప్రకాశ క్షణికమై ఉపమేయాధిక్యం కనబడుతోంది. వాల్మీకి హీనత్వాది దోషములు అంగీకరించినట్లు లేదు. ఎందుకంటే ఇటువంటి ప్రయోగాలు ఇంతఃపూర్వం వచ్చాయి. ఇకపైన వస్తున్నాయి. దోషమని తెలిసి మహర్షి ప్రయోగించరు కదా! ఇది **వాక్యార్థవృత్త్యుపమ.**

వీరంతా ఉద్యానవనాల్లో పాడుతున్నారు. నాట్యం చేస్తున్నారు. వాద్యాలను మ్రోగిస్తున్నారు. సర్వాభరణభూషితులై అన్ని వైపులకు తిరుగుతూ గొప్పగా ఆనందిస్తున్నారు.

అథ తాశ్చారు సర్వాఙ్గ్యో రూపేణాప్రతిమాభువి।
ఉద్యాన భూమి మాగమ్య తారా ఇవ ఘనాంతరే॥ ౧౪

తీర్చిదిద్దినట్లున్న అవయవాలతో సాటిలేనిసౌన్దర్యంతో ఆ కన్యలు ఉద్యాన భూములను పొంది మేఘముమధ్య నక్షత్రాలవలె ప్రకాశిస్తున్నారు.

ఆకాశం అంతా మేఘావృతమైన నక్షత్రాల మిణుకులు ఉండవు.
ఆకాశంలో అక్కడక్కడ ఉన్న మేఘాలమధ్య నక్షత్రాలు.
ఉద్యానభూములలో తీర్చిదిద్దినట్లున్న వృక్షాలమధ్య కన్యలు.
ఇక్కడా ఉపమేయాధిక్యం కనబడుతోంది. కనుక హీనోపమ అని చెప్పకూడదు. ఎందుకంటే ఉపమానోపమేయములకు సర్వవిధసామ్యం అనునది ఎప్పుడూ

కుదరదు. శక్యమైనంత వరకే చెప్తారు. కావున ఇటువంటి సందర్భాలలో న్యూనతను దోషముగా పరిగణింప పనిలేదని భామహాదుల మతం.

సర్వవ్యాపకుడైన వాయువు సర్వగుణ సంపన్నులు రూపయౌవనములతో కూడినవారైన ఆ కన్యలను చూచి మాట్లాడుతున్నాడు.

నేను మిమ్మల్ని అందరినీ కోరుకొనుచున్నాను. నాకు భార్యలై మానుషభావం వీడి, దీర్ఘమైన ఆయుర్దాయాన్ని పొందండి. అని పలికేడు.

మీరు నాకు భార్యలు కావాలని కోరుకొంటున్నాను. అలా అయితే మీకు గొప్పప్రయోజనం ఉంది. ఎమిటది? మీయందు మానుషభావం పోతుంది. జరామృత్యువులు మానుషస్వభావం. ఆ విషయాన్నే చెప్తున్నారు.

చలం హి యౌవనం నిత్యం మానుషేషు విశేషతః।

యౌవనం అస్థిరం. అది మనుష్యులలో ఇంకా అస్థిరం. నన్ను పెండ్లాడితే మీకు యౌవనం స్థిరమైపోతుంది. దేవతాస్త్రీలు అయిపోతారు. అంటే జరావ్యాధులు లేని దీర్ఘాయువు లభిస్తుంది. అని పలికేడు.

తరువాత సర్వసమర్థుడైన వాయువు మాటలు విన్నారు. విని, ఆ వందమంది కన్యలు పరిహాసపాత్రమైన మాటల్ని పలికేరు.

ఓసురోత్తమా! సర్వభూతములయొక్క లోపల సంచరించువాడవు. మేము నీ ప్రభావాన్ని తెలిసినవారమే. మమల్ని ఎందుకు అవమానిస్తావు.

మేమందరమూ కుశనాభుని కుమార్తెలం. దేవత్వమైన నిన్ను నీ అధికారమునుండి తొలగించు సామర్థ్యంకలవారము. కాని తపస్సును రక్షించుకొనుచున్నాము.

మాభూత్సకాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్।
అవమన్య స్వధర్మేణ స్వయం వరముపాస్మహే॥ ౨౧

ఓదుర్మేధా! సత్యవాది అయిన తండ్రిని అవమానించి **స్వధర్మేణ** గాంధర్వవిధిని స్వయముగనే వరుని సేవించుకాలం రాకుండుగాక!

ఇక్కడ మహర్షి- కన్యలు ప్రలోభాలకు లొంగి స్వతంత్రించకూడదని హెచ్చరిస్తున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా వరుడు (శ్రేష్ఠుడు) అనుకొని పరపురుషుని సేవించుట ఒకప్పుడూ చెయ్యకూడదు. కుశనాభుని కుమార్తెల మాటల వ్యాప్తికి నిలువెత్తు నిదర్శనం శకుంతలా దుష్యంతుల జీవితం. ఇలా ప్రతిసందర్భంలోనూ సుఖాంతం అవ్వాలని లేదు.

అన్ని వేళలా మహర్షులు అలభ్యంకదా!

మాకు తండ్రియే ప్రభువుకదా! అతడే గొప్పదేవత. మాతండ్రి మమ్మల్ని ఎవరికి ఇస్తే అతడే మాకు భర్తకాగలడని అన్నారు. సమర్థుడగు వాయువు వారి మాటలు విన్నాడు. చాలాకోపించి వారియొక్క సర్వావయవముల ప్రవేశించి భగ్నంచేసేడు.

వాయువుచేత బలహీనలుగాచేయబడిన ఆ కన్యలు రాజుయొక్క గృహమును ప్రవేశించి తొట్రుపడుచు సిగ్గునుకూడి నీరునిండిన కళ్ళతో భూమిపైపడ్డారు. అప్పుడు రాజైన కుశనాభుడు తన పుత్రికలు బలహీనలై దైన్యముతో ఉండుటను చూచి అడుగుతున్నాడు.

కిమిదం కథ్యతాం పుత్ర్యః కో ధర్మమవమన్యతే।
కుబ్జాః కేన కృతాః సర్వావేష్టన్త్యో నాభిభాషథ॥
ఏవం రాజా వినిఃశ్వస్య సమాధిం సందధే తతః॥

ఓపుత్రికలారా! ఇదేమిటి? ఎవడు ధర్మాన్ని అవమానించేడు. చెప్పండి. మీరందరూ కుబ్జలుగా ఎవనిచే చెయ్యబడ్డారు? నేలపైపడి మాట్లాడరేమి? రాజు ఈ విధంగా పలికి నిట్టూర్చి సావధాన చిత్తుడైనాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్వాత్రింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ త్రయస్త్రింశ స్సర్గః॥

(కుశనాభుడు క్షమాగుణంగల తన కుమార్తెలను ప్రశంసించి, బ్రహ్మదత్తునికి ఇచ్చి కుమార్తెలకు వివాహము చేయుట.)

తస్య తద్వచనం శ్రుత్వా కుశనాభస్య ధీమతః।
శిరోభిశ్చరణౌ స్పృష్ట్వా కన్యాశత మభాషత॥ ౧

బుద్ధిమంతుడైన కుశనాభునియొక్క మాటను విన్నారు. విని కన్యాశతం తండ్రిపాదాలకు శిరస్సువంచి నమస్కరించి చెప్తున్నారు.

రాజా! సర్వాత్మకుడైన వాయువు అశుభమైన మార్గమును అనుసరించి మిమ్మల్ని తిరస్కరిస్తున్నాడు. ధర్మాన్ని ఆలోచించుటలేదు.

మాకు తండ్రి ఉన్నాడు. నీకు భద్రమగుగాక! మేము స్వతంత్రులంకాము. మమల్ని నీకు ఇస్తాడేమో మా తండ్రిని కోరుకోమని పలికిన మా మాటలను అంగీకరించని వాడై పాపపు ఆలోచనలుకల వాయువుచే మిక్కిలి హింసింప బడ్డాము. అనిచెప్పేరు.

పరమధార్మికుడు మహాతేజోవంతుడు అయిన రాజు వారియొక్క మాటలు విన్నాడు. విని, అత్యుత్తమమైన కన్యాశతాన్నిగూర్చి మాట్లాడుతున్నాడు.

పుత్రికలారా! ఓర్పుకలవారికి క్షమించుట కర్తవ్యం. మీరు ఆ పనిచేసేరు. చాలా గొప్పపని. మీరందరూ ఐకమత్యంగా నాగురించి నా వంశగౌరవంగురించి ఆలోచించేరు.

అలంకారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా।

స్త్రీలకుగాని పురుషులకుగాని ఓర్పు అలంకారంకాదా! దేవతలకుకూడా క్షమించుట అనునది ఆచరణసాధ్యం కానిది. మీరందరూ భేదములేకుండా ఎటువంటి ఓర్పుకలిగి ఉన్నారో అది ఇంకనూ దుష్కరం.

క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః।
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా విష్ఠితం జగత్॥

పుత్రికలారా! ఓర్పే దానం. ఓర్పే యజ్ఞం. ఓర్పే సత్యం. ఓర్పే కీర్తి. ఓర్పే ధర్మం. జగత్తు ఓర్పుచేత నిలచి ఉంది.

దానం క్షమారూపవగానే ఉంది. సత్పాత్రునకు దానం చేయుటకు నిరీక్షించాలి. యజ్ఞం క్షమారూపంగానే ఉంది అక్రోధియై శ్రద్ధకలిగి శ్రాద్ధవిధులు నిర్వర్తించాలి. దానికి ఓర్పుకావాలి. కీర్తికాములు కీర్తికొరకు కొన్ని సందర్భాల్లో జీవిత పర్యంతమూ ఎదురు చూడాల్సిరావచ్చు. కొందరకు మరణానంతరము రావచ్చు. ఓరిమితో ఉండవలసిందే. ధర్మాచరణమందు ఓర్పుకలిగి ఉండాలి. ఇవన్ని జగన్నియామక మైన కర్మలు. కావున జగత్తు క్షమాగుణం మీదనే నిలచి ఉంది.

రామా! దేవతలవంటి పరాక్రమం కలిగిన ఆలోచనాపరుడైన రాజు కన్యలను విడచి మంత్రులతోకూడి కన్యాదాన విషయమై ఆలోచించేడు.

ఆ కాలంలో గొప్ప తపస్సుకలవాడు ఊర్ధ్వరేతస్కుడు మంచినడవడికలవాడు అయిన “చూళి” అను మహర్షి వేదోక్తమైన తపస్సును చేసేడు.

తప్యన్తం తమృషిం తత్ర గన్ధర్వీ పర్యుపాసతే।
సోమదా నామ భద్రం తే ఊర్మిళా తనయా తదా॥

అలా అక్కడ తపస్సు చేస్తూన్న ఆ ఋషిని ఊర్మిళ కూతురైన సోమద అను గంధర్వస్త్రీ సేవించేది. నీకు మంగళమగుగాక! అని మహర్షి చెప్తున్నారు. ఎందుకంటే? అది ఈ కథా శ్రవణానికి ఫలం కనుక.

ఆమె చూళి విషయమున వినయవంతురాలై శుశ్రూష చేయుచు శ్రద్ధకలిగి ధర్మమునందు నిష్ఠకలదై నివసిస్తోంది. కొంతకాలానికి గురువైన చూళి ఆమె విషయంలో అంటే ఆమె పరిచర్యలకు సంతృప్తి చెందేడు.

రఘునందనా! కాలం కలిసివచ్చుటచే ఆ మహర్షి సోమద పరిచర్యకు సంతసించినవాడై ఆమెనుగూర్చి నీకు శుభ మగుగాక! నీకొఱకు ఏమి ప్రియమును చేయగలను అని అడిగేడు.

తన సేవలకు చూళిమహాముని సంతోషించారని తెలుసుకిని మాట్లాడుట తెలిసిన గంధర్వాంగన వినసొంపైన రీతిలో పరమప్రీతితో వాక్యకోవిదుడైన మునినిగూర్చి పలుకుతోంది.

గొప్ప తపస్సుగల నీవు బ్రహ్మవర్చస్సుతోకూడిన వాడవై బ్రహ్మవే అయి ఉన్నావు. ధార్మికుడా! బ్రహ్మవర్చస్సుతో కూడిన పుత్రుని కోరుచున్నాను.

అపతిశ్చాస్మి భద్రం తే భార్యా చాస్మి న కస్యచిత్॥

నేను పతిలేనిదానను. నీకు భద్రమగుగాక! ఎవ్వనికి భార్యగాకూడా లేను. నీ ఆశ్రయమందున్న నాకు బ్రహ్మ వర్చస్సుతో కుమారుని ఇమ్ము.

అపతిశ్చాస్మి అంటే నేను ఎవరియందు పత్నీత్వంకలదానిని కాదు. అంటే ఎవరి శ్రాద్ధవిధులలోను భాగస్వామ్యం లేనిదానను. ఎవరియందైన పత్నీత్వం ఉండి పరపురుషుని ఆశ్రయిస్తే పతిని అనుసరించి ఉంటానని చేసిన ప్రమాణమునకు భగం కలుగుతుంది. చెడినస్వభావం కలదవుతుంది. శౌచహీనులు శ్రాద్ధకర్మలకు పనికిరారు. దానివల్ల ధర్మంచెడుతుంది. ఎందువల్ల అంటే యజమాని శ్రాద్ధకర్మ నిర్వహణంలో ఆటంకం ఏర్పడుతుంది కనుక. నాయందు ఇటువంటి ఇబ్బందిలేదు. నేను ఎవరిచేత భరింపబడుట లేదు. కావున నీయందు పుత్రుని కంటే ధర్మమునకు హానిలేదు.

కుశనాభుని కుమార్తెల విషయంలో వారిని 'తండ్రికలవారిగా' చెప్పి తండ్రి అనుజ్ఞను పొందాలని ఉపదేశించారు. ఇక్కడ సోమదను **'ఊర్మిళా తనయా సోమదా'** అని చెప్పి ఈమె స్వాతంత్ర్యాన్ని చూపించేరు. కనుక తనే పుత్రుని అభ్యర్థించిననూ ధర్మలోపం జరగదని చెప్పింది.

అనుగ్రహించిన బ్రహ్మర్షిచూళి తనయొక్క మానసపుత్రుని బ్రహ్మదత్తుడని ఖ్యాతినిపొందిన ఉత్తముడైన పుత్రుని ఆమెకు ఇచ్చేడు. మానసపుత్రుడు అంటే సోమదకోరిన విధంగా బ్రహ్మతేజోవిరాజితుడైన పుత్రునికై మనస్సు నిలిపి ఆమెయందు పుత్రునికన్నాడని.

ఆ సోమదేయుడైన రాజు దేవేంద్రుడు స్వర్గమునువలె 'కాంపిల్యా' నగరమును గొప్ప ఐశ్వర్యముతో అధిష్ఠించి ఉన్నాడు.

రామా! అప్పుడు మంచి ధార్మికుడైన రాజైన కుశనాభుడు కన్యాశతమును బ్రహ్మదత్తునకు ఇచ్చుటకు ఆలోచనను చేసేడు. మహాతేజశ్శాలి మహీపతి అయన కుశనాభమహారాజు ఆ బ్రహ్మదత్తుని ఆహ్వానించి సంతోషాంతరంగుడై కన్యాశతాన్ని ఇచ్చేడు.

రామా! దేవింద్రునివంటి బ్రహ్మదత్తుడు క్రమమును అనుసరించి ఆ కన్యలను పాణిగ్రహణం చేసేడు.

అతడి హస్తములు స్పృశింపబడినంతనే ఆ కన్యాశతం గూని తొలగినవారై గొప్పదైన కాంతితోకూడినవారై ప్రకాశించేరు.

రాజైన కుశనాభుడు వాయుదోషము తొలగిన కుమార్తెలను చూచి చాలా సంతోషించాడు.

తరువాత కుశనాభుడు వివాహము చేసుకొన్న బ్రహ్మదత్త మహారాజును భార్యా ఋత్విగాది సమేతంగా అతని రాజ్యమునకు పంపేడు.

సోమదా చ సుసంహృష్టా పుత్రస్య సదృశీం క్రియామ్।
యథాన్యాయం చ గన్ధర్వీ స్నుషాస్తాః ప్రత్యనన్దత॥ ౨౬
స్పృష్ట్వా స్పృష్ట్వా చ తాః కన్యాః కుశనాభం ప్రశస్య చ।

గన్ధర్వస్త్రీ అయిన సోమద ఆ కన్యలను ఒక్కొక్కరిగా స్పృశించి వారి తండ్రియైన కుశనాభుని ప్రశంసించి, కుమారునియొక్క యుక్తమైన పనిని, కోడళ్ళను అభినందించింది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రయత్రింశ స్సర్గ సమాప్తము.

–

అథ చతుస్త్రింశ స్సర్గః

(గాధి జననము. సత్యవతీ వృత్తాంతము. రాత్రి వర్ణనము)

కృతోద్వాహే గతే తస్మిన్ బ్రహ్మదత్తే చ రాఘవ।
అపుత్రః పుత్రలాభాయ పౌత్రీమిష్టిమకల్పయత్॥ ౧

రాఘవా! ఆ బ్రహ్మదత్తుడు వివాహం చేసుకొని వెళ్ళిపోయేడు. కళకళలాడే ఇల్లు వెలవెలబోయింది. పుత్రులులేని రాజు పుత్రులకొరకు ప్రౌత్రీయమైన ఇష్టిని చేసేడు. అప్పుడు ఇష్టిజరుగు సమయంలో పరమఉదారుడైన బ్రహ్మపుత్రుడైన కుశుడువచ్చి కుశనాభునితో అంటున్నాడు.

పుత్రా! నీకు తగినవాడు మంచిధార్మికుడు అయిన పుత్రుడు కలుగగలడు. గాధి అను పేరుగల కుమారుని పొందగలవు. అతనిచేత శాశ్వతమైన కీర్తినికూడా పొందుతావు.

పుట్టబోయే వానికి గాధియని నామనిర్దేశం చేసేరు. పేరు పెట్టడం అనే పని పెద్దలు చెయ్యాలి. నేనేదో కష్టపడి కన్నాను. పిల్లాడు పుట్టడంకోసం ఆదేవుడిచుట్టూ ఈ దేవుడిచుట్టూ తిరిగేను. ఆ పారాయణ చేసేను. ఈ వ్రతాలు చేసేను. ఆయా దేవుళ్ళ అనుగ్రహంవల్ల పుట్టేడు కనుక ఆ దేవుళ్ళందరి పేర్లుకలిపి రాజవీధి అంతపొడవైన పేరు పెట్టడం. **'టామీ'** అని పిలుచుకోవడం. తప్పు. ఈవిధంగా చేయడం పెట్టిన పేరును, అనుగ్రహించిన దేవతను అవమానించటమే. పుత్రులకోసం యజ్ఞాలు చేసిన దశరథాది మహారాజులు సంతానంయొక్క నామకరణానికి కులపురోహితులను ఆశ్రయించేరు. పేరు అంటే మంత్రం. నామకరణంనుండి ప్రేతకర్మపర్యంతం అది నిత్యం అనుక్షణం స్మరింపబడుతూ ఉంటుంది. ఆ నామ శ్రవణ మనన ఉచ్చారణాదులద్వారా మనయందు అంతఃకరణ శుద్ధికలుగుతుంది. తద్వారా అభీష్టసిద్ధీ కలుగుతుంది. "రామో నామ జనైః శ్రుతః" జనులచేత "రామ" అనే వినబడతాడు. అంటే అలాగే పిలవబడతాడు అని. GOD అని పిలిస్తే ఆ భావనచేత కలిగిన అతఃకరణశుద్ధి అదే పదాలను వ్యత్యస్థం చేసి DOG అన్నప్పుడు కలిగిన భావనవల్ల రాదు. పేరొకటి పిలుపొకటి కాకూడదు.

రామా! కుశుడు మహీపతియైన కుశనాభునితో ఇలా చెప్పి ఆకాశమార్గమున శాశ్వతమైన బ్రహ్మలోకమునుగూర్చి వెళ్ళేరు.

కొంతకాలానికి ధీమంతుడైన కుశనాభునకు పరమధర్మిష్ఠి అయిన కుమారుడు గాధియను పేరుతో పుట్టేడు. అంటే కుశుడు చెప్పిన విధంగా గాధియని పేరుపెట్టేరు.

కుశవంశ ప్రసూతోఽస్మి కౌశికో రఘునందన।

రామా! పరమధార్మికుడైన గాధి నా తండ్రి. రఘునందనా! కుశవంశమునందు పుట్టిన నేను కౌశికుడను పేరు గలవాడను.

రఘువంశమున పుట్టుటచే నీవు ఎట్లు రాఘవుడవో కుశవంశమున పుట్టిన నేనునూ అట్లే! అని. రాఘవా! మంచి నియమములు కలది. సత్యవతియను పేరుగలది. నాకు ముందు పుట్టినదైన నా సోదరిని ఋచకునికి ఇచ్చేరు.

సశరీరాగతా స్వర్గం భర్తార మనువర్తినీ।
కౌశికీ పరమోదారా ప్రకృత్తా చ మహానదీ॥ ౮

ఆమె భర్తను అనుగమించి సశరీరంగా స్వర్గమునుగూర్చి వెళ్ళింది. మిక్కిలి ఉదారమైన కౌశికీ నదిగా ప్రవృత్తమైంది. నేను సోదరియగు కౌశికియందు స్నేహముతో హిమవత్పర్వత ప్రాంతమునందు సుఖముగా జీవిస్తున్నాను. ఆమె పుణ్యాత్మురాలు. సత్యధర్మములందు స్థిరంగా ఉండునది. పతివ్రత. పూజ్యురాలైన సత్యవతి నదులలో శ్రేష్ఠమైన కౌశికిగా ఉన్నది.

లోకహితాన్ని కోరి దివ్యమైన రమ్యమైన మలినరహితమైన ఉదకములు కలదైన నా సోదరి హిమవంతుని ఆశ్రయించింది.

ఇక్కడ సత్యవతి పత్నీత్వంచేతను భర్తృసేవాపరాయణత్వంచేతను గొప్ప అపూర్వాన్ని సంపాదించింది. కాని సంసారబంధనాలనుండి విడివడలేదు. తను సంపాదించిన కర్మఫలాన్ని అనుసరించి స్వర్గాన్ని చేరింది. సోపాధికంగా అంటే **అహం** భావనతోనే స్వర్గసుఖాలను అనుభవింది. తరువాత పరమోదారమైన మహానదిగా ఆర్భవించింది. అంటే అహంభావనను విడిచి పెట్టేదిశగా తన నడకసాగించింది అని. మహానదులు అన్నీ సాగరాన్ని చేరి తమదైన అస్తిత్వాన్ని **అహంభావనను** విడిచి సాగరరూపాన్ని పొందుతాయి.

ఆవిధంగా ఈమె మరుజన్మలో జ్ఞానాన్ని పొందింది అని చెప్పేరు.
రామా! నియమమువలన ఆమెను విడిచి సిద్ధాశ్రమానికి వచ్చేను. నీ తేజస్సుచేత కార్యసిద్ధినిపొందేను.
రామా! మహాబాహో! నీవు చెప్పమని అడిగేవు. నేను ఈ దేశాన్నిగూర్చి నాపుట్టుకనుగూర్చి నావంశమునుగూర్చి చెప్పేను.
రామా! కథలు చెప్పడంలో పడి అర్ధరాత్రి గడిచిపోయింది. ఇక నిద్రపో. మనకు మార్గమునందు విఘ్నముకాకుడదు. నీకు భద్రమగుగాక!
వృక్షములు నిశ్చలముగా ఉన్నాయి. మృగములు పక్షులన్ని అణగి ఉన్నాయి. మృగములు అంటే **ఇంద్రియవృత్తులు,** పక్షి **జీవుడు** వీళ్ళు అణగి ఉన్నారు. అంటే గాఢనిద్ర (సుషుప్తి)యందు ఉన్నాయి. చీకటి అన్ని దిక్కులకు వ్యాపించింది. మెల్లమెల్లగా సంధ్యాకాలం తొలగిపోయింది. నక్షత్రాలతోను గ్రహాలతోను నిండిన ఆకాశం జ్యోతిస్వరూపమైన నేత్రాలచే నిండినట్లుంది.
విభో! చల్లని కిరణములుగల చంద్రుడు లోకముల చీకట్లను తొలగించుచు కాంతిచేత లోకమందలి ప్రాణులయొక్క మనస్సులను సంతోషపెడుతూ పైకి వస్తున్నాడు.
రాత్రి సంచరించు సర్వప్రాణులు యక్షరాక్షస సంఘాలు భయంకరమైన నరమాంసభక్షకులు అక్కడక్కడ సంచరిస్తున్నారు.
అని చెప్పి విశ్వామిత్రమహర్షి విరమించేరు. మునులందరు సాధువచనములు పలికేరు. ఆయన్ని మెచ్చుకొన్నారు.
కుశికాత్మజులయొక్క ఈ వంశము పూజ్యమైనది. సదాధర్మమునందు ఆసక్తిగలది. ఈ కుశవంశమునందు పుట్టిన నరోత్తములు పూజ్యులు. బ్రహ్మతో సమానమైనవారు.
గొప్పకీర్తిగల విశ్వామిత్రా! కుశికాత్మజులలో నీవు విశేషముగా చెప్పతగ్గవాడవు. బ్రహ్మతుల్యుడవు. కౌశికి నీయొక్క కులమును ప్రకాశింపచేయునది.
ఈ విధంగా మునిశ్రేష్ఠులచేత ప్రస్తుతింపబడిన శ్రీమంతుడైన కుశికాత్మజుడు, శ్రీమంతుడైన సూర్యుడు అస్తాద్రిని పొందినట్లు నిద్రనుపొందేడు.

రామోఽపి సహసౌమిత్రిః కించిదాగత విస్మయః।
ప్రశస్య మునిశార్దూలం నిద్రాం సముపసేవతే॥

కించిత్ ఆశ్చర్యానికి లోనైన సౌమిత్రీసహితుడైన రాముడు విశ్వామిత్రుని ప్రశంసించి నిద్రించేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుస్త్రింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ పఞ్చత్రింశ స్సర్గః॥

(విశ్వామిత్రాదులు గంగాతీరముచేరుట. రామాదులకు విశ్వామిత్రుడు గంగావతరణ కథను చెప్పుట)

ఉపాస్య రాత్రిశేషం తు శోణాకూలే మహర్షిభిః।
నిశాయాం సుప్రభాతాయాం విశ్వామిత్రోఽభ్యభాషత॥

విశ్వామిత్రుడు శోణానదీతీరంలో మునులతోకలిసి రాత్రిశేషాన్ని గడిపేడు. రాత్రి తెల్లవారింది. మహర్షి మేల్కొన్నారు. పిల్లల్ని లేపుతున్నారు.

రాత్రి బాగా తెల్లవారింది. ప్రాతఃకాల సంధ్యవస్తోంది. రామా! లేలే. నీకు భద్రమగుగాక! ప్రయాణమునుగూర్చిన ఆసక్తుడవు కమ్ము.

ఈ మధ్యకాలంలో నిద్ర లేపవలసి రాలేదు. ముందటి రాత్రి ఆలస్యమైన కారణంగా అలసిన శరీరాల్తో పడుకొన్న పిల్లల్ని లేపవలసివచ్చింది. పిల్లలకు ప్రయాణాలంటే ఉండే సహజమైన ఇష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంకా సంధ్యావందనాది ప్రాతఃకృత్యాలు నిర్వర్తించాలి. లేవండి లేవండి తొందరగా బయలుదేరాలి అంటున్నారు.

విశ్వామిత్రమహర్షి మాటలు విని పూర్వాహ్ణిక క్రియల్ని నిర్వర్తించి ప్రయాణానికి సిద్ధమై మాట్లాడుతున్నాడు.

బ్రహ్మన్! మంగళకరమైన జలములుకలది. ఇసుక తిన్నెలతో అలంకరింప బడినదైన శోణనదిని మనం ఏలా దాటుదాం? అని అడిగేడు.

ఆ నదియొక్క కొన్ని ప్రదేశాల్లో నీరు బాగా ఉంది. కొన్ని ప్రదేశాల్లో ఇసుకమేటలు ఉన్నాయి. దారి సంశయగ్రస్తంగా ఉంది. మహర్షీ ఏం చేద్దాం! అని అడిగేడు. రాముని చేత ఈ విధంగా అడుగబడిన విశ్వామిత్రుడు

ఏష పన్థా మయోద్దిష్టో యేన యాన్తి మహర్షయః॥ ౫

మహర్షులు ఏమార్గంలో వెళ్తున్నారో ఆ మార్గంలోనే వెళ్దాం.

నడక ప్రశ్నార్థకమైతే అనుభవజ్ఞులను అనుసరించడం సర్వశ్రేయోదాయకం.

ఆ విషయాన్ని చెప్పేరు మహర్షి. ధీమంతుడైన విశ్వామిత్రునిచే ఈవిధంగా పలుకబడిన మహర్షులు అనేక విధాలైన వనములను చూస్తూ ముందుకు వెళ్తున్నారు.

చాలాదూరం ప్రయాణం చేసేరు. మధ్యాహ్న సమయమైంది. మునులచే సేవింపబడు గంగానదీ దర్శనమైంది.

తాం దృష్ట్వా పుణ్యసలిలాం హంససారస సేవితామ్।
బభూవుర్ముదితాః సర్వేమునయః సహ రాఘవాః॥ ౮

పుణ్యమైన ఉదకములు కలది హంసలచేత సారసపక్షులచేతను సేవింపబడిన గంగానదిని చూచేరు. రామునితో సహా మునులందరూ సంతోషించేరు.

ఇక్కడ గంగానదిగూర్చి **హంససారస సేవితామ్** అని చెప్తున్నారు. ఈ నది హంసలచేత సేవింపబడుతోంది.

తమస్సును పోగొట్టువారిచేత సేవింపబడుతోంది. బ్రహ్మవేత్తలచే సేవింప బడుతోంది. సరస్సులోని తామరపూలవంటి సంసారులు. వీరు ఆస్తిక్యబుద్ధిచే కర్మలు చేయువారు. కర్మఠులైన సంసారులు. వీరిద్దరిచేత సేవింపబడుతోంది. పుణ్యాత్ములు మహర్షులు ఎదురైతే నమస్కరించాలి. పుణ్యనదులు కనబడితే స్నానం చేయాలి. పుణ్యాత్ములను పుణ్యనదులను విడిచి వెళ్ళవలసివస్తే అనుజ్ఞనుపొందాలి.

అటువంటి గంగను చూచి ఆనందించేరు. తీరప్రాంతలో బసచేసేరు. స్నానంచేసేరు. పితృదేవతలకు తర్పణాలు విడిచేరు. అగ్నిహోత్రాది కర్మలు చేసేరు. తరువాత **ప్రాశ్య చామృతవద్ధవిః** అమృతమువంటి హవిస్సును భుజించేరు. అంటే అన్నం తినడంకూడా యజ్ఞకర్మయే అని భావించి ఆహుతిపూర్వకంగా భోజనంచేయాలని శ్రుతి చెప్తోంది. దానిద్వారా అన్నశుద్ధి తద్వారా చిత్తశుద్ధి కలుగుతాయి. కనుకనే ఆ మహర్షులను **ముదిత మనస్కు**లని చెప్పేరు. వీరందరూ విశ్వామిత్రుని చుట్టూచేరేరు.

ఎందుకు ఎప్పుడూ రాముడే అడుగుతున్నాడు. ఆక్కడ ఉన్న మిగిలిన మునులు వారు ఎందుకు అడగరు? అంటే కథాశ్రవణం అంటే అందరికీ ఆసక్తే. కాని విశ్వామిత్రుడిని అడిగితే ఏమంటాడో! అదే మనవడి వయస్సులో ఉన్న రాముడు అడిగితే? అడిగిందే తడవుగా ఎన్ని కథలైనా చెప్తాడు. లోకంలోకూడా మనుమడు అడిగితే కథలు చెప్పే తాత, కొడుకు అడిగితే చెప్పడు. పైగా ఇది కథలు వినే వయస్సా! చదువుకొని తెలుసుకోలేవు అని కసురుతాడు.

అంటే చదువుకొని తత్త్వం తలుసుకోమని. కనుకనే ఇక్కడ కథాభాగమంతా మనుమడి (మనుమడి వయస్సున్న రాముడితో)తోనే నడిపేరు. మనంకూడా రామాయణాన్ని కథాలా పిల్లలికి చెప్పాలి. మనం చదివి తత్త్వాన్ని తెలుసుకోవాలి. పెద్దలకు చెప్పవలసివస్తే తత్త్వంచెప్పాలి. పెద్దలకు కూడా కథలా చెప్పి విడిచిపెడితే అది శ్రీమద్రామాయణమైన మరేదైనా సంశయాత్మకుల్ని తయారుచేస్తుంది. ఆస్తిక్యబుద్ధిని పాడుచేస్తుంది.

ఇదిగో రాముడు విశ్వామిత్రుడిని అడుగుతున్నాడు. భగవన్! త్రిపథగయైన గంగానదినిగూర్చి తెలుసుకోవాలనుకొంటున్నాను. లోకత్రయాలను ఆక్రమించిన ఈ నది ఎలా సముద్రంలో కలిసింది? అని అడిగేడు.

రామవాక్యముచే ప్రేరితుడైన విశ్వామిత్రుడు గంగానదియొక్క పుట్టుకను వృద్ధినిగూర్చి చెప్పుటకు ఉపక్రమించేరు.

రామా! ధాతువులకు నిధియైన హిమవంతుడను పర్వతరాజు, అతనికి భూలోకంలో సాటిలేని సౌందర్యంకల ఇరువురు కన్యలున్నారు.

రామా! అందమైన నడుముకలది మేరువుయొక్క కూతురైన **మనోరమ** ఆ కన్యాద్వయానికి తల్లి. ఈ హిమవంతునికి మనోరమయందు గంగ అను పెద్దకూతురు. ఉమ అను రెండవ కూతురు జన్మించేరు.

తరువాత దేవతలందరూ వారి ప్రయోజనముకొరకు మూడుమార్గముల ప్రవహించు నదియైన గంగనుగూర్చి కొండదొరను యాచించేరు.

ఆ హిమవంతుడు ధర్మబుద్ధితో లోకత్రయముయొక్క హితముకోరి స్వేచ్ఛగాచరించు లోకపావనియైన గంగను ఇచ్చేడు.

దేవతలు లోకత్రయమునకు హితము చేయువారై గంగను స్వీకరించి కృతార్థులమైనామను మనస్సుతో వెళ్ళేరు.

హిమవంతుని మరియొక పుత్రికైన ఉమ తపోధనురాలై ఉగ్రమైన వ్రతమును అవలంబించింది. హిమవంతుడు ఉగ్రమైన తపస్సుతోకూడిన సర్వలోక నమస్కృతయైన ఉమయను కూతురును సాటిలేని రుద్రునకు ఇచ్చి వివాహంచేసేడు.

రామా! హిమవంతుని కుమార్తెలైన నదులలో శ్రేష్ఠురాలైన గంగా మరియు ఉమ అనువారలు సర్వలోక నమస్కృతులు.

అందమైన నడక కలవాడా! మూడుమార్గములందు చరించు గంగానది ముందుగా ఏవిధంగా ఆకాశమును పొందింది చెప్పాను.

సైషా సురనదీ రమ్యా శైలేన్ద్రస్య సుతాతదా।
సురలోకం సమారూఢా విపాపాజలవాహినీ॥

రమ్యమైన పాపరహితమైన జలరూపమున ప్రవహించు ఈ కొండదొర కూతురు సురనదిగా మారి స్వర్గమును అధిరోహించింది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చత్రింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ షట్త్రింశ స్సర్గః॥

(పార్వతి దేవతలను భూదేవిని శపించుట)

ఉక్తవాక్యే మునౌ తస్మిన్నుభౌ రాఘవలక్ష్మణౌ।
ప్రతినన్ద్య కథాం వీరావూచతుర్ముని పుఙ్గవమ్॥

రామలక్ష్మణులు మహర్షి చెప్పిన కథను మెచ్చుకొంటు విశ్వామిత్రునితో మాట్లాడుతున్నారు.

మునీంద్రా! ధర్మయుక్తమైన శ్రేష్ఠమైన కథను నీవు చెప్పేవు. నీవు కథా విస్తారములు తెలిసినవాడవు. హిమవంతుని పెద్దకూతురైన గంగకు సంబంధించిన దేవ మనుష్య లోక సంబంధమైన విషయమును చెప్పండి.

ధర్మజ్ఞుడా! లోకపావనియైన గంగ ఏకారణంచేత మూడు మార్గాల్లో ప్రవహిస్తోంది. ఏకర్మచేత లోకత్రయమందు ఉత్తమమైనదని ప్రసిద్ధి పొందింది. అని అడిగేరు.

రాముడు అడిగిన దానిని విని విశ్వామిత్రుడు ఋషులమధ్య ఉన్నవాడై మొత్తం కథను పూర్తిగా చెప్పేరు.

పరంతపా రామా! పూర్వం మహాతపశ్శాలియైన ఈశ్వరుడు వివాహం చేసుకొని దేవిని చూచి ఆసక్తితో మైథునమునకు ఉపక్రమించేరు. శితికంఠుని క్రీడలో వంద దివ్యసంవత్సరాలు గడచిపోయేయి. కాని కుమారుడు జనించలేదు.

తరవాత బ్రహ్మాది దేవతలందరూ ఈ దేవియందు ఏప్రాణి పుట్టునో? దానిని ఎవడు సహింపగలడు. అని కలతచెందేరు.

బ్రహ్మాదులందరూ ఈశ్వరుని వద్దకు వెళ్ళి నమస్కరించేరు. దేవదేవా! ఈ లోకహితమునందు ఆసక్తి కలవాడా! మహాదేవా! దేవతలందరూ నమస్కరిస్తున్నారు అనుగ్రహించు.

ఓసురోత్తమా! నీ తేజస్సును లోకములు ధరింపజాలవు. వేదోక్తరీత్యా పార్వతితోకూడి తపస్సుచేయుము. లోకత్రయ హితముకొరకు తేజస్సును (వీర్యమును) తేజస్సునందు ఉంచుము.

అన్ని లోకములకు ప్రభువైన ఈశ్వరుడు దేవతలయొక్క మాటలను విని అట్లే అగుగాక! అని పలికేడు. ఇంకా చెప్తున్నాడు.

ఉమాసహితుడైన నేను నా తేజస్సును (రేతస్సును) తేజస్సునందే ధరిస్తాను. దేవతలు పృథివి భయపడకుందురుగాక! స్వస్థానమునుండి క్షోభింపబడిన నా తేజస్సును ఎవడు ధరించగలడు. నాకు చెప్పండి అని పలికేరు.
పరమేశ్వరుని మాటలు విన్న దేవతలు. చలించిన నీ తేజస్సును భూమి ధరించగలదని చెప్పేరు.
దేవతలు చెప్పినవిధంగా సురపతి అయిన శివుడు తేజస్సును భూమిపై విడువగా ఆ తేజస్సు పర్వతాలు అరణ్యాలతోకూడిన భూమి అంతటా వ్యాపించింది.
తరువాత దేవతలు మరల అగ్నినిగూర్చి వాయువుతోకూడి రుద్రసంబంధమైన గొప్పతేజస్సును ప్రవేశించమని ఆజ్ఞాపించేరు.
అగ్నిచేత వ్యాప్తమైన పరమేశ్వర తేజస్సు తెల్లని పర్వతమైంది. ఆదిత్యుడితోను అగ్నితోను సమానమైన దివ్యమైన తెల్లుగడ్డిగా అయింది.
ఆ తెల్లుగడ్డియందే మహాతేజశ్శాలి అగ్నినుండి పుట్టినవాడు కృత్తికా కుమారుడు పుట్టేడు.
ఋషిగణాలతోకూడిన దేవతలు చాలసంతోషించిన మనస్సుకలవారై ఉమాదేవిని శివుని పూజించేరు.
తరువాత ఉమాదేవి కోపంతోకూడినదై కోపంతో ఎఱ్ఱబడ్డ కన్నులుకలదై అందర్నీ శపించింది.
పుత్రునికోరి మేము చేయు సంగమమును నివారించిన కారణంగా మీకు మీ భార్యలయందు సంతానం కలుగకుండుగాక! అని.
నేడు మొదలు మీ పత్నులకు సంతానం కలుగకుండుగాక! అని దేవతలందర్నీ శపించి, పృథివినికూడా శపించింది.
ఓభూమీ! నీవు అనేక రూపములు కలదానవై అనేకులకు భార్యకాగలవు. నాకు పుత్రుడు కలుగుటకు ఇష్టపడని నీకు నా కోపఫలంగా పుత్రులవలన కలుగు ఆనందాన్ని పొందకుందువుగాక! అని శపించింది.
సురపతియైన శివుడు సిగ్గుపడుతున్న సమస్తమైన దేవతలను చూచి వరుణుడిచే పాలింపబడుచున్న పశ్చిమదిక్కునకు వెళ్ళుటకు బయలుదేరెను.

ఆ మహేశ్వరుడు ఆ పర్వతమునందే పశ్చిమదిక్కుగా వెళ్ళి ఆ హిమవత్పర్వతము ఉత్తరపార్శ్వమునందు పుట్టిన శిఖరమునందు ఉమాదేవితోకూడి తపస్సు చేసేరు.

ఏషతే విస్తరే రామ శైలపుత్ర్యా నివేదితః।
గఙ్గాయా ప్రభవం చైవ శ్రుణుమే సహలక్ష్మణః॥

రామా! ఉమాదేవికి సంబంధించిన విస్తారమైన కథను నీకు చెప్పేను. లక్ష్మణసహితుడవై గంగా ప్రభావాన్నికూడా వినిండి. అన్నారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షట్త్రింశ స్సర్గ సమాప్తము.

॥అథ సప్తత్రింశ స్సర్గః॥

(కార్తికేయ జననము)

తప్యమానే తపోదేవే దేవాః సర్షిగణాః పురా।
సేనాపతిమభీప్సన్తః పితామహ ముపాగమన్॥ ౧

పూర్వము పరమేశ్వరుడు తపస్సు చేయుచుండగా ఋషిగణములతో కూడిన దేవతలు సేనాపతిని కోరుచూ బ్రహ్మదేవుని ఆశ్రయించేరు.

తరువాత అగ్నిని ముందుంచుకొని ఇంద్రాది దేవతలు భగవంతుడైన బ్రహ్మకు నమస్కరించి మాట్లాడుతున్నారు.

యో నః సేనాపతిర్దేవ దత్తో భగవతా పురా।
తపః పరమమాస్థాయ తప్యతే స్మ సహోమయా॥ ౨

దేవా! భగవవంతుడవైన నీచే పూర్వము మాకు ఏ సేనాపతి ఇవ్వబడ్డాడో అతడు ఉమాసహితుడై గొప్ప తపస్సును అవలంబించి తపస్సు చేస్తున్నాడు. పూర్వము బ్రహ్మ దేవతలకు రుద్రుని సేనాపతిగా చేసేడు. కానీ ఇప్పుడు రుద్రుడు ఉమాసహితుడై చాంద్రాయణాది గొప్ప వ్రతములను అవలంబించి తపస్సుచేస్తున్నాడు. కార్తికేయుడు సేనాపతిత్వాన్ని చేపట్టేవరకు ఇక్ష్వాకువంశీయుడైన ముచికుందుడు అను రాజు సేనాపతిగా సహాయం చేసేడు.

ఉపాయములు తెలిసినవాడా! లోకహితం కోరి ఈ విషయమున (దేవసేనాపతి విషయమున) ఏమి చేయతగినదో దానిని చేయుము. నీవే మాకు శరణుకదా! దేవతల ఆర్తినిగూర్చి విన్నాడు. ఉపలాలన మాటలతో దేవతల భయాన్ని తొలగిస్తున్నాడు.

ఉమాదేవి శాపకారణంగా మీరు మీ భార్యలయందు సంతానమును పొందలేరు. ఆమె వాక్కు అడ్డగింపరానిది. ఇది సత్యం. సంశయంలేదు. శత్రువులను నశింపచేయు దేవసేనానిని గంగయందు అగ్ని పుట్టింపగలడు. హిమవంతుని పెద్దకూతురు అగ్నియొక్క కుమారుని అంగీకరింపగలదు. అది ఉమకు సమ్మతమైనదే. సంశయములేదు.

రామా! దేవతలందరూ బ్రహ్మవాక్కును విని వచ్చిన పని నెరవేరినదని ఆనందముతో బ్రహ్మదేవుని పూజించిరి.

ఆ దేవతలందరూ ధాతువులచే అలంకరింపబడిన కైలాసగిరినిగూర్చి వెళ్ళేరు. పుత్రునికొఱకు అగ్నిని ఆజ్ఞాపించేరు.

దేవా! హుతాశనా! ఈ దేవతాకార్యము చేయుము. గొప్ప తేజస్సు కలవాడా! నీయందున్న మహేశ్వర తేజస్సుని హిమవంతుని కూతురైన గంగయందు ఉంచుము.

పావకుడు దేవతలకు మాట ఇచ్చేడు. గంగను సమీపించి దేవీ! గర్భమును ధరింపుము. ఈ కార్యము దేవతలకు ప్రియమైనది. అని పలికేడు.

ఆ అగ్నియొక్క మాటలను విని గంగ దివ్యమైన రూపాన్ని ధరించింది. ఆ అగ్ని గంగయొక్క మహిమను చూచి అంతటా వ్యాపించేడు.

రఘునందనా! తరువాత పావకుడు పరమేశ్వరవీర్యంచేత గంగాదేవిని అంతటా తడిపేడు. గంగయొక్క సర్వావయవములు పరమేశ్వర తేజస్సుచే నిండిపోయేయి.

ఆ గంగ సర్వదేవపురోహితుడైన ఆ అగ్నినిగూర్చి–

ఓదేవా! విజృంభించిన నీయొక్క తేజస్సును ధరించుటయందు అసమర్థురాలను. ఆ అగ్నిచేత (రేతస్సుచేత) దహింపబడుచున్న నేను స్పృహ కోల్పోతున్నాను అంది.

సర్వదేవ హుతాశనుడు (దేవతలకొఱకు హోమద్రవ్యా లను భుజించువాడు) గంగనుగూర్చి –

గంగా! ఈ గర్భమును ఇచ్చట హిమవత్పర్వత సమీపము నందు ఉంచు అని చెప్పేడు.

అనఘాత్ముడవైన రామా! అగ్నియొక్క మాటను విని గంగ మిక్కిలి ప్రకాశించుచున్న ఆ గర్భమును అవయవముల నుండి విడిచింది.

ఈ గంగనుండి కరిగిన బంగారమువంటి కాంతిగల ఏ తేజస్సు బయలుదేరి భూమిని పొందిందో దానినుండి బంగారము, స్వచ్ఛమైన వెండి పుట్టేయి.

అచ్చట తీక్ష్ణత్వమునుండి (క్షారగుణమునుండి) రాగి, ఇనుము పుట్టేయి. ఆ రేతస్సుయొక్క మలము తగరముగా సీసముగా అయ్యేయి. ఈ వీర్యము భూమిని పొంది అనేక విధములైన ధాతువులుగా వృద్ధి చెందింది.

గర్భము అక్కడ ఉంచబడగానే పర్వతముపై మొలచిన సమస్తమైన శరవణము (రెల్లుగడ్డి) సువర్ణమై తేజస్సులచే ప్రకాశింపబడినదైంది.

పురుషవ్యాఘ్రా! రామా! అగ్నితో సమానమైన కాంతిగల బంగారం జాతరూపమని ప్రఖ్యాతిని పొందింది. సమస్తమైన తృణవృక్షలతాగుల్మాదికమూ బంగారంగా అయ్యింది.

అంతట ఇన్ద్రాది మరుద్గణములు, పుట్టిన కుమారునికి క్షీరమునిచ్చి ఆదరించుటకై కృత్తికలను ఏర్పరిచేరు.

ఆ కృత్తికలందరూ ఒక నిశ్చయానికి వచ్చారు. ఈ శిశువు మాకందరకూ పుత్రుడు కావలెనను కట్టుబాటు చేసుకొన్నారు. అప్పుడే పుట్టిన శిశువుకు చనుబాలను ఇచ్చేరు.

ఎప్పుడైతే కృత్తికలు ఆ శిశువునందు పుత్రభావమును పొందేరో, ఆక్షణమే వారందరూ మాతృత్వము కలవారైయ్యేరు.

స్వామియందు పుత్రభావాన్ని పొంది ఈ సర్గలు పారాయణ చేసిన నిస్సంతులు సంతానవంతులుగా అగుదురని శ్రీమద్రామాయణంలోని రహస్యం.

ఈ పుత్రుడు కార్తికేయుడని కృత్తికల పుత్రుడని లోకత్రయమునందు ప్రఖ్యాతిని పొందుతాడని దేవతలు పలికేరు.

దేవతల పలుకులు విన్న కృత్తికలు గర్భస్రావమునందు జారిపడినవాడు అగ్నివలె పరమసౌందర్యముతో ప్రకాశించువాడైన ఆ శిశువునకు స్నానం చేయించేరు.

రామా! మహాభాగ్యవంతుడు అగ్నితో సమానమైనవాడు గర్భస్రావంవలన జారిపడిన కార్తికేయుని స్కందుడని పిలిచేరు.

అంతలో కృత్తికలకు సమృద్ధిగా క్షీరము ప్రాదుర్భవించింది. ఆరుగురియొక్క స్తన్యములందు పుట్టిన క్షీరమును ఆరుముఖములు కలవాడై గ్రహించేడు.

సమర్థుడైన కార్తికేయుడు ఒక్కరోజుమాత్రమే పాలు త్రాగేడు. సుకుమారమైన శరీరం కలవాడైననూ తన పరాక్రమంచేత దైత్యసేనలను జయించేడు.

పిమ్మట అగ్న్యాది దేవగణములు పరమశోభాయమానంగా ఉన్న అతనిని దేవసేనానిగా అభిషేకించేరు.

రామా! నాచేత గంగయొక్క విస్తారమైన కథ చెప్పబడింది. ధన్యత్వమును కలిగించునది పవిత్రమైనది అయిన కుమారసంభవము కూడా చెప్పబడినది.

భక్తశ్చ యః కార్తికేయే కాకుత్స్థ భువి మానవః।
ఆయుష్మాన్ పుత్రపౌత్రైశ్చ స్కన్దసాలోక్యతాం వ్రజేత్॥ ౩౨

రామా! భూలోకంలో ఏ మానవుడు కార్తికేయుని భక్తుడో అతడు ఆయుష్మంతుడు వంశవృద్ధికలవాడై స్కందునితో సాలోక్యమును పొందును.

(ఇక్కడ కొన్ని రహస్యాలను చెప్పేరు మహర్షి. పరమేశ్వర వీర్యంనుండి బంగారం వెండి రాగి ఇనుము తగరము సీసము మొదలైన లోహాల ఆవిర్భావం జరిగిందని చెప్పేరు. పరమేశ్వర వీర్యమంటే పాదరసం.

బంగారం వెండి ధాతువులు శరీర నిర్మాణంలో భాగంగా స్మరింపబడ్డాయి. ఇవి విషపదార్థములు కావు. రాగి ఇనుము శరీర పోషణకు ఉపయుక్తమైన ధాతువులు. తగరము, సీసము ఇవి మలము అని చెప్పి విషలక్షణం కలవని చెప్పేరు. సీసము ఇది పళ్ళలోను, ఎముకులలోను ఉంటుంది. ఇవికాక అనేక ధాతువులు శరీరనిర్మాణంలో పాలుపంచుకొంటున్నట్లుగా చెప్పేరు. పాశ్చాత్యుల దగ్గర 10000 B.C నాటికి రాగినిగూర్చిన ఆధారాలున్నాయి. ఈ శ్రీమద్రామాయణం అంతకు పూర్వమే వాల్మీకిచే రచింపబడిందని చెప్పొచ్చు. ఈ కుమారజననం సమయమునకు గంగ ప్రకాశ స్వరూపంగా ఉంది. అంటే ఘనీభూతమైన జలరూపంగా(glacier)ఉంది. హిమాలయ ప్రాంతంలో అపారమైన పాదరసనిక్షేపాలు ఉన్నట్లుగా రసవాద తంత్రాలలో చెప్పేరు. ఇప్పటి గంగ నదీరూపాన్ని పొంది ఇప్పటికి 80000 సంవత్సరాలని ఇప్పటి శాస్త్రవేత్తలు చెప్తున్నారు. 80000 సంవత్సరాలకు పూర్వమే స్వర్ణ రజతాది లోహములకు సంబంధించిన విజ్ఞానం మనకు కలదని చెప్పొచ్చు. బాలకాండలో మహర్షి ఇటువంటి ఆధారములను చాలా చోట్ల నిక్షిప్తంచేసేరు. వాటి ఆధారంగా రామాయణ కాలనిర్ణయం చేసే అవకాశం ఉంది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తత్రింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ అష్టత్రింశ స్సర్గః॥

(సగరుని చరిత్ర. సగరునకు సంతాన ప్రాప్తి. సగరుడు అశ్వమేధ యాగము చేయుటకు ఉపక్రమించుట.)

తాం కథాం కౌశికో రామే నివేద్య కుశికాత్మజః
పునరేవాపరం వాక్యం కాకుత్థ్స మిదమబ్రవీత్॥ ౧

కుశికాత్మజుడైన కౌశికమహర్షి (కుమారసంభవ వృత్తాంతాన్ని) ఆకథను రామునకు చెప్పి అంటే కొండదొర కూతుళ్ళ కథలను కుమారసంభవ పర్యన్తం చెప్పి మరల ఇంకొక విషయాన్ని చెప్తున్నారు.

పూర్వము అయోధ్యాధిపతీ శూరుడు ధర్మాత్ముడు అయిన సగరుడను రాజు ఉండేవాడు. అతడు సంతానము లేనివాడై సంతానమునందు కోరిగలవాడై ఉన్నాడు.

రామా! కేశిని అను పేర ప్రసిద్ధిగల ఉత్తమురాలు సత్యవాదిని అయిన విదర్భరాజ కుమార్తె సగరుని పెద్దభార్య. అరిష్టనేమియొక్క కుమార్తె గొప్పసౌన్దర్యవతైన సుమతి సగరుని రెండవభార్య.

ఆ రాజు ఇద్దరు భార్యలతో హిమవత్పర్వతమునకు పోయి భృగుప్రస్రవణమను పర్వతమునందు తపస్సు చేసేడు. ఏమిటి తపస్సు అంటే...

సర్వాభీష్టప్రదమైన మహాత్ముల సేవ. మహాత్ముడైన భృగువుని సేవిస్తున్నాడు. కోరిక చెప్పలేదు. ఎంతకాలం సేవించాలో తెలియదు. అనుగ్రహిస్తాడో లేదో అదీ తెలియదు. ఒక్కోసారి ఈ జన్మకు కలుగకపోవచ్చు. కానీ మహాత్ముల సేవాఫలం వృధాపోదు. వందసంవత్సరాలు ఏకదీక్షగా సేవించేడు.

సగరునియందు మహర్షికి అనుగ్రహంకలిగింది. సగరుని తపస్సునకు భృగువు వరమును ఇచ్చేరు.

అపత్యలాభం సుమహాన్ భవిష్యతి తవానఘ
కీర్తిం చాప్రతిమాం లోకే ప్రాప్స్యసే పురుషర్షభ॥ ౭
ఏకా జనయితా తాత పుత్రం వంశకరం తవ
షష్టిం పుత్రసహస్రాణి అపరా జనయిష్యతి॥ ౮

ఓ పుణ్యాత్మా! నీకు చాలా గొప్పదైన సంతానలాభం (బహు సంతానం) కలుగుతుంది. లోకంలో సాటిలేని కీర్తికూడా ప్రాప్తిస్తుంది.
నాయనా! నీ ఇద్దరి భార్యలలో ఒకతె వంశవృద్ధికరుడగు పుత్రుని కనగలదు. రెండవ భార్య అరువదివేలమంది పుత్రులను కనగలదు.
అప్పుడు రాజపుత్రికలు పరమప్రీతితో అంజలిబద్ధులై మహాత్ముడైన భృగువునిగూర్చి బ్రహ్మర్షీ! మాలో ఎవరికి ఒక కుమారుడు కలుగుతాడు, ఎవరు చాలా మందికి జన్మనిస్తారు?

శ్రోతుమిచ్ఛామహే బ్రహ్మన్ సత్యమస్తు వచ స్తవ॥ ౧౦

బ్రహ్మన్! ఇది మేము తెలుసుకోవాలనుకొంటున్నాము. నీ వాక్యము సత్యమగుగాక! అన్నారు. ఇక్కడ **తవ వచనం సత్యమస్తు** అనునది భృగువునకు వీరు చేయు ఆశీర్వచనము కాదు. మాకు శుభమగుగాక! అను ఆకాంక్ష.
పరమధార్మికుడైన భృగువు వారిమాటలను విని ఈ విషయంలో మీరు స్వతంత్రులు. మీ ఇచ్ఛను అనుసరించి కోరుకోండి అన్నారు.
వంశకరుడైన ఒక్కడా? మహాబలవంతులు కీర్తిమంతులు గొప్ప ఉత్సాహవంతులు అయిన బహుసంతానమా? మీలో ఏది ఎవరికి కావాలి?
రామా! పెద్దభార్య అయిన కేశిని ధర్మాన్ని అనుసరించి వంశకరుడైన పుత్రుని కోరింది.
గరుత్మంతుని సోదరియైన సుమతి మహోత్సాహవంతులు కీర్తిమంతులు అగు అరవైవేలమంది పుత్రులను గ్రహించింది.
(ఇక్కడ ఒక రహస్యం ఉంది. అప్పటికి హిమవత్పర్వతం క్రొత్తగా ఏర్పడింది. ఆపర్వతంపై భృగుమహర్షి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకొని సమాజాభ్యుదయం కొరకు కృషి చేస్తున్నారు. ఆ హిమాన్ని జలంగా భూమిపైకి తెచ్చి జీవజాలానికి ఉపయోగపడేటట్లు చెయ్యాలి. అది అప్పటి అవసరం. దానికై ఎన్నో ప్రయత్నాలు, ఎన్నెన్నో వ్యూహాలు. అందులో భాగంగానే ఈ అపుత్రుని పుత్రవంతునిగా చేసే ప్రయత్నం.
నీకు సంతానాన్ని అనుగ్రహిస్తున్నాను. అందులో ఒకడు నీకు సంబంధించిన

వాడు. నీ వంశమును వృద్ధిచేస్తాడు. "తాత! **తవ వంశకరం** పుత్రం **ఏకా** జనయిష్యతి" నాయనా నీకు వంశకరుడైన పుత్రుని ముఖ్యురాలు కనగలదు. అని చెప్పేరు కదా! అందుకని కేశిని వంశకరుడైన పుత్రుడు కావాలని అడిగింది. ఎందుకంటే మహారాణియై పత్నీ స్థానంలో ఉన్న ఆమెకు పుట్టిన సంతానమే ధర్మ సంతానం. కావున ఆమెయే వంశకరుడైన వానిని కోరుకొంది. మిగిలిన సంతానము గౌణము. ఎలా రాజ్యంలోని పౌరులు అందరు రాజునకు సంతానమో; అలానే మిగిలిన అరవైవేలమంది. వీరు దేశముయొక్క శ్రేయస్సుకొరకైన వారు. వీరివల్ల నీ వంశవృద్ధి జరగదు. వీరంతా ప్రజాహితం కొరకై పుడుతున్నారు. వారివల్ల నిర్వహింపబడ వలసిన బృహత్ప్రయోజనం ఒకటుంది. అది జరగాలి. తన్నిమిత్తంగా వ్యూహ రచనచేసేరు.)

రామా! సగరుడు భార్యాసమేతుడై ఋషికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి తన పురమునకు ప్రయాణమైయ్యేడు. కాలం గడచింది జ్యేష్ఠపత్ని అయిన కేశిని సగరాత్మజుడైన అసమంజుడు అను పుత్రునికి జన్మనిచ్చింది.

సుమతిస్తు నరవ్యాఘ్ర గర్భతుమ్బమ్ వ్యజాయత
షష్టిః పుత్రసహస్రాణి తుమ్బభేదాద్వినిఃసృతా॥ ౧౭

ఓ నరశ్రేష్ఠా రామా! సుమతి సొరకాయవంటి గర్భపిండాన్ని కన్నది. పతనమైన పిండము పగిలి అరవైవేలమంది పుత్రులు కలిగేరు.

గర్భతుమ్బమ్ వ్యజాయత అన్నారు మహర్షి. తుంబి, కటుతుంబి అని రెండు రకాలు. తుంబి ఉపయోగించు కొనుటకు వీలైన వ్యవస్థలోనిది. కటుతుంబి నిరుపయోగ మైనది. పూర్ణాకృతిని పొందక పిండదశలోనే గర్భపాత మైనప్పటికి దీనియందలి జీవపదార్థము చెడలేదని భావము.

అప్పటికి మానవసమాజం సంఖ్యాపరంగా ఇంత విస్తారంగా లేదు. సంఖ్యాపరంగా ఇంత విస్తృతిని పొందటానికి చాలాకాలం పడుతుంది. వ్యూహంలో భాగంగానే అమెకు (సుమతికి) గర్భపాతం చేసి, అలా పతనమైన పిండాన్ని అరవైవేల భాగాలుగా విభాగించి ఘృతపూర్ణమైన పాత్రలలో ఉంచి బాగుగా వృద్ధి పొందించేరు. ఘృతపాత్రలంటే కృత్రిమ గర్భాశయాలు. ఈ విజ్ఞానం భారతకాలం వరకు ఉంది. ఈ విజ్ఞానమును కలిగిన వారు

అంటే సృష్టించే సామర్థ్యం కలిగినవారు "బ్రహ్మ" అని పిలవబడేవారు. అందుకే ముందు భృగువును "బ్రహ్మన్!" అన్నారు. వశిష్ఠ, అగస్త్య, ధార్తరాష్ట్రులు మొదలైనవారు ఇలా పుట్టిన వారే.)

వారందరూ చాలాకాలమునకు యౌవనాన్ని పొందేరు. రూపయౌవనాలతో ప్రకాశిస్తూ పెరిగేరు.

నరశ్రేష్ఠా రామా! సగరుని పెద్దకొడుకు నిత్యము చిన్న పిల్లల్ని పట్టుకొని సరయూ నదీ జలాలలో విసిరి వాళ్ళు మునిగిపోతూంటే వాళ్ళను చూస్తూ నవ్వుకొనే వాడు. పాప కార్యాచరణయందు ఆసక్తుడైనాడు. సజ్జనులను బాధించేవాడు. పౌరులయొక్క హితమునందు అనాసక్తుడైన వాడికి రాజ్యబహిష్కారాన్ని విధించేరు.

రాగద్వేషాలకు అతీతంగా నిస్స్వార్థంగా రాజ్యపాలన చేయడం, పాలకులు కలిగి ఉండవలసిని ప్రధానమైన ధర్మం. ఇది అసమంజునికి లేదు.

ఆ అసమంజుని పుత్రుడు అంశుమంతుడు. మహాపరాక్రమవంతుడు. ఇతడు సర్వలోకములకు ఇష్టుడు. ప్రియభాషి.

తండ్రి దుర్మార్గుడైనంత మాత్రాన కొడుకు దుర్మార్గుడు అవుతాడన్న నియతి లేదని మహర్షి చూపిస్తున్నారు. ఎవరి గుణవిశేషాలు కర్మఫలాలు వారివే.

చాలాకాలానికి సగరునికి యజ్ఞం చేయాలనే కోరిక కలిగింది.

సకృత్వా నిశ్చయం రామ సోపాధ్యాయగణ స్తదా।
యజ్ఞకర్మణి వేదజ్ఞో యష్టుం సముపచక్రమే॥ ౨౪

రామా! అప్పుడు వేదజ్ఞుడైన సగరుడు ఉపాధ్యాయ సహితుడై యజ్ఞము చేయ నిశ్చయించి యాగము చేయుటకు ఉపక్రమించెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టత్రింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకోన చత్వారింశ స్సర్గః॥

(సగరుని యాగాశ్వాన్ని అపహరింపబడుట. సగరుని కుమారులు అశ్వమును అన్వేషించుచూ భూమిని భేదించుట)

విశ్వామిత్ర వచః శ్రుత్వా కథాన్తే రఘునన్దనః।
ఉవాచ పరమప్రీతో మునిం దీప్తమివానలమ్॥ ౧

విశ్వామిత్ర మహర్షి కథ చెప్పడం ముగించేరు. రాముడు మహర్షి చెప్పింది విని చాలా సంతోషించేడు. జ్వలిస్తున్న అగ్నిలా ఉన్న మహర్షినిగూర్చి పలుకుతున్నాడు. బ్రహ్మన్! నీకు మంగళమగు గాక! నాయొక్క పూర్వికుడు యజ్ఞమును ఎలా చేసేడు. ఈ కథను సవిస్తరముగా చెప్పండి అన్నాడు.

విశ్వామిత్రుడు చిరునవ్వు నవ్వుచూ రామునితో రామా! మహాత్ముడైన సగరుని కథను సవిస్తరంగా చెప్తాను, విను. అని చెప్పటం మొదలు పెట్టేరు మహర్షి.

శఙ్కరశ్వశురో నామ హిమవానచలోత్తమః।
విన్ధ్యపర్వత మాసాద్య నిరీక్షేతే పరస్పరమ్॥ ౨

శివుని మామగారైన హిమవంతుడు అను పర్వతశ్రేష్ఠము వింధ్యపర్వతము పరస్పరము చూచుకొనుచున్నవి.

పురుషశ్రేష్ఠుడా! ఆయజ్ఞము ఆ రెండు పర్వతములమధ్య జరిగింది. నరవ్యాఘ్రా! ఆ దేశము యజ్ఞకర్మయందు ప్రశస్తమైనది.

రామా! దృఢమైన ధనుస్సుకలవాడు మహారథుడు అయిన అంశుమంతుడు సగరుని ఆజ్ఞప్రకారము యజ్ఞాశ్వమును రక్షించుచు దానిని అనుసరించేడు. (మహారథుడు అంటే పంద్రెండుమంది అతిరథులతో లేదా ఏడులక్షల ఇరవైవేలమంది యోధులతో పోరాడగలిగిన సామర్థ్యం కలవాడు.)

వాసవుడు రాక్షసరూపమును గ్రహించి ఉక్థ్యదివసమున సగరునియొక్క యాజ్ఞీయాశ్వమును అపహరించేడు.

మహాత్ముడైన సగరునియొక్క యాగాశ్వము అపహరింపబడగా ఋత్విక్కులు యజమానుడైన సగరుని ఉద్దేశించి,

ఓ కాకుత్థ్సా సగరా! యజ్ఞీయాశ్వమును ఎవడో అపహరించి వేగముగా

తీసుకొనిపోవు చున్నాడు. అపహరించిన వానిని సంహరించి అశ్వమును తీసుకొనిరమ్ము. ఈ యజ్ఞాపరాధము మనందరకూ అమంగళకరము. క్రతువునకు అపచారము కలుగకుండా చూడు. అని ఋత్విజులు ఆదేశించేరు.

సగరుడు ఋత్విక్కుల ఆదేశమును విని ఆ యజ్ఞసదస్సులో అరవైవేలమంది పుత్రులను ఆజ్ఞాపిస్తున్నాడు–

పురుషశ్రేష్ఠులైన పుత్రులారా! ఈ యజ్ఞం మంత్రములచే పవిత్రులైన మహాత్ములచే అధిష్ఠింపబడింది. కావున ఇక్కడకు రాక్షసులు రాలేరని నా విశ్వాసము.

పుత్రులారా! మీకు మంగళమగుగాక! మీరందరూ బయలుదేరి, సముద్రములచే చుట్టబడిన భూమినంతను వెదకండి.

పుత్రులారా! మీరందరు ఒక్కొక్క యోజనము చొప్పున భూమిని పంచుకొని అశ్వమును అపహరించిన వానిని వెదకుచు, తురగము కనబడునంతవరకు భూమిని త్రవ్వండి. ఇది నా ఆజ్ఞ.

దీక్షితుడనైన నేను పౌత్రునితోను ఋత్విగ్గణముతోనుకూడి యజ్ఞీయాశ్వము కనబడువరకు ఇచ్చటనే ఉండగలను. మీకు క్షేమమగుగాక!

రామా! ఈవిధంగా ఆజ్ఞాపింపబడిన రాకుమారులు ఉత్సాహవంతులై తండ్రి ఆజ్ఞ ప్రకారము భూమినంతను వెదకుటకు వెళ్ళేరు.

ఒక్కొక్కడు ఒక్కొ యోజనం సమానమైన పొడవు వెడల్పులు కలిగిన ధరణీతలాన్ని వజ్రసమమైన గోళ్ళతో బ్రద్దలుకొట్టేరు. **"వజ్రస్పర్శసమైర్నఖైః"** అంటే కఠినమైన మొనదేలిన లోహనఖాలు.

రఘునందనా! వజ్రాయుధంతో సమానమైన శూలములతో చాలా దారుణమైన నాగళ్ళతో భేదింపబడుతున్న భూమి గొప్పధ్వని చేసింది.

రాఘవా! ఆ సగరపుత్రులు భూమిని త్రవ్వుచుండగా సర్పములు అసురులు రాక్షసులు ఇతర జంతువులు నలిగిపోవుటచే సహింపరాని ఆర్తనాదములు చేసేయి.

రఘునందనా! ఆ వీరులు అరవైవేల యోజనముల భూమిని రసాతలము అగునట్లుగా త్రవ్విరి.

నృపశార్దూలా! సగరకుమారులు పర్వతములతో ఇరుకైన జంబూద్వీపమును

ఈవిధంగా త్రవ్వుచున్నవారై అంతట సంచరించేరు.

పిమ్మట గంధర్వులతోను అసురులతోను పన్నగములతోనుకూడిన దేవతలందరూ కలతచెందిన మనస్సుకలవారై బ్రహ్మవద్దకు చేరేరు.

బాగా భయపడినవారును దిగులుచెందిన ముఖముగల వారైన ఆ దేవతాది సమూహము బ్రహ్మదేవుని అనుగ్రహింపచేసుకొని విన్నవించుకొంటున్నారు. భగవన్! సమస్తమైన పృథివీ సగరకుమారులచే త్రవ్వబడుచున్నది. పాతాళములో నివసించు చాలామంది మహాత్ములు చంపబడుచున్నారు.

అయం యజ్ఞహనోఽస్మాకమనేనాశ్వోఽపనీయతే
ఇతి తే సర్వభూతాని నిఘ్నన్తి సగరాత్మజాః॥

వీడే మన అశ్వమును అపహరించాడు. మన యజ్ఞమును చెరచినవాడు వీడే, అని ఆ సగరకుమారులు సమస్త భూతములను చంపుచున్నారు.

(సగరకుమారులు అరవైవేల యోజనములు త్రవ్వేరు. అని చెప్పుకొన్నాం. సుందరకాండలోనూ, యుద్ధకాండలో శతయోజనాల సముద్రమని చెప్పేరు. దానిపై వంతెన నిర్మించారని చెప్పారు. ధనుష్కోటినుండి శ్రీలంకకు 31కిలోమీటర్లు. ఇప్పుడు ఇక్కడ శతము అంటే "బహు" అనే అర్థంలో ప్రయోగించారు అని తెలుస్తోంది. **శత** శబ్దానికి **వంద** అనే అర్థాన్ని తీసుకొంటే శతయోజనాలు అంటే 31/100=0.31kms ఒక యోజనం, అప్పుడు సగరకుమారులు త్రవ్వింది 60000x0.31 = 18600kms ఇది ఇప్పటి హిమాలయ నదులయొక్క పొడవునకు సుమారుగా సరిపోతోంది. (Jhelum 813kms, Chenab 960, Ravi 720, Beas 470, Sutlej 1450, Indus 2900, Ganga 1900, Yamuna 1376, Brahmaputra 3200, Spiti 150, Sarayu 350, Ghaghara 1080, Alakananda 190, Bhagirathi 205, Sharada 350 and Sarasvati)

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకోన చత్వారింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ చత్వారింశ స్సర్గః॥

(బ్రహ్మ సగరపుత్రులు మరణమునుగూర్చి చెప్పుట. కపిలుడు సగరపుత్రులను భస్మంచేయుట.)

దేవతానాం వచః శ్రుత్వా భగవాన్వై పితామహః।
ప్రత్యువాచ సుసంతప్తాన్ కృతాన్త బలమోహితాన్॥

దేవతలు మాయచేత మోహముచెంది మిక్కిలి భయముతోకూడి పలికిన పలుకులు విని బ్రహ్మదేవుడు వారికి ధైర్యమును చెప్తున్నాడు.

యస్యేయం వసుధా కృత్స్నా వాసుదేవస్య ధీమతః।
కాపిలం రూపమాస్థాయ ధారయత్యనిశం ధరామ్॥

ఈ భూమి ధీమంతుడైన వాసుదేవునకు సంబంధించినది. ఆ వాసుదేవుడు కపిలుడు అను రూపమును ధరించి, ఎల్లప్పుడు భూమిని ధరించుచున్నాడు. అతని కోపాగ్నిచే సగరపుత్రులు కాల్చబడతారు.

భూమికి అగ్నిగర్భ అని పేరు. భూగర్భమందున్న అగ్నికి కపిలుడని పేరు. ఈవిధంగా భూమియొక్క భేదనము, అదీర్ఘజీవనులైన సగరపుత్రుల వినాశనము ఏనాడో నిర్ణయింపబడింది.

అరిందమా రామా! వచ్చినటువంటి ముప్పదిముగ్గురు దేవతలు పితామహుడి మాటలు విని పరమసంతోషంతో వచ్చిన దారినే వెళ్ళేరు.

సగరస్య చ పుత్రాణాం ప్రాదురాసీన్మహాత్మనామ్।
పృథివ్యాం భిద్యమానాయాం నిర్ఘాతసమనిస్వనః॥

మహాత్ములులైన సగరపుత్రులకు భూమిని బ్రద్దలుకొట్టుచుండగా పిడుగువంటి ధ్వని పుట్టింది. తరువాత సగరపుత్రులందరూ భూమిని భేదించి ప్రదక్షిణముచేసి సగరుని దగ్గరకు వచ్చి చెప్తున్నారు. సమస్తమైన భూపరిక్రమణం చేసేం, దేవ దానవ రాక్షస పిశాచ ఉరగ కిన్నరులు చంపబడ్డారు.

అశ్వమును అపహరించినవాడు మాత్రం కానరాలేదు. నీకు భద్రమగుగాక! ఈ విషయమున బుద్ధిపెట్టి ఆలోచించు. ఇప్పుడు ఏమి చెయ్యాలో చెప్పు. రామా! రాజశ్రేష్ఠుడైన సగరుడు పుత్రుల మాటలు విని కోపముతో కూడినవాడై భూమిని భేదించి మరల త్రవ్వండి. అశ్వమును హరించిన వానిని పొంది

కృతార్థులై రండి. మీకు భద్రమగుగాక! అని చెప్పేడు. తండ్రి అయిన సగరుని మాటలు విన్నారు. అరవైవేలమంది రసాతలాన్నికి వేగంగావెళ్ళేరు.
ఇక్కడ అరవైవేలమంది ఒక్కొక్కడు ఒక్కొయోజనం మేర త్రవ్వేరు. చాలాలోతైన అఖాతం ఏర్పడింది. ఫలితంరాలేదు. ఈ త్రవ్వకానికి అడ్డం పడినవాళ్ళనందర్నీ చంపేము. అయినా ప్రయోజనం లేకపోయింది, అని తండ్రికి చెప్పేరు. బుద్ధిపెట్టి ఆలోచించవయ్యా! ఇది సామాన్యుల పనికాదు, సరైన నిర్ణయం తీసుకో అని చెప్పేరు. సగరుడు కోపాన్ని ఆశ్రయించేడు. అది ఇంకెవరిని, దేన్నీ ఆశ్రయించనివ్వదు. కనక వినాశహేతువైన నిర్ణయాన్నిచేసేడు.
ఇది చూచుటకు సగరుని నిర్ణయంలా మనకు కనబడుతుంది. ఇది ముందే నిర్ణయింపబడింది అని బ్రహ్మగారు చెప్పేరు. వీళ్ళు వంశకరులుకారని భృగుమహర్షి చెప్పేరు. కనుక వీళ్ళు హిమగిరిసానువులలో ఉన్న అనంత జలసంపదను ఒక క్రమపద్ధతిలో భూమికి తెచ్చే పనికొరకు ప్రకృతిచేతనే నిర్ణయింపబడ్డారు. కనుకనే దారుణమైన జీవహింస వారు చేసినప్పటికి వారిని వాల్మీకి మహాత్ములనే సంబోధించారు.
మళ్ళీ త్రవ్వడం మొదలుపెట్టేరు. పర్వతాకారంగల విరూపాక్షం అనే దిగ్గజం కనబడింది. అది భూతలాన్ని మోస్తోంది.
రఘునన్దనా! విరూపాక్షమను పేరుగల మహాగజం పర్వతములతోను వనములతోనుకూడిన సమస్తమైన భూమిని శిరస్సుచేత ధరించింది.
రామా! ఆ మహాగజము అలసట కలిగినప్పుడు విశ్రాంతికొరకు శిరస్సును కదుల్చుచుండును. అప్పుడు భూకంపము కలుగుతుంది.
రామా! వారు ఆ దిగ్గజమునకు ప్రదక్షిణచేసి పూజించి భూమిని భేదించుకొని రసాతలమునకు వెళ్ళేరు.
తూర్పుదిక్కును త్రవ్విన తరువాత దక్షిణదిక్కును భేదించేరు. దక్షిణదిక్కున కూడా మహాపర్వత సమానంగా శిరస్సుచేత భూమిని ధరించిన పూజింపతగిన మహాపద్మమను గొప్ప ఏనుగును చూచేరు. చాలా ఆశ్చర్యాన్ని పొందేరు.
దానికి ప్రదక్షిణచేసేరు. పశ్చిమదిక్కును భేదించేరు. సగరపుత్రులు పశ్చిమ దిక్కునకూడా సౌమనసమను దిగ్గజమును చూసేరు. .

ఆ దిగ్గజానికి ప్రదక్షిణ నమస్కారాలు చేసేరు. కుశలం అడిగేరు. ఉత్తరదిక్కుకు వెళ్ళేరు. భద్రమనెడు గజాన్ని చూసేరు. వారు దానిని స్పృశించి ప్రదక్షిణ నమస్కారాలు చేసేరు.

ఈశాన్యదిక్కుకు వెళ్ళేరు. రోషముతో తిరిగి భూమిని త్రవ్వుతున్నారు.

మహాత్ములైన సగరపుత్రులు భీకరమైన వేగంకలవారు. మహాబలవంతులు వారందరు అచట కపిలరూమున ఉన్న సనాతనుడైన వాసుదేవుని అతనికి దగ్గరగా తిరుగుతున్న అశ్వాన్ని చూచారు.

రామా! వారందరూ మహాసంతోషాన్ని పొందేరు. వారు ఆ అశ్వమును గుర్తించారు. కోపంతో కళ్ళు ఎఱ్ఱబారేయి. గునపములు నాగళ్ళు వృక్షాలను శిలలను ధరించి కోపించినవారై కపిలుని దగ్గరకు వెళ్ళేరు.

ఓదుర్బుద్ధీ! నీవు మాయొక్క యజ్ఞీయాశ్వమును హరించేవు. మమ్ములను సగరకుమారులని తెలుసుకో, అన్నారు.

రఘునందనా! కపిలుడు పెద్ద హుంకారధ్వని చేసేడు.

తతస్తే నాప్రమేయస్య కపిలేన మహాత్మనా
భస్మరాశీకృతాః సర్వేకాకుత్థ్స సగరాత్మజాః॥

అప్రమేయుడు మహాత్ముడైన కపిలునిచే సగర పుత్రులందరు భస్మరాశిగా చేయబడ్డారు.

(ఈ భూమిని దిక్కులు విదిక్కులు కలిపి మొత్తం ఎనిమిది దిగ్గజములు భరించుచున్నవని చెప్పేరు. ఇవి భూమిని భరిస్తున్న అతిముఖ్యమైన రాతిఫలకలు. ఇవి ఆఫ్రికన్, ఆస్ట్రేలియన్, అంటార్కిటిక్, యూరేషియన్, ఇండియన్, నార్త్అమెరికన్, పసిఫిక్ ఫలకలు.

సగరుని కాలానికి ఉన్న భౌగోళిక స్వరూపంలో రాతిఫలకలు నాలుగే ఉన్నయి. లేదా నాలుగు రాతిఫలకలే గుర్తించబడ్డాయి.

నదీరూపంగా గంగయొక్క ఆవిర్భావం ఇంకా కాలేదు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చత్వారింశ స్సర్గ సమాప్తము.

అథ ఏకచత్వారింశ స్సర్గః

(అంశుమంతుడు యజ్ఞాశ్వమును తీసుకొనివచ్చి, తన పినతండ్రులగూర్చి సగరునకు చెప్పి, వారికి ఉత్తమగతులు కలుగు విధానంతెల్పుట.)

పుత్రాంశ్చిరగతాన్ జ్ఞాత్వా సగరో రఘునన్దన।
నప్తార మబ్రవీద్రాజా దీప్యమానం స్వతేజసా॥౧

రఘునందనా! తన పుత్రులు వెళ్ళి చాలా కాలమైందని గుర్తించిన సగరుడు సహజమైన తేజస్సుచే ప్రకాశించుచున్న పౌత్రునిగూర్చి మాట్లాడుతున్నాడు. నేర్పబడిన విద్యలుగల శూరుడవైన నీవు పూర్వులతో సమానమైన వాడవైయున్నావు. అశ్వము ఎవనిచే అపహరింపబడిందో, తండ్రులు ఏమైనారో వెదుకు.

భూమిలోపల ప్రాణులు పరాక్రమమును, గొప్పప్రమాణాన్నికలవై ఉంటాయి. వాటిని చంపుటకు ధనుస్సును అస్త్రములను తీసుకొని వెళ్ళు.

నీవు అభివాదము చేయతగినవారికి అభివాదముచేసి, విఘ్నములనుచేసిన వారిని చంపి, కార్యమును పూర్తిచేసుకొని వచ్చి నా యజ్ఞమును పూర్తిచెయ్యి.

మహాత్ముడైన సగరుడు ఈవిధంగా ఆజ్ఞాపించగానే అంశుమంతుడు ధనస్సును ఖడ్గమును గ్రహించి వేగముగా బయలుదేరేడు.

ఓ నరోత్తమా! అంశుమంతుడు రాజుచేత ప్రేరేపింపబడినవాడై మహాత్ములైన పినతండ్రులు త్రవ్విన భూమార్గమును అనుసరించి వెళ్ళేడు.

మహాతేజశ్శాలి అయిన అంశుమంతుడు దైత్యులచేత దానవులచేత రాక్షసులచేత పిశాచములచేత పక్షులచేత సర్పములచేత పూజింబడుతున్న దిగ్గజాన్ని చూసేడు, దానికి ప్రదక్షణంచేసి యోగక్షేమములను పృచ్ఛచేసి తన పినతండ్రులగూర్చి యాగాశ్వాన్నిగూర్చి ప్రశ్నించేడు.

అంశుమంతుడు అడిగినదానికి సమాధానంగా ఆ దిగ్గజము నీవు కృతార్థుడవై అశ్వముతో సహా తిరిగిరాగలవు అని పలికింది. ఆ అంశుమంతుడు మిగిలిన దిగ్గజములను యథాక్రమంగా యథాన్యాయంగా కుశలాన్ని అడిగేడు.

ఆ వాక్యకోవిదులైన దిగ్గజాలన్నీ అశ్వముతో కూడినవాడవై వెళ్ళగలవని పలికి ఉత్సాహపరిచేయి. ఆ ఏనుగుల మాటలను విని తన పినతండ్రులు ఎక్కడ

భస్మరాశులుగా చేయబడ్డారో అక్కడకు శీఘ్రగమనం కలవాడై వెళ్ళేడు.
తరువాత అసమంజుని కుమారుడైన అంశుమంతుడు వారి మరణానికి మిక్కిలి దుఃఖించేడు. ఆవిధంగా శోకసమన్వితుడైన ఆ పురుషశ్రేష్ఠుడు సమీపంలో మేయుచున్న యజ్ఞీయాశ్వాన్ని చూచేడు.
తన పినతండ్రులకు జలతర్పణములు విడుచుకోరికచే జలముకొరకు అన్వేషించాడు. ఎక్కడా జలము కనబడలేదు. ఆప్రాంతాన్ని అన్వేషిస్తూండగా పినతండ్రులకు మేనమామ పక్షిరాజైన సుపర్ణుడు కనబడ్డాడు.
వధోఽయం లోకసమంతః మహాబలవంతుడైన సుపర్ణుడు అంశుమంతునితో ఓపురుషశ్రేష్ఠా! దుఃఖించకు. ఈ వధ లోకమునకు హితకరమైనది. ఎందువలన అంటే ఈ మరణము దేశరక్షణకొరకు ప్రాణత్యాగముచేసిన సైనికుల మరణం వంటిది. వీరు జీవాధారమైన నీటిని భూమికి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోయేరు.
మహాబలవంతులైన నీ పినతండ్రుల్ని అప్రమేయుడైన కపిలుడు అగ్నిచే దగ్ధము చేసాడు. **సలిలం నార్హసి ప్రాజ్ఞ దాతుమేషాం హి లౌకికమ్** వీరికి లౌకికమైన ఉదకమును ఇచ్చుట యుక్తముకాదు.
పురుషశ్రేష్ఠుడా! నీ తండ్రులకు జలక్రియలను హిమవంతుని పెద్దకూతురు గంగ ఉంది. ఆ నీటితో చెయ్యి. లోకపావనియైన ఆ గంగ భస్మరాశులుగా చేయబడిన వీరిని పావనులను చేస్తుంది.

భస్మరాశీకృతానేతాన్పావయేల్లోకపావనీ
తయా క్లిన్నమిదం భస్మ గఙ్గయా లోకకాన్తయా॥

ఈ గంగను లోకము కోరుకొంటోంది. అటువంటి లోకపావని అయిన గంగచేత తడుపబడిన భస్మరాశులు సగరపుత్రులను స్వర్గమునకు చేరుస్తాయి. మహాభాగా! పురుషర్షభా! ఈ అశ్వమును తీసుకొని వెళ్ళి నీ పితామహుని యజ్ఞమును జరిపించు.
అమితపరాక్రముడైన అంశుమంతుడు సుపర్ణుని మాటలను విని శీఘ్రముగా అశ్వముతో సహా తిరిగివచ్చాడు. యజ్ఞదీక్షితుడైన సగరునివద్దకు వెళ్ళి జరిగినదంతయు చెప్పేడు. సుపర్ణుని ఉపదేశమునూ చెప్పేడు.

సగరుడు తన పుత్రుల మరణమునుగూర్చిన ఘోరమైన వార్తను విన్నాడు. తరువాత కల్పోక్తరీతిని యథావిధిగా యజ్ఞాన్ని చేసాడు.
శ్రీమంతుడైన సగరుడు యజ్ఞమును పూర్తిచేసుకొని తన పురముచేరేడు.
గఙ్గాయాశ్చాగమే రాజా నిశ్చయం నాధ్య గచ్ఛత రాజు గంగయొక్క రాక విషయమున నిశ్చయమును పొందలేదు.

అకృత్వా నిశ్చయం రాజా కాలేన మహతా మహాన్
త్రింశద్వర్ష సహస్రాణి రాజ్యంకృత్వా దివంగతః॥

గొప్పవాడైన సగరుడు ముప్పదివేల సంవత్సరముల తన రాజ్యపాలనలో గంగను భూమికి తెచ్చే ప్రయత్నం సఫలం కాకుండానే స్వర్గానికి వెళ్ళేదు.
(**సలిలం నార్హసి ప్రాజ్ఞ దాతుమేషాం హి లౌకికమ్** లౌకిక జలంతో తర్పణాదులు యుక్తంకాదు. అంటే ఇప్పటికే వారి ప్రయత్నం లేకుండా సిద్ధమైయున్న జలంతో తర్పణాదులు వారికి తృప్తిని ఇవ్వలేవు. లోకం గంగయొక్క ఆగమనాన్ని కోరుకొంటోంది. లోకహితైషి అయిన సగరుడు మహానదుల ఏర్పాటుకు కృషిచేస్తూ, తన సంతానాన్ని అందుకు నియోగించేడు. వారు నదీగమనాన్ని నిర్దేశిస్తూ మార్గాలను చేసారు. ఆ ప్రయత్నంలో భాగంగా భూగర్భంలో ఉండే అగ్ని (సంబంధమైన వాయువుల)చే భస్మం చేయబడ్డారు. ఆ హిమాన్ని గంగగా లోకానికి అందించి ఆ జలాలతో తర్పణాదులు విడిస్తే వారి ఆత్మకు శాన్తి ఉత్తమ గతులూను. ఎందుకంటే వారి సంకల్పం నెరవేరినందుకు. కానీ సగరునకు నదీరూపంగా గంగను భూమికి తీసుకొనివచ్చే ఉపాయం ఏదీ కనబడలేదు. ఆ బృహత్కార్యం తరువాత రెండుతరాల వరకు సాకారం కాలేదు.)

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకచత్వారింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ద్విచత్వారింశ స్సర్గః॥

(అంశుమంతుడు గంగకొరకు తపస్సుచేసి విఫలమగుట. భగీరథుడు గంగకొరకు తపస్సుచేసి బ్రహ్మను మెప్పించుట. గంగను ధరించమని శివుని కోరమని భగీరథునకు బ్రహ్మ సలహానిచ్చుట)

కాలధర్మం గతే రామ సగరే ప్రకృతీ జనాః।
రాజానాం రోచయామాసు రంశుమన్తం సుధార్మికమ్॥

రామా! సగరుడు చనిపోయిన తరువాత మంత్రులు ప్రజలు అందరూ మంచి ధార్మికుడైన అంశుమంతుని రాజుగాచేసేరు.

అంశుమంతుడు గొప్పరాజుగా పేరు తెచ్చుకొన్నాడు. అతనికి దిలీపుడని ప్రసిద్ధుడైన పూజ్యుడైన పుత్రుడు కలిగేడు.

రఘునన్దనా! దిలీపునకు రాజ్యాన్ని ఒప్పచెప్పి, శుభకరమైన హిమవచ్ఛిఖరమునందు దారుణమైన తపస్సును చేసేడు. ముప్పదిరెండువేల సంవత్సరములు తపోభూమిని పొంది తపస్సే ధనముగా కలవాడై స్వర్గమును పొందేడు.

మహాతేజశ్శాలి అయిన దిలీపుడు తన తాతలయొక్క వధనుగూర్చి విని దుఃఖోపహతుడై గంగను తీసుకువచ్చు ఉపాయమును బుద్ధితో నిర్ణయింప లేకపోయేడు.

భూమిపై గంగావతరణం ఏట్లు? తాతలకు జలక్రియలు ఏవిధంగా చెయ్యాలి? వారు ఏవిధంగా తరిస్తారు? ఇదే ఆలోచనలతో నిండిన మనస్సు కలవాడైనాడు. ధర్మమార్గమున గంగను తీసుకువచ్చుటనుగూర్చి నిత్యముగా ఆలోచిస్తూన్న దిలీపునకు భగీరథుడు అనుపేరుగల పరమధార్మికుడైన పుత్రుడు పుట్టేడు. మహాతేజశ్శాలియైన దిలీపుడు అనేక యజ్ఞాలనుచేసేడు. ముప్పదివేల సంవత్సరములు రాజ్యమును శాసించేడు. నరశ్రేష్ఠుడా! తాతలను ఉద్ధరించే మార్గము కానరాక ఆ మనోవ్యథతోనే దిలీపుడు మరణించేడు.

నరశ్రేష్ఠుడైన రాజైన దిలీపుడు పుత్రుడైన భగీరథుని రాజ్యమందు అభిషేకించి స్వార్జితమైన కర్మలచేత స్వర్గప్రాప్తి హేతువులైన (యజ్ఞయాగాదులచే) ఇష్టులచే ఇంద్రలోకానికి వెళ్ళేడు.

భగీరథస్తు రాజర్షిర్ధార్మికో రఘునన్దన
అనపత్యో మహాతేజాః ప్రజాకామః స చాప్రజః॥ ౧౧

రామా! ధార్మికుడు మహాతేజశ్శాలి రాజర్షి అయిన భగీరథుడు అనపత్యుడు (సంతానం లేనివాడు), అతడు సంతానమునందు కోరికకలవాడైననూ నిస్సంతునిగనే ఉన్నాడు.

వాల్మీకి భగీరథుని సంతానంలేని రాజర్షి అంటున్నారు. అంటే వైరాగ్యోదయమైనటువంటివాడా? అంటే అలాకాదు ఇతడు **ప్రజాకామః** సంతానమునందుకోరిక కలవాడే అయినా నిస్సంతునిగా ఉండుటకే ఇష్టపడుతున్నాడు. తపోభూమిలోనే శరీరమును విడిచిపెట్టిన పూర్వుల ఆనువంశిక గాఢతయే భగీరథునిగా రూపుద్దికుంది. కనుకనే వాల్మీకి ఇతడిని ఆదిలోనే రాజర్షి అని పరిచయం చేసేరు. భగీరథుడు జన్మాంతర వాసనాగాఢతచే గంగావతర ణమునందు ఆసక్తికలవాడై రాజ్యమును మంత్రులకు ఒప్పగించి గోకర్ణక్షేత్రమునందు బాహువులను పైకిఎత్తి పంచాగ్నిమధ్యమున (అంటే తనచుట్టూ నాలుగుదిక్కులా అగ్నిని రగుల్చుకొని మధ్య నిలబడి సూర్యాభిముఖంగా) మాసమునకు ఒకసారి ఆహారమును తినుచు జితేంద్రియుడై దీర్ఘమైన తపస్సుచేసేడు.

రామా! అలా వేల సంవత్సరాలు గడచిపోయేయి. ప్రజలకు ప్రభువు ఈశ్వరుడు మహాత్ముడు అయిన రాజువిషయమున భగవంతుడైన బ్రహ్మ సంతోషించేడు.

బ్రహ్మ దేవతాగణములతో కూడి వచ్చి తపస్సు చేయుచున్న భగీరథునిగూర్చి... నీవుచేసిన తపస్సుకు సంతోషించేను. ఓసువ్రతుడా! వరమును కోరుకో అన్నాడు.

మహాతేజశ్శాలి గొప్ప భాగ్యవంతుడు అయిన భగీరథుడు అంజలిబద్ధుడై సమస్త లోకములకు తండ్రియైన బ్రహ్మనుగూర్చి భగవన్! నావిషయమున ప్రీతి చెందినట్లయితే, నా తపస్సునకు ఫలము ఉన్నట్లయితే సగరపుత్రులందరూ నానుండి ఉదకక్రియలను పొందుదునట్లుగా; ఈ మహాత్ములైన నా ప్రపితామహులందరి భస్మరాసులు గంగా జలముతో తడుపబడగానే శాశ్వతముగా స్వర్గమును పొందునట్లుగా అనుగ్రహించండి.

దేవా! నా మరొక వరము ఏమనగా – ఇక్ష్వాకువంశీయులు నిస్సంతులు కాకుడదు. మావంశమెన్నటికీ నశింపకూడదు అని కోరేడు.

ఎందుకంటే – వంశక్షయానికి తను కారకుడు కాకూడదు అనుకొన్నాడు. ఇప్పటికి ఇంకా తనకు సంతానం లేదు. ఈ బృహత్కార్యం అయితేకానీ తనకా దృష్టిరాదు. అప్పటికి తన దేహదార్ఢ్యం సడలిపోవచ్చు. అప్పుడు తను సంతానార్థియై తిరిగి తపస్సు చెయ్యలేకపోవచ్చు. అందుకని తన వంశం ఎన్నటికీ నిర్వంశం కాకుడదని వరం కోరేడు.

ఇయం హైమవతీ గఙ్గా జ్యేష్ఠా హిమవతః సుతా
తాం వై ధారయితుం శక్తో హరస్తత్ర నియుజ్యతామ్॥ ౨౩

బ్రహ్మ సంతోషించి ఇక్ష్వాకు కులవర్ధనా! నీవు కోరినట్లే అగుగాక! (అంటే నీకు సంతతి కలుగుతుందని) అని, హివంతుని కూతురైన గంగను భరించు సమర్ధుదు హరుడే, ఆకార్యమునందు అతడు నియమింపబడుగాక!
రాజా! గంగయొక్క పతనమును భూమి భరింపజాలదు. ఆమెను ధరించుటకు శూలికంటె నాకు అన్యుదు కానరాకున్నాదు.

తమేవముక్త్వా రాజానం గఙ్గాం చాభాష్య లోకకృత్
జగామ త్రిదివం దేవః సహ దేవైర్మరుద్గణైః॥ ౨౫

లోకకర్త ఆ రాజునుగూర్చి ఈ విధంగా మాట్లాడినవాడై గంగతోకూడ మాటలాడి దేవతలతోను మరుద్గణముల తోను స్వర్గమునకు వెళ్ళెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్విచత్వారింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ త్రిచత్వారింశ స్సర్గః॥

(భగీరథుని తపస్సుకు సంతసించిన శివుడు గంగను ధరించి బిందుసరస్సున విడుచుట. గంగ ఏడు ప్రవాహములుగా చీలి భగీరథుని అనుసరించుట.)

దేవదేవే గతే తస్మిన్ సోంగుష్ఠాగ్ర నిపీడితామ్।
కృత్వా వసుమతీం రామ సంవత్సర ముపాసత॥

రామా! దేవదేవుడైన బ్రహ్మ వెళ్ళిన తరువాత భూమిని కాలి బొటనవ్రేలితో పీడిస్తూ అంటే కాలి బొటనవ్రేలిపై నిలబడి సంవత్సరకాలం ఉపాసించేడు. **ఉప సమీపే** ధాతువు. సంవత్సరకాలం అక్కడే శివ సన్నిధిలో కాలి బొటనవ్రేలిపై నిలబడి ఎదురు చూస్తున్నాడు.

ఇంతకు ముందు –

తాం వై ధారయితుం శక్తో హరస్తత్ర నియుజ్యతామ్ అని బ్రహ్మగారు భగీరథునితో గంగను భరించు సమర్ధుడు హరుడే, ఆకార్యమునందు అతడు నియమింపబడుగాక! అని చెప్పారు. **"యుజ్యతామ్ యుజ్యేతామ్ యుజ్యన్తామ్"** అని ధాతురూపం. ఆత్మనేపది లోట్. ఇది బ్రహ్మముఖతః వచ్చింది. విధివాక్యం.

నేను చెప్పేను అని చెప్పు ఆపెద్దాయనే వచ్చి ఆపని చేసిపెడతాడు. అంటే ఒకడు వెళ్ళి అయ్యా! ఫలానావారు చెప్పారు, మిమల్ని రమ్మన్నారు, అంటే ఆ...అలాగా! అయితే వస్తున్నా ఉండు అని, ఆ పెద్దాయన లోపలికి వెళ్ళేరు, కూర్చోమనలేదుకనుక ఆయన వచ్చేవరకూ అలా నిలబడే ఎదురుచూడాలి. ఆవిధంగా భగీరథుడు ఏకదీక్షగా ఏడాదికాలం శివస్మరణతో శివసాన్నిధ్యంలో గడిపేడు.

అథ సంవత్సరే పూర్ణే సర్వలోకనమస్కృతః
ఉమాపతిః పశుపతీ రాజానమిదమబ్రవీత్॥ ౨

సంవత్సరం పూర్తి అయింది. సర్వలోక నమస్కృతుడైన ఉమాపతి పశుపతి అయినవాడు రాజునుగూర్చి పలుకుతున్నాడు. (ఉమాపతి అంటే ఉ అంటే తపస్సు మా అంటే వద్దు అని) తల్లి తన తపస్సును వద్దని చెప్పడంచేత **ఉమ** అని పిలవబడింది.

హిమవంతుని కూతురైన పార్వతి భర్త అనేకాదు. ఈవిధంగా తపస్సు చేసిన వారందరికి పతి అయినవాడు. ఉమాపతి అంటే **తపః ఫలప్రదాత.** ఇక్కడ భగీరథుడు ఏడాదిగా ఏకదీక్షగా ఉన్నాడు. కనుక ఆయనయందు అనుగ్రహం కలిగి మాట్లాడుతున్నాడు.

నరశ్రేష్ఠా! నేను నీ తపస్సుకు సంతోషించేను. నీకొరకు గంగను శిరమున ధరించి నీకు ప్రియమును చేస్తానని మాట ఇచ్చాడు. తరువాత హైమవతీ సర్వలోక నమస్కృతా అయిన గంగ గొప్పదైన రూపమును దుస్సహమైన వేగమును పొంది ఆకాశమునుండి శుభప్రదమైన శివుని శిరస్సుపై పడింది.

ధరించుటకు శక్యముగాని ఆగంగాదేవి నేను నాప్రవాహంతో శంకరునికూడా గ్రహించి పాతాళానికి ప్రవేశిస్తాను అని ఆలోచించెను.

త్రినయనుడు భగవంతుడూ అయిన హరుడు ఆ గంగయొక్క గర్వమును తెలిసికొని, ఆమె కనబడకుండా చేయాలని నిశ్చయించెను.

ఆ గంగ ఎన్నో సంవత్సరములు ఆ జటాజూటమునందే తిరిగెను. గంగ కనబడక భగీరథుడు పునః గొప్పతపస్సు అవలంబించేడు.

రఘునందనా! ఈ తపస్సుచే శివుడు చాలా సంతోషించేడు. సంతోషించి బిందుసరస్సు అనే ప్రాంతంలో గంగను విడిచాడు.

శివుడు గంగను విడిచినప్పుడు ఏడు ప్రవాహాలు పుట్టేయి. వాటిలో **హ్లాదిని పావని** మరియు **నళిని** అను మూడు గంగలు తూర్పునకు ప్రవహించేయి. **సుచక్షువు సీత సింధువు** అను మహానదియు శోభాదాయకములైన ఈ మూడు పశ్చిమదిక్కునకు ప్రవహించేయి. వాటిలో ఏడవది భగీరథుని అనుసరించింది.

(భగీరథుడు ఏడు గంగలను ప్రయత్నంతో ఎలా తీసుకు వచ్చాడో –


అలాగే **కాటన్** మహాశయుడు సప్తగోదావరులను ప్రయత్న పూర్వకంగా తీసుకువచ్చాడు. అందువలనే కాటన్ దొరను అపరభగీరథుడు అన్నాము)

మహాతేజశ్శాలి రాజర్షి అయిన భగీరథుడు దివ్యమైన రథాన్ని అధిష్ఠించినవాడై ముందు వెళ్ళగా గంగ అతడిని అనుసరించింది.

ఆకాశమునుండి శంకరుని శిరస్సుపై పడి తరువాత భూమిపై పడిన కల్మషములేని నిర్మలమైన ఉదకము ప్రకాశిస్తోంది.
శివుని శరీరమునుండి జారిన ఉదకము పవిత్రమైనదని తలచి దేవతలు ఋషులు గంధర్వులు భూమిపై నివసించు వారు దీనిని స్పృశించిరి.
(ఆరోజు అక్కడ ఒక అద్భుతం ఆవిష్కరింపబడింది.
ఇంతవరకూ గంగ దేవతాస్వరూపంగా ఉంది. అంటే ఘనీభవించి ప్రకాశస్వ రూపంగా ఉంది. ఆ ఘనీభూత జలంకరిగి నదీరూపంగా గంగావిర్భానికి పూర్వమే హిమవత్పర్వతం పై అక్కడక్కడ సరస్సులు ఏర్పడి ఉన్నాయి. అక్కడనుండి జలములను గ్రహించి వినియోగించుకొనుట సర్వజన సామాన్యానికి కష్టసాధ్యమైనదిగా ఉంది. సర్వ జనోపయుక్తంగా ఉంటుందని ఏడు పాయలుగా ప్రవాహ మార్గాలు ఏర్పరిచి నీటిని నేలకు తెచ్చేరు.
ఇది కొన్నితరాల శ్రమ. నిస్స్వార్థంగా నిర్విరామంగా లోకకల్యాణ కాంక్షతో చేసిన మహాయజ్ఞం. ఆ యజ్ఞఫలం ప్రవాహరూపాన్ని పొందింది.
హిమానినదం కరిగి ఈ తపోవనాన్ని చేరింది.
తపోవనానికే శివజటాజూటమని పేరు. ఇక్కడనుండి కేదారం.
వ్యక్తావ్యక్త స్వరూపంగా ఉన్న పరమేశ్వరుడి ఒక్కపాదమే కంటికి కనబడేది. ఆ ఒక్కపాదం లోనుండి ఆవిర్భవించిన గంగ కనుక విష్ణుపాదోద్భవి, ఆ గంగ మొదట భూమిని చేరిన ప్రాంతం లోకశుభంకరమగటచే శివం.
అది శివజటాజూటమయిన తపోవనం.
ఇలా ప్రవాహ రూపాన్నిపొందిన గంగను సకల జీవరాశులు ఆశ్రయించేయి.)

(The Bhagirathi rises at the foot of Gangotri Glacier, at Gomukh, at an elevation of 3,892 m (12,769 ft), being mythologically referred to as, residing in the **matted locks of Shiva, symbolically Tapovan,** being a meadow of ethereal beauty at the feet of Mount Shivling, just 5 km away.[16]Gangotri Tapovan Trek, [17] ^ Jump up to: a b C. R. Krishna Murti; Ganga Pariyojana Nidesalaya; India Environment Research Committee (1991). The Ganga, a scientific study. Northern Book Centre. p. 19. ISBN 978-81-7211-021-5. Retrieved 24 April 2011.)

Gangotri Tapovan



Gangotri Kedar



ఎవరు శాపమువలన గగనమునుండి భూమిపై పడ్డారో వారు ఆ గంగలో స్నానము చేసి గతకల్మషులైనారు.
బాగుగా ప్రకాశించుచున్న జలముచేత జనులందరూ సంతోషించి గంగయందు స్నానముచేసి తొలగిన శ్రమకలవారైయ్యేరు.
రామా! ఋషిగణములతోకూడిన దేవతలు, దైత్యదానవులు రాక్షసులు కిన్నరులు మహోరగములతోకూడిన గంధర్వులు యక్షశ్రేష్ఠులు సమస్తమైన అప్సరసులు ప్రీతిచెందినవారై భగీరథుని అనుసరించుచున్న గంగను అనుగమించేరు.

యతో భగీరథో రాజా తతో గఙ్గా యశస్వినీ

భగీరథుడు ఎటువైపు వెళ్తే అటువైపు యశస్విని నదులలో శ్రేష్ఠురాలు సర్వపాప ప్రణాశిని అయిన గంగ వెళ్ళింది.
ఆవిధంగా ప్రవహిస్తున్న గంగ ఆశ్చర్యజనకమైన కర్మలనుచేయు మహాత్ముడైన జహ్నుమహర్షియొక్క యజ్ఞశాలను ముంచివేసింది.
రామా! యజ్ఞముచేయుచున్న జహ్నుమహర్షి గంగయొక్క గర్వమును చూచి కోపించి ఆ గంగాజలమునంతను త్రాగేసేరు.
గంగను అనుసరిస్తూన్న దేవతలు గంధర్వులు ఋషులు చాలా ఆశ్చర్యాన్ని పొందేరు. పురుషశ్రేష్ఠుడైన మహాత్ముడైన జహ్నుమహర్షిని పూజించేరు. ఆ గంగ నీకు కూతురువంటిది. అంటే పిల్లలయొక్క అల్లరిలా తలచి విడిచి పెట్టవయ్యా! అని అడిగేరు.

తతస్తుష్టో మహాతేజాః శ్రోత్రాభ్యామసృజత్పునః
తస్మాజ్జహ్నుసుతా గఙ్గా ప్రోచ్యతే జాహ్నవీతి చ॥ ౩౮

జహ్నుమహర్షి సంతోషించి చెవులనుండి గంగను విడిచిపెట్టేరు.
(జహ్నోస్తనయా జాహ్నవీ, జహ్ను అంటే విడిచిపెట్టేవాడని అర్థం) ఇక్కడ గంగ అప్రయత్నంగా వచ్చిన వరదవంటిదికాదు. ప్రయత్నపూర్వకంగా భగీరథుడు తీసుకువస్తున్నాడు. ఆ గంగ ప్రవాహమార్గాన్ని నిర్దేశిస్తున్న వాడు భగీరథుడు. జహ్నుఆశ్రమం గంగాప్రవాహ మార్గంలోనిదే. కానీ ఆ ప్రాంతముయొక్క ముంపు ఊహించనది.

ఇటువంటివి ఆకస్మిక భూపాతం (landslides) వలన కలుగుతూ ఉంటాయి. ఈ భూపాతానికి కారణాలు ఒక్కటే కావచ్చు లేదా అనేకంగా ఉండచ్చు. ఆ నీరు ఏటవాలుగా క్రిందికి ప్రవహిస్తున్నప్పుడు దాని ప్రవాహవేగం ఆ వాలుయొక్క స్థిరత్వాన్ని అస్థిరపరచే అవకాశం ఉంది. ఆ ప్రవాహాన్ని అనుసరించి ప్రవాహ వేగంతో సమానంగా వాహనాలలో వస్తూన్న వారి వాహనాల ప్రకంపనలుకూడా కారణంకావచ్చు. ఇలా...

Landslides occur when the stability of the slope changes from a stable to an unstable condition. A change in the stability of a slope can be caused by a number of factors, acting together or alone. Natural causes of landslides include:

groundwater (pore water) pressure acting to destabilize the slope

loss or absence of vertical vegetative structure, soil nutrients, and soil structure (e.g. after a wildfire - a fire in forests lasting for 3–4 days)

erosion of the toe of a slope by rivers or ocean waves

weakening of a slope through saturation by snow melt, glaciers melting, or heavy rains

earthquakes adding loads to barely stable slope

earthquake-caused liquefaction destabilizing slopes

volcanic eruptions

Landslides are aggravated by human activities, such as**:**

deforestation, cultivation and construction, which destabilize the already fragile slopes.

vibrations from machinery or traffic, blasting earthwork which alters the shape of a slope, or which imposes new loads on an existing slope in shallow soils, the removal of deep-rooted vegetation that binds colluvium to bedrock

construction, agricultural or forestry activities (logging) which change the amount of water infiltrating the soil.

అనుకోని పరిస్థితులలో ఆ ప్రదేశంలో ఒక సహజ సిద్ధమైన జలాశయం మొదటి ఆనకట్ట(ఋఎ) ఏర్పడింది. ఆనకట్ట నుండి నీటిని దిగువకు చెవులవంటి మార్గాల ద్వారానే విడిచి పెడతారు. ఇదిగో మహర్షి తన ప్రాంతం నష్టపోయి నప్పటికీ జీవకారుణ్య బుద్ధితో ఆ జలం తిరిగి సక్రమమైన మార్గంలో ప్రవహించునట్లుగా చెవులవంటి మార్గాలను తెరిచేరు.

అప్పటినుండి గంగకు "జాహ్నవి" "జహ్నుసుత" అను పేర్లు వచ్చేయి.

నదులలో శ్రేష్ఠమైన గంగ తిరిగి భగీరథుని అనుసరించి సముద్రమును పొంది సగరపుత్రులను తరింపచేసి పాతళమును ప్రవేశించింది.

దీనమనస్కుడైన రాజర్షి భగీరథుడుకూడ ప్రయత్నమువలన గంగను తీసుకొని భస్మరాసులుగా చేయబడిన తాతలను చూసేడు.

అథ తద్భస్మనాం రాశిం గఙ్గాసలిలముత్తమమ్
ప్లావయద్ధూతపాప్మానః స్వర్గం ప్రాప్తా రఘూత్తమ॥౪౧

రఘూత్తమా! ఉత్తమైన గంగాజలము భస్మరాశుల పై ప్రవహించింది. వారు (సగరపుత్రులు) పాపములు తొలగినవారై స్వర్గమును చేరేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రిచత్వారింశ స్సర్గ సమాప్తము.

-

August 1894

"The tale began in September 1893, with a massive landslip at Gohna, Garhwal District, in the north of India, which created a natural dam across the River Ganges at Birahi, above the Alaknanda valley.

The dam broke on 25 August 1894, propelling a deluge of 10,000 million cubic feet of water into the valley.



Before the Flood (Aug 23)



After the Flood (Aug 26)

అథ చతుశ్చత్వారింశ స్సర్గః

(బ్రహ్మ అనుజ్ఞను పొంది భగీరథుడు గంగాజలములతో పితృతర్పణము చేసి తిరిగి తనపురమును ప్రవేశించాడు)

సగత్వా సాగరం రాజా గఙ్గాయానుగత స్తదా
ప్రవివేశ తలం భూమేర్యత్ర తే భస్మసాత్కృతాః॥ ౧

గంగానది అనుసరించి వస్తూండగా భగీరథుడు సముద్రమునుగూర్చి వెళ్ళి ఎక్కడ సగరపుత్రులు భస్మముగా చేయబడ్డారో అక్కడ భూమియొక్క అడుగు భాగమును ప్రవేశించేరు.

తరువాత భస్మము గంగనీటిచేత ముంచబడింది. అప్పుడు సర్వలోకప్రభువైన బ్రహ్మ రాజునిగూర్చి నరశార్దూలా మహాత్ముడైన సగరునియొక్క అరవైవేలమంది కుమారులు తరించారు. స్వర్గమునకు చేరేరు.

పార్థివా! లోకములో సముద్రం జలపూర్ణమై ఉన్నంతకాలం సగరపుత్రులు దేవతలవలె స్వర్గమునందు ఉండగలరు.

ఈ గంగ నీకు పెద్దకుమార్తెకాగలదు. ఇకపై నీ సంబంధమైన పేరుతో భాగీరథీ అని లోకప్రసిద్ధి పొందగలదు.

రాజా! దివ్యమైన గంగ త్రిపథగ, భాగీరథి అను పేర్లతో ప్రసిద్ధిని పొందును. స్వర్గమర్త్యపాతాళములను మూడుమార్గములను పవిత్రముచేయును. ఈ భాగీరథీ జలములతో నీ పితామహులకు తర్పణములను విడిచి నీ ప్రతిజ్ఞను పూర్తిచెయ్యి.

రాజా! నీకు పూర్వుడు గొప్పకీర్తిమంతుడు ధర్మవంతులలో శ్రేష్ఠుడైన సగరుడు కూడ ఈ కోరికను పొందలేక పోయేడు.

నాయనా! లోకంలో సాటిలేని తేజోవంతుడు గంగను తీసుకొని రావలెనన్న కోరికగలవాడగు అంశుమంతుడు కూడా ప్రతిజ్ఞపూర్తి చేసుకొనలేక పోయేడు.

ఓపుణ్యాత్ముడా! నాతో సమానమైన తపస్సుకలవాడైన నీ తండ్రి దిలీపుడుకూడా గంగను తిసుకొనిరాలేక పోయేడు. ఆ ప్రతిజ్ఞ నీచేత దాటబడినది. మిక్కిలి పూజ్యమైన గొప్పకీర్తిని పొందేవు.

భగీరథా! నీవు గంగను భూమికి దింపుటవలన గొప్పధర్మ ప్రతిష్ఠను చేసిన వాడవు అయ్యేవు. (శాశ్వతంగా ఎంతో మంది దాహార్తిని తీర్చేదు)

ప్లావయస్వ త్వమాత్మానం నరోత్తమ సదోచితే
సలిలే పురుషవ్యాఘ్ర శుచిః పుణ్యఫలో భవ॥ ౧౪

పురుషవ్యాఘ్రా! తగిన జలమునందు సదా నిన్నునీవు ముంచుకొనుము. పవిత్రుడవై పుణ్యఫలములు కలవాడవగుము. '**ఉచితే సలిలే త్వం ఆత్మానం సదా ప్లావయస్వ**' ఇది ఉపదేశించారు. ఇతఃపూర్వం ఇంత పరిమాణంలో జలంలేదు. లేదా జలం లభ్యమయ్యే ప్రదేశాలు అరుదుగా ఉండుటకూడా ఒక కారణం. దంతధావనమునకు తిథినిర్ణయం ఉంది.

అర్కపాతే వ్యతీపాతే సంక్రాంత్యాం జన్మవాసరే
వర్జయేత్ దంతకాష్ఠంతు నందాదిషుచ పర్వసు॥

ఈవిధంగా స్మృతిగ్రంథాలలో చెప్పబడ్డాయి, అంటే కొన్ని తిథులలో దంతధావనం నిషేదింపబడిందనే కదా! ఆవిధంగానే స్నానం పుణ్యతిథులకే పరిమితమైయుండేది అనే విషయాన్ని **"సదా"** అనే పదం చెబుతోంది.

భస్మ గోమయ మృ ద్వారి పంగవ్యై స్తతః పరం
గోమూత్రం గోమయం క్షీరం దధి సర్పిః కుశోదకం॥ అని దశవిధ స్నానాలు ఒకచోట చెప్పేరు.

వారుణం ఆగ్నేయం వాయువ్యం బ్రాహ్మం కాపిలం మానసం దివ్యం అని సప్తవిధ స్నానాలని ఒకచోట చెప్పేరు.

వారుణం నీటిలో మునిగి స్నానం చేయుట

ఆగ్నేయం శరీరమంతా భస్మము పూసుకొనుట

వాయవ్యం గోధూళిని శరీరమునకు రాసికొనుట.

బ్రాహ్మం–ఆపోహిష్ఠాది మంత్రములచే ప్రోక్షణ చేసుకొనుట

కాపిలం– నాభికి క్రింది భాగమును ఉదకముచే ప్రక్షాళనం చేసికొనుట, ఊర్ధ్వభాగమును తడిబట్టచేత తుడుచుకొనుట

మానసం విష్ణు చింతనం

దివ్యం– ఎండలో కురిసిన వర్షం. దీనిలో స్నానం దివ్యం.

మానసము, దివ్యము అను స్నానవిధులు ఉత్తమమైనవని చెప్పబడింది. 3000వేల సంవత్సరాల క్రితం వరకూ గ్రీకు దేశీయులకు తెలియదు, ఇప్పటికీ

ముస్లింలకు తెలియదు నిత్యం జలంతో స్నానం. అత్తర్లు పౌడర్లతో అగ్నేయ వాయవ్య స్నానాలే. గంగావిర్భావానికి ముందువరకు మనకూ జలంతో నిత్యము స్నానంలేదు. గంగావిర్భావం తరువాత సమాజికంగా చాలామార్పులు చోటుచేసుకొన్నాయి. ఇవి అప్పటి భౌగోళిక సామాజి పరిస్థితులు.

1. Ancient Indians used elaborate practices for personal hygiene with three daily baths and washing. These are recorded in the works called gruhya sutras which are in practice even today in some communities.

2. The Ancient Greeks adopted the idea of bathing from the Hindus who were familiar with the benefits of bathing as early as 3,000 years ago.

ఇప్పుడా ఇబ్బంది తొలగినదైంది. (15వ శతాబ్ది మధ్యకాలంవరకు మిగిలిన ప్రపంచం ఇంకా రోజుకు రెండుపూటల స్నానం చేసే అలవాటును చేసుకోలేదు.)

రా! నీ పితామహులకు జలతర్పణం చెయ్యి.

నీకు శుభమగుగాక! నేను వెళ్తాను. నీవుకూడా నీ రాజ్యమునకు వెళ్ళు అని సర్వలోక పితామహుడు దేవతలకు ప్రభువు అయిన బ్రహ్మ ఎలా వచ్చేడో అలాగే దేవలోకమునుగూర్చి వెళ్ళేడు.

భగీరథుడు సగరపుత్రులందరికీ యథాక్రమంగా జలతర్పణములు ఇచ్చి పవిత్రుడై తన అంతఃపురానికి చేరేడు.

రామా! భగీరథుడు రాజైనందుకు రాజ్యం సంతోషించింది. భగీరథుడు ప్రయోజనాన్ని సమృద్ధిగా పొంది, మనస్తాపము పోయినవాడైనాడు.

రామా! గంగనుగూర్చి విస్తారమైన కథ నాచేత చెప్పబడినది. ఈ కథా శ్రవణముచే శుభములను పొందుము. నీకు భద్రమగు గాక!

సంధ్యాకాలం దాటిపోతున్నది.

(నాయనా సంధ్యాకాలం దాటిపోతోంది. సంధ్యావందనం చేసుకోవాలి. ముందు ఆ పనిచేద్దాం లే! అంటున్నారు. ఈ కథా శ్రవణంకూడా పుణ్యప్రదమేకదా! మరి తొందర ఎందుకు అంటే...

సంధ్యాసమయంలో ఆ సంధ్యాస్వరూపాన్ని ఆరాధించుటయే చేయాలి మిగిలినవి అన్నీ సర్వేసర్వత్ర నిషేధమే)

ఈ గంగావతరణ వృత్తాంతం ఐశ్వర్యాన్ని యశస్సును ఆయుర్దాయాన్ని పుత్రుల్ని స్వర్గాన్ని ఇస్తుంది. ఈ ఉపాఖ్యానమును ఎవడు బ్రాహ్మణులకు క్షత్రియులకు ఇతరులకు వినిపించునో వానియొక్క పితరులు సంతోషిస్తారు. ఈ కథ చెప్పినంతమాత్రాన ఎందుకు శుభాలు కలుగుతాయి, పితృదేవతలు ఎందుకు సంతోషిస్తారు అంటే...

జీవాధారమైన నీటిని సమాజానికి అందివ్వటానికి ఎందరు ఆత్మత్యాగం చేసేరో తెలుస్తుంది. నీరు రక్షించుకోవలసిన వాటిలో మొదటిదని తెలుస్తుంది. తద్వారా ఆ నీటియందు పూజ్యభావం కలుగుతుంది. ఆ దిశగా పని చేస్తాం. ఆదిశగా చేసిన ఏపనైనా అది సమాజానికి ప్రయోజనకరమే కావున సర్వశుభాలు కలుగుతాయి.

ఇదమాఖ్యానమవ్యగ్రో గఙ్గావతరణం శుభమ్
యః శృణోతి చ కాకుత్థ్స సర్వాన్ కామానవాప్నుయాత్
సర్వేపాపాః ప్రణశ్యన్తి ఆయుః కీర్తిశ్చ వర్ధతే॥

రామా! ఈ శుభకరమైన గంగావతరణమను ఆఖ్యానమును ఎవడు ఏకాగ్రచిత్తుడై వింటాడో వాడు సమస్తమైన కోరికలను పొందుతాడు. వాడి పాపాలు నశించి వాడి ఆయుర్దాయం కీర్తి వృద్ధిపొందుతుంది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుశ్చత్వారింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ పఞ్చచత్వారింశ స్సర్గః॥

(క్షీరసాగర మథనం, విష్ణువు మంథరపర్వతాన్ని ఉద్ధరించడం. హాలాహల భక్షణం, ధన్వంతరి అప్సరసలు మద్యము ఉచ్చైశ్రవము కౌస్తుభము అమృతముల ఆవిర్భావము. దేవాసురుల యుద్ధం)

విశ్వామిత్ర వచః శ్రుత్వా రాఘవః సహలక్ష్మణః
విస్మయం పరమం గత్వా విశ్వామిత్ర మథాబ్రవీత్॥ ౧

విశ్వామిత్రుని మాటలను విని లక్ష్మణ సహితుడైన రాముడు ఆశ్చర్యాన్ని పొందేదు. హేబ్రహ్మన్! నీచే చెప్పబడిన గంగ అవతరణ సాగరగమనాదులు అత్యద్భుతం, అని ఆ సోదరులు విశ్వామిత్రుడు చెప్పిన కథనుగూర్చి చింతిస్తున్నారు.

తస్య సా శర్వరీ సర్వా సహ సౌమిత్రిణా తదా
జగామ చిన్తయానస్య విశ్వామిత్రకథాం శుభమ్॥ ౩

ఇలా ఆలోచిస్తూండగానే **శర్వరీ జగామ**

ఇంతకి ఏమి ఆలోచిస్తున్నారు...

తమపూర్వులు నీటికోసంచేసిన తపస్సు (తీవ్రమైన ప్రయత్నం) గూర్చి, ఆ ప్రయత్నంలో జనహితంకోసంచేసిన ఆత్మబలిదానాలనుగూర్చి ఆలోచిస్తున్నారు. నీటి విశిష్టతనుగూర్చి ఆలోచిస్తున్నారు.

ఇలా ఆలోచిస్తున్నారు అని ఎక్కడా చెప్పలేదు. 'శర్వరీ జగామ' అనటంలో ఉంది. అదెలా! అంటే...

రాత్రి వ్యాపారం నిద్ర. దాన్ని మానుకొని ప్రయోజన శూన్యమైన వ్యాపారం చెయ్యరు. లోకోపకారక వ్యక్తిత్వ నిర్మాణాన్ని మహర్షి సంకల్పించి చెప్తున్నారు. వ్యక్తి నిర్మాణానికి భోజనం-వ్యక్తిత్వ నిర్మాణానికి చింతనం.

ఆ పనిలో ఉండగానే రాత్రి గడిచిపోయింది.

అరిందముడైన రాముడు, ప్రశాంతమైన ప్రభాతంవేళ ఆహ్నికాలను పూర్తిచేసుకొని సిద్ధంగా ఉన్న విశ్వామిత్రునితో మహాతపా! **పరమం శ్రోతవ్యం శ్రుతమ్** వినదగిన వాటిలో శ్రేష్ఠమైన ఆఖ్యానమును విన్నాను.

గతా భగవతీ రాత్రిః భగవతి అయిన రాత్రి గడిచిపోయింది.

ఇక్కడ భగవతీ అంటే షడ్గుణైశ్వర్య సంపన్నురాలు అనికాదు.

ఇక్కడ భగశబ్దానికి యోని అర్థం. యోని అంటే విశ్వవ్యక్తీకరణ సామార్థ్యం.
నిరుస్వసారమస్కృతోషసం దేవ్యాయతీ అపేదుహాసతే తమః
వస్తూన్న రాత్రి స్వసారం– కూతురైన ఉషస్సును యథాస్థానంలో ఉంచుతుంది. చీకటి తొలగిపోతుంది. వెలుగు చీకటియొక్క సారం. గర్భమందు వెలుగులు నింపుకొన్న రాత్రి గడిచిపోయింది. పరమోత్కృష్టమైన ఆఖ్యానాన్ని ఆలోచిస్తూండగానే ఆ రాత్రి ఒకక్షణంలా గడిచిపోయింది.

తరమా సరితాం శ్రేష్ఠాం పుణ్యాం త్రిపథగాం నదీమ్॥

ప్రవాహలక్షణంకలవాటిలో శ్రేష్ఠమైన పుణ్యమైన త్రిపథగామిని అయిన నదిని దాటుదుము.
ఎందువలన గంగ శ్రేష్ఠమైనది అంటే గంగావిర్భావానికి పూర్వమే ఉన్న వృద్ధగంగ (గోదావరి) వర్షాధారమగుటచే దానియందు నిత్యత్వంలేదు. గంగ వర్షాధారపునది కాదు. శ్రేష్ఠత్వము నిత్యత్వంవలన వచ్చింది. దేవభూమి అయిన హిమాలయాలలో పుట్టింది. మనుష్యులమధ్యగా పోతోంది. సముద్రుని చేరి పాతాళానికి పోయింది. కనుక త్రిపథగా అయింది.
సుఖముగా కూర్చొని నదిని దాటుటకు వీలైన నావను పుణ్యకర్ములైన ఋషులు తీసికొనివచ్చారని రాముడు చెప్పగా...
విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో ఋషులతో కలిసి నదిని దాటుటకు ఏర్పాట్లు చేయించేరు.
నావ నది ఉత్తరతీరాన్ని చేరింది. తాము నదిని దాటుటకు సహకరించిన ఋషిగణములను పూజించి 'విశాల' నగరాన్ని చేరేరు. రాముడు కుతూహలంచే విశ్వామిత్రుని ఈ నగరము ఏరాజవంశమునకు చెందినది. నాకు విన వేడుకగా ఉంది. అని ప్రార్థించగా...
విశ్వామిత్రుడు విశాలనగర వృత్తాంతమును చెప్పుట ప్రారంభించేరు.

శ్రూయతాం రామ శక్రస్య కథాం కథయతః శుభామ్।

రాఘవా! శక్రుడు (దుష్టులను జయించుటయందు సమర్థుడు) అయిన వానియొక్క శుభమైన కథను విను. ఈ ప్రాంతములో జరిగిన వృత్తాంతాన్ని విను.

పూర్వం కృతయుగే రామ దితేః పుత్రా మహాబలాః
అదితేశ్చ మహాభాగ వీర్యవన్తః సుధార్మికా॥ ౧౫

మహాభాగా రామా! పూర్వము కృతయుగమునందు దితియొక్క పుత్రులును, అదితియొక్క పుత్రులును గొప్ప బలముకలిగిన మంచిధార్మికులు. వీరందరూ...

అమరా అజరాశ్చైవ కథం స్యామ నిరామయాః

ముసలితనము మరణము రోగములు లేకుండా ఉండటం ఎలా? అని ఆలోచించసాగారు.

ఈవిధంగా ఆలోచిస్తూండగా వారికి క్షీరసాగరాన్ని మథించి అమృతాన్ని పొందాలనే ఆలోచన కలిగింది.

అమితతేజస్సుగల దైత్యులు, ఆదిత్యులు క్షీరసాగర మథనమునకు నిశ్చయించి వాసుకిని త్రాడుగా, మంథరమును కవ్వముగా చేసి మథించేరు.

అలా వేయిసంవత్సరాలు మథించేరు. అప్పుడు సర్పముయొక్క శిరస్సులు అధికమైన విషమును కక్కుచూ దంతములచే శిలలను కరవసాగినవి. అగ్నితో సమానమైన హాలాహలం అనే గొప్పవిషం బయలేదేరింది.

తేన దగ్ధం జగత్సర్వం సదేవాసురమానుషమ్।

దానిచే దేవాసుర మనుష్య సహితమైన జగత్తంతా దగ్ధం చేయబడింది.

అథ దేవా మహాదేవం శఙ్కరం శరణార్థినః
జగ్ముః పశుపతిం రుద్రం త్రాహి త్రాహీతి తుష్టువుః॥ ౨౧

అంతట దేవతలందరూ సుఖమును కలిగించువాడు పశుపతి అయిన రుద్రునిగూర్చి వెళ్ళి రక్షింపుము రక్షింపుము అని స్తుతిచేరు.

(ఈ కథాప్రసంగంలో మహర్షి మనకు ఒక ఉపదేశం సూచ్యంగా చేస్తున్నారు. పూర్వము దైత్యాదిత్యులు ఇరువురూ కూడా మహాబలవంతులై ధర్మపరులుగా ఉన్నారు. అప్పుడు వారికి కోరికలు లేవు. ఎప్పుడైతే ఉపాధియందు మమత్వదృష్టి ఏర్పడిందో ఉపాధికొరకైన ప్రయత్నం ప్రారంభం అయింది. దైత్యాదిత్యులకు కూడా ముసలితనం రోగము మరణము ఉన్నట్లుగా, ఇవి లేకుండుటకై చేసే ప్రయత్నంవలన తెలుస్తోంది. కోరిక మహాదుఃఖానికి కారణం. కోరికను సిద్ధింపచేసుకొనే ప్రయత్నంలో బహుప్రయాస ఉంది.

కామ్యకర్మ ఒక్కనాటికీ సుఖహేతువు కాదు. బహుప్రయాసకోర్చి కర్మచేసిన వాడికి, ఫలానుభవ సమయం (కర్మ విరామసమయం)లో దుఃఖాభావంచేత సుఖంగా ఉన్నానను కొంటాడు. ఫలంయొక్క క్షీణదశలో సుఖరూప భ్రాంతులు తొలగిపోయి దుఃఖం యథాతథంగా ఉన్నదనే సత్యం తెలుస్తుంది.

క్షుత్తు (ఆకలి) లోకసహజమైన ఒక శారీరక ధర్మం. క్షున్నివారణకై శతాధిక ప్రయత్నాలు. ఇవి నిజానికి క్షుత్తును నివారించే ప్రయత్నాలుకావు. దీనిని అడ్డంపెట్టుకొని జిహ్వేంద్రియ కామాన్ని పోషించే ప్రయత్నం. దీనికొరకై అధికసమయం బహుప్రయాసతో అనేక పదార్థములను వండుకొని భోజనానికి కూర్చొంటాం. ఈ ఫలానుభవ సమయమే వంట(కర్మ) విరామ సమయం. ఇక్కడ పదార్థాల రుచిని ఆస్వాదిస్తూ దుఃఖాభావాన్ని పొంది – అహా! ఎంత రుచిగా ఉన్నాయి పదార్థాలు, కడుపునిండా తిన్నాను. ఇక ఆకలి తీరిందనుకొంటాడు. ఆ ఫలం క్షీణదశకు చేరుకొన్న వానికి మహాదుఃఖం అనుభవంలో అలాగే ఉంది.

అందుకే శంకరులు అన్నం సిద్ధవస్తువన్నారు. వీడు సుఖస్వరూపుడు, వీడికి ఆకలి సుఖాభావం. దీనికొరకు ఎటువంటి ప్రయత్నంలేదు. దొరికిన దానితో తృప్తి. ఇది ఇక్కడ వాల్మీకిమహర్షి మనకు ఉపదేశిస్తున్నది.

ఇక్కడ దైత్యాదిత్యులు మనోవృత్తులు. పూర్వం వీటియందు మంచి చెడు అను రెండులేవు. ఎందుకంటే ఇవి అకామంగా నిస్వార్థంగా ఉన్నాయి. ఇప్పుడు అశాశ్వతమైన దానియందు శాశ్వతత్వాన్ని కోరి ప్రయత్నిస్తున్నారు. ఇప్పుడు కోరిక ఉంది, స్వార్థమూ ఉంది. ఇది మహాదుఃఖ హేతువు.

దేవాసురమనుష్య సహితమైన సర్వజగత్తు దగ్ధమైపోయింది. ఇది అపునర్భవమైన స్థితికాదు.) దేవతలందరూ సర్వలోకరక్షకుడు దేవదేవేశ్వరునితో రక్షింపుమని ప్రార్థిస్తున్న సమయంలో శంఖచక్రధరుడైన హరి ప్రత్యక్షమయ్యేడు.

ఉవాచైనం స్మితం కృత్వా రుద్రం శూలభృతాం హరిః
దైవతైర్మథ్యమానే తు యత్పూర్వం సముపస్థితమ్॥
త్వదీయం హి సురశ్రేష్ఠ సురాణామగ్రజోసి యత్
అగ్రపూజామిమాం మత్వా గృహాణేదం విషం ప్రభో॥

దేవతాశ్రేష్ఠుడైన విష్ణువు రుద్రునితో –ఓ సురశ్రేష్ఠా! దేవతలచే మథనము చేయబడుచుండగా ఏది ముందు పుట్టిందో అది నీది. ఎందుకంటే సురులలో ముందు పుట్టినవాడవు కనుక అగ్రపూజను గ్రహించు అని పలికేడు.
దేవతా శ్రేష్ఠుడైన విష్ణువు ఈవిధంగా పలికి అంతర్ధానం మయ్యేడు. (ఇక్కడ సున్నితమైన హాస్యం ఉంది.)

దేవతానాం భయం దృష్ట్వా శ్రుత్వా వాక్యం తు శార్ఙ్గిణః॥

శృఙ్గ వికారమే శార్ఙ్గము. తనను తెలుసుకొనే లింగము శార్ఙ్గము(వేదము). వేదవేద్యుని (విష్ణువు)యొక్క వాక్యమును విని ఘోరమైన హాలాహల విషమును అమృత తుల్యముగా గ్రహించేడు.
రామా! వచ్చిన పని అయింది. దేవేశుడు భగవానుడైన హరుడు దేవతలను విడిచి వెళ్ళేడు. మరల దేవాసురులందరూ మథించుట ప్రారంభించేరు.
(ఇతఃపూర్వం దేవాసుర మనుష్య సహితమైన సర్వజగత్తు దగ్ధమైపోయిందని చెప్పేరు కదా! ఇప్పుడు
తతో దేవాసురాస్సర్వే మమన్థుః అని తిరిగి ప్రారంభించేరు అంటే ముందుచెప్పిన వాక్యానికి ఘాతకలుగుతోంది కదా! ఇది దోషంకాదా! అంటే ఇది దోషంకాదు. ఈ దేవతలు అసలు చావనులేదు. తిరిగి పుట్టనూలేదు. **తేన దగ్ధం జగత్సర్వం సదేవాసురమానుషమ్।** అని పూర్వం చెప్పేరుకదా! అందులోనే ఉంది రహస్యం. దేవాసుర సహితంగా మానుషజగత్తు అంతా దగ్ధమైపోయింది. ఈ దేవాసురులు మనుష్య సంబంధమైనవారు. ఇవి మనోవృత్తులు. మనుష్యులు కర్మచేసేరు. అది ఫలాన్ని ఇచ్చింది. లభించిన ఫలమునుందు అనిష్టత, పైగా అది ప్రతికూలంగా ఉంది. ఇప్పుడు యజమాని మహాదుఃఖాన్ని పొందుతాడు. ఇష్టఫలావాప్తికాలేదు. అక్కరలేనిది ఒకటి వచ్చికూర్చొంది. ఇదిగో ఇప్పుడు మనోవృత్తులు అన్నీ నశించిపోయాయి. ఇది మనం చెప్పుకొనే శ్మశానవైరాగ్యం. పురాణవైరాగ్యాల వంటిది.
ఇది నిజంగా నశించిపోవుట కాదు. దుఃఖోపశమనం కాగానే తిరుగ ఆదే కర్మయందు పునఃపునః ప్రవర్తిస్తూంటాడు.
కనుకనే పునః మథనాన్ని చెప్తున్నారు.)

ఇంతలో కవ్వంగా ఉన్నట్టి పర్వతం పాతాళమును ప్రవేశించింది. అంటే జాతిపోతోంది. అప్పుడు గంధర్వులతోకూడిన దేవతలు విష్ణువును స్తుతించేరు. గంధర్వులు అంటే వేదవేత్తలు.

త్వం గతిః సర్వభూతానాం విశేషేణ దివౌకసమ్
పాలయస్మాన్మహా బాహో గిరి ముద్ధర్తుమర్హసి॥ ౨౮

ఓమహాబాహో! నీవే సర్వభూతములకు గతివి. ప్రధానముగా దేవతలకు. పర్వతమును ఉద్ధరించి మమ్ములను పాలించు. దీనికి తగిన వాడవు నీవే.

ఇతి శ్రుత్వా హృషీకేశః కామఠం రూపమాశ్రితః॥ ౨౯

ఇంద్రియాలకు అధిపతియైన హృషీకేశుడు ఈ వాక్యమును విని తాబేలు రూపాన్నిపొంది పర్వతాన్ని వీపుపై ఉంచుకొని సముద్రమునందు శయినించెను. (అమృతత్వాన్ని పొందే దిశలో ఉపకరణాలనుకొన్నవి జాతిపోతున్నాయి. ప్రయోజనశూన్యంగా ఉన్నాయి. అమృతస్వరూపాన్ని శ్రుతులద్వారానే తెలుసుకోవాలి. కనుక మనస్సుయొక్క సద్వృత్తులు వేదాన్ని ఆశ్రయించాయి. అమృతస్వరూపము ప్రత్యక్షాది ప్రమాణములచే తెలుసుకొనుటకు సాధ్యపడనిది.

ప్రత్యక్షేణానుమిత్యా వాయాస్తూపాయో న బుధ్యతే।
ఏతం విదంతి వేదేన తస్మాద్వేదస్య వేదతా॥

ప్రత్యక్షాది ప్రమాణాలతో తెలుసుకొనుటకు శక్యముకాని దానిని బోధించునది వేదము. **"విదంతి (అనేన) వేదన సాధనభూతా ఇతి వా వేదాః" "తం త్వౌపనిషదం పురుషం పృచ్ఛామి"** అను శ్రుతిచే ఉపనిషత్ జ్ఞానముచే బ్రహ్మ తెలుసుకోదగినవాడు. అని చెప్పుటచే బ్రహ్మజ్ఞానమునకు సాధనములు వేదములు అను అర్థమందు విధధాతువునుండి జ్ఞానార్థమందు వేదశబ్ద నిర్వచనము చేయబడినది. కనుకనే గంధర్వులను ఆశ్రయించేరు.

ఛాందోగ్యశ్రుతికూడా **దేవా వై మృత్యోర్బిభ్యతః॥ త్రయీం విద్యాం ప్రావిశగ్ంస్తే ఛందోభిరచ్ఛాదయన్ యదేభిరచ్ఛా దయగ్ం స్తచ్ఛందసాం ఛందస్త్వమ్॥** దేవతలు మృత్యుభయంవలన వేదవిద్యను ఆశ్రయించారని అంటే వేదవిహితమైన కర్మను ఆశ్రయించారని చెప్పింది.)

పర్వతాగ్రేతు లోకాత్మా హస్తే నాక్రమ్య కేశవః॥ ౩౦
లోకాత్మా పురుషోత్తముడు అయిన కేశవుడు దేవతలమధ్యలో ఉండి పర్వతశిఖరాన్ని చేతితో పట్టుకొని మథించాడు.
కూర్మరూపుడు హృషీకేశుడు అనువారు ఇద్దరా ?ఒక్కరా!
అంటే కఠోపనిషత్తు (1.3.1) **'ఋతం పిబంతౌ సుకృతస్య లోకే గుహాం ప్రవిష్టౌ పరమే పరార్ధే, ఛాయాతపౌ బ్రహ్మవిదో వదంతి పంచాగ్నయో యేచత్రిణాచికేతాః'** అని చెప్పిన అశక్యమగు కర్మఫలమును అనుభవించుచున్న వెలుగు నీడలవలె విరుద్ధస్వభావులుగా కనబడు జీవాత్మ పరమాత్మలు.
గుహాధికరణంలో ఆచార్యశంకరులు **గుహాం ప్రవిష్టావాత్మానౌ హి తద్దర్శనాత్** హృదయగుహను ప్రవేశించిన ఆత్మలు రెండు నిశ్చయముగా ఆ విధముగా చూడబడుటచే – అనుచోట జీవాత్మ పరమాత్మలనియే భావమని ఆచార్యస్వామి ప్రతిపాదించారు.
ఇచ్చట కర్మను కర్మఫలమును ఉభయులు చేయుచున్నట్లు అనుభవించు చున్నట్లు కనబడుచున్నది. కానీ నిజానికి పరమాత్మ కర్మనుచేయుటలేదు, కర్మఫలమును అనుభవించుటలేదు. కేవలము జీవాత్మమాత్రమే కర్మను చేయుచూ కర్మఫలమును అనుభవించుచున్నది. (ఉద్యమం జరుగుతోంది. పెద్ద సమూహం ఉంది. అందులో ఒకడు నినాదాలుచేస్తూ అరుస్తున్నాడు మిగిలినవారు వాడివెనుక ఉన్నారు. ఇంతలో రక్షకభటఅధికారి అరుస్తూన్న వాళ్ళని చెదరగొట్టండి అని అదేశించాడు. అప్పుడు రక్షభటులు ఆ సమూహాన్నంతటినీ చెదరగొడతారు. అరుస్తూన్న ఒక్కడినేకాదు. ఇక్కడకూడా అంతే ఒకడు మోస్తున్నట్టు, ఒకడు త్రిప్పుతున్నట్టుగా) ఆధార ఆధేయాలు రెండూ పరమాత్మయే అయినప్పుడు మొయ్యడం అనేది లేదు.
ఈ తాబేలు సర్వగతమగు నిత్యచైతన్య స్వరూపుడు. అనాదిసిద్ధము. సనాతనుడు. ఈ విషయం–
అంతరతః కూర్మం భూతగ్ం సర్పంతం। తమబ్రవీత్। మమ వై త్వఙ్మాగ్ంసా సమభూత్। నే త్యబ్రవీత్। పూర్వమేవాఽహ మిహాఽఽసమితి। తత్పురుషస్య పురుషత్వం। అను అరుణమన్త్రం చెబుతోంది.

'అపో హ యద్బృహతీ ర్గర్భ మాయన్। దక్షం దధానా జనయంతీ స్స్వయంభుం। తత ఇమేధ్యసృజ్యంత సర్గాః। అద్భ్యో వా ఇదగ్ం సమభూత్ తస్మా దిదగ్ం సర్వం బ్రహ్మ స్వయంభ్వితి।' కుర్మరూపమగు బ్రహ్మమే ఈ సర్వమును సృష్టించుటచే ఈ సర్వజగత్తు స్వతసిద్ధమగు బ్రహ్మయే అను విషయము **తస్మా దిదగ్ం సర్వం** అను వాక్యం చెబుతోంది. ఈ కూర్మము బ్రహ్మమే. కావుననే వాల్మీకిమహర్షి **కమఠ**మని అన్నారు. ఇదే సర్వులచేత కోరబడు స్వరూపమై ఉంది.

రెండవవాడు హృషీకేశుడు ఇంద్రియాధిష్ఠాన దైవం. జీవుడు– ఈ జీవుడు వివేకవంతుడయ్యేనని **"సోఽ_ధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమం పదమ్"** (కఠ. ఉ. 1. 3. 9) ఆవలనున్న సర్వవ్యాపకుడైన పరబ్రహ్మమును పొందును.) ఇలా అనేక సంవత్సరాలు గడిచాయి. దండకమండులువు ధరించిన ధన్వంతరి, మంచితేజస్సుకల అరువదికోట్ల అప్సరలు ముందుగా వచ్చేరు. వీరు అసంఖ్యాకమైన పరిచారికలతోకూడి పుట్టేరు.

దేవదానవులలో ఎవ్వరును ఆ అప్సరసలను ప్రతిగ్రహింపని కారణంగా (అంటే వివాహమాడని కారణంగా) వారందరూ సాధారణలని చెప్పబడ్డారు. సాధారణ స్త్రీలు అంటే సర్వులయందు సమానమైన ఆధారముకలవారు. సర్వులపొత్తు కావున సాధారణ. మహాభారతంలో ఊర్వశి అర్జునుని కామించి ఈ విషయాన్నే చెప్పింది. వేశ్యలని అర్థం.

రఘునన్దనా! తరువాత వరుణునియొక్క కన్య గొప్పభాగ్యముగల వారుణి (మదిర) తనను ఎవరు పరిగ్రహించెదరని అని అన్వేషిస్తూ ఉత్పన్నమైంది. రామా! వరుణాత్మజని (వారుణిని) దితిపుత్రులు దైత్యులు స్వీకరించలేదు. వీరుడా! నిందింపతగని ఆమెను ఆదిత్యులు (అదితిపుత్రులు) గ్రహించిరి. సురను గ్రహింపకుండుటచే దైత్యులు అసురులైనారు. ఆదిత్యులు సురులైనారు. నరశ్రేష్ఠా! ఉచ్చైఃశ్రవమను అశ్వము, కౌస్తుభమను మాణిక్యము మరియు ఉత్తమైన అమృతము బయటకువచ్చేయి.

(ఇక్కడ హాలాహలము ధన్వంతరి అప్సరసలు ఉచ్చైఃశ్రవము కౌస్తుభము

అమృతము ఇవే ఉత్పన్నమైనట్లుగా చెప్పేరు మహర్షి. వీటితోపాటు ఐరావతము కల్పవృక్షము చంద్రుడు మన్మథుడు లక్ష్మి ఇత్యాదులు కూడా ఉత్పన్నమైనట్లుగా తరువాత వాఙ్మయములో చెప్పబడింది. దానంజేసి సుఖస్థానములైన సర్వమూ, అని చెప్పుకోవాలి. **'అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మాఽ మృతం గమయ'** అసత్తునుండి సత్తును పొందటానికి చేసే ప్రయత్నమే ఈ కథాభాగం. **"స యదాహాసతో మా సద్గమయేతి మృత్యుర్వా అసత్పదమృతం మృత్యోర్మాఽ మృతం గమయాఽ మృతం మా కుర్విత్యేవైతదాహ।..."** అని బృహదారణ్యకము(1.3.28) అసత్తు అంటే అజ్ఞానజములైన సర్వకర్మలు మరియు లౌకికజ్ఞానోద్భవములైన భోగములు. ఇవి మృత్యువు అని చెప్తున్నారు. అలాగే చీకటినుండి వెలుగుకు గొనిపొమ్మని ప్రార్థిస్తున్నాడు. ఇక్కడ చీకటి మృత్యువు. శాస్త్రమును ఆధారముచేసుకొని కర్తృత్వభావనతో కర్మలను చేయడం. ఇది శాస్త్రీయమైన అజ్ఞానం. ఇది అసురభావం. ఈ అజ్ఞానమును కప్పివేయునది అంటే అందుండి బయటకు రానీయనిది తమస్సు. ఇది మృత్యువు. ఈ అసురభావంనుండి అమరత్వాన్ని పొందించమని మన్త్రార్థం.

లోకంలో ధనాన్ని కోరేవాడు నేను దరిద్రుణ్ణి అని భావనచేసుకొంటాడు. అసలు లేకనో... ఉన్నది చాలకనో!

అదే విధంగా సుఖస్వరూపుడే అయినవాడు... తాను దుఃఖిని అని భావించుకొని సుఖాన్వేషణ చేస్తాడు. సుఖాభావంవలన కలిగిన హాలాహలరూప దుఃఖాన్ని చూసి భయపడతాడు. ఈశ్వరరూపుడైన గురువు ఇది దుఃఖమే (విషమే) కాదయ్యా! అని నోట్లో వేసుకొని చక్కాపోయేడు. తిరిగి మథింపు మొదలైంది. సుఖస్వరూపంగా సహకారి భావనగల సాధారణలు (వ్యభిచారీవృత్తులు) ధన్వంతరి మొదలు కౌస్తుభాదుల వరకు... దేవాలయంమీది బూతు బొమ్మల్లా! ఇక్కడితో ప్రయత్నాన్ని నిలిపేస్తే... మృత్యువు.

ఇంకా ప్రయత్నాన్ని కొనసాగిస్తే...అమృతం

ఈ మథనమే త్రైలోక్యమోహనమైన యుద్ధం.

అమృత స్వరూపంతో ఆసురీభావనలు నశించిపోతాయి కనుక దేవతల

చేతిలో దైత్యులు నశించేరని ముందు చెప్తున్నారు.) తరువాత అమృతముకొరకై గొప్ప కులక్షయం అయింది. దేవతలు దైత్యులను నశింపజేసేరు.

ఏకతోభ్యాగమన్ సర్వే హ్యసురా రాక్షసైః సహ
యుద్ధమాసీన్మహా ఘోరం వీర త్రైలోక్య మోహనమ్॥

రాక్షసులతోకూడ దైత్యులందరూ ఒకపక్షం.
మూడులోకాలను మోహపెట్టు (త్రైలోక్య మోహనమైన) మహాఘోరమైన యుద్ధంజరిగింది. ఎప్పుడు అంతా క్షయాన్ని పొందిందో అప్పుడు మోహినీ రూపాన్ని ధరించి మహాబలుడైన విష్ణువు అమృతాన్ని హరించేడు.
కొందరు దైత్యులు నాశరహితుడు పురుషోత్తముడైన విష్ణువునకు యుద్ధమందు ఎదురు వెళ్ళేరు. సమర్థుడైన విష్ణువుచే నలిపివేయబడ్డారు. దైత్యులకు ఆదిత్యులకు జరిగిన ఘోరమైన యుద్ధమునందు వీరులైన అదితికుమారులు దితిపుత్రులను చంపేరు.

నిహత్య దితి పుత్రాంశ్చ రాజ్యం ప్రాప్య పురందరః।
శశాస ముదితో లోకాన్ సర్షిసంఘాన్ సచారణాన్॥ ४४

పురందరుడు దైత్యులను చంపి రాజ్యాన్ని పొంది ముదితుడై ఋషిసంఘాలతో చారణులతోకూడిన లోకమును పరిపాలించెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చచత్వారింశ స్సర్గ సమాప్తము.

అథ షట్చత్వారింశ స్సర్గః

(ఇంద్రుని చంపగల పుత్రునికై దితి తపస్సుచేయుట, ఇంద్రుడు అదునుచూచి ఆమె గర్భమును ఏడు ముక్కలుగా ఖడించుట.)

హతేషు తేషు పుత్రేషు దితిః పరమదుఃఖితా
మారీచం కాశ్యపం రామ భర్తారమిదమబ్రవీత్॥౧
హతపుత్రాస్మి భగవంస్తవ పుత్రైర్మహాబలైః।
శక్రహన్తారమిచ్ఛామి పుత్రం దీర్ఘతపోర్జితమ్॥ ౨

రామా! పుత్రుల మరణంతో దితి పరమదుఃఖాన్ని పొందింది. మరీచిమహర్షి పుత్రుడు తన భర్త కాశ్యపప్రజాపతితో మాట్లాడుతోంది... భగవన్! మహాబలవంతులైన నీ కుమారులైన దేవతలచే నా పుత్రులు చంపబడ్డారు. నా దీర్ఘతపస్సుచే శక్రుని చంపగల బలముగల పుత్రుని కోరుకుంటున్నాను.

సాహంతపశ్చరిష్యామి గర్భం మే దాతు మర్హసి।
ఈశ్వరం శక్రహన్తారం త్వమనుజ్ఞాతుమర్హసి॥ ౩

నేను తపస్సు చేస్తాను. ఈశ్వరుడు శక్రహంత అగు గర్భమును నాకు ఇచ్చుటకు నీవు తగినవాడవు.

పరమదుఃఖాన్ని పొందిన దితి పలికిన పలుకులు విన్న మహాతేజశ్శాలి మారీచుడు అయిన కాశ్యపుడు ఆమెనుగూర్చి మాట్లాడుతున్నాడు.

ఓ తపోధనురాలా! నీవు కోరుకొన్నట్లే అగును. ఆవహము (యుద్ధము)నందు శక్రుని చంపగల పుత్రుని పొందగలవు, నీవు శుచివిఅగుము. నీవు శుచిగా ఉన్నట్లయితే కొంతకాలం గడచిన తరువాత నావలన మూడులోకాలకు ప్రభువైన పుత్రునికనగలవని పలికి మహాతేజశ్శాలి అయిన కాశ్యపుడు చేతులతో దితిని దగ్గరకు తీసుకున్నాడు. ప్రేమాతిశయంచేత శరీరాన్ని నిమిరాడు. ఆమె కోరికను చెల్లించి, తరువాత స్వస్తివాక్యాలు పలికి తపస్సుకై వెళ్ళిపోయేడు.

ఓనరశ్రేష్ఠా! ఆమె పరమసంతోషాన్ని పొందింది. కుశప్లవనము అనే ప్రాంతాన్ని చేరుకొని చాలా తీవ్రంగా తపస్సు చేసింది. ఇంతకుముందు సంతానరూప ఫలాలు పరాభవింపబడ్డాయి.

ఇప్పుడు తన కొడుకు లోకోత్తరపురుషుడు కావాలని తీవ్రప్రయత్నం చేస్తోంది. ఏవిధంగా ఉంటే సత్సంతానం కలుగుతుందని శాస్త్రం చెప్పిందో ఆవిధంగా తూ.చ. తప్పకుండా నడుచుకొంటోంది. అది తపస్సు. ఈ తపస్సు వృధాపోదు.

తపస్తస్యాం హి కుర్వన్త్యాం పరిచర్యాం చకార హ
సహస్రాక్షో నరశ్రేష్ఠ పరయా గుణసంపదా॥ ౯

నరశ్రేష్ఠా! ఈమె తపస్సు చేస్తున్నంతకాలం శ్రేష్ఠమైన గుణసంపదతో సహస్రాక్షుడు దితిని సేవించేడు.
సహస్రాక్షుడు దితికి కుశలను కట్టెలను ఉదకములను దుంపలను ఆమెచే కోరబడిన ఇతరములైన వాటిని సమకూర్చుచుండెడివాడు.
శక్రుడు దితియొక్క శారీరకశ్రమను పోగొట్టుటకు అనేక ఉపచారములను చేయుచుండెడివాడు.

అథ వర్షసహస్రే తు దశనే రఘునన్దన।
దితిః పరమ సంప్రీతా సహస్రాక్ష మథాబ్రవీత్॥ ౧౨

రఘునన్దనా! పది తక్కువగా వేయి సంవత్సరాలు గడిచాయి. దితి సంప్రీతిని దేవేంద్రునితో మాట్లాడుతోంది.
ఓ సురశ్రేష్ఠా! నేను కోరగా మహాత్ముడైన నీ తండ్రిచే వేయిసంవత్సరాలకు నాకు పుత్రుడు కలుగగలడని వరము ఇవ్వబడింది.
వీర్యవంతులలో శ్రేష్ఠుడా! ఇంక పదిసంవత్సరములలో తపస్సుపూర్తి అగును నీవు సోదరుని చూడగలవు నీకు భద్రమగుగాక!
పుత్రా! అతనిని నీకొరకైన జయమునందు ఉత్సుకతను కలుగచేసెదను. పుత్రా దుఃఖము లేనివాడవై మూడు లోకములను కలిసి అనుభవించండి.
దితి ఈవిధంగా పలికి మధ్యాహ్న సమయమందు పాదములపై కేశములు పడుతున్నట్లుగా కూర్చొన్న అశుచిగానున్న ఆమెయొక్క శరీరరంధ్రమును ప్రవేశించి గర్భమును ఏడువిధములుగా భేదించాడు.
రామా! నూరు అంచుల వజ్రముచే ఖండింపబడుచున్న గర్భము బిగ్గరగా ఏడ్చుచున్నది.

ఇంతలో దితి లేచింది మహాతేజస్సుగల శక్రుడు గర్భమునుగూర్చి ఏడవకుము ఏడవకుము అని పలుకుచూ, వారు ఏడ్చుచున్నను భేదించెను.
దితి శక్రునితో చంపవద్దని పలుకగా తల్లిమాటపై గౌరవముచే బయటకు వచ్చేడు. వజ్రసహితుడైన శక్రుడు దితిముందు అంజలిబద్ధుడై ఓదేవి! పాదాలపై కేశములు పడుటచే అపవిత్రురాలవై అటులనే నిద్రపోయావు.

తదన్తరమహం లబ్ధ్వా శక్రహన్తారమాహవే।
అభిదం సప్తధాదేవి తన్మే త్వం క్షన్తుమర్హసి॥ ౨౩

నేను ఆ అవకాశం దొరికిన వెంటనే యుద్ధమునందు శక్రహంత కాగల వానిని ఏడు ఖండములుగా ఛేదించితిని. నా పనిని క్షమింపుము.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షట్చత్వారింశ స్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తచత్వారింశ స్సర్గః॥

(ఖండిత శిశువు సప్తమరుత్తులుగానగుట. దితి తపస్సు చేసిన ప్రదేశమునందే విశాలుడు విశాలనగరమును నిర్మించుట.)

సప్తధా తు కృతే గర్భే దితిః పరమదుఃఖితా।
సహస్రాక్షం దురాధర్షం వాక్యం సానునయాఽబ్రవీత్॥ ౧

గర్భము ఏడుముక్కలుగా చేయబడినది అగుచుండగా దితి దుఃఖిస్తూ ఎదిరింప శక్యముగాని సహస్రాక్షునిగూర్చి అనునయ వాక్యాలు పలుకుతోంది.

ఓ బలసూదనా! (అంటే బలాసురుని సంహరించినవాడా) దేవేంద్రా! నాయొక్క అపరాధమువలన ఈ గర్భము ఏడుముక్కలైంది. ఈ విషయంలో నీయొక్క అపరాధము లేదు.

గర్భ విషయమున విపరీతఫలమును పొందిన నాకు ప్రియమును చేయవలెనని కోరుచున్నాను.

ఈ సప్తఖండములు ఏడైన మారుతస్థానములకు పాలకులు అగుగాక!

కుమారా! ఏడుగా విభాగింపబడిన వీరు దివ్యరూపములను ధరించి వాతస్కంధములకు అధిష్ఠాతలై మారుతులని విఖ్యాతిని పొంది అంతరిక్షమున చరింతురుగాక!

వీరిలో ఒకడు బ్రహ్మలోకమునందు సంచరించుగాక! అట్లే మరొకడు ఇంద్రలోకమునందు సంచరించుగాక! మూడవవాడు వాయువు అను పేర ఖ్యాతినిపొంది అంతరిక్షమందు సంచరించుగాక!

సురశ్రేష్ఠా! మిగిలిన ఆత్మజులైన నలుగురు నీ ఆజ్ఞవలన దేవతలుగా దిక్కులను సంచరించగలరు.

త్వత్కృతేనైవ నామ్నా చ మారుతా ఇతి విశ్రుతాః

నీచేత పిలువబడిన పేరుతో మారుతులని ప్రసిద్ధిని చెందగలరు.

సాహస్రాక్షుడు బలనిషూదనడైన పురందరుడు ఆమెయొక్క మాటలను విన్నాడు. అంజలిబద్ధుడై మాట్లాడు తున్నాడు.

నీచే ఏవిధంగా చెప్పబడిందో అవిధంగానే జరుగుతుంది. నీకుమారులు దేవతలై

సంచరించగలరు. నీకు శుభమగును.

జగ్మతుస్త్రిదివం రామ కృతార్థావితి నః శ్రుతమ్॥

రామా! ఆ తల్లీకొడుకులు ఈవిధంగా నిశ్చయించుకొని కృతార్థులై స్వర్గమునకు వెళ్ళేరని వినియున్నాము.

ఏషదేశస్స కాకుత్థ్స మహేంద్రాధ్యుషితః పురా।
దితిం యత్ర తపఃసిద్ధామేవం పరిచచారచ సః॥ ౧౦

కాకుత్థ్సా! పూర్వము మహేంద్రుడు నివసించిన ఆ దేశము ఇదే, ఇక్కడే దితి తపస్సు చేయుచుండగా ఆమెకు ఉపాచారాలను చేసేడు.

(ఇక్కడ ఏకదీక్షగా చేసే ప్రయత్నానికి మనస్సు కలిగించే విఘ్నాలని తెలియచేసింది. సకలలోక పూజ్యుడైన లోకోత్తర బలవంతుని పుత్రునిగా పొందుటకొరకు చేసిన ప్రయత్నం ఇంద్రియాల బలానికి వశమైపోయింది. ప్రతి ప్రయత్నానికి అంతకు మించిన బలంతో అడ్డుపడే ప్రయత్నాన్ని మనస్సు ఎప్పుడూ చేస్తూనే ఉంటుంది. సర్వేంద్రియ బలాలను హరించి వేయగలిగినది కనుకనే **మనస్సుకు బలసూదన**మని పేరు.

లోకంలో మనం చూస్తూనే ఉంటాం...

సాత్త్వికప్రవృత్తి కలవాడు వ్యసనపరుడైతే వాడు నిత్య సంఘర్షణకు గురి అవుతుంటాడు ఆ వ్యసనంనుండి బయటపడటానికి. వాడికి వ్యసనంకూడా సుఖస్పర్శను ఇవ్వలేదు. వాడు ఆ వ్యసనాలనుండి బయటపడే ప్రయత్నం సజ్జన సహవాసంతో చేస్తూంటాడు. కబ్జాచేసిన భూమిని విడిచి పెట్టడానికి ఇష్టపడని కబ్జాదారునిలా అధిక బలంగల ఇంద్రియాలు వాడిని జయించే ప్రయత్నం చేస్తూంటాయి. దురాక్రమణకుగురైన భూమిని కాపాడుకొనుటకు భూయజమాని రక్షకభటులను, ప్రచారమాధ్యమాలను, సానుభూతిపరులను ఆశ్రయించి ఏవిధంగా భూమినిపొందే ప్రయత్నంచేస్తాడో, ఆవిధంగానే ఈ సందర్భంలో గురుచరణాలను ఆశ్రయించడం, సత్సంగం, దేవతార్చన, తీర్థయాత్రా గమనము, వేదాంతశాస్త్ర పఠనము ఇత్యాది ప్రయోజనకరంగా ఉంటాయి.

తీవ్రమైన సంకల్పంతో చేసేప్రయత్నాలకు దీక్షాప్రారంభ సమయంలో మనస్సు

భయమునకు లోనై సాధకునకు వశవర్తియైనట్లుగా ఉంటుంది. ఉంటూనే అవకాశం కోరకు నిరీక్షిస్తూ అవకాశం చిక్కగానే విజృభించి సాధకుని లోబరుచుకుంటుంది.

ఏకాదశేంద్రియ సమాహార రూపంగా మనస్సు ఎప్పుడూ మనలను ప్రలోభపెట్టే పనిని చేస్తూంటుంది. ప్రయత్నం అంచున ఫలితం ఉన్న సమయంలో విశ్రాంతిని తీసుకోమని చెబుతుంది. మండలదీక్షలకు ముగింపుగా మద్యాన్ని చూపిస్తుంది. ఆనందం జూదంలో ఉందనిపించి, మనచేత ఆడిస్తుంది. ఆట వేట అయి ఇంటిని వేలం వేయిస్తుంది. ఇల్లు అంటే ఇటుకలు సున్నం సింమెంటు కాదు...ఇల్లాలు.

వీటినుండి బయటపడే ప్రయత్నాలుచేసిన అనేకుల వృత్తాంతాలు ఇందులో మహర్షి చెప్పేరు. ఆయా ప్రయత్నాలలో అనేక సంవత్సరాల కృషిని చేజార్చుకొన్న వారిని చూపించి ముందుకు నడుస్తారు. అంటే వారు ఆప్రయత్నాలను సాధించలేక విడిచిపెట్టారనో, అవి సాధించ లేనివనో చెప్పటం ఉద్దేశ్యంకాదు. అవి సాధింపబడతాయి అని నిదర్శనంగా నిలువెత్తు విశ్వామిత్రునిచే అవి సాధించిన వానిచేత చెప్పించేరు. ఆసాధన క్రమంలోనే దితి పాత్రను పరిచయం చేసేరు.

ఇరువురూ కృతార్థులై స్వర్గానికి వెళ్ళేరని మహర్షి చెప్పేరు. స్వర్గం అంటే వ్యసనదూరమైన అరిషడ్వర్గ రహితమైన మనస్సు ఇద్దరూ ఆస్థితిని పొందేరు. వాడెవడినో చంపగలిగే శక్తిగల సంతానం కావాలన్న కోరిక బహుప్రయాసతో కూడి దుఃఖాన్ని ఇచ్చింది.

వాడు పుడితే నా పదివికి ప్రమాదం అనుకొన్న వాడి భయం, పదవీవ్యామోహం వాడిని ప్రభువునుండి పనివాడిని చేసేయి. భ్రూణహత్యకు కూడా ప్రేరేపణ చేసింది. చెడు సంకల్పాలు ప్రమాద హేతువులనే...

సత్యం తెలుసుకొన్న ఇద్దరూ సుఖావస్థను పొందేరు. స్వర్గం అంటే మరెక్కడో ఉందనుకోకూడదు. ఎందుకంటే

మహేంద్రుడు విశాలనగర పాలకుడని **పురా ఏషః దేశః మహేంద్రాధ్యుషితః** అని మహర్షి చెప్తున్నారు.)

నరవ్యాఘ్రా! (రామా!) ఇక్ష్వాకువునకు ఆలంబుసయందు పరమధార్మికుడైన విశాలుడను ప్రసిద్ధి పొందిన పుత్రుడు పుట్టేడు. ఈయనే ఇక్కడ విశాల అను పురము నిర్మించాడు.

పూర్వం మహేంద్రుడు ఏ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకొని పాలించాడో ఆ ప్రాంతాన్నే ఇప్పుడు విశాలుడు విశాలనగరంగా పాలిస్తున్నాడు.

విశాలునికి ఇద్దరు కొడుకులు మహాబలశాలురైన అయిన హేమచంద్రుడు మరియు సుచంద్రుడు. ఈ సుచంద్రుని కుమారుడు ధూమ్రాశ్వుడు.

ధుమ్రాశ్వుని కుమారుడు సృంజయుడు. ఈయనయొక్క కుమారుడు శ్రీమంతుడు ప్రతాపవంతుడు అయిన సహదేవుడు. ఈయన కుమారుడు పరమధార్మికుడైన కుశాశ్వుడు. మహాతేజఃశాలి ప్రతాపవంతుడు అయిన సోమదత్తుడు కుశాశ్వుని కుమారుడు. ఈ సోమదత్తుని పుత్రుడు కాకుత్థుడు.

తస్యపుత్రో మహాతేజాః సమ్ప్రత్యేష పురీమిమామ్।

ఇప్పుడు ఈ పట్టణమున ఇక్ష్వాకువుయొక్క పుత్రుడు గొప్ప తేజస్సుకలవాడు దేవతలతో సమానుడు జయింప శక్యముకానివాడు అయిన సుమతి అనువాడు నివసించుచున్నాడు.

ఇక్ష్వాకువుయొక్క అనుగ్రహంచేత వైశాలికులు విశాలనగర సంబంధికులు అయిన రాజులు మహాత్ములు వీర్యవంతులు మంచిధార్మికులు.

రామా! నేటి రాత్రి మనము ఇచ్చటనే సుఖముగా నివసించెదము. రేపు ప్రభాతకాలమున జనకుని చూద్దాం.

గొప్పతేజస్సు యశస్సు కలవాడు, నరశ్రేష్ఠుడు అయిన సుమతి, విశ్వామిత్రుని రాకను తెలుసుకొని స్వాగతించుటకు ఎదురువెళ్ళేడు.

ఊరులోకి వచ్చినవాడు ఇంటిలోకి రాకుండా పోతాడా ఏంటి? ఎదురు వెళ్ళడం ఎందుకు అనుకోలేదు. తన అభివృద్ధిని, తన దేశాభివృద్ధిని కోరుకొనేవాడు; విశ్వశ్రేయస్సుని కోరుకొనే వారు, పండితులు అయినటువంటివారు మన ఊరికో, మన ఇంటికో వచ్చారనో వస్తున్నారనో తెలిసినప్పుడు తలుపులు తాళాలు వెసుకొని వెళ్ళిపోవడమో, నేను బయటున్నాను అంటు చెప్పడమో చేయకూడదు. అది వారిని అవమానపరచడం.

మన సంప్రదాయం–

అభివాదయేత్ వృద్ధాంశ్చ దద్యాచ్చైవాసనం స్వకమ్
కృతాంజలి రుపాసీత గచ్ఛతః పృష్ఠతోన్వియాత్॥ చెబుతోంది. అంటే వృద్ధులకు నమస్కరించడం. నీ ఆసనం వారికి ఇయ్యటం, అంజలిబద్ధులైయుండి అంటే వీరియందు వినయంకలిగియుండి వారు వెళ్ళేప్పుడు కొంతదూరం సాగనంపాలి. ఇది ధర్మం శ్రేయోమార్గం అని చెప్పేరు పెద్దలు. వారు వచ్చిన వెంటనే నువ్వులేచి వారికి నమస్కరించాలి. ఆ విషయం నీ ఆసనం వారికి సమర్పించాలి అని చెప్పడంలో ఉంది. నువ్వు వినయంతో వారు వెళ్ళే పర్యంతమూ వారి సమీపంలో ఉండాలి. వారి సమీపంలోనే ఉంటూ సేవించాలి. ఇది ఉపాసన. భగవదారాధనలో మనం చేసే సేవలన్నీ మనం వారికి అవసరమైనంత దగ్గర ఉండి చెయ్యాలి. వారు వెళ్ళ దలచినప్పుడు, వారి వెనుకనే కొంతదూరం కనీసం ఇంటి సరిహద్దు వరకైనా సాగనంపడం చేయాలి. ఇలా చేస్తే ...

సంతానానికి ప్రేతకర్మ చేయవలసిన అవసరం తల్లిదండ్రులకు రాదు.
వైధవ్యాన్ని మోయవలసిన అవరం ఇల్లాలికి రాదు,
సంతానం అనాథ జీవితం గడపవలసిన దుర్గతిపట్టదు.

ఇది తెలిసినవాడు సుమతి. అందుకని తను మహారాజైనా సత్పురుషుల దర్శనానికి, వారిని ఆహ్వానించడానికి స్వయంగా వచ్చాడు.

బంధపురోహిత సమేతంగా వచ్చిన సుమతి విశ్వామిత్రుని గొప్పగాపూజించి అంజలిబద్ధుడై కుశలప్రశ్నలను అడిగేడు.

ధన్యోస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే విషయం మునిః
సంప్రాప్తో దర్శనం చైవ నాస్తి ధన్యతరో మమ॥ ౨౨

విశ్వామిత్రముని నీవు నాయొక్క దేశమునకు వచ్చుటవలన నీ దర్శనమువలన ధన్యుడనైతిని. నేను అనుగ్రహింపబడ్డాను. నీ ఆగమన దర్శన భాగ్యాలను పొందిన నాకంటే ధన్యాత్ముడు వేరొకడు లేదు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **సప్తచత్వారింశ స్సర్గ** సమాప్తము.

॥అథ అష్టచత్వారింశ స్సర్గః॥

(విశ్వామిత్రుడు ఆ రాత్రి రామలక్ష్మణులతో కలిసి సుమతి ఆతిథ్యం స్వీకరించి మరునాడు మిథిలానగరిని చేరు క్రమంలో అహల్యాగౌతముల వృత్తాంతము రామునకు చెప్పుట.)

పృష్ట్వా తు కుశలం తత్ర పరస్పసమాగమే।
కథాన్తే సుమతిర్వాక్యం వ్యాజహార మహామునిమ్॥ ౧

అచట ఒకరినొకరు యోగక్షేమములను అడిగి తెలుసుకొన్న తరువాత మహామునినిగూర్చి ఈ విధంగా పలికెను.

ఓ విశ్వామిత్ర మహామునీ! నీకు మంగళము అగుగాక! దేవతలతో సమానమైన పరాక్రమంకలవారు గజసింహములవంటి గతికలవారు, వీరులు, శార్దూల వృషభములవలె ఉన్నవారు, పద్మపత్రములవంటి నేత్రములుకలవారు, ఖడ్గమును తూణీరమును ధనుస్సులను ధరించిన వారు, అశ్వినీదేవతలవలె ఉన్నవారు, యువకులు, తమ ఇచ్ఛను అనుసరించి భూమినిపొందిన దేవతలవలె ఉన్న ఈ కుమారులు ఇక్కడకు నడిచి ఎందుకు వచ్చేరు? వీరు ఎవరు?

ఓ మునిశ్రేష్ఠా! వీరు హావభావములచేతను ప్రమాణముచేతను ఒకేవిధంగా నున్నారు. చంద్రసూర్యులు ఆకాశమును అలంకరించినట్లు వీరు ఈ ప్రదేశమును అలంకరించుచున్నారు. శ్రేష్ఠములైన ఆయుధములను ధరించిన ఈ వీరులు దుర్గమమైనమార్గమునందు దేని నిమిత్తమై వచ్చియున్నారు? యథార్థమును తెలియగోరుచున్నాను.

సుమతి మాటలను విన్న విశ్వామిత్రుడు సిద్ధాశ్రమ నివాసము, రాక్షస సంహారము మొదలైనవి జరిగినది జరిగినట్లుగా తెలియజేసేడు.

రాజైన సుమతి విశ్వామిత్రుడు చెప్పినది విని పరమసంతోషాన్ని పొందిన వాడై శ్రేష్ఠులును అతిథులును సత్కారమునకు తగినవారును మహాబలులైన ఆ దశరథపుత్రులను యథావిధిగా పూజించెను.

రామలక్ష్మణులు సుమతినుండి గొప్పసత్కారమును పొంది అచట ఒకరాత్రి ఉండి తరువాత మిథిలనుగూర్చి వెళ్ళిరి.

మునులందరూ జనకమహారాజుయొక్క శుభప్రదమైన పట్టణమును చూసి

సాధు సాధు అని ప్రశంసించుచూ ఆ మిథిలానగరమును పూజించిరి.

మిథిలోపవనే శూన్యమాశ్రమం దృశ్య రాఘవః
పురాణం నిర్జనం రమ్యం పప్రచ్ఛ మునిపుఙ్గవమ్‌॥ ౧౧

రాఘవుడు మిథిలా సమీపమునున్న వనమందు పురాణము నిర్జనము రమ్యము శూన్యము అయిన ఆశ్రమాన్ని చూచి మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుని ప్రశ్నించేడు.

శ్రీమదాశ్రమ సంకాశం కిం న్విదం మునివర్జితమ్‌।
శ్రోతుమిచ్ఛామి భగవన్ కస్యాయం పూర్వ ఆశ్రమః॥ ౧౨

భగవన్! ఇది మునివర్జితంగా ఉంది, శ్రీమంతంగా ఉంది.
ఇది ఏమి? ఈ ఆశ్రమము ఎవరిది? వినాలని ఉంది.
మహాతేజఃశాలి వాక్యవిశారదుడు అయిన విశ్వామిత్రుడు రాఘవుని మాటలు విని, సమాధానం చెబుతున్నాడు.
రాఘవా! చాలా ఆనందంగా ఉంది. చెబుతాను విను.
ఎందుకు ఆనందం అంటే...
రామునియొక్క నిశితపరిశీలనాత్మకమైన ప్రశ్న తీరునకు ఆనందం. రాముడు ఆశ్రమాన్ని చూసిన తీరుకి ఆనందం.
ఈ ఆశ్రమాన్ని రాముడు ఎలా చూస్తున్నాడు...
పురాణమ్‌– నిత్యనూతనముగా ఉంది, **నిర్జనమ్‌**– నిర్జనంగా ఉంది. అంటే ఇంద్రియరహితంగా ఉంది. ఆశ్రమానికి ఇంద్రియాలు లేకపోవడం ఏమిటి? అంటే ఆశ్రమంలో ఉన్నవారి ఇంద్రియాలు ఉపరమావస్థయందున్నాయి. **భ్రష్ట బీజోపమా భూయో జన్మాంకుర వివర్జితా** అని శ్రుతి చెప్పినట్లు వేయించిన బీజములు మరల తిరిగి ఎట్లు జన్మించుటకు సమర్థములుకావో! ఆవిధమైన హృదయంతో శుద్ధవాసనలుగల జీవన్ముక్తస్థితిలో ఉన్నారు. అక్కడ భోగ్యపదార్థములు ఏవి కనుబడుటలేదు కావున నిర్జనమని చెప్పేరు. అంటే కామనాశూన్యంగా పరమప్రశాంతంగా ఉంది. అందువలన **రమ్యం**. అంటే బ్రహ్మవేత్తల హృదయానికి ఆనందాన్ని ఇచ్చేదిగా ఉంది. ఇటువంటి ఆశ్రమాన్ని చూసి బ్రహ్మవేత్త అయిన విశ్వామిత్రుని అడిగేరు.

ఇది ఎవరి ఆశ్రమమో ఏ మహాత్ముడు కోపంతో దీనిని శపించాడో యథార్థమును చెప్తాను విను. అని మహర్షి చెబుతున్నారు.

గౌతమస్య నరశ్రేష్ఠ పూర్వమాసీన్మహాత్మనః।
ఆశ్రమో దివ్యసంకాశః సురైరపి సుపూజితః॥ ౧౫

ఓ నరశ్రేష్ఠా! మహాప్రకాశముతోకూడిన దేవతలచేకూడ బాగుగా పూజింపబడిన ఈ ఆశ్రమము పూర్వము గౌతమునిది. ఆ గౌతముడు ఆహల్యా సహితుడై అనేకములైన సంవత్సర సముదాయములు ఇచట తపస్సు చేసేడు.

తస్యాన్తరం విదిత్వా తు సహస్రాక్షః శచీపతిః।
మునివేషధరోఽహల్యామిదం వచనమబ్రవీత్॥ ౧౬

శచీపతి అయిన సహస్రాక్షుడు భర్తయొక్క అవకాశాన్ని తెలిసికొని గౌతమముని వేషమును ధరించి అహల్యతో మాట్లాడుతున్నాడు. "శచతి హంసవద్గచ్ఛతీతి శచీ" అంటే శ్వాసకు పతి అయిన వాడు సహస్రాక్షుడు. ఇది మనస్సు. మనస్సు మాత్రమే బాహ్యాభ్యంతరములను ఏకకాలములో చూడగలదు. కనుకనే సహస్రాక్షుడని చెప్పబడింది. (మీమాంసాది శాస్త్రములలో 'ఆత్మ' శబ్దమును బ్రహ్మ, జీవుడు, మనస్సు, శరీరము అను అర్థములలో ప్రయోగించుట కలదు. సందర్భమును తెలిసి అర్థగ్రహణము చేయవలసి ఉంటుంది)

బ్రాహ్మీముహూర్తములో భగవచ్చింతనలో ఉండవలసిన వేళ ఇంద్రియాలు అన్యథా ఉన్నాయి.

సైన్యం విజృభిస్తున్నంత కాలం రాజు బలవంతుడే!

ఇంద్రియరాజమైన మనస్సు అహల్యను లోబరుచుకొనే ప్రయత్నం చేస్తోంది. ఆమెయొక్క మనస్సు గౌతమరూపాన్ని ధరించింది. గౌతమ వేషాలంకృతమైన మనస్సు అహల్యతో తర్కిస్తోంది.

గౌతమరూపుడైన ఇంద్రుడు(మనుస్సు) ఆమెతో తర్కిస్తున్నాడు అంటే అహల్య తనకు కలిగిన కోరికకు యుక్తులను ఆశ్రయించి సర్దిచెప్పే ప్రయత్నం, చేస్తోంది.

ఋతుకాలం ప్రతీక్షన్తే నార్థినః సుసమాహితే।
సంగమం త్వహమిచ్ఛామి త్వయా సహ సుమధ్యమా॥

భోగము కోరువారు ఋతుకాలంకొరకు ఎదురుచూస్తారా? చక్కని నడుము కలదానా! నీతో సంగమించాలని కోరుకొంటున్నాను. అని అంటున్నాడు గౌతమరూపధారి అయిన సహస్రాక్షుడు (మనస్సు). ఇప్పటివరకు అహల్య అంతర్ముఖంగా ఉంది. ఇప్పుడు ఆమె ఇంద్రియాలు బహిర్ముఖమై ప్రపంచాన్ని చూస్తున్నాయి. తనకు తానే అందంగా కనబడుతోంది. చక్కని తీర్చి దిద్దినట్లున్న నా శరీరం చక్కని సన్ననినడుము. ఎంత అందంగా ఉన్నానో ఇటువంటి నేను నా పతితో సుఖిస్తే బాగుండును అనుకొంది. ఇంత అందమైన తనను తన భర్తకోరికతో సమీపించినట్లుగా ఊహించుకొంది. తనలోని కామమే తన భర్త రూపాన్నిపొంది తనను ఆక్రమించుకొంటోంది. ధర్మం తెలిసినది అగుటచేత నిషిద్ధసమయాలను బుద్ధియందుంచుకొని మనస్సును నిగ్రహించుకొనే ప్రయత్నంచేస్తోంది. అది బ్రాహ్మీ ముహూర్తం. శాస్త్రామోద యోగ్యమైన కాలంకాదు.

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన।
మతిం చకార దుర్మేధా దేవరాజకుతూహలాత్॥ ౧౯

భర్తృరూపంగా ఉన్న మనస్సు (సహస్రాక్షుని) తో 'దుర్మేధాః' శాస్త్రవిరుద్ధమైన బుద్ధి అని తెలిసిన అహల్య. దుర్మేధ అనునది మన్మథునకు ఉన్న పేర్లలో ప్రసిద్ధమైనది. అంటే ఈమె మన్మథుని వశమందున్నది. అహల్య మనస్సుయొక్క ఆధీనంలో ఉంది. **దేవరాజకుతూహలాత్** అంటే భర్తమీద కోరికచే అని...

"యథా భర్తృసమం నాన్యమపశ్యం పురుషం క్వచిత్"

"యథా భర్తృసమం నాన్యహం పశ్యామి దైవతం" ఇత్యాది ప్రతిజ్ఞలు అనసూయాదేవి సుమతీ మాంగళ్యరక్షణ సమయంలో చేసింది. పతివ్రతలకు భర్తయే దైవం. ఆదిత్యాదులుకూడా దేవతా శబ్దవాచ్యులు అగుటచేత ఆ దేవతలందరికంటే శ్రేష్ఠుడైనవాడు భర్త. కావున భర్తయే దేవరాజు.

కన్యక మొదటి రెండుసంవత్సరాలు సోమునిచే అనుభవింపబడుతుంది. తరువాత రెండుసంవత్సరాలు గంధర్వునిచే అనుభవింపబడుతుంది. తరువాత రెండుసంవత్సరములు అగ్నిచే అనుభవింపబడుతుంది. అంటే నాలుగునుండి ఆరువరకు అగ్నిచే అనుభవింపబడుతూ ఉంటుంది. **సోమః**

ప్రథమో వివిదే... అను శ్రుతి చెప్పుచున్నది. ఇక్కడ అనుభవించుట అంటే దంపతులమధ్య దాంపత్య సుఖమువంటిదికాదు. రెండుసంవత్సరముల ప్రాయంలో పాలబుగ్గలతో చంద్రకళలతో నిండి ఉంటుంది. నాలుగువరకు వాక్కును బలంచేసుకొంటుందికావున గంధర్వునిచే అనుభవింపబడుచున్నదని చెప్పటం. తరువాత ఆరువరకూ అగ్ని అనుభవిస్తున్నాడంటే, రూపప్రకాశలక్షణం అగ్నిది. తను అందమైన ప్రకాశవంతమైన రూపాన్ని పొందుతుంది.
తరువాత ఎవరి అనుభవంలో ఉంటోంది, అని ఆలోచిస్తే...
ఇంద్రుని (మనుస్సు) యొక్క అనుభవంలో ఉంటోంది. కనుక ఈ అనుభావాల విషయంలో కుశంకలకు తావులేదు.
మనస్సు భర్తృరూపాన్నిపొంది అనుభవాన్ని అందిస్తోంది.
మానసిక శృంగారమేకదా! అని అంగీకరించింది. అంటే మనస్సుకు వశమైంది. తీవ్రమైన కోరికతో శాస్త్రవిరుద్ధమైన వేళలలో సంభోగంచేసింది. అది మానసికశృంగారమే అయినా సర్వేంద్రియాలు అనుభవసారాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇటువంటి సమయంలో ఎవరు చూసినా వారి మానసిక స్థితిని గ్రహించగలుగుతారు. కామ క్రోధ లోభాదుల విషయంలో ఇటువంటి సన్నివేశాలు లోకసహజం. మనం చూస్తూనే ఉంటాం.
ఆమె తపస్వి కావున ఈ విషయాన్ని గ్రహించింది.

అథాబ్రవీన్నరశ్రేష్ఠ కృతార్థేనాన్తరాత్మనా। ౨౦
కృతార్థాస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్రమితః ప్రభో
ఆత్మానం మాం చ దేవేశ సర్వథారక్ష గౌతమాత్॥ ౨౧

నరశ్రేష్ఠా! ఆమె పొందిన ఆనందం నుంచి బయటపడి అంతఃకరణముచేత పలుకుతోంది. వేళకానివేళలో ఇటువంటి ఆలోచనలు ఏమిటి? వస్తే వచ్చింది, తొందరగా విడిచిపోతే బాగుండును అని ప్రాధేయపడుతోంది. ఆ మనస్సు అభివ్యక్తంకాకుండా సర్వవిధాల ప్రయత్నం చేస్తోంది. ఓ మనసా నన్నూ, నిన్నూ కూడా గౌతమునినుండి కాపాడు. ఎందుకంటే గౌతముడు ఈ భావనలో ఉన్న నన్ను చూస్తే శిక్షణ ఇంకా కఠినంగా ఉంటుంది.
అందుకని మనస్సుని అదుపు చేసే ప్రయత్నం. కానీ సాధ్యపడటం లేదు. భర్త

అయిన గౌతముడు చూసేడు. కోపంవచ్చింది. కఠినసాధన చేయమని కటువుగా చెప్పేడు.

అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేషధరం మునిః। ౨౮
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషాద్వచనమబ్రవీత్
మమ రూపం సమాస్థాయ కృతవానసి దుర్మతే॥ ౨౯

అహల్యా గౌతములు సంసారంచేయని వారేంకాదు. బ్రహ్మవేత్తయైన శతానందుని తల్లిదండ్రులు. శతానందుడు ధర్మసంతానం. దీనితో పితౄణం తీరింది. విద్యాధ్యయన అధ్యాపనాదులచే ఋషిఋణం తీరింది. సమాజ ఋణము తీర్చుకొన్నారు. ఋణత్రయమునుండి విముక్తిపొంది వానప్రస్థ జీవనంలో ఉన్నారు.

అంతేకాక ఆ సమయంలో కలిస్తే రాక్షసప్రవృత్తికలవారు పుడతారు. రావణుడు అలాగే పుట్టేడు. రావణ శతానందులను చూస్తే మనకు ఈ విషయం సుబోధకం అవుతుంది.

చెడునడవడికల మనస్సును చూసేరు. కోపాన్నిపొంది ఓ చెడుమనసా! నా రూపాన్నిపొంది చేయరాని పనిని చేసేవు. నీవు విఫలుడవు కాగలవు. అంటే ఇక నీవు నీ ప్రయత్నములయందు సఫలము కాకుందువు. అన్నారు. అహల్యకు అదుపుతప్పిన ఇంద్రియాలను అదుపులో పెట్టే ప్రయత్నాన్నీ చెప్పేరు.

ఇహ వర్షసహస్రాణి బహూని త్వం వసిష్యసి।
వాయుభక్షా నిరాహారా తప్యన్తీ భస్మశాయినీ॥౩౦
అదృశ్యా సర్వభూతానా మాశ్రమేఽస్మిన్నివత్స్యసి॥ ౩౧

వేల సంవత్సరాలు ఇక్కడే ఉండు. అన్నం మనో నిర్మాణానికి కారణం కావున దాన్ని విడిచిపెట్టమన్నారు. వాయుభక్షణను విధించేరు. భూతలశయనాన్ని చేప్పేరు. ఈ విధంగా తపస్సు చేయమన్నారు. ఎవ్వరికీ కనబడకు. చూడదగ్గది ఏదీ బయటలేదు. నీవు అనుభవించిన సురతాదులయందలి ఆనందంకన్నా గొప్పఆనందం నీలో ఉంది. దానికై లోచూపుకలిగి ఉండు. అలా ఉంటే ఈమెకు బయటి ప్రపంచం లేనిదైపోతుంది. ఈమెకు ప్రపంచమున చూచుటకు ఏమీ లేనిదగుటచే ప్రపంచమునకు ఈమె కనబడనిదిగా ఉంటుంది. లోకం

బ్రహ్మవేత్తలను పిచ్చివాళ్ళు అనుకున్నట్లుగా! ఈవిధంగా తపస్సు చేయమని గౌతముడు శాసించి, తాను తనయందలి క్రోధరూపమైన దోషమును గ్రహించిన వాడగుటచే తపస్సుకొరకు హిమవత్పర్వత ప్రాంతాలకు వెళ్ళిపోయారు.
ఎందుకని అంటే తపస్సుకు తగిన వాతావరణాన్ని కల్పించుటకు. విద్యార్థికి అధ్యయనమే తపస్సు. మనం వాడి చదువుకు తగిన వాతావరణం మనమే కల్పించాలి. వాడి ఏకాగ్రతకు భగంకలిగే విధంగా ప్రవర్తించకూడదు.
ఇక్కడ అహల్య తపస్సు భంగం కావడానికి తనపైగల కామం, తన తపస్సు భంగం కావడానికి తనలోని క్రోధం కారణాలుగా ఉన్నాయి. అందుకని తపస్సు పరిసమాప్తి పర్యంతము దూరంగా ఉండాలని అనుకున్నాడు. తన తపశ్శక్తి దేవదానవులకు భయకారకము. అన్యులు దుర్బుద్ధితో తన ఆశ్రమంలో ప్రవేశించలేరు. కనుక తన పత్నిని ఆశ్రమంలో ఉంచి తనే బయట ఉన్నాడు. ఇదిగో ఈ విధమైన కఠిన తపస్సే చిత్తశుద్ధికి ఉపాయమని అహల్యా వృత్తాంతాన్ని చూపించేరు.
ఇంతకుముందు ఉద్రేకింపబడిన ఇంద్రియముల ఉపరమ స్థానం గృహస్థాశ్రమమని విషయసుఖములను అనుభవించుట ద్వారా శాన్తింపచేయ వచ్చునని వాల్మీకిమహర్షి ఋష్యశృంగ వృత్తాంతముద్వారా చెప్పేరు. ఇది ఆదరణీయమైన దగుటంజేసి మనమూ ఈ విధమైన ప్రవృత్తికలవారమే అయ్యాము.
నానావిధ విషయసుఖములను అభిలషించుచున్న ఇంద్రియములకు ఆయా సుఖములను సమకూర్చి ఇంద్రియములచే అనుభవింపజేసి అలసిన ఇంద్రియములను చూచి ఇది సహజమగు ఉపరమావస్థయని భ్రమించుచున్నారము. అలసట తీరినమీదట ఆయా సుఖములను ఆ ఇంద్రియములు మరలమరల అపేక్షించుచూనే ఉన్నవి అనునది అనుభవ సిద్ధమేకదా!
కోరికలను అనుభవిస్తూ పోయినయెడల కోరిక శమించదు. కామములు అనుభవించేకొద్ది ఘృతముచే అగ్నివలె కామవాంఛ ఇంకనూ వృద్ధిపొందునని శ్రుతి చెప్పుచున్నది.
వాల్మీకిమహర్షి ఇది తెలియనివారు కాదు. కనుకనే బాలకాండలో ఋష్యశృంగ వృత్తాంతముతో ప్రారంభించి సాధకుడు తన అనుభవాలతో సరిచూసుకొను

అవకాశము కల్పించి, అహల్యావృత్తాంతముతో సమాధానరూపంగా సమాప్తి చేస్తారు.

సంనియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నిగచ్ఛతి ఇంద్రియములు బలవంతముగాను కఠినతపస్సుచేతను నిగ్రహింపవలసినవే అప్పుడే వైరాగ్యోదయము జ్ఞానప్రాప్తి; అన్యథా సాధ్యంకాదని అహల్యావృత్తాంతాన్ని చూపించేరు. ఇదే భావనను శ్రీరామకృష్ణులు వారి శిష్యులకు చాలా సందర్భాలలో చెప్పేరు. వారు ఆచరించి చూపేరుకూడా!

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టచత్వారింశ స్సర్గ సమాప్తము.

-

॥అథ ఏకోనపఞ్చాశ స్సర్గః॥

(శ్రీరాముడు అహల్యను చూచుట. అహల్యా గౌతములు శ్రీరాముని సత్కరించుట.)

అఫలస్తు తతః శక్రో దేవానగ్నిపురోగమాన్।
అబ్రవీత్త్రస్తవదనః సర్షిసఙ్ఘాన్ సచారణాన్॥ ౧

విఫలుడగుటచే దిగులు చెందిన శక్రుడు దిగులుతోకూడిన ముఖముగలవాడై ఋషిసంఘముతోను చారణులతోనుకూడిన అగ్నిని ముందుంచుకొని నడుస్తున్న దేవతలను గూర్చి పలికెను.

గౌతముని కోపముచేత అఫలునిగా చేయబడ్డాను. అహల్యకూడా నిరాకరింప బడింది. శాపమును ఇచ్చుటచేత గౌతముని తపస్సు నాచేత హరింపబడింది. ఓ దేవతాశ్రేష్ఠులారా! ఋషి చారణులతోకూడిన మీరందరు దేవతలకు సహాయముచేసిన నన్ను సఫలునిగా చేయవలసినది. అగ్న్యాది దేవతలు ఇంద్రుని మాటలు విని మరుద్గణములతోకలిసి పితృదేవతల దగ్గరికి వెళ్ళేరు. వెళ్ళి...

మీకు యజ్ఞభాగముగా లభించు మేషమునకు ఉన్న వృషణములను శక్రునకు ఇవ్వండి. వృషణములు లేనిదైనను మేషము మీకు గొప్పసంతోషాన్ని ఇవ్వగలదు. అటువంటి మేషమును మీకు సమర్పించిన మానవులుకూడా ఇష్టార్థప్రాప్తి రూపంగా సంతోషమును పొందగలరు.

అగ్నేస్తు వచనం శ్రుత్వా పితృదేవాః సమాగతాః
ఉత్పాట్య మేషవృషణౌ సహస్రాక్షే న్యవేశయన్॥ ౮

పితృదేవతలు వచ్చిన అగ్న్యాదిదేవతల మాటలు విని మేషవృషణములు తీసి సహస్రాక్షునకు అతికించారు. ఇరుపక్షాలు సమానంగా గౌరవించే వ్యక్తి సంధానకర్తగా ఉన్నప్పుడే సంధి జరుగుతుంది. ఇక్కడ అగ్ని అటువంటి వాడు. కనుక అగ్నినిముందు పెట్టుకొని వ్యవహారమును చేయడం.

నలభైఎనిమిదవ సర్గలో అహల్యా వృత్తాంతమును చెబుతూ మహర్షి... అహల్యను "**సుమధ్యమా** అంటే చక్కనినడుముకలదానా! అని, **సుశ్రోణి** అంటే మంచిపిరుదులు కలదిగా" చెప్పేరు. పురుషులయందు కామోద్దీపన స్థానాలుగా వీటిని చూపేరు.

శ్రీమద్రామాయణం వేదాన్తం చెప్పటానికి అవతరించలేదు. లక్ష్యలక్షణ

సహితంగా గార్హస్థ్యజీవనాన్ని నిర్దేశించుటకు ఆవిష్కరింపబడింది.

ఇక్కడ ఇంకో విషయాన్నికూడా గమనించాలి. పరస్త్రీవ్యామోహం ప్రమాద హేతువనికూడా మహర్షి చెప్తున్నారు. స్త్రీ పురుషుల వివాహేతర సంబంధం వలన ఇద్దరికీ ప్రమాదమే అని మహర్షి చెబుతున్నారు. వివాహేతర సంబంధం వలన శక్రుని వృషణాలను గౌతముడు కోసేసాడు. ఇక్కడ ఇంకొక విషయం గమనించాలి...

రామాయణ కాలంలోనే వృషణాలను మార్పిడిచేసే శస్త్రచికిత్సను విజయ వంతంగా చేసేరు.

John Romulus Brinkley (later John Richard Brinkley; July 8, 1885 – May 26, 1942) was a controversial American who fraudulently claimed to be a medical doctor (he had no legitimate medical education and bought his medical degree from a "diploma mill") who became known as the "goat-gland doctor" after he achieved national fame, international notoriety and great wealth through the xenotransplantation of goat testicles into humans. Although initially Brinkley promoted this procedure as a means of curing male impotence, eventually he claimed that the technique was a virtual panacea for a wide range of male ailments.

రామా! పితృదేవతలు మేషవృషణములను శక్రునికి అతికించారు కావున అది మొదలు పితృదేవతలు వృషణములు లేని మేషములనే భుజిస్తున్నారు. రామా! మహాత్ముడైన గౌతముని తపఃప్రభావముచే ఇంద్రుడైతే ఆనాటినుండి మేషవృషణములు కలవాడైనాడు.

మహాతేజఃశాలివైన రామా! పుణ్యాత్ముడైన గౌతముని ఆశ్రమము ప్రవేశించు. గోప్పభాగ్యముకలది దేవరూపిణి అయిన ఈ అహల్యను తరింపచేయుము. లక్ష్మణసమేతుడైన రాముడు విశ్వామిత్రుని మాటలను విని విశ్వామిత్రుని ముందుంచుకొని ఆశ్రమములోనికి ప్రవేశించాడు.

దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్
లోకైరపి సమాగమ్య దుర్నిరీక్ష్యాం సురాసురైః॥ ౧౩

ప్రయత్నాన్నిర్మితాం ధాత్రా దివ్యాం మాయామయీమివ
సతుషారావృతాం సాభ్రాం పూర్ణచన్ద్రప్రభామివ॥ ౧౪
మధ్యేంఽభసో దురాధర్షాం దీప్తాం సూర్యప్రభామివ

గొప్పభాగ్యంకలది తపస్సుచేత ప్రకాశింపబడుతున్న కాంతికలది, దేవాసుర మనుష్యులు ఎవరు సమీపించి చూడ శక్యముకానిది బ్రహ్మచేత ప్రయత్న పూర్వకంగా నిర్మింపబడిన దివ్యమైన మాయవలె ఉన్నదీ, మంచుచేత కప్పబడి మేఘావృతమైన పూర్ణచంద్రకాంతిలా, నీటిమధ్యయందు ప్రకాశిస్తూన్న చూడ శక్యముగాని సూర్యకాంతిలా! ఉన్న అహల్యను రాముడు చూసేడు.

సా హి గౌతమవాక్యేన దుర్నిరీక్ష్యా బభూవ హ
త్రయాణామపి లోకానాం యావద్రామస్య దర్శనమ్॥ ౧౫

ఆమె గౌతమ వాక్యముచే ఆనందంయొక్క దర్శనం, సుఖస్వరూప దర్శనం అగునంతవరకు లోకత్రయానికి చూడశక్యంకానిదిగా అయింది.
ఇక్కడ అహల్య తనయందు ప్రపంచం లేనిదై తపస్సుచేసింది. కనుక ప్రపంచానికి తను కనబడనిదిగా ఉంది.
రాముడంటే కేవలం కరచరణాది అవయవ సహితుడైన కౌసల్యా సుప్రజుడు అనుకోకూడదు. ఆనందస్వరూపం ధర్మం. సుఖస్వరూపం ధర్మం.
అదిగో అటువంటి ధర్మం మూర్తిమంతమైతే కౌసల్యాసుప్రజుడు.
గౌతముడు చెప్పేడు, నిజమైన ఆనందాన్ని దర్శించేవరకూ తపస్సు చెయ్యమని, ఆంతరంగా తన తపస్సుకు లక్ష్యమైన ఆనందాన్ని దర్శించింది.
బాహ్యంగా ఆ ఆనందం మూర్తిమంతమై ఎదురుపడితే అది రామబ్రహ్మం.
ఇప్పుడు అహల్య తను ఆనందఘనమై ఆనందస్వరూపాన్ని చూస్తోంది.

శాపస్యాన్తముపాగమ్య తేషాం దర్శనమాగతా
రాఘవౌ తు తతస్తస్యాః పాదౌ జగృహతుస్తదా॥ ౧౬

భర్తృ శాసనరూపమైన సాధన పూర్తి అయింది. రామలక్ష్మణులు ఆమె పాదములను గ్రహించేరు. లోకంలో అహల్యామాతనుగూర్చి చులకనగా మాట్లాడేవారు ఒక విషయం గమనించాలి. అహల్యామాతనుగూర్చి మనం ప్రమాణపత్రాలు ఇవ్వనక్కర్లేదు. ధర్మస్వరూప మైన రామబ్రహ్మం ఆతల్లి పాదాలవద్ద సాగిలిపడింది.

రాఘవౌ పాదౌ జగృహతుః అంటున్నారు... రాముడు ఆతల్లియొక్క రెండు పాదములను తన చేతులతో గ్రహించాడు అంటున్నారు. అంటే ఆమె పాదములను స్పృశించి పునీతుడైనట్లుగా భావించాడు.

ఇంతవరకు రాముడు ఎవరికీ పాదాభివందనం చేసినట్లు మహర్షి చెప్పలేదు. ఆ తల్లి అధర్మమే ఆచరించి ఉంటే రాముడు పాదాభివందనం చేసేవాడు కాదు. అహల్య గౌతముని మాటలు స్మరించి వారిని గౌరవించింది. శాస్త్రోక్తవిధిని సావధానచిత్తముతో పాద్యమును అర్ఘ్యమును ఆతిథ్యమును ఇచ్చింది. రాముడు ఆ సత్కారములను స్వీకరించేడు.

దేవ దుందుభులు మ్రోగేయి. పుష్పవృష్టి కురిసింది. గంధర్వులు పాడేరు. అప్సరసలు నాట్యం చేసేరు. అంటే సర్వప్రకృతి ఆనందంలో తేలిపోతోంది. గౌతముని ఆదేశం ప్రకారం తపోబల విశుద్ధాంగియైన అహల్యను దేవతలు సాధు సాధు అని పూజించేరు.

గౌతమోపి మహాతేజా అహల్యాసహితః సుఖీ
రామం సంపూజ్య విధివత్తపస్తే పే మహాతపాః॥ ౨౧

గొప్పతపస్సుగల అహల్యాసహితుడైన గౌతముడు సుఖవంతుడై రాముని శాస్త్రవిధిని అనుసరించి పూజించి తపోనిష్ఠుడైయ్యేడు.

ఇక్కడ గౌతముడు అహల్యను తిరిగి స్వీకరించాడు. అని మహర్షి చెప్పలేదు. తిరిగి స్వీకరించాడు అంటే పూర్వం విడిచిపెట్టేడని చెప్పవలసి వస్తుంది. ధర్మవేత్త అయిన గౌతముడు వేదోక్తరీతిని పాణిగ్రహణంచేసిన కన్యను, తన పత్నిని విడిచిపెట్టేడంటే ధర్మంతప్పినవాడు అవుతాడు. భార్యను విడిచిపెట్టడం (విడాకులు) మన సంప్రదాయంకాదు.

దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్
లోకైరపి సమాగమ్య దుర్నిరీక్ష్యాం సురాసురైః॥ ౨౨

గౌతముడు విధిని అనుసరించి చేసిన పూజను రాముడు గ్రహించి మిథిలకు వెళ్ళేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **ఏకోనపఞ్చాశ స్సర్గ** సమాప్తము.

॥అథ పఞ్చాశః సర్గః॥

(రాఘవులతోకూడి మిథిలనుచేరిన విశ్వామిత్రుడు జనకునకు జరిగిన వృత్తాంతము అంతయూ చెప్పారు)

తతః ప్రాగుత్తరాం గత్వా రామః సౌమిత్రిణా సహ
విశ్వామిత్రం పురస్కృత్య యజ్ఞవాటముపాగమత్॥ ౧

అటుతరువాత సౌమిత్రితోకూడిన రాముడు విశ్వామిత్రుని ముందుంచుకొని ఈశాన్యదిక్కుకు వెళ్ళి యజ్ఞవాటికను చేరేడు.

లక్ష్మణునితోకూడిన రాముడు విశ్వామిత్రునితో...

మహాత్ముడైన జనకుని యజ్ఞసంభారములు చాలా చాలా గొప్పగా ఉన్నాయి. మహామునీ! ఇచట అనేక దేశాలనుండి వచ్చిన అధ్యయనసంపన్నులైన బ్రాహ్మణులు వేలకొలదిగా ఉన్నారు. ఋషివాటికలన్నీ వందలకొలది శకటములతో ఇరుకుగా కనబడుతున్నాయి. ఇచట మనం నివసించుటకు అనువైన ప్రదేశమును నిర్ణయించవలసినది.

విశ్వామిత్రుడు రాముని మాటలను విని, జనసమర్దములేనిది జలసమృద్ధ మైనది అయిన ప్రదేశమునందు విడిదిచేసేరు.

జనకుడు విశ్వామిత్రుడు వచ్చినట్లుగా తెలుసుకొని అనిందితుడు పురోహితుడు అయిన శతానందుని ముందుంచుకొని వినయముతోకూడి ఎదురు వెళ్ళేడు.

మహాత్ములైన ఋత్విక్కులుకూడా శీఘ్రముగా అర్ఘ్యమును (పూజాద్రవ్యములను) అతిథిపూజా ధర్మముచేత మంత్ర పూర్వకముగా విశ్వామిత్రునకు ఇచ్చేరు.

మహాత్ముడైన జనకునియొక్క ఆపూజను స్వీకరించి విశ్వామిత్రుడు రాజుయొక్క కుశలమును అడిగి, యజ్ఞము నిర్విఘ్నంగా జరుగుతోందా అని ప్రశ్నించి తెలుసుకొన్నారు.

ఆ విశ్వామిత్రుడు ఉపాధ్యాయులతోను పురోహితులతోను న్యాయానుసారముగా కుశలమును అడిగి సంతోషిచినవాడై వారందరితో ఆనందంగా కలిసిగడుపు తున్నాడు.

ఇంతలో రాజైన జనకుడు అంజలిబద్ధుడై విశ్వామిత్రునితో పూజ్యుడవైన నీవు ఆసనమును అలంకరించమని ప్రార్థించేడు.

రాజుయొక్క అభ్యర్థనను మన్నించి విశ్వామిత్రుడు కూర్చొన్నాడు తరువాత పురోహితుడైన శతానందుడు, ఋత్విక్కులు, రాజు, మంత్రులు కూర్చొన్నారు. వారందరూ యథాన్యాయముగా వారివారి ఉచితాసనములపై కూర్చొన్న తరువాత జనకుడు విశ్వామిత్రునిగూర్చి మాట్లాడుతున్నాడు.

అద్య యజ్ఞసమృద్ధిర్మే సఫలా దైవతైః కృతా
అద్య యజ్ఞఫలం ప్రాప్తం భగవద్దర్శనాన్మయా॥ ౧౩

ఈనాడు దేవతలు నా యజ్ఞసంపదను సఫలంచేసేరు. ఈనాడు భగవద్దర్శనము వలన నాచేత యజ్ఞఫలము పొందబడినది.

ఇది జనకుని మాటతీరు.

ఇక్కడ శుభకార్యములకు ఆహ్వానించే పద్ధతి చెప్తున్నారు.

పూర్వసర్గలో సుమతి అనే ఇక్ష్వాకురాజు ఇదే తీరున ఆహ్వానించేరు. ఇక్కడ జనకచక్రవర్తి పద్ధతి ఇదే.

మా ఇంట శుభకార్యం మీ వీలు చూసుకొని రండి అని ఒక్కడేపోయి పిలవ కూడదు. పెద్దలను పిలిచేటప్పుడు పురోహితసహితంగా వారికి ఇవ్వదలచిన వస్త్ర పూజాద్రవ్యాలు తీసుకొని నీ సద్గతికొరకు సలహా ఇవ్వగల పెద్దలను వెంటతీసుకొని వెళ్ళి పిలవాలి.

వీలుచూసుకొని రండి అని కాదు.

వీలుచేసుకొని రండి అని పిలవాలి.

మంత్రాధీనంతు దైవతమ్ భగవంతుడు ఎక్కడో లేడు. మంత్రద్రష్టలైన మీయందు మంత్రరూపంగా ఉంటాడు. ఇదిగో ఇప్పుడు నాకు మీరూపంగా భగవద్దర్శనం లభించింది. నా యజ్ఞం సఫలమైంది.

బ్రహ్మన్! మునిపుఙ్గవా! మునులతోకూడా నీవు నా యజ్ఞము జరుగు ప్రదేశమునుగూర్చి వచ్చుటచే నేను ధన్యుడనైయ్యాను, అనుగ్రహింపబడ్డాను.

ద్వాదశాహం తు బ్రహ్మర్షే శేషమాహుర్మనీషిణః
తతో భాగార్థినో దేవాన్ ద్రష్టుమహర్హసి కౌశిక॥ ౧౫

ఓ మహర్షి! వేదవిదులైన విద్వాంసులు యజ్ఞపరిసమాప్తికి ఇక పండ్రెండు రోజులు ఉన్నదని చెప్పుచున్నారు. తరువాత హవిర్భాగములను గ్రహించుటకు

వచ్చు దేవతలను చూచుటకు తగినవాడవు.
అంటే నా యజ్ఞఫలమును గ్రహించుటకు దేవతలు వస్తారు. మీరుకూడా తపఃసంపన్నులు కదా! ఈ పంద్రెండురోజులు ఉంటే దేవతలను చూసే అదృష్టం పడుతుంది. అని చెప్పటం కాదు.
వేదోక్త మంత్రప్రతిష్ఠితములైన దేవతా క్షేత్ర ఆరామములయందు నిత్య మంత్రపఠనాదులవలన ఆ క్షేత్రారామాదులు వాటి శక్తిని ద్విగుణం బహుళం చేసుకొని, ఆశ్రితులకు అభీష్టఫలదములు అగుచున్నాయి. కావున మీరు యజ్ఞపరిసమాప్తి పర్యంతము ఇక్కడ ఉండి దేవతాదర్శనం చేస్తే నా యజ్ఞఫలం అక్షయమగునని జనకుడంతటి వాడు విశ్వామిత్రుణ్ణి ప్రార్థిచేడు.
అంతేకానీ నా యజ్ఞమంటే మాటలనుకొంటున్నావా?
పంద్రెండురోజులు ఆగితే నీకు దేవతలను చూపిస్తాను అని, మన దౌర్భాగ్యంలోంచి పుట్టిన స్వాముల ప్రచారం వంటిదికాదు జనకునిది.
జనకుడు మునిశ్రేష్ఠునితో ఈవిధంగా పలికి, అప్పుడు సంతోషం నిండిన ముఖము కలవాడై అంజలిబద్ధుడై నమస్కరిస్తూ మరల అతనిని అడుగుతున్నాడు.

ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్య పరాక్రమౌ
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ॥౧౭

ఇంతకుముందు సుమతి రామలక్ష్మణులను ఏవిధంగా దర్శించాడో... అదే విధంగా జనకుడు చూస్తున్నాడు. రెండవసారి వాల్మీకి మహర్షి అక్షరం పొల్లు పోకుండా అదేవిధంగా చెప్పేరు ఎందుకని అంటే రామలక్ష్మణుల విషయంలో నేను చెప్పింది అక్షరశః సత్యం. వారు అలాగుననే ఉన్నారు. అని చెప్పటం. సత్యప్రతిపాదన విషయంలో పునరుక్తి శాస్త్రమర్యాద.
ఇంకా...రాముని నడక నడత కూడా ఏనుగువంటిదిగా ఉంది.
మగఏనుగు స్వాభావికంగా ఏకాంతవాసి. కాని కొన్ని సందర్భాలలో మరిన్ని చిన్న ఏనుగలతో సహవసించేదిగా ఉంటుంది. ఏనుగుయొక్క నాయకత్వం వయసు మరియు బలం ప్రాతిపదికన నిర్ణయింపబడుతుంది. విధేయులైన ఇతర మగ ఏనుగులు నాయకత్వాన్ని కోరుకోవు. కానీ గుంపులో చాలా స్థిరమైన సభ్యులుగా ఉండి సేవిస్తాయి. మరొక బలముగల మగఏనుగు

ఎదురుపడినప్పుడు అనుచర మగఏనుగులు అధికారాన్ని లేదా నాయకత్వాన్ని సర్దుబాటు చేసుకొంటాయి (సుగ్రీవ, విభీషణాదుల వలె). అంటే మార్చుకొంటాయి. ఈ సహచరులు ఎప్పుడూ నాయకుని ముందు వెనుకల ఉండి రక్షించుకుంటూ ఉంటారు. మహర్షి రాముని ఏనుగుతో పోల్చారు. ఆ లక్షణాలు రాముడు కలిగి ఉన్నాడని ద్విరుక్తంగా చెప్పేరుకూడా. అంటే రాముడు సహజంగా ఏకాంతవాసి, మునివంటివాడు. కొన్ని సందర్భాలలో విధేయులైన ఇతర మగఏనుగులతో (గుహ, సుగ్రీవ, విభీషణాదులు) సహవసిస్తాడు. రామునిముందు ఆశ్రితులైన ఇతరులు ఎన్నడూ నాయకత్వం కావాలని కోరుకోరు. రాముని గురుపీఠంగాని, అధికారపీఠంగాని స్థిరమైనది అని తాటక సంహారంనుండి ప్రారంభించి వీలైన సందర్భాలలో రామ బలప్రదర్శనను చేయించారు మహర్షి. ఏనుగు జ్ఞానానికి ప్రతీక. సమూహాలుగా నివసించే సంఘజీవి. 12 నుండి 15 సంవత్సరాలమధ్య మగఏనుగులు కుటుంబాన్ని (తల్లిదండ్రులను) విడిచిపెడతాయి. ఇన్ని విషయాలను దృష్టిలో పెట్టుకొని రాముడు ఏనుగని చెప్పేరు.

లక్ష్మణస్వామిని సింహమని చెప్పేరు. సింహం మదించి ఉంటుంది. అహంకారంతో ఉంటుంది. స్వాభావికమైన హింసాప్రవృత్తి కలిగి ఉంటుంది. ఇవి లక్ష్మణస్వామియందూ ఉన్నాయి. మగసింహాలు ఒంటరిగా ఉండటమో లేదా 2 లేదా 3 మగసింహాలతో చాలా సఖ్యతనుకలిగి ఉండటమో చేస్తాయి. విశ్రాంతి సమయాలలో అవి వాటి ప్రేమను అభిమానాన్ని తమతోటి మగ సింహాలతో పంచుకొంటాయి. అవి వాటి ప్రాదేశిక సార్వభౌమాధికారాన్ని నిలుపు కోవడానికి గర్జిస్తాయి. లక్ష్మణ ప్రవృత్తి ఇలా ఉంది. తనకు ఆరాధ్యుడైన అన్నకు దురవస్థ కలిగితే తండ్రినికూడా ఖైదు చెయ్యడానికి లేదా చంపడానికి వెనుకాడడు. తన సీమలోనికి ప్రవేశించి తన ఆరాధ్యుడైన అన్నకు ఆపద కలిగించ వస్తున్నాడని భరతునిపై ముందే గర్జిస్తాడు ఇది అరణ్యకాండలో మహర్షి చూపిస్తారు.

శార్దూలవృషభోపమౌ శార్దూల వృషభాలవలె ఉన్నారు. విశ్వామిత్రా! వీరుభయులు దేవలోకంనుండి యాదృచ్ఛికంగా భూలోకానికి వచ్చిన దేవతలవలె ఉన్నారు. ఈ బాలురు ఎవరు?

ఎందుకు ఇలా కాలినడకన తిరుగుతున్నారు.
ఓ మహామునీ! శ్రేష్ఠమైన ఆయుధములను ధరించిన వీరు ఎవని పుత్రులు. చంద్రసూర్యులచే ప్రకాశింపబడుతున్న ఆకాశంలా, వీరిచే ఈ ప్రదేశం ప్రకాశింపబడుతోంది.
చన్ద్రసూర్యావివామ్బరమ్ ఇక్కడ రాముడు చంద్రుడు. లక్ష్మణుడు సూర్యుడు. రామునిగూర్చి **సోమవత్ ప్రియదర్శనః** అని ప్రథమసర్గలో చెప్పేరు. రామచన్ద్రుడు అన్న పదప్రయోగం మహర్షి చెయ్యలేదుకానీ రాముడు చంద్రుడే అని చాలా సందర్భాలలో సూచించారు. రాముడు సర్వజనాశ్రయస్థానం. సుఖస్థానం. సంసారాబ్ధి దాటనూగలడు దాటించనూగలడు. కనుకనే రాముని శార్దూలం అన్నారు (పులి నీటిలో బాగా ఈదగలదు) ఇంతకుముందు. ఈ వీరులనుగూర్చి వినాలని ఉందయ్యా! అని జనకమహారాజు అడుగగా...
విశ్వామిత్రమహర్షి రామలక్ష్మణుల సిద్ధాశ్రమ నివాసము, రాక్షస సంహారము, విశాలనగర దర్శనము, అహల్యా దర్శనము, గౌతమునితో సమాగమము వరకూ చెప్పి...

మహాధనుషి జిజ్ఞాసాం కర్తుమాగమనం తథా
ఏతత్సర్వం మహాతేజా జనకాయ మహాత్మనే॥ ౨౫
నివేద్య విరరామాథ విశ్వామిత్రో మహాముని.

గొప్పదైన శివధనుస్సునందలి జిజ్ఞాసచే ఇక్కడకు వచ్చారని మిథిలా ఆగమన కారణాన్నికూడా జనకునకు నివేదించారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చాశ స్సర్గ సమాప్తము.

-

॥అథ ఏకపఞ్చాశః సర్గః॥

(విశ్వామిత్రుడు అహల్యాశ్రమ వృత్తాంతాన్ని శతానందునికి చెప్పగా ఆనందించి శతానన్దుడు శ్రీరామునికి విశ్వామిత్రుని చరిత్రను చెప్పుట.)

తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రస్య ధీమతః
హృష్టరోమా మహాతేజాః శతానందో మహాతపాః॥ ౧
గౌతమస్య సుతో జ్యేష్ఠస్తపసా ద్యోతితప్రభః॥
రామసందర్శనాదేవ పరం విస్మయమాగతః॥ ౨

ధీమంతుడైన విశ్వామిత్రుని మాటను విని, మహాతేజస్సు కలవాడు మహాతపస్సంపన్నుడు గౌతముని జ్యేష్ఠకుమారుడు తపస్సుచేత ప్రకాశించుచున్న కాంతిగలవాడు అయిన శతానందుడు శరీరము గగుర్పాటును పొందినవాడై రాముని చూడగనే గొప్ప ఆశ్చర్యాన్ని పొందేడు.

సమీపంలో సుఖంగా కూర్చొన్న ఆ రాకుమారులను చూసి మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రునితో...

దీర్ఘతపస్సును పొందిన యశస్విని అయిన నా తల్లిని ఈ రాజపుత్రులకు చూపించారా! గొప్పతపస్సు యశస్సుగల నాతల్లి సర్వప్రాణులచేత పూజింప తగిన రామునికి కందమూలాలు సమర్పించి అతిథిపూజను చేసిందా?

అపి రామాయ కథితం యథావృత్తం పురాతనమ్
మమ మాతుర్మహాతేజో దైవేన దురనుష్ఠితమ్॥ ౬
అపి కౌశిక భద్రంతే గురుణా మమ సంగతా
మమ మాతా మునిశ్రేష్ఠ రామసందర్శనాదితః॥ ౭

గొప్పతేజస్సుకలవాడా! విశ్వామిత్రా! నా తల్లియొక్క దైవముచే కఠినముగా చేయబడిన పూర్వవృత్తాంతమును యథాతథముగ రామునకు చెప్పారా? నా తల్లి రామసందర్శన, అతిథిపూజాదుల వలన **'మమ గురుణా'** నా తండ్రితో కలిసిందా? **"మమ గురుణా"** **"మమ మాతా"** **"మాతుః దైవేన"** ఇవి సంబంధార్థ ప్రయోగాలు. **దైవేన** అంటే **విధినా** అని అర్థం చెప్పకూడదు. అలా చెప్తే దైవముచే చెడుగా చేయబడిన నా తల్లియొక్క పూర్వవృత్తాంతమును అని చెప్పాలి. దైవము ఎప్పుడూ చెడుచేయదు.

మంచి, చెడు ఫలములు కర్మానుగతంగా వస్తాయి. మంచి అంటే ఇష్టఫలం. చెడు అంటే అనిష్టఫలం. అనిష్టఫలం అనుభవంలో ఉన్నప్పుడు...

ఇప్పుడుమనం చేస్తూన్న జప హోమ దాన సజ్జనసాంగత్యాదులు ఉపాసనలు, ధ్యానాదులు మనకు అనిష్టఫల నివారకమైన సాహాయ్యమును అనేకుల రూపంగా అందించే ప్రయత్నం చేస్తాయి. చాలా సందర్భాలలో ఆ అనిష్టఫలం శాన్తావస్థకు చేరుతుంది. మరికొన్ని సందార్భాలలో శాస్త్రబద్ధంగా జీవిస్తూన్నప్పటికీ ఆ అనిష్టఫలం అనుభవంలోనే ఉంటుంది. అంటే అది విడిచిపెట్టిన బాణం. అది అనుభవంతోనే పోతుంది. దాన్ని ఆపాలంటే ఆ బాణానికి దైవం ఎదురుపడి ఆ దెబ్బను తాను తినాలి. అది గురురూపంగా స్నేహితునిరూపంగా సత్పురుషుల రూపంగా ఉంటుంది. చాలా సందర్భాలలో ఆశ్రితుల దురవస్థను మహాత్ములు అనుభవించిన సందర్భాలను మనం మన జీవితంలో చూడటమో అనుభవించడమో చేసే ఉంటాం.

ఇదిగో ఇక్కడకూడా గురురూపంగా భర్తృరూపంగా మనస్సునకు ఉండే చెడులక్షణాన్ని సరిచేసే కఠినమైన శిక్షణరూపమైన పూర్వవృత్తాంతమును చెప్పావా? అని అడిగారు. మనస్సును నిగ్రహించటం అంటే గాలిని మూట కట్టడం అంత కష్టం. అందుకే అంత కాఠిన్యం.

కుశికాత్మజా! రాముడు నా తండ్రిచే పూజింపబడ్డాడా? అని అడిగేడు. అంటే నా తండ్రి అతిథిపూజను చేసాడా అని, ఎందుకంటే గౌతముడు కర్మఠుడు. **కర్మణైవ హి సంసిద్ధి మాస్థితా జనకాదయ** పత్నీలోపంవలన ధర్మలోపం కలుగుతుంది, అది గౌతముడు చెయ్యడు. అతిథిపూజ చేసేడు అంటే... తన తల్లిని స్వీకరించేడు అని. తన తల్లి తండ్రులు కలిసి ఉన్నారన్న ఆనందం.

అపి శాన్తేన మనసా గురుర్మే కుశికాత్మజ।
ఇహాగతేన రామేణ ప్రయతేనాభివాదితః॥ ౯

కుశికాత్మజా! ఇచటకు వచ్చిన శాన్తించిన మనస్సుతో శుద్ధాత్ముడైన రామునిచేత నా గురువు (తండ్రి) నమస్కరింపబడినాడా?

శాన్తించుట అంటే సర్వసంసారోపరతి. రాముడు మహాయోగి. బ్రహ్మవేత్త. ఇంత చిన్న వయస్సులో ఇంతటి స్థితప్రజ్ఞతా!

ఇది "**రామసందర్శనాదేవ పరం విస్మయమాగతః**" శతానందుని ఆశ్చర్యానికి కారణం. సంవత్సరాలతరబడి తపస్సుచేసినా...
తన తండ్రి కోపాన్ని, తల్లి కామాన్ని జయించలేకపోయారు. తిరిగి తపస్సు (సాధన) చేసేరు.
ఎవరినిగూర్చి తపస్సుచేస్తే తపఃఫలంగా వారి అనుగ్రహాన్ని పొందుతారు. బ్రహ్మనుగూర్చి తపస్సుచేస్తే బ్రహ్మదర్శనంచేత ఆయన అనుగ్రహాన్ని పొందుతారు. హరిహరులకొరకైన తపస్సునకు ఫలం వారి దర్శనంచేత వారి అనుగ్రహాన్ని పొందటం.
ఇక్కడ అహల్యా గౌతములు ఇంద్రియజయాన్ని కోరి తపస్సుచేసేరు. తపఃఫలంగా శ్రీరామ దర్శనంచేసేరు. రాముడు అంటే పఞ్చకర్మేన్ద్రియలు పఞ్చజ్ఞానేన్ద్రియాలు మనస్సు కలిసిన దశేంద్రియసమాహార రూపమైన మనోజయానికి (లయానికి) స్వరూపం ఏదైనాఉంటే అది 'రామం'. అంటే శ్రీరామసేవన దర్శనాదులవలన దశేన్ద్రియసమాహార రూపంగా మనస్సు ఉపరమావస్థను పొందుతుంది.
అహల్యాగౌతములు తపస్సుచేత ఏకాదశేంద్రియములు ఉపరమావస్థను పొందిన వారుగా అయ్యేరు. అది సూచించుటకే తదధిష్ఠాన దైవంగా రామ దర్శనం.
ఇది రామోపాసనకు ఫలమని మహర్షి మనకు రహస్యంగా ఉపదేశించేరు.
మహర్షిపోతనామాత్యుడుకూడా ఈశ్వరునికొరకు తపస్సుచేసేడు. పోతనామాత్యుని ఈశ్వరుడు త్రిగుణాలలోని దైవంకాదు. కనుకనే తపఃఫలంగా శ్రీరామ దర్శనాన్ని పొందేరు.
మీరాభాయి తన జీవితమంతా శ్రీకృష్ణసంకీర్తనం చేస్తే వారణాశిలో రామదర్శనాన్ని పొంది "**రామ రతన్ ధన్ పాయో**" అని రామసంకీర్తనను చేసింది. ఆ రామ సంకీర్తనయే ఆమె జీవితంలో చివరి కీర్తన తరువాత ఆతల్లి కీర్తనలు వ్రాయలేదు పాడనూలేదు. రామదర్శనం తరువాత మనస్సు తన స్వభావంతో నిలబడలేదు. ఎందుకంటే రాముడు పరమశాన్తిస్థానం. రామనామము రామోపాసన రామధ్యానము ఇవి తారకము అని చెప్పటంలో ఇదే రహస్యం. త్రిగుణములు శాన్తావస్థయందున్న "ఓమ్" ఏ "రామ్".
ఈవిధంగా ప్రశ్నించిన శతానందునితో విశ్వామిత్రమహర్షి మాట్లాడుతున్నాడు.

మునిశ్రేష్ఠా! శతానందా! నీవడిగినది ఏదీ అతిక్రమింపబడలేదు. నాచేత ఏది చేయతగిరదో అది అంతయు చేయబడినది.

సంగతా మునినా పత్నీ భార్గవేణేవ రేణుకా॥ ౧౧

రేణుకాదేవి జమదగ్నిని చేరినట్లు అహల్య గౌతముని చేరినది. అని అహల్యను రేణుకామాతతో పోల్చి అహల్యది మానసిక శృఙ్గారమే అని చెప్పేరు.

విశ్వామిత్రుడు చెప్పినదంతా మహాతేజశ్శాలి అయిన శతానందుడు విన్నాడు. విని...

రామునిగూర్చి పలుకుతున్నాడు. నరశ్రేష్ఠా! రాఘవా! నీకు స్వాగతం అపరాజితుడైన విశ్వామిత్రుని మూలముగా మా అదృష్టంకొద్ది ఇక్కడికి వచ్చావు. గొప్ప తపస్సుకల విశ్వామిత్రుడు ఊహింపశక్యముగాని కర్మలు కలవాడు. మిక్కిలి ప్రకాశంకలవాడు. తపస్సుచేత బ్రహ్మర్షి అయినాడు. ఇతనిని గొప్ప గతినిగా ఎరుగుదువు.

రామా! ఎవనిచేత గొప్ప తపస్సు చేయబడినదో అట్టి విశ్వామిత్రుడు నీకు రక్షకుడు. కావున భూమిపై నీకంటే ధన్యుడు మరొకడులేడు.

మహాత్ముడైన కౌశికునియొక్క బలము ఎట్టిదో చరిత్ర ఎట్టిదో చెప్పెదను విను. ఈ విశ్వామిత్రుడు ధర్మాత్ముడు అరిందముడు అంటే శత్రువులను (సరిహద్దు రాజులను) కర్కశంగా అణిచివేయువాడు. ధర్మజ్ఞుడు అంటే ధర్మం తెలిసిన వాడు. విద్యలను అభ్యసించినవాడు. ప్రజలయొక్క హితమునందు ఆసక్తి కలవాడు. ఇతడు చాలాకాలం రాజుగా ఉన్నాడు. **దీర్ఘకాలం రాజా అభూత్** అంటున్నారు. ఇది భూతకాలిక క్రియాపద ప్రయోగం.

అంటే ఇప్పుడు కాదని. మరిప్పుడు..? బ్రాహ్మణుడు.

ప్రజాపతియొక్క కుమారుడైన కుశుడు అనే రాజు ఉండేవాడు. బలవంతుడు ధర్మాత్ముడు అయిన కుశునాభుడు అనువాడు కుశునియొక్క కుమారుడు. ఈ కుశనాభుని కుమారుడు గాధి. గొప్పతేజస్సుగల విశ్వామిత్ర మహాముని గాధియొక్క కుమారుడు. మహాతేజశ్శాలి అయిన విశ్వామిత్రుడు రాజై చాలా వేలసంవత్సరములు పాలించేడు. గొప్పతేజస్సుగల విశ్వామిత్రుడు అక్షౌహిణీ సైన్యముతో భూమి అంతా తిరిగేడు.

రామా! విశ్వామిత్రుడు రాష్ట్రములతోకూడిన నగరములను నదులను పర్వతములను ఆశ్రమములను క్రమముగా సంచరించుచూ; అనేకములైన వృక్షములతో ఆకులమైనది, నానావిధములైన మృగగణములతో నిండినది దేవ దానవ గంధర్వులతోను కిన్నరులతోనూ ప్రకాశించునది, ప్రశాన్తములైన లేళ్ళతోకూడినది అంటే లేళ్ళు నిర్భయముగా సంచరించునది పక్షిసంఘముల తో సేవింపబడునది బ్రహ్మర్షిగణములతో నిండినది దేవర్షుల సముదాయంచే సేవింపబడునది తపస్సుచే సిద్ధిపొందినవారు, అగ్నికల్పులు, మహాత్ములు, ఉదకమునుమాత్రమే భక్షించువారు వాయుభక్షకులు రాలిన ఆకులనుమాత్రము తినువారు ఫలమూలములను తినువారు ఇంద్రియనిగ్రహము కలవారు జితక్రోధులు జితేంద్రియులు అయిన ఋషీశ్వరులతోను జపహోమముల యందు ఆసక్తులైన వాలఖిల్యులతో, బ్రహ్మనఖములనుండి పుట్టిన వైఖానసులతో ప్రకాశించుచున్న వసిష్ఠుని ఆశ్రమాన్ని చేరేదు.

వసిష్ఠాశ్రమపదం బ్రహ్మలోకమివాపరమ్।
దదర్శ జయతాం శ్రేష్ఠో విశ్వామిత్రో మహాబలః॥ ౨౮

జయించువారిలో శ్రేష్ఠుడైన మహాబలుడైన విశ్వామిత్రుడు అపర బ్రహ్మలోకమువలె ఉన్న వసిష్ఠునియొక్క ఆశ్రమాన్ని చూసేదు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకపఞ్చాశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ద్విపఞ్చాశః సర్గః॥

(వసిష్ఠుడు కామధేనువు సహాయంతో విశ్వామిత్రమహారాజును సత్కరించుట)

స దృష్ట్వా పరమప్రీతో విశ్వామిత్రో మహాబలః।
ప్రణతో వినయాద్వీరో వసిష్ఠం జపతాం వరమ్॥ ౧

మహాబలుడు వీరుడు అయిన విశ్వామిత్రుడు జపముచేయువారలలో శ్రేష్ఠుడైన వసిష్ఠుని చూచి చాల సంతోషించిన వాడై సవినయంగా నమస్కరించేడు.

వసిష్ఠుడు విశ్వామిత్రునకు స్వాగతం పలికి ఆసనాన్నిఇచ్చేడు.

కూర్చొన్న విశ్వామిత్రునకు యథాన్యాయంగా వసిష్ఠుడు ఫలమూలాలను సమర్పించేడు. అతిథిపూజనుగ్రహించిన విశ్వామిత్రుడు వసిష్ఠునియొక్కక్షేమమును శిష్యులయొక్క క్షేమమును ఆశ్రమప్రాంతములోని వృక్షములయొక్క క్షేమమును అడిగేడు. ఇది పర్యావరణ స్పృహ. మీ ఇంట్లో టీవి ఉందా... ఏసి ఉందా... ఇదికాదు అడగవలసినది. మీ ఇంట్లో చెట్టు ఉందా... ఆ ఉంటే నువ్వు ఈ భూమి పై జీవించడానికి కనీస అర్హతను సంపాదించావన్నమాట.

వసిష్ఠుడు సర్వమూ క్షేమమే అని సమాధానం చెప్పేరు.

ప్రజాః పాలయసే వీర రాజవృత్తేన ధార్మిక॥౬

తరువాత విశ్వామిత్రుని క్షేమమునుగూర్చి బ్రహ్మపుత్రుడైన వసిష్ఠమహర్షి అడిగేరు. ధార్మికుడా! ఓవీరుడా! ప్రజలను రాజవృత్తానుసారముగా పాలిస్తున్నావా? రాజవృత్తి యుద్ధము. అర్థసంపాదనము, దానిని వృద్ధి పొందించుట, పాలించుట, దానిని పాత్రులకు ఇచ్చుటకై యుద్ధము చేయుట. ఆ యుద్ధము ధర్మరక్షణార్థం ప్రజారక్షణార్థం కనుక ధర్మ్యము. ఇందుండి తొలగిపోనివాడు కనుక ధార్మికుడు. నీ భృత్యులు నీ ఆజ్ఞాపాలన నిష్ఠులై ఉంటున్నారా? వారు బాగా పోషింపబడు తున్నారా? రిపుసూదనా! నీయొక్క శత్రువులు అందరూ జయింపబడినారా? అంటే నీవు సరిహద్దురాజ్యాలను జయించావా?

ఓ పరంతపా! అనఘా! నరవ్యాఘ్రా! నీ సేనలు ధనాగారము మిత్రులు పుత్రపౌత్రాదులు అందరూ కుశలమా? అని వసిష్ఠుడు అడిగారు.

గొప్పతేజస్సుగల రాజైన విశ్వామిత్రుడు వినయముతో సర్వత్ర కుశలమే అని చెప్పేడు. ధర్మిష్ఠులైన వారిరువురు చాలాసేపు సంభాషించుకొన్నారు. తరువాత

వసిష్ఠుడు విశ్వామిత్రునిగూర్చి "మహాబలుడా! నీకు నీసైన్యమునకు తగినవిధంగా ఆతిథ్యమును చేయుటకు అంగీకరింపుము" అని అడిగారు. రాజువైన నీవు ప్రయత్నపూర్వకంగా పూజింపతగిన శ్రేష్ఠాతిథివి. కనుక నీవు నాచేత ఇవ్వబడుచున్న సత్కారమును అంగీకరింపవలసింది. వసిష్ఠునిచేత ఈవిధంగా అడుగబడినవాడై...

విశ్వామిత్రుడు వసిష్ఠునితో పలుకుతున్నాడు. భగవన్! నీ ఆశ్రమములో లభించు ఫలమూలాదికముచేత పూజ్యుడవైన నీ దర్శనంచేత పూజార్హుడవైన నీచేత బాగుగా పూజింపబడ్డాను. మహాప్రాజ్ఞుడవగు ఓ వసిష్ఠా! నీవు స్నేహపూర్వకమైన నేత్రములతో చూచుచుండుము. నీకు నమస్కారము అగుగాక! ఇక నేను వెళ్ళెదను. అని పలుకగా!

రాజైన విశామిత్రుని, ధర్మాత్ముడు ఉదారమైనబుద్ధికలవాడు అయిన వసిష్ఠుడు పునఃపునః ఆహ్వానించేడు.

మునిపుఙ్గవా! పూజ్యుడవగు నీకు ఏది అభిమతమో ఆవిధంగా చేస్తానన్నాడు విశ్వామిత్రుడు. మహాతేజశ్శాలి జపముచేయువారలలో శ్రేష్ఠుడు పాపములను నశింపచేయు వాడైన వసిష్ఠుడు సంతోషించినవాడై చిత్రవర్ణముగల శబలా అను ధేనువును పిలిచేరు.

ఓ శబలా! శీఘ్రముగా రమ్ము. నామాట విను. నేను సేనతోకూడిన రాజర్షిని శ్రేష్ఠమైన భోజనముచేత సత్కరించుటకు నిశ్చయించితిని. తగువిధముగా ఏర్పాట్లను చేయుము. ఓ కామధేనువా! షడ్రుచులలో ఎవరెవరికి ఏదేది ఇష్టమో దానినంతను వారుకోరిన విధంగా నాకొరకు వర్షించు.

రసేనాన్నేన పానేన లేహ్యచోష్యేణ సంయుతమ్।
అన్నానాం నిచయం సర్వం సృజస్వ శబలే త్వర॥ ౨౩

ఓశబలా! రసముతో అన్నముతో నాకతగినవాటితో పీల్చతగినవాటితో కూడిన సమస్తమైన అన్నసముదాయమును శీఘ్రముగా సృష్టించుము.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్విపఞ్చాశ స్సర్గ సమాప్తము.

॥అథ త్రిపఞ్చాశః సర్గః॥

(వసిష్ఠుని ఆతిథ్యమునకు సైన్యసమేతంగా విశ్వామిత్రుడు బాగుగా తృప్తిచెంది కామధేనువును ఇమ్మనికోరుట. వసిష్ఠుడు నిరాకరించుట.)

ఏవముక్తా వసిష్ఠేన శబలా శత్రుసూదన।
విదధే కామధుక్కామాన్యస్య యస్య యథేప్సితమ్॥ ౧

శత్రుసూదనా రామా! వసిష్ఠునిచేత ఆజ్ఞాపింపబడిన కామధుక్ అయిన శబల ఎవరెవరికి ఏదేది ఇష్టమో దానినంతయు సమకూర్చింది.

చెఱకుగడలను తేనెలను పేలాలను మంచి పాత్రలలో పోసిన మద్యములను శ్రేష్ఠములైన పానీయములను అనేక భేదములుగల భక్ష్యములను సమకూర్చింది. ఇక్కడ పర్వతాకారములను పోలిన వేడి వేడి అన్నపు రాశులను, సూపములను (పప్పులను) మరియు పెరుగు కాలువలను, షడ్రసభక్ష్యములతో బాగుగా నిండిన పాత్రలను, బెల్లముతో చేసిన పదార్థములు వేలకొలది ఏర్పడినవి.

రామా! సైన్యసహితముగా విశ్వామిత్రుడును, అతని అంతఃపురకాంతలును బ్రాహ్మణపురోహితాదులును ఆ ఆతిథ్యముచే తృప్తి చెందినవారై ఆనందించిరి. అమాత్యులతోను భృత్యులతోనుకూడి వసిష్ఠుని పూజలందుకొన్న విశ్వామిత్రుడు వసిష్ఠునితో...

బ్రహ్మన్! పూజనీయుడవైన నీచేత పూజింపబడితిని. బాగుగా సత్కరింపబడితిని. వాక్యవిశారదుడవైన వసిష్ఠుడా! నేనొక మాట చెప్పేదను వినుము.

భగవన్! నూరువేల గోవులను ఇచ్చెదను ఈ శబలను నాకు ఇమ్ము. ఇది రత్నముకదా, రాజు రత్నములను తీసుకొనువాడు. ఓ ద్విజుడా! ఆ కారణమువలన ఈ శబలను నాకు ఇమ్ము. ఇది ధర్మానుసారముగా నాకు చెందినది.

ఇక్కడ అన్నముయొక్క మహిమను చూపిస్తున్నారు.

సుక్షత్రియుడు. ఇప్పటివరకూ రాజవృత్తానుసారముగా పాలిస్తున్నాడు. అంటే న్యాయానుసారముగా అర్థసంపాదనము, దానిని వృద్ధిపొందించుట, వృద్ధిపొందిన దానిని రక్షించుట, సత్పాత్రలకు దానమిచ్చుట ఇది రాజవృత్తము. ఇప్పటివరకు దాత. బ్రాహ్మణ భోజనం వంటపట్టింది. దాత యాచనకు దిగేడు. అందుకే స్మృతిగ్రంథాలు బ్రాహ్మణ ద్రవ్యాన్ని గ్రహించకూడదని చెప్పేయి.

శ్రీరాముడు అరణ్యవాసారంభంలో గుహుడు ఇచ్చిన ఆతిథ్యాన్ని సున్నితంగా తిరస్కరించేడు. స్వీకరిస్తే పాలకుడు సేవకలక్షణాలనుపొంది ఆలోచిస్తాడు.

అన్నముచ్చావచం భక్షాః ఫలాని వివిధానిచ
రామాయాభ్యవహారార్థం బహుచోపహృతం మయా॥
తత్సర్వం ప్రత్యనుజ్ఞాసీ ద్రామ స్సత్యపరాక్రమః।
నతు తత్ప్రతిగృహ్ణా త్సక్షత్త్రధర్మ మనుస్మరన్॥
న హ్యస్మాభిః ప్రతిగ్రాహ్యం సఖే దేయం తు సర్వదా।
ఇతి తేన వయం రాజన్ అనునీతా మహాత్మనా॥
లక్ష్మణేన సమానీతం పీత్వా వారి మహాయశాః
ఔపవాస్యం తదాఽకార్షీ ద్రాఘవ స్సహ సీతయా॥
తతస్తు జల శేషేణ లక్ష్మణోఽప్యకరో త్తదా।
వాగ్యత స్తే త్రయ స్సంధ్యాం సముపాసత సంహితాః॥

అని అయోధ్యకాండ 87వ సర్గలో మహర్షి చూపించేరు.

విశ్వామిత్రునిచే ఈవిధంగా పలుకబడినవాడై ధర్మాత్ముడు మునిశ్రేష్ఠుడు అయిన వసిష్ఠుడు బదులు పలుకుతున్నాడు.

రాజా! నీవు వందవేల గోవులను ఇచ్చినను, వేలకోట్ల ఆవులను ఇచ్చినను వెండికొండలను ఇచ్చినను ఈ శబలను ఇవ్వను.

అరిందముడవైన రాజా! ఈ ధేనువు నాసమీపము నుండి దూరమగుట యుక్తముకాదు. ఆత్మవంతునకు కీర్తివలె నాకు శాశ్వతమైనది. ఇక్కడ మహర్షి..

శాశ్వతీ శబలా మహ్యం కీర్తిరాత్మవతో యథా॥౧౨

అంటున్నారు.

ఆత్మవతః కీర్తిః యథా శరీరానికి ఇంద్రియములవలె అని **ప్రాణా వై యశో వీర్యం...** బృహదారణ్యక శ్రుతి శరీరమునకు ఇంద్రియములే కీర్తి బలము అని చెప్పింది. ఆ శ్రుతి వాక్యాన్నే మహర్షి గ్రహించేరు.

ఇంద్రియములు లేని శరీరమువలె శబల లేని వసిష్ఠుడు అనూహ్యము.

హవ్యకవ్యములు హవ్యము అంటే దేవతలకు సమర్పించేది కవ్యము అంటే పితృదేవతలకు ఇచ్చేది, మరియు నా ప్రాణయాత్ర, అగ్నిహోత్రము, భూతబలి

మరియు హోమము అన్నీకూడా ఈ ధేనువుపై ఆధారపడి ఉన్నాయి.
ఓరాజర్షీ! స్వాహాకార వషట్కారములు అనేక విధములైన విద్యలు సర్వము ఈ ధేనువు మీదనే ఆధారపడి ఉన్నవి. సందేహంలేదు. ఇది నిజముగా నాయొక్క సర్వస్వము. ఇంకా అనేకములైన కారణములచేత శబలను నీకు ఇవ్వలేను. అని వసిష్ఠుడు పలుకగా...
వాక్యవిశారదుడైన విశ్వామిత్రుడు మిక్కిలి తొందరపాటుతో ఇంకా ప్రలోభపెట్టే పనికి పూనుకొన్నవాడై... బంగారు నడుముత్రాళ్ళను మెడత్రాళ్ళనుగల బంగారు అంకుశములచే అలంకరింపబడిన పదునాల్గువేల ఏనుగులను, తెల్లని గుఱ్ఱములుగల నాలుగు గుఱ్ఱములు కట్టుటకు వీలైన చిరుగంటలచే అలంకరింపబడిన ఎనిమిది వందల స్వర్ణ రథములను ఇస్తాను.
సువ్రతుడా! ఓ వసిష్ఠమహర్షీ! మంచి దేశమునందు మంచిజాతియందు పుట్టిన గొప్ప ఓజస్సుగల పదకొండువేల అశ్వములనుకూడా ఇస్తాను. అనేక రంగులలో వేరువేరుగా ఉన్న ఒక కోటి ఆవులనుకూడా ఇస్తాను. నాకు ఈ శబలను ఇమ్ము. ద్విజోత్తమా! నీకు ఇంకా రత్నములను బంగారమును నీవు కోరినంతగా ఇస్తాను. ఈ శబలను మాత్రము నాకు ఇమ్ము.
విశ్వామిత్రుని మాటలను విన్నటువంటి వసిష్ఠుడు ఇదియే నాకు ధనము. ఇదియే నాకు రత్నము. ఇదియే నాకు సర్వస్వము. ఇది నా జీవితం.
రాజన్! నాకు దర్శపూర్ణమాస యాగములు, కోరిన దక్షిణలుగల యజ్ఞములు ఇంకా అనేక విధములైన క్రియలు సర్వము ఇదే.

అదోమూలాః క్రియాః సర్వా మమ రాజన్నసంశయః
బహునా కిం ప్రలాపేన నదాస్యే కామదోహినీమ్॥ ౨౫

రాజన్! నాయొక్క సమస్తమైన క్రియలకు ఇదే మూలము. ఇందులో సంశయంలేదు. ఎక్కువగా ప్రలాపించుటచే ప్రయోజనం లేదు. కోరిన కోర్కెలను పిదికి ఇచ్చు ఈ ధేనువును ఇవ్వను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రిపఞ్చాశ స్సర్గ సమాప్తము.

అథ చతుఃపఞ్చాశః సర్గః

(విశ్వామిత్రుడు బలాత్కారముగా శబలను తీసుకొనిపోవుటకు ప్రయత్నించుట. వసిష్ఠ హృదయమును తెలిసిన శబల శకయవనాదులను సృజించి విశ్వామిత్ర సైన్యమును సంహరించుట.)

కామధేనుం వసిష్ఠోఽపి యదా న త్యజ్యతే మునిః।
తదాస్య శబలాం రామ విశ్వామిత్రోఽన్వకర్షత॥ ౧

రామా! వసిష్ఠుడు కామధేనువును ఎప్పుడు ఇవ్వలేదో, అప్పుడు విశ్వామిత్రుడు శబలను బలవంతముగా లాగికొని వెళ్ళేడు. గొప్పవాడైన రాజుచేత తీసుకొని వెళ్ళబడుచున్న శబల దుఃఖించుచున్నదై ఏడ్చుచూ ఆలోచించసాగింది.

దీనురాలును మిక్కిలి దుఃఖితురాలును అయిన నన్ను రాజభటులు తీసుకొని పోవుచున్నారు. మహాత్ముడైన వసిష్ఠుడు నన్ను విడిచినాడా! ఏమి? అని ఆలోచించ సాగింది.

అపరాధము లేనిదానను వసిష్ఠునియందు భక్తికలదానను వసిష్ఠునకు ఇష్టురాలను అయిన నన్ను ధార్మికుడైన వసిష్ఠుడు విడిచి పెడుతున్నాడే! పవిత్రాత్ముడైన ఆ మహర్షికి నావలన ఏదైనా అపరాధము జరిగిందా?

శత్రుసూదనా రామా! ఆ ధేనువు ఈవిధంగా చింతించుచున్నదై మాటిమాటికి నిటూర్చుచూ వందలకొలదిగా ఉన్న భృత్యులను విదిలించుకొని వాయువేగముతో వసిష్ఠుని పాదముల దగ్గరకు పోయెను.

ఆ శబల ఏడ్చుచున్నదై ఆక్రోశించుచున్నదై వసిష్ఠునియొక్క ఎదుట నిలచి మేఘదుందుభి స్వరముతో వసిష్ఠునిగూర్చి పలుకుతోంది.

భగవన్! బ్రహ్మయొక్క కుమారుడవైన వసిష్ఠుడా! నేను నీచేత విడువబడితినా! ఏమి? ఏకారణంగా రాజభృత్యులు నన్ను నీ సమీపమునుండి తీసుకొని పోవుచున్నారు. అని అడిగిన శబల మాటలను విన్న వసిష్ఠుడు శోకతప్త హృదయముగల శబలనుగూర్చి...

ఓ శబలా! నేను నిన్ను విడువలేదు. నీచేత నాకు ఏ అపరాధము జరుగలేదు. మహాబలవంతుడైన రాజు నిన్ను నానుండి బలాత్కారముగా తీసుకొని పోతున్నాడు. నా బలము ఈతని బలముతో తుల్యమైనదికాదు కదా!

విశేషించి రాజుగా ఉన్నాడు. ఇతడు బలీయమైన క్షత్రియుడు. పృథివికంతకు ప్రభువుకూడాను. అశ్వములతోను, అశ్వములతోకూడిన రథములతోను, ఏనుగులతో, ధ్వజములతోకూడిన పూర్తి అక్షౌహిణీ సేనకూడా ఉంది. ఈ కారణములచేత ఇతడు బలవత్తరుడు.

ఈ విధంగా పలుకిన వసిష్ఠుని మాటలను విన్న శబల బ్రహ్మర్షినిగూర్చి పలుకుతోంది.

న బలం క్షత్రియస్యాహుర్బ్రాహ్మణో బలవత్తరః।
బ్రహ్మన్ బ్రహ్మబలం దివ్యం క్షత్రాత్తు బలవత్తరమ్॥ ౧౩

క్షత్రియుని బలాన్ని బలమని చెప్పరు. బ్రాహ్మణుడు ఎక్కువ బలము కలవాడు. బ్రహ్మన్! క్షత్రియబలముకంటె బ్రహ్మబలము దివ్యమైనదీ బలవత్తరమును.

క్షత్రియాదులు ఏ విషయ విశేషములు శ్రేయోదాయకమో వాటియందు పరార్థమై ప్రవర్తిస్తూ, స్వార్థముకొరకైన ఆసక్తినికలిగియుండి పాపముకలవారుగా అగుచున్నారు. బ్రాహ్మణునియందు స్వార్థముకొరకైన ఆసక్తిలేకుండుటచే ముఖస్థానీయుడై ప్రాణరూపుడు అగుచున్నాడు.

ఇట్టి బ్రాహ్మణుని (ప్రాణము) ఆశ్రయించి క్షత్రియాదులు (ఇంద్రియములు) శుద్ధులు (బలముకలవారు) అగుదురు. ఈ బ్రాహ్మణుడు (ప్రాణము) ఏదో ఒక ఇంద్రియమును మాత్రమే ఆశ్రయించుటలేదు.

ఇక్కడ **బ్రాహ్మణః బలవత్తరః** అన్నది జాతివాచకం కాదు. ఇక్కడ బ్రాహ్మణ శబ్దమునకు ప్రాణము అర్థము. దీనికి **బ్రాహ్మణోస్య ముఖమాసీత్** అను శ్రుతి వాక్యమే ప్రమాణం.

తే హోచుః క్వ ను సోఽభూద్యో న ఇత్థమసక్తేత్యయ మాస్యేఽంతరితి సోఽయాస్య ఆంగిరసోఽంగానాగ్ం హి రసః అను బృహదారణ్యక శ్రుతి ప్రాణము ఆస్యము మరియు ఆంగిరసము అని చెప్పుచున్నది. క్షత్రియాదులు ఇంద్రియములు. ఈ ఇంద్రియములు ప్రాణమును ఆశ్రయించి ఉండును. అంగములైన క్షత్రియాదులకు (ఇంద్రియములకు) సారము బ్రహ్మబలము (ప్రాణము). కనుకనే క్షత్రియాదులు బ్రాహ్మణుని ఆశ్రయించుకొని బలమును పొందుతారు. అసంగమగుటచే ప్రాణము పవిత్రమైనది. అటువంటిది నీ బలం.

కొలతకు అందని బలము నీకు ఉన్నది. గొప్ప వీర్యవంతుడైన విశ్వామిత్రుడు నీకంటే బలవత్తరుడు కాడు. నీ తేజస్సు సమీపింప శక్యము కానిది.

నియుఙ్క్ష్వ మాం మహాభాగ త్వద్బ్రహ్మబలసంభృతామ్।

హే మహాభాగా! నీయొక్క బ్రహ్మబలముతో నిండిన నన్ను ఆజ్ఞాపించు, ఆ దురాత్ముని యొక్క దర్పమును బలమును నశింపచేసెదను.

నీయొక్క బ్రహ్మబలంతో నిండిన నన్ను ఆజ్ఞాపించు అంటోంది శబల.

ఇక్కడ ప్రాణోపాసనద్వారా ఇంద్రియములయొక్క మృత్యురూపమైన దోషమును (ఆసక్తిని) తొలగించుకొన్న శరీరేంద్రియ మనస్సంఘాతరూపమే శబల అంటే.

అసత్యభీభత్సానృతాదులను పలుకకుండుటచే వాక్కు మృత్యువును దాటి అగ్నిరూపాన్ని పొందింది.

దుర్గంధమును ఆఘ్రాణించకుండుటచే మృత్యురూపమైన పాపమును దాటి వాయువు ఆయెను.

చూడకూడనివి చూడకుండుటచే కన్నులు మృత్యువును అతిక్రమించి ఆదిత్యుడాయెను.

అమంగళములను వినకుండుటచే చెవి మృత్యువును దాటి దిక్కులాయెను.

దుష్టసంకల్పాదులను విడిచిన మనస్సు మృత్యువును దాటి చంద్రుడాయెను.

దేవస్వరూపమును పొందిన ఇంద్రియములు ప్రాణమును (బ్రహ్మణస్పతిని) అన్నివైపుల ప్రవేశించినవి.

వసిష్ఠునియొక్క మృత్యువును (పాపమును) దాటిన శరీరేంద్రియ మనస్సంఘాతమే **శబల**. ఇతడు తెచ్చిపెట్టుకొన్న కోపముకలవాడు, పరులకొరకైన ఆసక్తికలవాడు. శబలా రూపమైన ఇంద్రియ సంఘాతం కోరిన కోర్కెలను తీర్చేదిగా ఉంటుంది. కనుక కామధేనువని చెప్పబడుతోంది.

రామా! శబలచే ఈవిధంముగా పలుకబడిన గొప్పకీర్తిగల వసిష్ఠుడు పరబలమును పీడించు సేనను సృజించమని పలికెను. వసిష్ఠుని అనుజ్ఞను పొంది, శబల సైన్యమును సృజించెను. ఆ శబలయొక్క హుంభా ధ్వనినుండి బయలుదేరిన వందలాది పహ్లవులు విశ్వామిత్రుని కళ్ళ ఎదుటనే సర్వ సైన్యమును నశింపచేసింది.

తన సైన్యము నశించుటను చూచిన విశ్వామిత్రుడు కోపముతో కళ్ళు పెద్దవి చేసికొని రథమును అధిరోహించి అనేకరకములైన ఆయుధములచే పప్లవులను నశింపచేసేడు.

వందలకొద్ది పప్లవులు విశ్వామిత్రునిచే పీడింపబడుట చూచిన శబల కోపమువలన యవనులతోకూడిన శకులను సృజించింది.

కాంతికలవారు గొప్పపరాక్రమంకలవారు బంగారు కింజల్కములతో సమానులైన ఆ శక యవనులు భూమిని కప్పివేసేరు. బంగారురంగు వస్త్రములు ధరించి దీర్ఘములైన ఖడ్గములతోను పట్టసములతోను జ్వలిస్తూన్న అగ్నులవలె ఆ శకయవనులు విశ్వామిత్రునియొక్క సర్వ సైన్యమును దహించివేసేరు.

తతోఽస్త్రాణి మహాతేజా విశ్వామిత్రో ముమోచ హ।
తై స్తైర్యవకామ్బోజాః పప్లవాశ్చాకులీకృతాః॥ ౨౩

తరువాత గొప్ప తేజస్సుగల విశ్వామిత్రుడు అస్త్రములను ప్రయోగించగా యవనులు కామ్బోజులు పప్లవులు చెల్లాచెదరై పోయేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుఃపఞ్చాశ స్సర్గ సమాప్తము.

-

అథ పఞ్చపఞ్చాశః సర్గః

(విశ్వామిత్రుని నూర్గురు పుత్రులతోసహా సైన్యమంతయు నశించగా తపస్సుచే శివుని మెప్పించి దివ్యాస్త్రములు సంపాదించి వసిష్ఠాశ్రమంపై ప్రయోగించుట, వసిష్ఠుడు బ్రహ్మదండముతో వాటిని వారించుట.)

తతస్తానాకులాన్ దృష్ట్వా విశ్వామిత్రాస్త్రమోహితాన్।
వసిష్ఠశ్చోదయామాస కామధుక్సృజ యోగతః॥ ౧

తరువాత, విశ్వామిత్రాస్త్రమోహితులై వ్యాకులులైన యవన కామ్భోజ పహ్లవులను చూచి “ఓ కామధేనువా! యోగబలముచేత సృజింపుము” అని ధేనువును ప్రచోదనము చేసేరు.

ఈవిధంగా ప్రేరేపింపబడిన శబల హుంభాధ్వని చేయగా...

సూర్యసన్నిభులైన కామ్భోజులు పుట్టేరు. పొదుగునుండి శస్త్రధారులైన పహ్లవులు, యోని ప్రదేశమునుండి యవనులు, మరియు మలద్వారమునుండి శకులు, రోమకూపములనుండి మ్లేచ్ఛులు కిరాతులు హారీతులు పుట్టేరు.

రఘునందనా! వారిచే విశ్వామిత్రునియొక్క చతురంగ (రథ గజ అశ్వ పదాతి దళములు) బలమంతయు నశింపచేయబడినది.

మహాత్ముడైన వసిష్ఠునిచేత నశింపచేయబడిన సైన్యమును చూచిన విశ్వామిత్రుని నూర్గురుకుమారులు నానావిధ ఆయుధధారులై చాల కోపించిన వారై జపము చేయువారలలో శ్రేష్ఠుడైన వసిష్ఠునిమీదికి వచ్చారు. భగవంతుడైన వసిష్ఠుదు హుంకారముచేతనే వారినందరినీ దహించివేసేడు.

చతరంగబలములతోకూడిన విశ్వామిత్రుని కుమారులు క్షణములో భస్మము చేయబడ్డారు.

అప్పుడు పుత్రసహితముగా సైన్యమంతయు నశించిపోవుటను చూచిన గొప్పకీర్తిగల విశ్వామిత్రుడు వేగంలేని సముద్రంలా, కోరలు పీకిన పాములా, గ్రహణంపట్టిన సూర్యునిలా నిస్తేజుడైనాడు. రెక్కలుతెగిన పక్షివలె దీనుడై తొలగిన దర్పముకలవాడై రణోత్సాహము చచ్చి దుఃఖమునుపొందెను.

అట్టి విశ్వామిత్రుడు భూమిని క్షత్రియధర్మానుసారంగా పాలింపుమని ఒక పుత్రుని నియమించి వనమునుచేరేడు.

గొప్పతపస్సుగల అతడు కిన్నరులతోను ఉరగులతోనుకూడిన హిమగిరికి వెళ్ళి మహాదేవుని ప్రసాదముకొరకు తపస్సుచేసేడు.
తరువాత కొంతకాలానికి దేవేశుడైన వృషభధ్వజుడు వరదుడై విశ్వామిత్రునకు దర్శనమిచ్చాడు.
రాజా! దేని నిమిత్తము తపస్సు చేసేవు? నీవు చప్పదలచినది ఏదో చెప్పుము. వరదుడను అయి ఉన్నాను. నీ కొరికను తెలియజేయుము.
దైవముచేత ఈవిధముగా పలుకబడగా! విశ్వామిత్రుడు నమస్కరించి...
అనఘా! మహాదేవా! నా తపస్సునకు నీవు సంతసించి నట్లైతే సాఙ్గోపాఙ్గముగా ఔపనిషదము రహస్యము అయిన ధనుర్వేదమును నాకు ఇమ్ము.
అనఘుడా! దేవ దానవ మహర్షి గంధర్వ యక్ష రాక్షసాదులందు ఏ అస్త్రములున్నవో అవి అన్నీ నాకు స్ఫురించుగాక! దేవదేవా! నీయొక్క ప్రసాదమువలన నాయొక్క కోరిక తీరుగాక! అని అడుగగా...
దేవేశుడు అస్తు (అగుగాక) అని వెళ్ళిపోయేడు.

దర్పేణ మహతా యుక్తో దర్పపూర్ణోఽభవత్తదా॥ ౧౯

రాజర్షియు గొప్పబలముకలవాడును గొప్పదర్పముకలవాడు అయిన విశ్వామిత్రుడు అస్త్రములను పొంది పూర్ణమైన దర్పముకలవాడైనాడు.
దర్పము అను పదమునకు గర్వము అధికారము బలము అను అర్థములలో వినియోగము. ఇది గుణము.
విశ్వామిత్రుడు నేను బలవంతుడను అను దర్పము స్వభావముగాకలవాడు. ఇప్పుడు దేవతానుగ్రహమున ఇంకనూ అస్త్రములనుపొంది దర్పమున పూర్ణత్వాన్ని పొందేడు.

వివర్ధమానో వీర్యేణ సముద్ర ఇవ పర్వణి।
హతమేవ తదా మేనే వసిష్ఠమృషిసత్తమమ్॥ ౨౦

పర్వమునందు సముద్రమువలె వీర్యముచేత వృద్ధిపొందుచున్నవాడైన విశ్వామిత్రుడు ఋషిసత్తముడైన వసిష్ఠుని చంపబడినవానినిగా తలచేడు.
కేవల విద్యాశబ్దము ప్రయోగింపబడిన సందర్భములందు విద్య అంటే బ్రహ్మవిద్యయే గ్రాహ్యము. ఆవిధముగానే కేవలము పర్వము అని

ప్రయోగింపబడిన తావుల పర్వము అంటే పూర్ణిమాతిథి అని గ్రాహ్యము. పున్నమినాటి సముద్రంలా క్రొత్తగా సంపాదింపబడిన బలంతో పొంగి పోతున్నాడు.
క్రొత్తగా సంపాదించుకొన్న బలంతో ఆశ్రమానికి వెళ్ళేడు. ఆ అస్త్రములను విడిచేడు. ఆ అస్త్రముల తేజస్సుచేత ఆశ్రమం కాల్చివేయబడింది.
ధీమంతుడైన విశ్వామిత్రునియొక్క విజృంభించుచున్న అస్త్రమును చూచి మునులందరూ దిక్కులుపట్టి పారిపోయేరు.
వసిష్ఠునియొక్క ఏ శిష్యులుకలరో వారూ, వేలకొలదిగా ఉన్న మృగపక్షిగణము భయపడి దొరికిన దిక్కుకు పారిపోయేరు.
మహాత్ముడైన వసిష్ఠుని ఆశ్రమము శూన్యముగా అయింది. క్షణకాలంలో మరుభూమిలా నిశ్శబ్దంగా అయిపోయింది.
వసిష్ఠుడు మాటిమాటికీ భయపడకండి భయపడకండి అని అంటూనే ఉన్నాడు. సూర్యుడు పొగమంచును నశింపచేసినట్లుగా గాధేయుని నశింపచేస్తాను అని అనుచుండగనే అందరూ పారిపోయేరు.
జపముచేయువారలలో శ్రేష్ఠుడు గొప్పతేజస్సుకలవాడు అయిన వసిష్ఠుడు రోషముతో కూడుకొన్నవాడై
విశ్వామిత్రునితో...

దురాచారోఽసి తన్మూఢ తస్మాత్త్వం న భవిష్యసి॥ ౨౭

మూఢుడా! చిరసంవృద్ధమైన ఆశ్రమాన్ని నాశనంచేసి దురాచారుడవు అయ్యేవు. అందువలన నీవు ఉండవు.
ఇది రాజైన విశ్వామిత్రునకు, బ్రహ్మర్షి అయిన వసిష్ఠునకు మాటతీరులో ఉన్న భేదము.
విశ్వామిత్రుడు వసిష్ఠునియొక్క ఉపాధినాశనాన్ని సంకల్పించేడు. కనుకనే **హతమేవ మేనే** అని ప్రయోగం. అంటే వసిష్ఠుడు నాచేతిలో చచ్చేడు అని అనుకొన్నాడు.
వసిష్ఠుడు విశ్వామిత్రునిగూర్చి **త్వం న భవిష్యసి** అన్నారు.
నీవు ఉండవు అని. ఎలా ఉండదు? అంటే ఇప్పుడు ఉన్నట్లుగా ఉండవు

అని. ఇక్కడ **భవిష్యసి** రూపం **"భూ"** ధాతువుయొక్క లృట్ మధ్యమపురుష ఏకవచనం. ఇది విశేషణమునో గుణమునో లక్ష్యంచేసుకొని ప్రవర్తిస్తుంది. అస్ ధాతువు పై లృట్ మధ్యమపురుష ఏకవచన ప్రయోగం అయితే దానికి విశ్వామిత్రుని ఉపాధి లక్ష్యము అయ్యేది.

జ్ఞాని నాశనాన్ని కాదు... మార్పును చూస్తాడు.

వ్యష్టి ప్రయోజనానికి ఘాతకలిగితే ఉపేక్షించవచ్చు.

ఇక్కడ వసిష్ఠుని ఆశ్రమం నాశనమయింది.

అది విశ్వవిద్యాలయం. ఇది సమష్టిసంపద. సమాజహితముకొరకైనది. దాన్ని నాశనంచేసేడు. కనుక **తస్మాత్త్వం న భవిష్యసి** అని మరణదండనకు అర్హుడైన ప్పటికి ధర్మాత్ముడు ప్రజోపకారికావున దర్పాదులతోకూడిన మానసికస్థితిని సరిచేసే సంకల్పంచేసేరు మహర్షి.

ఇత్యుక్త్వా పరమక్రుద్ధో దణ్డముద్యమ్య సత్వరః।
విధూమమివ కాలాగ్నిం యమదణ్డమివాపరమ్॥ ౨౮

ఈ విధంగా పలికి, మిక్కిలికోపించిన వసిష్ఠుడు సత్వరమే పొగలేని కాలాగ్నివలె రెండవ యమదండమువలె ఉన్న దండమును చేతధరించెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్తర్వ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చపఞ్చాశ స్సర్గ సమాప్తము.

-

॥అథ షట్పఞ్చాశః సర్గః॥

(వసిష్ఠుడు తన బ్రహ్మదండంతో విశ్వామిత్రుని అస్త్రములను శమింపచేయుట. విశ్వామిత్రుడు బ్రాహ్మణత్వమును సంపాదించుటకు ఉద్యుక్తుడగుట)

ఏవముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహాబలః।
ఆగ్నేయమస్త్రముత్క్షిప్య తిష్ఠతిష్ఠేతి చాబ్రవీత్॥ ౧

వసిష్ఠునిచే ఈవిధంగా పలుకబడినవాడై మహాబలుడైన విశ్వామిత్రుడు నిలునిలు అంటూ ఆగ్నేయాస్త్రమును ప్రయోగించేడు.

పూజ్యుడైన వసిష్ఠుడు రెండవయమదండమువలెనున్న బ్రహ్మదండమును ఎత్తి కోపముతో దుష్టక్షత్రియా! నిలు నిలు అన్నావు కదా! **ఏషః** అంటున్నారు. అంటే ఈ నేను... అని, ఇక్కడ **ఏషః** అనునది అభినయవాచకము. తన చూపుడువ్రేలుతో తననుతాను చూపుకొంటూ నేను (వసిష్ఠుడు అంటే ఉపాధి మాత్రమేకాదు. కావున) సోపాధికముగా నిలుచున్నాను అంటున్నారు. ఎందువలన అంటే విశ్వామిత్రునకు వసిష్ఠుడు అంటే ఉపాధిమాత్రుడు.

లోకంలో "నా నీడనుకూడా తాకలేవు" అనటం వింటూ ఉంటాం.

అదే విధంగా... నేను అంటే ఇదే అనుకుంటున్నావు కదా! ఇదిగో ఈ నేను నిలిచి ఉన్నాను. బలం బలం అంటున్నావుకాదా! నీ బలం ఏదో చూపించు.

నాశయామద్య తే దర్పం శస్త్రస్య తవ గాధిజ॥ ౩

నీ దర్పాన్ని నీ శస్త్రములదర్పాన్నికూడా నాశనంచేస్తాను అంటున్నారు.

ఇదీ **"త్వం న భవిష్యసి"** అన్న వసిష్ఠ సంకల్పం.

క్షత్రియాధమా! నీయొక్క క్షత్రియబలము ఎక్కడ! గొప్పదైన బ్రహ్మబలము ఎక్కడ. దివ్యమైన నా బ్రహ్మబలాన్ని చూడు.

అని ఆ గాధిపుత్రునియొక్క ఆగ్నేయాస్త్రమును నిప్పు నీటిచే శాంతించినట్లు బ్రహ్మదండముచే శాన్తింపచేసేరు.

కుపితుడైన విశ్వామిత్రుడు వారుణాస్త్రమును రౌద్రాస్త్రమును పాశుపతమును ఐషీకాస్త్రమును ప్రయోగించాడు. ఇంకా మానవ మోహన గాంధర్వ స్వాపన జృంభణ మాదన సంతాపన విలాపన శోషణాస్త్రములను జయింపశక్యముగాని వజ్రాస్త్రములను ప్రయోగించెను. ఇంకా బ్రహ్మపాశము వరుణపాశము,

శుష్కము ఆర్ద్రము అను వజ్రములను, దండము పూశాచము క్రౌంచాస్త్రములను ప్రయోగించెను. ధర్మచక్ర కాలచక్ర విష్ణుచక్రములను, వాయవ్య మథన హయశిరోస్త్రములను, కంకాళము ముసలము అను రెండుశక్తులను, వైద్యాధర కాల త్రిశూల కాపాల కంకణాస్త్రములను ప్రయోగించేడు.

బ్రహ్మకుమారుడైన వసిష్ఠుడు వాటినన్నింటినీ దండముచేత మ్రింగివేసేడు. ప్రయోగించిన అస్త్రములన్నీ శాంతిచగా గాధినందనుడు బ్రహ్మాస్త్రమును ప్రయోగించేడు.

ఆ ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రమును చూచి అగ్న్యాదిదేవతలు దేవర్షులు మహోరగులతోకూడిన గంధర్వులుకలతచెందేరు. బ్రహ్మాస్త్రము ప్రయోగింపగనే మూడులోకాలు తపింపబడినవి.

రామా! వసిష్ఠుడు బ్రహ్మతేజస్సుచేత బ్రహ్మదండముచేత మహాఘోరమైన బ్రహ్మాస్త్రమునుకూడా పూర్తిగా మ్రింగివేసేడు.

బ్రహ్మాస్త్రమును మ్రింగుచున్న వసిష్ఠునియొక్క రూపము త్రిలోకములను మూర్ఛనొందించునదిగా భయంకరముగా చాలాదారుణంగాను ఉంది.

మహాత్ముడైన వసిష్ఠునియొక్క సమస్త రోమకూపములందు పొగతోనిండిన జ్వాలలుకల అగ్నికిరణములు బయటకు వస్తున్నట్లుగా ఉండెను.

వసిష్ఠుడు చేతియందు పట్టుకొన్న బ్రహ్మదండము పొగలేని కాలాగ్నివలె మరొయొక యమదండమువలె ప్రజ్వరిల్లెను.

తరువాత మునిగణములు "బ్రహ్మన్! నీయొక్క బలము అమోఘమైనది. నీయొక్క తేజస్సును నీ తేజస్సునందే ధరింపుము." అని శ్రేష్ఠుడైన వసిష్ఠుని స్తుతించిరి. బ్రహ్మన్! నీచేత గొప్ప తపస్సుగల విశ్వామిత్రుడు నిగ్రహింప బడ్డాడు. మునిశ్రేష్ఠుడా! అనుగ్రహించు లోకములు బాధతొలగినవిగా అగుగాక! అని ప్రార్థించేరు.

అస్త్రములలో బ్రహ్మాస్త్రము చివరిది. అది శాన్తించింది. గాధిసుతుడు శాన్తించిన దర్పముగలవాడై విశ్వామిత్రుడు అయ్యేడు. సర్గారంభమునుండి గాధిసుతుడని అంటూ అతనిచే ప్రయోగింపబడిన బ్రహ్మాస్త్రము శాన్తించగనె తొలగిన స్వాభావికదర్పము అస్త్రదర్పముగలవాడగుటచే మహర్షి ఇతడిని విశ్వామిత్రుడని చెప్తున్నారు.

ఇక్కడ విశ్వామిత్రుడు తపస్సుచేత సంపాదించిన మహాదేవప్రసాదమైన అస్త్రవిద్య ఎందుకూ పనికిరానిదైంది.

ఎందువలన అంటే...

బ్రహ్మకంటె శివుడుగొప్పవాడు, శివునికంటె విష్ణువు గొప్పవాడు. విశ్వామిత్రుడు విష్ణువునిగూర్చి తపస్సుచేస్తే వసిష్ఠుని జయించి ఉండేవాడని వైష్ణవం సంతోషించవచ్చు

విశ్వామిత్రుని గర్వం అణచివేయుటకు మహాదేవుడు ఆవిధంగా చేసేడని శైవం సమాధాన పడవచ్చుగాక!

ఈ గాధిసుతుడు ఇంద్రియబలాన్ని నమ్ముకున్నాడు. గాధిసుతుని తపస్సుకు లక్ష్యమైనవాడు త్రిగుణాలలోని దైవం.

త్రిగుణములు శాన్తావస్థయందున్న శుద్ధబ్రహ్మము రొమ్ము విరుచుకు నిల్చుంటే గుణత్రయాధిష్ఠాతలు అంతర్హితమై పోతారు. అద్వైతము ముందు ఇతర మతముల వలె.

మునిగణములయొక్క ప్రార్థనను విని మహాతేజశ్శాలి తపశ్శాలి అయిన వసిష్ఠుడు శాన్తించేడు. భంగపడిన విశ్వామిత్రుడు నిట్టూర్చుచూ...

ఛీ ఈ క్షత్రియబలమేమి బలము! బ్రహ్మతేజోబలమే బలము. ఒక్క బ్రహ్మదండము చేత నాయొక్క అస్త్రబలము అంతయు కొట్టబడినది.

తదేతత్సమవేక్ష్యాహం ప్రసన్నేంద్రియ మానసః।
తపో మహత్సమాస్థాస్యే యద్వై బ్రహ్మత్వకారణమ్॥ ౨౪

ఆ కారణమువలన నేను ప్రసన్నమైన ఇంద్రియములు మానస్సుకలవాడనై ఏది బ్రాహ్మణత్వమునకు కారణమో అటువంటి గొప్పతపస్సును చేస్తాను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్తర్వ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షట్పఞ్చాశ స్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తపఞ్చాశః సర్గః॥

(విశ్వామిత్రుని తపస్సు. త్రిశంకువు వృత్తాంతము.)

తతః సంతప్తహృదయః స్మరన్నిగ్రహమాత్మనః
వినిశ్వస్య వినిశ్వస్య కృతవైరో మహాత్మనా॥ ౧

రామా! వసిష్ఠునితో వైరమునగల విశ్వామిత్రుడు సంతప్త హృదయుడై తనకు జరిగిన పరాభవమును స్మరించుచు మాటిమాటికీ నిట్టూర్చుచూ పట్టమహిషితో కలిసి దక్షిణదిక్కునుగూర్చి వెళ్ళి పరమఘోరమైన తపస్సునుచేసేడు. ఆసమయంలో ఫలమూలములను గ్రహించుచు దాన్తుడై చాలాగొప్ప తపస్సును చేసేడు.

తరువాత ఈతనికి హవిష్యందుడు మధుష్యందుడు దృఢనేత్రుడు మహారథుడు అను పుత్రులు సత్యధర్మాలయందు ఆసక్తిగలవారు కలిగేరు.

పూర్తిగా వేయిసంవత్సరములు నిండేయి.

లోకపితామహుడైన బ్రహ్మదేవుడు తపోధనుడైన విశ్వామిత్రునిగూర్చి మధురంగా మాట్లాడుతున్నాడు.

ఓ కుశికాత్మజా! నీయొక్క తపస్సుచేత రాజర్షిలోకములు జయింపబడినవి. ఈ తపస్సుచేత నిన్ను రాజర్షి అని గుర్తిస్తున్నాను.

ఏవముక్త్వా మహాతేజా జగామ సహ దైవతైః
త్రివిష్టపం బ్రహ్మలోకం లోకానాం పరమేశ్వరః॥ ౬

మహాతేజశ్శాలి లోకములకు పరమేశ్వరుడు ఈవిధంగా పలికి దేవతలతో కూడ బ్రహ్మలోకమైన స్వర్గమునుగూర్చి వెళ్ళేడు.

స్వర్గం అంటే కేవలం రంభాదులు నట్యవినోదాలతో, ఇంద్రాదులు ఉండే లోకంకాదు. దానిపేరుకూడా స్వర్గము అయితే కావచ్చు. ఇది ఇంద్రియార్థముల పై ఆసక్తితోచేసిన తపస్సుకు ఫలరూపంగా ఉంటుంది. కనుకనే స్వర్గమునకు ఇంద్రుడు అధిపతి అని చెప్పబడుతున్నాడు. ఈ రంభాదుల నాట్యవినోదాలు ఆగిపోయిన ఉత్తరక్షణం దుఃఖాన్ని పొందుతున్నాడు.

లోకంలో కర్మఫలరూపమైన ధనంతో పట్టువస్త్రములు ఖరీదైనదుస్తులు ధరించడం, జూదము వేశ్యాపరిష్వంగ సుఖాదులవంటివి పొందుతారు.

దీనికే స్వర్గమని పేరు. ఈ స్వర్గమునకు అధిపతి ఇంద్రుడు (మనస్సు). తొందరలో ఈ సుఖాలు (కర్మఫలం-ధనం) క్షీణించి దుఃఖము కలుగుతుంది. అంతేకానీ స్వర్గం అంటే వేరే ఎక్కడో ఉంది అనుకోకూడదు.

ఇంద్రియార్థములయందలి ఆసక్తిని విడిచి జ్ఞానమును ఆశ్రయించిచేసిన తపస్సునకు (విచారము) ఫలరూపమైన స్వర్గము బ్రహ్మలోకం. ఇది కర్మఫల రూపంగా వచ్చినదికాదు. నిరంతర బ్రహ్మవిచారజన్యమైన ఈ ఆనందం అఖండము అనంతమును.

ఇక్కడ విశ్వామిత్రుడు ధనాన్ని విడిచిపెట్టేడు. ధనమంటే డబ్బు ఒక్కటే కాదు. అధికారం బలం అరిషడ్వర్గరూపమైన ఇంద్రియార్థములు. ఇవన్నీ ధనమే. వీటిని విడిచిపెట్టేడు. ఇవి సుఖహేతువు ఆనందహేతువు కాదని విడిచిపెట్టేడు. బ్రహ్మవిచారాన్ని మొదలుపెట్టేడు. రాజర్షి అయ్యేడు. అంటే ఏదో పెద్దపదవి దక్కిందని కాదు, బ్రహ్మగారు చెప్పింది. నువ్వు తమస్సును మాత్రమే దాటేవు. రజోగుణం అలాగే ఉంది. అని చెప్పటం. కనుకనే...

విశ్వామిత్రోపి తచ్ఛ్రుత్వా హ్రియా కిఞ్చిదవాఙ్ముఖః

విశ్వామిత్రుడుకూడా ఆవాక్యమును విని సిగ్గుతో తలవంచుకొన్నాడు. గొప్పదైన దుఃఖాన్నిపొందేడు. కోపముతోకూడినవాడై మాట్లాడుతున్నాడు.

చాలాకాలం తపస్సు చేసినప్పటికీ నన్ను ఋషిగణములతోకూడిన సమస్త దేవతలు రాజర్షి అనియే గుర్తిస్తున్నారు. **నాస్తి మన్యే తపఃఫలమ్** నా తపస్సునకు ఫలంలేదు. అంటే నేనింకా తపఃఫలాన్ని పొందలేదు అని అనుకొన్నవాడై

గొప్పబుద్ధిగలవాడైన విశ్వామిత్రుడు మరల గొప్పతపస్సును చేసెదనని మనస్సుచేత నిశ్చయించి తపస్సుచేయడం ప్రారంభించేరు.

ఈ కాలంలోనే సత్యవాది జితేంద్రియుడు ఇక్ష్వాకు కులవర్ధనుడు అయిన త్రిశంకువు అను రాజు ఉండేవాడు.

రామా! ఈ రాజుకు సశరీరంగా స్వర్గానికి పోవాలనే బుద్ధిపుట్టింది. దీనికొరకై యజ్ఞం చేయాలనుకొన్నాడు.

వసిష్ఠుని పిలిచి తన ఆలోచనని చెప్పేడు. మహాత్ముడైన వసిష్ఠునిచేత ఇది అశక్యమని చెప్పబడింది. వసిష్ఠునిచేత నిరాకరింపబడిన అతడు దక్షిణదిక్కునకు ప్రయాణమై వెళ్ళేడు. తన ఆలోచనను సిద్ధింపచేసుకొనుటకు వసిష్ఠపుత్రుల వద్దకు వెళ్ళేడు.

దీర్ఘతపస్సుకల వసిష్ఠపుత్రులు ఎక్కడ తపస్సుచేస్తున్నారో అక్కడకు వెళ్ళేడు. అక్కడ మిక్కిలి ప్రకాశిస్తూన్న నూర్గురు వసిష్ఠపుత్రులను చూసేడు.

త్రిశంకువు మహాత్ములైన నూర్గురు వసిష్ఠపుత్రులను సమీపించి వారి తారతమ్యములను అనుసరించి నమస్కరించేడు. సిగ్గుతో తలవంచుకొని అంజలిబద్ధుడై వారితో మాట్లాడుతున్నాడు. శరణుకోరివచ్చిన నేను, రక్షకులైన మిమ్ము శరణుపొందుచున్నాను. మీకు భద్రమగుగాక! నేను మహాత్ముడైన వసిష్ఠునిచేత నిరాకరింపబడ్డాను.

ఓ గొప్పయజ్ఞము చేయాలనే కోరికకలిగింది. నాకు అనుజ్ఞ ఇవ్వండి. గురుపుత్రులైన మిమ్ము నమస్కరించి అనుగ్రహింపవలసినదిగా వేడుచున్నాను. తపస్సు చేయుచున్న బ్రాహ్మణులైన మిమ్ములను శిరస్సువంచి యాచించుచున్నాను. నేను శరీరముతో దేవలోకమును పొందుటకై సావధాన చిత్తముకలవారై యజ్ఞమును చేయించండి. వసిష్ఠునిచేత నిరాకరింపబడిన నాకు గురుపుత్రులైన మీరు తప్ప మరియొక గతి లేనివాడను.

ఇక్ష్వాకూణాం హి సర్వేషాం పురోధాః పరమా గతిః।
పురోధసస్తు విద్వాంసస్తారయన్తి సదా నృపాన్।
తస్మాదనంతరం సర్వే భవన్తో దైవతం మమ॥ ౨౨

ఇక్ష్వాకువంశీయులందరుకు పురోహితుడే పరమగతి. విద్వాంసులైన పురోహితులు ఎల్లప్పుడూ రాజులను తరింపచేయుదురు. వసిష్ఠుని అనన్తరము మీరే నాకు దేవతలు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తపఞ్చాశ స్సర్గ సమాప్తము.

–

అథ అష్టపఞ్చాశః సర్గః

(త్రిశంకుని వసిష్ఠపుత్రులు శపించుట. త్రిశంకువు విశ్వామిత్రుని ఆశ్రయించుట.)

తతస్త్రిశఙ్కోర్వచనం శ్రుత్వా క్రోధసమన్వితమ్।
ఋషిపుత్రశతం రామ రాజానమిదమబ్రవీత్॥ ౧

రామా! త్రిశంకువుయొక్క వచనము విన్న తరువాత నూరుగురు ఋషిపుత్రులు కోపముతో కూడినవారై రాజునుగూర్చి మాట్లాడుతున్నారు.

ఓ దుర్బుద్ధీ! సత్యవాది అయిన గురువుచే నిరికరింపబడినవాడవై ఆ గురువును అతిక్రమించి శాఖాంతరమును ఏవిధంగా ఆశ్రయిస్తున్నావు?

ఇక్ష్వాకులందరకూ పరమపూజ్యుడు సత్యవాది అయిన వసిష్ఠుని వాక్యము అతిక్రమింపరానిది. భగవాన్ వసిష్ఠులు అశక్యమని చెప్పిన యజ్ఞమును చేయుటకు మేము ఎట్లు సమర్థులము కాగలము.

నరశ్రేష్ఠా! నీవు మూఢుడవు. నీవు నీ నగరమునకు తిరిగి వెళ్ళు.

భగవాన్ వసిష్ఠులు త్రిలోకములలో ఎవ్వరి చేతనైనా యజ్ఞము చేయించుటకు సమర్థుడు. అందువలన నీచే యాగము చేయించి ఆయనను అవమానింప లేము. అని కోపముచేత వ్యాకులమైన చూపులతో పలికిన వసిష్ఠపుత్రుల మాటలను విని...

తపోధనులారా! గురువుచేతను మరియు గురుపుత్రులచేతను నిరాకరింపబడితిని. నేను మరొక మార్గమును పొందగలను. మీకు భద్రమగుగాక! అన్నాడు.

త్రిశంకువుయొక్క ఘోరమైన అభిప్రాయమును విన్న వసిష్ఠపుత్రులు మిక్కిలి కోపించినవారై చండాలత్వమును పొందుమని శపించేరు.

శపించి వారు వారి ఆశ్రమము లోనికి వెళ్ళిపోయేరు. రాత్రిగడిచినది అగుచుండగా రాజు చండాలత్వమును పొందేడు.

రూపం మారింది. నల్లనివాడైయ్యేడు. నల్లని వస్త్రములు ధరించేడు. శరీరానికి కరకుదనం వచ్చింది. కేశాలు కురచ అయ్యేయి. శవములమీది మాలలను అలంకరించుకొన్నాడు. చితాభస్మం పులుముకొన్నాడు. ఇనుప ఆభరణములను ధరించేడు.

ఇవి దరిద్ర చిహ్నాలని మహర్షి మనకు చెబుతున్నారు.

రామా! చండాలరూపముగల ఆ త్రిశంకువును చూచి ఆతనియొక్క మంత్రులు పౌరులు మరియు అతనిని అనుగమించువారలు అందరూ దూరంగా పారిపోయేరు. ఆ త్రిశంకువు గొప్పధైర్యముకలవాడై ఒక్కడే రాత్రిపగలు దుఃఖముచే దహింపబడుచున్నవాడై తపోనిధి అయిన విశ్వామిత్రునిగూర్చి వెళ్ళేడు.

మహాతేజశ్శాలి పరమధార్మికుడు అయిన విశ్వామిత్రుడు ఘోరరూపముగల రాజునుగూర్చి కరుణవలన ముందుగా నీకు మంగళమగుగాక! అని పలికి...

మహాబలముగల రాజా! నీ ఆగమన కార్యమేమి?

ఆయోధ్యాధిపతివైన ఓ వీరుడా! శాపమువలన చండాలత్వమును పొందినావుకదా! అని విశ్వామిత్రుడు అడుగగానే...

చండాలత్వమును పొందిన పలుకనేర్చిన రాజు,

వాక్యవిశారదుడైన విశ్వామిత్రునితో అంజలిబద్ధుడై మాట్లాడుతున్నాడు.

నేను గురువుచేతను గురుపుత్రులచేతను నిరాకరింపబడ్డాను. నాకోరిక తీరకుండగనే విపరీతఫలమును పొందేను.

ఓ సౌమ్యుడా! సశరీరముగా స్వర్గముగూర్చి వెళ్ళవలెనని నా అభిప్రాయము. నాచేత నూరు యజ్ఞములు చేయబడినవి. ఆ ఫలము పొందబడలేదు.

నేను పూర్వము ఎప్పుడూ అసత్యమును పలుకలేదు. ఇక ఎన్ని కష్టములు కలిగినను పలుకను. క్షాత్రధర్మముచేత నీకు ప్రతిజ్ఞ చేయుచున్నాను.

అనేక యజ్ఞములు చేయబడినవి. ప్రజలు ధర్మముగా పాలింపబడినారు. మహాత్ములైన పెద్దలను మంచిశీలముచేత నడవడికచేత సంతోషపెట్టితిని.

ఓమునిశ్రేష్ఠా! ధర్మబద్ధముగా ప్రయత్నించుచున్నాను. యజ్ఞము చేయవలెనని కోరుచున్న వాడనైన నా విషయమున గురువులు సంతోషమును పొందుటలేదు.

దైవమేవ పరంమన్యే పౌరుషంతు నిరర్థకమ్।
దైవేనాక్రమ్యతేసర్వం దైవం హి పరమాగతిః॥ ౨౨

దైవమునే శ్రేష్ఠమైన దానినిగా తలుస్తాను. పౌరుషం (పురుషప్రయత్నం) వ్యర్థమైనది. సమస్తము దైవముచేతనే ఆక్రమింపబడి ఉంది. దైవమే ఆశ్రయింప దగినదిగా ఉంది.

ఆర్తుడనై ప్రార్థించుచున్నాను. నన్ను అనుగ్రహించుటకు నీవే తగినవాడవు. నేను దైవోపహతుడను నీకు శుభ మగుగాక!

నాన్యాం గతిం గమిష్యామి నాన్యః శరణమస్తి మే।
దైవం పురుషకారేణ నివర్తయితుమర్హసి॥ ౨౪

నేను మరొకరిని ఆశ్రయించను. నాకు మరొక రక్షకుడులేదు. పురుషకారముచే దైవమును (విధిని) మరల్చుటకు నీవు సమర్థుడవు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టపఞ్చాశ స్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకోనషష్టితమః సర్గః॥

(త్రిశంకువుచే యజ్ఞము చేయించుటకు విశ్వామిత్రుడు ఋషులను ఆహ్వానించుట. వసిష్ఠపుత్రులను మహోదయుని శపించుట.)

ఉక్తవాక్యం తు రాజానం కృపయా కుశికాత్మజః।
అబ్రవీన్మధురం వాక్యం సాక్షాచ్చణ్డాలరూపిణమ్॥ ౧

అని పలికిన సాక్షాత్ చండాలరూపము కలిగిన రాజును చూసి, జాలిగొని కుశికాత్మజుడు మధురమైన వాక్యమును పలుకుతున్నాడు.

ఇక్ష్వాకువంశమునందు పుట్టిన ఓవత్సా! నీకు స్వాగతం. నిన్ను మంచి ధార్మికునిగా నేను ఎరుగుదును. నృపుఙ్గవా! భయపడకు. నీకు రక్షకుడను కాగలను.

నేను పుణ్యకర్ములైన యజ్ఞమునందు సహాయము చేయు మహర్షులందరినీ ఆహ్వానిస్తాను. నిశ్చింతగా యజ్ఞంచెయ్యి.

గురుశాపమువలన ఏర్పడిన ఈరూపముతోనే సశరీరముగా స్వర్గమునుగూర్చి వెళ్ళగలవు. శరణుపొందతగిన విశ్వామిత్రుని చేరి శరణుపొందేవు. ఇక నీకు స్వర్గము తథ్యము. గొప్పతేజస్సుగల విశ్వామిత్రుడు ఈవిధంగా పలికి ధార్మికులు గొప్పబుద్ధిగలవారు అయిన తన పుత్రులను యజ్ఞసంభారములను సమకూర్చుటకై నియోగించెను.

శిష్యులందరినీ పిలచి వత్సలారా! నా ఆజ్ఞానుసారముగా వెళ్ళి శిష్యులతో ఋత్విక్కులతో మంచివిద్యావంతులతోకూడిన సహృదయులైన ఋషిగణములను తీసుకొని రండి.

అన్యుడు నావాక్య బలముచేత ప్రేరేపింపబడినవాడై అనాదరపూర్వకంగా ఏది పలుకునో అదంతయూ నాకు చెప్పవలెను.

విశ్వామిత్రుని అజ్ఞను అనుసరించి శిష్యులు నలుదిక్కులకు వెళ్ళి ఆహ్వానింపగా అన్ని దేశములనుండి వేదాధ్యయన సంపన్నులు విచ్చేసారు.

శిష్యులందరూ తిరిగివచ్చి అగ్నివలె ప్రకాశించుచున్న విశ్వామిత్రునిగూర్చి వేదాధ్యయన సంపన్నులైన వారందరూ పలికిన వాక్యములను చెప్పేరు.

మహోదయుడు తప్ప అన్నిదేశములందున్న బ్రాహ్మణులు అందరు వచ్చేరు.

మునిపుఙ్గవా! వసిష్ఠకుమారులు నూర్వురు క్రోధముచే తడబడుచున్న అక్షరములచే క్షత్రియుడు యాజకునిగాగల విశేషించి చండాలుడైన వానియొక్క యజ్ఞసదస్సులోని హవిర్భాగములను దేవతలును ఋషులును ఎట్లు భుజింతురు? విశ్వామిత్రుని ఆజ్ఞాబద్ధులైన మహాత్ములైన బ్రాహ్మణులు చండాలుని భోజనమును భుజించి ఎలా స్వర్గమునకు వెళ్లగలరు?

మునిశార్దూలా! మహోదయుడు వసిష్ఠకుమారులు సంరక్తలోచనులై ఈ విధంగా పలికేరు. మునిపుఙ్గవుడైన విశ్వామిత్రుడు శిష్యులయొక్క మాటలను విని కోపముచే ఎఱ్ఱబడ్డ కన్నులుకలవాడై...

దోషరహితుడనగు ఉగ్రమైన తపస్సును ఆచరించు నన్ను దూషించు దురాత్ములు నిస్సంశయముగా భస్మమైపోతారు.

వారు ఇప్పుడే యమపాశముచేత యమునిగృహమును గూర్చి తీసుకువెళ్ళబడి ఏడువందల జన్మలపాటు శవభక్షకులుగా ఉందురు.

జాలిలేని ముష్టికజాతిలో పుట్టి కుక్కమాంసము భక్షించుచూ శాస్త్రవిరుధమైన పనులుచేయుచూ విరూపులై అంటే సాముద్రికశాస్త్రమందు చెప్పబడ్డ శుభ లక్షణములు లేనివారై ఈ లోకమునందు తిరుగుదురుగాక!

దుర్బుద్ధిగల మహోదయుడు దూషింపకూడని నన్ను దూషించినాడు కనుక సర్వలోకములందు దూషింపబడు నిషాదత్వమును పొందుతాడు.

ప్రాణములను తీయుటయందు ఆసక్తి కలవారై దయాహీనులై దీర్ఘకాలము దుర్గతిని పొందగలరు.

ఏతావదుక్త్వా వచనం విశ్వామిత్రో మహాతాపాః।
విరరామ మహాతేజా ఋషిమధ్యే మహామునిః॥ ౨౨

మహాతేజశ్శాలి అయిన విశ్వామిత్రుడు ఋషులమధ్య ఈవిధంగా పలికి విరమించను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్వ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకోనషష్టితమ స్సర్గ సమాప్తము.

–

అథ షష్టితమః సర్గః

(విశ్వామిత్రుడు త్రిశంకువుచే యజ్ఞము ప్రారంభం చేయించుట, త్రిశంకువు సశరీరముగా స్వర్గమునకు వెళ్ళుట. ఇంద్ర నిరాకరణము. త్రిశంకువు కొరకు మహర్షి స్వర్గమును నిర్మించుటకు పూనుకొనుట.)

తపోబలహతాన్ కృత్వా వాసిష్ఠాన్ సమహోదయాన్।
ఋషిమధ్యే మహాతేజా విశ్వామిత్రోఽభ్యభాషత॥ ౧

గొప్పతేజస్సుకల విశ్వామిత్రుడు మహోదయునితో కూడిన వసిష్ఠకుమారులను అందరినీ శపించినవాడై ఋషులను గూర్చి పలుకుతున్నాడు.

రాగీ కర్మఫలప్రేప్సుర్లుబ్ధో హింసాఽఽత్మకోఽశుచిః।
హర్షశోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః॥ అని భగవద్గీత చెప్పింది.

విశ్వామిత్రునియందు ఇంకా రాగము ఉంది. హింసించే స్వభావము ఉంది. హర్షశోకములతోకూడి ఉన్నాడు. బ్రహ్మగారు తనను రాజర్షి అని మాత్రమే గుర్తించారని ఏడ్చేడు. త్రిశంకునియందు రాగాన్ని పొందేడు. వసిష్ఠపుత్రులను హింసించేడు. ఇదంతా రాజసమే.

మహర్షి త్రిశంకువును అక్కడన్న ఋషిగణమునకు వేలితో చూపిస్తూ మాట్లాడు తున్నారు. ఇదిగో ఇతడు...

ఇక్ష్వాకువంశమందు పుట్టినవాడు. త్రిశంకువు అని ప్రసిద్ధి చెందినవాడు. ధర్మాత్ముడు, దాత.

తేన అనేన శరీరేణ దేవలోక జిగీషయా॥ ౨

ఇతడు ఈ...శరీరంతో దేవలోకమును జయించవలెనను కోరికతో ఉన్నాడు. నన్ను శరణుపొందేడు.

ఈతడు తన శరీరముతోనే స్వర్గమునకు ఎలా వెళ్ళగలడో! ఆవిధంగా మీ అందరితో కలిసి నాచేత యజ్ఞము చేయబడుతుంది.

అని విశ్వామిత్రుడు నిర్ణయంచేసి చెప్పేడు. ఋషిగణము కొద్ది దూరం కదిలి... ధర్మజ్ఞులైన మహర్షులందరూ సమావేశమై...

కలిసి ధర్మసహితమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. ఆగుంపులో ఉన్న పెద్దాయన దూరంలో ఉన్న విశ్వామిత్రుని చూపెడుతూ...

కుశికవంశజుడైన ఈ ముని పరమకోపిష్ఠి. ఆముని ఏం చెప్తున్నాడో అది చేయటం శ్రేయస్కరం. ఇందులో ఆలోచించడానికి ఏమీలేదు. ఇతడు అగ్నికల్పుడు అంటే అగ్నివలె తీవ్రమైన స్వభావం కలవాడని. కోపంవస్తే శాపాన్ని ఇస్తాడు. కనుక యజ్ఞాన్ని చేద్దాం! అనుకొని...

ఈ ఇక్ష్వాకువంశజుడు విశ్వామిత్రుని తేజస్సుచేత సశరీరముగా స్వర్గానికి ఏవిధంగా అయితే వెళ్ళగలడో ఆవిధంగా అందరూ యజ్ఞమును జరపండి. అందరూ ప్రారంభించండి అని ఋషిగణము పలికి...

యజ్ఞార్థమై చేయవలసిన పనులను చేసేరు. విశ్వామిత్రుడు ప్రధాన ఋత్విక్కుగా ఉన్నాడు.

మంత్రప్రవీణులైన ఋత్విక్కులు కల్పోక్తప్రకారము యథావిధిగా అన్నింటినీ ఒకదానితరువాత ఒకటిగా పూర్తిచేసేరు.

చాలాకాలం గడచింది. తరువాత గొప్పతపస్సుగల విశ్వామిత్రుడు సమస్త దేవతలను వారివారి యజ్ఞభాగములను తీసుకొనుటకు ఆహ్వానించేడు.

పిలువబడిన దేవతలు ఎవరూ హవిర్భాగములను తీసుకొనుటకు రాలేదు. క్రోధముతోకూడిన విశ్వామిత్రుడు స్రువమును పైకి ఎత్తి...

రాజా! స్వయముగా సంపాదింపబడిన నా తపోబలాన్ని చూడు...నిన్ను సశరీరముగా స్వర్గమును పొందించెదను. ఓ నరాధిపా! పొందశక్యముగాని స్వర్గమునుగూర్చి శరీరముతో వెళ్ళుము.

స్వార్జితం కించిదప్యస్తి మయా హి తపసః ఫలమ్।

ఎంతోలేదు..నా స్వార్జితమైన తపఃఫలం కొంచెంగా ఉంది. దాని బలంతో స్వర్గమునకు వెళ్ళు. అని అనగానే!

మునులందరూ చూస్తూండగానే రాజు సశరీరుడై స్వర్గమునకు వెళ్ళేడు.

విశ్వామిత్రుని తపోబలం ఇంద్రియబలానికి లోబడి సంపాదింపబడింది. తన కోరికను సాధించుకొనుటకు తన కోపమును తృప్తిపరచుకొనుటకు సంపాదింపబడింది. కొంతభాగం వసిష్ఠమహర్షి గ్రహించేరు. మరికొంత వసిష్ఠపుత్రుల శాపరూపంగా పోయింది. అయినా కొంత ఉండే ఉంటుంది. దాన్ని నీకు ఇస్తున్నాను. స్వర్గానికి వెళ్ళు. దేవలోకమునకు వచ్చిన త్రిశంకువును చూచి

సకల సురగణములతోకూడిన దేవేంద్రుడు...

మూఢా! త్రిశంకో గచ్ఛ భూయస్త్వం నాసి స్వర్గకృతాలయః

ఓ త్రిశంకూ! గురుశాపోపహతుడవైన నీవు స్వర్గవాసానికి అర్హుడవుకావు. మూఢుడా! తలక్రిందులుగా తిరిగి భూమిని చేరుమనెను.

మహేంద్రుడు ఈవిధంగా పలుకగానే, త్రిశంకువు రక్షించు రక్షించు అని తపోధనుడైన విశ్వామిత్రునిగూర్చి అరుచుచూ క్రిందికిపడ్డాడు.

కౌశికుడు రాజుయొక్క ఆక్రోశమును విన్నవాడై తీవ్రమైన కోపమును తెచ్చుకొని నిలు నిలు అని పలికేడు.

ఋషులమధ్యయందున్న ఆ విశ్వామిత్రుడు అపర బ్రహ్మవలె దక్షిణమార్గమందున్న వేరైన రెండవ సప్తర్షులను సృజించేడు. దక్షిణదిక్కునందు మరొక నక్షత్రమాలను సృజించేడు.

ఇంకా నక్షత్రవంశమును సృజించేడు. క్రోధముచేత కలుషీ కృతుడగుచున్నాడు. నేను మరొక ఇంద్రుని సృజించెదను లేదా ఇంద్రుడు లేకుండగా చేస్తాను. దేవతా సృష్టికూడా చేస్తాను అని క్రోధముతో ఆ పనికి పూనుకొన్నాడు.

పూర్వం త్రిశంకునిగూర్చి మాట్లాడుతూ **దేవలోక జిగీషయా** అని అతని కోర్కెను చెప్పేరు.

దేవలోకంలో ఉండే సుఖాలను అన్నింటినీ సశరీరంగా అనుభవించాలని కొరుకుంటున్నాడు. ఏకాదశేంద్రియ సంఘాతరూపమైనదే శరీరం. ఈ ఇంద్రియాలను నిగ్రహించే ప్రయత్నంకాదు త్రిశంకువు చేసేది. ఇంద్రియ సుఖమునకు వశుడై ఇంద్రియములను ఇంకా బలవత్తరమైనవిగా చేసే ప్రయత్నం చేస్తున్నాడు.

కనుకనే వసిష్ఠునిచేత పూర్వం, ఇది "వసిష్ఠేన అశక్యమితి ఉక్తః" శక్యముకాదని పలకబడింది. ఎందుకంటే ఇంద్రియములద్వారా పొందిన అనుభవం సుఖరూపంగా భాసింపబడుతున్న దుఃఖమేకనుక. స్వర్గము సుఖస్వరూపం.

ఇక్కడ విశ్వామిత్రుడు కూడా తనకు సహజమైన క్రోధాన్ని ఆశ్రయించి విచక్షణను కోల్పోయి వసిష్ఠునిపై ఉన్న కోపంతోనే తపస్సు చేసేడు.

చేసి ఎవరిని దర్శించేడు? అంటే **"దేవేశో వృషభధ్వజః"** అన్నారు మహర్షి.

అంటే పురాణములలో శివుడుకాదు. రామాయణం శ్రుతిశిశువు.
కనుక వేదమును ఆశ్రయించే అర్థం చెప్పుకోవాలి.
వేదమే కామములను వర్షించు వృషభము. **'వృషభో కామానాం వర్షణాత్, కామానాం జ్ఞానపూర్వకానుష్ఠాన పరత్వాత్'** అని పతంజలిహృదయాన్ని కైయటుడు ఆవిష్కరించేడు.
ఇప్పుడు విశ్వామిత్రుడు దర్శించినది శబ్దబ్రహ్మను. ఆయన చేసిన తపస్సు వేదమును మథించడమే. కనుకనే విద్యనే (ధనుర్వేదాన్ని) పొందేడు. విశ్వామిత్రుడు ఇంద్రియార్థములకు వశుడై తపస్సుచేసేడు.
దీని ఫలితం **దర్పపూర్ణోఽభవత్తదా** ఇంద్రియానుభవజన్యమైన కామక్రోధాదులు వృద్ధి పొందేయి.
ఈ బలంతో త్రిశంకునికి సుఖాన్ని ఇవ్వాలనుకొన్నాడు. దుఃఖం లక్ష్యంగాగల కర్మ సుఖాన్ని (స్వర్గాన్ని) ఇవ్వలేదు.
అంతరిక్షాన్ని లక్ష్యంచేసుకొని ప్రయోగించిన రాకెట్ చాలినంత సాంకేతిక, ఇంధన బలములేక తిరిగి భూమిని సమీపించినట్లుగా త్రిశంకువు క్రిందికి వచ్చేడు.
కోపమును ఆశ్రయించి ఉన్న విశ్వామిత్రుని అనునయిస్తూ ఓ తపోధనా! ఓ పూజ్యుడా! ఈ రాజు సశరీరముగా స్వర్గమునుగూర్చి వెళ్లుటకు అర్హుడుకాదు. ఎందుకని... అంటే

ఇంద్రియసుఖాలు శాశ్వతంకావని చెప్పిన వసిష్ఠునికాదని, ఇంద్రియ సుఖాలు శాశ్వతమనుకొని ప్రయత్నిస్తున్నాడు. కావున విపరీతబుద్ధి అని గురువుచే విడిచి పెట్టబడ్డాడు. వీడికి సుఖస్వరూపం తెలిసే అవకాశంలేదు. స్వర్గ ప్రవేశార్హత లేదు. మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రుడు దేవతల మాటలు విని వారితో...
మీకు భద్రమగుగాక! నేను త్రిశంకువును స్వర్గమునకు పంపెదనని ప్రతిజ్ఞచేసి, ఆ ప్రతిజ్ఞను అసత్యమును చేయుట నాకు ఇష్టంలేదు.

స్వర్గోఽస్తు సశరీరస్య త్రిశఙ్కోరస్య శాశ్వతః।

ఈ త్రిశంకువునకు సశరీరంగా శాశ్వత స్వర్గలోకవాసం కలగాలి మరియు నాచేత చేయబడిన ఈ సమస్తమైన నక్షత్రాదులు నావిగా ఈ లోకాలు ఉన్నంత వరకూ స్థిరంగా ఉండాలి.

ఓ దేవతలారా! మీరందరూ దానిని అనుమతించండి.

అని అడిగిన విశ్వామిత్రునితో దేవతలు...

ఓ మునిశ్రేష్ఠా! నీకు భద్రమగుగాక! ఈ ప్రసిద్ధమైన అనేకములైన నక్షత్రములు వైశ్వానరపథమునకు బయట ఆకాశమునందు అన్ని వైపుల ఉంటాయి. ఆ నక్షత్రములమధ్య ప్రకాశించుచూ త్రిశంకువుకూడా దేవతలతో సమానుడై తలక్రిందుగ నివసిస్తాడు.

ఈ నక్షత్రములన్నీ కృతార్థుడైన ఈ నృపసత్తముని స్వర్గలోకములో ఉన్నవారినివలె అనుసరిస్తాయి. అని సకల దేవతలు మునులు పలికేరు.

ధర్మాత్ముడు గొప్పతేజోవంతుడూ అయిన విశ్వామిత్రుడు సరే అని అంగీరించేడు.

తతో దేవా మహాత్మానో మునయశ్చ తపోధనాః
జగ్మూర్యథాగతం సర్వే యజ్ఞస్యాన్తే నరోత్తమ॥ ౩౪

నరోత్తమా రామా! యజ్ఞాన్తమునందు మహాత్ములైన దేవతలు తపోధనులైన మునులు అందరూ ఎలా వచ్చేరో అలానే వెళ్ళిపోయేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షష్టితమస్సర్గ సమాప్తము.

–

॥అథ ఏకషష్టితమః సర్గః॥

(విశ్వామిత్రుడు పుష్కరతీర్థమందు తపస్సుచేయుట. అంబరీషుడు ఋచీకుల వృత్తాంతము.)

విశ్వామిత్రో మహాత్మాథ ప్రస్థితాన్ ప్రేక్ష్య తాన్ ఋషీన్।
అబ్రవీన్నరశార్దూల సర్వాంస్తాన్వనవాసినః॥ ౧

ఓ నరశ్రేష్ఠుడా! రామా! తరువాత ప్రయాణమైన వనవాసులైన ఋషులను చూచి విశ్వామిత్రుడు...

దక్షిణదిక్కున గొప్ప విఘ్నము ఏర్పడినది. మరియొక దిక్కునకు పోయి తపస్సు చేసెదము.

మహాత్ములారా! విశాలమైన పశ్చిమదిక్కున పుష్కరక్షేత్ర మందు సుఖముగా తపస్సు చేసెదము. అది శ్రేష్ఠమైన తపోవనము. అని పలికెను.

మహాతేజశ్శాలి అయిన విశ్వామిత్రుడు ఈ విధంగా పలికి పుష్కరమందు దుంపలను ఫలములను మాత్రమే తింటూ అనితరసాధ్యమైన తపస్సును చేసెను.

ఈ కాలమందే అయోధ్యాధిపతి అయిన అంబరీషుడు అను రాజు యజ్ఞము చేయుట ప్రారంభించేడు.

యజ్ఞము చేయుచున్న అంబరీషుని యజ్ఞపశువును ఇంద్రుడు అపహరించేడు.

అప్పుడు బ్రాహ్మణులు అంబరీషునితో నీ అధర్మమువలన యజ్ఞపశువు నష్టమైనది. రాజా! యజ్ఞపశువును రక్షింపని రాజును దోషములు చంపును.

రాజా! ఇది గొప్ప ప్రాయశ్చిత్తము కలది. పశువు లభించనిచో మనుష్యునైననూ పశువుగా తీసుకొనిరమ్ము అప్పుడు యజ్ఞకర్మ జరుగగలదు.

రామా! బుద్ధిమంతుడైన రాజు ఉపాధ్యాయుని వాక్యమును విని వేలకొలది గోవులను ఇచ్చి నరపశువును అన్వేషించసాగెను.

నాయనా రఘునన్దనా! ఆ మహీపతి ఆయా దేశములను జనపదములను నగరములను వనములను పుణ్యమైన ఆశ్రమములను వెదకుచు భృగుతుంగ పర్వతమందు భార్యాసమేతుడై పుత్రులతోకూడి కూర్చొని ఉన్న ఋచీకుని చూసేడు.

మహాతేజస్సుకలవాడు అమితమైన ప్రకాశంకలవాడు అయిన ఆ రాజర్షి

అంబరీషుడు తపస్సుతో ప్రకాశిస్తూన్న బ్రహ్మర్షి ఋచీకునికి నమస్కరించి అనుగ్రహమింప చేసుకొని కుశలమును అడిగి మాట్లాడుతున్నాడు.

మహాభాగ్యవంతుడవైన భృగువంశమందు పుట్టిన ఋచీక మునీ! నూరువేల గోవులను తీసుకొని నీ కుమారుని యజ్ఞపశువుకొరకై అమ్మినట్లయితే నేను కృతార్థుడను అవుతాను.

సమస్తమైన దేశాలు సంచరించేను కానీ యజ్ఞపశువు లభించలేదు. మూల్యమునకు నీ కుమారులలో ఒకరిని నాకు ఇమ్ము అని అడిగేడు.

ఈవిధంగా అడుగబడిన ఋచీకుడు నేను ఎట్లైనను జ్యేష్ఠుని విక్రయించలేను. అని పలికేడు.

ఋచీకుని మాటలను విన్న తాపసి అయిన వారియొక్క తల్లి నరశ్రేష్ఠుడైన అంబరీషునితో

భృగువంశమందుపుట్టిన భగవాన్ ఋచీకుడు జ్యేష్ఠసుతుడు విక్రయింప తగని వాడని చెప్పేరు. రాజా! శుకుడను చిన్నవాడు నాకు ఇష్టునిగా తెలుసుకో. అందువలన చిన్నకుమారుని నీకు ఇవ్వను.

సాధారణంగా జ్యేష్ఠుడు తండ్రికి, చిన్నవాడు తల్లికి ఇష్టులుగా ఉంటారు. అందువలన నేను చిన్నవాడిని రక్షించుకొందును.

యజ్ఞం ధర్మకార్యం. దేశక్షేమంకొరకైనటువంటిది. కనుక దాని రక్షణబాధ్యత అందరిదీను. దానికొరకు త్యాగం చేయవలసివస్తే అది చేసి తీరవలసినదే. కనుకనే ఆ గృహస్థు ఇవ్వనని అనలేదు.

మొదటివాడు ధర్మ సంతానం. కర్మాధికారి. కావున ఇవ్వను అన్నాడు. మిగిలినవారు కామాన్ని ఆశ్రయించుకొని పుట్టేరు. మిగిలినవారినిగూర్చి మాట్లాడలేదు. ఆ ఇద్దరిలో ఎవరినైనా తీసుకొని వెళ్ళు లోకహితంకొరకైన యజ్ఞాన్ని పూర్తిచేసుకొ అని.

అంబరీషుడు సుక్షత్రియుడు కావున, రాజధర్మాన్ని అనుసరించి మాట్లాడు తున్నాడు. ప్రతిగా నీకు కొంత మూల్యాన్ని ఇచ్చి తీసుకొంటాను అని. పాలకుడు దాతయే కాని గ్రహీతకాకూడదు. అందకని ప్రతిగా నూరువేల గోవులను ఇస్తానని అనుట. భగవంతుడు బ్రహ్మర్షి అయిన ఋచీకుడు ఏది ధర్మమో

అది చెయ్యమని మిన్నకున్నాడు. అంతేకాని ఇది వస్తువిక్రయాల వంటిదికాదు. ఎప్పుడైనా కొరికలలో చివరిదానియందు అనురక్తి ఎక్కువగా ఉంటుంది. పూర్వోద్భవములైన కోరికలు కొంత అనుభవింపబడి ఉంటాయి కనుక వాటియందు అంత గాఢత ఉండదు. ఇది లోకరీతి, కనుక తల్లి చిన్నవాడిని ఇవ్వను అంది. అంతేకానీ మధ్యమునియందు ద్వేషంకాదు. లోకహితైషణులైన భార్యాభర్తలు ఇరువురూ త్యాగమునందు సమానమైన దృష్టినే కలిగి ఉన్నారు. అక్కడ ముగ్గురు ఉన్నారు కనుక ఈ విధమైన నిర్ణయం చేయవలసి వచ్చింది. ఇద్దరే ఉంటే రెండవ వాడిని ఇచ్చేవారే.

తండ్రి ఋచీకునియొక్క, తల్లియొక్క మాటలను విని ఋచీకపుత్రుడైన శునశ్శేఫుడు స్వయముగా మాట్లాడుతున్నాడు.

నిజముగా మధ్యమునియందు అనిష్టతే ఉంటే ముందే వీడిని తీసుకువెళ్ళండి అని అనాలి. సమానమైన వాత్సల్యం కలవారు కనుకనే మధ్యముని విషయమై మౌనాన్ని ఆశ్రయించేరు.

కావుననే శునశ్శేఫుడే మాట్లాడుతున్నాడు. రాజా! జ్యేష్ఠుని తండ్రి, కనిష్ఠుని తల్లి ఇవ్వనని చెప్పేరు. కావున మధ్యమ పుత్రుడనైన నేను ఇవ్వబడిన వాడినిగా తలచుచున్నాను. నన్ను తీసుకువెళ్ళు.

రఘునందనా! ఆ రాజు నూరువేల గోవులను ఇచ్చి శునశ్శేఫుని ఆనందంగా గ్రహించి వెళ్ళేడు.

అమ్బరీషస్తు రాజర్షీ రథమారోప్య సత్వరః।
శునశ్శేఫం మహాతేజా జగామాశు మహాయశాః॥ ౨౩

మహాతేజోవంతుడు గొప్పకీర్తిగలవాడు రాజర్షి అయిన అమ్బరీషుడు వెంటనే శునశ్శేఫుని రథము ఎక్కించుకొని శీఘ్రముగా వెళ్ళాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకషష్టితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ ద్విషష్టితమః సర్గః॥

(విశ్వామిత్రుడు శునశ్శేపుని రక్షించుట.)

శునశ్శేఫం నరశ్రేష్ఠ గృహీత్వా తు మహాయశాః।
వ్యశ్రామ్యత్పుష్కరే రాజా మధ్యాహ్నే రఘునన్దన॥ ౧

రఘునందనా! గొప్పకీర్తిగల ఆ రాజు శునశ్శేపుని గ్రహించి మధ్యాహ్నమందు పుష్కరక్షేత్రమందు విశ్రాంతి తీసుకొన్నాడు. రాజు విశ్రాంతి తీసుకొనుచుండగా శునశ్శేపుడు మిక్కిలి బాధపడుచున్నవాడై పుష్కరక్షేత్రమునకు వచ్చి ఋషులతో కూడి తపస్సుచేయుచున్న మేనమామ అయిన విశ్వామిత్రుని చూచేడు.
దప్పికచేతను శ్రమచేతను ముఖం రంగుమారిపోయింది. దీనంగా మునియొక్క ఒడిలో వెళ్ళిపడ్డాడు.
నాకు తల్లిదండ్రులులేరు. తల్లిదండ్రులే లేకపోతే ఇంక జ్ఞాతులు ఎక్కడ ఉంటారు? అందువలన నన్ను...

న మేఽస్తి మాతా న పితా జ్ఞాతయో బాన్ధవాః కుతః
త్రాతుమర్హసి మాం సౌమ్య ధర్మేణ మునిపుఙ్గవ॥ ౪

ధర్మేణ మాం త్రాతుమ్ నన్ను ధర్మముచేత రక్షించు.
న మేస్తి మాతా న పితా అని ఎందుకు చెప్పుకున్నాడు? అంటే యజ్ఞసంరక్షణార్థం నూరువేలగోవులకు ప్రతిగా విడిచిపెట్టబడ్డాడు. కావున మునిదంపతులు నా తల్లిదండ్రులు అని చెప్పకూడదు. వారు ఆ హక్కును విడిచేసారు. ఇప్పుడు తను అలా చెప్పుకుంటే ధర్మలోపం చేసినట్లు అగును. యజ్ఞరక్షణార్థమై యజ్ఞద్రవ్యంగా తీసుకురాబడుచున్నాడు కావున రాజసంబంధికుడూ కాడు. తాను ఇప్పుడు యజ్ఞద్రవ్యం.

త్రాతా త్వం హి మునిశ్రేష్ఠ సర్వేషాం త్వం హి భావనః
రాజా చ కృతకార్యః స్యాదహం దీర్ఘాయురవ్యయః
స్వర్గలోకముపాశ్నీయాం తపస్తాప్త్వా హ్యనుత్తమమ్॥ ౬

మునిశ్రేష్ఠా! నీవు అందరికి రక్షకుడవు కదా! సర్వులకు హితముచేయువాడవు కదా! రాజు కార్యము సఫలమగు నట్లును, నేను దీర్ఘాయువును కలవాడనై తపస్సుచేత నాశనము లేని స్వర్గమును సమీపించునట్లు చేయుము.

యజ్ఞము అధ్యయనము దానము తపస్సు బ్రహ్మచారి ఇవి ధర్మమునకు అంగములు. అంగ అంగీ భావముచేత వీటి సమష్టికి ధర్మమని పేరు.

పితేవ పుత్రం ధర్మాత్మం స్త్రాతుమర్హసి కిల్బిషమ్॥ ౭

రక్షకుడు లేని నాకు నీవు పవిత్రమైన మనస్సుతో రక్షకుడవు అగుము. ధర్మాత్ముడా! తండ్రి పుత్రుని పాపమునుండి రక్షించినట్లుగా, నన్ను రక్షించు.

పాపము అంటే...

అకార్యకార్యవకీర్ణా స్తేనో భ్రూణహా గురుతల్పగః చేయకూడని పనులు చేయడం, పిరికితనం, చౌర్యం, గర్భవిచ్ఛిత్తి చేయడం, గరుతల్పగమనం ఇవి పాపములు అని శ్రుతి చెప్తోంది. ఇవి పాపములు అని చెప్తూ తండ్రి పుత్రుని సంరక్షించుకొంటు ఉంటాడు.

అభిరక్షతి ఏవంవిద్ హ వై బ్రహ్మా యజ్ఞం యజమానం సర్వాన్ చ ఋత్విజః అభిరక్షతి. ఆవిధముగా యజ్ఞరక్షకుడైన ప్రాయశ్చిత్త సహితముగా దోషములను ఎరిగిన బ్రహ్మవలె యజ్ఞగతమైన దోషముల నుండి యజ్ఞమును యజమానిని ఋత్విక్కులందరినీ రక్షించు. అని ప్రార్థించేడు.

ఇప్పుడు తనయందున్న పాపము ఏమిటన్నది ప్రశ్న...

ప్రాణాపానపరిచలనవత్యా హి వాచశ్చితస్య చోత్తరక్రమో యద్యజ్ఞః అని ఐతరేయ బ్రాహ్మణము అంటుంది.

అంటే మనస్సుతో సంకల్పించుట వాక్కుతో మన్త్రమును ఉచ్చరించుట యజ్ఞము. యజ్ఞము ప్రవర్తిల్లుటకు ఇవే మార్గము. ఇవి సంస్కరింపబడినవిగా ఉండాలి. ఇప్పుడు తన మనస్సు అందుకు సిద్ధంగా లేదు. ఇప్పటి తన స్థితి త్యాగమునకు సిద్ధంగాలేదు. తను దీర్ఘాయువును పొందాలి కర్మలుచేయాలి, స్వర్గమును పొందాలి. ఇలా కామనాపూర్ణంగా ఉంది. అంటే ఇప్పుడు తను ద్రవ్యశుద్ధిలేని యజ్ఞద్రవ్యం. తనవలన రాజుకు యజ్ఞఫలావాప్తి కలుగదు. పైగా ఈ యజ్ఞమువలన యజమానుడు పాపమును పొందుతాడు. కనుక నన్ను రక్షించు. అంబరీషుడు యజ్ఞఫలాన్ని పొందు విధంగా రక్షించు.

దానికి నీవు మాత్రమే సమర్థుడవు. గొప్పతపస్సుగల విశ్వామిత్రుడు అతని మాటను విన్నాడు.

విని, చాలావిధాలుగా సాన్త్వనపరిచేడు. తన పుత్రులను ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. తల్లిదండ్రులు పరలోక హితమును అపేక్షించి సంతానాన్ని కనుట చేస్తారు. ఇప్పుడు ఆ సమయం వచ్చింది. మునికుమారుడైన ఈ బాలుడు నన్ను శరణుకోరేడు. పుత్రులారా! ఇతనికి జీవితాన్ని ఇచ్చి ప్రియాన్ని చేయండి. మిరందరూ ధర్మపరాయణులై పుణ్యకర్మలు చేసి ఉన్నారు. మీరు రాజునకు యజ్ఞపశులై అగ్నికి తృప్తికలిగించండి. ఈవిధంగాచేస్తే శునశ్శేఫుడు నాథవంతుడు అవుతాడు. యజ్ఞం నిర్విఘ్నంగా సాగుతుంది. నా మాట నిలబెట్టుకొన్నట్లుగా అవుతుంది. అని అన్నారు.

నరశ్రేష్ఠుడవైన రామా! మధుష్యందుడు మొదలైన విశ్వామిత్ర పుత్రులు...
ఓ ప్రభూ! సొంత బిడ్డలను విడచి, పరసుతులను రక్షించుట భోజనమందు కుక్కమాంశమును భుజించుట వంటిది అని విశ్వామిత్రుని అహంకారముతో పరిహాసం చేసేరు.

విశ్వామిత్రుడు పుత్రుల మాటలను విని క్రోధముచే ఎఱ్ఱబారిన కన్నులతో...

నిస్సాధ్వసమిదం ప్రోక్తం ధర్మాదపి విగర్హితమ్।
అతిక్రమ్య తు మద్వాక్యం దారుణం రోమహర్షణమ్॥ ౧౬

నా మాటను అతిక్రమించి ధర్మముచేతకూడా నింద్యమైన విధంగా దారుణంగా గగుర్పాటుకలిగించే విధంగా మాట్లాడేరు. ఇందులో ధర్మానికి విరుద్ధమైనది ఏముంది? అంటే **జీవతోవాక్యకరణాత్...** అనునది ధర్మం. బ్రతికి ఉన్నంతకాలం చెప్పినట్లు చేయాలి. మనం బ్రతికినంత కాలం లేదా తల్లిదండ్రులు బ్రతికినంత కాలం చెప్పినట్లు చేయాలి. అది ధర్మం. ఇప్పుడు తన మాటను త్రోసివేసేరు. మరొక ధర్మలోపం చేసేరు. వీరు క్షత్రియులు. శరణాగత రక్షణ అనేది క్షత్రియధర్మం. దానిని విస్మరించి సంస్కార రహితంగా మాట్లాడేరు. ఇది అధర్మం. ఔరసులు (తన సంతానం) కాదా అని శిక్షించడం మానలేదు. ఎందుకంటే? తను తండ్రి. కనుక వారిని సంస్కరించవలసిన ధర్మం తనయందు ఉంది. కనుక శపించేడు. అంతేకాని... వెధవకి... తెలివితేటలు...తెలివితేటలు అని వెనకవేసుకొని రాలేదు.

అలా చేస్తే వాణ్ణి వెధవను చేసిన దోషం వీడియందు ఉంటుంది.

మీరందరు పూర్తిగా వేయిసంవత్సరములు కుక్కమాంశమును భుజిస్తూ భూమిపై తిరగండి అని శపించేడు. ముని శ్రేష్ఠుడు పుత్రులను శపించి, దుఃఖిస్తూన్న శునశ్శేఫునకు రక్షచేసేడు. అతనిగూర్చి మాట్లాడుతున్నాడు.

నిన్ను విష్ణుదేవతాకమైన యూపస్తంభమునకు పవిత్రమైన పాశములచే కడతారు. రక్తవర్ణంకల మాలలను వేస్తారు. ఎఱ్ఱబట్టలు ధరింపచేస్తారు. ఆ సమయంలో అగ్నిని స్తుతించు. అని చెప్పేరు.

మునిపుత్రా! అంబరీషునియొక్క ఈ యజ్ఞములో ఈ రెండు దివ్యమైన గాథలను గానము చేయి. సిద్ధిని పొందగలవు. అని చెప్పి రెండు గాథలను ఉపదేశించేరు. సావధాన చిత్తుడై శునశ్శేఫుడు ఆ రెండు గాథలను గ్రహించేడు. తరువాత రాజసింహుడైన అంబరీషునితో యజ్ఞసదస్సునకు శీఘ్రముగా వెళ్ళు దీక్షితుడవై యజ్ఞము నిర్వర్తించు అని తొందరచేసేడు. ఋషిపుత్రుని మాటలను విన్న రాజు ఆనందంతో ఉత్సాహంగా ఆలస్యం లేకుండా యజ్ఞవాటమునకు వెళ్ళేడు. రాజు సదస్సుల అనుమతిపొంది ఆ శునశ్శేఫుని దర్భలచే పవిత్రునిగా చేసి ఎఱ్ఱని వస్త్రమును కట్టి యజ్ఞపశువుగా చేసి యూపస్తంభానికి కట్టేడు. కట్టబడిన ఆ మునికుమారుడు ఇంద్రుని ఉపేంద్రుని ఆ ఇద్దరు దేవతలను శ్రేష్ఠములైన వాక్కులచే యథాశాస్త్రముగా గానం చేసేడు.

రాఘవా! తరువాత రహస్య స్తుతిచే తృప్తిచెందిన ఇంద్రుడు ప్రీతుడై శునశ్శేఫునకు దీర్ఘాయువును ఇచ్చేడు. నరశ్రేష్ఠా రామా! అంబరీషుడుకూడా ఇంద్రుని అనుగ్రహము వలన అనేక రేట్లుగా యజ్ఞఫలమును పొందేడు.

విశ్వామిత్రోపి ధర్మాత్మా భూయాస్తే పే మహాతపాః।
పుష్కరేషు నరశ్రేష్ఠ దశవర్షశతాని చ॥ ౨౮

నరశ్రేష్ఠా! ధర్మాత్ముడును గొప్పతపస్సు కలవాడును అగు విశ్వామిత్రుడు పుష్కరమునందు మరల తపస్సు చేసేడు. విశ్వామిత్రుని తపస్సువలన అతనియందలి అహంకారం నెమ్మదించి దాని స్థానంలో కరుణ త్యాగం వృద్ధిచెందేయి.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **ద్విషష్టితమ స్సర్గ** సమాప్తము.

॥అథ త్రిషష్టితమః సర్గః॥

(విశ్వామిత్రుడు మహర్షిత్వము పొందుట. మేనకవలన తపోభంగము. బ్రహ్మర్షిత్వమునకై ఘోరమైన తపస్సును సంకల్పించుట.)

పూర్ణే వర్షసహస్రే తు వ్రతస్నాతం మహామునిమ్
అభ్యాగచ్ఛన్ సురాః సర్వే తపఃఫల చికీర్షవః॥ ౧

వ్రతస్నాతుడై వేయిసంవత్సరముల కాలము పూర్తి చేసినవాడు అగుచుండగా తపస్సునకు ఫలమును ఇవ్వదలచి సర్వ దేవతలు మహామునిని సమీపించేరు.

ఋషిస్త్వమపి భద్రం తే స్వార్జితైః కర్మభిః శుభైః॥ ౨

వృద్ధిక్షయములు లేని గొప్పతేజస్సుగల బ్రహ్మ నీ స్వార్జితమైన పుణ్యకర్మలచే ఋషి అయినావు. నీకు భద్రమగుగాక! అని విశ్వామిత్రునిగూర్చి పలికేడు.
విశ్వామిత్రుడు ప్రతిఫలాపేక్ష రహితంగా సంపాదించుకొన్న పుణ్యవిశేషం శునశ్శేపుని రక్షించు నిమిత్తంగా తన పుత్రులను యజ్ఞపశువుగా ఇచ్చుటకు సిద్ధపడుట.
ఇది అంతఃకరణం శుద్ధమగుచున్నదను విషయమును సూచిస్తోంది.
త్రిశంకుని స్వర్గమునకు పంపు సందర్భమున తన సృజనయొక్క శాశ్వతత్వమును కోరుకున్నాడు. అక్కడ తన పౌరుషప్రకటనము ఉంది.
దేవేశుడు (బ్రహ్మ) విశ్వామిత్రునిగూర్చి ఈవిధంగా పలికి త్రిదివమునకు వెళ్లేడు. మహాతేజస్సుగల విశ్వామిత్రుడు మరల తపస్సు ప్రారంభించేడు.
నరశ్రేష్ఠా రామా! చాలాకాలమునకు మేనక అనే గొప్ప అప్సరస్త్రీ పుష్కరప్రదేశమునందు ఉపక్రమించింది. గొప్పతేజశ్శాలి అయిన కుశికాత్మజుడు పుష్కరమందు మేఘమునందు మెఱుపువలె సాటిలేని రూపముగల మేనకను చూసేడు.
చూచి, మన్మథునకు వశుడై ఓ అప్సరా! నీకు స్వాగతం. నా ఈ ఆశ్రమమున నివసింపుము. మన్మథునిచేత బాగుగా మోహితుడనైన నన్ను అనుగ్రహించు. నీకు శుభము కలుగుగాక!
అని విశ్వామిత్రుడు పలుకగా ఆమె అచట నివసించెను. పది సంవత్సరములు సుఖముగా వెళ్లిపోయేయి.

పది సంవత్సరాలు గడచిన తరువాత విశ్వామిత్రుడు చింతాశోకపరాయణుడై సిగ్గుపడ్డాడు. విశ్వామిత్రుడు కోపముతోకూడి ఇది అంతయూ గొప్పదైన నా తపోహరణముకొరకైన దేవతల పని.

కామమోహాలచే ఆవహింపబడిన నాకు పది సంవత్సరాల కాలం రాత్రిపగలు అంటూనే గడచిపోయాయి. ఈ విధంగా నా తపస్సుకు విఘ్నం వచ్చింది.

రామా! మునివరుడైన కుశికాత్మజుడైన విశ్వామిత్రుడు పశ్చాత్తాపముచే దుఃఖించుచున్నవాడై నిట్టూర్చుచూ అంజలిబద్ధురాలై భయముచే వణకుచూ నిల్చున్న మేనకను చూచి మధురముగా మాట్లాడి అమెను విడచి హిమవత్పర్వతములనుగూర్చి వెళ్ళేరు.

రామా! అతడు స్థిరత్వాన్నిగూర్చిన దృఢనిశ్చయాన్ని చేసుకొని **జేతుకామః** జయించాలను కోరిక కలవాడై కౌశికీనదీ తీరమును పొంది వేయి సంవత్సరములు దారుణమైన తపస్సును చేసేడు. ఆ తపస్సునకు దేవతలకు భయము కలిగినది.

వశిష్ఠుని జయించాలను కోరిక ఆంతరంగా ఉంది. అంటే ఎదర ఇంకా విఘ్నాలు కలుగుతాయి. ఎందుకని అంటే జయింపవలసినది బయటే ఉందను కొంటున్నాడు. ఆంతరమైన ఇన్ద్రియజయాన్నిగూర్చి విచారించుటలేదు.

కౌశికీతీరంలో హిమవత్పర్వతముపై వేయిసంవత్సరములు ఘోరమైన తపస్సుచేయుచుండగా **దేవతానామభూద్భయమ్** దేవతలకు భయం వేసింది. దేవతలు అంటే సాత్త్వికమైన గుణములు ఇంతవరకూచేసిన తపస్సుకు ఫలంగా అన్తఃకరణము శుద్ధతను పొందుతోంది. కరుణరసార్ద్రమైంది. త్యాగము వంటబట్టింది. కానీ వసిష్ఠుని జయించాలి అనే ఆ క్షాత్రవాసనపోలేదు. అది భయానికి కారణం.

ఋషిగణములతోకూడిన దేవతలు ఈ కుశకాత్మజుడు బాగుగా మహర్షిశబ్దమును పొందుగాక! అని నిర్ణయించేరు.

సర్వలోకపితామహుడు దేవతల వాక్యమును విని తపోధనుడైన విశ్వామిత్రుని గూర్చి...

మహర్షేస్వాగతం వత్స తపసోగ్రేణ తోషితః।

ఓ మహర్షీ! వత్సా! స్వాగతం. ఉగ్రమైన తపస్సుచేత సంతోషింపచేసావు. కౌశికా! నీకు మహత్త్వమును ఋషిముఖ్యత్వమును ఇచ్చుచున్నాను. అన్నారు.

బ్రహ్మణః స వచః శ్రుత్వా సర్వలోకేశ్వరస్య హ
న విషణ్ణో న సన్తుష్టో విశ్వామిత్రస్తపోధనః॥ ౧౮

తపోధనుడైన విశ్వామిత్రుడు సర్వలోకేశ్వరుడైన బ్రహ్మయొక్క మాటను విని విషాదమును పొందలేదు. సంతోషించలేదు.

అంజలిబద్ధుడై నమ్రతతో సర్వలోకపితామహునిగూర్చి మాట్లాడుతున్నాడు. భగవన్! నీవు నా స్వార్జిత పుణ్యకర్మలచేత సాటిలేని మహర్షిత్వము లభించిందని చెప్పుచున్నావు, అంటే నేను జితేంద్రియుడను అయితినని అనుకొన్నాడు.

తమువాచ తతో బ్రహ్మా ప తావత్త్వం జితేన్ద్రియః।
యతస్వ మునిశార్దూల ఇత్యుక్త్వా త్రిదివం గతః॥ ౨౨

విశ్వామిత్రుడు ఆవిధంగా అనుకొన్న వెంటనే "నీవు జితేంద్రియుడవు మాత్రము కాదు. మునిశార్దూలా! ఇంకనూ ప్రయత్నింపుము" అని త్రిదివమునకు వెళ్లెను. దేవతలుకూడా ప్రయాణమైన పిమ్మట విశ్వామిత్రుడు బాహువులు పైకిఎత్తి వాయుభక్షకుడై తపస్సును చేయసాగెను.

తపోధనుడు గీష్మర్తువునందు పంచాగ్నిమధ్యమున వర్షాకాలమందు ఆరుబయట శిశిరమునందు రాత్రి పగలు నీటియందుండి ఈ విధంగా వేయిసంవత్సరములు తపస్సుచేసేదు.

సంభ్రమః సుమహానాసీత్సురాణాం వాసవస్య చ॥

మహాముని తపస్సుచూసి దేవతలకు వాసవునకు గొప్పదైన భయము కలిగింది. ఎందుకని భయము అంటే ఇప్పటి ప్రయత్నం ఇన్ద్రియజయార్థం. వాసనాక్షయం అయితే వీరికి ఉనికి ఉండదు. కనుక...

రమ్భామప్సరసం శక్రః సహసర్వైర్మరుద్గణైః
ఉవాచాత్మహితం వాక్యమహితం కౌశికసకయ చ॥ ౨౮

శక్రుడు సమస్తమైన మరుద్గణములతో కూడినవాడై తనకు హితమైనదియు కౌశికునకు హితముకానిది అయిన మాటను రంభ అను అప్సరస్త్రీతో పలికెను.

ఇంద్రియములు అహోరాత్రులు శ్రమపడి ప్రోగుచేసుకొన్న అనుభవసార రూపమైన సంపద ఈ వాసనలు. ఈ సంపదకు ప్రభువు వాసవుడు. ఇప్పుడు వీటిని జయిస్తే చాలాకాలంగా భద్రపఱుచుకొంటూ వస్తూన్న ఈ సంపద అంతా పోతుంది. అందువలన ఇంద్రియాలు మనస్సుతో కలిసి తమను తాము రక్షించుకొనే ప్రయత్నాలు సాధకునకు అపజయాలు కలుగచేసే ప్రయత్నాలు చేస్తాయి.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రిషష్టితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ చతుష్షష్టితమః సర్గః॥

(విశ్వామిత్రుడు తన తపస్సును భగంచేయుటకు వచ్చిన రంభను శపించుట. బ్రహ్మర్షిత్వమునకై ఘోరతపస్సు చేసెదనని ప్రతినపూనుట.)

సురకార్యమిదం రమ్భే కర్తవ్యం సుమహత్త్వయా।
లోభనం కౌశికస్యేహ కామమోహసమన్వితమ్॥ ౧

ఓ రంభా! ఇప్పుడు కౌశికుని కామమోహితుని చేసి గొప్పదైన ఆశకల్పించవలెను. ఇది దేవకార్యము. నీ కర్తవ్యము.

బుద్ధిమంతుడైన సహస్రాక్షునిచేత ఆ విధంగా పలుకబడిన ఆ అప్సరస సిగ్గుపడుచు అంజలిఘటించి సురేశ్వరునితో...

ఓ సురపతీ! ఈ విశ్వామిత్ర మహాముని భయంకరుడు. దేవా! నాయందు భయంకరమైన క్రోధమును చూపును. సంశయము లేదు. అందువలన నాకు భయముకలుగు చున్నది. నన్ను అనుగ్రహింపుమని భయముతో వణకుచూ అంజలిఘటించియున్న రంభతో...

సహస్రాక్షుడు ఓ రంభా! భయపడకు. నీకు భద్రమగుగాక! నా శాసనమును చేయుము. నేను అందమైన వృక్షములుగల వసంతర్తువునందు హృదయగ్రాహి అయిన కోకిలగా మన్మథసమేతుడనై నీ ప్రక్కనే ఉండగలను. రంభా! నీవు శృంగారాది అనేక గుణములుగల పరమశోభాయమానమైన రూపమును ధరించి తపస్వి ఋషి అయిన కౌశికుని తపస్సునుండి విడదీయుము.

లోభయామాస లలితా విశ్వామిత్రం శుచిస్మితా॥

ఆమె సహస్రాక్షునియొక్క వచనమును విని అత్యుత్తమమైన శృంగార రసప్రధానమైన రూపమును ధరించి శుచిస్మితయై అంటే సంస్కరింపబడిన నవ్వుగలదై అంటే మనోగతమైన మాలిన్యాన్ని (పరులచే నియోగింపబడిన విషయమును) బయటకు కనబడనీయకుండా వశ్యకరమైన నవ్వుగలదై విశ్వామిత్రుని ఆశపెట్టెను. లేదా అది వసంతర్తువు. మనస్సును రజింపచేసే ప్రకృతిశోభ. స్త్రీసహజమైన కామముచే రతి చేష్టితయై సహజంగానే నవ్వింది. విశ్వామిత్రుడు మధురంగా కూయుచున్న కోకిలధ్వనిని విన్నాడు.

మిక్కిలి సంతోషం నిండిన మనస్సుతో ఈమెను చూసేడు.
తరువాత ఆ కోకిలధ్వనిచేతను గానముచేత రంభయొక్క దర్శనముచేతను ముని సందేహాన్ని పొందేడు.
మునిశ్రేష్ఠుడైన కుశికాత్మజుడు ఇదంతా సహస్రాక్షుని పనిగా తెలుసుకొని క్రోధముతో కూడినవాడై రంభను శపించేడు.
దౌర్భాగ్యురాలా! రంభా! కామక్రోధములను జయించవలెనని కోరుచున్న నన్ను ఎందువలన ఆశపెట్టుచున్నావో అందువలన పదివేలసంవత్సరాలు ఱాయిగా ఉండు అని శపించేడు.
ఓ రంభా! గొప్పతేజస్సుకలవాడు తపోబలసమన్వితుడు అయిన బ్రాహ్మణుడు నా క్రోధముచే పీడింపబడిన నిన్ను ఉద్ధరించగలడు.
గొప్పతేజస్సుకలవాడు మహాముని అయిన విశ్వామిత్రుడు
క్రోధమును నిగ్రహించుకొను సామర్థ్యములేనివాడై పశ్చాత్తాపమును పొందేడు.
మహర్షి శాపకారణంగా రంభ ఱాయిగా అయింది. విశ్వామిత్రుని మాటలను విన్న మన్మథుడు సహస్రాక్షుడు అక్కడనుండి జాఱుకున్నారు.
ఇక్కడ విశ్వామిత్రుని సహస్రాక్షుడు పరీక్షిస్తున్నాడు.
అంటే తన మనస్సే ప్రకృతిగతమైన సౌందర్యంచేత తనలో ఉండే కామమును బహిర్గతంచేసి స్త్రీయందు ఆశను కలిగిస్తోంది.
ఇతఃపూర్వపు స్త్రీ (మేనక) విషయంలో తనయందలి కామం స్వాభావికము అగుటచే అది అనుభవింపబడుతూ వచ్చి చాలాకాలం తరువాత గుర్తించేడు.
ఇప్పుడు పరణతిచెందిన తపస్సువలన తనలో కలిగిన కామవికారాన్ని గుర్తించి అణచివేసే ప్రయత్నంచేసేడు. ఆ ప్రయత్నంలో తనలో ఉన్న క్రోధం బహిర్గతం అయింది.
కామం ఉంటే క్రోధం ఉంటుంది. క్రోధం ఉంటే కామమూ ఉంటుంది. కామ క్రోధములు కవలలు.
కోపంకారణంగా విశ్వామిత్రుని తపస్సు క్షీణించింది.
ఇంద్రియములు జయింపబడక పోవుటచే మనశ్శాన్తి లేకుండాపోయింది.

ఈవిధంగా తపస్సు హరింపబడుటచే ఆలోచనలోపడ్డాడు. నేను కోపమును పొందను ఏమైనా మాటకూడా మాట్లాడను. అని నిశ్చయించుకొన్నాడు.
అనేక సంవత్సరములు ఊపిరివిడువను. శరీరమును శుష్కింపజేసి నేను ఇంద్రియ జయము కలవాడను అగుదును.
నాకు తపస్సుచేత సంపాదింపబడిన బ్రాహ్మణ్యము ఎప్పటికి పొందబడునో అప్పటివరకు అనేక సంవత్సరములు ఊపిరి విడువని వాడనై ఆహారమును భుజించను. తపస్సు చేయుచున్నంతవరకూ ఉపాధి క్షయమును పొందదు.
ఇక్కడ వాల్మీకిమహర్షి మనోజయానికి శ్రుతిసమ్మతమైన ప్రాణాయామాన్ని ఆహారనియమాన్ని చెప్పేరు.

ఏవం వర్షసహస్రస్య దీక్షం సమునిపుఙ్గవః
చకారాప్రతిమాం లోకే ప్రతిజ్ఞాం రఘునన్దన॥ ౨౦

రఘునన్దనా! ఆ మునిపుఙ్గవుడు ఈ విధంగా లోకమునందు సాటిలేని వేయిసంవత్సరముల దీక్షనుగూర్చి ప్రతిజ్ఞనుచేసేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుష్షష్టితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ పఞ్చషష్టితమః సర్గః॥

(విశ్వామిత్రుని ఘోరమైన తపస్సునకు బ్రాహ్మణత్వము లభించుట. జనకుడు విశ్వామిత్రుని ప్రశంసించుట.)

అథ హైమవతీం రామ దిశం త్యక్త్వా మహామునిః
పూర్వాం దిశమనుప్రాప్య తపస్తేపే సుదారుణమ్॥ ౧

రామా! విశ్వామిత్రుడు హిమవత్పర్వత సంబంధమైన దిక్కును విడచి తూర్పు దిక్కును చేరి చాలాదారుణమైన తపస్సును చేసేడు. వేయి సంవత్సరములు చాలాగొప్పదైన మౌనవ్రతమును పాటిస్తూ అనితరసాధ్యమైన పరమదుష్కరమైన తపస్సుచేసేడు.

అంటే త్రికరణశుద్ధిగా మౌనాన్ని ఆశ్రయించేడు. మనోగతమైన సంకల్పాలు ఉంటే తత్సంబంధమై వాగింద్రియం పనిచేస్తుంది. మౌనం సాధ్యపడదు. మౌనం అంటే పైకి మాట్లాడకుండా కూర్చొని పలకపైన కాగితంపైన వ్రాసి చూపించడంకాదు.

వేయిసంవత్సరముల కాలము పూర్తి అయింది. మహాముని కట్టెవలె అయ్యేడు. ఎన్నో విఘ్నాలు వచ్చేయి. అతని మనస్సులో మాత్రం క్రోధం కలుగలేదు. దృఢనిశ్చయంతో నాశనము లేని తపస్సును చేసేడు.

రఘూత్తమా! వేయిసంవత్సరముల వ్రతము పూర్తిఅయింది. మహావ్రతుడైన విశ్వామిత్రుడు సిద్ధాన్నమును తినుటకు ఉపక్రమించేడు. ఆ సమయంలో ఇంద్రుడు బ్రాహ్మణరూపంలో మహర్షిని అన్నం యాచించేడు.

గొప్పతపస్సుకలవాడు మౌనవ్రతమునందున్న భగవాన్ విశ్వామిత్రుడు నిశ్చయాత్మక బుద్ధితో సిద్ధాన్నమును అంతనూ విప్రునికొరకు ఇచ్చేడు. విప్రరూపుడైన ఇంద్రుడు నిశ్శేషముగా భుజించేడు. విశ్వామిత్రుడు నిరాహారిగా ఉండిపోయేడు. ఆ బ్రాహ్మణుని మాత్రము ఏమీ అనలేదు.

ఇక్కడ విశ్వామిత్రుని మనస్సు సంకల్పాలు చేయట్లేదు. కావున అన్నం ఇలా ఉండాలని మనస్సు చెప్పటంలేదు. కనుక ఇప్పుడు దేహధారణార్థమై తినదగిన పదార్థం ఏది దొరికితే అదే అన్నము.

సిద్ధాన్నము అంటే శరీరధారణకొరకై ప్రకృతిసిద్ధంగా లభించే ఆహారము.

తను తపస్సుచేసుకొనే ప్రాంతంలో తినుటకు యోగ్యమైన పదార్థములను సంపాదించుకొన్నాడు. దాన్ని విప్రరూపంలో వచ్చి గ్రహించేడు. ఉన్న దానిలో కొంత తీసుకోవడంకాదు. ఉన్నదంతా గ్రహించేడు.

అయినా మౌనం వీడలేదు.

అంటే మనస్సునందుకూడా ఏ విపరీతభావనా చేయలేదు. అంటే పదిమందిలో ఇచ్చి ప్రక్కన బాధపడటం, సమయం చూసుకొని వచ్చాడు ఇవ్వక తప్పిందికాదు అని అనుకోలేదు. అసలు ఇచ్చాను అనే భావనకూడా లేకుండా ఉన్నాడు.

ఈ లక్షణం శ్రీరామునియందు ఉంది. కిష్కింధాకాండలో

తవ ప్రసాదేన నృసింహ! రాఘవ!
ప్రియాం చ రాజ్యం చ సమాప్నుయామహమ్।
తథా కురు త్వం నరదేవ! వైరిణమ్
యథా నిహంస్యద్య రిపుం మమాగ్రజమ్॥ అని సుగ్రీవుడు అడిగేడు. శ్రీరాముడు ఇచ్చేడు. నేను ఇచ్చేను అనే భావన లేకుండా ఇచ్చేడు. కనుకనే **'అహం చ లక్ష్మణశ్చైవ సీతా చ వరవర్ణినీ, త్వ దధీనా వయం సర్వే వనేస్మిన్ శరణం భవాన్'** అని అంటారు రామచన్ద్రమూర్తి. ఇది రామునకు పుట్టుకతో వచ్చింది. విశ్వామిత్రుడు పరమదారుణమైన ప్రయత్నంతో సాధించేరు.

తరువాత మునిపుంగవుడు వేయి సంవత్సరములు ఉచ్ఛ్వసించ కుండా తపస్సు చేసేడు. అంటే కేవల కుంభకమునందు ఉండి తపస్సు చేసేడు.

ఇవిధంగా చేయుటచే అతని శిరస్సునుండి ధూమము పుట్టింది. దానితో మూడులోకాలు భయపడి కళావిహీనం అయిపోయేయి.

గంధర్వ సహితంగా సురాసురులు పన్నగులు మహర్షియొక్క తేజస్సుచే తెలివితప్పినవారై అతని తపస్సుచేత తేజోవిహీనులై బ్రహ్మదేవునిగూర్చి వెళ్ళేరు. ఓ దేవా! మహాముని అయిన విశ్వామిత్రుని అనేక విధాలుగా లోభపెట్టిననూ తపస్సుచే వృద్ధి పొందుచూనే ఉన్నాడు.

ఇతనియందు ఇసుమంత అయినా పాపము కనబడుటలేదు. ఇతడు మనసా ఏది కోరుకొన్నాడో అది ఇవ్వకున్నచో తపస్సుచేత చరాచరాత్మకమైన లోకత్రయమును నశింపచేయగలడు.

దిక్కులు వ్యాకులమైనాయి. సాగరాలు క్షోభిస్తున్నాయి. పర్వతాలు బ్రద్ధలవుతున్నాయి.

హేబ్రహ్మన్! ఈ భూమికూడా కంపించుచున్నది. వాయువు చాలా వ్యాకులమై వీచుచున్నది. జనులు నాస్తికులుగా అగుచునాన్నరు. మాకేమి చేయవలెనో తెలియకున్నది.

లోకత్రయము బాగుగా క్షోభించిన మనస్సుకలదై మూర్ఛ పొందినట్లున్నది. ఆ మహర్షి తేజస్సుచేత సూర్యుడుకూడా కాంతిహీనుడైనాడు.

ఓ దేవా! ఈ మహాముని ముల్లోకాలను నాశనము చేయకముందే అగ్నితుల్యుడు గొప్పకాంతికలవాడు అయిన భగవాన్ విశ్వామిత్రుని ప్రసన్నుని చేయుము. పూర్వము ముల్లోకములు కాలాగ్నిచేత ఎట్లు దహింపబడెనో అట్లే సమస్త దేవరాజ్యము ఇప్పుడు దహింపబడగలదు. కావున ఇతనికి ఏది అభిమతమో అది ఇవ్వవలసినది అని, అటుపై

తతః సురగణాః సర్వే పితామహపురోగమాః।

బ్రహ్మముందుగా గల దేవతలందరూ మహాత్ముడైన విశ్వామిత్రునితో...

ఇంతవరకు దశరథుని పుత్రీయేష్టి సమయమునగాని, గౌతముడు ఇంద్రుని శపించిన సందర్భమునగాని దేవతలను అగ్నిపురోగాములని చెప్పేరు. ఇక్కడ యజమాని కర్మసంబంధము కలవాడు అగుటచే దేవతలు అగ్ని పురోగాములని చెప్పేరు.

ఇప్పుడు ఇక్కడ విశ్వామిత్రుడు బ్రహ్మవేత్త. కర్మసంబంధము లేనివాడు, కనుకనే దేవతలు బ్రహ్మపురోగాములు అయేరు.

బ్రహ్మర్షే స్వాగతం తేస్తు తపసా స్మ సుతోషితాః
బ్రాహ్మణ్యం తపసోగ్రేణ ప్రాప్తవానసి కైశిక॥ ౧౯

ఓ బ్రహ్మర్షీ! నీకు స్వాగతము అగుగాక! తపస్సుచేత బాగుగా సంతోషించేము. కౌశికా! ఉగ్రమైన తపస్సుచేత బ్రాహ్మణ్యమును పొందితివి.

ఓ బ్రాహ్మణా! మరుద్గణసమేతుడనైన నేను నీకు దీర్ఘాయువునుకూడా ఇచ్చుచున్నాను. నీకు క్షేమమగుగాక! నీకు భద్రమగుగాక! ఓ సౌమ్యుడా! సుఖముగా వెళ్ళుము.

ఇక్కడవరకూ విశ్వామిత్రుని ఉపాఖ్యానంద్వారా
తస్మాద్బ్రాహ్మణః పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్। బాల్యం చ పాడిత్యం చ నిర్విద్యాథ మునిరమౌనం చ మౌనం చ నిర్విద్యాథ బ్రాహ్మణస్స బ్రాహ్మణః కేన స్యాద్యేన స్యాత్తేనేదృశ ఏవాతోఽ_స్యదార్తం తతో హ కహోలః కౌషీతకేయ ఉపరరామ అను బృహదారణ్యక శ్రుతి వ్యాఖ్యానించింది.
ఇతరులకు ఆత్మజ్ఞానదూరులైన వారికి సాధనములను ఆశ్రయించి కర్మఫలములను పొందుటయే బలము. ఇది అజ్ఞానావస్థ కౌశికుని ప్రయాణం ఇక్కడనుండే మొదలు. తరువాత బ్రహ్మజ్ఞానమనే బలము ఏది ఉందో అదే బలమని గ్రహించేడు. ఇది మాత్రమే ఆశ్రయింపతగినదని గ్రహించేడు. ఇంద్రియములు తిరిగి ఏషణయందు ప్రవేశపెట్టే ప్రయత్నంచేసేయి. ఆత్మజ్ఞానముయొక్క నిశ్చయాత్మకబుద్ధితో స్థిరంగా ఉండాలని కోరుకొన్నాడు కావున ఇంద్రియాలు ఇతనిని ఏషణల పరిధిలోనికి లాగుకొని పోయే సామర్థ్యం లేనివైనాయి.
ఈ బుద్ధిబలము మరియు ఆత్మజ్ఞానము పూర్తిగా సంపాదించి మననశీలతను కలిగి ఉండాలి. ఈ స్థితిలో మనోవృత్తులన్నింటినీ నిరాకరించాలి. ఆత్మజ్ఞానము మరియు అనాత్మప్రత్యయ తిరస్కారము అను రెండుకలిపి అమౌనమని చెప్పబడుతున్నాయి. అమౌనసాధన ఫలమే మౌనము. మౌనం అంటే అనాత్మప్రత్యయ తిరస్కరణ పర్యవసాయ ఫలం (ప్రశాంతత). దీనినికూడా నిర్వర్తిస్తే బ్రహ్మజ్ఞాని. ఇప్పుడు విశ్వామిత్రుడు బ్రహ్మజ్ఞానము మనన మౌనములు కలవాడైయేడు కావున బ్రహ్మర్షి అని పిలవబడ్డాడు. ఇటువంటి వాడిని మాత్రమే బ్రాహ్మణుడని శ్రుతిచెప్పింది.
వాల్మీకి అడుగడుగునా శ్రుతివాక్యాలను ఉపాఖ్యానాలరూపంగా అందించేరు. మహామునియైన విశ్వామిత్రుడు సమస్తమైన దేవతలయొక్క బ్రహ్మయొక్క వాక్కులను విన్నాడు. విని... నాకు బ్రాహ్మణ్యము దీర్ఘమైన ఆయువు లభించినట్లయితే ఓంకార వషట్కారములు వేదములు నన్ను వరించుగాక! అని అడిగేడు. అంటే నాకు వేదములను ఉపదేశించు అర్హత యజ్ఞయాగాదులను చేయించు అర్హత లభించుగాక! అన్నాడు.

దేవతలారా! క్షత్రవేదవిదుడు అంటే ధనుర్వేదము తెలిసినవాడు, బ్రహ్మవేదవిదుడు అంటే ఋగ్వేద సామవేద యజుర్వేదములను ఎరిగినవారిలో శ్రేష్ఠుడైన బ్రహ్మపుత్రుడైన వసిష్ఠుడు నన్ను బ్రహ్మర్షియని అంగీకరించుగాక! ఈ గొప్పదైన కోరికను మీరు ఇచ్చినట్లయితే మీరు వెళ్ళవచ్చు.

తతః ప్రసాదితో దేవైర్వసిష్ఠో జపతాం వరః

పిమ్మట దేవతలయందు అనుగ్రహబుద్ధితో జపముచేయు వారలలో శ్రేష్ఠుడైన వసిష్ఠుడు, విశ్వామిత్రునితో సఖ్యతను పొంది నీవు బ్రహ్మర్షివి అని పలికేరు. దేవతలుకూడా విశ్వామిత్రునిగూర్చి నీవు బ్రహ్మర్షివే. సందేహము లేదని పలికేరు. విశ్వామిత్రునిచేత ఈవిధంగా బ్రాహ్మణ్యము పొందబడినది.
రామా! ఇతడు మునులలో శ్రేష్ఠుడు. ఇతడు ధర్మపరుడు వీర్యమునకు నివాస స్థానము. ఇతడు మూర్తీభవించిన తపస్సు.
మహాతేజస్సుగల ద్విజశ్రేష్ఠుడైన శతానందుడు ఈవిధంగా పలికి విరమించేడు.
జనకుడు రామలక్ష్మణుల సన్నిధిలో శతానన్దుని వాక్యములను విని అంజలి బద్ధుడై కుశికాత్మజునితో...
ఓ ధార్మికుడా! మునిపుఙ్గవా! కాకుత్థ్ససహితుడవై నా యజ్ఞమునకు వచ్చితివి. నేను ధన్యుడనైతిని. అనుగ్రహింపబడ్డాను.
ఓ మహామునీ! బ్రాహ్మణోత్తమా! నీ దర్శనముచేతనే నేను పవిత్రుడనైతిని. నీయొక్క దర్శనమువలన నేను అనేక విధములైన గుణములను (లాభాలను) పొందేను.
మహాతేజస్సుగల ఓ బ్రహ్మర్షీ! సవిస్తరముగా కీర్తింపబడిన నీయొక్క తపస్సును గూర్చి మహాత్ముడైన రామునితోకూడి నేను విన్నాను.

అప్రమేయా గుణాశ్చైవ నిత్యం తే కుశికాత్మజ॥ ౩౪

యజ్ఞవాటికలో ఉన్న సదస్యులు అందరూ విన్నారు. నీ తపస్సు నీ బలము నీ గుణములు నిత్యముగా కొలతకు అందనివి. అంటే సంకల్పసిద్ధికై ఇంత మహోగ్రముగా ప్రయత్నించినవాడు కాలత్రయంలో లేడని అన్నారు.
హే విభో! ఆశ్చర్యకరములైన నీయొక్క కథల విషయంలో నాకు ఇంకా

తృప్తికలుగలేదు. కానీ సూర్యమండలం వ్రేలాడుతోంది. ఇది నిత్యకర్మకాలం. మహాతేజస్సుగల విశ్వామిత్రుడా! రేపు ప్రభాతవేళ నన్ను తిరిగిచూడచ్చు. శ్రేష్ఠుడా! నీకు స్వాగతం. తిరిగివెళ్ళుటకు నాకు అనుజ్ఞను ఇమ్ము. అని జనకుడు పలుకగా... ప్రీతమనస్కుడైన విశ్వామిత్రుడు సంతోషాంతరంగుడైన జనకుని ప్రశంసించి తొందరగా విడిచిపెట్టేడు.

విదేహదేశాధిపతి అయిన మిథిలాపతి ఉపాధ్యాయులతో బంధువులతో కలిసి విశ్వామిత్రునకు ప్రదక్షిణము చేసేరు.

విశ్వామిత్రోపి ధర్మాత్మా సహరామః సలక్ష్మణః
స్వవాటమభిచక్రామ పూజ్యమానో మహర్షిభిః॥ ౩౯

ధర్మాత్ముడైన విశ్వామిత్రుడుకూడా రామలక్ష్మణులతో కూడినవాడై మహర్షులతో పూజింపబడుచున్నవాడై తన నివాసస్థానమునకు వెళ్ళేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ద్వ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చషష్టితమ స్సర్గ సమాప్తము.

-

॥అథ షట్ష ష్టితమః సర్గః॥

(జనకుడు విశ్వామిత్రుని రామలక్ష్మణులను యథోచితంగా గౌరవించి శివధను ర్వృత్తాంతమును చెప్పాడు. రాముడు ధనుస్సునకు నారిని సంధించినచో సీతను ఇచ్చెదనని ప్రకటించుట.)

తతఃప్రభాతే విమలే కృతకర్మా నరాధిపః
విశ్వామిత్రం మహాత్మానమాజుహావ సరాఘవమ్॥ ౧

తెల్లవారిన పిమ్మట రాజు కృతకర్ముడై అంటే నిత్యకృత్యములను పూర్తిచేసుకొని మహాత్ముడైన విశ్వామిత్రుని రాఘవులతో సహా ఆహ్వానించేరు.

ధర్మాత్ముడైన జనకుడు యథాశాస్త్రముగా పూజించి అప్పుడు మాట్లాడుతున్నాడు. హేఅనఘా! భగవన్! నీకు స్వాగతము అగుగాక. నీవు నన్ను ఆజ్ఞాపించు. నేను నీచేత ఆజ్ఞాపింపతగినవాడను.

మహాత్ముడైన జనకునిచే ఈవిధంగా అడుగబడినవాడైన ధర్మాత్ముడైన వాక్యవిశారదుడైన విశ్వామిత్రుడు...

క్షత్రియులును దశరథపుత్రులును లోకప్రసిద్ధులగు ఇరువురూ నీవద్ద ఉన్న శ్రేష్ఠమైన ధనుస్సును చూడకోరిక గలవారు.

ఏతద్దర్శయ భద్రం తే కృతకామౌ నృపాత్మజౌ
దర్శనాదస్య ధనుషో యథేష్టం ప్రతియాస్యతి॥౬

ఈ ధనుస్సును చూపు నీకు మఙ్గళములు కలుగుతాయి. ఈ ధనుస్సుయొక్క దర్శనమువలన రాజకుమారులు తీరినకోరిక కలవారై యథేచ్ఛగా తిరిగి వెళ్ళగలరు. అని పలికిన విశ్వామిత్రుని మాటలను విని...

ఈ ధనుస్సు ఇక్కడ ఎందునిమిత్తముగా ఉన్నదో ఆ వృత్తాంతము వినుమని చెప్పుట ప్రారంభించేరు.

న్యాసోఽయం తస్య భగవన్ హస్తే దత్తో మహాత్మనా॥

భగవన్! విశ్వామిత్రా! నిమిచక్రవర్తినుండి ఆరవవాడైన దేవరాతుడు అని ఖ్యాతి గడించిన రాజునకు మహాత్మునిచేత న్యాసముగా ఇవ్వబడింది. అంటే తిరిగి ఇవ్వవలసినది అని. అవసరార్థము వినియోగించుకొని కర్మపరిసమాప్తియందు తిరిగి ఇచ్చివేయవలసినది.

రుద్రునిచే ఎవనికి ఈ ధనుస్సు ఇవ్వబడిందో అతడు, ఆ దేవత ఇక్కడ మహాత్ముడని చెప్పబడ్డాడు.

పూర్వము దక్షయజ్ఞము నాశనముచేయుచూ "ధనురాయమ్య వీర్యవాన్' పరాక్రమవంతుడైన రుద్రుడు ధనుస్సును ఎక్కుపెట్టి దేవతలనుగూర్చి కోపముతో విలాసముగా...

సురులారా! యజ్ఞభాగమును కోరుచున్న నాకు ఎందువలన భాగమును కల్పింపలేదో అందువలన మీయొక్క విలువైన శ్రేష్ఠములైన అవయవములను ధనుస్సుతో ఖండించెదను అని పలికెను. "సర్వస్య గాత్రస్య శిరః ప్రధానమ్" అని కదా! కనుక మీ తలలు నరుకుతాను అని ధనుస్సు ఎక్కుపెట్టేడు.

మునిపుఙ్గవా! సమస్తమైన దేవతలు విమనస్కులై దేవతలకు ప్రభువైనవానిని అనుగ్రహింపచేసుకొన్నారు. భవుడు వారి విషయమున ప్రీతిని పొందేడు.

ప్రీతియుక్తస్స సర్వేషాం దదౌ తేషాంమహాత్మనామ్
తదేతద్దేవదేవస్య ధనూరత్నం మహాత్మనః।
న్యాసభూతం తదా న్యస్తమస్మాకం పూర్వకే విభో॥

ప్రీతిని పొందిన ఆ భవుడు గొప్పమనస్సుగల వారికి (ఆ ధనుస్సును) ఇచ్చేడు. హేవిభో! దేవదేవునియొక్క ఈ ధనూరత్నము అప్పుడు 'మహాత్మనః' గోప్పమనస్సుగల దేవతలచేత మాయొక్క పూర్వునియందు న్యాసముగా ఉంచ బడింది.

క్షేత్రం శోధయాతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా॥౧౩

తరువాత సీత అను పేరుతో పిలవబడుచున్న కన్య నేను క్షేత్రమును దున్నుచుండగా నాగలినుండి లేచినది. నాచేత పొందబడినది. క్షేత్రం అంటే కర్మఫలాన్ని ఇచ్చేది. భూతలమునుండి బయటకు వచ్చిన ఆమె నాయొక్క కుమార్తెగా పెరిగింది. అయోనిజగా పుట్టిన ఈ కన్య నాచేత వీర్యశుల్కగా నిర్ణయించబడింది.

గృహస్థు తన కర్మఫల స్వరూపంగా సంతానాన్ని పొందుతాడు. జనకుడు బ్రహ్మవేత్త కర్మసంఘం లేనివాడు. కనుక ఈమె అయోనిజగా ఉద్భవించింది.

మునిశ్రేష్ఠా! భూతలమునుండి లేచినదై పెరుగుచున్న ఆ నాకుమార్తెను

చాలమంది రాజులు వరించేరు.

భగవన్! ఆ సమస్తమైన రాజులు కన్యనువరించి వస్తూంటే నేను వీర్యశుల్క అని చెప్పి కుమార్తెను ఇవ్వలేదు.

మునిపుఙ్గవా! తరువాత రాజులందరూకలిసి తన పరాక్రమమును తెలుసుకొన దలచి మిథిలకు వచ్చిరి.

వారి పరాక్రమమును పరీక్షించుకొను నిమిత్తము మిథిలకు వచ్చిన వారికి ఆ ధనుస్సును చూపగా దానిని పట్టుకొనుటగాని కదల్చుటగాని చేయలేకపోయారు.

మహామునీ! తపోధనా! ఆ రాజులయొక్క బలము అల్పమైనదిగా తెలుసుకొని నాచేత (సీతను వారికి ఇచ్చే విషయంలో) నిరాకరింపబడినారు. **'తత్ నిబోధ'** అది తెలుసుకో! అంటున్నారు జనకుడు.

ఎందుకని అంటే అప్పటికే ఆ ధనుస్సు విషయం లోకప్రసిద్ధం. నువ్వు పనికట్టుకొని వచ్చి ధనుస్సు ఈ రాకుమారులకు చూపించమని అంటున్నావు. నా హృదయం తలిసే అడుగుతున్నావు అనుకొంటున్నాను.

వీరుడు కానివానికి సీతను ఇవ్వను, అది తెలుసుకో...

తరువాత రాజులందరూ తమ బలమునుగూర్చిన సందేహంకలవారై చాలా కోపముతో మిథిలను ముట్టడించేరు.

మునిశ్రేష్ఠా! ఇలా సంవత్సరము గడచిపోయింది. రాజ్యం అంతటా సాధనములు క్షయమైయాయి. దానితో నేను చాలా దుఃఖపడ్డాను.

అప్పుడు నేను తపస్సుచేత సమస్తమైప దేవగణములను అనుగ్రహింపచేసుకొంటిని. దేవతలు ప్రీతమనస్కులై చతురంగబలాలను ఇచ్చేరు.

తరువాత తమ బలము విషయమున సందేహముగల పాపకర్మాసక్తులైన పరాక్రమహీనులైన రాజులు యుద్ధమునందు ఓడినవారై సపరివారముగా దిక్కులుపట్టి పోయారు.

రామలక్ష్మణయోశ్చాపి దర్శయిష్యామి సువ్రత॥

సువ్రతుడవైన మునిశార్దూలా! మిక్కిలి ప్రకాశించుచున్న ఈ ధనుస్సును రామలక్ష్మణులకుకూడా చూపగలను.

సువ్రతుడా! అని నర్మగర్భంగా మాట్లాడుతున్నాడు. నువ్వు మంచిపనులు

చేసేవాడివి. పూర్వపు రాజులవలె కాదు...

యద్యస్య ధనుషో రామః కుర్యాదారోపణం మునే
సుతామయోనిజాం సీతాం దద్యాం దాశరథేరహమ్॥ ౨౬

ఓ విశ్వామిత్రమునీ! రాముడు ఈ ధనుస్సును ఎక్కుపెట్టి నట్లయితే నా కూతురు అయోనిజయైన సీతను నేను రామునకు ఇచ్చెదను.

ఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షట్ష ష్టితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తషష్టితమః సర్గః॥

(శివధనుర్భంగము. విశ్వామిత్రుని అనుజ్ఞనుపొంది దశరథునికి వర్తమానం తెలిపి మిథిలకు ఆహ్వానించుటకై మంత్రులను పంపుట.)

జనకస్య వచః శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః
ధనుర్దర్శయ రామాయ ఇతి హోవాచ పార్థివమ్॥౧

మహాముని విశ్వామిత్రుడు జనకుని మాటలు విని రామునికొరకు అంటే రమించువానికొరకు ఆనందింప చేయువానికొరకు లేదా ఆనందస్వరూపునికొరకు ధనుస్సును చూపుమని జనకునితో పలికేడు.

తరువాత రాజైన ఆ జనకుడు గంధమాల్యవిభూషితమైన దివ్యమైన ధనుస్సును తీసుకొనిరమ్మని సామంతులను ఆజ్ఞాపించారు.

జనకునిచేత ఆజ్ఞాపించబడిన సచివులు పురమును ప్రవేశించి ధనస్సును ముందు ఉంచుకొని బయలుదేరేరు.

ఏబదివందలమంది గొప్పశారీరక దార్ఢ్యము కలిగిన దీర్ఘకాయులైన సామంతులు ధనుస్సు ఉంచిన ఎనిమిది చక్రముల పెట్టెను శ్రమించి తీసుకొని వచ్చేరు.

జనకునియొక్క మంత్రులు ధనుస్సు ఉంచిన ఇనుప పెట్టెను తీసుకొని వచ్చి దేవతలతో సమానుడైన జనకునితో... రాజేన్ద్రా మిథిలాధిపా! ఓరాజా! సర్వరాజులతో పూజింపబడిన ఏ శ్రేష్ఠమైన ధనుస్సుగలదో ఆ ధనుస్సు ఇదిగో...

జనకుడు ధనస్సును తీసుకొని వచ్చిన సామంతుల మాటలను విని, అంజలిబద్ధుడై మహాత్ముడైన విశ్వామిత్రుని రామలక్ష్మణులగూర్చి పలుకుతున్నాడు.

ఇదం ధనుర్వరం బ్రహ్మన్ జనకైరభిపూజితమ్।
రాజభిశ్చ మహావీర్యైరశక్తైః పూరితుం పురా॥ ౮

ఓ బ్రాహ్మణుడా! **జనకైః** జనకవంశీయులచేత అంటే నా పూర్వీకులు ఈ ధనుస్సును ఎక్కుపెట్టుటకు శక్తిలేనివారైనారు. అశక్తులని చెప్పినంత మాత్రమున అల్పవీర్యం కలవారు అని అనుకోకు.

వీరు మహాపరాక్రమవంతులు ఇట్టి పరాక్రమవంతులైన రాజులచేత

పూజింపబడిన శ్రేష్ఠమైన ధనుస్సు ఇదే!
దీనిని ఎక్కుపెట్టుటకు సమస్తమైన సురగణములు అసమర్థులు. అసురులూ సమర్థులుకారు. కిన్నరులు మహోరగులు గన్ధర్వులు యక్షశ్రేష్ఠులు సమర్థులు కాలేకపోయేరు.

క్వ గతిర్మానుషాణాం...

ఇక మనుష్యుల గతి వేరే చెప్పాలా! ఈ ధనుస్సును వంచుటగానీ నారిని ఎక్కించుటకుగానీ శరసంధానముగానీ వారు చేయగలరా!

దర్శయైతన్మహాభాగ అనయో రాజపుత్రయోః॥

మునిశ్రేష్ఠా! అటువంటి శ్రేష్ఠమైన ధనుస్సు తీసుకొనిరాబడినది. దీనిని ఈ రాజపుత్రులకు చూపుము.

విశ్వామిత్రస్తు ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్।
వత్స రామధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్॥ ౧౨

ధర్మాత్ముడైన విశ్వామిత్రుడైతే... జనకుడు చెప్పింది విని,
రాముని వత్సా అని పిలిచేరు. పైన జనకుడు **అనయోః రాజపుత్రయోః** అని ఇద్దరికీ చూపుమని చెప్పేరు.
విశ్వామిత్రుడైతే... వత్సా అని రాముని ఉద్దేశించిపలికేరు.
తను రామునకు గురువు. కనుక పుత్రసముడైన రాముని ఉద్దేశించి వత్సా అని పిలిచేరు. ఆనందకారకమైన ధనుస్సును చూడు. అని రాఘవునిగూర్చి పలికేరు.
ఏమిటి ఆ ధనుస్సు కలిగించే ఆనందం? అంటే అది కేవల ధనుస్సుకాదు. ధనురూపంగా ఉన్న కన్యారత్నం.
"ధనుర్దర్శయ రామాయ ఇతి హోవాచ పార్థివమ్" "వత్స రామధనుః పశ్య ఇతి రాఘవమబ్రవీత్" అని మహర్షి **(ఛన్దో)** ధర్మరక్షణకై నిత్యమైన గుణాన్ని విడదీసి చూపేరు.

సంహితైకపదే నిత్యా నిత్యా ధాతూపసర్గయోః
నిత్యా సమాసే వాక్యే తు సా వివక్షామపేక్షతే॥

త్రిశూలంలేని శివుణ్ణి, కోదండంలేని రాముని ఊహచేయలేము.

ఇక్కడ **రామధనుః** అంటే కోదండంకాదు. ధర్మరక్షణకొరకు–
నిత్యమైన సంధి రెండుగా విభాగింపబడినట్లుగా ఏవిధంగా చూపేరో ఆవిధంగానే ఆనందఘనుడైన రామునియందలి రతికరత్వం అనే గుణాన్ని వివక్షచేస్తున్నారు.
ఈ గుణవివక్ష తాత్కాలికమే అని చెప్పుటకే
"హెూవాచ పార్థివమ్" "బ్రహ్మర్షేర్వచనాద్రామో" అని వెంటనే గుణాన్ని నిత్యంచేసేరు.
ముప్పదిఒకటవ సర్గలో **"అద్భుతం ధనురత్నం చ తత్ర తద్ద్రష్టుమర్హసి"** అనుచోట అక్కడ అద్భుతమైన ధనురత్నాన్నికూడా చూడగలవు అంటే అక్కడ శ్రేష్ఠమైనది అసలు చూడవలసినది మరొకటి ఉంది అనునది స్పష్టమగుచున్నది. దాన్ని చూచుటకు వెళ్తున్నాం దానితోపాటు ధనురత్నాన్నికూడా చూడగలవు అని చెప్పేరు.
అద్భుతం ధనురత్నం చ అన్నచోట శ్రేష్ఠవాచకంగా ప్రయోగింపబడిన చకార ప్రయోజనం ఇక్కడ **'రామధనుః** గా' సిద్ధించింది.
శివునకు త్రిశూలంతో నిత్యసంబంధము. పినాకము విశేషణము. విష్ణువునకు సుదర్శనంతో నిత్యసంబంధం. శార్ఙ్గముతో విశేషము. **"హీనాశ్రయో నకర్తవ్యః"** శ్రేష్ఠమైన వాటితోనే (వారితోనే) నిత్యసంబంధము కలిగి ఉండాలన్నది లోకనీతి. కనుక రామునకు ఈ రామధనువు నిత్యసంబంధియై ఉండాలి. విరిగిన పినాకంతో నిత్యత్వంకుదరదు. మరి కోదండం అనుకుందామా? అది చేత ధరించే విశ్వామిత్రుని వెంటవచ్చేడు. మరిప్పుడు ఈ శ్రేష్ఠమైన **రామధనుః**? అంటే కన్యారత్నమైన సీత.
విశ్వామిత్రుడు విదేహరాజు చెప్పినదంతా విన్నాడు. విని...
వత్సా! సీతను చూడు. అని రాఘవునితో అంటే కార్యసాధకునితో చెప్తున్నారు.
రాముడు బ్రహ్మర్షియొక్క ఆజ్ఞనుపొంది ఆ ధనుస్సు దేనియందు ఉందో ఆ మంజూషమును తెరిచి ధనుస్సును చూచి మాట్లాడుతున్నాడు.
ఓ బ్రాహ్మణుడా! ఇప్పుడు ఈ శ్రేష్ఠమైన ధనుస్సును చేతితో స్పృశిస్తాను కదల్చుటకుగాని, ఎక్కుపెట్టుటకుగాని ప్రయత్నిస్తాను. అని పలికేడు.
జనకుడు విశ్వామిత్రుడు ఆవిధంగానే చేయమని రామునితోపలికేరు.

విశ్వామిత్రమునియొక్క ఆజ్ఞప్రకారము రాముడు ధనుస్సును లీలగా పట్టుకొన్నాడు.

ధర్మాత్ముడైన రఘునందనుడు వేలకొలది రాజులు చూస్తూండగా ఆ ధనుస్సును అనాయాసముగా ఎక్కుపెట్టేడు.

ధర్మాత్ముడు గొప్పకీర్తిగలవాడు నరశ్రేష్ఠుడు అయిన రాముడు ఆ ధనుస్సును ఎక్కిపెట్టి దానిని మధ్యలో విరిచేడు.

ఆ ధనుస్సు విరిగినప్పుడు పిడుగుపాటువంటి గొప్పధ్వని వచ్చింది. పర్వతము బ్రద్దలగునంతగా చాలాగొప్ప భూకంపము కలిగినది.

విశ్వామిత్రుడు జనకుడు ఆ రాఘవులు తప్ప మిగిలిన సమస్తమైన మనుష్యులు మూర్ఛపోయి క్రిందపడ్డారు.

ఆ జనము స్వస్థితికి వచ్చినతరువాత వాక్యజ్ఞుడైన జనకుడు ఏమాత్రము భయపడకుండా అంజలిబద్ధుడై మునిశ్రేష్ఠుడైన విశ్వామిత్రునితో మాట్లాడు తున్నాడు.

భగవన్! దశరథాత్మజుడైన రామునియొక్క అత్యద్భుతము అచిన్త్యము అయిన వీర్యాన్ని చూసేను. ఇది నా ఊహకు కూడా అందనిది.

నా కుమార్తె అయిన సీత దశరథాత్మజుడైన రాముని భర్తగా పొంది నా కులమునకు కీర్తిని తీసుకురాగలదు.

కౌశికా! ఈ నాయొక్క కన్య వీర్యశుల్క అని నాచేత చేయబడిన ప్రతిజ్ఞకూడా సత్యమైనది. నాకు ప్రాణసమా నమైన నా కూతురు సీతను రామునకు ఇచ్చెదను.

ఓ బ్రాహ్మణుడా! విశ్వామిత్రా! నీ అనుమతి అయితే నా మంత్రులు శీఘ్రముగా అయోధ్యకు వెళ్ళెదరు. నీకు భద్రమగుగాక!

వీర్యశుల్క అయిన సీతాప్రదాన విషయమును పూర్తిగా చెప్పి వినయపూర్వకమైన వాక్యములచేత దశరథుని నాయొక్క పురమునకు తీసుకువచ్చేదరుగాక!

అయోధ్యకు శీఘ్రముగా వెళ్ళి రామలక్ష్మణులు విశ్వామిత్రుని రక్షణలో ఉన్నారను సమాచారమును దశరథునకు చెప్పి ఆనందించుచున్న దశరథుని తీసుకువచ్చెదరు.

కౌశికస్య తథేత్యాహ రాజా చాభాష్య మన్త్రిణః
అయోధ్యాం ప్రేషయామాస ధర్మాత్మా కృతశాసవాన్
యథావృత్తం సమాఖ్యాతుమానేతుం చ నృపం తదా॥ ౨౮

విశ్వామిత్రుడుకూడా ఆవిధంగానే చేయమని పలికేదు. జనకుడు తన మంత్రులతో మాటలాడి, దశరథునకు జరిగినది అంతయు చెప్పి మిథిలానగరమునకు తీసుకు వచ్చుటకై ఆజ్ఞాపాలకులైన సామంతులను అయోధ్యకు పంపెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తషష్టితమ స్సర్గ సమాప్తము.

–

అథ అష్టషష్టితమః సర్గః

(జనకునిచే పంపబడిన వర్తమానమును విని దశరథుడు మంత్రి పురోహిత సమేతుడై మిథిలకు ప్రయాణమగుట.)

జనకేన సమాదిష్టా దూతాస్తే క్లాన్తవాహనాః
త్రిరాత్రముషితా మార్గే తేయోధ్యాం ప్రావిశన్‌పురీమ్॥ ౧

జనకునిచే ఆజ్ఞాపింపబడిన దూతలు మూడురాత్రులు ప్రయాణంచేసి అలసిన అశ్వాలతో అయోధ్యలో ప్రవేశించేరు. రాజభవనాన్నిచేరి అక్కడ ఉన్న ద్వారపాలకులతో జనకునియొక్క దూతలమైన మమ్ముగూర్చి రాజునకు శీఘ్రముగా తెలుపవలసినది. అని పలికిన దూతలయొక్క మాటలను విని ద్వారపాలకులు దశరథునకు విషయం నివేదించేరు. తరువాత దశరథుని ఆజ్ఞప్రకారము రాజభవనమును ప్రవేశించి దేవతలతో సమానుడైన వృద్ధుడైన దశరథుని చూసేరు. దూతలందరూ అంజలిబద్ధులై కంగారులేనివారై నియమ సంపన్నులై దశరథునితో మధురంగా మాట్లాడుతున్నారు.

ఓ మహారాజా! మిథిలాధిపతియైన జనకమహారాజు స్నేహ పూర్ణమైన మాటలతో నిత్యాగ్నిహోత్రియగు నీయొక్క, ఉపాధ్యాయులతో పురోహితులతోకూడిన నీ పరివారముయొక్క యోగక్షేమములను అడుగుచున్నాడు.

మిథిలాధిపతి శ్రద్ధాగా కుశలమును అడిగి, విశ్వామిత్రుని అనుమతిప్రకారము నిన్నుగూర్చి ఈ మాట చెప్పమన్నారు.

నా పుత్రిక వీర్యశుల్క అని నేను పూర్వము చేసిన ప్రతిజ్ఞ తెలిసినదే కోపించివచ్చిన నిర్వీర్యులైన రాజులు పరాజితులైనారు.

యదృచ్ఛయాగతైర్వీరై ర్నిర్జితా తవ పుత్రకైః॥ ౯

దశరథమహారాజా! అట్టి ఈ నాయొక్క కుమార్తె విశ్వామిత్రుని వెంట యాదృచ్ఛికముగావచ్చిన నీయొక్క వీరుడైన చిన్నికుమారునిచేత జయింపబడినది. ఇక్కడ **పుత్రకైః** అను బహువచన ప్రయోగం లోకసాధారణమైన గౌరవ ఏకవచనంగా గ్రహించాలి. ఇప్పుడు అక్కడ ఉన్న రాముడు వయోధర్మంగా చిన్నవాడై నప్పటికీ వీర్యముచే తనను తనపూర్వికులను జయించిన వాడు,

తనచేత అల్లునిగా భావింపబడినవాడు. కనుక గౌరవసూచకమైన బహువచన ప్రయోగం. వయస్సును మాత్రమేకాదు గుణవిశిష్టతనూ గౌరవించాలని మహర్షి చూపించేరు.

మహారాజా దశరథా! ఆ దివ్యధనుస్సు గొప్పదైన జనులసభయందు మహాత్ముడైన రామునిచేతనే భగ్నము చేయబడింది.

వీర్యశుల్క అయిన సీతను ఈ మహాత్మునకు (రామునకు) నాచేత ఇవ్వతగినది. ప్రతిజ్ఞను నెరవేర్చుకొనవలెనని కోరుచున్నాను. ఆ కారణంగా నీవు అనుజ్ఞ ఇవ్వవలసినది.

దశరథా! నీవు పురోహితులను ముందుంచుకొని ఉపాధ్యాయులతో కలిసి శీఘ్రముగా వచ్చి రాఘవులను చూడుము.

రాజేన్ద్రా! ఇచ్చటికి (మిథిలకు) వచ్చి నాకు ఆనందం కలిగింపుము. నీవుకూడా ఇరువురు పుత్రులయొక్క ఆనందమును పొందగలవు.

విదేహరాజైన జనకుడు విశ్వామిత్రుని అనుజ్ఞనుపొంది శతానందుని అనుమతి తీసుకొని ఈవిధమైన మధురమైన వాక్యములను పలికెనని దూతలు చెప్పి రాజు అనెడు గౌరవముచేత భయపడుచు పలుకుటను విరమించిరి.

ఆ దశరథమహారాజు దూతవాక్యములను విని పరమ సంతోషంతో వసిష్ఠుని వామదేవుని మంత్రులనుగూర్చి ఉద్దేశించి పలుకుతున్నాడు.

గుప్తః కుశికపుత్రేణ కౌసల్యానన్దవర్ధనః
లక్ష్మణేన సహభ్రాత్రా విదేహేషు వసత్యసౌ॥ ౧౬

ఈ కౌసల్యానందవర్ధనుడైన రాముడు విశ్వామిత్రునిచే రక్షింపబడినవాడై సోదరుడైన లక్ష్మణునితోకూడ విదేహనగరమున ఉన్నాడు.

ఇక్కడ దశరథుడు రాముని కౌసల్యానందవర్ధనుడు అంటున్నారే కానీ పేరుపెట్టి చెప్పలేదు.

ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్య చ। శ్రేయస్కామో గృహ్ణీయా జేష్ఠాపత్య కళత్రయోః॥ ఈ ధర్మం తెలిసే దశరథుడు పుత్రునియొక్క శ్రేయస్కాముడై రాముని పేరు స్మరించలేదు. మహాత్ముడైన జనకుడు రామపరాక్రమము దర్శించి, రామునకు తన కుమార్తెను దానము చేయుటకు కోరుచున్నాడు.

యది వో రోచతే వృత్తం జనకస్య మహాత్మనః
పురీం గచ్ఛామహే శీఘ్రం మాభూత్కాలస్య పర్యయః॥౧౯

మహాత్ముడైన జనకునియొక్క చరిత్ర మీకు ఇష్టమైనట్లయితే మిథిలనుగూర్చి శీఘ్రముగా వెళ్ళుదము. ఆలస్యం లేకుండుగాక!

పూర్వం దశరథుడు అశ్వమేధక్రతు విషయంలో...

తదహం యష్టుమిచ్ఛామి శాస్త్రదృష్టేన కర్మణా। కథం ప్రాప్స్యామ్యహం కామం బుద్ధిరత్ర విచార్యతామ్॥ అని తన పాపప్రక్షాళన విషయంలో స్వవిషయం కనుక తను నిర్ణయించుకొని ఆజ్ఞాపించేడు.

వివాహం స్వవిషయంకాదు. **ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః** అని శ్రుతి అంటున్నది. గార్హస్థ్యమును (గృహస్థ ధర్మాన్ని) స్వీకరించమని శ్రుతి ప్రేరేపిస్తోంది. గృహస్థును ఆశ్రయించే మిగిలిన ఆశ్రమములు ఉన్నాయి. కనుక గృహస్థాశ్రమము సమాజహితంకొరకైనది. కావునా "నా పెళ్ళి నా ఇష్టం" అనటానికి లేదు. వివాహం స్వవిషయంకాదు సామాజిక విషయం. వచ్చేది గృహస్థుయొక్క లోకహితంకొరకైన ధర్మ నిర్వహణలో సహకరించేదిగా ఉండాలి. వచ్చేవాడు ధర్మకర్మాచరణ దక్షుడేనా? అని చూడాలి. అందుకోసం పెద్దలను ఆశ్రయించడం. ఇరుపక్షాలవారు సమాజహితంకొరకే వధూవర అన్వేషణచేస్తారు. వివాహానంతరం అన్యథా జరిగితే లోకహితాన్ని దృష్టిలో ఉంచుకొనే పునర్వివాహం చేయడం చేస్తారు.

దానంజేసి వివాహం సామాజిక బాధ్యత. కనుక స్వతంత్ర నిర్ణయంకూడదు. కనుకనే జనకుడు విశ్వామిత్ర శతానందులను; దశరథుడు వసిష్ఠ వామదేవాదులను అనుమతికొరకు అర్థించేరు.

పెద్దల అనుమతి లభించింది ఇది నా స్వంత నిర్ణయంకాదు అని దూతలద్వారా తెలియజేసేడు. దశరథుడు వసిష్ఠ వామదేవాదులను అడిగి తన ధర్మనిరతిని చాటుతున్నాడు.

ఇప్పటికీ శుభపత్రికలలో ఇట్లు అని చేవ్రాలు వ్రాసే స్థలంలో వధూవరుల తల్లిదండ్రుల పేర్లనుగాక వారి వంశలో ఉన్న పెద్దల పేర్లతో శుభపత్రిక వ్రాస్తారు. దానికి ఇదే కారణం.

"మన్త్రిణో బాఢమిత్యాహుః" మహర్షులు మంత్రులు అందరూ మంచిది ఆవిధంగానే చేయవలసినది అని ఆమోదించేరు.

మన్త్రిణస్తు నరేన్ద్రస్య రాత్రిం పరమసత్కృతాః
ఊషుస్తే ముదితాః సర్వే గుణైః సర్వైః సమన్వితాః॥ ౨౧

సమస్తమైన గుణములతోకూడిన జనకమహారాజుయొక్క మంత్రులు గొప్పగా సత్కరింపబడినవారై సంతోషంగా ఆ రాత్రిగడిపేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
అష్టషష్టితమస్సర్గ సమాప్తము.

–

అథ ఏకోనసప్తతితమః సర్గః

(దశరథుడు మిథిలకు చేరుకొనుట. జనకుడు దశరథుని సత్కరించుట.)

తతో రాత్ర్యాం వ్యతీతాయాం సోపాధ్యాయః సబాన్ధవః
రాజా దశరథో హృష్టః సుమన్త్రమిదమబ్రవీత్॥ ౧

ఉపాధ్యాయులు బంధువులతో కూడిన దశరథమహారాజు రాత్రి గడచిన తరువాత సుమంత్రునితో...

కోశాధికారులందరూ పుష్కలంగా ధనమును రత్నములను గ్రహించి ముందుగా వెళ్ళండి.

నా ఆజ్ఞ అయిన వెంటనే చతురంగబలాలతో శ్రేష్ఠమైనపల్లకీలు రథములతోకూడి నలువైపులనుండి బయలుదేరేదరు.

వసిష్ఠుడు వామదేవుడు మరియు జాబాలి కాశ్యపుడు దీర్ఘాయువుగల మార్కండేయుడు మరియు ఋషియైన కాత్యాయనుడు ఈ బ్రాహ్మణులు ముందు నడిచెదరు. ఆలస్యము లేకుండా నాయొక్క రథమును తీసుకురమ్ము. జనకుని దూతలు నన్ను తొందరపెట్టుచున్నారు.

దశరథుని ఆజ్ఞను అనుసరించి గజాశ్వరథపదాతి దళములు నాలుగు అతనిని అనుసరించి వెనుకనే వెళ్ళెను.

రాజా తు జనకః శ్రీమాన్ శ్రుత్వా పూజామకల్పయత్

మార్గమున నాలుగు దినములు ప్రయాణము చేసి విదేహా రాజ్యమును చేరేరు. ఈ వార్తను విన్న శ్రీమంతుడైన జనకమహారాజు తగువిధముగా వారిని పూజించెను. ఇక్కడ **శ్రీమాన్ జనకః** అంటున్నారు.

అంటే విదేహరాజ్యమునకు విచ్చేసిన దశరథుని జనకుడు భార్యా సమేతుడై పూజించేడు అని.

తరువాత రాజైన జనకుడు వృద్ధుడైన దశరథమహారాజును సమీపించి గొప్పసంతోషమును పొందేడు.

ఉవాచ చ నరశ్రేష్ఠో నరశ్రేష్ఠం ముదాన్వితః

నరశ్రేష్ఠుడైన జనకుడు సంతోషముతో కూడినవాడై నరశ్రేష్ఠుడైన దశరథ మహారాజుతో మాట్లాడుతున్నాడు.

నరశ్రేష్ఠుడు నరశ్రేష్ఠునితో మాట్లాడుతున్నాడు అని,
మహర్షి సంబంధాలు స్నేహాలు సములమధ్యనే ఉండాలని సూచిస్తున్నారు. అసలు వరుని నిర్ణయించేటప్పుడు మొదట కులాన్ని తరువాత విద్యను, ఆ తరువాత వయస్సును ఆ పిమ్మట గుణము ధనము రూపము దేశములగూర్చి పరిశీలించాలి.
జనకుడు అదేచేసేడు. విశ్వామిత్రుని అనుగమించి వచ్చిన రాఘవులనుగూర్చి మహర్షిని ప్రశ్నచేసి తెలుకొన్నారు. వంశము సంప్రదాయము తెలుసుకొన్న తరువాత విద్యా విషయాలనుగూర్చి తెలుసుకోవడం చెయ్యాలి. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను సిద్ధాశ్రమం తీసుకొని వెళ్ళడంనుండి మిథిలకు వచ్చువరకు జరిగిన వృత్తాంతమును జనకునికి చెప్పేరు. దానిచేత వారియొక్క ధనుర్విద్యాది పాటవాదులు జనకునికి తెలిసేయి.
అహల్యావృత్తాంతాదులవలన గుణము తెలిసింది. రూపమా? పరమ సంమోహనంగా ప్రత్యక్షంగానే ఉంది. ఇక దేశము అంటే బంధువర్గము.
ఈ విధంగా సమస్తమూ ప్రత్యక్ష పరోక్షములద్వారా తెలిసి జనకుడు పిల్లను ఇస్తాను అన్నాడు.
రఘువంశమునందు పుట్టిన దశరథమహారాజా! నీకు స్వాగతం అగుగాక! నా భాగ్యవశంచేత వచ్చేవు. నీ ఇరువురి పుత్రులయొక్క పరాక్రమంచే లభించిన ఆనందమును అనుభవించగలవు.
గొప్పతేజస్సుగల భగవానుడైన వసిష్ఠుడు సమస్తమైన బ్రాహ్మణోత్తములచే దేవతలతోకూడిన ఇంద్రునిలా ప్రకాశిస్తూ నా భాగ్యంకొద్దీ ఇక్కడకు వచ్చేరు. భాగ్యవశమున వీర్యశ్రేష్ఠులు మహాత్ములు అయిన రాఘవులతో సంబంధమువలన నా విఘ్నములన్నీ జయింపబడినవి. నా వంశము పూజనీయమైనది.
నరశ్రేష్ఠుడవైన **నరేన్ద్రేన్ద్రా!** రేపు ప్రభాతకాలంలో యజ్ఞపరి సమాప్తియందు ఋషులకు అంగీకారయోగ్యమైన వివాహమును నిర్వర్తింపచేయుము.
వాక్యవిదులలో శ్రేష్ఠుడైన దశరథుడు జనకుని మాటలను విని, ఆ ఋషులమధ్య జనకునిగూర్చి మాట్లాడుతున్నాడు.

ప్రతిగ్రహమనునది దాతవశమునందు ఉంటుంది అని నేను పూర్వము విన్నాను. ధర్మజ్ఞుడవైన జనకమహారాజా! నీవు ఎలా చెప్పెదవో మేము అలా చేసెదము.

సత్యవాది అయిన దశరథుని ధర్మసమ్మతము కీర్తికరము అయిన మాటలను విని జనకుడు విస్మయాన్ని పొందేడు.

ధీరాః చతుర్దశభువనాని భుఞ్జతే అని శృఙ్గారశతకంలో అంటారు భర్తృహరి. ధైర్యవంతులు సామర్థ్యంతో సంపదలతో పదునాలుగులోకాలను అనుభవిస్తున్నారు. అటువంటి దశరథుడు నువ్వు చెప్పినవిధంగా చేయుటకు వచ్చేం అన్నారు. అది సంస్కారం.

ఏమీ లేకపోయినా కేవలం మగపెళ్ళివారం అనే అహంతో నానా రభసా చేసి కన్యాదాత కంటతడి పెట్టిస్తూంటారు. ఇది లోకంలో నిత్యము అనుభవంలో ఉన్నదే. తను సార్వభౌముడు. సమస్తపృథివీమండలము తన అధీనంలో ఉంది. తనవంటివారు దశరథుని అనుగ్రహంచేత బ్రతుకుతున్న స్వతంత్ర సామంతులు. ఈ విషయం కిష్కింధాకాండలో రాముడు **ఇక్ష్వాకూణామియం భూమి స్సశైలవనకాననా, మృగపక్షి మనుష్యాణాం నిగ్రహ ప్రగ్రహావపి** అని వాలితో చెప్పేడు. మరి రావణాదుల బలమో? అని ఒక సందేహం సామాన్యంగా మనలను వేధిస్తూంటుంది. రావణుడు చాలామంది చేతులలో పరాజయం పాలై ప్రాణభిక్షను పొందేడు. వసిష్ఠాది బ్రహ్మర్షులచే సేవింపబడు సార్వభౌముడైన దశరథుని వీర్యంముందు రావణాదుల పరక్రమం అల్పము. దశరథుడు ధర్మజ్ఞుడు యుద్ధకాంక్ష లేనివాడుకనుక కొద్దిమంది స్వతంత్రించేరు. అటువంటి దశరథుడు ఇంత వినయంగా మాట్లాడేసరికి జనకుడు పరమాశ్చర్యాన్ని పొందేడు.

హర్షేణ మహతా యుక్తాస్తాం నిశామవసన్ సుఖమ్॥ ౧౬

తరువాత మునీగణములు పరస్పరము కలిసినందులకు గొప్పసంతోషంతోకూడి ఆ రాత్రి సుఖముగా నివసించేరు.

పూర్మము వాల్మీకిమహర్షి "జనకో **ముదితో** రాజా **హర్షం** చ పరమం యయౌ" "పుత్రయోరుభయోః **ప్రీతిం** లప్స్యసే వీర్యనిర్జితామ్" అని చెప్పిన సందార్భాలలో ఉన్నది సంతోషం మాత్రమే సుఖముకాదు. సుఖము అనునది బ్రాహ్మీస్థితి సంబంధి. సంసారులకు సుఖస్థానం నిద్ర(సుషుప్తి).

ఇక్కడ నిద్రించేరు అనలేదు. ఎందుకంటే వీరు అందరూ బ్రహ్మవేత్తలు. బ్రహ్మవేత్తలకు సుఖస్థానం బ్రహ్మమే. వారందరూ అవస్థాత్రయాతీతమైన బ్రహ్మచింతనయందున్నారు. ఇంత అందంగా వాల్మీకి మాత్రమే చెప్పగలరు. దశరథుడు పుత్రులైన రామలక్ష్మణులను చూసిన సంతోషం జనకుడు చూపిన ఆదరానికి పరమప్రీతితో ఆ రాత్రి నివసించేడు. అంటే దశరథుడూ నిద్రపోలేదు. కారణం కొడుకు పెళ్ళి, వసిష్ఠాదుల ఆమోదంపొందిన గొప్ప సంబంధం. జనకుడు చూపిన ఆదరం ఇవి తలచుకొంటూ ఆనందంలో నిద్రరాలేదు ఆయనకు.

జనకోఽపి మహాతేజాః క్రియాం ధర్మేణ తత్త్వవిత్
యజ్ఞస్య చ సుతాభ్యాం చ కృత్వా రాత్రిమువాస హ॥౧౮

గొప్పతేజస్సుగల తత్త్వవేత్త అయిన జనకుడుకూడా యజ్ఞసంబంధమైన కుమార్తెల వివాహసంబంధమైన పనులుచేసి రాత్రి నివసించేరు. అంటే ఆ రాత్రి ఎవరు నిద్రపోలేదు.

తెల్లవారితే వివాహం. చేతినిండా పని ఉంది. చేయవలసిన ఏర్పాట్లు చాలా ఉన్నాయి. పనివత్తిడివలన జనకునికి, సంతోషంతో దశరథునకుకూడా నిద్రలేదు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకోనసప్తతితమ స్సర్గ సమాప్తము.

-

॥అథ సప్తతితమః సర్గః॥

(జనకుడు కుశధ్వజుని రప్పించుట, వసిష్ఠుడు సూర్యవంశరాజులనుగూర్చి వర్ణించుట. సీతా ఊర్మిళలను రామలక్ష్మణులకొరకు వరించుట.)

తతః ప్రభాతే జనకః కృతకర్మా మహర్షిభిః
ఉవాచవాక్యం వాక్యజ్ఞః శతానందం పురోహితం॥ ౧

తరువాత ప్రభాతకాలమున మహర్షులచేత చేయవలసిన పనులన్నీ చేబడ్డాయి. వాక్యజ్ఞుడైన జనకుడు పురోహితుడైన శతానందుని పిలిచి మాట్లాడుతున్నాడు. గొప్పధార్మికుడు కుశధ్వజుడను ఖ్యాతి గడించినవాడు నా చిన్నసోదరుడు నీటిలో శూలములు సరిహద్దుగాగల ఇక్షుమతీ నదీజలములు త్రాగుచూ పుష్పకవిమానం వంటి శుభకరము అపూర్వము అయిన సాంకాశ్యనగరమును అధివసించి యున్నాడు.

నేను అతనిని చూడాలనుకొంటున్నాను. అతడు నాయొక్క యజ్ఞరక్షకుడిగా ఉన్నాడు. గొప్పతేజోవంతుడైన అతడు నాతోకలిసి ఈ ఆనందమును అనుభవించవలెను.

ఈవిధంగా శతానందునితో చెప్పాడు, శతానందుడు పిలువగావచ్చిన తొట్రుపాటులేని దూతలను జనకుడు ఆజ్ఞాపించేడు.

ఇంద్రుని ఆజ్ఞను అనుసరించు విష్ణువులా, జనకుని ఆజ్ఞప్రకారము దూతలు కుశధ్వజుని దగ్గర ఉండి తీసుకు వచ్చుటకు శీఘ్రముగా గుఱ్ఱములపై వెళ్ళేరు. తను అనుభవిస్తున్న ఆనందాన్ని, ఆరగిస్తున్న మధురాన్ని పంచుకోదగిన వాళ్ళతో పంచుకోవాలి.

తన దరిద్రాన్ని దుఃఖాన్ని పంచకోడదు.

పంచుకోదగ్గ వారిలో మొదటివాడు సోదరుడు. ఈ విషయాన్ని కిష్కింధాకండలో వాలికి తార హితవు చెప్పు సందర్భంలో తారతో చెప్పించేరు మహర్షి.

ఆ దూతలు సాంకాశ్యనగరమును చేరి కుశధ్వజుని చూచేరు. జరిగిన విషయాన్ని జనకుని ఆలోచనను నివేదించేరు.

రాజైన కుశధ్వజుడు మహాబలులైన దూతలచే చెప్పబడిన వృత్తాంతమును

విన్నాడు. జనకునియొక్క ఆజ్ఞప్రకారము వారితో మిథిలానగరమునకు వచ్చేడు. వచ్చి...ధర్మవత్సలుడు మహాత్ముడూ అయిన జనకునికి శతానందునికి అభివాదం చేసేడు. రాజోచితమైన ఆసనమును అధిరోహించేడు.
మహాతేజోవిరాజితులైన వీరులైన ఆ జనక కుశధ్వజులు కూర్చొన్నవారై మంత్రులలో శ్రేష్ఠుడైన సుదామనుని దశరథుని వద్దకు పంపిరి.
మంత్రిశ్రేష్ఠుడా! అమితప్రభకలవాడగు దశరథునిగూర్చి శీఘ్రముగా వెళ్ళు. ఎదిరింప శక్యముకానివాడు మంత్రులతోకూడినవాడు అయిన అతనిని పుత్రులతోకూడ తీసుకొనిరమ్ము.
అంతట ఆ సుదామనుడు విడిదిని చేరి రఘువంశీయుల వంశమును వృద్ధిపొందించు దశరథుని చూచి శిరస్సువంచి నమస్కరించి మాట్లాడుతున్నాడు. వీరుడవైన ఓ అయోధ్యాధిపతీ! మిథిలాధిపుడైన వైదేహుడు ఉపాధ్యాయులతో పురోహితులతోకూడిన నిన్ను చూచుటకు నిశ్చయించినాడు.
అప్పుడు దశరథమహారాజు మంత్రిమాటలను విని బన్ధు ఋషిగణ సమేతుడై జనకుడున్న చోటునకు వెళ్ళారు.
మంత్రులతో బంధువులతోకూడిన వాక్యవిశారదుడైన దశరథుడు విదేహరాజునుగూర్చి మాట్లుడుతున్నాడు. మహారాజా! భగవంతుడైన వసిష్ఠుడు ఇక్ష్వాకు కులదైవము. అన్ని పనులందు మాపక్షమున మాట్లాడువాడు. నీకు తెలియునుకాదా!
సమస్తమైన మహర్షులతోకూడిన విశ్వామిత్రునిచే అనుజ్ఞ ఇవ్వబడినవాడై ధర్మాత్ముడైన ఈ వసిష్ఠుడు మా వంశమును గూర్చి చెప్పగలడు.
నరశ్రేష్ఠుడైన దశరథుడు మహాత్ములై రాజులయొక్క మధ్యయందు ఈ విధంగా పలికి మౌనము వహించాడు. వాక్యజ్ఞుడు భగవంతుడూ అయిన వసిష్ఠుడు పురోహితులతో కూడిన జనకునితో మాట్లాడుతున్నాడు.
అవ్యక్తమునుండి పుట్టినవాడు శాశ్వతుడు నిత్యుడు అవ్యయుడు అగు **బ్రహ్మ** ఉన్నాడు. ఆ బ్రహ్మదేవునికి **మరీచి** పుట్టేడు. ఆ మరికి **కాశ్యపుడు** పుట్టేడు. కాశ్యపునకు **సూర్యుడు** జన్మించేడు. ఆ సూర్యునికుమారుడే మనువు అను ప్రజాపతి. ఆ **మనువు**కుమారుడు **ఇక్ష్వాకువు.**

ఈ ఇక్ష్వాకువు అయోధ్యకు మొదటిరాజు. ఇక్ష్వాకువుయొక్క కుమారుడు శ్రీమంతుడైన **కుక్షి,** ఇతని కుమారుడు **వికుక్షి** అనువాడు. వికుక్షి పుత్రుడు మహాతేజశ్శాలి ప్రతాపవంతుడు అయిన **బాణుడు.**

గొప్పతేజస్సుగల ప్రతాపవంతుడైన **అనరణ్యుడు** బాణునికుమారుడు. అనరణ్యునికుమారుడు **పృథువు. త్రిశంకువు** పృథువుయొక్క కుమారుడు.

మహాయశశ్శాలియైన **దుందుమారుడు** త్రిశంకువుయొక్క కుమారుడు. ఈ దుందుమారునకు **యువనాశ్వుడ**ను పేరుకలదు. యువనాశ్వుని కుమారుడు **మాంధాత.**

ఈ మాంధాతకు శ్రీమంతుడైన **సుసంధి** అను కుమారుడు.

సుసంధికి **ధ్రువసంధి, ప్రసేనజిత్తు** అను ఇరువురుకుమారులు.

ధ్రువసంధికి **భరతుడు** అనువాడు పుట్టేడు. భరతునకు **అసితుడు** అను కుమారుడు పుట్టేడు. అసితునకు హైహయులు తాలజంఘులు శూరులైన శశిబిందువులు అను రాజులు శత్రువులు. అసితుడు వారిని యుద్ధమునందు ఎదిరించి పరాజితుడై రాజ్యభ్రష్టుడై కొద్దిపాటి సేనతోను మంత్రులతోనుకూడి హిమాలయపర్వతమునుచేరి నివసించసాగేడు.

ఆసమయమునకు అతనియొక్క ఇరువురు భార్యలు గర్భవతులైయుండిరి. ఇరువురి భార్యలలో ఒకతే సవతిగర్భము నశించుటకు విషాన్నమును ఇచ్చింది. ఆ సమయంలో ఆనందదాయకమైన పర్వతశ్రేష్ఠమునుగూర్చి భృగువుయొక్క వంశమందు పుట్టిన చ్యవనమహర్షి వచ్చేడు.

గొప్పభాగ్యముగల పద్మపత్రాక్షి అయిన విషాన్నమును తిన్నటువంటి అసితునియొక్క భార్య దేవతలవంటి కాంతిగల చ్యవనుని పుత్రునికోరి నమస్కరించింది.

కాళింది అను పేరుగల అసితుని రెండవభార్యకూడా ఋషికి నమస్కరించింది. ఆ విప్రుడు పుత్రునికోరు అసితుని భార్యనుగూర్చి...

గరేణ సహితః శ్రీమాన్మాశుచః కమలేక్షణే॥ ౩౫

నీయొక్క కుక్షియందు గొప్పబలముగలవాడు గొప్పవీర్యము కలవాడు గొప్పతేజస్సుగల పుత్రుడు ఉన్నాడు. దుఃఖపడకు శ్రీమంతుడైన అతడు అంటే

విషమును గ్రహించిన అతడు విషముతో కూడినవాడై కొద్దికాలంలో పుట్టగలడు. ఈమె గర్భవతిగా ఉన్నకాలంలోనే అసితుడు కాలధర్మం చెందేడు.
చ్యవనుని అనుగ్రహంచే రాజపుత్రీ పతివ్రత పతిశోకాతుర అయిన ఆమె పుత్రునికి జన్మనిచ్చింది. గరముతో పుట్టిన వాడగుటచే **సగరుడు** ఆయెను. సగరుని కుమారుడు **అసమంజుడు.** అసమంజుని కుమారుడు **అంశుమంతుడు. దిలీపుడు** అంశుమంతుని కుమారుడు. దిలీపుని కుమారుడు **భగీరథుడు.** భగీరథుని కుమారుడు **కాకుత్థుడు.** కాకుత్థుని కుమారుడు **రఘువు.** రఘువుయొక్క పుత్రుడు **ప్రవృద్ధుడు.** ఈ ప్రవృద్ధుడే వసిష్ఠ శాపముతో పురుషాదకుడు అయెడు. అతడు ప్రతిశాపము ఇచ్చుటకు ప్రయత్నిస్తూన్న సమయంలో భార్యచే వారింపబడు సమయంలో ఆ నీరు తన పాదములపై పడుటచే **కల్మాషపాదుడ**ను పేరు వచ్చింది. ఈ కల్మాషపాదునకు **శంఖణుడు** అను కుమారుడు. శంఖణునకు **సుదర్శనుడు** పుత్రుడు. సుదర్శనునికి **అగ్నివర్ణుడు,** అగ్నివర్ణునికి **మరువు** అనువాడు కుమారుడు. మరువుయొక్క కుమారుడు **ప్రశుశ్రుకుడు,** ప్రశుశ్రుకుని కుమారుడు **అంబరీషుడు. నహుషుడు** అంబరీషుని కుమారుడు. ఈ నహుషునకు **యయాతి** పుట్టేడు. **నాభాగుడు** యయాతికుమారుడు.
ఈ నాభాగునకు **అజుడు** అనువాడు కుమారుడు. అజునకు **దశరథుడు** పుత్రుడు. సోదరులైన రామలక్ష్మణులు ఈ దశరథునియొక్క కుమారులు.

రామలక్ష్మణయోరర్థే త్వత్సుతే వరయే నృప
సదృశాభ్యాం నృపశ్రేష్ఠ సదృశే దాతుమర్హసి॥ ౪౫

నరశ్రేష్ఠుడవైన జనకుడా! ఆదినుండి పరిశుద్ధమైన వంశము కలవారు, ధర్మాత్ములు వీరులు సత్యమునే పలుకువారు ఇక్ష్వాకువంశీయులకు సంబంధించిన రామలక్ష్మణులు నీ కుమార్తెలను వరించుచున్నారు. ఈ రామలక్ష్మణులకు తగిప పుత్రికలను ఇమ్ము అని వసిష్ఠుడు పలికేడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
సప్తతితమ స్సర్గ సమాప్తము.

అథ ఏకసప్తతితమః సర్గః

(జనకుడు తన వంశమునుగూర్చి వర్ణించుట. సీతా ఊర్మిళలను రామలక్ష్మణు లకు ఇచ్చి వివాహము చేయుటకు జనకుడు అంగీకరించుట.)

ఏవం బ్రువాణం జనకః ప్రత్యువాచ కృతాఞ్జలిః
శ్రోతుమర్హసి భద్రం తే కులం నః పరికీర్తితమ్॥౧

ఈ విధంగా ఇక్ష్వాకువంశ వర్ణనచేసిన వసిష్ఠునితో అంజలిబద్ధుడై జనకుడు మాట్లాడుతున్నాడు.

మునులలో శ్రేష్ఠుడైన ఓ మహాముని! సత్కులమందు పుట్టిన వానిచేత కన్యాదాన సమయమున తమ కులమునుగూర్చి పూర్తిగా చెప్పతగినది. కావున వినుము. తన కర్మలచేత మూడులోకములందు ప్రసిద్ధుడు పరమధర్మాత్ముడు బలముకల వారందరిలో శ్రేష్ఠుడగు **నిమి** అను మహారాజుకలడు.

నిమియొక్క కుమారుడు **మిథి** అనువాడు. అతనియొక్క పుత్రుడు మొదటి **జనకుడు.** ఇతడిచేతనే మిథిల అను నగరము నిర్మింపబడినది. మొదటి జనకుని కుమారుడు **ఉదావసువు** అనువాడు.

ఈ ఉదావసువునకు ధర్మాత్ముడైన **నందివర్ధనుడు** పుట్టేడు. ఈ నందిర్ధనుని కుమారుడు **సుకేతువు.**

సుకేతువునకు ధర్మాత్ముడు మహాబలవంతుడు అయిన **దేవరాతుడు** జన్మించేడు. రాజర్షిఅయిన దేవరాతునకు **బృహద్రథుడు** పుట్టేడు.

బృహద్రథునకు శూరుడు ప్రతాపవంతుడు అయిన **మహావీరుడను** పుత్రుడు జన్మించేడు. మహావీరునకు ధైర్యవంతుడు సత్యవిక్రముడు అయిన **సుధృతి** అనువాడు పుట్టేడు.

సుధార్మికుడు ధర్మాత్ముడు అయిన **ధృష్టకేతువు** సుబుద్ధియొక్క కుమారుడు. ఈ ధృష్టకేతువునకు **హర్యశ్వుడని** ప్రసిద్ధిపొందిన కుమారుడుకలడు. హర్యశ్వునకు **మరువు** అనువాడు జన్మించెను. మరువుయొక్క కుమారుడు **ప్రతింధకుడు.** ప్రతింధకునియొక్క కుమారుడు ధర్మాత్ముడైన **కీర్తిరథుడు.**

కీర్తిరథుని పుత్రుడు **దేవమీఢుడు.** దేవమీఢుని కుమారుడు **విబుధుడు.** విబుధునకు **మహీధ్రకుడ**నువాడు కలిగెను.

మహీధ్రకునకు మహాబలుడైన **కీర్తిరాతుడ**నువాడు జన్మించెను. కీర్తిరాతునకు **మహారోముడు** పుట్టేడు. మహారోమునకు **స్వర్ణరోముడు** పుట్టేడు. రాజర్షియైన స్వర్ణరోమునకు **హ్రస్వరోముడు** పుట్టెను.

తస్య పుత్రద్వయం జజ్ఞే ధర్మజ్ఞస్య మహాత్మనః
జ్యేష్ఠో౽హమనుజో భ్రాతా మమ వీరః కుశధ్వజః॥

మహాత్ముడు ధర్మజ్ఞుడైన హ్రస్వరోమునకు ఇద్దరు పుత్రులుకలిగిరి. నేను **(జనకుడు)** పెద్దవాడిని, వీరుడైన **కుశధ్వజుడు** నాయొక్క అనుజుడు. ఇక్కడ "అహం జ్యేష్ఠః" అనుట ధర్మమునాశ్రయించి చెప్పినది. తన పేరును, గురువుయొక్క పేరును, లుబ్ధునియొక్క పేరును, జ్యేష్ఠసంతానముయొక్క పేరును చెప్పుట శ్రేయస్కరముకాదు అను స్మృతిధర్మాన్ని తెలిసి జనకుడు మాట్లాడుతున్నాడు. మా తండ్రీ రాజైన హ్రస్వరోముడు, పెద్దవాడనైన నన్ను రాజ్యమునందు అభిషేకించి కుశధ్వజుని భారమును నాయందు ఉంచారు.

వృద్ధుడైన తండ్రి స్వర్గమునకు వెళ్ళగా సోదరుడైన దేవతలతో సమానుడైన కుశధ్వజుని స్నేహితునిగా చూచుచూ ధర్మముతో రాజ్యభారమును వహించితిని. తరువాత కొంతకాలమునకు పరాక్రమవంతుడైన సుధన్వుడను రాజు మిథిలను ముట్టడింప తలచి సాంకాశ్యనగరమునుండి మిథిలను చేరేడు.

శ్రేష్ఠమైన శివధనుస్సును పద్మాక్షియైన నాకుమార్తె సీతను ఇమ్మని ఆ సుధన్వుడు నాకు వర్తమానం పంపేడు.

ఓ బ్రహ్మర్షీ! ఆ రెంటినీ ఇవ్వక పోవుటచే అతనికి నాకు యుద్ధము జరిగెను. ఆయుద్ధమునందు ఆ సుధన్వుడు నాచేత చంపబడినాడు.

ఓ మునిశ్రేష్ఠా! రాజైన ఆ సుధన్వుని చంపి నాసోదరుడు వీరుడు అయిన కుశధ్వజుని సాంకశ్యనగరమునకు రాజును చేసితిని.

ఓ మహాముని ఇతడు నాయొక్క సోదరుడు చిన్నవాడు. నేను జ్యేష్ఠుడను. ఓ మునిపుఙ్గవా! మిక్కిలి సంతసించిన వాడనై ఆ కన్యలను ఇచ్చుచున్నాను. రామునకు సీతను, లక్ష్మణునకు ఊర్మిళను ఇచ్చుచున్నాను. నీకు భద్రమగుగాక!

వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతోపమామ్।
ద్వితీయామూర్మిళాం చైవ త్రిర్దదామి న సంశయః॥ ౨౧

వీర్యశుల్కయి దేవకన్యతో సమానమైన నాకుమార్తె సీతను రెండవ కుమార్తె ఊర్మిళను మాడుసార్లు ఇచ్చుచున్నాను. సంశయములేదు.

ఇక్కడ **త్రిః దదామి** అంటే...

చతుర్విధ పురుషార్థములలో ధర్మ అర్థ కామ పురుషార్థముల విషయంమునందే స్త్రీ అపేక్షింపబడుచున్నది. మోక్షసాధన విషయంలో స్త్రీ అపేక్షితకాదు.

వివాహసమయంలో...

ప్రజా సహత్వకర్మభ్యః ప్రతిపాదయామి అని కన్య వరునకు ఇవ్వబడుచున్నది. కనుక నీకు ధర్మముకొరకు ఇచ్చుచున్నాను. దీనివలన దేవతాఋణము తీరుచున్నది. కామముకొరకు ఇచ్చుచున్నాను. దీనివలన సంతానమును పొంది పితౄణమునుండి ముక్తుడగుచున్నాడు. అర్థముకొరకు ఇచ్చుచున్నాను. అని ఇక్కడ చెప్పినట్లుగా కనబడుటలేదు. ఇక్కడ అర్థము సంహితాస్వరూపము. **య ఏవమేతా మహాసంహితా వేద। సంధీయతే ప్రజయా పశుభిః బ్రహ్మవర్చసే నాన్నాద్యేన సువర్గేణ లోకేన** ఈవిధంగా తెలిసిచరించువాడు ఐహిక ఆముష్మికాలను పొందుతాడని శ్రుతిచెప్పింది. వివాహము వేదోక్తరీతిని అనుసరించి జరుగుచున్నది. కనుక ఈ మూడింటికొరకు ఇస్తున్నాను అని ముమ్మారు పలుకుట.

తనకు అనుకూలవతియైన కన్యను తనకొరకు వరించవలసినదని **మదర్థం కన్యాం వృణీధ్వం** యోగ్యులగు విప్రులను కనీసం నలుగురిని పంపాలి.

వారు కన్యాదాతవద్దకు పోయి...

నప్త్రే పౌత్రాయ పుత్రాయ వర్మణే వరాయ

నప్త్రీం పౌత్రీం పుత్రీం అముకనామ్నీం కన్యాం ధర్మప్రజా సంపత్యర్థం వృణీమహే అని అడుగుతారు. అందుకే ధర్మవేత్త అయిన దశరథుడు వసిష్ఠ వామదేవ జాబాలి కాశ్యప మార్కండేయ కాత్యాయనులనుముందు వెళ్ళమన్నారు. వసిష్ఠాదులు వంశచరిత్రను చెప్పేరు.

జనకుడు తన వంశచరిత్రను చెప్పి ముమ్మారు ఇచ్చెదననిచెప్పేరు.

వైదికమతాను సారము ముమ్మారుచెప్పిన వచనము ఇది పరమసత్యమను దానిని నిర్ధారించును.

త్రిరాహ త్రిషత్యా హి దేవాః ఈవిధంగా చెప్పుటవలన వివాహమునకు ఆహ్వానింపబడిన దేవతలు కన్యాదాత వాక్కునందు సత్యత్వబుద్ధికలిగి దాతకు దానఫలమును ఇచ్చుచున్నారు.

త్రిః దదామి అనుటను పూర్వవాఖ్యాతలు త్రికరణశుద్ధిగా అని వాఖ్యానించేరు. ఓ దశరథమహారాజా! చాలాసంతోషపూర్వకంగా ఆ కన్యలను ఇచ్చుచున్నాను.

రామలక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వ హ
పైతృకార్యం చ భద్రం తే తతో కారయస్వ హ॥ ౨౩

రాజా! రామలక్ష్మణులకు గోదాన వ్రతమును చేయించు. పితృకార్యముకూడా (నాందీశ్రాద్ధము) చేయించు. తరువాత వివాహంజరిపించు.

విద్యాభ్యాస సమయంలో క్షురకర్మ, అద్దం చూసుకొనుట ఇత్యాదులు నిషేధం. ఇప్పుడు స్నాతకుడైనాడు కావున ఈ గోదానం (గో అవదానే ఖండనే).

గోదాన నాందీశ్రాద్ధాదులవలన వరునకు యజ్ఞాకర్మాధికారము (అగ్నిపరిచర్యా ధికారం) సిద్ధించుచున్నది. ఈ నాందీశ్రాద్ధ సమయంలో చేయు గోదానముద్వారా జగత్తుయొక్క పాపసమూహము నశించుచున్నది. గోవుద్వారా లభించు క్షీర ఆజ్యాదులు యజ్ఞసాధనములు అగుచున్నవి. వీనివలన విశ్వశ్రేయస్సు సిద్ధిస్తున్నది తద్వారా విశ్వరూపుడు సంతోషిస్తున్నాడు.

స్థాలీపాక బ్రాహ్మణులను పేర చేయుకర్మకు నాందీశ్రాద్ధమని పేరు.

నాందీదేవతాహ్వానము మొదలు నాలుగు రాత్రులు నాందీ(పితృ) దేవతలు ఆ ప్రదేశమున ఉండి రక్షింతురు.

అందుకే శేషహోమపర్యంతము దీక్షాగృహంలో భోజనముచేయరు. ఈ దీక్షామధ్యమున వధూవరులు స్నానముచేయకున్నను ఔపాసనాగ్ని పరిచర్యకు అర్హులగుచున్నారు.

మఘా హ్యద్య మహాబాహో తృతీయే దివసే ప్రభో
ఫల్గున్యాముత్తరే రాజన్ తస్మిన్ వైవాహికం కురు
రామలక్ష్మణయో రాజన్ దానం కార్యం సుఖోదయమ్॥

గొప్పబాహువులుగల ఓ మహారాజా! ఈరోజు మఘానక్షత్రం. నేటికి మూడవదినమందు ఫల్గుని, దానికి ఉత్తర నక్షత్రమందు వివాహకార్యమును చేయుము. రాజా! రామ లక్ష్మణులయొక్క సుఖోదయమునుగూర్చి దానకార్యములను చేయతగినది.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ఏకసప్తతితమ స్సర్గ సమాప్తము.

-

॥అథ ద్విసప్తతితమః సర్గః॥

(విశ్వామిత్రుడు భరతశత్రుఘ్నులకొరకు కుశధ్వజుని కన్యలను వరింపగా జనకుడు అంగీకరించుట.)

తముక్తవన్తం వైదేహం విశ్వామిత్రో మహామునిః
ఉవాచ వచనం వీరం వసిష్ఠసహితో కృపమ్॥ ౧

విశ్వామిత్ర మహాముని వసిష్ఠునితోకూడి జనకునితో మాట్లాడుతున్నాడు.

నరపుఙ్గవా! ఇక్ష్వాకురాజులయొక్క విదేహరాజులయొక్క కులములు అచింత్యములు అప్రమేయములు. ఈ ఇక్ష్వాకు విదేహ రాజులకు సమాన మైనవాడు ఎవ్వడూ లేడు.

సీతా ఊర్మిళలను రామ లక్ష్మణులకు ఇచ్చుట అనునది తగిన ధర్మసంబంధము. రూపసంపదలచేతకూడా ఇది తగిన సంబంధము.

నరశ్రేష్ఠా! మేము చెప్పదలచిన మాట విను. నీ సోదరుడు రాజు అయిన కుశధ్వజుడు ధర్మజ్ఞుడు.

అస్య ధర్మాత్మన్ రాజన్ రూపేణాప్రతిమం భువి
సుతాద్వయం నరశ్రేష్ఠ పత్న్యర్థం వరయామహే॥ ౫

నరశ్రేష్ఠా జనకమహారాజా! భూమియందు సాటిలేని సౌందర్యవతులైన కుశధ్వజునియొక్క పుత్రికాద్వయమును భరతశత్రుఘ్నులకు పత్నులుగా వరించు చున్నాము.

భరతకుమారునికొరకు ధీమంతుడైన శత్రుఘ్నునికొరకు నీ తమ్ముని కుమార్తెలను వరించుచున్నాము.

ఈ దశరథపుత్రులు అందరూ రూపయౌవనములతో ప్రకాశించువారు. లోకపాలురుతో సమానులు. దేవతుల్య పరాక్రమవంతులు.

మహారాజా! ఇక్ష్వాకువంశమునకు నీయొక్క వంశమునకు ఈ వివాహముచే బంధము దృఢమగుగాక!

వసిష్ఠునియొక్క వచనము ప్రకారము విశ్వామిత్రుని మాటను విని జనకుడు అంజలిబద్ధుడై మాట్లాడుతున్నాడు.

మునిపుఙ్గవులైన మీరు ఏకారణంగా మా వంశమునకు తగిన కులసంబంధమును

స్వయముగా ఆజ్ఞాపించుచున్నారో ఆ కారణంగా మా వంశము ధన్యమైనదిగా తలచుచున్నాను.

మీరు చెప్పినట్లే అగుగాక! మీకు భద్రమగుగాక!

పత్న్యౌ భజేతాం సహితౌ శత్రుఘ్నభరతావభౌ॥ ౧౧

ఈ కుశధ్వజుని కుమార్తెలు కలిసిచరించెడు వారైన శత్రుఘ్నభరతులను పత్నులుగా సేవింతురుగాక!

భరతశత్రుఘ్నులకు పత్నులుగా వరించుచున్నామని మహర్షులు అడిగేరు, ఈ కన్యలు వారిని పత్నులుగా సేవించుటకు ఇస్తాను అని జనకుడు చెప్పేడు. తైతరీయబ్రాహ్మణము పత్నీరహితమగు యజ్ఞము యజ్ఞమేకాదని చెప్పింది. పత్నీ అనగా భర్తచేసిన యజ్ఞఫలమును అనుభవించునది అని అర్థము. **"శ్రీవృద్ధిహేతుత్వాత్ పత్నీనాం శ్రీత్వం"** వీరు భరతశత్రుఘ్నుల ధనాదితేజో వృద్ధి హేతువులు.

రామునకు సీతను ఇచ్చే విషయంలో జనకుడు పత్నీగా సేవిస్తుందని చెప్పలేదు. మహర్షులు సీతను రామునికొరకు పత్నిగా వరిస్తున్నామని అడగనూ లేదు. శేషహోమపర్యంతమైన నాలుగురోజుల వివాహముతో పత్నీత్వము సహజంగానే సిద్ధిస్తోంది కదా?

భరతశత్రుఘ్నుల విషయంలో అడిగినట్లుగా మరి రాముని విషయంలో ఆవిధంగా ఎందుకు అడుగలేదు?

సీతకు గృహముతో వియోగాన్ని అనుభవించవలసి ఉందని తెలిసినావారు కనుకనే ఆవిధంగా అడిగేరు. సీత విషయంలో జనకుడు వీర్యశుల్క సహధర్మచారిణి, సీత నిన్ను విడచిపెట్టని నీడ అనే చెప్పేరు. అంటే రాముడు ఎక్కడ ఉంటే అక్కడ సీత ఉంటుంది. సీత ఎక్కడ ఉంటే అక్కడ రాముడు ఉంటాడు. ఈ వివాహం దంపతులకు గృహవియోగాన్ని కలిగిస్తుందని తెలిసే లోకకల్యాణకారకమైన వివాహాన్నిచేసేరు.

'గృహాన్ గచ్ఛ గృహపత్నీ యథా సౌవశీత్వం విదధ మావధాసి' మాండవీ శ్రుతకీర్తుల విషయంలో వీరు భరతశత్రుఘ్నులకు పత్నీస్థానీయులని మహర్షులచేతను జనకునిచేతను చెప్పబడుటచే **"తాత్స్యాద్గృహాదారాః"** వీరు

గృహసంబంధము నిత్యముగా కలవారని చెప్పకనే చెప్పేరు.

మహామునీ! మహాబలశాలులగు నలుగురు రాజపుత్రులు ఒకేదినమున రాజపుత్రికల పాణిగ్రహణము చేసెదరు.

బ్రహ్మన్! పూర్వోత్తర ఫల్గుణీనక్షత్ర ద్వయముతోకూడిన దినమునందు ప్రజాపతి అయిన భగుడు దేవతగాగల ఉత్తరఫల్గుణీ నక్షత్రకాలమున వివాహకృత్యమును విద్వాంసులు ప్రశస్తమని చెప్పుచున్నారు.

జనకమహారాజు ఇలా సౌమ్యముగా పలికి లేచి అంజలిబద్ధుడై మునివరు లిరువురిగూర్చి మాట్లాడుతున్నాడు.

ఓ మహామునులారా! మీచేత నాకు గొప్పధర్మకార్యము చేయబడినది. మీ ఇద్దరికీ శిష్యుడనైయున్నాను. మునిపుఙ్గవులైన మీరు ఈ సింహాసనములను అధిష్ఠింతురుగాక!

ఈ మిథిల దశరథునకు ఎట్లో, నాకు అయోధ్యా అట్లే ప్రభుత్వ విషయమున సందేహము లేదు. తగువిధముగా చేయుటకు మీరు తగియున్నారు.

విదేహరాజైన జనకుడు అట్లు పలుకగా రఘునందనుడైన దశరథుడు సంతోషంతో జనకునిగూర్చి పలుకుచున్నాడు.

మిథిలేశ్వరులైన మీ సోదరులు లిరువురూ లెక్కింపశక్యముగాని గుణములు కలవారు. మీచేత చాలామంది ఋషులు రాజులు పూజింపబడినారు.

నీకు క్షేమమగుగాక! నీకు భద్రమగుగాక! నేను నా నివాసమునుగూర్చి వెళ్ళగలను. సమస్తమైన శ్రాద్ధకర్మలను అంటే నాందీశ్రాద్ధాదులను చేయగలను. అని...

గొప్పకీర్తిగల దశరథమహారాజు జనకమహారాజును అడిగి వసిష్ఠ విశ్వామిత్రులను ముందు ఉంచుకొని శీఘ్రముగా వెళ్ళేడు.

దశరథమహారాజు తన నివాసమునకు వెళ్ళి శాస్త్రవిధిని అనుసరించి శ్రాద్ధకర్మను చేసి ప్రాతఃకాలమున లేచి ఉత్తమమైన గోదానవ్రతమును చేసేరు.

నరాధిపతియైన దశరథమహారాజు పుత్రులను ఒక్కొక్కరిని ఉద్దేశించి బ్రాహ్మణులకొరకు గోసహస్రములను దానముచేసేరు.

పుత్రవాత్సల్యముకల పురుషశ్రేష్ఠుడైన దశరథుడు గోదానమును ఉద్దేశించి

బంగారుకొమ్ములతో క్షీరసమృద్ధిగల, దూడలతోకూడిన నాలుగులక్షల ఆవులను, పాలుపిదుకుటకు కాంస్య పాత్రలను ఇంకనూ అధికమైన ధనమును బ్రాహ్మణులకు ఇచ్చెను.

స సుతైః కృతగోదానైర్వృతస్తు నృపతిస్తదా
లోకపాలైరివాభాతి వృతః సౌమ్యః ప్రజాపతిః॥ ౨౫

గోదానముచేసి పుత్రులతోకూడగియున్న దశరథమహారాజు లోకపాలులచే ఆవృతుడైన సౌమ్యుడైన ప్రజాపతివలె ప్రకాశిస్తున్నాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
ద్విసప్తతితమ స్సర్గ సమాప్తము.

-

॥అథ త్రిసప్తతితమః సర్గః॥

(శ్రీరామలక్ష్మణ భరతశత్రుఘ్నుల వివాహము.)

యస్మింస్తు దివసే రాజా చక్రే గోదానముత్తమమ్
తస్మింస్తు దివసే శూరో యుధాజిత్సము పేయివాన్॥ ౧

దశరథుడు ఏ దినమందు గోదానవ్రతమును చేసేడో ఆ దినమే భరతుని మేనమామ యుధాజిత్తు వచ్చేరు.

కేకయరాజకుమారుడు సాక్షాత్తు భరతుని మేనమామ అయిన యుధాజిత్తు దశరథమహారాజును చూచి కుశలము అడిగి మాట్లాడుతున్నాడు.

కేకయప్రభువు స్నేహపూర్వకంగా కుశలమును అడిగారు. నీవు ఎవరియొక్క కుశలమునందు కోరికకలవాడవో వారందరూ ఇప్పుడు అనామయులుగా ఉన్నారు.

రఘునందనా దశరథమహారాజా! కేకయమహీపతి నాయొక్క మేనల్లుని చూడకోరిక కలవాడగుటచే నేను అయోధ్యనుగూర్చి వెళ్ళేను.

దశరథమహారాజా! నీయొక్క కుమారులు వివాహముకొరకు నీతోకూడి మిథిలను చేరినవారిగా తెలుసుకొని సోదరియొక్క కుమారుని చూచుటకు నేను శీఘ్రముగా ఇచటికి వచ్చినాను.

తరువాత రాజైన దశరథడు ప్రియమైన అతిథిని చూచి పూజార్హమైన అతనిని అధిక సత్కారములచే పూజించెను.

కర్మవేత్త అయిన దశరథుడు మహాత్ములైన పుత్రులతో ఆ రాత్రి గడిపి ప్రభాతవేళ లేచి కర్మలను ఆచరించి ఋషులను ముందుంచుకొని యజ్ఞవాటమును చేరేడు.

సర్వాలంకార భూషితులైన సోదరులతోకుడిన రాముడు విజయమనెడు మహూర్తమున చేయబడిన వివాహమఙ్గళములు కలవాడై మహర్షులను ముందు ఉంచుకొని సోదరులతో కలిసి తండ్రి సమీపమును చేరెను.

భగవాన్ వసిష్ఠులు వైదేహునితో...

రాజా! నరశ్రేష్ఠా! దశరథుడు కౌతుకమంగళములను పూర్తిచేసి కన్యాదాతవైన నీకొరకు ఎదురు చూచుచున్నాడు.

సర్వప్రయోజనములు దాత ప్రతిగ్రహీతల ద్వారానే జరుగును. ఉత్తమమైన

వివాహమును చేసి స్వధర్మమును నిర్వహించుము. మహాత్ముడైన వసిష్ఠునిచే ఈవిధంగా చెప్పబడినవాడైన పరమోదారుడు గొప్పతేజస్సుకలవాడు పరమధర్మవేత్త అయిన జనకుడు వసిష్ఠునితో...

మీరు ఎవరి ఆజ్ఞకై ఎదురుచూస్తున్నారు. మిమ్ము అడ్డగించు ద్వారపాలకుడు ఎవడైనా ఉన్నాడా! లేనియెడల స్వగృహములో సంకోచము ఎందులకు? ఈ రాజ్యము నీ రాజ్యమువంటిదే.

మునిశ్రేష్ఠా! నాయొక్క కన్యలు పరిపూర్ణముగా కౌతుక మఙ్గళములు చేయబడిన వారై జ్వలిస్తూన్న అగ్నిజ్వాలలవలె వేదిమూలమును ఆశ్రయించి ఉన్నారు. నేను ఈ వేదియందు సిద్ధముగా ఉండి మీకొరకు ఎదురు చూచుచున్నాను. దశరథమహారాజా! విఘ్నములు ఏవియు లేక కార్యముచేయుము. ఆలస్యము ఎందుకు. అని అడిగిన జనకుని మాటలను విని...

దశరథుడు కుమారులను సర్వఋషిగణములను తీసుకొని లోనికి ప్రవేశించెను. తరువాత విదేహరాజు వసిష్ఠునిగూర్చి...

ధార్మికుడా సర్వసమర్థుడవైన వసిష్ఠమహర్షీ! ఋషులతో కలిసి...

రామస్య లోకరామస్య క్రియాం వైవాహికీం విభో॥ ౧౯

లోకమునకు ఆనందకారకుడైన రామునియొక్క వివాహసంబంధమైన క్రియనుచేయించు.

ఇక్కడ జనకుడు ఈ వివాహము లోకకల్యాణకారకమైన క్రియ అని చెప్తున్నారు.

మహాతపస్సంపన్నుడైన భగవాన్ వసిష్ఠులు జనకునితో అట్లే అని పలికి విశ్వామిత్రుని శతానందుని ముందుంచుకొని...

పందిరిమధ్యయందు యథాశాస్త్రముగా వేదిని ఏర్పాటుచేసి దానిచుట్టూ గంధపుష్పములు బంగారుపాలికలతోను అంకురములుగల రంధ్రములతో కూడిన కుంభములు అంకురములతో నిండిన మూకుళ్ళతోను, అగరు ధూపములతోకూడిన ధూపపాత్రలతోను శంఖాకారముగల పాత్రలతో స్రుక్కుస్రువాలతో అర్ఘ్యోదకములచే పూరింపబడిన పాత్రలచేతను పేలాలతో నిండిన పాత్రలచేతను సంస్కరింపబడిన అక్షతలచేతను ఆ వేదిని సమముగా అలంకరించిరి.

మహాతేజోవంతుడైన భగవాన్ వసిష్ఠులు సమమైన దర్భలతో యథాశాస్త్రముగా మంత్రపూర్వకముగా వేదియందు అగ్నిని ఉంచి ఆ అగ్నియందు హోమము చేసేరు.

తతః సీతాం సమానీయ సర్వాభరణభూషితామ్
సమక్షమగ్నేః సంస్థాప్య రాఘవాభిముఖే తదా
అబ్రవీజ్జనకో రాజా కౌసల్యానన్దవర్ధనమ్॥ ౨౬

తరువాత జనకమహారాజు సర్వాభరణభూషితయైన సీతను తీసుకొనివచ్చి అగ్నిసమక్షమున రామునికి అభిముఖముగా ఉంచి కౌసల్యానన్దవర్ధనుడైన రామునితో పలుకుతున్నాడు.

ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ।
ప్రతీచ్ఛచైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా॥

ఇదగో సీత, నీకు సహధర్మచారిణికాగల నాయొక్క కూతురు. ఈమెను అంగీకరింపుము. నీకు భద్రమగుగాక! ఈమె చేతిని నీచేతిచే గ్రహింపుము.

పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా।
ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మన్త్రపూతం జలం తదా॥

పతివ్రతయై మహాభాగ్యవంతురాలగు ఈమె ఛాయవలె నిన్ను అనుగమించి ఉండగలదు. అని పలికి జనకుడు మంత్రపూతములైన జలమును విడిచెను. ఛాయవలె ఉండుట అంటే నీతో నిత్యసంబంధంకలదై ఉంటుంది. ఛాయ ముందు వెనుకలలో; ఇటు అటు ఉంటుంది. లేనియడల తనయందే ఉంటుంది. చూసే కన్ను ఉండగా నీడలేని వస్తువు ఉండదు.

ఖచ్చితంగా లక్ష్యాన్ని చూడగలిగితే అంటే దృష్టిని ఏకాగ్రం చేసి సీతారాములను చూస్తే సీత రామునియందే ఉన్నదని, రాముడు సీతయందే ఉన్నాడని తెలుస్తుంది. దృష్టి విక్షేపంవలనే వస్తుఛాయల దూరాదూరాలుకాని, ఏకాగ్రమైన దృష్టికి ఆ వియోగం తెలియదు.

సీతారాములయందు విశ్వామిత్ర వసిష్ఠ జనక హనుమ వంటి వారి దృష్టి అటువంటిది. మిగిలిన వారియందు అదిలేదు. జనకుడు నాయనా! ఈమె నువ్వే, ఈమె కుడ్యప్రాకారాదులలో విడిగా ఎక్కడో ఉండదు.

నీలోనే ఉంటుంది. నీతోనే ఉంటుంది. ఇది జనకుని మాట. సుందరకాండలో హనుమకు మాత్రమే ముద్రికాప్రదానం చేయటంలో ఆంతర్యం ఇదే.

అప్పుడు ఋషులు దేవతలు సాధుసాధు అని పలికేరు. దేవదుందుభులు మ్రోగినవి. గొప్ప పుష్పవృష్టి కురిసినది.

జనకమహారాజు మన్త్రోదకపురస్కృతురాలగు సీతను ఇచ్చి సంతోషముతో నిండినవాడై పలుకుతున్నాడు.

లక్ష్మణా! రమ్ము. నాచేత ఇవ్వ నిశ్చయింపబడిన ఊర్మిళను అంగీకరింపుము. హస్తమును హస్తముతో గ్రహింపుము. ఆలస్యము కానీయకు.

జనకుడు లక్ష్మణునితో ఇట్లు పలికి భరతునితో...

భరతా! నీ హస్తముచేత మాండవియొక్క హస్తమును గ్రహింపుము.

ధర్మాత్ముడైన జనకుడు శత్రుఘ్నునిగూర్చి...

గొప్పబాహువులుకలవాడా! నీ చేతితో శ్రుతకీర్తి చేతిని గ్రహింపుము.

ఓ రామలక్ష్మణభరతశత్రుఘ్నులారా! మీరందరూ సౌమ్యులు. మంచి చరిత్రకలవారు. నియమబద్ధమైన జీవిక కలవారు. పత్నులతో కూడినవారుగా అగుదురుగాక!

ఆ నలుగురు జనకుని మాటలను విని వసిష్ఠుని అనుమతి పొందినవారై తమ హస్తములతో ఆ నలుగురి కన్యలయొక్క హస్తములను స్పృశించిరి.

మహాత్ములైన రఘువంశశ్రేష్ఠులు భార్యలతోకూడి అగ్నికిని యజ్ఞవేదికిని జనకునకు మహర్షులకు ప్రదక్షిణముచేసి చెప్పినప్రకారము యథాశాస్త్రముగా వివాహము చేసుకొనిరి.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు సుందరములైన సీతా ఊర్మిళా మాండవీ శ్రుతకీర్తుల హస్తములను గ్రహించినవెంటనే అన్తరిక్షమునుండి మిక్కిలి ప్రకాశవంతమైన పుష్పవృష్టి కురిసినది.

రాఘవముఖ్యుల వివాహమున దివ్యమైన దుందుభిధ్వనులతోను గీతవాద్య ధ్వనులతోను అప్సరఃసంఘములు నాట్యము చేసిరి. గంధర్వులు మధురముగా

పాడిరి. అక్కడ ఉన్నవారిచే అదంతా ఆశ్చర్యకరముగా చూడబడినది. ఇట్టి నృత్యగీతవాద్యాదుల ధ్వనులు ప్రవర్తిల్లుచుండగా మహౌజసులైన ఆ సోదరులు మూడుపర్యాయములు అగ్ని పరిక్రమణం చేసి కన్యలను వివాహమాడిరి.

అథోపకార్యం జగ్ముస్తే సభార్యా రఘునందనాః
రాజాప్యనుయయౌ పశ్యన్సర్షిసంఘః సబాన్ధవః॥ ౪౧

తరువాత రామలక్ష్మణభరతశత్రుఘ్నులు తమ భార్యలతో కూడి విడిదికి వెళ్ళేరు. దశరథుడుకూడా ఋషులతోను బంధువులతోను కూడినవాడై భార్యసమేతులైన పుత్రులను చూచుచూ అనుసరించి వెళ్ళేరు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
త్రిసప్తతితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ చతుస్సప్తతితమః సర్గః॥

(విశ్వామిత్రుడు హిమాలయములకు వెడలుట. జనకుడు కన్యలకు అరణము ఇచ్చుట. దశరథుడు అయోధ్యకు పయనమగుట. పరశురామ దర్శనము.)

అథ రాత్ర్యాం వ్యతీతాయాం విశ్వామిత్రో మహామునిః
ఆపృష్ట్వా తౌ చ రాజానౌ జగామోత్తరపర్వతమ్॥౧
ఆశీర్భిః పూరయిత్వా చ కుమారాంశ్చ సరాఘవాన్।

విశ్వామిత్రుడు రాత్రి గడచిన పిదప రాఘవులైన రాజ కుమారులను ఆశీర్వదించి ఉత్తరదిక్కునందలి పర్వతమునుగూర్చి వెళ్ళేరు.

విశ్వామిత్రుడు వెళ్ళిన తరువాత దశరథమహారాజు రాజైన వైదేహుని అడిగి శీఘ్రముగా అయోధ్యకు బయలుదేరేరు.

జనకుడు అయోధ్యకు వెళ్ళుచున్న దశరథుని అనుసరించి వెళ్ళి సాగనంపేడు. తన కుమార్తెలకు అరణముగా చాలా కన్యాధనమును ఇచ్చేరు.

కన్యల తండ్రియైన జనకుడు అనేక లక్షల గోవులను లక్షలకొలది కంబళ్ళను కోట్లకొలది పట్టువస్త్రములను ఏనుగులను గుఱ్ఱములను రథములను కాల్బలమును సాలంకృతులైన సౌన్దర్యవతులైన దాసీజనమును వారికి ఇచ్చేరు. పరమసంతోషంతో జనకుడు వెండిని బంగారమును ముత్యములను పగడములను కన్యాధనముగా ఇచ్చేరు.

మిథిలేశ్వరుడైన జనకమహారాజు కుమార్తెలకు అత్యధికమైన ధనమును ఇచ్చి దశరథునివద్ద అనుజ్ఞను తీసుకొని మిథిలానగరాన్ని ప్రవేశించేరు.

దశరథమహారాజుకూడా మహాత్ములైన పుత్రులతోకూడి ఋషులను ముందుంచుకొని సైన్యము వెంటరాగా అయోధ్యకు పయనమైనారు.

దశరథుడు ఋషిసముదాయముతో రామలక్ష్మణభరతశత్రుఘ్నులతోకూడి ప్రయాణము చేయుచుండగా పక్షులు ఘోరముగా ధ్వనిచేయసాగినవి.

భూమిపై చరించు మృగములు ప్రదక్షిణముగా వెళ్ళినవి. భయంకరముగా ధ్వనిచేయుచున్న పక్షులను ప్రదక్షిణముగా తిరుగుచున్న మృగములను చూచిన దశరథుడు వసిష్ఠునితో...

పక్షులు ఘోరముగా అరుచుచూ ప్రతికూలముగా ఉన్నవి. మృగములు

ప్రదక్షిణముగా తిరుగుచున్నవి. హృదయమును కంపింపచేయు ఇదంతయు ఏమిటి? నా మనస్సు విషాదగ్రస్త మగుచున్నది అని పలికెను.
మహర్షి దశరథమహారాజుయొక్క వచనములను విని దీనికి ఏది ఫలమో చెప్పెదను వినండి అని 'ఉవాచ మధురాం వాణీం' మధురంగా పలికేరు. దశరథుని హృదయాన్ని ఆక్రమించిన విషాదం తొలగిపోయి స్వస్థుడగునట్లుగా మాట్లాడుతున్నారు.
అనూహ్యమైన దైవకృతమైన ఘోరమైన భయమును పక్షులు సూచించుచున్నవి. దానిని ఈ మృగములు శాన్తింప చేయుచున్నవి. దశరథమహారాజా నీచేత మనస్తాపము విడువబడుగాక!
వారు అలా మాటలాడుచుండగా! భూమిని కంపింపచేయుచూ శుభకరమైన వృక్షములను పడవేయుచు వాయువు పుట్టింది.

తమసా సంవృత స్సూర్యః సర్వా న ప్రబభుర్దిశః।

సూర్యుడు చీకటిచే ఆవరింపబడ్డాడు. సమస్తమైన దిక్కులు ప్రకాశాన్ని కోల్పోయాయి. సమస్తమైన సైన్యము దుమ్ముచేత కప్పబడి మూర్ఛను పొందింది. ఆసమయంలో వసిష్ఠుడు ఇతరులైన ఋషులు కుమారులతో కూడిన దశరథుడు వీరు మాత్రమే చైతన్యవంతంగా ఉన్నారు. మిగిలిన వారు అచేతనులు అయేరు. ఆ ఘోరమైన అంధకారమునందు ఆ సేన భయంకరుడును జటామండల మును ధరించినవాడును కైలాసమువలె ఎదిరింపశక్యము కానివాడును ప్రళయకాలాగ్నివలె సహింప శక్యము కానివాడును తేజస్సులచే జ్వలిస్తూన్న వాడును దుర్నిరీక్షుడు పరశువును భుజమందు ధరించినవాడును మెఱుపుల సమూహముతో సమానమైన ధనుస్సును, శ్రేష్ఠమైన శరమును గ్రహించి త్రిపురఘ్నుడైన శివునివలె ఉన్న ఆ భృగువంశజుడైన పరశురాముని చూచేరు. భయంకరుడు జ్వలిస్తూన్న అగ్నివలెనున్న అతనిని చూసి జపహోమ పరాయణులైన బ్రాహ్మణులైన వసిష్ఠాది మునులందరూ కలిసి మాటలాడు కొనుచుండిరి.
తండ్రి వధచేత కోపించిన ఇతడు క్షత్రియజాతిని నశింప చేయడుకదా! పూర్వము క్షత్రియవధను చేసి పోయిన కోపము మనస్తాపము కలవాడైనాడు కదా!

మరల ఇతనిచే క్షత్రియ వంశవినాశనము అభిలషింపబడలేదుకదా! ఋషులు ఈవిధంగా ఒకరితో ఒకరు మాట్లాడుకొని అర్ఘ్యమును గ్రహించి భీమదర్శనుడైన భార్గవరామునిగూర్చి రామా రామా అని మధురముగా మాట్లాడుతున్నారు.

ప్రతిగృహ్య తు తాం పూజామృషిదత్తాం ప్రతాపవాన్
రామం దాశరథిం రామో జామదగ్న్యోఽభ్యభాషత॥ ౨౪

ప్రతాపవంతుడైన జమదగ్ని కుమారుడైన రాముడు ఋషులచేత ఇవ్వబడిన ఆపూజను స్వీకరించి దశరథుని కుమారుడైన రాముగూర్చి మాట్లాడు తున్నాడు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
చతుస్సప్తతితమ స్సర్గ సమాప్తము.

-

॥అథ పఞ్చసప్తతితమః సర్గః॥

(పరశురాముడు వైష్ణవధనుస్సు శరసంధానం చేయమని రాముని కోరుట.)

రామ దాశరథే రామ వీర్యం తే శ్రూయతేఽద్భుతమ్।
ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్॥౧

దశరథకుమారా రామా! రామా! నీయొక్క పరాక్రమము అద్భుతమైనదిగా వినబడుతోంది. శివధనుర్భంగముగూర్చి కూడా పూర్తిగా నేను విన్నాను. నీవు చేసిన శివధనుర్భేదనము అద్భుతము అచిన్త్యము.

ఇక్కడ మహర్షి రెండుసార్లు రామనామాన్ని ఉచ్చరించేరు.

మొదటిది దశరథపుత్రుడవైన రామా అని...

ఇది తల్లిదండ్రులచే లోకవ్యవహారార్థము కల్పింపబడినది.

రెండవసారికూడా రామా అనే పిలిచేరు మహర్షి,

రెండవది ఉత్కర్షహేతువు. ఇది స్వార్జితము. సాధనసాధ్యము.

నీ లోకోత్తర వీర్య రూప గుణములచే సంపాదితము. నీవు ఆశ్రితులందరుకూ ఆనందమును ఇచ్చువాడవు. కనుక నీవు రాముడవు. ఇక్కడ...

కేవలం మాతాపితరులచే కల్పింపబడిన నామమాత్రముచే ఇతడు రాముడు కాలేదు. తనయొక్క లోకోత్తర వీర్య రూప గుణములవలన సమస్త లోకములచే ఆవిధంగా పిలువబడుచూ సర్వులకు ఆనందమును కలిగిస్తున్నవాడు. కనుక రాముడు. దశరథరామునియందలి గుణోత్కర్షహేతువుగా రెండవ రామ నామమును మహర్షి చెప్పేరు. ద్వితీయనామం ఉత్కర్షహేతువని తైత్తిరీయసంహిత యందు ధిష్ణియదేవతలనుగూర్చి చెప్పే ఆఖ్యానంలో చెప్పేరు.

తచ్ఛ్రుత్వాహమనుప్రాప్తో ధనుర్గృహ్యాపరం శుభమ్॥

నేను ఆ వృత్తాంతాన్ని విని మరొక శుభకరమైన ధనుస్సును గ్రహించి వచ్చేను. రామా నీ పరాక్రమం అద్భుతం అన్నారు. అంటే ఇతఃపూర్వం అటువంటి పరాక్రమం లేదు. అదేవిధంగా ఈ ధనుస్సువంటి ధనుస్సులేదు. అంతకుముందు కొందరి పరాక్రమాలు తెలుసుకాని ఈ ధనుర్భంగరూపంగా ప్రదర్శితమైన పరాక్రమం ఉందే అది అచిన్త్యం. ఇతఃపూర్వదర్శిత పరాక్రమాలతో పోల్చిచూద్దామంటే గుణసంపర్క శూన్యత్వంవలన ఊహకుకూడా అందట్లేదు.

అటువంటి నీ పరాక్రమానికి ముగ్ధుడనై నీకొరకు సర్వశుభాలను కలిగించే మరొక ధనుస్సు తెచ్చాను. అంటే శివధనుస్సువలెనే ఇదీ నీకు శుభపరంపరలను ఇస్తుంది.

ఘోరమైనది జమదగ్నిద్వారా ప్రాప్తమైనది అయిన ఈ ధనుస్సును శరముచే పూరించి నీ బలమును చూపుము.

రాఘవా! నీవా ధనుస్సునకు శరసంధానము చేసినచో అప్పుడు నీ బలమును చూచి పరాక్రమముచే శ్లాఘింపతగిన నీకు ద్వంద్వయుద్ధమును ఇవ్వగలను.

అప్పుడు దశరథుడు పరశురాముని మాటలు విని విషణ్ణ వదనముతో దీనుడై అంజలిబద్ధుడై మాట్లాడుతున్నాడు.

క్షత్రియులపైగల కోపమునుండి ప్రకృష్టమైన శాన్తమును కలవాడవైనావు బ్రాహ్మణుడవు గొప్పకీర్తిగలవాడవు అయిన నీవు బాలులైన నాయొక్క పుత్రులకు అభయమును ఇమ్ము.

స్వాధ్యాయవ్రతముచే ప్రకాశించుచున్న భృగువంశీయుల కులమునందు పుట్టితివి. సహస్రాక్షునియందు ప్రతిజ్ఞచేసి శస్త్రమును విడిచినవాడవు.

నీవు ధర్మపరుడవై భూమినంతను కాశ్యపునకు ఇచ్చి వనమునుగూర్చి వెళ్ళి మహేంద్రపర్వతముపై నివసిస్తూన్నవాడవు.

ఓ మహామునీ! నీవు నాయొక్క సర్వవినాశనముకొరకు సంప్రాప్తించేవు. ఒక రాముడు చంపబడిన మేమందరము మరణించెదము.

దశరథుడు ఈ విధంగా పలుకుచుండగా ఆతని మాటలను ప్రతాపవంతుడైన జామదగ్ని అదరించక రామునిగూర్చియే మాట్లాడుతున్నాడు.

ఈ రెండు ధనుస్సులు శ్రేష్ఠమైనవి. దివ్యమైనవి. లోకములలో ప్రసిద్ధమైనవి. ధృఢమైనవి బలముగలవి. ప్రధానమైనవి. విశ్వకర్మచేత నిర్మితములైనవి.

నరశ్రేష్ఠా కాకుత్థా! ఏ ధనుస్సు నీచేత భగ్నము చేయబడిందో అది యుద్ధము చేయగోరు ఈశ్వరునకు దేవతలచే ఇవ్వబడిన త్రిపురఘ్నమైన ధనుస్సు.

ఎదిరింపశక్యముగాని ఈ రెండవ ధనుస్సు విష్ణువునకు ఇవ్వబడినది. కాకుత్థా రామా! మిక్కిలి ప్రకాశించుచున్న ఇది వైష్ణవధనుస్సు. ఇది శివధనుస్సుతో సమానమైన బలముగలది.

అప్పుడు దేవతలు శితికణ్ఠునియొక్క విష్ణువుయొక్క బలపరీక్షను చేయదలచి బ్రహ్మను అడిగిరి.

సత్యవంతులలో శ్రేష్ఠుడైన బ్రహ్మ దేవతల అభిప్రాయమును తెలుసుకొని శివునకు విష్ణువునకు విరోధమును కల్పించెను.

ఇరువురి మధ్య గొప్పయుద్ధం జరిగింది. విష్ణువుయొక్క హుంకార ధ్వనికి పినాకము జడమైనది. పిమ్మట త్రిలోచనుడు స్తంభింపచేయబడినాడు.

(శివధనువు విష్ణుధనువు రెండు సర్వసమములు. శివకేశవులు సర్వసములు. మరి హెచ్చుతగ్గుల బలపరీక్ష ఏమిటి? అంటే ఉపనిషత్పర్యన్తమైన వేదముయొక్క పూర్వార్థం ధర్మకర్మ ప్రతిపాదకము.

వసిష్ఠ విశ్వామిత్ర జనక రామరామాదులు బ్రహ్మవేత్తలు అయినను స్థితికర్తృత్వ దీక్షాధారులై సమాజాన్ని నడిపేరు. సర్వులు ఉపనిషద్ధర్మమునందు బ్రహ్మచింతన యందు వ్యవస్థితులైతే సృష్టి స్థితులు క్రమంతప్పుతాయి.

చతుష్షష్టితంత్రముల పుట్టుకకు సంబంధించిన ఉపాఖ్యానం శివపురాణంలో ఉంది. అది ఈ విషయాన్నే తెలియచేస్తుంది.

లోకంలో స్థితిప్రాధాన్యాన్ని అంగీకరించే త్రిలోచనుడు అంటే జ్ఞాని స్తంభితుడైనట్లు చెప్పేరు.)

అప్పుడు ఋషిసంఘములతో చారణులతోకూడి దేవతలు అచటకు వచ్చి ప్రార్థింపగా ఆ దేవతాశ్రేష్ఠులు ఇరువురు శాన్తించేరు.

విష్ణుపరాక్రమముతో శివధనుస్సు జడమగుట చూచి ఋషిగణములతోకూడిన దేవతలు విష్ణువే అధికుడని తలచేరు.

జడమైన శివం అమంగలకారకం. జ్ఞానం జడమైన కర్మకారకం. లోకవ్యవహార రీత్యా స్థితికారమైన కర్మప్రాధాన్యాన్ని అంగీకరించి విష్ణుపారమ్యాన్ని అంగీకరించేరు.

శివుడు త్రినేత్రుడని, విష్ణువు సుదర్శనుడని చెప్పటంలో ఆంతర్యం ఇదే. జ్ఞానసంబంధమైన విద్యాధిదేవతలందరు త్రినేత్రములను కలిగిఉన్నట్లు సంప్రదాయ ఉపాసనాస్వరూపాలు తెలియజేస్తున్నాయి. పరంపరయా ముక్తి పొందు కర్మిష్ఠి వస్తు వ్యవస్థలయందు ధర్మకర్మలయందు సుదర్శనాన్ని చెయ్యాలి.

లేదా కర్మ మోహకారకమై ముక్తికి ఘాతకలుగు తుంది. లలితాసహస్రనామ పీఠికలో భగవాన్ వ్యాసమహర్షి కొన్నివేలసంవత్సరాలు విష్ణువును ఆరాధనచేస్తే శైవారాధన సిద్ధిస్తుందని చెప్పడంలో ఆంతర్యం ఇదే. సుదర్శనంతో కర్మను వీక్షిస్తూ కర్మను ఉపాసన చేసినవాడు; జ్ఞానాన్ని ఉపాసించుటకు అర్హుడగునని. అంతేకాని వాళ్ళు ఆధిపత్యంకోసం కొట్టుకున్నారు,

వారికంటే బుద్ధిమంతులమైన మనమే మేలు అని అనుకోకూడదు.

కోపగించిన గొప్పకీర్తిగల రుద్రుడు అయితే బాణసహితమైన ఆ ధనువును విదేహదేశములో దేవరాతుని హస్తమందు ఉంచేడు.

రామా! విష్ణువు పరపురంజయమైన ఈ వైష్ణవధనుస్సును భృగువంశమునకు చెందిన ఋచీకునివద్ద ఉత్తమమైన న్యాసముగా ఇచ్చేడు.

మహాతేజఃశాలి అయిన ఋచీకుడు దానిని సాటిలేనికర్మలు కలవాడు మహాత్ముడు అయిన నాతండ్రి జమదగ్నికి ఇచ్చేడు.

తపోబలసమన్వితుడైన నాతండ్రి విడువబడిన ఆయుధములుకలవాడైన కాలమున కార్తవీర్యార్జునుడు ప్రాకృతమైన బుద్ధినిపొంది జమదగ్నిని చంపేడు.

రామా! తండ్రివధను విని చాలాదారుణమైన సాటిలేనికోపముతో క్షత్రియ వంశమున పుట్టినవానిని పుట్టినట్లుగనే నశింపచేస్తూ సమస్తమైన ఈ భూమినిపొంది యజ్ఞాంతమునందు ఈ భూమినంతను మహాత్ముడు పుణ్యకర్ములు చేయువాడైన కాశ్యపునకు ఇచ్చి తపోబలసమన్వితుడనై మహేంద్రపర్వతమును నివాసంగా చేసుకొన్నాను.

నేను ఇప్పుడు శాన్తాగ్నిని. తపోబలసమన్వితుడను. కోపం ఎప్పుడో విడిచేను. నీకు సర్వశుభాలను చేకూర్చే మరొక ధనుస్సును తీసుకువచ్చేను.

మహాబలా రామా! ఇప్పుడు ఉత్తమమైన పరాక్రమముచే నీచేత ధనుస్సు భేదింపబడినదని విని శీఘ్రముగా వచ్చేను.

రామా! క్షత్రియధర్మాన్ని పురస్కరించుకొని పితృపైతామహమైన ఈ శ్రేష్ఠమైన వైష్ణధనుస్సును గ్రహింపుము.

యోజయస్వ ధనుఃశ్రేష్ఠే శరం పరపురఞ్జయమ్।
యది శక్నోషి కాకుత్థ్స దాస్యామి తే తతః॥ ౨౮

కాకుత్థ్సా! శ్రేష్ఠమైన ఈ ధనుస్సుకు పరపురఞ్జయమైన శరమును సంధించు. తరువాత నీకు ద్వంద్వయుద్ధమును ఇవ్వగలను.
అంటే ఈ ధనుస్సునకు శరసంధానం చేస్తే శత్రువులయొక్క పురములు జయింపబడతాయి.
తరువాత క్షత్రియధర్మానుసారముగా శరము ప్రయోగించవచ్చు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
పఞ్చసప్తతితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ షట్సప్తతితమః సర్గః॥

(రాముడు వైష్ణవధనుస్సు ఎక్కుపెట్టి పరశురాముడు సంపాదించుకొన్న పుణ్యలోకములను కొట్టుట. పరశురాముడు తిరిగి మహేంద్రగిరినిచేరుట.)

శ్రుత్వా తజ్జామదగ్న్యస్య వాక్యం దాశరథిస్తదా
గౌరవాద్యన్త్రితకథః పితూ రామమథాబ్రవీత్॥ ౧

అప్పుడు రాముడు పరశురామునియొక్క వాక్యములను విని తండ్రిపైనున్న గౌరవముచే మితభాషియై పరశురామునిగూర్చి...

ఓ భార్గవా! నీవు ఏకర్మను చేసితివో నేను దానిని విన్నాను. బ్రహ్మన్! పితౄణము తీర్చుకొన్న నిన్ను మెచ్చుకొనుచున్నాను.

ఓ భార్గవా! వీర్యహీనునివలె క్షత్రధర్మమునందు అశక్తునివలె భావించి నన్ను అవమానించు చున్నావు. ఇప్పుడు నాయొక్క తేజస్సును పరాక్రమమును చూడుము.

శీఘ్రమైన పరాక్రమముగల రాఘవుడు కోపించినవాడై భార్గవునియొక్క హస్తము నుండి శరశరాసనములను తీసుకొనెను.

ఆ రాముడు ధనుస్సును ఎక్కుపెట్టి శరమును నారితో కూడినదానినిగా చేసెను. తరువాత రాముడు కోపముతో జమదగ్ని కుమారుడైన రామునితో...

పరశురామా! బ్రాహ్మణుడవు అయి ఉన్న కారణమువలనను, విశ్వామిత్రునికి బంధువగుటచేతను నాకు పూజింపతగినవాడవు. ఆ కారణమువలన ప్రాణహరమైన శరమును నీపై విడుచుటకు సమర్థుడనుకాను. (జమదగ్ని విశ్వామిత్రుని మేనల్లుడు.)

రామా! నీయొక్క పాదగమనమునుకానీ తపోబలముచే సంపాదించుకొన్న సాటిలేని లోకములనుగాని కొట్టెదను. దేనిని కోరుచున్నావో చెప్పుము.

శత్రుపురములను జయించునది వీర్యముచేత బలదర్పములను నశింప చేయునది దివ్యమైన ఈ వైష్ణవశరము వ్యర్థమగుటకు వీలులేదు.

శ్రేష్ఠమైన ఆయుధమును ధరించిన రాముని చూచుటకు ఋషిగణములతో దేవతలు పితామహుని ముందుంచుకొని అచట గుంపుగా కూడిరి. గంధర్వులు అప్సరసలు సిద్ధులు చారణులు యక్షులు రాక్షసులు నాగులు ఆ అద్భుతమును చూచుటకు వచ్చేరు.

అప్పుడు రాముడు వరధనుర్ధరుడైనవాడు అగుచుండగా లోకము జడముగ చేయబడినది. ఈ జమదగ్ని కుమారుడైన రాముడు నిర్వీర్యుడై రాముని చూచెను.

రాముని తేజస్సుచేత పరాక్రమము అణగి జడుడైన పరశురాముడు రామునితో మెల్లగా మాట్లాడుతున్నాడు.

పూర్వము నేను ఈ భూమినంతను కాశ్యపునకు ఇచ్చినప్పుడు నా దేశమునందు నీవు నివసింపకూడదని కాశ్యపుడు నన్ను ఆజ్ఞాపించేడు.

రామా! ఈ భూమిని కాశ్యపునకు దానముచేసి గురువైన కాశ్యపుని ఆజ్ఞను అనుసరించి ఈ భూమియందు రాత్రి నివసించనని ప్రతిజ్ఞచేసేను.

వీరుడవైన రాఘవా! ఆ కారణమువలన నీవు ఈ గమనశక్తిని కొట్టవలదు. మనోవేగముతో మహేంద్రపర్వతమునకు వెళ్ళగలను.

రామా! నాచేత సాటిలేని లోకములు తపస్సుచేత జయింపబడినవి. వాటిని ప్రధానమైన శరముచే కొట్టుము. ఆలస్యము చేయవద్దు.

ఈ ధనుస్సును ఎక్కుపెట్టుటచే నిన్ను అక్షయునిగా సురేశ్వరునిగా మధువును చంపిన వానిగా తలుసుకొన్నాను. పరంతపా! నీకు క్షేమమగుగాక!

వచ్చిన సమస్తమైన దేవగణములు యుద్ధమునందు ఎదురు లేనివావు సాటిలేని పనులు చేయువాడవు అయిన నిన్ను చూచుచున్నారు.

కాకుత్థ్సా! నేను త్రైలోక్యనాథుడైన నీచేత పరాజితుడనైనాను. నాకు సిగ్గుపడ వలసిన పనిలేదు.

సువ్రతుడా రామా! సాటిలేని శరమును విడుచుటకు తగియున్నావు. శరము విడిచిన పిమ్మట మహేంద్రపర్వతమునుగూర్చి వెళ్ళగలను.

జమదగ్ని కుమారుడైన రాముడు ఆవిధంగా పలుకుచుండగా ప్రతాపవంతుడైన దాశరథి అయిన రాముడు ఉత్తమమైన శరమును ప్రయోగించెను.

ఆ పరశురాముడు తపస్సుచే సంపాదించుకొన్న తన సంబంధమైన లోకాలు రామునిచేత కొట్టబడుటచూచి శీఘ్రముగా పర్వతశ్రేష్ఠమైన మహేంద్రపర్వతమునకు వెళ్ళేడు.

తరువాత దిక్కులు విదిక్కులు చీకటి లేనివై ప్రకాశించేయి. ఋషిగణములతోకూడిన దేవతలు ధనుర్ధారియైన రాముని ప్రశంసించేరు.

రామం దాశరథిం రామో జామదగ్న్యః ప్రశస్య చ
తతః ప్రదక్షిణీకృత్య జగామాత్మగతిం విభుః॥ ౨౪

జమదగ్ని కుమారుడైన రాముడు సమర్థుడైన దశరథరాముని ప్రశంసించి ప్రదక్షిణము చేసి తనమార్గమును పొందెను.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి
షట్సప్తతితమ స్సర్గ సమాప్తము.

–

॥అథ సప్తసప్తతితమః సర్గః॥

(శ్రీమంతులగు పుత్రులతోకలిసి దశరథుడు అయోధ్యను ప్రవేశించుట. శత్రుఘ్నసమేతుడై భరతుడు కేకయరాజ్యమునకు వెళ్ళుట. సీతారాముల అనురాగము.)

గతే రామే ప్రశాన్తాత్మా రామో దాశరథిర్ధనుః
వరుణాయాప్రమేయాయ దదౌ హస్తే ససాయకమ్॥ ౧

రాముడు వెళ్ళిన తరువాత ప్రశాంతచిత్తముకలవాడైన దశరథరాముడు బాణములతోకూడిన ధనుస్సును అప్రమేయుడైన వరుణుని హస్తమందు ఉంచెను.
తరువాత రఘునందనుడైన రాముడు వసిష్ఠప్రముఖులైన ఋషులకు నమస్కరించి భయవిహ్వాలుడైన తండ్రినిగూర్చి పలికేడు.
జమదగ్నికుమారుడైన రాముడు వెళ్ళేడు. ప్రభువైన నీచేత పాలింపబడు చతురంగ సేనలు అయోధ్యాభిముఖమై ప్రయాణించుగాక!
మహారాజా! నీ శాసనమందున్న సేనను ఆజ్ఞాపించుము. చాతకముల పంక్తి నీటినివలె సేన నీ ఆజ్ఞను కోరుచున్నది.
రాజైన దశరథుడు రాముని మాటలను విని కొడుకైన రాముని కౌగిలించుకొని శిరస్సును ఆఘ్రాణించాడు. పరశురాముడు వెళ్ళినవానిగా విని సంతోషించేడు. చాలా ఆనందాన్నిపొందేడు. తను తనపుత్రులు మరల జన్మించినట్లుగా తలచేడు.
దశరథుడు సేనను ప్రేరేపించెను. పతాకములతోను ధ్వజములతోను కూడినది, సుందరమైనది తూర్యానాదములచే ప్రతిధ్వనించుచున్నది, తడుపబడిన రాజమార్గములు కలది చల్లిన పుష్పసముదాయముకలది, రాజప్రవేశమునకై ఆనందముతో ఎదురు చూచుచున్న ప్రజలచే అలంకరింపబడిన అయోధ్యనుగూర్చి శీఘ్రముగా వెళ్ళెను.
పౌరులు పురప్రముఖులు బ్రాహ్మణులు ఎదురువెళ్ళి స్వాగతించేరు. పత్నీసమేతులైన పుత్రులచే అనుసరింపబడువాడైన పత్నీసమేతుడు గొప్పకీర్తికలవాడు అయిన దశరథుడు మరల హిమవత్పర్వతముతో సమానమైన గృహమును ప్రవేశించేరు.

రాజు గృహమందు బంధుజనులతోకూడి భోగ్యవస్తువులచే బాగుగా పూజింప బడినవాడై ఆనందించెను.

కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ సుమధ్యమా।

కౌసల్య సుమిత్ర సుమధ్యమ అయిన కైకేయి ఇతరులైన రాజస్త్రీలు కోడండ్రను ప్రతిగ్రహించుటయందు ఆనందాన్ని పొందుతున్నారు. ఇక్కడ కైకను సుమధ్యమా అంటున్నారు. అంటే ఇంకా ముడతలుపడని నడుముకలది. సుమధ్యమా అంటే స్థితికారిణి అని. దశరథునియొక్క స్థితికి ఈమెను కారణంగా చూపెదుతున్నారు. తరువాత రాజభార్యలు గొప్పభాగ్యముగల సీతను కీర్తిగల ఊర్మిళను ఇద్దరు కుశధ్వజుని కుమార్తెలను గ్రహించిరి.

ఆ వధూవరులందరూ మంగళకరములైన పైపూతల ద్రవ్యములచే శోభిస్తున్నవారై పట్టువస్త్రములు ధరించినవారై శీఘ్రముగా దేవతాగృహమును చేరి పూజించిరి. అప్పుడు రాజపుత్రికలందరూ నమస్కరింపతగినవారికి నమస్కరించి కుబేరభవనముతో సమానమైన తమ గృహములనుపొంది గోవులచేతను ధనముచేతను ధాన్యముచేతను బ్రాహ్మణులను పూజించి రహస్యమున భర్తలతోకూడి ఆనందించి క్రీడించిరి.

మహాత్ములును పరాక్రమముచేత భూమియందు సాటిలేని వారు వివాహితులు అస్త్రములందు నేర్పుకలవారు ధనముతో కూడినవారు నరశ్రేష్ఠులైన రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు తండ్రికి శుశ్రూషచేయుచూ అనుసరించుచున్నారు.

పిమ్మట కొంతకాలమునకు రఘునందనుడైన దశరథమహారాజు కైకయీ పుత్రుడైన భరతునితో...

కుమారా! నిన్ను తీసుకొని వెళ్ళుటకు వచ్చినవాడును కేకయరాజుయొక్క పుత్రుడును వీరుడును నీయొక్క మేనమామ అయిన యుధాజిత్తు ఉన్నాడు. ధర్మజ్ఞుడా! అతడు మిథిలలో ఋషులమధ్యమున నన్ను ఆవిధంగా ప్రార్థించి యున్నాడు. నీవు అతనికి ఆనందమును చేయుము.

కైకయీసుతుడైన భరతుడు దశరథునియొక్క మాటలను విని రామునికి నమస్కరించి లక్ష్మణుని కౌగిలించుకొని శత్రుఘ్నసమేతుడై వెళ్ళుటకు ఉపక్రమించేడు.

శూరుడును నరశ్రేష్ఠుడు అయిన భరతుడు తండ్రిని కష్టపెట్టకుండా పనులు చేయు రాముని తల్లులను అడిగి శత్రుఘ్నసహితుడై వెళ్ళేడు.
భరతుడు వెళ్ళిన తరువాత రాముడును గొప్పబలముగల లక్ష్మణుడును దేవతలతో సమానుడైన తండ్రిని సేవించిరి.
ధర్మాత్ముడైన రాముడు తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని పౌరులకు ప్రియమైన అన్ని పనులను చేసాడు.
మిక్కిలి నియమబద్ధుడై తల్లులకు చేయవలసిన కార్యములను గురువులకు పూజ్యులకు చేయవలసిన కార్యములను ఆయాకాలములందు పరిశీలిస్తున్నాడు.
రాముని ఈ స్వభావముచేతను నడవడి చేతను దశరథుడు సంతోషించేడు. బ్రాహ్మణులు నగరవాసులు సమస్తమైన ప్రజలు సంతోషించేరు.
లోకమందు గొప్పకీర్తికలవాడును సత్యపరాక్రముడును అధికగుణవంతుడును అయిన రాముడు ఆ దేశప్రజలకు ప్రాణులకు బ్రహ్మవలె ఉన్నాడు.

రామస్తు సీతయా సార్థం విజహార బహూనృతూన్
మనస్వీ తద్గతస్తస్యా నిత్యం హృది సమర్పితః॥ ౨౮

రాముడు సీతతోకూడ అనేకమైన ఋతువులను విహరించేడు. మనస్వి అయిన రాముని ఆమె తనయొక్క హృదయంలోనే నిలుపుకొంది. మనస్వి అయిన రాముడు అంటే ఆమెయందు సర్వస్వాతంత్ర్యంగల రాముని తన హృదయంలోనే నిలుపుకొంది అని.
రామునకేనా స్వాతంత్ర్యం, ఈమె మనస్వినికానక్కర్లేదా? అంటే ఉందని ప్రత్యేకంగా చెప్పను అవసరంలేదు.
శ్రుతే పత్నికి ఆ అధికారాన్ని ఇచ్చింది.
మూర్ధానం పత్యురారోహ ప్రజయా చ వీరాఢ్భవ। సమ్రాజ్ఞీ శ్వశురే భవ సమ్రాజ్ఞీ శ్వశ్ర్వాం భవ। ననాందరి సమ్రాజ్ఞి భవ సమ్రాజ్ఞీ అధిదేవృషు। అని సర్వానికి సమ్రాజ్ఞివి అని శ్రుతి చెప్తోంది.
పత్న్యన్వారభేతే పత్నీ హి పారీణహ్య స్యేశే పత్నియై వా౾నుమతం నిర్వపతి।
గృహసంబంధమైన సర్వకర్మలయందు ఆమెదే అధికారము.
అన్యోన్యాసక్తులై చాలాకాలం విహరించేరు.

తండ్రిచే అంగీకరింపబడిన భార్య అగుటచే రామునకు ప్రీతిపాత్రురాలు అయింది. సౌందర్యముచేత సద్గుణములచే ఇంకను ప్రేమ గాఢతను పొందింది. సీత హృదయంలో రాముడు రెండింతలుగా తిరుగుతున్నాడు.

అన్తరాజతమపి వ్యక్తమాఖ్యాతి హృదయం హృదా॥

హృదయాంతర్గతమైన భావములనుకూడా ఒకరి హృదయము మరొకరి హృదయంతో చెప్పుచున్నాయి.

రూపమునందు దేవతలతో సమానురాలు, రూపుదాల్చిన లక్ష్మివలె ఉన్నదియు లక్ష్మివలె సౌందర్యముగలది మిథిలానగరమున జనించినది జనకాత్మజ అయిన సీత రాముని హృదయంలో ఇంకనూ విశేషముగా తిరుగుతోంది.

ఒకరిపై ఒకరికి ఉన్న ప్రేమను వారివారి ప్రేమతోనే చెప్పవలెగాని మరొక పోలికను చెప్పుటకు వీలులేదు.

తయా స రాజర్షిసుతోఽభిరామయా
సమేయివానుత్తమరాజకన్యయా
అతీవ రామః శుశుభే ముదాన్వితో
విభుః శ్రియా విష్ణురివామరేశ్వరః॥ ౩౨

రాజర్షి అయిన దశరథుని కుమారుడైన రాముడు మనోహరురాలగు జనకమహారాజ కన్యయైన సీతతోకలిసినవాడై లక్ష్మితోకూడిన అమరేశ్వరుడైన సమర్థుడైన విష్ణువువలె ఆనందముతోకూడి ప్రకాశించెను.

ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి, మహర్షి విష్ణుశబ్దాన్ని 'వ్యాపకత్వాత్ విష్ణుః' అను అర్థమునందే ప్రయోగించారు.

ఇక్కడ సీతారాములు శచీపురందరుల వలే ఉన్నారు అని చెప్పారు.

శ్రీఫల అను శ్రీమద్రామాయణాన్ధ్రవ్యాఖ్యానమందు
బాలకాణ్డయందలి **సప్తసప్తతితమస్సర్గ** సమాప్తము.
॥శ్రీమద్రామాయణాన్తర్గత బాలకాణ్డః సమాప్తః॥